# అఖిల

అఖిల భారత పత్రిక

జనవరి 2024



# ఆశ

# ప్రార్థన

ప్రపంచం ఆధిపత్యం కోసం సంఘర్షించే రెండు వ్యతిరేక శక్తుల మధ్య విభజించబడింది. ప్రభూ ఆ రెండూ కూడా నీ న్యాయానికి సమానంగా విరుద్ధమైనవి. కానీ మృత్యుమయ స్తంభన లేదా అంధ వినాశనం నీ యిచ్ఛ కాదు. ఒక నిరంతరమయిన, ప్రగతి శీలము, తేజోపూరితమయిన పరిణామంలో నిన్ను నీవు అభివ్యక్తీకరించుకుంటావు. నీ సంకల్పాన్ని ఆవిష్కరించదలచినపుడు దీనినే మేము ప్రతిస్థాపించవలసి ఉంటుంది.

కొన్నిసార్లు మా అసహనం వల్ల ఈ అవతరణ ఏవిధంగా జరుగుతుందనే విషయాన్ని వెంటనే తెలుసుకోవాలనుకుంటాం. కానీ మా అసహనానికి అర్థం లేదు. ఎందుకంటే ఏ విధమైన సమాధానం దొరకదు కనుక. అనుకూలమైన క్షణంలోనే, కార్యాచరణ సమయంలోనే జ్ఞానం అవతరిస్తుంది. ఆలోచనలు శాంతియుతంగా ఉన్నప్పుడు సంకల్పం నిశ్చలంగా, దృఢంగా ఉన్నప్పుడు నీవిచ్చే సంకేతం కోసం మేము వేచి ఉంటాం.

*సెప్టెంబర్ 9, 1914*

## సంపాదకీయం :

మానవజాతి తన పురోగమనంలో జవజీవాలను నింపే ఉత్సాహంతో, వీర్యంతో తనను తాను బలోపేతం చేసుకొనే విశ్వాసం కోసం ఇటువంటి సమయాలలో అది యెదురుచూస్తుంటుంది. మనలోనే వున్న సమస్త సంభావ్యతా మూలాన్ని వివరించడానికి ఈ సంచికను అంకితం చేసాం.

*- అనువాదం కె.వి. రావు*

**జనవరి 1908 నాడు**

**నిర్వాణ సిద్ధి**


శ్రీ అరవిందులు, మహాయోగి అయిన విష్ణు భాస్కర్ లేలేని కలిశారు. లేలే ఇచ్చిన సూచనలను అనుసరించి సంపూర్ణ మానసిక నిశ్శబ్ద స్థితిని తద్వారా నిశ్చల నీరవ బ్రహ్మానుభూతిని పొందారు.

**జనవరి 1922**

శ్రీమాత శ్రీ అరవిందుల గృహ నిర్వహణ బాధ్యతను తీసుకున్నారు.
ఆ సంవత్సరం నుండి క్రమం తప్పకుండా సాయం సంభాషణలు, సమూహ ధ్యానాలు జరిగేవి.

**జనవరి 1934**

భోజనశాల ప్రారంభించబడింది.



అతిమానస సిద్ధి ప్రారంభం
మనోహరమైన సౌందర్యం అది విజయానికి ప్రకటింపు.
(మదర్ ఈ పుష్పానికి ఆధ్యాత్మిక సంకేత విశిష్టత మరియు వివరణ ఇచ్చారు)
శాస్త్రీయ నామం - బూటియా మోనోస్పెర్మా
ఫ్లేమ్ ఆఫ్ ద ఫారెస్ట్ పలస్.

January జనవరి

| Sun ఆది | Mon సోమ | Tue మంగళ | Wed బుధ | Thu గురు | Fri శుక్ర | Sat శని |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | 31 | | | |

# భవిష్యత్తు పట్ల నమ్మకం

పృథ్వి ఆధ్యాత్మిక ప్రగతిలో శ్రీ అరవిందులు ప్రాతినిధ్యం వహించేది ఒక బోధనకు కాదు, ఒక సాక్షాత్కారానికి కూడా కాదు. అది పరమాత్మనుండి సూటిగా వచ్చే మహా శక్తివంతమైన బృహత్కార్యం.

*

ఆయన ఈ భూమిని కేవలం తేజోమయ భవిష్యత్తుకు సంసిద్ధం చేయడానికి వచ్చారు.

*

శ్రీ అరవిందులు, పాత బోధనలు, విశ్వాసాలకు పోటీగా కొత్త బోధనలు లేదా మతాన్ని తీసుకురావడానికి రాలేదు. గతాన్ని అధిగమించే త్రోవను చూపి ఆసన్నం కాబోయే అనివార్యమైన భవితకు పటిష్టమయిన మార్గాన్ని తెరవడానికి ఆయన వచ్చారు.

*

ప్రభూ! ఈ రోజు ఉదయం మీరు కార్యాన్ని సాధించే వరకు మాతో ఉండి, మమ్మల్ని నడిపించి, జ్ఞానవంతం చేసే చేతనగా మాత్రమే గాక కార్యాచరణలో ఒక శక్తివంతమయిన సాన్నిధ్యంగా ఉంటానని హామీ ఇచ్చారు. ఏ మాత్రం పొరపడని విధంగా మీరు ఇక్కడ ఉంటానని, ఈ పృథ్వి రూపాంతరం చెందే వరకూ, ఈ భూ వాతావరణాన్ని వదిలి వెళ్ళకుండా మీ సమగ్ర రూపంలో ఇక్కడ వుంటానని ప్రమాణం చేశారు. ఈఅద్భుతమైన సాన్నిధ్యానికి మేము పాత్రులం కావాలని, ఇకపై మాలో సర్వస్వం ఈ సంకల్పానికి నీ ఉత్కృష్ట కార్యానికి మరింతగా, మరింతగా పరిపూర్ణంగా అంకితం కావాలని దీవించండి.

*


శ్రీ అరవిందుల సహాయం నిరంతరం ఉంటుంది. దానిని ఎలా స్వీకరించాలనేది మనం తెలుసుకోవాలి.

*

శ్రీ అరవిందులు మనలను ఉద్దీపింపచేస్తూ, దారి చూపుతూ, సంరక్షిస్తూ సర్వదా మనతో వుంటారు.

పరిపూర్ణమయిన విశ్వసనీయతలో మనం ఆయన అపారమైన కరుణకు స్పందించాలి.

*CWM 13:4-6,13* — శ్రీమాత



దైవం వినా మనం పరిమితులం, అశక్తులం, నిస్సహాయులం.

భగవంతునితో కూడి వున్నప్పుడు మనం ఆయనకు సంపూర్ణంగా నివేదన అయినపుడు, అంతా సుసాధ్యం అపుడు మన ప్రగతికి అవధులు వుండవు.

శ్రీ అరవిందుల శతాబ్ది సంవత్సరంలో భూమిపైకి ఒక ప్రత్యేకమయిన సహాయం వచ్చింది.

మనం ఆ లబ్ధిని వినియోగించుకొని, అహాన్ని జయించి వెలుగులోకి పయనిద్దాం.

*CWM 13:16* శ్రీమాత

శ్రీ అరవిందులు మనం సిద్ధింపజేసుకోవలసిన సుందర భవిత గురించి చెప్పడానికి వచ్చారు.

ఆయన కేవలం ఒక నమ్మకాన్ని కాక పృథ్వి ఏ తేజోవైభవ ముఖంగా కదులుతుందో దాని పట్ల నిశ్చయాత్మకతను యివ్వడానికి వచ్చారు. ఈ ప్రపంచం ఒక దురదృష్టకరమయిన ప్రమాదం కాదు. అది తనను తాను వ్యక్తీకరించుకోవడానికి తరలి వస్తున్న మహాద్భుతం.

ఈ జగత్తుకు సుందర భవిత యొక్క ధృవీకరణ అవశ్యం.

శ్రీ అరవిందులు ఆ భరోసా ఇచ్చారు.

*

శ్రీ అరవిందులు ఒక వైభవోపేతమయిన భవిష్యత్తుకు మార్గం చూపారు.

*

శ్రీ అరవిందుల సందేశం భవితపై ప్రకాశించే అమర భానుతేజం.

*

మనిషి గతం యొక్క సృజన

శ్రీ అరవిందులు రేపటి సృష్టి గురించి చెప్పడానికి వచ్చారు. అదే అతిమానస వ్యక్తి ఆగమనం.

*

శ్రీ అరవిందులు చేపట్టిన బృహత్కార్యమయిన రూపాంతరీకరణ విజయవంతమవుతుందనే విశ్వాసం మీలోఒక్క క్షణం కూడా చలించకూడదు. ఎందుకంటే అది నిజానికి సత్యం. మన చేతిలోని ఆ కార్యం గురించి ఏ మాత్రం సందేహం లేదు. ఈ పరిణామం తప్పని సరిగా జరుగుతుంది. దానిని ఏదీ ఆపలేదు. ఆ సర్వశక్తిమంతుని నిర్ణయాన్ని ఎవరూ నిష్ఫలం చేయలేరు. దీర్ఘమయిన ఆ పోరాటం శాశ్వత విజయంగా మారేముందు సంకోచం, బలహీనతలను విడిచివేసి ఆ మహత్తర ఘడియ కోసం ధైర్యంగా నిరీక్షించడానికి దృఢ నిర్ణయం తీసుకోండి.

*CWM 13:15:19:21* — *శ్రీమాత*

**6 ఫిబ్రవరి 1893 -**
శ్రీ అరవిందులు
భారతదేశానికి తిరిగి
వచ్చారు. శ్రీమాత
**1878 ఫిబ్రవరి 21వ తేదీన**
పారిస్‌లో జన్మించారు.

**28 ఫిబ్రవరి -**
అరొవిల్లి ఆవిర్భావ దినం
అరొవిల్లి పునాది రోజుగా
కూడా భావించబడుతుంది

**29 ఫిబ్రవరి - అతి మానస**
అవతరణ దినం
శ్రీమాత ఆ రోజున
అతిమానస చేతన
భూమిపై అవతరించటాన్ని
స్పష్టంగా అనుభవం చెందారు.


In France, 1885

ఫ్రాన్స్‌లో, **1885**

February ఫిబ్రవరి

| Sun<br>ఆది | Mon<br>సోమ | Tue<br>మంగళ | Wed<br>బుధ | Thu<br>గురు | Fri<br>శుక్ర | Sat<br>శని |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | | |

# ఫిబ్రవరి 5, 1913

నా హృదయ ప్రశాంతతయందు ఒక శ్రావ్యమైన గానంలా నీ కంఠస్వరం విన్పించింది. సరియైనవి కానప్పటికీ నీ ప్రభావంతో నిండిన మాటలుగా నా మస్కిష్కమందవి తర్జుమా చేయబడినవి. ఈ మాటలు పృధ్వికుద్దేశించ బడినవి. ఆమెకిలా చెప్తున్నాయి. విచారగ్రస్తయైన ఓ దయనీయ భూమాతా, నేను నీలో వున్నానని జ్ఞప్తియందుంచుకో. ఆశను కోల్పోకు. నీహృదయ ప్రతి ప్రయత్నం, ప్రతివ్యధ, ప్రతి సంతసం, ప్రతి బాధ, ప్రతి పిలుపు, నీ అంతరాత్మ ప్రతి ఆకాంక్ష, నీ రుతువుల ప్రతి నూతన ఆగమనం, మినహాయింపేమీ లేకుండా, నీకు విచారగ్రస్తమైనదిగా కన్పించే, సంతసం కలిగించేదిగా కన్పించే, అసహ్యమైనదిగా కన్పించే, సుందరమైనదిగా కన్పించే, అన్నీ సర్వం పొరపడకుండా నిన్ను నావైపుకు నడుపుతాయి. నేను అంతంలేని పరమశాంతిని, నీడలేని పరంజ్యోతిని, పరిపూర్ణ సమరసాన్ని, నిశ్చాయకతను, పరమ విశ్రాంతిని, సర్వోత్కృష్ట దైవానుగ్రహాన్ని.

ఆలకించు ఓ భూదేవీ, పైకి లేచే మహనీయ కంఠ స్వరాన్ని, ఆలకించి నూతన ధైర్యాన్ని స్వీకరించు.

*

అత్యంత క్రూరుడుసైతం, దయామయుడగుటను, అత్యంగ నీచుడు సైతం గౌరవించపబడుటను, ఆత్మ గౌరవం దాదాపు లుప్తమైన వాడైనప్పటికీ కీర్తివంతుడు, న్యాయవంతుడు అగుటను సాధ్యంచేసేది, ఓ ప్రేమమయ దివ్య గురుదేవా, ప్రతి వ్యక్తిలోని నీ సన్నిధియే. సమస్త ఆచారాలు, నిరాధార అభిప్రాయాలకావల దివ్యమైన, పరిశుద్ధమైన ఒక ప్రత్యేక వెలుగుతో, మేమైవున్న సమస్తమును, మేము చేయు సమస్తమందు ప్రకాశింపజేసేది, మేము ఏదిగా కాగలమో, కచ్చితంగా మేమేదై ఉన్నామో వాటి మధ్య భేదమును స్పష్టముగా మేము చూడగలిగేటట్లు చేయగలిగేది నీవే. మితిమీరిన కీడు, అంధకారం, దుస్సంకల్పాలకు వ్యతిరేకంగా, దాటనలవి గాని, అవరోధాన్ని నింపింది నీవే. సాధ్యంకాగల భవిష్య సిద్ధులనన్నింటికీ సంబంధించిన ప్రతి హృదయంలోని సజీవ ఆశవు నీవే. అనుమానించని, ఊహించనలవి గాని వైభవాలకు, పురోగమించిన కొద్దీ మాకు వెల్లడించబడే వైభవాలకు మాకు అందుబాటులో ఉన్న ప్రవేశ ద్వారానివి నీవే.

*CWM 1:14,60* — *శ్రీ మాత*



**1914,** మార్చి **29**న సాయంకాలం గం. **3.30** నిమిషాలకు ప్రప్రథమంగా మదర్, శ్రీ అరవిందులను కలుసుకొన్నది ఇచటనే.

మదర్ పాండిచ్చేరికి ప్రప్రథమ రాక. **1914** మార్చి **29**న మదర్ పాండిచ్చేరికి వచ్చి, ప్రప్రథమంగా శ్రీ అరవిందులను కలుసుకొన్నారు.

March మార్చి

| Sun ఆది | Mon సోమ | Tue మంగళ | Wed బుధ | Thu గురు | Fri శుక్ర | Sat శని |
|---|---|---|---|---|---|---|
| | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |
| 31 | | | | | | |

సమస్త అపాయాలకు, భయాలకు, విపత్తులకు వ్యతిరేకంగా కవచధారివై జీవితంలో నుండి నడవడానికి రెండు విషయాలవసరం. దివ్యమాత కృపా కటాక్షం, నీవంతుగా, విశ్వాసం, నిజాయితీ, సమర్పణలతో తయారైన ఒక ఆంతరిక స్థితి ఉండాలి.

* *

నీ విశ్వాసం, నిజాయితీ, సమర్పణలు ఎంత అధికంగా సంపూర్ణమైతే అంత అధికంగా కృపాకటాక్షం, రక్షణ నీతో ఉంటాయి. దివ్యమాత కృపా కటాక్షం, రక్షణ నీతో ఉంటే, నిన్ను తాకగలదేమి వుంటుంది, లేక నీవు ఎవరికి భయపడవలసి ఉంటుంది? దానికి సంబంధించినది ఏ కొంచెమైనా నిన్ను సమస్త యిక్కట్ల నుండి ఆటంకాలు, ప్రమాదాల నుండి దూరంగా తీసుకు పోతుంది. దాని పూర్తి సాన్నిధ్యంతో నీవు చుట్టుముట్టబడి వున్నందున నీ మార్గం మీద నీవు భద్రంగా ముందుకు పోగలవు. ఎందుకనంటే అది ఆమెదే, సమస్త ప్రమాదాలను లెక్కచేయక, ఈ ప్రపంచం నుండి గాని లేక ఇతర అదృశ్య లోకాల నుండి గాని ఎంత శక్తివంతమైన ఎట్టి శతృత్వంతోనూ ప్రభావితంగాకుండా ముందుకు పోగలవు. ఇబ్బందులను అవకాశాలుగా, ఓటమిని విజయంగా, బలహీనతను తొట్రుపడని బలంగా దాని స్పర్శ మలుపు త్రిప్పగలదు. ఎందుకనంటే దివ్యమాత కృపాకటాక్షమంటే, పురుషోత్తముని అనుజ్ఞ, ఇప్పుడు గాని లేక రేపు గాని దాని ప్రభావం తప్పదు. అది జారీ చేయబడిన శాసనం, అనివార్యం, అప్రతిహతం.

*CWSA 32:8* *శ్రీ అరవిందులు*


ఓనా ప్రభూ, నీవు నన్నేమి చేయమంటివో, దానినే చేశాను. అతిమానస ద్వారాలను బార్లా తెరచాను, అతిమానస చేతన, వెలుగు, క్రియాశక్తి, భువిని ముంచెత్తుతున్నాయి.

*

నీ పురోగతిలోనూ, నీ కార్యంలోనూ సహాయం చేసేందుకు, నా సహాయం ఎల్లప్పుడూ వున్నది.

ఈ రోజు నీవు అధిగమించలేని కష్టాలు రేపు గాని లేక తరువాత గాని నీవధిగమిస్తావు

*CWM 13:56,68* *శ్రీమాత*



శ్వేత కమలం

అదితి - దైవచేతన



ఎర్ర కమలం

అవతారం - పరాత్పరుడు భువిపై ఒక దేహంలో అవతరించడం.

శ్రీ అరవిందులు పాండిచ్చేరికి **1910** ఏప్రిల్ **4**న వచ్చారు.

**42** సంవత్సరాల వయస్సులో **1920** ఏప్రిల్ **24**న ది మదర్ చివరిసారిగా పాండిచ్చేరి వచ్చారు. అచట శాశ్వతంగా స్థిరపడేందుకు తిరిగి వచ్చారు. ఆమె ఒక తీవ్రమైన యోగాభ్యాసం చేస్తున్నారు. ఆమె సాధన మానసిక, ప్రాణిక స్తరాలలో జరుగుతోంది. ఫలితం ఆమె బాహ్య ఆకారంలో సైతం ఒక భౌతిక మార్పు.

**1939 ఏప్రిల్ 24 :** ఈ రోజున ఆమె ప్రథమంగా దర్శనమిచ్చారు. తరువాతి కాలంలో అదొక నియమబద్ధ దర్శన దినంగా అయ్యింది.

April ఏప్రిల్

| Sun ఆది | Mon సోమ | Tue మంగళ | Wed బుధ | Thu గురు | Fri శుక్ర | Sat శని |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | | | | |

పెరుగుతున్న వెలుగులో, శాంతిలో సదా నీతోనే ఉన్నా.

నిరంతరం ఉన్నతంగా పైకిలేస్తున్న ప్రేమ, ఆనందం, శాంతిలో ముందుకు సదా మున్ముందుకు.

*

వారు నాకు ఎన్నడూ వ్రాయకపోయినా నా బిడ్డలనందరినీ నేను సమంగా గుర్తుంచుకొంటాను, ప్రేమిస్తాను, నాకుగా నేను వ్రాయకపోయినా, చిత్తశుద్ధి గల ప్రార్థనలన్నింటికీ సదా సమాధానం ఇస్తాను. అందుచేత బాధ పడకు, హుషారుగా ఉండు.

*CWM 13:71*

నేనెప్పుడూ పైవంకేచూస్తుంటాను. సౌందర్యం, శాంతి, వెలుగు అచట ఉన్నాయి. అవి క్రిందికి రావడానికి సంసిద్ధంగా వున్నాయి. అందుచేత వాటిని ఈ భువిపై అభివ్యక్తం చేయ వీలుగా ఎల్లప్పుడూ ఆకాంక్షిస్తూ, పైకి చూస్తూ ఉండాలి. ప్రపంచానికి సంబంధించిన అసహ్యాకర విషయాల వంక క్రిందికి చూడకు. విచారం కలిగినప్పుడల్లా నాతో పాటు సదా ఊర్ధ్వానికి చూడు.

*

వాస్తవానికి దైవం నుండి ఆతడేమి ఆశిస్తాడో ఖచ్చితంగా దానిని ప్రతి వ్యక్తికీ ఆతడిస్తాడు. దైవం చాలా దూరాన ఎక్కడో ఉన్నాడని, ఆతడు క్రూరుడనీ నీవు నమ్మితే, ఆతడు దూరానే వుంటాడు. క్రూరుడుగానే ఉంటాడు. ఎందుకనంటే భగవంతుని రౌద్రాన్ని అనుభూతి చెందడం నీకు చివరకు శుభం జరగడానికవసరం. కాళీ ఆరాధకులకతడు కాళి, భక్తునకు దివ్యానంద స్థితి. జ్ఞానాన్వేషికి అతడు సమస్త జ్ఞానం, భ్రాంతివాదికతడు విశ్వాతీత నిర్వ్యక్తికత. నాస్తికునకాతడు నాస్తికుడు, ప్రేమికునకు ప్రేమ, ప్రతి కదలికకు, ప్రతి క్షణానికీ ఆతడు ఆంతరిక మార్గదర్శకునిగా అనుభూతి చెందే వారికాతడు సోదరునిలాంటి వాడు, సన్నిహితుడు, సదా విశ్వసనీయమైన ఒక స్నేహితుడు, ఉపకారం చేయడానికి సదా సిద్ధంగా ఉండేవాడు. ఆతడు సమస్తాన్నీ తుడిచి వేస్తాడని నీవు నమ్మితే, ఆతడు ప్రతిదానినీ తుడిచి వేస్తాడు. నీ తప్పిదాలనన్నింటినీ, దోషాలనన్నింటినీ అవిరామంగా తుడిచివేస్తాడు. ప్రతిక్షణం ఆతని అనంత కృపాకటాక్షాన్ని నీవనుభూతి చెందగలవు. నీ ప్రగాఢతను ఆకాంక్షలో నీవాతని నుండి ఏమి ఆశిస్తావో, నిజానికి ఆయనే దైవం అంటే నీకు.

*CWM 13:75-76*

**1908 మే రెండవ తేదీన**

శ్రీ అరొబిందో, తమ సోదరుడు బరీంద్రకుమార్ ఘోష్, ఇతరులతో కలిసి చేసిన విప్లవ కార్యకలాపాల విషయంలో ఖైదు చేయబడ్డారు.

**1908 మే 5 నుండి 1909 మే 6** వరకు అలీపూర్ జైలులోఉన్నారు. **1909 మే6** న ఆయనను నిర్దోషిగా భావించి విడుదలచేశారు.

విడుదలైన తర్వాత ఆయన **30 మే 1909**న తమ మొదటి బహిరంగ సభలో ప్రసంగించారు, నేడు అది ఉత్తరపారా ప్రసంగంగా ప్రసిద్ధి చెందింది.



పాత ఆలీపూర్‌లో
శ్రీ అరవిందులను ఉంచిన చెరసాల

"ఒక రోజు అయిపోయింది, రెండవ, మూడవ రోజు కూడా గడిచాయి, అప్పుడు లోపల నుండి నాకు ఒక స్వరం వినిపించింది, "వేచి చూడు." అప్పుడు నేను ప్రశాంతంగా ఉండి వేచి ఉన్నాను, నన్ను లాల్‌బజార్ నుండి అలీపూర్‌కు తీసుకువెళ్లారు, అక్కడున్న మనుషులతో పాటు ఒక నెల జైలులో ఒంటరిగా ఉంచారు. అక్కడ నేను నా లోపల ఉన్న దేవుని స్వరం కోసం, రాత్రింబగళ్ళు వేచి చూశాను, ఆయన నాతో ఏమి చెప్పాలనుకున్నాడో తెలుసుకోవడానికి, నేను ఏమి చేయాలో తెలుసుకోవడానికి వేచి చూశాను." - శ్రీ అరవిందులు

May మే

| Sun ఆది | Mon సోమ | Tue మంగళ | Wed బుధ | Thu గురు | Fri శుక్ర | Sat శని |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | 31 | |

ఆంతరిక వైఖరి చాలా ముఖ్యమైనది, బాహ్య వైఖరి కూడా దానికి మినహాయింపు కాదు. విశ్వాసం ఎంత ముఖ్యమో, విశ్వాసం ఎంత అద్భుతమో మనుషులకు తెలియదు. ఆ విశ్వాసం అద్భుతాలను సృష్టించగలదనే విషయం వారికి తెలియదు. మీరు ప్రతి క్షణం పైకి లేవనెత్త బడి, దైవం వైపుకు లాగబడతారని విశ్వసించినట్లయితే, భగవంతుడు మిమ్మల్ని పైకి ఉద్ధరించ డానికి వస్తాడు, ఆయన ఎప్పుడూ మీకు చాలా దగ్గరగా ఉంటాడు.

*CMW 13: 75-76*

## జీవితానికి ఒక లక్ష్యం ఉంది.

ఆ లక్ష్యం దైవాన్ని కనుగొని ఆయనకు సేవ చేయడం.

భగవంతుడు దూరంగా లేడు, ఆయన మనలోనే, మన అంతరంగ లోతుల్లోనే ఉన్నాడు. భావాలకు, ఆలోచనలకు అతీతంగా ఉన్నాడు. భగవంతునితో ఉండటంతో శాంతి, విశ్వాసం అలాగే అన్ని కష్టాలకు పరిష్కారం కూడా లభిస్తుంది. మీ సమస్యలను భగవంతునికి అప్పగించండి, అతను మిమ్మల్ని అన్ని కష్టాల నుండి బయటకు లాగి వేస్తాడు.

*

జీవితానికి ఒక లక్ష్యం ఉంది అది మాత్రమే నిజమైనది, శాశ్వతమైనది దైవం. అతని వైపు తిరిగినట్లయితే శూన్యత పోతుంది.

*

సంతోషంగా ఉండటానికి జీవించవద్దు, దైవానికి సేవ చేయడానికి జీవించండి, మీరు అనుభవించే ఆనందం అన్ని అంచనాలకు మించి ఉంటుంది.

*

నీవు ఒంటరిగా లేవని ఎప్పటికీ మర్చిపోకు. నీకు సహాయం చేస్తూ, మార్గనిర్దేశం చేస్తూ భగవంతుడు నీ వెంట ఉంటాడు. అతడు ఎప్పుడూ విఫలం చెందని సహచరుడు, అతడు ఎప్పుడూ తన ప్రేమతో ఓదార్పును, శక్తిని ఇస్తూ బలపరిచే స్నేహితుడు. నీవు ఎంత ఎక్కువ ఒంటరితనాన్ని అనుభవిస్తావో, నీవు అతని ప్రకాశవంత సాన్నిధ్యాన్ని గ్రహించడానికి అంత సిద్ధంగా ఉంటావు. విశ్వాసంతో ఉండు, అప్పుడు అతడు నీ కోసం ప్రతిదీ చేస్తాడు.

*CWM 14:5-6,9*

**జూన్ 2, 1907:**
వందేమాతరం.
వారపు మొదటి సంచిక
విడుదల.

**జూన్ 1, 1913:**
ఆర్యను ప్రచురించాలన్న
నిర్ణయం తీసుకోవడం
జరిగింది.



భగవంతుని నుండి ప్రేమ

ఒక నిర్దిష్ట లక్ష్యంపై భగవంతుడు నిర్దేశించే ప్రేమ ప్రకంపన
(మదర్ ఈ పుష్పానికి ఆధ్యాత్మిక సంకేత విశిష్టత మరియు వివరణ ఇచ్చారు)

June జూన్

| Sun ఆది | Mon సోమ | Tue మంగళ | Wed బుధ | Thu గురు | Fri శుక్ర | Sat శని |
|---|---|---|---|---|---|---|
| | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |
| 30 | | | | | | |

భగవంతుడు మాత్రమే మనకు పరిపూర్ణ భద్రతను ఇవ్వగలడు.

*

ప్రతి హృదయంలో, భవిష్యత్తుకు, ఆ భవిష్యత్తులో సాధించబోయే పరిపూర్ణతలకు సంబంధించిన వాగ్దానం భగవంతుని ఉనికి.

*

పరిస్థితుల ఉపరితలం వెనుక పరిపూర్ణ చేతనా సముద్రం ఉంది, దీనిలో మనం ఎల్లప్పుడూ మునగవచ్చు.

*

ఏదీ కించపరచలేని, కళంకం కావించలేని, అపవిత్రం చేయలేని చేతన ఒకటి ఉంది. దానిని మనం దివ్య చైతన్యం అని పిలుస్తాము.

*

భగవంతునిలో, భగవంతుని ద్వారా అన్నీ రూపాంతరం చెంది, మహిమాన్విత మౌతాయి. భగవంతునిలో అన్ని రహస్యాలకు, అన్ని శక్తులకు సంబంధించిన కీలకం కనుగొనవచ్చు.

*

మన శక్తి అంతా భగవంతుని వద్ద ఉంది. ఆయనతో కలసి ఉంటే మనం అన్ని అడ్డంకులను అధిగమించగలము.

*

భగవంతుని మాటలు ఓదార్పునిచ్చి, ఆశీర్వదించడమే కాకుండా, శాంతింప చేసి, ప్రకాశవంతం చేస్తాయి. భగవంతుని ఉదార హస్తం అనంత జ్ఞానాన్ని దాచిపెట్టే ముసుగును తొలగించి వేస్తుంది.

*

భగవంతుని మహిమ, ఓటములను శాశ్వత విజయాలుగా మారుస్తుంది, అతని ఉజ్వలమైన ప్రకాశం ముందు చీకట్లు పారిపోతాయి.

*

భగవంతుడు ఎప్పుడూ ఓటమి లేని నిశ్చిత స్నేహితుడు, ఒక శక్తి, ఒక మద్దతు, ఒక మార్గదర్శి. భగవంతుడు అంటే చీకటిని చెదరగొట్టే వెలుగు, విజయానికి హామీ ఇచ్చే విజేత.

**జూలై 1899**


'ప్రేమ మరియు మరణం' అనే సుదీర్ఘ కథన కవిత పూర్తయింది.

**జూలై 18 1909**

కలకత్తాలోని కాలేజ్ స్క్వేర్ వద్ద ప్రసంగం

**జూలై 31, 1909:**

ఆయనను బహిష్కరించడానికి బ్రిటిష్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాల తరువాత కర్మయోగిన్‌లో "నా దేశ ప్రజలకు బహిరంగ లేఖ" ప్రచురించబడింది.



దైవం కోసమే జీవించాలి

దీని అర్థం వ్యక్తిగత జీవితంలోని అన్ని ఇబ్బందులను అధిగమించడం.
(మదర్ ఈ పుష్పానికి ఆధ్యాత్మిక సంకేత విశిష్టత మరియు వివరణ ఇచ్చారు)

శాస్త్రీయ నామం: మిర్టస్ కమ్యూనిస్.

July జూలై

| Sun ఆది | Mon సోమ | Tue మంగళ | Wed బుధ | Thu గురు | Fri శుక్ర | Sat శని |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | 31 | | | |

ఎప్పటికీ విఫలం కానీ మద్దతు భగవంతుడు మాత్రమే.

*

ఎప్పటికీ విఫలం కానీ ఏకైక ప్రతిస్పందన భగవంతునిదే. ఎప్పటికీ విఫలం కానీ ఏకైక ప్రేమ భగవంతునిదే. భగవంతుని ఒక్కనిని మాత్రమే ప్రేమించు, భగవంతుడు ఎల్లప్పుడూ నీతో ఉంటాడు.

*

దివ్య జీవనం లేకుండా ఉండడం ఒక బాధాకరమైన భ్రాంతి, భగవంతునితో ఉంటే అంతా ఆనందమే.

*

జీవితానికి విలువనిచ్చేది భగవంతుని సన్నిధి. ఈ సన్నిధి సమస్త శాంతికి, పరిపూర్ణ సంతోషానికి, పరిపూర్ణ భద్రతకు మూలం. నీలో ఈ ఉనికిని కనుగొను, అప్పుడు నీ కష్టాలన్నీ అదృశ్యమైపోతాయి.

*

అన్ని ఆలోచనల్ని, అన్ని భావాలను, అన్ని చర్యలను, అన్ని ఆశలను భగవంతుని వైపు మళ్లించి, ఆయనపై కేంద్రీకరించు. భగవంతుడు మాత్రమే మనకు సహాయం చేయగలడు, ఆయన మాత్రమే భద్రతను ఇవ్వగలడు.

*

అన్నింటికంటే, ఇది చాలా సులభం, మనం మన అస్తిత్వ లోలోతులలో ఉన్న దానిగా మారాలి.

*

దివ్య చైతన్యంతో ఏకం కావడం కంటే అందమైనది మరొకటి లేదు.

*

ఒక వ్యక్తి తాను వెతుకుతున్న దానిని చిత్తశుద్ధితో కోరుకుంటే దాన్ని ఖచ్చితంగా కనుగొంటాడు. ఎందుకంటే ఆ వ్యక్తి కోరుకునేది అతనిలోనే ఉంటుంది.

*

పరమాత్మతో తాదాత్మ్యం చెందిన వారికి, ప్రతిచోటా పరమాత్మకు సంబంధించిన పరిపూర్ణ ప్రేమ, ఎటువంటి ప్రదేశంలో నైనా, ఎటువంటి పరిస్థితిలోనైనా అతనితో ఉంటుంది.

*CWM 14:10-16. 19*

శ్రీ అరవిందుల జన్మదినం

శ్రీ అరవిందులు ఆగష్టు 15, 1872న కలకత్తాలో జన్మించారు. యాదృచ్ఛికంగా, భారతదేశం 1947లో అదే రోజున బ్రిటన్ నుండి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను పొందింది.

1907 ఆగష్టు 2 బెంగాల్ నేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్ పదవికి శ్రీ అరవిందులు రాజీనామా చేశారు.

ఆగష్టు 16న వందేమాతరం పత్రికలో ప్రచురించిన రచనల పర్యవసానంగా దేశద్రోహ అభియోగంపై శ్రీ అరవిందులను నిర్బంధించారు.



శ్రీ అరవిందులు, 1884

అటుతరవాత బెయిల్‌పై విడుదలయ్యారు.

ఆగస్ట్ 23 బెంగాల్ జాతీయ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి శ్రీ అరవిందులు ప్రసంగించారు. సెప్టెంబర్‌లో నిర్దోషిగా విడుదలైన తర్వాత శ్రీ అరవిందులు మళ్లీ కళాశాలలో ఆచార్యులుగా చేరారు.

August ఆగష్టు

| Sun ఆది | Mon సోమ | Tue మంగళ | Wed బుధ | Thu గురు | Fri శుక్ర | Sat శని |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | 31 |

## దైవం పట్ల విశ్వాసం

అత్యంత చీకటి రోజులలో సైతం దైవం పట్ల విశ్వాసం సురక్షితమైన మార్గదర్శి.

*

ప్రతి క్షణం ముందుగా ఎదురుచూడనివి, ఊహించనివి, తెలియనివి అన్నీ మన ముందు ఉంటాయి - మనకు ఏమి జరుగుతుందో అది మన విశ్వాసపు తీవ్రత, స్వచ్ఛతపై ఆధారపడి ఉంటుంది.

*

మనకు నిజమైన సజీవమైన విశ్వాసం, పరమాత్మ సర్వశక్తి పట్ల సంపూర్ణమైన దృఢ నమ్మకం ఉంటే, ఆతని అభివ్యక్తి, మొత్తం భూమిరూపాంతరం చెందుతుందనడానికి సాక్ష్యమౌతుంది.

*

అచంచలమైన విశ్వాసాన్ని కలిగి ఉండు. సత్యం గెలుస్తుంది.

*

భగవంతునిపై విశ్వాసం కలిగి ఉండు అలాగే నీలోకి లోతుగా వెళ్ళు. నా సహాయం ఎల్లప్పుడూ నీతోనే ఉంటుంది.

*

నమ్మకం కలిగి ఉండు. అలాగే ముందుకు కదులు.

*

మనకున్న ఉత్తమ సహాయం దైవం పట్ల మనకు గల విశ్వాసం- దైవం సంపూర్ణమైన దయామయుడు..... ప్రేమ మరియు ఆశీర్వాదాలతో.

*

చిన్నపిల్లల్లో మాదిరిగా సరళమైన విశ్వాసంలోనే గొప్ప శక్తి దాగి ఉంది.

*

చిన్నపిల్లలకుండే ఆత్మవిశ్వాసంతో మన హృదయం దైవాన్ని వేడుకుంటుంది.

*


కష్టాలను ఎదుర్కోవడానికి ఉత్తమమైన మార్గం దైవానుగ్రహం పట్ల మౌనంగా ప్రశాంతంగా ఉండే విశ్వాసం.

*

విశ్వాసం భరోసా ఉంచు, హుషారుగా ఉండు.

*CWM 14: 79-80*

శ్రీ అరొబిందో సొసైటీ
**19వ** సెప్టెంబరు **1960**న శ్రీ ఆరోబిందో సొసైటి శ్రీ మాతచే ప్రారంభించబడింది. ఆమె వ్యవస్థాపకురాలు మరియు కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా మాత్రమే కాకుండా దాని మార్గదర్శక శక్తిగా కూడా కొనసాగుతుంది. చాలా చిన్నసంస్థగా మొదలై, సంవత్సరాలు గడిచే కొద్దీ శ్రీ అరొబిందో సొసైటీ విభిన్నరంగాలలో పని చేసే అంతర్జాతీయ సంస్థగా ఎదిగింది.





శ్రీ అరొబిందో సొసైటీ, పాండిచ్చేరి.

September సెప్టెంబర్

| Sun<br>ఆది | Mon<br>సోమ | Tue<br>మంగళ | Wed<br>బుధ | Thu<br>గురు | Fri<br>శుక్ర | Sat<br>శని |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | | | | | |

ఆ పరమాత్ముడు తన కృపను లోకరక్షణార్థమై ఈజగత్తులోకి పంపిఉన్నాడు.

*

దైవానుగ్రహం కొరకు మనం ప్రార్థించవలసి ఉంటుంది-ధర్మం గనక అభివ్యక్తమైనట్లైతే, దాని ముందు నిలబడగలిగేవారు చాలా తక్కువమంది.

*

విశ్వజనీనమైన ధర్మం యొక్క మార్గంలో జోక్యం చేసుకొని దానిని మార్చడానికి ఒక్కదైవానుగ్రహానికి మాత్రమే అధికారం ఉంది. ఒక అవతారం యొక్క మహాకార్యం ఏమిటంటే ఈ భువిపైన దైవానుగ్రహాన్ని వ్యక్తపరచడం. అటువంటి దివ్య అవతారానికి శిష్యుడిగా ఉండటమంటే దైవానుగ్రహానికి సాధనంగా మారడమే. విశ్వజనీన ధర్మాన్నిదైవానుగ్రహంతో మమేకమై సంపూర్ణ జ్ఞానంతో అందరికీ అందిస్తున్నది శ్రీ మాత.

అలాగే ఆమె ద్వారానే దైవం పట్ల నిష్కపటమైన విశ్వాసంతో చేసే ఆకాంక్ష యొక్క ప్రతి కదలిక దైవానుగ్రహాన్ని ప్రతిస్పందనగా తీసుకొని వస్తుంది.

ప్రభూ, నీ ముందు నిలబడి, “నేనెప్పుడూ తప్పు చేయలేదు” అని నిజాయితీగా చెప్పగలవాడెవడు? మీ పనికి వ్యతిరేకంగా మేము ఒక్క రోజులోనే ఎన్నిసార్లు తప్పులు చేస్తున్నాము. ఎల్లప్పుడూ మీ అనుగ్రహం, కృప వాటిని తుడిచివేయడానికి వస్తున్నది.

నీ అనుగ్రహ ప్రమేయం లేకపోతే, విశ్వజనీన ధర్మం యొక్క కనికరంలేని కత్తివేటు కిందకు ఎవరైనా తరచుగా రాకుండా ఉంటారా ?

*

దైవానుగ్రహమా, నీవు చేసే మంచి అంతులేనిది. కృతజ్ఞతాపూర్వకంగా నీకు నమస్కరిస్తున్నాము.

*

సత్యమైన సారభూతమైన శాంతిని, ఆనందాన్ని, శక్తిని, ప్రకాశాన్ని, జ్ఞానాన్ని, సౌందర్యాన్ని మరియు ప్రేమను ఇవ్వగలిగేది దైవానుగ్రహం మాత్రమే.

*CWM 14 :83-86*

శ్రీమాత నాలుగు ఘన అంశ రూపాలు. ఆమె ముఖ్య శక్తులు, మూర్తిమత్వాలు, ఆమె దర్శకత్వంలో ఈ విశ్వాన్ని నడిపేందుకు, తాము నిర్వహించే ఈ ఐహిక నాటకంలో వ్యవహరించేందుకు ముందు శ్రేణిలో నిలిచి ఉన్నాయి.

స్థిర విశాలత, ప్రశాంతత, విశద ప్రజ్ఞతో, నిర్మల దయారసంతో, అక్షయ కారుణ్యంతో, అతిశయ గాంభీర్యంతో సర్వాన్నీ పరిపాలించే మహత్వంగల విశిష్ట వ్యక్తిత్వాన్ని కల్గి ఉంటుంది, ఆమె ప్రథమ అంశ.

మరో అంశ ఆమె యొక్క అద్భుత శక్తి సామర్థ్యంతో, నిర్నిరోధమైన మహాకాంక్షతో, ఆమెలోని యోధ భావనతో, త్రీవ ఇచ్ఛతో, ఉగ్రవేగంతో, లోకం కదిలిపోయే బలంతో మూర్తీభవిస్తుంది.

మూడవ అంశ స్ఫుటంగా, మధురంగా, సౌందర్యానికి చెందిన గహనరహస్యంతో అమోఘంగా, సామరస్యంతో, శ్రేష్ఠమైన లయ పొందికతో, సంక్లిష్ట సూక్ష్మ ఐశ్వర్యంతో, తన ప్రబల ఆకర్షణతో అమిత సమ్మోహన సౌందర్యంతో అలరారుతుంది.

తన నాల్గవ అంశ సమస్త విషయాల్లోనూ అచంచలమైన, ఖచ్చితమైన సమగ్రతను కల్గి, భద్రమైన, నిష్కళంకమైన కార్యంతో, సంపూర్ణ మైన సచేతన జ్ఞానానికి చెందిన అక్షయ సామర్థ్యంతో సుసంపన్నమై ఉంటుంది.

ఈ నాలుగు అంశలనే మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అనే మహిమాన్విత నామాలతో పిలుస్తాం.

October అక్టోబర్

| Sun ఆది | Mon సోమ | Tue మంగళ | Wed బుధ | Thu గురు | Fri శుక్ర | Sat శని |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | 31 | | |

అనుగ్రహం సరిసమానంగా అందరిపైనా ఉంటుంది. ప్రతి మనిషి తనలోని నిజాయితీని బట్టి దానిని గ్రహిస్తాడు. అది బయట పరిస్థితులపై ఆధారపడి ఉండదు, కేవలం నిజాయితీతో కూడిన ఆకాంక్ష, దాని వైపే పూర్తిగా తెరుచుకోవడం పై ఆధారపడి ఉంటుంది.

*

ఎప్పుడు నిజాయితీ, సద్భావన ఉంటుందో అప్పుడు దైవ సహకారం కూడా ఉంటుంది.

*

ఎప్పటికీ నీ సమర్పణలోనూ, ఆకాంక్షలోనూ, నిజాయితీతో ఏకాగ్ర దృష్టితో ఉండు. నీవిక దైవ మార్గ దర్శనాన్ని, సహాయాన్ని ఎడతెంపులేకుండా సంవేదిస్తావు.

*

దైవసహాయం ఉంటే ఏదీ అసాధ్యంకాదు.

*

దివ్యానుగ్రహం పట్ల నిశ్చలమైన విశ్వాసాన్ని ఉంచు.

*

అనుగ్రహం ఎప్పుడూ నీతో ఉంది, నిశ్శబ్ద మనస్సుతో నీ హృదయంలో దృష్టిని నిలిపి వుంచు. నీవు కోరుకునే మార్గదర్శనం, సహాయం నీకు తప్పక అందుతుంది.


*

ఎవరైతే అనుగ్రహం కోసం, సహయం కోసం ఆకాంక్షిస్తారో వారందరి కోసం అవి సదా వున్నాయి. వాటిని విశ్వాసంతో, ఆత్మస్థైర్యంతో అందుకొన్నప్పుడు వారి శక్తి ఇక అపరిమితం.

దివ్యానుగ్రహం పనిచేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంది. కాని దానిని నీవు పని చేయనివ్వాలి, దాని కార్యాన్ని నీవు అడ్డుకోకూడదు. ఇక్కడ ఆవశ్యక నియమం విశ్వాసం. నీవు ఏదైనా దాడిని ఎదుర్కొన్నట్లు భావిస్తే శ్రీ అరవిందులూ మరియు నా సహాయంకోసం పిలువు, నీ పిలుపులో నిజాయితీ ఉంటే (చెప్పాలంటే, నిజంగా నీవు బాగుపడాలని కోరుకొంటే) నీ పిలుపుకు జవాబు వస్తుంది. అనుగ్రహం నిన్ను బాగు చేసి పెడుతుంది, రక్షిస్తుంది.

*CWM 14:85-87*

**1926** నవంబర్, **24**వ తారీఖు ఒక అత్యంత ప్రధానమైన సిద్ధి తరువాత శ్రీ అరవిందులు తమ ఆధ్యాత్మిక కార్యాన్ని మరింత గంభీరంగా కొనసాగించేందుకు గాను, ప్రజాసందర్శన, సంపర్క మైన జీవనం నుండీ ఉపసంహరించు కొన్నారు. ఈ తరుణంలో సాధకుల (ఆధ్యాత్మిక జిజ్ఞాసువుల) ఆంతరిక, బాహ్య జీవనానికి సంబంధించిన పూర్తి బాధ్యతను, ఆశ్రమాన్ని ఆధ్యాత్మిక సహ కార్యకర్త్రిణీ, అంతకు మునుపు మిర్రా అల్ఫాస్సాగా పేరొందిన ది మదర్‌కు అప్పగించారు. కాబట్టి ఈ తేదీ ఆశ్రమ స్థాపక దినంగా చెప్పడం జరుగుతుంది. అయినప్పటికీ



విజయం
అన్ని ఆటంకాలను గెలవగలదు.
(మదర్ ఈ పుష్ప ఆధ్యాత్మిక విశిష్టతను, వివరణను ఇచ్చారు.)

"ఇది ఆశ్రమంగా సృష్టించ బడటం కంటే ఆయన చుట్టూతా ఆయనను కేంద్రంగా చేసుకునిదానికదే ఎదిగింది" అని శ్రీఅరవిందులు అన్నారు.

**17** నవంబర్, శ్రీమాత మహాసమాధి. (ది మదర్ భౌతిక ఉపసంహారణ)

**24** నవంబర్ **1926** - సిద్ధి దినం (విజయమొందిన దినం) శ్రీకృష్ణుని అవతరణ అధి మానస అధి దేవత, భౌతికంలోకి దిగిరావడం **(1926)**

November నవంబర్

| Sun ఆది | Mon సోమ | Tue మంగళ | Wed బుధ | Thu గురు | Fri శుక్ర | Sat శని |
|---|---|---|---|---|---|---|
| | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |

అనుగ్రహం తన కార్యానికి సంబంధించి పూర్తిగా పరిపూర్ణమైన, ఖచ్చితమైన ఫలితంతో ఉంటుంది. అంచేత విశ్వాసం పూర్తిగా, పరిపూర్ణంగా ఉండాలి .

*

అనుగ్రహం ఎప్పటికీ మనల్ని విఫలం కానీయదు. అదే స్థాయిలో మన హృదయంలో అలాంటి విశ్వాసంతో నిరంతరం ఉండాలి.

*

మనలో విశ్వాసపు కొరత మనలో పరిమితుల్ని సృష్టిస్తుంది.

*

అనుగ్రహం మనతోనే ఉంటుంది, కనిపించేవన్నీ చీకటిమయమైనా అది మనల్ని వీడదు.

*

పరాత్పరుని శక్తి అనంతం, మన విశ్వాసం అల్పం.

*

అనుగ్రహం జీవితంలో ప్రతిక్షణం, అన్ని పరిస్థితుల్లో ఉండి, మన కష్టాలను అధిగమించడంలో సహాయం చేస్తుంది.

*

వైఫల్యంలోనూ, అదేవిధంగా విజయంలోనూ దివ్యానుగ్రహం ఉన్నది, సదా ఉన్నది.

*

దైవానికి ఎంత దగ్గరగా వస్తావో అంతగా ఆయన అపరిమాణ అనుగ్రహపూరిత, సాక్షీభూత, ప్లవన జల్లులో జీవిస్తావు.


*

అనుగ్రహమందు విశ్వాసం, దృఢ నమ్మకం అన్నది చరమవిశ్లేషణ, సర్వోన్నత ప్రజ్ఞ.

*

ఈ దృగ్గోచర విధ్వంసం ఉన్నప్పటికి ఒకక్రొత్త, ఉత్తమ క్రమం రూపొందించుకొంటుంది. మనిషి దానిని కాంచాలంటే దివ్యానుగ్రహమందు విశ్వాసముండాలి, హుషారుగా ఉండు.

*CWM 14:87-90*



## శ్రీఅరవిందుల
## మహా సమాధి రోజు.

శ్రీఅరవిందులు డిసెంబరు5, 1950న దేహాన్ని త్యజించారు. డిసెంబరు 9న శ్రీఅరవిందుల దేహం విశ్రాంతికై మహాసమాధిలో వుంచబడింది.



**1943** డిసెంబరు **2**న మదర్ పిల్లల కోసం ఒక కొత్త స్కూలు ప్రారంభోత్సవానికి స్వీకారం చుట్టారు. ఇరవై మంది పిల్లలకు, మదర్ మొదటి ఉపాధ్యాయులలో ఒకరుగా స్కూలు ప్రారంభించారు. ఆ తర్వాత ఈ స్కూలు శ్రీఅరొబిందో ఇంటర్నేషనల్ సెంటర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా వృద్ధిచెందింది.

December డిసెంబర్

| Sun<br>ఆది | Mon<br>సోమ | Tue<br>మంగళ | Wed<br>బుధ | Thu<br>గురు | Fri<br>శుక్ర | Sat<br>శని |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | 31 | | | | |

ప్రస్తుతం పెరుగుతున్న సంఘర్షణలలో మన దృక్పథం ఎలా వుండాలి? దివ్య కృప పై నమ్మకము, పూర్తి విశ్వాసములతో వుండాలి.

*

సర్వమూ పోగొట్టుకున్నట్లుగా కనిపించినపుడే సర్వమూ రక్షించబడగలదు. నీ వ్యక్తిగత శక్తి మీద విశ్వాసం పోగొట్టుకున్నపుడు, నీలో దివ్యకృప మీద విశ్వాసముండాలి.

*

అంతిమ పరిశీలనలో నిజానికి అంతా దైవకృపపైన ఆధారపడివుంటుంది.

భవిష్యత్తు వైపు మనం విశ్వాసంతో, శాంతతతో చూడాలి, అదే సమయంలో ఎంత తొందరగా పురోగమించగలమో అంత తొందరగా పురోగమించాలి.

*

నమ్మకము, చలించని ప్రగాఢ విశ్వాసము కలిగివుండు. తక్కినదంతా దివ్యకృప నిర్వర్తిస్తుంది.

*

మన సంకల్పాన్ని దైవకృపకు అర్పిద్దాము. దివ్యకృప మాత్రమే అంతనూ సఫలం చేస్తుంది.

*

అనుగ్రహం, అనుగ్రహం మాత్రమే పనిచేస్తుంది. అది మాత్రమే మార్గాన్ని తెరవగలదు, అది మాత్రమే అద్భుతం చేయగలదు.


*

కేవలం దైవకృప మీద ఆధారపడటము, అన్ని పరిస్థితులలో దాని సహాయాన్ని పిలవటము నేర్చుకోవాలి. అప్పుడు అది స్థిరమైన అద్భుతాలను అందిస్తుంది.

*

నిజాయితీగా అనుగ్రహాన్ని నమ్మే వ్యక్తికి దివ్యకృప అనంతంగా వుంటుంది.

*CWM 14:89-93*



దైవం యందు విశ్వాసం, ప్రచోదిత ప్రాణికానికి అత్యావశ్యకం.
(మదర్ ఈ పుష్పానికి ఆధ్యాత్మిక సంకేత విశిష్టత మరియు వివరణ ఇచ్చారు)
శాస్త్రీయ నామం :
ఆస్పాస్టేషియా గాంగటికా

దివ్యకృప ఎప్పటికీ నీతోనే వుంది, నీ విశ్వాసం దాని చర్యలను ప్రభావ వంతంగా అమలు చేస్తుంది.

*

భగవంతుని మీద మనకున్న విశ్వాస ప్రమాణాన్ని బట్టి దివ్య కృప మనకోసం పనిచేస్తుంది, సహాయం చేస్తుంది. దైవంపై మన విశ్వాసం బాహ్యావరిస్థితుల మీద ఆధారపడకూడదు.

*

దివ్యకృపపై గల విశ్వాసంతో సమస్త ఆటంకాలు అధిగమించ బడగలవు.

*

దివ్యకృవ పై మనకు విశ్వాస ముంటే విఫలం కాని ఒక ధైర్యాన్ని పొందుతాము.

*

దైవ అనుగ్రహాన్ని ఎప్పటికీ విశ్వసించు, అన్ని రకాలుగా దివ్యకృప నీకు సహాయం చేస్తుంది.

*

కారణం అడక్కుండా, ఏ చింతా లేకుండా వుండే ఒక చిన్నపిల్లవాడిలా, ఆయన సంకల్పమే జరగాలని దైవాన్ని విశ్వసించు.

*

ఏది జరిగినా మనం నిశ్చలంగా వుంటూ దైవానుగ్రహాన్ని విశ్వసించాలి.

*CWM 14:93-96*

దైవకృప పైన గల ఒక సంపూర్ణ విశ్వాసం నుండి పొందే శాంతికి ఏదీ సరిసాటి కాదు.

*

నీ పురోగతితో సహా సమస్త సంరక్షణను దైవకృపకు వదిలెయ్యి, నువ్వు శాంతిలో వుంటావు.

*

వ్యక్తి ఎంత ఎక్కువ తెలుసుకుంటే అంత ఎక్కువగా తనకేమీ తెలియదని అర్థం చేసుకుంటాడు. దైవం మీద, ఆయన జ్ఞానం మీద, ఆయన దయ మీద సంపూర్ణ విశ్వాసమున్న వ్యక్తికి సమస్యలంటూ వుండవు.

*

సంపూర్ణ శాంతి నిశ్శబ్దాలలో వుంటూ, దివ్యకృపపై ఒక చెక్కు చెదరని నమ్మకము, విశ్వాసాలతో వున్నపుడు మాత్రమే అన్ని పరిస్థితులను అవి వుండవల్సినంత యుక్తంగా వుండేట్లు చేయగలవు. ఎవరు దైవంపై, కేవలం దైవం పైన సంపూర్ణ విశ్వాసముంచుతారో వారికి ఎప్పటికీ ఉత్తమమైనదే జరుగుతుంది.



దివ్యకృప

నీ మంచి అనంతమైనది. మేము కృతజ్ఞతతో నీ ముందు మోకరిల్లుతున్నాము.

(మదర్ ఈ పుష్పానికి ఆధ్యాత్మిక సంకేత విశిష్టత మరియు వివరణ ఇచ్చారు)

శాస్త్రీయ నామం : హైబిస్కస్ మ్యూటాబిలిస్

*

నీ జీవితంలో ఒక కష్టాన్ని ఎదుర్కొన్నపుడు దానిని భగవంతుని అనుగ్రహంగా తీసుకో, రూఢీగా అది అలాగే అవుతుంది.

*

ఏ విషయంలో నైనా ఏది జరిగినా, ఎప్పటికీ సంఘటనలను నీ జీవితపు ఆధ్యాత్మిక లక్ష్యం వైపుగా వున్న శీఘ్రమార్గాలకు నడిపించే దివ్యానుగ్రహంగా పరిగణించు.

*CWM 14:94-96*

ఏ విషయంలోనైనా దైవం సంకల్పించినదానిని సంకల్పించడం, దైవానుగ్రహ సర్వోన్నత అనుగ్రహంపై చెక్కుచెదరని విశ్వాసాన్నుంచడం మాత్రమే ప్రభావవంతంగా పనిచేస్తుంది, దానితో మాత్రమే ఎప్పటికీ ఉత్తమమైనది జరుగుతుంది : మానవ భావనలకు ఉత్తమమైనది కాదు, సర్వోన్నతసత్య ప్రకారంగా ఉత్తమమైనది జరుగుతుంది.

నిశ్శబ్దంగా ఒక దృఢమైన సంపూర్ణ శుద్ధ విశ్వాసంతో వుండు .

*

నీకు ఏం కావాలన్నదానిమీద అంతా ఆధారపడి వుంటుంది. నీకు యోగం కావాలంటే నీకు జరిగేదంతా నీ లక్ష్యం వైపు నిన్ను నిర్దేశించే దివ్యకృప ప్రకటనగా భావించు, పరిస్థితులు ఇచ్చే పాఠాలను అర్థంచేసుకోవడానికి ప్రయత్నించు.

*

దైవానికి తమను తాము అర్పించుకున్నవాళ్ళకు వారు ఎదుర్కొనే ప్రతి కష్టము ఒక కొత్త పురోగతికి భరోసా, ఆ విధంగా దానిని దివ్యానుగ్రహం నుండి పొందిన బహుమతిగా తీసుకోవాలి.

*

కష్టాలు నిన్ను స్వాధీనం చేసుకున్నపుడు, దివ్యానుగ్రహం నీ వెంటే వున్నదని తెలుసుకో.

*

దైవానుగ్రహమంటే నీ జీవితంలో ప్రతిదానిని మృదువుగా చేయడమని మనుష్యులు నమ్ముతారు. అది నిజం కాదు.

నీ ఆకాంక్ష వాస్తవం కావడానికి అనుగ్రహం పనిచేస్తుంది, అత్యంత ప్రేరణను, శీఘ్ర సాక్షాత్కారాన్ని సాధించడానికి ప్రతిదీ అమర్చబడుతుంది.

*CWM 14:94-96*

దైవకృప అనేది మనం సాధించవలసిన లక్ష్యం వైపు పయనించేలా చేస్తుంది. నీ మనస్సు ద్వారా దానిని నిర్ధారించడానికి ప్రయత్నించవద్దు, దానిపై నీవు ఒక అవగాహనకు రాలేవు. ఎందుకంటే దైవకృప అనేది మాటలకు, భావానికి అందని బలీయమైన అనుభూతి. దైవకృప పని చేసినపుడు దాని

ఫలితం ఆహ్లాదంగా ఉండవచ్చు, ఉండకపోవచ్చు. అది ఏ మానవత్వ విలువను పరిగణనలోకి తీసుకోదు. పైపైగా సాధారణ దృష్టితో చూస్తే ఇది ఒక విపత్తు లాంటిది. కానీ ఇది ఎప్పుడూ ప్రతి ఒకరికి ఉత్తమమైనది. వేగవంతమైన పురోగతి కోసం ఇది దైవం పంపిన ఒక దెబ్బ. దైవకృప అనేది సాక్షాత్కారం వైపు నిన్ను వేగంగా నడిచేలా చేస్తుంది.

*

ఒక విషయం మనం ఒప్పుకోవాలి - ఈ ప్రపంచమూ, మానవాళీ, తమ లక్ష్యమైన దైవ సాక్షాత్కారాన్ని వీలైనంత తొందరగా పొందడానికి ఏదైతే జరగాలో, అదే ఖచ్చితంగా జరుగుతోంది. దైవంతో ఏకమవ్వడం, కడపటికి దైవాభివ్యక్తీకరణ చేయడం.

*

నిశ్చలమైన మనఃపూర్వకమైన ఈ విశ్వాసమే మనకు రక్ష.

మన ధైర్యం, ఓర్పు, మన ఆశ అంత గొప్పగా ఉండాలి, మన ఆశా విశ్వాసానికి పరిమితులు లేవు.

*

నిశ్చలమైన విశ్వాసం ఈ పయనంలో చాలా సహాయపడుతుంది.

*

మన ఆశలు దివ్య అవతరణ కన్నా గొప్పవేమీ కావు, జరగని దేనినీ మనం భావించలేము.

*CWM 14:96-97, 174*

నా ఉద్దేశ్యంలో, జీవితం ఎప్పుడూ, ఇబ్బందులు, కష్టాలు, బాధలతో నిండి ఉంటుంది. ఇది ఒక సాధారణ వాస్తవం, ప్రతి ఒకరూ వాటిని అనుభవించవలసి ఉంటుంది. కష్టాలు, బాధలను ఎదుర్కొనడానికి ఉన్న ఏకైక మార్గం, మన ఆకాంక్ష, ఆశ, నమ్మకాలను, అంతర, చైతన్యం పై ఉంచి, మన చేతనను దైవం వైపు మరల్చి, దైవిక శక్తి మరియు సహాయం పొందుటకు సిద్ధంగా ఉండటం. తరచుగా ప్రాణికం లేదా దానిలో కొంత భాగం, ప్రతి కష్టానికి నాటకీయ ప్రాముఖ్యత ఇవ్వడంలో ఒక రకమైన వికృత సుఖాన్ని పొందుతుంది, ఆవిధంగా అంతరాత్మ మరియు దైవీక శక్తితో సంబంధం తెగిపోతుంది.

*

దైవం చేతులలో ఆశ్రయం పొందడం ద్వారా అన్ని కష్టాలు దూరమవుతాయి, మనకు ఆశ్రయం ఇవ్వడానికి దైవం ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు.

*

ప్రతిఒక్కటి మనకు వ్యతిరేకంగా జరుగుతున్నపుడు, ప్రతిఒక్కరూ దేవుడు సర్వశక్తివంతుడని గుర్తించడాన్ని తెలుసుకోవాలి.

*

దైవం మనందరిలోనూ ఉన్నాడు, మనం దైవాన్ని స్మరించిన ప్రతీసారి, అన్ని పరిస్థితులను ఉంచే సంపూర్ణమైన శాంతి, సమానత్వంతో ఎదుర్కొనే శక్తిని ఆయన మనకు ఇస్తాడు. దైవం నీతో ఉన్నాడని గుర్తించు, నీ కష్టాలన్నీ తొలగిపోతాయి.

దైవం పట్ల నిరంతర ఆకాంక్షతో, అంతర్ముఖుడవై జీవించడం వలన, బయటి పరిస్థితులు ఎలా ఉన్నా, జీవితంలో, చిరునవ్వుతో ప్రశాంతంగా ఉండగల సామర్థ్యాన్ని అది ఇస్తుంది.

*

అంతర్ముఖుడవై జీవించు, పరిస్థితులకు భయపడవద్దు, దైవం కోసం మాత్రమే జీవించడం' అంటే, వైయక్తిక జీవితంలోని అన్ని కష్టాలను అధిగమించడమే.

*CWM 14:230-32*

*

జీవితంలోని చిన్న చిన్న సంఘటనలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వవద్దు. ఈ సంఘటనల ప్రాముఖ్యత, అవి మీరు జీవితంలో పురోగతి సాధించడానికి ఎంతవరకు సహాయపడ్డాయి అనే దానిపై ఆధారపడి ఉంది. ఒకసారి పురోగతి సాధించిన తర్వాత, గత లోపాల యొక్క పరిణామాలు ఏమైనా ఉంటే దైవానుగ్రహంతో అవన్నీ అదృశ్యమైపోతాయి.

అసమర్థమైన ఈ ఆలోచనలు, అసంబద్ధమైనవి. అవి పురోగతి యొక్క సత్యాన్ని నిరాకరిస్తాయి. కానీ ఆకాంక్ష ఉంటే, ఈ రోజు చేయలేని దానిని ఇంకో రోజు సాధించవచ్చు.

*

పరిస్థితులు ఉండాల్సిన విధంగా లేకపోతే, మన ఆందోళన వాటిని సరిచేయడానికి ఏమాత్రం ఉపయోగపడదు. నిశ్చలమైన విశ్వాసం మన బలానికి మూలం.

*

గతం గురించి ఎక్కువగా విచారించడం చాలా తప్పు. దేవుని సంకల్పం లేనిదే ఏమీ జరగదని గుర్తించి నిశ్చలంగా ఆ సంకల్పానికి లొంగిపోవడమే నిజమైన వైఖరి, నీవు తప్పులు చేసి ఉంటే, అది నిజమైన శరణాగతి లేకపోవడమే. నిజమైన శరణాగతే, తప్పులను దిద్దుకొనే ఏకైక మార్గం.

*

భయపడాల్సిన అవసరం లేదు. అంతా దైవమే దైవం తప్ప మరేమీ లేదు. భగవంతుడు మాత్రమే ఉన్నాడు, మనల్ని భయపెట్టడానికి ప్రయత్నించేవన్నీ, హాస్యాస్పదమైన, అర్థంలేని, దేవుని మారువేషం మాత్రమే. ఉత్సాహంగా ఉండు, నీ ముందు మార్గం తెరచుకుని ఉంది. అనారోగ్యాన్ని గురించిన ఆలోచనల్ని తొలగించి, ప్రశాంతమైన దైవత్వాన్ని తీసుకునిరా, అపుడు అంతా నవ్యంగా ఉంటుంది. ప్రేమ మరియు ఆశీర్వాదాలతో.

*

నా మాట ఏమిటంటే, బాధల గురించి పట్టించుకోకపోతే బాధలు నిన్ను పూర్తిగా వదిలేస్తాయి. పురోగతికి బాధలు అనివార్యం కాదు. స్థిరమైన, ఉల్లాసకరమైన సమస్థితి ద్వారా గొప్ప పురోగతి సిద్ధిస్తుంది.

*CWM 14:234-236, 242,247*



## దైవ దరహాసం

మన అహాన్ని జయించినపుడు, భగవంతుని చిరునవ్వులను చూడవచ్చు.
(మదర్ ఈ పుష్పానికి ఆధ్యాత్మిక సంకేత విశిష్టత మరియు వివరణ ఇచ్చారు)

శాస్త్రీయ నామం : మిచెలియా అల్బా

చంపక, సువాసనగల చంపక

## నవ్వడం నేర్చుకో

ఎల్లప్పుడూ, అన్ని పరిస్థితులలో నవ్వడం నేర్చుకో. నీ దుఃఖాల్లో, సంతోషాల్లో, అలాగే నీ బాధలు ఆశల్లో నవ్వు. ఎందుకంటే చిరునవ్వులో స్వీయ పాలక సార్వభౌమాధికారం ఉంది.

*

దైవ సేవలో ఉన్నపుడు సాత్త్విక ప్రవృత్తి శక్తివంతమౌతుంది.

*

చిరునవ్వు, మేఘాలపై సూర్యుని వలె, కష్టాలపై పనిచేసి, వాటిని చెదరగొడుతుంది.

*

ఎవరైనా ఎప్పుడూ ఎక్కువగా నవ్వగలరని నేను అనుకోను. అన్ని పరిస్థితులలో ఎలా నవ్వాలో తెలిసిన వ్యక్తి నిజమైన ఆత్మ సమత్వానికి దగ్గరగా ఉంటాడు.

*

సాధారణంగా, మనిషి తనను తాను చాలా తీవ్రంగా పరిగణించే జంతువు. అన్ని పరిస్థితులలో తనకు తాను ఎలా నవ్వుకోవాలో తెలుసుకోవడం, తన దుఃఖాలు, భ్రమలు, బాధ, కోపం, తిరుగుబాటును చూసి నవ్వడం, తనను తాను అధిగమించడానికి ఎంతో శక్తివంతమైన ఆయుధం.

*

నీవు జీవితంలో ఎల్లప్పుడూ నవ్వగలిగితే, జీవితం కూడా నిన్ను చూసి నవ్వుతూనే ఉంటుంది.

*

ఎవరైనా నిత్యం నవ్వగలిగితే వారు నిత్యయవ్వనులు.

*CWM:14:177-178*

ఏది శాశ్వతమైనదో, అమరమైనదో, అనంతమైనదో దానిని పొందడం, దానిలో ఉండడమే శ్రేష్టం. అదే దివ్యప్రకాశం, దివ్య ప్రేమ, దివ్య జీవనం - అదే సర్వోన్నత శాంతి, పరిపూర్ణ ఆనందం, అంటే పరిపూర్ణ అభివ్యక్తి కీలక శిఖరంగా, భూమిపై సమస్తాన్ని జయించడం.

*

రాత్రి ఎల్లప్పుడూ అనేక వాగ్దానాలతో నిండి ఉంటుంది, మనం దానిని పూర్తి విశ్వాసం మరియు దృఢనమ్మకంతో ఎదుర్కోవాలి.

*

అనుగ్రహానికి చెందిన సర్వశక్తి పట్ల మన విశ్వాసం ఆ దివ్యానుగ్రహంతో సమానంకాదు.

*

స్వయంపైనే ఏకాగ్రత అంటే క్షయించి మరణించడం. పరమాత్మపై ఏకాగ్రత మాత్రమే జీవితం, ఎదుగుదల, సాక్షాత్కారాలను తెస్తుంది.

*

అవును, నా బిడ్డ! భగవంతుడే ఏకైక ఆశ్రయం అనేది పూర్తి నిజం - అతడు సంపూర్ణ భద్రతకు నిలయం.

*

అవును, దైవానుగ్రహం పట్ల విశ్వాసం, అనుగ్రహం మనతో జోక్యం కల్గజేసుకొనేలా చేస్తుంది.

*

భగవంతులో మాత్రమే మనకు సంపూర్ణ శాంతి, పూర్ణ సంతృప్తి లభిస్తాయి.

*

భగవంతుని సన్నిధి మనకు శక్తిలో శాంతిని, చర్యలో ప్రశాంతతను, ఎటువంటి పరిస్థితులలోనైనా చెరగని ఆనందాన్ని ఇస్తుంది.

*

ప్రయాణం ఎంత దీర్ఘమైనా, ప్రయాణీకుడు ఎంత గొప్పవాడైనా, అంతిమంగా ఎప్పటికీ కేవలం దైవకృప మీద విశ్వాసంతో ఆధారపడి ఉన్నట్లు కనుగొంటాడు.

*

**AKHILA - Akhila Bharata Patrika (Telugu)**

with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

*Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo*



**Hope**

*Paves life's way.*

*ignificance and explanation of the flower given by the Mother)*

Botanical name: Jacquemontia pentantha

*Owner:* Sri Aurobindo Society
: Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
*blisher:* Pradeep Narang for Sri Aurobindo Society
*ı:* Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
*Printed from:* Sri Aurobindo Ashram Press,
. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**


A Monthly Published by

RI AUROBINDO SOCIETY-605001


# అఖిల

అఖిల భారత పత్రిక

ఫిబ్రవరి 2024



# భువికవసర నగరం



## విషయ సూచిక



## సంపాదకీయం :

**1968** ఫిబ్రవరి **28**న మదర్‌చే ఆరంభించబడిన 'ఉషానగరం' గురించి, ప్రతివాని అవగాహనను బట్టి అధికంగానే వ్రాశారు. రచనల నుండి, సంభాషణల నుండి విషయాలను సేకరించి ఎందుకున్నదో అది ఏ ఉద్దేశ్యంతో నిర్మితమైందో, ఒక స్పష్టమైన, చిత్రాన్నందించేందుకు అన్నింటినీ కలిపి గుది గ్రుచ్చడానికి ఈ ప్రయత్నించాం.

*అనువాదం :*

# ఆరోవిల్లి

కేంద్రంలోని చుక్క, ఏకత్వాన్ని, పరాత్పరాన్ని సూచిస్తుంది. లోపలి వృత్తం సృష్టిని, నగర రూపకల్పనను సూచిస్తుంది. ప్రకటనాశక్తిని, సిద్ధిని పుష్ప దళాలు సూచిస్తాయి.

*CWM 13:212* *ది మదర్*

# ఆరొవిల్లీ పుట్టుక

పూర్తి పారదర్శకమైన నిజాయితి వ్యక్తిలో ఉండి తీరాలి. ఆ నిజాయితీలోపమే ప్రస్తుత కష్టాలకు మూల కారణం.

కపటం మనుషులందరిలోను ఉన్నది. బహుశ భూమి మీద ఒక వందమంది నిజాయితీపరులు ఉంటారేమో! మనిషికున్న స్వభావమే అతడిని కపటిగా మార్చుతుంది. ఇది చాలా క్లిష్టపరిస్థితి, ఎందుకంటే ఈ మనిషి నిరంతరం తనను తాను మోసపుచ్చుకొంటూనే ఉన్నాడు. సత్యం నుండీ తనను దాచివేస్తూ ఉన్నాడు. తనకు మన్నింపులను వెతుక్కొంటూ ఉన్నాడు. మనిషి తన ఉనికిలోని అన్ని భాగాల్లో నిజాయితీపరుడుగా మారడానికి యోగం ఒక మార్గం. నిజాయితీగా ఉండడం చాలా కష్టం. కనీసం మానసికంగానైనా మనిషి నిజాయితీగా ఉండగలడు. ఇదే ఆరొవిల్లీ వాసుల నుండి కోరుకోగల్గేది.

అక్కడ ఒక శక్తి ఉంది. అది ఈనాడే ఉంది పూర్వం కాదు; ఆ శక్తి పై నుండీ దిగిరాగా దానిని అనుభూతి చెందడాన్ని అడ్డుకునేది మనలో వున్న కపటత్వమే. ఈ ప్రపంచం అసత్యంలో నిగ్రంగా నిలిచి ఉంది. మనుషుల మధ్య ఉన్న సంబంధాలన్నీ మోసం, కపటత్వాలను ఆధారంగా చేసుకొని ఉన్నాయి. దేశాల మధ్య రాయబార వ్యవహారం కూడా కపటంపైనే ఆధారపడి ఉంది. ఆ దేశాలు ఒక్క పక్క శాంతిని కోరతాయి, మరోపక్క వాటంతటవే ఆయుధాలు చేత ధరిస్తాయి. మనిషిలోనూ, దేశాల్లోనూ ఒక పారదర్శకమైన నిజాయితీ మాత్రమే 'ఒక రూపాంతరిత ప్రపంచాన్ని' అనుమతిస్తుంది.

ఆ దిశగా ఆరొవిల్లీ మొదటి ప్రయోగం. స్వభావ రూపాంతరం కోసం, నిజాయితీ కోసం శ్రమించడానికి మనుషులు సమ్మతించుకొంటే ఒక క్రొత్తలోకం ఆవిర్భవిస్తుంది. అది సాకారమౌతుంది. జంతువు నుండీ మనిషిగా పరిణమించడానికి మిలియన్ల సంవత్సరాలు పట్టింది. నేటి మానవుడు, అతడి మేధస్సుకు ధన్యవాదాలు. తనముందున్న విషయాలను వేగిరపర్చగలడు, దేవునిగా ఉండగల మనిషి వైపుగా అతడు రూపాంతరం చెందబోతాడు.

ఈ రూపాంతరీకరణ మనస్సు సహకారంతో ఆత్మ విశ్లేషణ ద్వారా జరుగుతుంది. ఇది మొదటి దశ. తర్వాత ప్రాణిక ప్రచోదనాలు కూడా రూపాంతం చెందాలి. అదింకా కష్టతరమైనది, ఆ పై అన్నింటికంటే

దుర్గమమైనది భౌతిక రూపాంతరీకరణం. ఈ కార్యాన్ని నేను ఇక్కడ నిర్వహిస్తున్నాను. అది మరణంపై విజయాన్ని కలుగజేస్తుంది. అదిక మరొక కథ; అది భవిష్య మానవజాతి, అది బహుశ శతాబ్దాల్లోనే, వేగంగానే సంభవించవచ్చు. అది మనిషిపైనే, ఈ మనుషులపైనే ఆధారపడి ఉంది.


ఆరొవిల్లీ ఈ లక్ష్యం వైపుగా మొదటి అడుగు

*శ్రీమాత శిష్యునితో సంభాషణ - ఫిబ్రవరి 28,1968*

## ఆరొవిల్లీ రూపకల్పన

చాలాకాలంగా నాకు ఒక ఆదర్శ నగరానికి సంబంధించిన ప్రణాళిక ఉంది. దానికి శ్రీ అరవిందులే కేంద్రంగా ఉన్నట్లుగా, అది శ్రీ అరవిందులు భౌతికంగా జీవించి ఉన్న కాలంలోనే ఉండేది. తరువాత... ఎందుకో ఆ భావనపై ఉత్సాహం సన్నగిల్లింది. మళ్ళీ మేం ఆరొవిల్లీ భావనను చేబూనాం. (నేను దానిని 'ఆరోవిల్' అని పిలిచాను) మరో పక్క ఈ నిర్ధారిత ప్రదేశానికి బదులుగా 'లేక్'కి దగ్గరలో వున్న స్థలాన్ని దీని రూపకల్పనకు అనుకొన్నాం. ఇప్పటికీ దానిపైన గౌణ ఉత్సాహాన్నే కనబర్చుతూ వచ్చాను. ఎందుకంటే దానిని గూర్చి ఒక మార్గదర్శనాన్ని నేను అందుకోలేదు. అప్పుడే ఈ చిన్న 'హెచ్' ఆ ఆలోచనను తాను స్వీకరించి 'లేక్' దగ్గర చిన్న ఇంటిని నిర్మించుకుంది. అది తర్వాత నాకే సమర్పించాలనే ఆలోచనతో జరిగింది. తనకు వచ్చిన స్వప్నాలన్నింటిని గూర్చి నాకు లేఖ వ్రాసింది. అకస్మాత్తుగా దానిలోని రెండు మూడు వాక్యాలను పరికించి చూడగా రూపం దాల్చడానికి ప్రయత్నించిన ఒక పాత జ్ఞాపకం మళ్ళీ మేల్కొన్నది - ఒక సృష్టి - అప్పుడు నా వయస్సు ఎంతో గుర్తులేదు గాని, అది చాలా చిన్న నాటి జ్ఞాపకం. ఆ తరువాత ఈ శతాబ్ది ప్రారంభంలో నేను మాక్స్‌థియోన్ దగ్గర ఉండగా మళ్ళీ అది రూపుతీసుకోవడానికి ప్రయత్నించింది. కాని తరువాత దానికి సంబంధించినదంతా మర్చిపోయాను. అదంతా ఆ అమ్మాయి రాసిన లేఖతో గుర్తుకొచ్చింది. వెంటనే ఆరొవిల్లీకి సంబంధించిన ప్రణాళికను వేసుకొన్నాను. ఇప్పుడు నాకు సహజమైన పథకం ఉంది. సవివరమైన ప్రణాళికలను తయారు చేయడం కోసం 'ఆర్' రాక కోసం ఎదురు చూస్తున్నాను. ఎందుకంటే నేను ఆరంభం నుండి చెబుతున్నాను కదా! 'ఆర్' ఆరొవిల్లీకి వాస్తు శిల్పి కాగలడు. అతడికి జాబు రాశాను.

*- శ్రీమాత : శిష్యునితో సంభాషణ జూన్ 23, 1965.*



ఆశ్రమ జీవనాదర్శానికి, ఆరొవిల్లీ జీవనాదర్శానికి వున్న ప్రాథమిక భేదం ఏమిటి?

భవిష్యత్ దృష్ట్యా, భగవంతుని సేవ దృష్ట్యా ప్రవర్తనా ధోరణిలో ఎలాంటి ప్రాథమికమైన భేదం లేదు.

కాని ఆశ్రమ వాసులు వారి జీవితాలను యోగానికి (సహజంగా విద్యార్థుల విషయంలో అయితే వాళ్ళు కేవలం చదువుకోవడం కోసమే ఇక్కడ ఉంటున్నారు. జీవితంలో యోగాన్ని ఎంచుకోమని వారికి చెప్పడం జరగదు) సమర్పించుకోవడం కొరకు ఉన్నారు.

ఆరొవిల్లిలో మానవ జాతి అభివృద్ధికై ఒక సామూహిక అనుభవాన్ని కల్గించగల సద్భావన వుంటే చాలు ఇక్కడకు ప్రవేశించడానికి.

*శ్రీమాత శిష్యునితో సంభాషణ, నవంబర్ 10,1969*

# ఆరొవిల్లి ఆవిర్భావం

ఆరొవిల్లి అధికార పత్రం :

**1.** ఆరొవిల్లి ప్రత్యేకంగా ఎవరికీ చెందినది కాదు. ఆరొవిల్లి యావత్తు మానవజాతికి చెందినది. ఆరొవిల్లిలో ఉండాలంటే దివ్యచేతనకు సేవకులుగా ఉండేందుకు సుముఖంగా ఉన్నవారైఉండాలి.

**2.** ఆరొవిల్లి ముగింపు అన్నది లేని విద్యకు, నిరంతర వికాసానికి, వయసు మళ్ళని యువత్వానికి స్థానం.

**3.** ఆరొవిల్లి గతానికి, భవిష్యత్తుకు మధ్య అన్ని ఆవిష్కృతులను,ఉపలబ్ధులను గైకొంటూ తెగువతో భవిష్య సాక్షాత్కారాల వైపు అంగవేయబోతోంది.

**4.** ఆరొవిల్లి వాస్తవమైన మానవ సమైక్యతకు చెందిన సజీవ సాకారానికై జరిగే ఆధ్యాత్మిక, పదార్థపరమైన పరిశోధనలకు ఒక ప్రయోగ క్షేత్రం కావాలనుకొంటుంది.

*శ్రీమాత శిష్యునితో సంభాషణ ఫిబ్రవరి 28, 1968*

ఆరొవిల్లి ప్రత్యేకంగా ఏ ఒక్కరికీ చెందినది కాదు, ఆరొవిల్లి మొత్తంగా యావత్ మానవజాతికి చెందినది. కాబట్టి పున్న వాస్తమిదే. ఆరొవిల్లి ఫలానా దేశానికి చెందింది అని నేను చెప్పడం లేదు, ఎందుకంటే భారతదేశానికి ఇది ఆగ్రహం కల్గించి ఉండవచ్చు. దీనిని "ఏ ఒక్కరికి చెందినదిగా చెప్పడం లేదు" - 'ఎవరికి' అన్నమాట స్పష్టంగా లేదు. ఎవ్వరికీ అంటే దానర్థం ఏ మానవునికి లేదా ఏ దేశానికి చెందినదిగా కాదు. ఆరొవిల్లి మొత్తంగా మానవజాతికి చెందినదిగా చెబుతున్నాను. ఎందుకంటే దేనితోనూ ఇది సరిసమానం కాదు. దీనిని మనుషులంతా కలసి అంగీకరించకపోతే ఇది అసాధ్యమౌతుంది. దీనిని నేను ఉద్దేశ్యపూర్వకంగానే నిర్ణయించాను.

పౌరుల గురించి నేను ప్రస్తావించను. నేను చెప్పేదంతా... ఆరొవిల్లిలో ఉండేవారు, దైవచేతనకు సంబంధించి సుముఖమైన సేవకులుగా ఉండి తీరాలి.

"దైవం" అని అంటే వారంతా భంగపడవచ్చు. నేను, దానిని లెక్కచేయను. కేంద్రంలో 'మాతృ మందిర్' యొక్క వివరణ ఉంటుంది. నీకర్థమయ్యిందా? మాతృమందిర్ దివ్య చేతనకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అంతా చెప్పనిదే అయిపోతుంది. ఇదీ అలానే.

ఇంకా...

**2.** ఆరొవిల్లి ముగింపు అన్నది లేని విద్యకు, నిరంతర వికాసానికి, వయసు మళ్ళని యువత్వానికి స్థానం.

**3.** ఆరొవిల్లి గతానికి, భవిష్యత్తుకు మధ్య వారధి కావాలనుకొంటుంది. అన్ని ఆవిష్కారాలకు సంబంధించిన ఉప లబ్ధులను చేపట్టుతూ.... ఇక్కడ అన్ని ఆవిష్కారాలు అంటే, తాత్త్విక, ఆధ్యాత్మిక, నైతిక, వైజ్ఞానిక, ఇలా ప్రతిదీ - గతానికి చెందిన ఉపలబ్ధుల్ని గైకొంటూ... ఆంతరికమైన, బాహ్యమైన అన్ని ఆవిష్కరణలతో పాటు ఆరొవిల్లీ తెగువతో భవిష్యత్ సాక్షాత్కారాలకై ముందుకు అంగవేస్తుంది.

చివరగా రెండు రూపాలుగా ఉంది. 'ఆరొవిల్లి సద్భావన, పరస్పర అవగాహనలను ఆధారంగా చేసుకొన్న మానవ సమైక్యతవైపు నడిపించే జీవన సాధనాలు మరియు జ్ఞానపరమైన పరిశోధనకు స్థానంగా ఉంటుంది.

మరోకాగితపు ముక్కపై 'మనమిక్కడ వాస్తవమైన మానవ సమైక్యతకు సజీవ దేహాన్ని రూపుదిద్దాలి. కాబట్టి మనం కొద్దిగా మారాలి.

**4.** ఆరొవిల్లీ వాస్తవమైన మానవ సమైక్యతకు చెందిన ఒక సజీవ సాకారానికై జరిగే ఆధ్యాత్మిక, పదార్థపరమైన పరిశోధనలకు ఒక నెలవు కావాలను కొంటుంది.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ ఏప్రిల్ 7, 1968.*

## ఆరొవిల్లిలో నివసించేందుకు నియమాలు :

మానసిక దృక్పథం దృష్ట్యా ఉండాల్సిన నియమాలు

**1.** మానవజాతి యొక్క వాస్తవిక ఐక్యతను సంపూర్ణంగా విశ్వసించి దానిని ఒప్పుకోవడం. ఆ సమైక్యతను భౌతికంగా సిద్ధింప చేయడం కోసం, సహకరించాలనే ఇచ్ఛతో ఉండటం.

**2.** భవిష్యత్‌లో కలుగబోయే సత్య సాక్షాత్కారాలకు సహకరించ బోతామనే సంకల్పంతో ఉండటం.

నిజీకరణ జరుగుతూ పోయే కొద్దీ పదార్థపరమైన నియమాలనే ఏర్పాటు చేయడం జరుగుతుంది.

***13:192***

## ఆరొవిల్లీకున్న లక్ష్యాలు

ఒక ప్రభావవంతమైన సమైక్యత

భూమిపై శాంతి

సత్యాన్ని సేవించే నగరం 'ఆరొవిల్లి'

*CWM 13:192*

ఆఖరిగా, ఆశలు ఆకాంక్షలు, మతాలు, జాతుల మధ్య శత్రుత్వాలు, వైషమ్యాలు లేకుండా శాంతంగా జీవించగల్గే ఒక ప్రదేశం.

*CWM 13:195-96*

## ఆశ్రమం - ఆరొవిల్లి

(ఐక్యరాజ్యసమితి (యునెస్కో)కి వ్రాసింది)

శ్రీఅరవిందుల దర్శనానికి ఒక దృఢమైన స్పష్టమైన రూపాన్ని ఇచ్చే సంక్లిష్టమైన కార్యం శ్రీమాతకు అప్పగించబడింది. ఒక నూతన చేతనను అభివ్యక్తం చేసే, రూపొందించే ఒక కొత్తప్రపంచ సృష్టిని, ఒక మానవజాతిని, ఒక కొత్త సమాజాన్ని నిర్మించే కార్యానికి శ్రీమాత పూనుకున్నారు. అదే వస్తు స్వభావంతోసామూహిక ప్రయత్నాన్నికోరే, సామూహిక ఆదర్శమిది. అది ఒకానొక సమగ్రమైన మానవ పరిపూర్ణత్వం అనే రూపంగా గ్రహించబడుతుంది.

ఈ లక్ష్య సాధన వైపుగా శ్రీమాత వేసిన మొదటి అడుగే ఆశ్రమ స్థాపన, నిర్మాణం. ఆరొవిల్లి యోజన రెండవ అడుగు. చాలా బాహ్యంగా, అది మానవ జాతి సామూహిక జీవనంలో స్వర్గానికి భూమికి ఆత్మకు, ప్రకృతికి, అంతరాత్మకు శరీరానికి మధ్య సామరస్యాన్ని నెలకొల్పే ప్రయత్న ఆధారాన్ని విశాల పర్చేందుకు చూస్తుంది.

*

నేను ఎప్పుడూ ఆశ్రమాన్ని, ఆరొవిల్లీని సమగ్రమైన అఖిలంలోని అంతర్భాగాలుగా పరిగణిస్తాను. వాటిని వేరు వేరు అస్తిత్వాలుగా భావించను, కానీ వాటిని మీరు ఎందుకు వేరు చేశారు మదర్? ఈ విషయంలో నేను పొరపాటు పడ్డానా? మా దృక్పథంలో సమైక్యత వైపు పోవడం కోసం ఇది చాలా గొప్ప అవసరంగా నాకు కనిపిస్తుంది.

ఆశ్రమం (మూల) కేంద్ర చేతన. ఆరొవిల్లి అన్నది దానికి సంబంధించి బాహ్య అభివ్యక్తీకరణల్లో ఒక పథకం. ఈ రెండు ప్రదేశాల్లోనూ దైవం కొరకే పని జరగాలి.

ఆశ్రమంలో ఉండే వారికంటూ పని ఉంది. వారిలో కొందరు అసలు తీరిక లేకుండా ఆరొవిల్లీకి పనిచేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ పనిలో మునిగిపోయి ఉండాలి. ఒక యోగ్యమైన సంస్థకు ఇది ఎంతో ముఖ్యం.

ఆరొవిల్లీ ఐక్యత కోసం ఆకాంక్షిస్తున్నది.

*CWM 13:204-05*

ఆశ్రమానికి ఆరొవిల్లీకి ఉన్న బేధమేమిటి?

ఆశ్రమం ఎన్నటికీ నిజమైన మార్గదర్శి, ప్రేరణ స్రోతస్సు పాత్రను పోషిస్తూనే ఉంటుంది.

ఆరొవిల్లీ సామూహిక సాక్షాత్కారం వైపుగా ప్రయత్నిస్తుంది.

*

నిజమే ఆరొవిల్లీలో ఉండటమంటే ఉండే వారి చేతనలో గొప్ప అభివృద్ధి జరిగి తీరాలి. కానీ ఈ అభివృద్ధి సుసాధ్యమయ్యే తరుణం వచ్చింది. నా సంపూర్ణ ప్రేమతో

*

ఆరొవిల్లీ నిజమైన చేతనాభివృద్ధి కోసమే కాని, కోర్కెలను సంతృప్తిపర్చుకోవడం కోసం కాదు.

*

భవిష్యత్తులోకి నెట్టబడటం అంటే పొందిన ఉపలబ్ధుల్ని త్యాగం చేయడానికి సిద్ధపడటం. అంటే నైతికమైన, పదార్థపరమైన వాటినన్నింటిని భవిష్యత్ ఇవ్వగల వాటిని ఆర్జించే నిమిత్తం త్యాగం చేయడానికి సిద్ధపడటం.

భవిష్యత్ తెచ్చి పెట్టే వాటిని పొందగల్గేవారు కొద్దిమందే ఉన్నారు. కాని నూత్న సంపత్తిని ఆర్జించే నిమిత్తం వారి దగ్గరున్న దాన్నంతా వదిలిపెట్టుకోవడానికి సిద్ధంగా లేరు.

*

ఆరొవిల్లికి వచ్చేది సౌకర్యం కోసం, మనిషి తన కోర్కెలను సంతృప్తి పర్చుకోవడం కోసం కాదు. సాక్షాత్కరించుకోవాల్సిన సత్యానికి సమర్పించుకోవడం కోసం, చేతనాభివృద్ధి కోసం రావాలి.

ఆరొవిల్లి సృష్టిలో పాలుపంచుకోవడానికి మొదటి ఆవశ్యతక నిస్వార్థత.

*CWM 13:196-97*

# ఆరోవిల్ ప్రగతి

ఆరోవిల్‌లో మనం ఎదుర్కొంటున్న ఇబ్బందులు

సాధారణ మరియు సంపూర్ణ మార్గంలో, సమస్యలు ఎల్లప్పుడూ అనుగ్రహమే. మానవ బలహీనత కారణంగా (నేను దానిని ఎలా చెప్పాలి?) వారు సహాయం చేయడంలో విఫలమవుతారు. కష్టాలు ఎల్లప్పుడూ అనుగ్రహమే. నేను ఈ సమయంలో చాలా కాలం పాటు భూమిపైఉన్నాను, ఎల్లప్పుడూ-ఎల్లప్పుడూ, ఎల్లప్పుడూ, ఒక్క మినహాయింపు కూడా లేకుండా- చిట్టచివరికి కష్టాలు అన్నీ అనుగ్రహం తప్ప మరేమీ కాదని నేను చూశాను. ఇది నా జీవితమంతా నా అనుభవం కాబట్టి నేను వేరే విధంగా అనుభూతి చెందలేను, అలా చూడలేను. నేను మొదట్లో కలత చెంది, "ఎలా, నేను సద్భావనతో నిండి ఉన్నాకూడా, ఇంకా కష్టాలు పెరుగుతూనే ఉన్నాయి...." అని అనుకున్నాను, కానీ తర్వాత, నన్ను నేను ఒక చెంపదెబ్బ వేసుకుని : "పిచ్చి దానా! ఇది నీలో, నీవు చేసే పనిలో మరింత పరిపూర్ణత తీసుకురావడానికి మాత్రమే. అది." (నిశ్శబ్దం)

కొంతమంది వ్యక్తులు ఆశ్రమం నుండి ఆరోవిల్‌కి పంపించివేయబడ్డారు. వాళ్ళు మన పనిని మరింత కష్టతరం చేసే క్లిష్టమైన అంశాలుగా ఉండేవారు. వారు సహజంగానే ఆరోవిల్ నుండి ఇంకా ఎక్కడికైనా తరిమివేయబడాలని నేను కోరుకుంటున్నాను. ఇది మిగిలిన ప్రపంచానికి అంత మంచిది కాదు- కానీ పర్వాలేదు! స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉన్నప్పటికీ, వారు సహించదగినవారు కావచ్చు. ఆచరణాత్మకంగా, ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడవలసి ఉంటుంది...

పరిశుభ్రత విషయంలో కూడా అదే. ఆ విషయాలకు బాధ్యత వహించే వారు ఎవరూ లేరా?

అవును మాతా, మన దగ్గర ఉన్నవారితో మనం పనిచేయాలి.

అవును. మనం విశ్వసించగల వ్యక్తులతో ఏదైనా పని ప్రారంభించండి, ఇతరులు అసంతృప్తిగా ఉంటేవారు వెళ్లిపోవచ్చు. నా ఉద్దేశ్యం మీకు అర్థమైందా? "నీవు వెళ్లిపో"అని వారి ఎదురుగా అనేకన్నా (అనేక కారణాల వల్ల ఇది చాలా కష్టం), వారు అంగీకరించని మనుషుల అధీనంలో వారిని ఉంచినట్లయితే, వారు బలవంతంగా నిష్క్రమిస్తారు. వారు మొదట నిరసన వ్యక్తం చేస్తారు, కానీ మనం దృఢంగా ఉండాలి: " ఇది ఇలాగే జరుగుతుంది".

అవసరమైన సత్ శీల బలంతో దీన్ని చేయగల వ్యక్తులను మనం కనుగొనాలి, వారిని కనుగొన్న తర్వాత, వారికి అధికారం ఇవ్వవచ్చు, ఇతరులు దీనిని ఇష్టపడకపోతే, వారు ఇక్కడి నుండి వెళ్లిపోవలసి ఉంటుంది!అంతే. అయితే ఆ స్థానాన్ని సమర్ధవంతంగా చేపట్టే సామర్థ్యం ఉన్న వ్యక్తి లేదా వ్యక్తులు దొరకనంత కాలం ఇప్పటికే అక్కడ ఉన్న వ్యక్తులను మనం తొలగించలేము.

## ఆరోవిల్‌లోకి ప్రవేశం - నిష్క్రమణ

అయితే ఆరోవిల్‌లో ప్రవేశాల సమస్య కూడా ఉంది.

ఓహ్! మంచిది?

ఉదాహరణకు, కొన్ని అంశాలు ప్రారంభం నుండి మనకు పూర్తిగా అవాంఛనీయమైనవిగా కనిపిస్తాయి. ఇంకా ఇటువంటి వ్యక్తులు కొన్నిసార్లు అక్కడ ఉండడానికి అంగీకరించబడతారు, దీనికి కారణం ఉందా?

తాత్కాలికంగా, కొంతకాలం చూసిన తరువాత మాత్రమే, ఇంకొక విధంగా కాదు.

కానీ, అమ్మా, ఒకసారి వారు ఇక్కడ తాత్కాలికంగా వస్తే, వారిని ఎవ్వరూ పంపలేరు!

ఆహ్, లేదు! వారు సంతృప్తికరంగా లేకుంటే పంపించివేయవచ్చు. ఆశ్రమంలో పూర్తిగా అవాంఛనీయంగా ఉన్నందున నేను ఎవరిని బలవంతంగా ఆశ్రమం నుండి తొలగించవలసి వచ్చిందో వారిగురించే నేను మాట్లాడుతున్నాను, వారు ఆరోవిల్‌కి వెళ్ళారు. ఈ వ్యక్తులు వెళ్లిపోవాలి, లేదంటే నేను చెప్పినట్లు, వారికి ఇక్కడ స్థానం లేదని భావించాలి. అయితే

కొత్తవారిని, తాత్కాలికంగా అనుమతించిన వారిని, వారు అవాంఛనీయంగా మారితే పంపివేయవచ్చు. నా ఉద్దేశ్యం పాతకాలపువారు, సంవత్సరాలు సంవత్సరాలుగా ఇక్కడ ఉన్నవారు. కానీ కొత్తవాళ్ళు, తాత్కాలికంగా తీసుకున్న వారిని సంతృప్తికరంగా లేని వారినందరినీ పంపివేయవచ్చు. వారు తప్పక వెళ్లిపోవలసిందే. వారిని పంపివేయడానికి నేను మీకు పూర్తి అధికారం ఇస్తున్నాను.

మీరు చూడండి, కొంతమంది నా దగ్గరకు వస్తారు - నాకు వారి పేర్లు తెలియదు, వారు ఏమి చేస్తారో నాకు తెలియదు, వారి గురించి నాకు ఏమీ తెలియదు. ఆరోవిల్‌లో ప్రవేశం కోసం కొత్త అభ్యర్థనలు మీ ఇద్దరిలో ఒకరి ద్వారా నాకు రావాలి, దురదృష్టవశాత్తు, చాలా మంది నాకు వ్రాస్తారు, వారెవరో నాకు తెలియదు. చూడండి, నాకు పేర్లు గుర్తుండవు. వాళ్లెవరో, ఏం చేస్తారో వగైరా తెలిసినప్పుడే నాకు గుర్తుకొస్తుంది. కానీ మీరు ఈ వ్యక్తుల యొక్క విలువేమిటో తెలుసుకుని, "వీరు ఇలాంటివారు లేదా అలాంటివారు" అని నాకు చెప్పగలిగితే, మీరు చెప్పేది నేను విశ్వసిస్తాను. "ఆ వ్యక్తి అవాంఛనీయుడు," అని మీరు నాకు చెబితే సరే, అతను వెళ్లిపోవలసిందే. కానీ నాకు ముందే సమాచారం ఇవ్వాలి, ఎందుకంటే వ్యక్తులు సాధారణంగా ఒకరి ద్వారా వెళతారు, తర్వాత మరొకరి ద్వారా నాకు వారి అభ్యర్థనను అందజేస్తారు, నేను అది పరిశీలించలేను, నాకు తెలియదు. మీరు పూర్తి చిత్రాన్ని చూస్తున్నారా? నేను సాధారణ సమాధానం ఇస్తాను వారు దానిని ఇలా తీసుకుంటారు... వారు మరెవరో అని నేను అనుకుంటాను. నాకు గుర్తు ఉండదు, నేను పేర్లు మర్చిపోతాను - మరుసటి నిమిషం నేను అన్నీ మర్చిపోతాను. నా తల నిండా... అన్నిటికంటే చాలా విశాలమైనది, మీకు తెలిసిందే. నాకు ఆరోవిల్ లో కొత్త ప్రవేశాలకు సంబంధించిన సమాచారం అందించడానికి ఒక వ్యక్తి ఉండాలి-ఒకరు లేదా ఇద్దరు ఉండాలి (ఇద్దరు ఉంటే చాలా బాగుంటుంది) మరియు మీరు అవాంఛనీయమని భావించిన వారిని తిరిగి పంపడానికి నేను పూర్తిగా అంగీకరిస్తున్నాను....

మీరు వారికి కనీసం ఒక నెల సమయం ఇవ్వాలి. కనీసం ఒక నెల. కానీ వాళ్ళు కించిత్ చిత్తశుద్ధి లేమిని ప్రదర్శిస్తే, "నేను ఇది చేయను, నేను ఇది చేస్తాను, నేను ఇది చేయను, వగైరా..." అని చెబితే, "మీరు వెళ్లిపోవచ్చు"

అని వారికి చెప్పండి. మీరు నన్ను అడగవలసిన అవసరం లేదు, మీరు వారిని పంపించివేయవచ్చు. ఫలానా ఫలానా వ్యక్తి అసంతృప్తికరంగా ఉన్నట్లు కనుగొన్నాము అని నాకు తెలియజేయండి. ఇలా చేయడానికి నేను మీకు అధికారం ఇస్తున్నాను. నేను దానిని వ్యతిరేకించను. కానీ నాకు సమాచారం ఇవ్వాలి ఎందుకంటే చాలా మంది వ్యక్తులు నా వద్దకు వస్తారు,చూడండి, వారు చాలా దొంగ తెలివితేటలు కలిగి ఉన్నారు: వారు తమ అభ్యర్థనను పంపడానికి మరొక వ్యక్తిని కనుగొంటారు.

*శ్రీమాత శిష్యుడితో సంభాషణ, ఏప్రిల్ 4, 1972*

భవిష్యత్తు కోసం జీవించాలనుకునే వారందరికీ:

ప్రతి ఒక్కరు తమచైతన్యం యొక్క శిఖరాగ్రానికి ఎదగాలి అని ప్రతిఒక్కరూ ముందు సమ్మతించాలి. ఆ ఎత్తులపైన మాత్రమే ఏకత్వం అనేది సృష్టించబడుతుంది.

*CWM 13: 205*

అతిమానస అవతరణకు సిద్ధపడండి, కోరికలతో కూడిన జీవితానికి కాదు :

(వాస్తుశిల్పి) మా మదిలో ఉన్న ప్రశ్న, అమ్మా, ఈ వ్యక్తులు ఆరోవిల్‌కు ఒక నిర్దిష్ట రకమైన ఇబ్బందులు కలగచేసే పనిలో ఒక విధంగా ఉపయోగకరంగా ఉన్నారని మీకు అనిపిస్తోందా అని ఉంది.

లేదు! ససేమిరా! లేదు, లేదు, నేను ఉద్దేశపూర్వకంగా కష్టాలను జోడించ డాన్ని ఇష్టపడను! అవి వస్తాయని నాకు తెలుసు.... కానీ వాటిని ఆహ్వానించ కూడదు- అందుకు విరుద్ధంగా మనం వాటికిచోటివ్వకూడదు. పనులు వీలైనంతవరకు సులభతరం చేసుకోవాలి. కష్టాలు వచ్చినప్పుడు ఆందోళనకు గురికాకూడదు. అది మాత్రమే ముఖ్యమైన విషయం. కష్టాలను అంగీకరించాలని నేను అస్సలు చెప్పడం లేదు-వాటిని అస్సలు, అస్సలు, ఆహ్వానించవద్దు. జీవితం చాలా కష్టం! కానీ ఏదైనా కష్టం వచ్చినప్పుడు హృదయాన్ని బలపరచుకొని ధైర్యంగా ఎదుర్కోవాలి.

మనం క్రమత, సామరస్యత, సౌందర్యం మరియు... సామూహిక ఆకాంక్ష కోసం ప్రయత్నించాలి- ప్రస్తుతానికి లేని అన్ని విషయాలు. నిర్వాహకులుగా మన పని ఏమిటంటే ఇతరులు ఏమి చేయాలని మనం కోరుతున్నామో దానికి మనమే ఒక ఉదాహరణగా నిలవడం. మనం మన వ్యక్తిగత

భావాలనుండి పైకి ఎదగాలి, ప్రత్యేకించి దైవ సంకల్పానికి అనుగుణంగా ఉండాలి. దైవసంకల్పం పట్ల విధేయతతో కూడిన సాధనంగా ఉండాలి - మనం ఎటువంటి వ్యక్తిగత ప్రతిచర్య లేకుండా వ్యక్తిభావన లేనివారమై ఉండాలి.

మనం చిత్తశుద్ధితో "ఉండాలి". భగవంతుడు ఏమి కోరుకుంటున్నాడో అలా జరగనివ్వండి. అంతే. మనం అలా ఉండగలిగితే, మనం ఎలా ఉండాలో అలాగే ఉంటాం, అదే మనం చేయవలసినది. మిగిలిన వారి కోసం... మిగిలిన వారందరికీ, మనం చేయగలిగినంత ఉత్తమంగా చేద్దాం.

ఇది అంత సులభం కాదని నాకు తెలుసు, కానీ మనం సులభమైన పనులు చేయడానికి ఇక్కడ లేము, సులభమైన జీవితాన్ని ఇష్టపడే వారి కోసం ప్రపంచం మొత్తం ఉంది. ప్రజలు ఆరోవిల్‌కు రావడం అంటే సులభమైన జీవితానికి రావడం కాదు-అంటే వికాసం కోసం ఒక భారీ ప్రయత్నం చేయడానికి రావడమేనని నేను భావిస్తున్నాను. ఎవరైతే దీన్ని అందుకోలేక పోతున్నారో వారుతప్పనిసరిగా వెళ్లిపోవాల్సిఉంటుంది. పరిస్థితులు ఇలా ఉండాల్సిందే. వికాసం చెందాల్సిన ఆవశ్యకత, తమ సత్తా యొక్క దైవీకరణ కోసంచేసే తీవ్ర ప్రయత్నం - ఇది చాలా బలంగా ఉండాలి - తదనుగుణంగా చేయలేని వారు, అందుకు ఇష్టపడని వారు వారంతట వారే వెళ్లిపోతారు: "ఓహ్, ఇది నేను అనుకున్నట్టుగా లేదు." అనుకుంటారు.

ఇప్పుడు ఉన్నట్లుగా, ఎవరైతే తేలికైన జీవితాన్ని కోరుకునే వారు, తమ తమ ఇష్టానుసారం చేయడానికి, "ఆరోవిల్‌కి వెళ్దాం!" అనుకోకూడదు. ఇది ఇందుకు పూర్తివ్యతిరేకంగా ఉండాలి. ప్రజలు ఆరోవిల్‌కు రావడం అంటే "వికాసం కోసం మానవాతీతమైన కృషి చేసేందుకు" అని తెలుసుకోవాలి.

మన దృక్పథం,మన ప్రయత్నంలోని చిత్తశుద్ధి మార్పును తీసుకువస్తుంది. చిత్తశుద్ధి లేకపోవడం, అసత్యం వీటికి ఇక్కడ స్థానం లేదని ప్రజలు భావించాలి - అవి అసలు పని చేయవు, మనుష్యత్వం దాటిపోవడానికి తమ జీవితమంతా అంకితం చేసిన వ్యక్తులను మీరు మోసం చేయలేరు.

ప్రజలను ఒప్పించటానికి ఒకే ఒక మార్గం ఉంది-అది మనం వారెలా ఉండాలని ఆశిస్తున్నామో అలా మనం ఉండటమే. అప్పుడు మనం బలంగా నిలబడతాము, మన వైపు దైవిక శక్తి అంతా ఉంటుంది.

మనం ఒక గొప్ప మానవ జాతిని సిద్ధం చేయడానికి ఇక్కడ ఉన్నాము, కోరికలలో, సులభమైన జీవితంలో తిరిగి పడకూడదు.

*శ్రీమాత శిష్యుడితో సంభాషణ, ఏప్రిల్ 4, 1972*

## నియమాలు, ఎంపికలు మరియు స్వీయ నియంత్రణలు

నేను ఆరోవిల్ కోసం నియమాలను రూపొందించాలని అనుకోలేదు, కానీ నేను కొన్ని విషయాలను రూపొందించడం ప్రారంభించవలసి వస్తుంది, ఎందుకంటే... అక్కడ ఇబ్బందులు ఎదురవుతాయి. ఏం చేయాలో తెలియడం లేదు.

నేను చెప్పాలనుకున్నది నా మనసుకు వచ్చింది. ఇది చాలా సులభం (శ్రీ మాత వ్రాతపూర్వకమైన నోట్ తీసుకుంటారు), ఇలా (ఇది చాలా చిన్న విషయాల గురించి)

"ఆరోవిల్‌లో తాగడం మరియు నివసించడం అనేవి ఒకదానికొకటి పొసగని విషయాలు, వీటిలో ఏదో ఒకటి ఎంచుకోవాల్సి ఉంటుంది."

ఇది ఏదో అమాయకత్వంతో తాగడం కాదు, అంటే అది హింసాత్మక చర్యలకు దారి తీస్తుంది, అది పిచ్చిగా మారుతుంది.

అయితే, మనం ఈ మార్గంలో ప్రారంభిస్తే, మనం ఇలా కూడా చెప్పవచ్చు (శ్రీ మాత మరో నోట్ తీసుకున్నారు)

"అబద్ధంతో జీవించడం లేదా ఆరోవిల్‌లో జీవించడం అనేవాటిలో ఏదో ఒకటి ఎంచుకోవాలి, రెండూ పొసగవు."

ఇది నిజమగుగాక!

తాగిన వారు మరచిపోవడానికి అలా చేస్తారని మనం చెప్పగలం, కానీ మరచిపోవడానికి ఆరోవిల్‌కు రారు. అందుకు విరుద్ధంగా, గుర్తుంచుకోవడం కోసం అతడు ఆరోవిల్‌కి రావచ్చు.

అవును, మేము దానిని అలా చెప్పవచ్చు.

వారు ఆరోవిల్‌లో నివసించాలనే ఎంపిక పైన దృష్టి ఉంచాలి. ఆరోవిల్‌లో నివసించడం ఒక ఎంపిక. ఇది ఒక ఎంపిక, మీరు అనుసరించాలనుకునే ఒక వైఖరి, అది మీరు తీసుకునే ఒక నిర్ణయం. ఆరోవిల్‌లో నివసించడం ఒక ఎంపిక, మీరు ఒక విధమైన జీవితాన్ని ఎంచుకుంటారు. కానీ మీరు

ఒక జీవన విధానాన్ని ఎంచుకున్న తర్వాత, మిగతావి అందుకు విరుద్ధంగా తయారవుతాయి. ఏమైనప్పటికీ, ఆరోవిల్‌లో నివసించడం అనేది ఒక చర్య, మీరు తీసుకునే నిర్ణయం, ఒక చర్య.

కానీ ఇది (శ్రీమాత తన నోట్‌ను చూపించారు) ప్రస్తుత మానవజాతి ఉన్నస్థితిని దృష్టిలో ఉంచుకొని ఇచ్చిన వెసులుబాటు. నిజం చెప్పాలంటే, ఆరోవిల్‌లో ఒక్కో మనిషిని ప్రత్యేకంగా పరిశీలించాలి. నా ఉద్దేశ్యం ఏమిటంటే: ఆరోవిల్‌లో తాగే అలవాటుతో ఉన్నా కూడా అర్హత ఉండే వ్యక్తులు ఉండవచ్చు. కాబట్టి మేము సాధారణ నియమం విధించలేము. కానీ మనం సాధారణ నియమం చేయకపోతే, మనం ఇక్కడ నివసించడానికి అనుమతించిన వారెవరితోనైనా "వద్దు, మీరు మారాలి-మీరు దీన్ని ఆపండి, లేదంటే మీరు ఆరోవిల్‌లో ఉండలేరు. ..."? అని ఎలా చెప్పగలం.

ఆల్కహాల్ గురించి చెప్పబడినది మాదకద్రవ్యాల గురించి కూడా చెప్పవచ్చు. అనేక ఇతర విషయాల గురించి కూడా చెప్పవచ్చు.

అవును అనేక విషయాలు, ఇంకా ఎన్నెన్నో విషయాలు. ఇది ప్రారంభం మాత్రమే. మీకు అర్థమైందా, అటువంటి పరిస్థితి ఎదురవుతుందని నేను ముందుగానే ఊహించాను. వీరు ఏదో ఒక దాన్ని ఎంచుకోవలసిన అవసరం వుంది, "ఇదా అదా అనేది తేల్చుకొండి." అని చెప్పవలసిన అవసరం ఉంది.

ఇది మత్తుపదార్థాల విషయంలో కూడా అంతే, అయితే కొంతమందిలో ప్రభావాలు ప్రమాదకరమైనవి కావు లేదా హానికరం కాదు.

అంతిమంగా, ప్రతి ఒక్కరి స్వేచ్ఛ ఇతరుల స్వేచ్ఛకు ఇబ్బందిగా ఉండకూడదు అనే వాస్తవం ద్వారా ప్రతి ఒక్కరి స్వేచ్ఛా పరిమితం చేయబడింది. అది పరిమితి.

*శ్రీమాత శిష్యునితో సంభాషణ, ఏప్రిల్ 6, 1968*

## ఆరొవిల్లి మతాలు :

మతాల అధ్యయనం, మానవ చైతన్య అభివృద్ధికి సంబంధించిన చారిత్రక అధ్యయనంలోఒక భాగం.

మతాలు, మానవజాతి చరిత్రలో భాగంగా ఉన్నాయి. మతాల గురించి అధ్యయనం మారు రూపంలో ఆరొవిల్లీలో చేయబడుతుంది. ఇది నమ్మకాల మీద కాకుండా మానవ చైతన్య అభివృద్ధికి, దేనికి కట్టుబడి ఉండాలి, లేదా

కట్టుబడి ఉండకూడదు అని కాకుండా, మానవుని మహోన్నతమైన సాక్షాత్కారంవైపు పయనింపజేసే ప్రక్రియలో భాగంగా ఉంటుంది.

మనం ప్రపంచం లేదా విశ్వంలోని ఒక ప్రత్యేక భావనకు మతం పేరు పెడతాము. దాన్ని పరమ సత్యంగా పరిచయం చేస్తాము. దానిపై ప్రతి ఒక్కరికీ ప్రగాఢమైన నమ్మకం ఉంటుంది. ఎందుకంటే సాధారణంగా ఈ సత్యం అభివ్యక్తికి ఒక ఫలితంగా ప్రకటించబడుతుంది.

చాలా మతాలు దేవుని ఉనికిని, ఆయనకు విధేయత చూపడానికి అనుసరించవలసిన నియమాలను ధృవీకరిస్తున్నాయి. కానీ కొన్ని తమకంటూ దైవం లేని మతాలు. ఉదా : సామాజిక, రాజకీయ సంస్థలు, ఆదర్శం పేరిట లేదా దేశం పేరిట విధేయత చూపడానికి గాను వాటికంటూ సమాన హక్కులను ఆశిస్తాయి.

తనదైన మార్గంలో సత్యాన్ని స్వేచ్ఛగా అన్వేషించడం, దానిని చేరుకోవడం మానవుని హక్కు. కానీ ప్రతి ఒక్కరూ తమ అన్వేషణ తమకు మంచిగా ఉండాలని, ఇతరుల మీద దానిని ఆపాదించే విధంగా ఉండకూడదని తెలుసుకోవాలి.

*CWM 13:206-07*

## నిజమైన ఆరోవిల్లీవాసులు

1. సాంఘిక, నైతిక, జాతి మరియు వంశపారంపర్య వైఖరి వెనుక నిజంగా ఏమి ఉందో తెలుసుకొనుటకు కావలసిన ప్రథమ ఆవశ్యకత అంతరాన్వేషణే.

కేంద్రంలో స్వతంత్రమైన, విశాలమైన సర్వం తెలిసిన ఒక ఉనికి ఉంది. అది మనం దానిని గురించి తెలుసుకోవాలని ఎదురు చూస్తోంది. ఆరోవిల్లీలో మన జీవితానికి, మన సత్తకు క్రియాశీల కేంద్రంగా అవ్వడానికి ఎదురు చూస్తోంది.

2. ప్రతి ఒక్కరూ, నైతిక, సామాజిక విషయాల నుండి స్వేచ్ఛగా ఆరోవిల్లీలో నివసిస్తున్నారు. కానీ ఈ స్వేచ్ఛ, అహంకారం, కోరికలు, ఆశయాలు అనే వాటికి కొత్తగా బానిస కాకూడదు.

కోరికలు తీర్చుకోవడం అనేది మన అంతరాన్వేషణకు అడ్డుకట్టగా మారుతుంది. పరిపూర్ణమైన నిరాసక్తతతో మాత్రమే శాంతియుతమైన, పారదర్శకమైన ఆత్మ పరిశీలనను సాధించగలరు.

3. ఆరోవిల్లీ వాసి వ్యక్తిగత స్వలాభాన్ని వదిలి వేయాలి. భౌతిక ప్రపంచంలో మన మనుగడ, మన జీవితం, మన చర్యలకు ఏది అనివార్యమైనదో, అది మనం ఖచ్చితంగా ఉండవలసిన స్థానాన్ని బట్టి ఉంటుంది.

మనం అంతరంగంతో, మనం ఎంత ఎక్కువ సచేతనంగా సంపర్కంలో ఉంటామో, అంతే ఎక్కువ సాధనాలు మనకు ఇవ్వబడతాయి.

4. అంతరంగ ఆవిష్కరణకు, కృషి, భౌతికంగా చేసే పనులు అనేవి చాలా అవసరం. కృషి చేయకపోతే, మన చేతనను లక్ష్యంపై ఉంచకపోతే, అది ఎప్పటికీ జరగదు. తన శరీరం ద్వారా చేతనను పదార్థంలోని కొంత అంశాన్ని నిర్వహించనివ్వడం మంచిది. తన చుట్టూ ఒక క్రమాన్ని ఏర్పరచుకోవడం, తనలో తాను క్రమాన్ని తీసుకురావడానికి సహాయపడుతుంది.

ఒక వ్యక్తి తన జీవితాన్ని బాహ్య, కృత్రిమ నియమాల ప్రకారం నిర్వహించకూడదు. కానీ వ్యవస్థీకృత అంతర్గత చైతన్యం ప్రకారం ఉన్నత చైతన్యం నియంత్రణకు లోబడకుండా జీవితాన్ని కొనసాగించడానికి అనుమతించినట్లయితే, అది చంచలంగా, వివరించలేని విధంగా మారుతుంది. ఇది సచేతనంగా ఉపయోగించబడని పదార్థంగా ఉంటుంది. దీని వలన ఒకరి సమయం వృధా అవుతుంది తప్ప ఏ ప్రయోజనం ఉండదు.

5. నూతన జాతుల ఆగమనం కోసం ప్రపంచం సిద్ధంగా ఉండాలి. ఈ నూతన జాతుల రాకను త్వరితం చేయుడానికి ఆరోవిల్లి సచేతంగా పనిచేస్తుంది.

6. ఈ కొత్త జాతి ఏమిటో ఎలా ఉంటుందో కొద్ది కొద్దిగా మనకు తెలుస్తుంది. అదే సమయంలో తనను తాను దైవానికి సమర్పించుకొనుటకు విధేయంగా ఉండటం ఉత్తమమార్గం.

*CWM 13:207-08*

## దివ్య స్వప్నం

నేను ఆరోవిల్లీ కోసం కొంచెం వ్రాసాను.

అన్ని జాతీయ శత్రుత్వాలు, సామాజిక అంశాలు, విరుద్ధమైన నైతికత, వ్యతిరేక మతాల నుండి ప్రజలందరూ ఆశ్రయం పొందే ఒక స్థలం భూమికి కావాలి. గతానికి చెందిన బానిసత్వాల నుండి విముక్తులై మానవాళి అందరూ

సంపూర్ణంగా తమకు తాము అన్వేషించి, అభివ్యక్తమవ్వ చూచే చేతనను సాధించేందుకు అంకితం అయ్యే ఒక ప్రదేశం కావాలి.

ఆరొవిల్లీ అటువంటి ప్రదేశం అవ్వాలని కోరుకొంటుంది. మరియు రేపటి సత్యంలో జీవించాలనే వారందరికీ తనను తాను సమర్పించుకొంటుంది.

*శ్రీమాత శిష్యునితో సంభాషణ, మార్చి 17, 1969*

# అరొవిల్లి కార్యం

## ఒక సత్య బీజం :

నాకొక దివ్య జ్ఞానోదయం జరిగింది. అధికంగా అది ఒక దర్శనంలా అనిపించింది.

అన్ని దేశాలు బాహ్య పరిస్థితుల కారణంగా ఎంత దీన స్థితిలో ఉన్నాయో చూస్తున్నాను. అప్పుడు అన్నింటినీ పొందుపరచగల దర్శనమొకటి కలిగింది. దేశాలన్నీ ఎలా (దేశాలను మనుషులుగా పరిగణించటం జరిగింది) ప్రవర్తిస్తున్నాయో, అవి శ్రుతిమించిన అసత్యంలో ఎలా నడయాడుతున్నాయో, నటిస్తున్నాయో, వాటి సృజనాత్మకతను దారుణమైన వినాశనాన్ని సృష్టించటానికెలా వినియోగిస్తున్నాయో! వాటిని ఎవరూ ఉపయోగించలేనంత భయంకరమైన నాశనాన్ని కలిగించాలనే ఒక బాల్య చాపల్యం ఆ మనసుల వెనుక దాగి ఉంది. కానీ వారికి తెలియదు (వారు తెలుసుకోవాలి, కానీ వారికి తెలియదు) ఏమిటంటే వస్తువులకొక చైతన్యముంటుందని, వాటిలో స్వీయ ఆవిష్కరణ శక్తి దాగి ఉంటుందని, వాటిని నాశనం చేయటానికి జరిగే ప్రయత్నాలన్నీ వాటిని ఉపయోగించమని ఒత్తిడి చేస్తున్నాయి. మనుషులు వాటిని వినియోగించుకోకపోయినా వారి కన్నా బలీయమైన శక్తి అలా చేయటానికి వారిని ప్రేరేపిస్తుంది.

ఈ పొంచి ఉన్న మహా విపత్తును చూసిన తరువాత అక్కడొక పిలుపు లేదా ఆకాంక్ష, ఆ పొరపాటును తటస్థీకరించగల దానిని క్రిందకు తీసుకురాగలగాలి. అప్పుడు వచ్చింది... ఒక సమాధానం... నేనది నా చెవులతో విన్నానని చెప్పలేను. కానీ అది ఎంత స్పష్టంగా, దృఢంగా, ఖచ్చితంగా ఉందంటే అది నిర్వివాదాంశం. నేను దానిని మాటలలోకి అనువదించవలసి వస్తే యిలా అంటాను. అందుకనే మీరు అరొవిల్లీని సృజించారు.

అరొవిల్లి శక్తికి, సృజనకు కేంద్రమనే స్పష్టమైన దర్శనంతో (నేను ఎలా వివరించాలి?) నేను ఎలా వివరించాలి? సత్యం యొక్క బీజం అంకురించి, ప్రవర్ధమానం కాగలిగితే అది ఎదిగే ప్రక్రియే, మారణాయుధాల వినాశకర పరిణామాలకు అవరోధక (స్పందన) చర్య అవుతుంది.

నాకది చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఎందుకంటే అరొవిల్లి జననం ముందస్తుగా ఒక ఆలోచన నుండి ఉద్భవించలేదా? ఎప్పటిలానే చాలా సరళంగా అది ఒక శక్తి కార్యం, ఒక పరమమైన ఆవిష్కరణ. 'అది ఎంత బలీయమైనదంటే (అరొవిల్లి భావన శ్రీమాతకు కలిగినప్పుడే) నేను అందరికీ చెప్పగలిగాను, మీరు దానిని విశ్వసించకపోయినా, పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా అరొవిల్లీ తప్పక ఆవిర్భవిస్తుంది. అందుకు వంద సంవత్సరాలా? లేక వెయ్యి సంవత్సరాలా? నేను చెప్పలేకపోయినా, అరొవిల్లి వచ్చి తీరుతుంది. ఎందుకంటే అది తీర్మానించబడింది. ఒక ఆదేశానికి విధేయమై, ఏవిధమైన ఆలోచన లేకుండా, అలా చాలా సరళంగా తీర్మానించబడింది. నాకు ఎప్పుడైతే చెప్పబడిందో (నేను చెప్పబడింది అంటున్నాను కానీ, దాని అర్థం మీకు తెలుసు) "ఆరొవిల్లి"ని నువ్వెందుకు నిర్మించావో చెప్తాను. నీకు తెలియదు కానీ దాని కారణం" పొంచి ఉన్న వినాశనాన్ని ఎదుర్కోగల చివరి ఆశ అదే. అన్ని దేశాలలోనూ కొంతశక్తిని దీని సృష్టికి మేల్కొల్పగలిగితే, వారు చేసిన తప్పిదాలకు వ్యతిరేకంగా కొంచెం కొంచెంగా ప్రతిస్పందించగల శక్తి దానికి ఉంటుంది.

## అగోచర కార్యం

సహజంగా, దానిని నాకు చూపించగానే అవగతమయింది. ఆరొవిల్లి సృజన అదృశ్యస్థాయిలో ఒక ధ్యేయాన్ని కలిగి ఉందని, అది ఏ కార్యమనే విషయం నాకర్థమయింది. అది భౌతికమయిన, బాహ్యమయిన చర్య కాదు. అది కనిపించని లోకాలలో జరిగే కార్యం. అప్పటి నుండి దేశాలన్నీ దానిని అర్థం చేసుకోవాలని నేను ప్రయత్నిస్తున్నాను. అది బాహ్యంగా కాదు. ఎందుకంటే వాళ్లంతా ఏమైనా బోధించాలంటే తాము చాలా తెలివైన వాళ్ళమని భావిస్తుంటారు. అందుకనే ఆంతరంగికంగా అగోచరమయిన స్థాయిలో దానిని బోధించాలని భావిస్తున్నాను.

ఇది యిటీవల రెండు, మూడు రోజుల క్రితం జరిగింది. ఇంతకు మునుపు యిది నాకెవరూ చెప్పలేదు. ఇది చాలా స్పష్టంగా చెప్పబడింది. చెప్పటం అంటే చూడటం జరిగింది. ఈ విధంగా చూపించబడింది (దృష్టికొక దృశ్యాన్ని యిచ్చినట్లుగా శ్రీమాత సంజ్ఞ చేస్తారు) అప్పటి నుండి ఆరొవిల్లి పట్ల నా ఆసక్తి గణనీయంగా పెరిగింది. ఎందుకంటే అది కేవలం ఒక ఆదర్శం యొక్క సృష్టికాక ఒక ఆచరణాత్మకమయిన దృగ్విషయంగా దానిని నేను అర్థం చేసుకున్నాను. ఒక ప్రమాదం నుండి భయం రక్షించగలదనే నమ్మకానికి సంబంధించిన మనస్తత్వ తప్పిదపు ప్రభావాలను భయంకర ప్రమాదాలను అడ్డుకొని ఆశలో, సంకల్పంలో సమతూకాన్ని ఏర్పరచడం కోసం ఇది జరుగుతోంది. భయం మిమ్మల్ని ప్రమాదం నుండి రక్షించలేక పోవటమే కాక దానిని మరింత ఆకర్షిస్తుంది. ఈ దేశాలు, ప్రభుత్వాలు అన్నీ కూడా ఈ విపత్తు పట్ల భయంతో తప్పుపై తప్పు చేస్తున్నాయి.

ఈ దేశాలన్నీ ఒక వేళ ఆరొవిల్లి మహత్కార్యంలో సహకరిస్తే, ఎంత నిరాడంబరంగా అయినా (ఇటీవల ఫ్రెంచి ప్రభుత్వం ద్రవ్యరూపంలో చేసిన నివేదన) అది వారికి హితమవుతుంది. ఎంతో హితవు చేస్తుంది, వారి కనిపించే చర్యల కంటే ఎన్నో రెట్లు శ్రేయస్సును కలుగచేస్తుంది.

*

## దేశాల సహకారం

మీరు పొంచి ఉన్న విపత్తు గురించి చెప్తున్నారు. మరి ఆరొవిల్లి రూపుదిద్దుకోవటానికి కొంత సమయం పడుతుంది కదా?

లేదు, నేను ఒక విషయాన్ని సృజించటంలో దేశాల సహకారం గురించి మాట్లాడుతున్నాను. అది ఆరొవిల్లి పూర్తి అయినపుడు కాదు. నేను దేశ దేశాలు దేనినో సృజించటంలో సహకరించడం గురించి - కాని ఆ సత్యాన్ని సృజించటంలో వైరం కాక సత్యంపై ఆధారితమైన దానిని సృజించడం గురించి. ఆరొవిల్లి సంసిద్ధమయినపుడది అన్ని నగరాలలో ఒక నగరంగా ఉంటుంది. కేవలం దాని సత్య సమర్థత మాత్రమే శక్తిని కలిగి ఉంటుంది. కానీ అది వేచిచూడవలసి ఉంది.

కాదు, విషయమేమిటంటే సత్యాధారితమైన దానిని నిర్మించడంలో ఉమ్మడి ఆసక్తిని కలిగి ఉండటం. వారికొక (పరస్పర యిష్టం లేకుండానే

విలీనం కావటం) అసత్యపు పునాదులున్న ఒక వినాశకర శక్తిని సృజించటంలో ఉమ్మడి ఆసక్తిని కలిగి ఉండటం. అరొవిల్లి అంటే ఆ శక్తిని కొంత దారి మళ్ళించటం (పరిమాణం స్వల్పమైనా ఉత్తమమైన నాణ్యతను కలిగి ఉంటుంది.) అది నిజంగా ఒక నమ్మకం. అది ఒక విశ్వాసంపై పునాది కలిగి ఉంది సామరస్యతా ఆరంభం అయిన దానిని చేయటంపై ఆధారితమై ఉంది.

కాదు, యిప్పుడే, యిప్పుడే ప్రచారశక్తి మరింత మహత్తరమై ఉంది. అది ప్రసార కేంద్రానికి అందనంత (శ్రీమాత) నిష్పత్తిలో ఉంది. అది విశ్వ కొలమానంలో అజ్ఞాతమూ, మరియు ఉనికిలో లేనిది. కానీ కేంద్రం నుండి కాంతి తరంగాల శక్తి మరియు ప్రసరణ పరిమాణానికి అతీతంగా ఉంది. అది చాలా పరిగణనలోకి తీసుకోవలసిన విషయం. (ఆరొవిల్లికి కలిగిన ప్రతిస్పందన అంతటా విస్తరించింది. సర్వత్రా వ్యాపించింది, అధునాతన ఆఫ్రికా స్పందన, ఫ్రాన్సు స్పందన, రష్యా దేశపు ప్రతిస్పందన, అమెరికా దేశాలు మరియు కెనడా స్పందన, అసంఖ్యాకమయిన దేశాల ప్రతిస్పందన ఇటలీలో ప్రతి చోటా, ప్రతిచోటా... కేవలం వ్యక్తులే కాక సమూహాలు, విభిన్న ధోరణులు ఉద్యమాలు, ప్రభుత్వాలలో కూడా చోటు చేసుకొన్నాయి.

అసలు రాజీ పడని ఐక్యరాజ్య సమితి కూడా (దాని వ్యతిరేకత అద్భుతం). వీళ్ళంతా పాతకాలపు వాళ్ళు. భౌతిక వాదులు మరియు మత విరుద్ధ ఉద్యమాలకు యింకా అతీతులు కాదు. వీళ్ళు ఆరొవిల్లి కరపత్రంపై చాలా అవమానకరమైన విమర్శ చేసారు! అది చాలా మతధోరణిలో మార్మికంగా ఉందని, ఈ అపహాస్యం చాలా రమణీయం!

మరొక పక్క, ఎంతో బాహ్యంగా భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం స్పష్టంగా (నేను ఎలా చెప్పను?) నాకు ఆంగ్లంలోనే పదాలు వస్తున్నాయి.

రెడ్ చైనా ఉద్యమాన్ని ప్రతి ఘటించే శక్తి గల ఒక మహత్తరమైన 'ఆసియా సమాఖ్య'ను సృజించాలని సంకల్పించే సత్యశక్తుల ప్రేరణలో, వాటిచే గమింపచేయబడి ఆరంభింపబడి, నడిపించబడ్డాయి. నిజానికి ఈ సమాఖ్య, పాకిస్తాన్ మరియు సంబంధిత ప్రాంతాలన్నీ - నేపాల్, టిబెట్, బర్మా మరియు దక్షిణంలో శ్రీలంకను కలిసి వెనుతిరిగి రావలసి ఉంది. ఒక మహత్తరమైన సమాఖ్య- ప్రతిదేశం తన స్వయంపాలిత అభివృద్ధిని కలిగి పరిపూర్ణంగా

స్వతంత్ర్యమై ఉంటూనే శాంతి కోసం వినాశకర శక్తులపై పోరాడటానికి ఒక సార్వజనీనమయిన ఆకాంక్షలో విలీనమై ఉంది. అది చాలా సుస్పష్టం. సంకల్పించబడింది కానీ ఐక్యరాజ్య సమితి అన్నింటిని అడ్డుకుంది.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణలు సెప్టెంబరు 21, 1966*

## తలక్రిందులుగా బాబిల్ శిఖరం

నేను అన్ని విధాలయిన తమాషా విషయాలు జరగటం చూసాను. ఇప్పుడే కలిగిన ఆలోచన. “ఇది తలక్రిందులయిన బాబిల్ శిఖరం (శ్రీమాత నవ్వుతారు) అది చాలా ఆసక్తికరం. నిర్మాణంలో వాళ్ళంతా సమకూడి తర్వాత విడిపోయారు. అందుకని మళ్ళీ యిప్పుడు నిర్మించటంలో ఏకం కావటానికి సమకూడారు. అదే యిది. తలక్రిందులయిన బాబిల్ శిఖరం. నాకిపుడర్థమయింది. ఇటీవల భారతదేశంలో ప్రచురించబడిన ఒక పుస్తకం చూశాక నాకీ అనుభవమంతా కలిగింది. దాని శీర్షిక ‘రోల్ ఆఫ్ హానర్’. అందులో భారత దేశపు స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్‌కు వ్యతిరేకంగా పోరాడి మరణించిన అందరి సంగ్రహమయిన జీవితచరిత్ర మరియు ఒక ఛాయా చిత్రం ఉన్నాయి. ఎక్కడ చూసినా చాలా మొత్తంలో ఛాయచిత్రాలున్నాయి (కొన్ని కేవలం వారు చంపబడి నేల కొరిగినపుడు పోలీసులు తీసిన ఫోటోలు) అదంతా ఒక విధమైన వాతావరణాన్ని తీసుకు వచ్చింది, విషాదకరమైన విధికి గురియైన స్వార్ధరహిత సహృదయులైన వ్యక్తుల వాతావరణాన్ని, అది సరిగ్గా జర్మనీయులు యుద్ధ సమయంలో గురియైన భీభత్సం వంటి ముద్రనే నాపై కలుగ చేసింది. ఈ విషయాలు స్పష్టంగా కొన్ని అసుర శక్తుల సూటి ప్రభావంతో ఉన్నాయి. మనకు తెలుసు! ఈ అసుర శక్తులు భయభ్రాంతులను కల్గిస్తూ పని చేయటానికి అనుమతించబడతాయి. అవి చైతన్య జాగరణను త్వరితం చేయటానికి మాత్రమే. ఫ్రాన్సులో జర్మనీయుల దురాగతాల ఛాయా చిత్రాలు చూసినపుడు కలిగిన అనుభవాలు చాలా బలీయంగా ఉన్నాయి. అది నన్ను మానవ భౌగోళిక, ఆధునిక పొరపాట్లతో అనుసంధానించాయి, అది ఆధునికం: ఆఖరి వెయ్యి సంవత్సరాలుగా ప్రారంభమయి, ఈ చిట్ట చివరి వంద సంవత్సరాలలో మరింత తీవ్రతరమయింది, అందుకు సమతూగాలనే ఆకాంక్షతో, దానినెలా సాధించాలి? ఏం చెయ్యాలి? అందుకు వచ్చిన సమాధానం ‘అందుకోసమే ఆరొవిల్లిని సృజించారు’ అని.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణలు, సెప్టెంబరు 21,1966.*

అన్ని దేశాలకు చెందిన స్త్రీ పురుషులంతా ప్రశాంతంగా, ప్రవర్ధమానమయ్యే సామరస్యంతో మతాలకు, రాజకీయాలకు, జాతీయతకు అతీతంగా నివసించగల విశ్వజనీన నగరంగా ఉండాలని ఆరోవిల్లి ఆశిస్తుంది.

మానవ ఐక్యతను సిద్ధింపచేయటం ఆరోవిల్లి ధ్యేయం.

*CWM 13: 188*

అక్కడ ధనమిక ఏక ఛత్రాధిపతి కాదు. వ్యక్తి విలువకు భౌతిక సంపద కన్నా మహోన్నతమైన ప్రాధాన్యత, సాంఘిక విలువ ఉంటుంది. అక్కడ పని ఒక వ్యక్తి జీవనోపాధి కాదు. ఒక వైపు సంఘానికి సేవలందిస్తూనే వ్యక్తి తనను వ్యక్తపరుచుకొనే మార్గం, మరియు తన సామర్థ్యాలను, సాధ్యతలను మెరుగు పరుచుకొనే మార్గం, అది ప్రతి వ్యక్తికీ జీవనోపాధిని, ఒక కార్య పరిధిని యిస్తుంది

*CAM 12 : 93: 94*

నిజమైన స్వాతంత్ర్యం అనేది పరమాత్మతో ఐక్యత ద్వారా లభిస్తుంది. అహంకారాన్ని జయించడం ద్వారా మాత్రమే ఒకరు దైవంతో ఐక్యం కాగలరు.

*CWM 13:215* — *శ్రీమాత*

*

నిజమైన ఆధ్యాత్మికత దైవకార్యానికి చెందిన సేవలోనే ఉన్నది. పనిని చేయడాన్ని నిరాకరించడమన్నది నీలోని స్వార్థాన్ని ప్రదర్శించుకోడమే అవుతుంది. దానికి ఆధ్యాత్మిక పరమైన ఏ విలువా లేదు.

ఆరోవిల్లిలో ఉండగల్గడానికి చేయవలసిందల్లా తనలోని అహంకారం నుండి స్వేచ్ఛ పొందడానికి తనను సమ్మతించుకోవడమే మొదటి చేష్ట.

*CWM 13:210*

# ఆరొవిల్లీ కొరకు ఇచ్చిన సందేశములు

## ఆరొవిల్లీ వాసులకు

ఆరొవిల్లీలో అక్కడ పరిపాలించేదిగా నిర్వచించబడిన సామరస్యపూరిత వాతావరణాన్ని స్థిరపరచటానికి మొదటి అడుగు, ప్రతి ఒక్కరు సంఘర్షణ, దురభిప్రాయాలకు గల కారణం కోసం తమ అంతరంలోకి చూసుకోవాలి.

ఎందుకంటే ఈ కారణాలు ఎప్పటికీ రెండు వైపుల నుంచి వుంటాయి, ఇతరుల నుండి ఏదైనా కోరడానికి ముందు ప్రతి ఒక్కరు వాటిని తననుండి తీసివేయడానికి ప్రయత్నించాలి.

*

ప్రతి ఆరొవిల్లీ వాసి సమస్త కోరికలు, ఎంపికలు, వికర్షణల నుండి తనను తాను విడుదల చెందించుకోవడానికి కృషి చేయాలి.

ఆరొవిల్లీలో జీవించడాన్ని సాధించాలంటే అన్ని పరిస్థితుల దృష్ట్యా సమత్వం ముఖ్య లక్ష్యం కావాలి.

*

కలహాలు మొత్తంగా ఆరొవిల్లీ ఆత్మకు విరుద్ధం.

*

ఆరొవిల్లీ వాసులందరికీ

ఆరొవిల్లి వాసి కావాలనుకునేవారు కనీసం మానవజాతి ప్రకాశితజ్ఞాన భాగానికి చెందివుండాలి, రేపటిజాతిని పాలించే ఉన్నతచేతన కొరకు ఆకాంక్షించాలి.

ఎప్పటికీ ఉన్నతంగా, ఎప్పటికీ ఉత్తమంగా- అహంకార పరిమితులకు అతీతంగా వుండాలి.

*

ఎవరైనా సౌకర్యంగా వుండటానికి ఆరొవిల్లీలో జీవించకూడదు, చైతన్యంలో వృద్ధిచెందడానికి, దైవానికి సేవ చేయటానికి వుండాలి.

*

నీ వ్యక్తిగత అవసరాలను తృప్తిపరచడానికి ఆరొవిల్లీకి వచ్చావా ?

నిజానికి దానికోసమైతే అవసరం లేదు. దాని కోసం సాధారణ ప్రపంచం వుంది.

భూమిమీద ప్రకటితమవ్వాలనుకునే ఒక దివ్యజీవనాన్ని వాస్తవం చేసుకోవడానికే ఎవరైనా ఆరొవిల్లీకి వస్తారు.

ప్రతి ఒక్కరు ఈ దిశలోనే ఒక ప్రయత్నం చేయాలి తప్ప అవసరాలని పిలువబడే వ్యక్తిగత మోజుల చేత సమ్మోహితమయ్యి కాకూడదు.

ఊర్ధ్వం లోకి, ముందుకు చూడు, మానవజంతు స్వభావాన్ని అధిగమించడానికి కృషి చేయి. ప్రతిజ్ఞ తీసుకో, అప్పుడు మార్గంలో సహాయం అందడాన్ని చూస్తావు.

*

ఆరొవిల్లీ కోసం పని చేయడమంటే ఇంకా ఎక్కువ సామరస్యపూరిత భవిష్యత్తు ఆగమనాన్ని వేగిరం చేయడమే.

*

మనం సరైన దృక్పథంతో వుంటే మనం నిర్వర్తించే అతి చిన్న చర్యలో కూడ దైవానికి సేవ చేయగలం.

*

దైవానికి ఒక అర్పణలాగా చేసే పనితో చైతన్యం అత్యుత్తమంగా పెరుగుతుంది.

సోమరితనము, నిర్వ్యాపారముల ఫలితంగా వచ్చే తమస్సు పురోగతికి, కాంతికి పూర్తి విరుద్ధమైన అచేతనలోకి పడేస్తుంది.

మన అహాన్ని అధిగమించి, కేవలం దైవ సేవలోనే జీవించడం నిజచైతన్యాన్ని పొందడానికి ఆదర్శము, దగ్గరదారి.

*CWM 13:210-12*

నీ చైతన్యాన్ని పృథ్వి పరిమాణాలకు విస్తరింపజేయి, ప్రతిదానికి నీలో స్థానముంటుంది.

*

ఆరొవిల్లివాసుల ఆదర్శం అహంరహితం కావడం- అహాన్ని తృప్తిపరచడం ఎంతమాత్రము కాదు.

*

ఒకవేళ స్వార్థపూరిత ఆరోపణల పాత మానవవిధానాన్ని వారు అనుసరిస్తే, ప్రపంచం మారాలని ఎలా ఆశిస్తారు ?

*

తమ స్వంత అభిప్రాయాన్ని బలపరుచుకోవటానికి ప్రతి ఒక్కరికి అనుకూల కారణాలు వుంటాయి, వారి మధ్యన తీర్పునివ్వడానికి నేను నిష్ణాతురాలను కాదు.

కానీ ఆధ్యాత్మిక దృక్పథంలో మనఃపూర్వకంగా చూస్తే అన్ని అభిప్రాయాలు ఇంకా విశాలమైన యధార్థ పరిష్కారంలో సామరస్యం కాగలవు. ఆరొవిల్లీ కార్యకర్తల నుండి నేను ఆశించేది ఇదే. వీరు కొంతమంది ఇతరులకు మార్గం చూపిస్తారని కాదు, మొత్తానికి అందరు ఇంకా ఎక్కువ విశాలమైన, పరిపూర్ణ ఫలితం కోసం వారి ప్రయత్నాలను కలపాలి.

ఆరొవిల్లీ ఆదర్శం ఈ పురోగతిని కోరుతుంది- తయారుచేయాలని నువ్వు కోరటంలేదా ?

*CWM 13:213-14* ఆశీర్వచనాలు

మాతృమందిరం దైవం కొరకు ఆరొవిల్లీ ఆకాంక్షకు సజీవసంకేతం కావాలి.

*శ్రీమాత శిష్యునితో సంభాషణ, ఫిబ్రవరి 21, 1971*

సహస్రాబ్దాల నుండి బాహ్య మార్గాలను బాహ్యసాధనాలను, జీవితానికి బాహ్య సాంకేతికప్రక్రియలను,అభివృద్ధి చేస్తున్నాం- తుదకు ఆ సాధనాలు, సాంకేతిక ప్రక్రియలు మనల్ను అణగగొడుతున్నాయి. నూతన మానవజాతికి చిహ్నం, దాని దృక్పథంలో వ్యతిరిక్తత, ఆంతరిక జ్ఞానం, ఆంతరిక సాంకేతిక నైపుణ్యత, ప్రపంచాన్ని అణిచివేయకుండా, దానిని మార్చి దానిపైపెత్తనం చేయగలదు అనే అవగాహనతో ఉండటం.

"ఈ నూతన జీవనవిధానం ఆచరణలో పెట్టే స్థలం ఆరొవిల్లీ, ఇది పరిణామాన్ని తీవ్రపరచే ఒక కేంద్రం, ఇక్కడ మనిషి ఆంతరిక ఆత్మ శక్తితో తన ప్రపంచాన్ని మార్చుకోవడం ప్రారంభించాలి.

*శ్రీమాత శిష్యునితో సంభాషణ ఆగస్టు 3, 1698*

శ్రీఅరవిందుల దర్శనానికి ఒక యథార్థరూపాన్ని ఇచ్చే కార్యము మదర్ కు అప్పగించబడింది. ఒక నూతన ప్రపంచ సృష్టి, ఒక నూతన మానవజాతి, ఒక నూతన సంఘం, నూతన చైతన్యాన్ని ప్రకటించడం, రూపొందించడం,అన్న కార్యానికి ఆమె పూనుకున్నారు. విషయాల స్వభావంలో ఇది ఒక సమగ్ర మానవజాతి పరిపూర్ణతను వాస్తవం చేసుకోవడానికి ఒక సామూహిక కృషిని కోరే ఒక సామూహిక ఆదర్శం.

మదర్ చేత స్థాపించబడిన, నిర్మించబడిన ఆశ్రమం ఈ లక్ష్యసాఫల్యత వైపుగా వేసే మొదటిఅడుగు. ఆరొవిల్లి యోజన తరువాతి అడుగు, ఇంకా ఎక్కువ బయటకు కనిపించేది, మానవజాతి సామూహిక జీవితంలో అంతరాత్మకు, దేహానికి, ఆత్మకు ప్రకృతికి, స్వర్గానికి, భూమికి మధ్యన సామరస్యతను స్థాపించడానికి ఈ ప్రయత్నపు ఆధారాన్ని విస్తారం చేసే అన్వేషణ.

*

మన కోరికలన్నింటినీ త్యజించి, దైవం వైపు మళ్ళి, దైవం గురించిన చైతన్యంతో వుండటానికే మనం ఇక్కడ వున్నాము. మనం అన్వేషించే దైవం ఎక్కడో దూరంలో, దుర్గమంగా లేడు. ఆయన తన స్వంత సృష్టిమూలం వద్ద వున్నాడు , అయన్ను మనం కనుక్కోవాలని కోరుకుంటున్నాడు, మన వ్యక్తిగత రూపాంతరీకరణతో ఆయన్ను తెలుసుకోగలగాలని, ఆయనతో సంయోగం చెందాలని, అంతిమంగా చైతన్యంగా ఆయన్ను అభివ్యక్తం చేయాలని కోరుతున్నాడు. దీనికి మనల్ను మనం అర్పించుకోవాలి, ఇదే అస్తిత్వానికి గల మన నిజమైన కారణం. ఉత్కృష్టమైన ఈ సాక్షాత్కారం వైపుగా మనం వేసే అడుగు అతిమానస చేతన అభివ్యక్తీకరణ.

మన స్వంత జీవితాలలో దైవాన్ని వాస్తవం చేసుకోవడం, అభివ్యక్తీకరించడం మార్గం, జంతువులుగా మారి కుక్కల్లా, పిల్లుల్లా బతకడం కాదు.

సరిగ్గా విరుద్ధం ! ఆరొవిల్లీలోని ఎక్కువ భాగం జనాభా ఒక అతిమానవ జాతికి బదులు ఒక క్రింది మానవజాతిగా వుంది. ఇదంతా ఒక అంతానికి చేరే సమయం వచ్చింది.

ఊరికే అలా వచ్చిన వాళ్ళు వున్నారు, “ఇది పని చేయదు” అని వారితో నేను చెప్పినపుడు, “మేము దాని కోసం ఇక్కడకు రాలేదు” అని సమాధానమిచ్చారు.

విషయాలు అలా వుండవని, వాళ్ళు పొరపాటు పడ్డారని వారి వద్దకు వెళ్ళి వారి ముఖాల మీదే చెప్పాలనుకున్నాను. కానీ దానిని వ్రాయడానికి ఇప్పుడు సమయమొచ్చిందని అనుకుంటున్నాను.

ఎంత విలక్షణమైనది ఇది, ఒక విలక్షణమైన మానవజాతి.

*CWM 13:347-48* *శ్రీమాత*

మానవజాతి ప్రస్తుత స్థితికి సంకేతాత్మక ప్రతినిధి భారతదేశ స్థితి అన్నదాని గురించి శ్రీఅరవిందులు నాకు ఏం విశదం చేశారో మీకు చెప్పాను. అందుకే ఆరొవిల్లీ సృష్టించబడిందని శ్రీఅరవిందులు నాతో చెప్పారు.

*శ్రీమాత శిష్యునితో సంభాషణ ఫిబ్రవరి* ***28, 1968***

*

## భూమికి అవసరం

అన్ని జాతీయ శత్రుత్వాలకు, సామాజిక సంప్రదాయాలకు, స్వీయ-విరుద్ధ నైతికతలకు, పోటీపడే మతాలకు దూరంగా మనుషులు నివసించగలిగే స్థానం.

గతానికి సంబంధించిన బానిసత్వం నుండి విముక్తి పొందిన మానవులు, అభివ్యక్తి కావడానికి ప్రయత్నిస్తున్న దివ్య చేతనను కనుగొనుటకు, దాని అభ్యాసానికి తమను తాము పూర్తిగా అంకితం చేసుకోగల ప్రదేశం.

ఆరోవిల్ ఇటువంటి ప్రదేశంగా ఉండాలని కోరుకుంటుంది, భవిష్యత్ సత్యంలో జీవించాలని కోరుకునే వారందరికీ తనను తాను అర్పించు కుంటుంది.

*CWM 13: 201-02*

ఆరోవిల్‌లో నివసిస్తున్న చాలా మంది వ్యవస్థీకృత పని విధానం అచట అభిలషణీయం కాదని చెప్పారు. వారు ముందుగా ప్రణాళిక లేని పని విధానం కోసమే ఉన్నారు.

ముందుగా ప్రణాళిక లేని అప్రయత్న సిద్ధమైన పనిని ప్రతిభావంతుడు మాత్రమే చేయగలడు.

ప్రతిభావంతుడనని చెప్పుకునే వారు ఎవరైనా ఉన్నారా?...

*ఆశీస్సులు*

*

ఆధో ప్రకృతికి సంబంధించిన అన్ని ప్రేరణలను అనుసరించడం ఖచ్చితంగా అతి మానసానికి సంబంధించిన మార్గం కాదు, అధో ప్రకృతి ప్రేరణలకు ఇక్కడ ఎటువంటి చోటు లేదు.

కోరికలు, అధో ప్రేరణలతో నిండిన మానవత్వ వికార స్థితికి దిగజారకుండా, అతి మానస ఆగమనాన్ని వేగవంతం చేయడమే మనకు కావలసినది.

*

ఆరోవిల్ ప్రజలు ఆరోవిల్‌లో సంతోషంగా ఉండటానికి ఆశ్రయం కల్పించాలని ఆరోవిల్ కోరుకుంటుంది. అసంతృప్తితో ఉన్నవారు, తమకు కావలసినది చేయడానికి తమకంటూ ప్రతి ఒక్కరికీ చోటు ఉన్న ప్రపంచానికి తిరిగి వెళ్ళాలి. ఆరోవిల్ నిజ భావన, సహకారం, అది మరింత ఎక్కువగా ఉండాలి. నిజమైన సహకారం దైవత్వానికి మార్గం వేస్తుంది.

*CWM 13: 215-16*

ఆరోవిల్ ఒక ప్రగతిశీల ఉన్నత మానవత్వం కోసం సృష్టించబడింది. ప్రవృత్తులు, కోరికలు ఆధిపత్యం వహించే నిమ్న-మానవత్వం కోసం కాదు. నిమ్న- మానవత్వానికి, జంతు మానవత్వానికి చెందిన వారికి ఇక్కడ స్థానం లేదు.

ఆరోవిల్ ఉన్నది అతిమానస అభివ్యక్తిని ఆకాంక్షించే వారి కోసం, అతి మానసికతను చేరుకోవడానికి ప్రయత్నం చేసే వారి కోసం.

*CWM 13: 217*

ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెంది మరింత నిజాయితీతో ఉండాలి.

ఆరోవిల్ అహంకారాల సంతృప్తి కోసం, దురాశల సంతృప్తి కోసం కాదు, అతి మానస దివ్య పరిపూర్ణతను వ్యక్తపరిచే ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించడం కోసం సృష్టించబడింది.

*

ఆరోవిల్ ఉన్నత మానవత్వం కోసం సృష్టించబడింది, అహంకారాన్ని అధిగమించి, అన్ని కోరికలను త్యజించాలనుకునే వారి కోసం, అతి మనస్సును స్వీకరించడానికి తమను తాము సిద్ధం చేసుకోవడానికి ఆరోవిల్ సృష్టించ బడింది. ఆ విధంగా నడుచుకునే వారే నిజమైన ఆరొవిల్లీ వాసులు.

తమ అహంకారానికి లోబడి తమ కోరికలన్నింటినీ తీర్చుకోవాలనుకునే వారు నిమ్న మానవత్వానికి చెందినవారు, వారికి ఇక్కడ స్థానం లేదు. అటువంటి వారు తమకు తగిన ప్రదేశం అయిన ప్రపంచానికి తిరిగి వెళ్లాలి.

*CWM 13:218*

ఆరోవిల్ కోసం మీకు ఎటువంటి రాజకీయ వ్యవస్థ కావాలి?

నాకు ఒక వినోదభరిత నిర్వచనం స్ఫురిస్తోంది: ఒక దివ్య అరాచకత్వం. కానీ దానిని ప్రపంచం అర్థం చేసుకోలేదు. మనుషులు తమ చైత్య పురుషుని గురించి ఎరుక కలిగి ఉండి, ఒక స్థిరమైన నియమాలు, చట్టాలు లేకుండా అంటే ముందుగా ఎటువంటి ప్రణాళికా లేని వ్యవస్థగా అప్రయత్న సిద్ధంగా తమను తాము సంభాళించుకోవాలి - అదే ఆదర్శం.

దీని కోసం, ప్రతి ఒక్కరు చైత్య పురుషునితో సంబంధం కలిగి ఉండాలి. చైత్య పురుషుని ద్వారా మార్గనిర్దేశం తీసుకోవాలి. అహంకార ఆధిపత్యం, ప్రభావం అదృశ్యం కావాలి.

*

వారికి కోరికలు ఉన్నంత వరకు, వారు నిజమైన ఆరొవిల్లీ వాసులుగా ఉండలేరు. వారిని మాటలకు సంబంధించి పై పై అర్థాలను తీసుకోనివ్వద్దు. కోరికలకు ఆకాంక్షకు మధ్య నక్కకు నాగలోకానికి మధ్య ఉన్నంత తేడా ఉంది. నిజాయితీగల ప్రతి ఒక్కరికి ఇది తెలుసు. అన్నింటికంటే మించి మనుషులు తమ అహాన్ని, కోరికలను భగవత్ సంబంధిత ఆకాంక్షగా భావించకూడదు. ఆ విధంగా తమను తాము మోసం చేసుకోవడం వల్లనే ఈ గందరగోళం ఏర్పడింది.

దాని కోసం, మనుషులు తమలోని భగవంతుని ఉనికికి సంబంధించి ఎరుక కలిగి ఉండాలి. అహంకారాన్ని పూర్తిగా నిశ్శబ్దమవ్వాలి, కోరికలు లుప్తమవ్వాలి.

*CWM 13:219-20*

ఆరోవిల్ మనకు కర్మయోగాన్ని బోధించి శ్రీఅరవిందుల ఆదర్శాన్ని గ్రహించి దానిని ఆచరించడానికి సృష్టించబడింది. ఆరోవిల్ కర్మయోగం చేయాలనుకునే వారి కోసం సృష్టించబడింది.

ఆరోవిల్‌లో నివసించడం అంటే కర్మయోగం చేయడం. కాబట్టి ఆరొవిల్లీ వాసులు అందరూ తప్పనిసరిగా ఒక పనిని చేపట్టి దానిని యోగంగా చేయాలి.

(ఆరోవిల్ అభివృద్ధికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్న ఫలానా వ్యక్తులు, సమూహాల గురించి) వారు సాధన చేయకపోవచ్చు. కానీ వారికి యోగం గురించి తెలియకపోతే, వారు ఆరోవిల్ ఉద్దేశ్యాన్ని ఎలా అర్థం చేసుకోగలరు?

*CWM 13: 222.247*

ఐక్యరాజ్య సమితి (యునెస్కో) కోసం సందేశం

ఆరోవిల్ భూమిపై ఉన్న అతి మానస సత్య ఆగమనాన్ని వేగవంతం చేయడానికి ఉద్దేశించబడింది. ప్రపంచం ఉండాల్సిన విధంగా లేదని కనుగొన్న వారందరికీ సహాయం చేయడానికి స్వాగతం పలుకుతోంది.

మనుషులు మరణించడానికి సిద్ధంగా ఉన్న పాత ప్రపంచంతో సంబంధాన్ని కలిగి ఉంటారా, లేదా పుట్టడానికి సిద్ధమవుతున్న కొత్త, మెరుగైన ప్రపంచం కోసం పని చేయాలనుకుంటున్నారా అన్న విషయంలో ప్రతి ఒక్కరూ నిర్ణయం స్వయంగా. తీసుకోవాలి.

*CWM 13: 215* — మదర్



# ఆరొవిల్లి అంతరాత్మ

## మాతృ మందిరం

మాతృమందిరాన్ని నిర్మించాలనుకొంటున్నాం, అదొక భావన. మేం మాతృమందిరాన్ని నిర్మించనారంభించినప్పుడు, అచట పనిచేయాలని అనుకొనే ప్రతి ఒక్కరూ అలా చేయవచ్చు. అది నిజంగానే కేంద్రీయ భావనపై పనిచేయడమే అవుతుంది.

అది త్వరగా జరగాలి. ఈ సరికే అది జరిగి ఉండవలసింది. అలా అయ్యుంటే ప్రతి వానికీ పని ఉండేది. చాలాకాలం నుండి మాతృమందిరాన్ని నిర్మించాలనుకొంటున్నాం. వాస్తవానికి వేరేచోట పనిచేస్తున్న వాళ్ళు తప్ప మిగిలిన ప్రతి ఒక్కరూ వచ్చి పనిచేయవచ్చు. ప్రతి ఒక్కరికీ అక్కడ పని ఉంటుంది. అది ఉత్తమం... అది పట్టణానికి కేంద్రం.

నీవతనికిలా చెప్పవచ్చు. సూత్రప్రాయంగా ఆ భావం మంచిది. కాని దానిని కార్యరూపంలో పెట్టేందుకు, చాలాకాలం నుండి, సంవత్సరం పైనుండే, ప్రతి ఒక్కరూ పనిచేసేటందుకు వీలుగా మాతృమందిరాన్ని ప్రారంభించాలను కొన్నాం. ఒక వ్యక్తి 'లేదు, నేనలా చేయాలనుకోవడం లేదు' అనవచ్చు. అతని కారణాలతనికుంటాయి.

అదొక దివ్య క్రియాశక్తి లాంటిది, ఆరొవిల్లి కేంద్రీయ దివ్యక్రియా శక్తి, ఆరొవిల్లికి సంబంధించి కలసికట్టుగా ఉంచే దివ్యక్రియాశక్తి. అచట ఉద్యానవనాలుంటాయి. అచట ప్రతిదీ, సమస్త సంభావ్యతలు, అంటే ఇంజనీర్లు, వాస్తు శిల్పులు, అన్నిరకాలైన శారీరక శ్రమకు సంబంధించిన పని ఉంటుంది. వాతావరణంలో విహరిస్తున్న భావాన్ని అతడు అందిపుచ్చుకొన్నాడని నా మాటగా అతనికి చెప్పు. కాని దివ్య కార్యరూపం యథార్థంగా ఒక ప్రతీక రూపం అవ్వాలని మేం భావిస్తున్నాం. మాతృమందిర నిర్మాణాన్నారంభించి నప్పుడు, దాని మీద పనిచేయడానికి ప్రతి ఒక్కరినీ నియమిస్తాం. ప్రతిరోజూ అనే కాదు, ఎల్లప్పుడూ, కాని పద్ధతిగా జరుగుతుంది.

*CWM 13:341*

## పాత, క్రొత్త పద్ధతి

ఆరొవిల్లిలో నివసించే పాత వారూ, క్రొత్తవారు కూడా చేతనను దిగజార్చే అంటే పొగత్రాగడం, మద్యం సేవించడం, మత్తుమందులు తీసుకోవడం లాంటి పాత అలవాట్లను అనుసరిస్తామని పట్టుబట్టే వాళ్ళు, తమ అస్తిత్వాన్ని ముక్కలు ముక్కలుగా ఖండిస్తున్నట్లన్నమాట. ఆశ్రమంలో సహజంగా నేను, కుదరదు అని చెప్పాను. మనం చేతనలో యెదగాలి. కోరికలలో, గోతిలో పడగూడదని అంటాం. దానినర్థం చేసుకొన తిరస్కరించే వారికి, ఒక నూతన లోతైన, మరింత సంపూర్ణమైన, మరింత పరిపూర్ణమైన జీవితాన్ని ఆవిష్కరించడం ఈ రోజుకంటే రేపు మరింత ఉత్తమంగా ఉంటుందని ప్రపంచానికి చూపడం, ఆరొవిల్లి లక్ష్యం అని చెప్తాను.

పొగత్రాగడం, మద్యం సేవించడం వగైరాలు రేపటి జీవితంలో భాగం అవుతాయని కొంతమంది నమ్మకం. అది వాళ్ళకు సంబంధించిన వ్యవహారం. ఆ అనుభవం ద్వారా సాగాలనుకొంటే, వాళ్ళనలాగే వదిలేద్దాం. తమ స్వంత కోరికలలో తమను తామే బంధించుకొంటున్నట్లు వాళ్ళు గ్రహిస్తారు. కానీ ఏదేమైనప్పటికీ నేను నీతులు చెప్పే మనిషిని ఏ మాత్రం, ఏ మాత్రం కాదు. అది వాళ్ళ స్వంత వ్యవహారం, స్వంత వ్యవహారం. ఈ అనుభవం ద్వారా వెళ్ళాలని వాళ్ళనుకొంటే, వెళ్ళనిద్దాం. కాని అందుకు ఆశ్రమం తగిన స్థలం కాదు. జీవితం అంటే మరోవిధమైనదని, మనం నేర్చుకొన్నాం, అందుకు భగవంతునికి కృతజ్ఞతలు, కోరికలను తృప్తి పరచడం, యధార్ధ జీవితంగాదు. మత్తు మందులచే లభించే అనుభవాలన్నీ, అదృశ్య లోకంతో కలిగే సంపర్కాన్నంతట్నీ ఇంకా ఉన్నతంగా, యింకా సచేతనగా, నియంత్రించగల పద్ధతిలో, మందులు లేకుండా పొందవచ్చు. అనుభవంతో ధృవీకరించగలను. తనను తాను అదుపులో వుంచుకోవడం మాత్రం చేయాలి. విషం మ్రింగడం కంటే అదెంతో కష్టం. కానీ నేను బోధించబోను.

కోరికలన్నింటినీ జయించి, తనను తాను ఉన్నత క్రియాశక్తులకి తెరచుకొని ఒక ఉన్నత జీవితానికి ఆరొవిల్లి ఉదాహరణగా యిప్పుడు నిలిస్తే అప్పుడు మనం ప్రతిచోటికీ వెళ్ళగలుగుతాం. ఆరొవిల్లీ వాసులు ప్రపంచంలో ఎప్పుడు కదలాడే జ్యోతులవుతారో అప్పుడు వాళ్ళు ఆహ్వానించబడతారు. అదీ విషయం.

*CWM 13:345*

'ఆంతర ఆవిష్కారము, ప్రప్రథమ షరతు...'గా పెడ్దాం. ఆదర్శప్రాయమైన క్రమంలో, ప్రస్తుత ప్రపంచం, మానవ పరిస్థితులకంటే మరేదో అవసరం అనేది ప్రథమ షరతు.

చెప్పకపోయినా జరుగవలసిందదే.

ఆ స్థితికి చేరాలంటే, ఈ వారసత్వ, సాంఘిక, సాంస్కృతిక ఆకారాల వెనుక అసలతడేమిటి అనేదాన్ని యథార్థంగా, అతడేమిటో తెలుసుకోవడానికి అతడు లోతుగా క్రిందికి దిగడం అనేది ప్రథమ షరతు. అప్పుడు ఆ దశలో, విషయాలు అర్థవంతమౌతాయి, కాని అంతకు ముందు నైతికతలో, మతంలో, తత్త్వశాస్త్రంలో వాటికే అర్థం ఉండదు.

కనుక మనమిలా చేద్దాం (మదర్ వ్రాస్తారు) ప్రప్రథమ తప్పనిసరి షరతు.

1. సమస్త సాంఘిక, నైతిక, సాంస్కృతిక, జాతి వారసత్వాల ఆకారాల వెనుక యథార్థంగా ఆత్మేమిటో కనుగొనేందుకు ఆంతరికావిష్కరణ ప్రథమావశ్యకత. ఆ పిదప చాలామంది దానినసలేమాత్రం యెరుగరు గనుక, (మదర్ నవ్వుతారు) ఆవిష్కరించవలసినదొకటి ఉన్నదని వాళ్ళకు మనం చెప్పాలి.

కేంద్రంలో ఒక స్వేచ్ఛామయ విశాల, యెరుక గల అస్తిత్వం ఉంది. మన ఆవిష్కరణకు వేచి చూస్తూ ఉంది, అది ఆరోవిల్లిలో మన మనుగడకు, మన జీవితానికి, క్రియాత్మకమైన కేంద్రం అవ్వాలి. దాని తర్వాత దీన్నుంచుదామా (ప్రథమ విషయమైన దైవానికి అర్పణ అనే అంశాన్ని చూపిస్తారు) లేక మరేదైనా పెడ్దామా?

ఇది నాకు, సిద్ధి కంటే అధికం అన్నట్లుగా వుంది. చిట్టచివరికి లభించేదేదోగా అనిపిస్తోంది.

ఇది నా స్వంతం అనే భావం నుండి తమను తాను విడుదల చేసుకోవడం గురించి మనం వాళ్ళకు చెప్పాలి. ప్రతిదీ భగవంతునికే చెందుతుంది. దైవం నీకు ఒక కేంద్రాన్ని (నీ వ్యక్తిత్వ కేంద్రంను) ఇవ్వడం మాత్రమే గాక, అనేక వస్తువులను వ్యక్తిగత ఉపయోగానికి ఉపయోగించుకొనే అవకాశాన్ని కూడా ఇచ్చాడు. అన్నింటినీ నీవలాగా తీసుకోవాలి. నిజమే, దైవం శాశ్వతం, ఎల్లప్పుడూ ఉండేవాడు అని ఆంగ్లంలో చెప్తారు. అదే సమయంలో, ఈ

వ్యక్తిగత కేంద్రాన్ని సృజిస్తాడు. గనుక అనేక వస్తువులు ఆతని కార్యానికు పయోగించడానికి అచట ఉన్నాయి. అందుకు అవి అప్పుగా యివ్వబడ్డాయి. అసలు విషయం ఖచ్చితంగా అదే. నీ ఆధీనంలో వాటిని ఉంచుకొంటావు.

స్వంతం అనే ధ్యాసను నిర్మూలించే విధానం అది. ఆసక్తికరంగా ఉంది గదూ. 'రేపటి నగర పౌరుల నిర్వచనం".

కోరికల మీద రెండవ పేరా ఉంది. మూడవది స్వంత ఆస్తిమీద ఉంది.

కోరికలను నివారించడానికి గల యధార్థమైన ఒకే ఒక మార్గం, తనను తాను దైవానికిచ్చివేయడం, నీకవసరమైన వాటిని మాత్రమే ఆతడు నీకిచ్చిన వాటిగా, ఆతడిచ్చిన వాటినంగీకరించడం, కాని అది చాలా పురోగమించిన దశ.

ఆరొవిల్లీ వాసులు "నైతిక సంప్రదాయాలు వగైరాల నుండి తప్పించుకొన డానికి వచ్చారు గాని విషయలాలసకు విశృంఖల కళ్ళెం ఇవ్వడానికి గాదు" అని నీవు మొదట్లో అన్నావు.

అవును అది సరైన మాటే (మదర్ వ్రాస్తారు)

**2.** నైతిక, సాంఘిక కట్టుబాట్ల నుండి స్వేచ్ఛకై ఆరొవిల్లిలో నివసిస్తాడు. కాని ఈ స్వేచ్ఛ అహానికి దాని కోరికలకు, అత్యాశలకు ఒక నూతన బానిసత్వం కాగూడదు.

అది పునాది. మూడవ పేరా వుంది. 'ఆరొవిల్లి వాసి వ్యక్తిగత ఆస్తి అనే భావన నుండి తనకు తానుగా బయటపడాలి' అని నీవన్నావు.

కాని అది 'భావన' కాదు. అది 'స్పృహ' (మదర్ వ్రాసారు)

**3.** ఆరొవిల్లీ వాసి వ్యక్తిగత ఆస్తి అనే స్పృహ నుండి తనను తాను బయట పడవేసుకోవాలి.

ఒక స్వీడన్ దేశస్థురాలో లేక నార్వేజి దేశస్థురాలో నాకొక పెద్ద క్రీస్తును శిలువ వేసిన చిత్రాన్ని పంపాలనుకొన్నదని నీకుచెప్పానా?... చెప్పాను. కానీ నీకు రెండు పాఠ్యాంశాలను చూపించలేదు. చూడూ, నక్షత్ర రాశి ఫొటోనొకదాన్ని, మొదటిదానిలాగే ఉన్నట్లు కన్పించే ఆరొవిల్లి ఫొటోనొకదాన్ని

యెన్నుకొన్నాను. క్రీస్తును శిలువ వేసిన చిత్రం క్రింద, పెద్ద పెద్ద అక్షరాలతో "మనిషి కోరికల చేత దైవచేతన శిలువ వేయబడింది" అని వ్రాద్దాం. (మదర్ చదివారు)

*శ్రీమాత శిష్యునితో సంభాషణ : ఏప్రిల్ 23,1968*

కేంద్రంలోని చుక్క ఏకతను, పరముని తెలుపుతుంది. లోపలి వృత్తం సృష్టిని తెలుపుతుంది, నగరాన్ని (ఆరొవిల్లి)ని గురించిన ఆలోచనారంభాన్ని తెలుపుతుంది.

దళాలు, ప్రకటనకు సంబంధించిన, సిద్ధికి సంబంధించిన శక్తిని తెలుపుతున్నాయి.

*CWM 13:212*

**(మాతృ మందిరం పునాదిరాయిని వేసే సందర్భంలో ఇచ్చిన సందేశం, ఫిబ్రవరి 21,1971)**

దైవం కోసం ఆరొవిల్లి ఆకాంక్షకు మాతృమందిరం సజీవ సంకేతమగుగాక

(మాతృమందిరం పనిని ప్రారంభించినప్పటి సందేశం)

కలసిపనిచేసే సౌభ్రాతృత్వం

ఆనందం, వెలుగులో ఏకత్వంవైపు ఆకాంక్ష

ఆశీస్సులు

*CWM 13:223-24*

## నాలుగు స్తంభాల విశిష్టత

ఉత్తరం : మహాకాళి

తూర్పు : మహాలక్ష్మి

దక్షిణం : మహేశ్వరి

పశ్చిమం : మహా సరస్వతి

మాతృమందిరం పునాది నుండి విస్తరించిన భూమిలోపలి పన్నెండు గదుల విశిష్టత.

చిత్తశుద్ధి, వినమ్రత, కృతజ్ఞత, తదేకదీక్ష, ఆకాంక్ష, స్వీకరించే శక్తి, పురోగతి, ధైర్యం, మంచితనం, ఔదార్యత, సమత, శాంతి.

(మాతృమందిరం చుట్టూ ఉన్న పన్నెండు ఉద్యానవనాల విశిష్టత)

సత్, చిత్, ఆనందం, వెలుగు, ప్రాణం, శక్తి, సంపద, ప్రయోజకత, పురోగతి, యౌవనం, సామరస్యం, పరిపూర్ణత.

*CWM 13:226*

## మాతృ మందిరం :

ఆరొవిల్లి కేంద్ర నిర్మాణాన్ని నేను చూచానని నీకు చెప్పాను.. నాకో ప్రణాళిక ఉంది. చూడాలనుకొంటున్నావా? మూడు చుట్టలున్నాయి. (వివరించేటప్పుడు మదర్ ప్రణాళికను విప్పింది)

పన్నెండు ముఖాలున్నాయి. అదొక వృత్తం.

కేంద్రం నుండి అంతేదూరంలో **12** స్తంభాలున్నాయి. కేంద్రంలో నేలమీద నాభి బీజం, నాభిబీజం కేంద్రంలో శ్రీ అరవిందులు ఆ నాలుగు గోళాలు ఉన్నాయి. అవి నాలుగూ కలసి ఒక చతురస్రంగా రూపొందాయి. ఆ చతురస్రానికి పైన ఒక పారదర్శకమైన సూర్యుడు ప్రకాశిస్తున్నప్పుడు పైకప్పు నుండి ఒక సూర్యకిరణం గోళం మీద పడ్తుంది. (అక్కడ మాత్రమే, మరింకెక్కడా కాదు) సూర్యకాంతి లేనపుడు కేవలం అక్కడికే వెలుగును పంపే విద్యుద్దీపాలు, ఒక కాంతి కిరణాన్ని కేవలం గోళంపై ప్రకాశింపజేస్తాయి. (ఇక్కడ కూడా ఒకే ఒక కిరణాన్నే గాని చెదరిన వెలుగును కాదు)

ఇహ తలుపులుండవు. లోతుగా క్రిందికి పోయిన తర్వాత తిరిగి ఆలయంలో కడుగుబెడ్తాం. గోడ క్రిందకుపోయి, లోపలికి తిరిగొస్తాం. అది కూడా సంకేతమే. ప్రతిదీ సంకేతాత్మకమే.

తరువాత సామాగ్రియేది ఉండదు. కాని మొదట్లో (బహుశా ఇక్కడున్నట్లుగానేమో) చెక్కతో తయారైన నేల, మందపాటి ఫోమ్‌రబ్బర్, దానిమీద ఇక్కడిలాగే తివాచీ, రంగును మనం ఎన్నుకోవాలి. మొత్తం అంతా తెలుపురంగే. శ్రీ అరవిందుల చిహ్నాలు గూడా తెలుపురంగులో ఉంటాయి అని ఖచ్చితంగా చెప్పలేను.. అలా ఉండకపోవచ్చు, వాటిలో తెలుపురంగులో చూడ్డం లేదు. అనిర్వచనీయమైన రంగులో చూచాను. అది బంగారం, నారింజరంగు మధ్యస్థంగా ఉన్న రంగులో చూచాను. శిలలో మలచబడినవై తిన్నగా నిలిచి ఉంటాయి. గోళం పూర్తిగా పారదర్శకం కాక, పాక్షికంగా

పారదర్శకమైనది. గోళం క్రింద నుండి పైపైపుకు ఒక వెలుగు పంపబడుతుంది. అది గోళంలో ప్రవేశించి చెల్లాచెదురౌతుంది. బయట నుండి కేంద్రం మీద కాంతి కిరణాలు పడతాయి. మరింకేదీపాలు ఉండవు, కిటీకలుండవు. విద్యుత్తుతో నడిచే యంత్రాల ద్వారా గాలి ప్రసారం జరుగుతుంది. సామాగ్రియేమీ ఉండదు. చేతనను కనుగొనేందుకు ప్రయత్నించే ఒక ప్రదేశమది.

బయట ఇలా ఉంటుంది (మరో ప్రణాళికా పటాన్ని మదర్ చుట్ట విప్పుతారు). పైకప్పు గోడుగా ఉంటుందో లేదో తెలియదు.

చాలా సాదాగా చాలా సాదాగా ఉంటుంది. రెండువందల మందికందులో చోటు ఉంటుంది.

*ది మదర్ శిష్యునితో సంభాషణ, జనవరి 10, 1970.*

ఆరొవిల్లీ నిర్మాణానికి ఎవరు శ్రీకారం చుట్టారు?

పరమ ప్రభువు

ఆరొవిల్లీకి ఆర్థిక వనరులు సమకూర్చడంలో ఎవరు పాలుపంచుకున్నారు?

పరమ ప్రభువు

ఒక వ్యక్తి ఆరొవిల్లీలో ఉండాలని కోరుకొంటే అతడు ఎలా ఉండాలి?

పరమ పరిపూర్ణతను పొందే ప్రయత్నం చేయాలి.

ఆరొవిల్లీలో ఉండే నిమిత్తం ఒక వ్యక్తి యోగాభ్యాసం చేసే విద్యార్థి అయ్యుండాలా?

జీవితం సమస్తం యోగమే. కాబట్టి ఏ ఒక్కరూ పరాత్పర యోగాన్ని అభ్యసించకుండా జీవించలేరు.

*CWM 13:188-190* — ది మదర్

**AKHILA - Akhila Bharata Patrika (Telugu)**

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

*Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo*



**Beauty of Supramental love (Flower of Auroville)**

*It invites us to live at its height*

*(Spiritual Significance and explanation of the flower given by the Mother)*

Botanical name: Hibiscus rosa-sinensis

Chinese hibiscus, Hawaiian hibiscus, Rose- of-China

**Cover Picture**

Bonfire of 28 February (birthday of Auroville)
with Matrimandir in the background

*Owner:* Sri Aurobindo Society
*Printer:* Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
*Publisher:* Pradeep Narang for Sri Aurobindo Society
*Published from:* Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
*Printed from:* Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001




# అఖిల

అఖిల భారత పత్రిక

మార్చి 2024


# జీవన శాస్త్రము - ఒక సరళ వైఖరి

(శ్రీ అరవిందులు, ది మదర్ సుభాషితాలు)

# విషయ సూచిక



నీ నుండి నేనాశించేదంతా యిదే.

*ది మదర్*

---

దైవానికి చేతనను ఉన్ముఖం చేసి వుంచడం స్వభావాన్ని పరివర్తన చేయడం, సాధన లక్ష్యం.

*CWSA 29 : 208* *శ్రీ అరవిందులు*

ప్రశ్న : ప్రియమైన అమ్మా!

నేను జ్యోతికై చాలా కేంద్రీకరించాను. కాని దానిని వెలిగించేంత బలంగా నా ఆకాంక్ష లేకపోయింది.

అగ్నిని వెలిగించే పని నీది కాదు.

నేను చెప్పినట్లు, దాని నెల్లపుడు వెలిగించేది నేను. నీవు చేయవలసిందల్లా దానిని స్వీకరించి, నీ సుహృద్భావనతో దానిని పెంచి పోషించుకొనడానికి నిన్ను నీవు ఉన్ముఖం చేసుకోవడం మాత్రమే.

*CWM 17 : 127-28* — దీ మదర్

# నిరాడంబరత - పరిపూర్ణ చిత్తశుద్ధి పర్యవసానం

వ్యక్తపరచేటట్లు చేయడంలో గల సమస్త కృషికనుమరుగైన వెంటనే అది చాలా సరళమైనదిగా, తన సౌందర్యాన్ని వ్యక్తపరుస్తూ, ఏ సందడీ లేకుండా, తీవ్రమైన సంజ్ఞ లేకుండా తన పరిమళాన్ని వెదజల్లే పుష్పానికుండే సారళ్యతగా అవుతుంది. ఈ సారళ్యతలో అత్యంత గొప్ప శక్తి వుంది. ఆ శక్తిలో మిశ్రమం లేదు. అపకారం కలిగించే ప్రతిచర్యలకాస్కారమివ్వదు. ప్రాణికానికి గల శక్తిని నమ్మరాదు. మనం చేసే పనిలో అది ప్రలోభ పెడ్తుంది. నీవు ఉచ్చులో పడే ప్రమాదం ఎప్పుడూ వుంటుంది. ఎందుకనంటే వెంటనే లభించే ఫలితాల రుచినది చూపిస్తుంది. పనిని చక్కగా చేయాలనే ప్రప్రథమ ఆరాటంలో ఈ శక్తినుపయోగించుకొనడానికి మొగ్గుతాం. కాని చాలా త్వరలోనే, అది సరైన పద్ధతినుండి తన పనినంతా ప్రక్క దారి పట్టిస్తుంది. అంతేగాక మనం చేసే దాన్లోకి, భ్రాంతిబీజాన్ని, మరణభయాన్ని ప్రవేశపెడ్తుంది.

సారళ్యత, సారళ్యత ! నీ సాన్నిధ్య పరిశుద్ధత యెంత మధురం!

*CWM 1 : 17*

సమగ్ర నిరాండబరత. పరిపూర్ణ చిత్తశుద్ధి పర్యవసానం నిరాడంబరత.

*CWM 14 : 158*

ప్రశ్న : స్వీట్ మదర్, క్రీడాస్థలం, వాద్యబృందం, అధ్యయనాలు వగైరా సమస్త కార్యకలాపాలను వదలివేసి, పని చేయడానికి మాత్రమే నా కాలాన్నంత వినియోగించాలని అనుకొన్న సమయాలున్నాయమ్మా?

మరింత క్లిష్టమైన పరిస్థితులను చక్కచేయడానికి శ్రమనంతా తప్పించుకొనడానికి, జీవన స్థితిగతులను సులభతరం చేయాలనే తామసిక నైజం తరచుగా బాహ్యస్వభావంలో తలెత్తుతుంది. కాని అస్తిత్వ సమగ్రత్వంలో పురోగమించాలనుకొంటే ఈ విధంగా సులభతరం చేయడం ఏమంత వాంఛనీయం కాదు.

*CWM 16 : 303* — దిమదర్

# అప్రయత్న సంభావ్యత, సారళ్యత, చిత్తశుద్ధి

అప్రయత్నంగా అన్య ప్రేరణ లేకుండా సంభవించడం అంటే, స్వయిచ్ఛతో, సిద్ధింపజేసుకొనడానికి ఆలోచించకుండా, సమకూర్చుకొనకుండా, నిశ్చయించుకొనకుండా కృషిచేయడం.

అప్రయత్నంగా సంభవించడమంటే యథార్థంగా యేమిటో నీకు స్పష్టంగా తెలియడం కోసం రెండుదాహరణలనిస్తాను. ఒకటి, నిస్సంకోచంగా మీకది తెలిసే వుంటుంది... **1914**లో శ్రీ అరవిందులు ఆర్యకు వ్రాయడమారంభించిన కాలానికి సంబంధించినది. వారు వ్రాసినది మానసిక జ్ఞానానికి సంబంధించినది కాదు; ఒక మానసిక సృష్టి కాదు. తన మనసును నిశ్చల నీరవం చేసి, టైపు మెషీను ముందు కూర్చొనేవారు, అది అక్షరరూపం ధరించేది. ఇటువంటి మానసిక నిశ్చల నీరవతా స్థితి, జ్ఞానాన్ని దాని వ్యక్తీకరణను సైతం పైనుండి రావడానికనుమతిస్తుంది. దాని ద్వారా నెలకు **64** ముద్రిత పేజీలను వ్రాసారు. ఇందువల్లే వారలా చేయగలిగారు. ఎందుకనంటే అది మానసిక సంబంధ కార్యమే అయివుంటే, అది పూర్తిగా అసాధ్యమై వుండేది. అది యథార్థమైన మానసిక, అన్యప్రేరణ లేని కార్యం. దీనినింకా కొంచెం ముందుకు తీసుకుపోతే, తాను చెప్పదలచుకొన్న దానిని లేక వ్రాయవలసి వున్న దానిని గురించి ముందుగా ఆలోచించుకోవలసి ఉండదు. అతడు తేలికగా మనసును నిశ్చలనీరవం చేయగలిగి దానిని ఒక పాత్రలాగా ఉన్నతతర చేతన వైపు త్రిప్పగలిగితే, అది స్వీకరించే దానిని, మానసిక నిశ్చల నీరవతలో, పైనుంచి వచ్చేదానిని, వ్యక్తం చేస్తాడు. అది యథార్థమైన అన్య ప్రేరణ లేని అప్రయత్నం సంభవత.

సహజంగానే ఇదంత తేలికగాదు. సమగ్రత వుండాలి. కార్యనిర్వహణా పరిధిలోనికి క్రిందికి వచ్చినపుడు అది మరింత కష్టమౌతుంది. ఎందుకనంటే మామూలుగా, ఒక విధమైన తర్కబుద్ధితో పనిచేయాలనుకొంటే, తాను చేయాలనుకొన్న దానిని గురించి, ముందుగా సాధారణంగా ఆలోచించాలి, చేయడానికి ముందు ప్రణాళిక రచించుకోవాలి. లేకపోతే ప్రయత్నం లేని చర్య లేక అప్రయత్న చర్య విషయంలో మనం చెప్పుకొన్న ప్రేరణనుండి చాలా పెడగా తీసుకుపోయే సకలవిధ కోరికలు, ప్రేరేపణలచే యిటూఅటూ ఊపివేయబడ్తాడు. అప్పుడు, నిమ్నస్వభావంచే నిన్ను నడిపే కదలికలుగా అవి

తయారవుతాయి. కాబట్టి, ఈ కథలో చెప్పుకొన్న చైనా ఋషి చేరుకొన్న పరిణిత ప్రజ్ఞానం, నిస్సంగత్వ స్థితికి చేరకపోయినట్లైతే నిత్యజీవన చర్యలను అప్రయత్నంగా చేయకపోవడం మంచిది. ఎందుకనంటే అత్యంత అపక్రమ ప్రేరణలు, ప్రభావాలకు ఆటవస్తువుగా మారే ప్రమాదంలో పడ్తాడు.

కాని ఒకసారి యోగంలోనికి ప్రవేశించినపుడు, యోగాన్ని అభ్యసించాలనుకొన్నప్పుడు, తన స్వకీయ మానసిక రూప నిర్మాణాల ఆటబొమ్మ కాకుండా వుండడమనేది చాలా అవసరం. తన అనుభవాల మీద ఆధారపడాలనుకొంటే, తాను పొందాలనుకొంటున్న అనుభవాల గురించి తనలో ఎటువంటి అభిప్రాయాలను యేర్పరచుకోగూడదు. తాను చూడాలని ఆశిస్తున్న రూపాల గురించి ఎటువంటి భావనను యేర్పరచుకోగూడదు. ఎందుకనంటే మానసిక రూపనిర్మాణం, నేను చాలా తరచుగా అదివరకే చెప్పినట్లు ఒక నిజమైన రూపం, ఒక నిజమైన సృష్టియే. నీ భావనచే, కొంతవరకు నీతో సంబంధంలేని రూపాలను సృష్టిస్తావు. అవి బయటనుంచి వచ్చిన వాటిలాగా ఎదిగి నీ దగ్గరకొచ్చి, నీకు అనుభవాలు అనే అభిప్రాయాన్ని కలిగిస్తాయి. ఇచ్ఛయించిన లేక కోరిన లేక ఆశించిన అనుభవాలు, అప్రయత్నంగా లభించిన అనుభవాలు కాకపోగా, భ్రమలుగా కొన్ని సమయాలలో ప్రమాదకర భ్రమలుగా సైతం తయారయ్యే ప్రమాదం వుంది.

కాబట్టి ఒక మానసిక క్రమశిక్షణననుసరిస్తున్నపుడు, ముఖ్యంగా ఊహించడం, ఒక విధమైన అనుభవం కలగాలని కోరుకోవడం చేయగూడదనే జాగ్రత తీసుకోవాలి. ఎందుకనంటే, ఈ విధంగా చేస్తే, ఈ అనుభవాల గురించిన భ్రమలను నీకు నీవు సృష్టించుకొన్న వాడివవుతావు. యోగ పరగణాలో, చాల నిక్కచ్చి అయిన, తీవ్రతరమైన అప్రయత్నతా చర్య తప్పనిసరిగా అపరిత్యాజ్యం.

అందుకోసం సహజంగానే ఎటువంటి అత్యాశ లేక కోరిక లేక అత్యధిక ఊహ లేక నేననే "ఆధ్యాత్మిక లాలస" మహిమల రుచికై ఆవేశం ఉండకూడదు. నిర్భయంగా ముందుకు సాగిపోవాలి తప్పకుండా అనేదానికి, చాలా జాగ్రత్తగా వీటన్నింటినీ రద్దు చేసుకొని తీరాలి.

ఈ ప్రాథమిక వివరణ తర్వాత, నేనదివరకు వ్రాసిన దానిని గురించి, వ్యాఖ్యానించమని నన్నడిగిన దానిని గురించి చదువబోతున్నాను. బహుశా

ఈ సూక్తులకు వివరణ అవసరమనుకుంటాను. నేనిప్పుడు నీతో మాట్లాడుతున్న దానిని గురించి చదువుతున్నపుడు బహుశా ప్రేరణ పొంది వ్రాసావనుకొంటాను. కాని వ్యక్తిగత అనుభవ ప్రకటన దేనికైనాకంటే చాలా అధికమైనది. దైవం అవ్వాలంటే, ముందుగా ఆలోచన చేయనివాడై వుండాలి.

దీనిని గురించి నేనింతకు ముందు వివరించాను. ఇహ ఇప్పుడు ముందుగా ఆలోచన చేయకుండా వుండడం యెలా? అనే ప్రశ్న తలెత్తుతుంది.

"ముందుగా ఆలోచన చేయనివాడై వుండడానికి తగినంత పరిపూర్ణంగా సరళంగా నిరాబంబరంగా వుండాలి"

పరిపూర్ణంగా సరళంగా వుండడం యెలా?

"పరిపూర్ణంగా సరళంగా వుండాలంటే అతడు పరిపూర్ణంగా చిత్తశుద్ధి కలవాడవ్వాలి"

పరిపూర్ణంగా చిత్తశుద్ధితో వుండడమంటే అర్థం యేమిటి?

"పరిపూర్ణంగా చిత్తశుద్ధితో వుండడమంటే తన అస్తిత్వంలో ఏ విధమైన విభజన, ఏ విధమైన వైరుధ్యంగాని లేకపోవడం"

భిన్నమైన లేదా తరచుగా పూర్తి పరస్పర విరుద్ధమైన శకలాలచే నీవు తయారై వుంటే, ఈ శకలాలు నీ అస్తిత్వంలో విభజనను సృష్టిస్తాయి. ఉదా : దివ్యజీవనం కోసం, దైవాన్ని తెలుసుకోవడం కోసం, ఆయనతో ఏకం కావడం కోసం ఆయనను సమగ్రంగా జీవించడంకోసం,ఆకాంక్షించే ఒక భాగం నీలో వుండి, మమకారాలు, కోరికలు - "అవసరాలు" అని పిలువబడేవి - కావాలని కాంక్షించడమే గాక, అవి నెరవేరనపుడు తలక్రిందులయ్యే మరో భాగం వుంది. ఇతర వైరుధ్యాలు కూడా వున్నాయి, కాని యిది అత్యంత నిందార్హమైనది. ఇతరమైనవి కొన్ని వున్నాయి. ఉదా : దైవానికి సంపూర్ణంగా సమర్పణ కావాలనుకొనే అతని ఇచ్ఛకు, ఆతని మార్గదర్శకతకు పూర్తిగా యిచ్చివేసుకోవాలనుకొనే లాంటివి. అదే సమయంలో, అనుభవం - దైవానికి తనను తానర్పించుకోవాలని నిజాయితీగా ప్రయత్నించే వానికి మార్గం మీద తటస్థపడే ఒక సర్వసామాన్య అనుభవం - అంటే, తానేమీ కాదు, తానేమీ చేయలేడు, అసలు ఎవరైనా దైవం లేకుండా బ్రతుకనేలేరు. అంటే ఆయన కనుక లేకపోతే ఎవరి ఉనికీ వుండదు, ఏమీ చేయలేడు, అసలతడేమీ కాడు... ఈ అనుభవం, సంపూర్ణ ఆత్మార్పణా మార్గం మీద సహాయకారిగా సహజంగా

లభిస్తుంది. కాని, అనుభవం కలిగినపుడు, అస్తిత్వంలో మరో భాగం, భయంకరంగా తిరుగుబాటు చేస్తుంది. "క్షమించండి, కాని నేను నేనుగా వుండాలనుకుని పట్టుబడ్తున్నాను, నేను మరోలా కావాలని పట్టుబడ్తున్నాను, నాకుగా నేను పనులు చేయాలనుకొంటున్నాను, నేనో ప్రత్యేకమూర్తిత్వం అవ్వాలనుకొంటున్నాను" అని ఉంటుంది. మొదటిది అనుకున్నదాన్నంతా సహజంగా రెండోది నిర్వీర్యం చేస్తుంది.

ఇవి అసాధారణ సందర్భాలు కాదు, చాలా తరచుగా జరుగుతుండేవే. అస్తిత్వంలో అటువంటి పరిస్థితులకు నేను అసంఖ్యాకమైన ఉదాహరణ నివ్వగలను. ఒక భాగం ముందుకొక అడుగు వేయాలనుకొన్నపుడు, రెండోది వచ్చి మొత్తాన్ని ధ్వంసం చేస్తుంది. కనుక ఎప్పుడూ తిరిగి మొదలుపెట్టవలసి వస్తుంది. ప్రతిసారీ అది ధ్వంసమౌతుంది. మరోవైపుకు లాగే ఒక భాగాన్ని నీ అస్తిత్వంలో చూచినపుడు, దానిని జాగ్రత్తగా తీసుకొని, ఒక బిడ్డకు విద్యగరపినట్లు, విద్యగరపి, కేంద్రీయ భాగంతో సామరస్యతలో వుంచేటట్లు చేస్తుంది. ఇది నీవు చిత్తశుద్ధితో చేయవలసిన పని. అది చిత్తశుద్ధి పని, అది అపరిత్యాజ్యం.

ఒక ఐకమత్యత, ఒక ఒప్పందం, ఒక సామరస్యత అస్తిత్వపు సమస్త సంకల్పాలయందూ వున్నపుడు సహజంగానే నీ అస్తిత్వం సరళమైనదిగా, నిష్కపటిగా, ఏకరూపిగా, తన చర్యలోనూ, వైఖరులలోనూ తయారవుతుంది. మొత్తం అస్తిత్వం, ఒకే ఒక కేంద్రీయ చలనం చుట్టూ గుమిగూడినపుడు మాత్రమే నీవు ముందుగా ఆలోచన చేయని వాడవవుతావు. ఎందుకనంటే, నీలో యేదో దైవంవైపు తిరిగి ప్రేరణ కోసం ఎదురుచూస్తుంటే, ముందుకు నెట్టబడడంకోసం ఎదురుచూస్తుంటే, అదే సమయంలో, తన అవసరాల మీదే దృష్టి పెట్టే, తన కోరికలను తీర్చుకొన పనిచేసే మరోభాగం వుంటే, నీవెక్కడున్నావో నీకేమాత్రం తెలియదు. ఏం జరుగబోతుందో కచ్చితంగా చెప్పలేవు. ఎందుకనంటే, మరోభాగం చేయాలనుకొన్నదాన్ని, ఈ భాగం పాడు చేయడమే గాక, పూర్తిగా దానితో విభేదిస్తుంది. వీనినే చైనావారి భావనతో సమరసంలో వుండాలంటే, ఏది ఆవశ్యకమో, ఏది చేసి తీరాలి అనేదాన్ని స్పష్టంగా చూచినపుడు, హింసతో కూడిన ప్రయత్నాన్నిగాని, లేక అత్యధిక ఆసక్తినిగాని ఈ కార్యక్రమ నిర్వహణలో పెట్టగూడదని సిఫార్సు చేయడం. ఎందుకనంటె అత్యధిక ఆసక్తి, దివ్యచేతన వ్యష్టి ద్వారా తనను

వ్యక్తపరచుకొనడానికవసరమైన శాంతి, ప్రశాంతి, స్థిరతలకు వినాశం కలిగించేదౌతుంది. అంటే సంక్షిప్తంగా -

సమతుల్యత అపరిత్యాజ్యం, వ్యతిరేకాంతాలకు తీసుకుపోయే దారిని త్యజించడం అపరిత్యాజ్యం. అతి తొందర ప్రమాదకరం. అసహనం, పురోగమనాన్నడుకొంటుంది. అదే సమయంలో జడత నీ పాదాలను వేగంగా ముందుకు పడనీయదు.

*CWM 8 : 282-86* *ది మదర్*

## ప్రకరణం 2 :

# సుఖ సంతోషాలతో జీవించడం

## ఉల్లాసభరితంగా, హుషారుగా ఉంచే అంతర్గత స్థితి

హాస్యం అనేది సుఖానికి క్రియాశీల పార్శ్వం; ఇది చురుకైన అంతర్గత ఆనందోల్లాసంలో తన ఉనికిని కలిగి ఉంటుంది, ఎటువంటి ప్రతికూల అనుభవం, మానసికమైనది కానీ లేదా శారీరికమైనది కానీ దానిని చెదరగొట్టలేదు. దానిపరిపూర్ణ స్థితి, సమత యొక్క సిద్ధిని పొందడం. దానిపై భగవంతుని ముద్ర ఉంటుంది. ఇది మన అంతరంగంలో ఉన్న చిరునవ్వులు ఒలికించే బాలకృష్ణుని రూపం, ఈ ప్రపంచపు ఉద్యానవనంలో శాశ్వతమైన శ్రీ కృష్ణుని బాలక,కుమార రూపాలలో విరాజిల్లుతూ ఉన్నది.

*CWSA 10.5-6*

హాస్యచమత్కార ప్రవృత్తి! ఇది మన ఉనికికే రుచిని చేకూర్చే ఉప్పు వంటిది. అది లేకపోతే ప్రపంచం పూర్తిగా సమతుల్యత కోల్పోతుంది - అది ఇప్పటికే తగినంత అసమతుల్యతలో ఉంది. చాలా కాలం క్రితమే మంటలలో కాలిపోయేది.

*CWSA 31:174*

యోగం చేసేవారు ఎప్పుడూ గంభీరంగా లేదా మౌనంగా ఉండాల్సిన అవసరం లేదు, కానీ యోగాన్ని గంభీరమైన విషయంగా తీసుకోవడం అవసరం. అలాగే ఇక్కడ మౌనానికి అంతర్గత ఏకాగ్రతకు పెద్ద స్థానం ఉంది. లోపలికి వెళ్లి దైవాన్ని కలుసుకోవడమే మన లక్ష్యం అయితే ఒక వ్యక్తి తన

మనసునువిల్లప్పుడూ బయటికి విసిరి వేసుకుంటూ ఉండకూడదు. అయితే దీని అర్థం మనం ఎల్లవేళలా గంభీరంగా, దిగులుగా ఉండాలని లేదా ఎక్కువ సమయం దిగులుగా ఉండాలని కాదు.

*CWSA 31: 175*

మాధుర్యాన్ని సంతోషకరమైన అనుభూతిని పెంపొందనివ్వు. ఎందుకంటే అవి ఆత్మ(మనలో సదా మేల్కొని ఉండి మనకు సన్నిహితంగా ఉండే చైత్య పురుషుడు) యొక్క బలమైన సంకేతం, ఆలోచన లేదా మాటలు లేదా నీ కర్మలలో జరిగే పొరపాట్లు నీకు క్లేశం కలిగించకుండా ఉండనివ్వు. వాటి పట్ల ఉదాసీనంగా ఉండు. అప్పుడు శక్తి, ప్రకాశం వాటిపై పనిచేసి వాటిని తీసివేస్తుంది. ఒక్క ముఖ్యమైన విషయం గుర్తుంచుకోండి- అది నీ ఆత్మ, ఇంకా దాని వెంటవచ్చే ఈ ఉన్నతమైన వాస్తవాల ఎరుక.

*CWSA 30: 344* *శ్రీ అరవిందులు*

## సంతోషంగా ఉండటానికి ప్రయత్నించు

నీవు సంతోషంగా ఉంటే - వెంటనే నీవుప్రకాశానికి దగ్గరగా ఉంటావు .

*CWM 14:193*

అలాగే అత్యంత ముఖ్యమైన గుణం పట్టుదల, ఓర్పు, అలాగే ఒక... నేను దానిని ఏమని పిలవాలి?

నిరుత్సాహపడకుండా, విచారంగా ఉండకుండా అన్ని కష్టాలను చిరునవ్వుతో ఎదుర్కోవడానికి నీకు సహాయపడే అంతర్గతమైన మంచి హాస్య స్ఫూర్తితో ఉండడం. ఈ చక్కని ఉల్లాసాన్ని వ్యక్తపరిచే ఒక ఆంగ్ల పదం ఉంది. అది "ఛీర్ఫుల్నెస్" అంటే ఉల్లాసభరితంగా, హుషారుగా ఉండడం. నీవు దీన్ని నీలో ఉంచుకోగలిగితే, నీ పురోగతికి అడ్డం వచ్చే ఎటువంటి చెడు ప్రభావాలైనా సరే, దాని వెలుగులో నీవు మరింత మెరుగ్గా పోరాడుతావు, మరింత మెరుగ్గా ఎదుర్కొంటావు,

*CWM 8:23*

ఎప్పుడూ సణుగుతూ ఉండకు. నీవు అలా సణుగుతూ ఉంటే అన్ని రకాల శక్తులు నీలోకి ప్రవేశిస్తాయి, అవి నిన్ను క్రిందికి లాగుతాయి. నవ్వుతూ ఉండు, నేను ఎప్పుడూ నవ్విస్తున్నట్లు అనిపిస్తుంది కానీ ఇది కేవలం ఛలోక్తి

కాదు. ఇది చైత్యపురుషుడి నుండి వచ్చే విశ్వాసం. దైవానికి వ్యతిరేకంగా ఏదీ నిలబడదని, చివరికి ప్రతిదీ సరిగ్గా జరుగుతుందనే విశ్వాసాన్ని ఒక చిరునవ్వు వ్యక్తపరుస్తుంది.

*CWM 14:221*

ఆత్మకున్న స్వభావమే దివ్యమైన ఆనందం, అది స్థిరమైనది, మార్పులేనిది, షరతులు లేనిది, పారవశ్యభరితమైనది

*CWM 9:40*

భూమిపై ఉదయించిన కొత్త ప్రకాశానికి నిన్ను నీవు తెరువు, అప్పుడు నీ ముందు ఒక ప్రకాశవంతమైన మార్గం పరుచుకుంటుంది..

*CWM 15:97*

ఒకరి హృదయంలోని శాశ్వతమైన ఉనికి యొక్క అనుభూతితో ఏ ఆనందము పోల్చదగినది కాదు.

*CWM 14: 195* శ్రీమాత

## సంతోషంగా ఉండడం ఎలా

నిజమైన, శాశ్వతమైన ఆనందానికి ఏకైక మార్గం దైవానుగ్రహంపై సంపూర్ణంగా అనన్యభావనతో ఆధారపడటం.

*CWM 14:193*

భగవంతునిపట్ల లోతుగా, తీవ్రంగా మరియు నిరంతరం కృతజ్ఞతతో ఉండటమే సంతోషంగా, శాంతియుతంగా ఉండటానికి ఉత్తమ మార్గం.

*CWM 16:315*

నీకు వీలైనంత వరకు నీ ఆలోచనల్లో నిరాశావాదాన్ని అదుపు చేయి. అలాగే స్వచ్ఛందమైన ఆశావాదిగా ఉండు.

*CWM 12:141*

మనం ఎల్లప్పుడూ సరైన పని చేద్దాం, అలాగే మనం ఎల్లప్పుడూ మౌనంగా, సంతోషంగా ఉందాము.

*CWM 14:194*

నిజమే, స్వచ్ఛమైన, నిరాసక్తమైన ప్రేమ కంటే ఎక్కువ ఆనందాన్ని ఏదీ తీసుకురాలేదు.

*CWM 16:175*

నిజమైన ఆనందం దైవం నుండి వచ్చేది, అది స్వచ్ఛమైనది, షరతులు లేనిది. సాధారణ సంతోషం ప్రాణిక జనితమైనది. ఇది అపరిశుభ్రమైనది, పరిస్థితులపై ఆధారపడి ఉండేది.

*CWM 17:18*

సరళంగా ఉంటూ, కేవలం మంచి సంకల్పంతోచేయగలిగినంత ఉత్తమంగా, సాధ్యమైనంత ఉత్తమంగా చేయడం చాలా మంచిది. ఏదో ఒకటి గొప్పది నిర్మించడం కాదు, కానీ పురోగతి కోసం, ప్రకాశం కోసం, సద్భావనతో నిండిన శాంతి కోసం మాత్రమే ఆకాంక్షించు. అలాగే నీవు ఈ ప్రపంచంలో ఏమి అవుతావో, నీవు ఈ ప్రపంచంలో ఏమి చేయాలో నీ కోసం దానిని (దైవాన్ని) నిర్ణయించనివ్వు. అప్పుడు ఇకపై నీవుఎలాంటి పట్టింపులు లేకుండా, సంపూర్ణంగా సంతోషంగా ఉండవచ్చు.

*CWM 6:248* శ్రీమాత

# విశుద్ధ ఆనందం గురించి తెలుసుకో

"మానవుడు - భగవంతుని కలయిక అనేది ఎల్లప్పుడూ మానవునిలోనికి దైవం యొక్క చొరబాటు లేక ప్రవేశం, దైవత్వంలో మనిషి యొక్క స్వీయ-లీనత అని అర్థం.

"కానీ ఆ లీనమై పోవడం అంటే అంతరించి పోవడం కాదు. అంతరించిపోవడం అనేది ఈ శోధన, తపన, వేదన లేక అమితానంద స్థితి యొక్క ఫలప్రాప్తి కాదు. అదే గనక ముగింపు అయితే ఆట అసలు ఎప్పటికీ ప్రారంభించబడి ఉండదు.

"పరమానందం అనేది రహస్యమైనది. స్వచ్ఛమైన ఆనందం గురించి గనక తెలిసికోగలిగితే నీవు దైవాన్ని గురించి కూడా తెలుసుకుంటావు ...."

-శ్రీ అరొబిందో, థాట్స్ అండ్ గ్లింప్సెస్

ప్ర : శ్రీ మాతా, "స్వచ్ఛమైన ఆనందాన్ని ఎలా తెలుసుకోవాలి"?

ప్రారంభించడానికి అన్నిటికంటే ప్రథమమైనది ఏమిటంటే, శ్రద్ధగల పరిశీలన ద్వారా కోరికలు, కోరికలను తీర్చుకోవడం అనేది అస్పష్టమైన, అనిశ్చిత మోదాన్ని మాత్రమే ఇస్తుంది అని, మిశ్రమంగాఉండి నశించిపోయే గుణం కలిగి, పూర్తిగా అసంతృప్తిని మాత్రమే మిగులుస్తుంది అనే ఎరుకను

పెంపొందించుకోవడం. ఇది సాధారణంగా ప్రారంభస్థానం. అప్పుడు, ఒక వ్యక్తి సహేతుకమైన జీవి అయితే, కోరిక అంటే ఏమిటో తరచి చూడగలగాలి. అలాగే కోరికలను తీర్చుకోవడానికి ఎటువంటి ప్రయత్నం చేయకుండా ఉండాలి. కోరికలను సంతృప్తి పరచడానికి ప్రయత్నించకుండా వాటిని తిరస్కరించాలి. కాబట్టి మొదటి ఫలితం బుద్ధుడు తన బోధనలో పేర్కొన్న మొదటి పరిశీలనలలో ఒకటి: కోరికను సంతృప్తి పరచడం కంటే దానిని జయించడం, తొలగించుకోవడంలో అనంతమైన గొప్ప ఆనందం ఉంది. ప్రతి నిష్కపటమైన, దృఢమైన అన్వేషకుడు కొంత సమయం తరువాత, త్వరగానో లేక నిదానంగానో, కొన్నిసార్లు అతి త్వరగా కూడా, ఇది ఒక సంపూర్ణ సత్యమని, కోరికను అధిగమించడంలో కలిగే ఆనందం చిన్నపాటి మోదం కంటే సాటిలేని విధంగా గొప్పదని తెలుసుకుంటాడు. ఆ కోరికలను సంతృప్తి పరుచుకోవడంలో కలిగే చిన్నపాటి సంతోషాలు చాలా నశ్వరమైనవి, మిశ్రమమైనవని గ్రహిస్తాడు.

అది రెండో అడుగు.

సహజంగానే, ఈ నిరంతర క్రమశిక్షణతో, చాలా తక్కువ సమయంలో కోరికలు దూరమై ఇకపై నిన్ను ఇబ్బంది పెట్టవు. కాబట్టి నీవు నీ ఉనికిలోకి కొంచెం లోతుగా ప్రవేశించడానికి స్వేచ్ఛగా ఉంటావు, ఇంకాపరమానంద ప్రదాతకు, దైవాంశకు, దైవకృప కొరకైన ఆకాంక్షతో నిన్ను నీవు తెరవగలవు. ఇదిచిత్తశుద్ధితో చేసే స్వీయ సమర్పణ - ఏదైనా తనను తాను ఇచ్చుకొంటుంది, ఇచ్చుకొంటూ పోవడానికి ముందుకు వస్తుంది, తాను ఇచ్చిన దానికి బదులుగా ఏమీ ఆశించకపోతే గనక - హృదయాన్ని నింపే, సౌకర్యవంతమైన, సన్నిహితమైన , ప్రకాశవంతమైన ఒక విధమైన మధురమైన వెచ్చదనం మనం అనుభూతి చెందగలం.

దీని తరువాత, మార్గం సులభం.

ప్రతిదానిలో, ప్రతి వస్తువులో, ప్రతి కదలికలో, ప్రతి స్పందనలో, మనుషులు, చేతన జీవులు మాత్రమే కాకుండా, వస్తువులు, వస్తువులు చుట్టూ ఉన్న అన్ని విషయాలలో చెట్లు మరియు మొక్కలు, జీవులు మాత్రమే కాదు, ఎవరైనా ఉపయోగించే ఏదైనా వస్తువు, ఒకరి చుట్టూ ఉన్న వస్తు సముదాయంలో సైతం ఈ ఆనందాన్ని చూడవచ్చు, ఈ ఆనందం, కేవలం ఉండటం, మనం ఎలా ఉన్నామో అలాగే ఉండటం. అలాగే ఇదంతా అలా

ఆనందంతో స్పందించడం కనిపిస్తుంది. ఒకరు ఒక వస్తువును తాకి, ఈ ఆనందాన్ని అనుభవించవచ్చు. కానీ సహజంగానే, నేను మొదట్లో మాట్లాడిన క్రమశిక్షణను అనుసరించి ఉండాలి లేకపోతే, ఒక వ్యక్తికి కోరిక, ప్రాధాన్యత, అనుబంధం లేదా ఆకర్షణ వికర్షణలు ఇలాంటివన్నింటినీ కలిగి ఉన్నంత వరకు, ఇది సాధ్యం కాదు, సాధ్యం కాదు.

మరియు ఒక వ్యక్తి ఒక వస్తువులో సుఖాలు-అవును, ప్రాణికమైన లేదా భౌతికమైన సుఖాన్ని పొందినంత కాలం, ఈ ఆనందాన్ని అనుభవించలేడు. ఈ ఆనందం ప్రతిచోటా ఉంది. ఈ ఆనందం చాలా సూక్ష్మమైనది. ఒక వ్యక్తి వస్తువుల రాశి మధ్యలో మెదులుతూ ఉంటే, అవి తమ ఆనందాన్ని నీకు పాడి వినిపించినట్టుగా ఉంటుంది. నీ చుట్టూ ఉన్న జీవులలో ఇది బాగా సుపరిచితం అయ్యే సమయం వస్తుంది. వాస్తవానికి, మానవులలో అనుభూతి చెందడం కొంచెం కష్టమని నేను అంగీకరించాలి, ఎందుకంటే వారి మానసిక, ప్రాణికమైన నిర్మాణాలన్నీ అవగాహన రంగంలోకి వచ్చి దానిని భంగ పరుస్తాయి. ఈ రకమైన అహంకార సంబంధమైన అస్పష్టత చాలా ఎక్కువగా ఉండి, ఇది విషయాలతో కలిసిపోతుంది, కాబట్టి అక్కడ ఆనందాన్ని చవిచూడటం చాలా కష్టం. కానీ జంతువులలో కూడా ఆ ఆనందాన్ని అనుభూతి చెందవచ్చు, ఇది ఇప్పటికే మొక్కలలోకంటే ఇంకా కొంచెం కష్టం. కానీ మొక్కలలో, పువ్వులలో, ఈ ఆనందం చాలా అద్భుతంగా ఆవిష్కృతమైంది! అవి తమ ఆనందాన్ని అంతటా వ్యక్తపరుస్తాయి. నేను చెప్పినట్లు, నీవు ఉపయోగించే అన్ని సుపరిచిత వస్తువులలో, నీ చుట్టూ ఉన్న వస్తువులలో, ప్రతి దానిలో ఆనందంగా ఉండే చైతన్యం ఉంది. ఆ ఆనందంలో ప్రతి వస్తువు తాను ఉండడం లోనే, ఎలా ఉంటే అలా ఆ ఆనందాన్ని అనుభవిస్తున్నాయి. కాబట్టి ఆ క్షణంలో మనం ఒక నిజమైన ఆనందాన్ని స్పృశించామని మనకు తెలుస్తుంది.

ఇది షరతులతో కూడుకున్నది కాదు. నా ఉద్దేశ్యం ప్రకారం అది ఆధారపడి ఉండదు... దేనిపైనా ఆధారపడదు. ఇది బాహ్య పరిస్థితులపై ఆధారపడదు, ఎక్కువ లేదా తక్కువ అనుకూలమైన స్థితిపై ఆధారపడదు, ఇది దేనిపైనా ఆధారపడదు: ఇది విశ్వం ఉనికి యొక్క ఉద్దేశ్యంతో మమేకం కావడం.

ఇటువంటి ఆనందం వచ్చినప్పుడు అది శరీరంలోని అన్ని కణాలను నింపుతుంది. ఇది ఆలోచించే విషయం కూడా కాదు, దీనిని గురించి తర్కించలేం, విశ్లేషించలేం, ఇది అటువంటిది కాదు: ఇది ఒక వ్యక్తి జీవించే స్థితి. శరీరం దానిలో పాలుపంచుకున్నప్పుడు, అది చాలా తాజాగా ఉంటుంది- చాలా తాజాగా ఉంటుంది, చాలా స్వచ్ఛందంగా ఉంటుంది, కాబట్టి... అది ఇకపై తిరిగి తనవైపుకు వెళ్లదు, స్వీయ-పరిశీలన, స్వీయ-విశ్లేషణ లేదా విషయాలను విశ్లేషించే భావం ఇకపై ఉండదు. అదంతా ఆనంద ప్రకంపనల ఖండంలా ఉంటుంది, కానీ చాలా చాలా నిశ్శబ్దంగా, హింసలేకుండా, ఉద్వేగంలేకుండా, అటువంటిది ఏదీ లేకుండా ఇది చాలా సూక్ష్మంగా, అదే సమయంలో చాలా తీవ్రంగా కూడా ఉంటుంది, అలాగే అది వచ్చినప్పుడు, మొత్తం విశ్వం ఒక అద్భుతమైన సామరస్యంతో నిండి కనిపిస్తుంది. సాధారణ మానవస్పృహకు వికారమైన, అసహ్యకరమైనది కూడా అద్భుతంగా కనిపిస్తుంది.

దురదృష్టవశాత్తూ, నేను చెప్పినట్లుగా, ప్రజలు, పరిస్థితులు ఇటువంటివన్నీ, మానసికప్రాణిక ఆకృతులన్నిటితో పాటు ఆ ఆనందాన్ని ఎల్లప్పుడూ భంగపరుస్తూ ఉంటాయి. అప్పుడు ఈ అజ్ఞాన, అంధ గ్రహణశక్తికి తిరిగి రావాల్సిన అవసరం ఉంది. అయితే, ఇవన్నీ ఆగి, దాని నుండి బయటపడిన వెంటనే.. ప్రతిదీ మారుతుంది. ఎవరో అన్నట్లుగా,చివరికి ప్రతిదీ మారుతుంది. అద్భుతమైన సామరస్యం. ఇంకా ఇదంతా ఒక దివ్యానందం, నిజమైన దివ్యానందం, సత్యమైన దివ్యానందం.

దీనికి కొంచెం పని అవసరం.

నేను మాట్లాడిన ఈ క్రమశిక్షణను ఒక మనిషి తప్పక పాటించాలి, ఆనందాన్ని కనుగొనే లక్ష్యంతో సాధన చేస్తే, ఫలితం ఆలస్యం అవుతుంది, ఎందుకంటే అహంకార సంబంధమైన అంశం దానిలో ప్రవేశించింది, ఇది ఒక లక్ష్యంతో చేయబడుతుంది గనక అది సమర్పణా భావంతో చేసింది కాదు, అది ఒక కోరిక, ఆపై.... అది వస్తుంది, ఇది వస్తుంది, సమయం ఎక్కువ తీసుకున్నా సరే (అనుకుంటారు) - ఒకరు ఏమీ అడగనప్పుడు, ఏమీ ఆశించనప్పుడు, ఏదో వస్తుందనే ఆశ లేనప్పుడు, అలా సరళంగా ఉన్నప్పుడు, అది తనను తాను ఇచ్చుకోవడం, అది ఒక ఆకాంక్ష, మరియు ఎటువంటి బేరసారాలు లేకుండా ఉండే స్వచ్ఛందమైన ఆవశ్యకత- దైవంగా ఉండాలనుకునే ఆవశ్యకత, అంతే.

*CWM 9: 20-23* — *శ్రీమాత*

ప్రకరణం 3 :

# ప్రశాంతంగా జీవించడం

## ప్రశాంతత

ప్రశాంతత, ప్రశాంతత, ఒక స్థిరత, ఏకాగ్ర శక్తి, ఏదీ కదిలించలేని నిశ్చలత - ఇది సమగ్ర సాక్షాత్కారానికి అనివార్యమైన ఆధారం.

*

కచ్చితంగా ప్రశాంతంగా ఉండటం తమస్సు కాదు. నిజానికి ప్రశాంతతలో మాత్రమే సరైన పని చేయవచ్చు. దేనికీ భంగం కలగకుండా పని చేయడాన్ని దేనికీ భంగం కలగకుండా ప్రతి విషయాన్ని గమనించడాన్ని నేను ప్రశాంతత అంటాను.

*

నీవు ప్రశాంతంగా ఉన్నప్పుడు దివ్య శక్తి, సహాయం, రక్షణ ఎల్లప్పుడూ నీతో ఉన్నట్లు భావిస్తావు.

*

నీవు చేయవలసింది ఒక్కటే, అచంచలంగా, కలవరపడకుండా, కేవలం దైవం వైపు మళ్లడం, మిగిలినది ఆయన చేతుల్లోనే ఉంది.

*

నిశ్చలత, శాంతి, నిశ్శబ్దాలలోనే ఆధ్యాత్మిక శక్తులు పనిచేస్తాయి. ఆందోళనలు, ఉద్రేకాలన్నీ ప్రతికూల ప్రభావం నుండి వస్తాయి.

*

నీవు ప్రశాంతత కోసం వెతకాల్సింది బాహ్య పరిస్థితులలో కాదు, నీ లోపల వెతకాలి. ప్రతి వ్యక్తి లోపల లోతైన శాంతి ఉంది, దానిని నీవు అనుమతించినట్లయితే, మొత్తం శరీరాన్ని అంతా ప్రశాంతతతో నింపి వేస్తుంది.

నీవు ఆ శాంతిని అన్వేషించాలి, అప్పుడు నీవు కోరుకున్న ప్రశాంతత నీకు లభిస్తుంది.

*CWM 14: 135, 142 - 145*

ఒత్తిడి నిరంతరం ఉంటుంది. నాకు ప్రశాంతతను ఇవ్వండి, నా మాధుర్యమయి మాత!

నేను నీపై శాంతిని, నిశ్చలతను, ప్రశాంతతను కురిపించడాన్ని ఎప్పుడూ ఆపను, నీవు వాటిని ఎందుకు స్వీకరించవు?

శాంతిని, ప్రశాంతిని, స్థిరతను స్వీకరించడానికి నేను ఏమి చేయాలి?

వాటిని హృదయపూర్వకంగా, సమగ్రంగా కోరుకోవాలి - నీ ఉనికిలోని ఒక భాగంతో మాత్రమే కాదు.

*CWM 17:60*

నీవు అనుకుంటున్నట్లుగా నీవు నాకు దూరంగా లేవు. నీవు నీ మనసులోని, ప్రాణికంలోని ఆందోళనను కొంత శాంతపరిచి, కొంతైనా ప్రశాంతితో, ఏకాగ్రతతో ఉంటే తక్షణం నీ చుట్టూ నా ఉనికిని నీవు కనుగొంటావు.

*CWM 17:68-69*

అతను తన మనస్సును నిశ్చలంగా ఉంచుకుని, తన హృదయాన్ని నిశ్చలంగా ఉంచుకుంటే, అతను పరిస్థితిని ఎదుర్కొనగలడు.

*CWM 16:125*

బలమైన వ్యక్తి ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటాడు. బలహీనతే అశాంతికి కారణం.

*CWM 17-413* — *శ్రీమాత*

అంతటా భగవంతుని సార్వభౌమ చింతనకు సంబంధించిన మార్పులేని శాంతి, మార్పులేని దివ్య శాశ్వతత్వానికి సంబంధించిన స్థిరమైన దృష్టి కొరవడింది.

*CWM 16:125* — *శ్రీమాత*

## "వ్యక్తి స్థిరంగా ఉండాలి" అన్నదానికి అర్థం.

ఈ పదాల ద్వారా నా ఉద్దేశ్యం ఏమిటని ఎవరో నన్ను అడిగారు: "వ్యక్తి ప్రశాంతంగా, స్థిరంగా ఉండాలి."

నేను ఎవరికైనా, "స్థిరంగా ప్రశాంతంగా ఉండండి" అని చెప్పినప్పుడు, నేను వ్యక్తిని బట్టి అనేక విభిన్న విషయాలను సూచిస్తున్నాను. కానీ మొదటి

అనివార్య స్థిరత్వమే మానసిక నిశ్చలత, ఎందుకంటే సాధారణంగా అది బాగా కొరవడుతుంది. నేను ఎవరికైనా, "ప్రశాంతంగా ఉండండి" అని చెప్పినప్పుడు, నా ఉద్దేశ్యం: విరామం లేని, ఉద్వేగభరిత, ఉద్రేకపూరితమైన ఆలోచనలు రాకుండా ప్రయత్నించడం, నీ మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి ప్రయత్నించు, నీ ఊహలలో, పరిశీలనలో, మానసిక నిర్మాణాలలో విహరించడం మానివేయి.

ఒక వ్యక్తి న్యాయబద్ధంగా ఒక ప్రశ్నను జోడించవచ్చు: మీరు మాకు "స్థిరంగా ప్రశాంతంగా ఉండండి" అని చెప్తారు, కానీ ప్రశాంతంగా ఉండాలంటే మేము ఏమి చేయాలి?... సమాధానం ఎప్పుడూ కొంచెం అటూ ఇటూగా ఒకేలా ఉంటుంది: మొదట నీవు స్థిరత్వం యొక్క అవసరాన్ని అనుభూతి చెంది, దానిని కోరుకోవాలి, ఆపై దానిని ఆకాంక్షించి ప్రయత్నించాలి! ప్రయత్నించడానికి, అనేకమంది సూచించినవి, అనేకమంది ఆచరించినవి అసంఖ్యాక పద్ధతులు ఉన్నాయి. ఈ పద్ధతులు సాధారణంగా పొడవైనవి, కఠిన ప్రయాసతోకూడినవి, కష్టమైనవి. చాలా మంది వ్యక్తులు లక్ష్యాన్ని చేరుకోకముందే నిరుత్సాహపడతారు, ఎందుకంటే, వారు ఎంత ఎక్కువగా ప్రయత్నిస్తే, వారి ఆలోచనలు అంత ఎక్కువగా మనసులో తిరుగుతాయి, అందువలన వారి మెదడు ఆందోళనలతో ఉంటుంది.

ప్రతి ఒక్కరికి పద్ధతి భిన్నంగా ఉంటుంది, కానీ నిశ్చల ప్రశాంతతను కోరుకోవడానికి కారణం ఏదైనా కావచ్చు - వ్యక్తి అలసిపోయినందున / అతిగా ఒత్తిడితో ఉన్నందున / వ్యక్తి నిజాయితీగా తాను ఉన్న స్థితిని దాటి పైకి ఎదగాలని కోరుకుంటున్నందున - మొదటిగా వ్యక్తి ప్రశాంతతకు తగ్గ కారణాన్ని తప్పనిసరిగా అనుభూతి చెంది అర్థం చేసుకోవాలి, అంటే మనస్సులో ఈ నిశ్చల శాంతి యొక్క అవసరాన్ని అనుభూతి చెందాలి. ఆపై, ఫలితాలను సాధించడానికి, తెలిసిన, ఇంకా కొత్త పద్ధతులన్నింటినీ వరుసగా ప్రయత్నించవచ్చు.

అప్పుడు వ్యక్తి మరొక రకమైన ప్రశాంతత అవసరమని, బాగా అవసరమని వెంటనే గ్రహిస్తాడు - ఇది ప్రాణిక ప్రశాంతత, అంటే కోరిక లేకపోవడం. వ్యక్తిలోని ప్రాణిక భాగం తగినంతగా అభివృద్ధి చెందనప్పుడు, నిశ్చలంగా ఉండమని చెప్పిన వెంటనే, అది నిద్రపోతుంది లేకపోతే సమ్మె చేస్తుంది.

అది ఏం చెబుతుందంటే, "ఆ! లేదు. ఏమీ కుదరదు! నేను ఎటువంటి సహాయం చేయను. నీవు నాకు అవసరమైన పోషకాన్ని అంటే ఉత్సాహాన్ని, కామనను, పెను ఆశను కల్గించక పోతే నేను నిష్క్రియంగా ఉండటానికి చూస్తాను, ఇకపై నేను ఏమీ చేయను. కాబట్టి అక్కడ సమస్య కొంచెం సున్నితంగా మారుతుంది, బహుశా ఇంకా కష్టమవుతుంది. వాస్తవానికి, ఉత్సాహం నుండి జడత్వంలోకి పడిపోవడం, అనేది పురోగతి నుంచి దూరంగా వెళ్లడమే! జడత్వం లేదా నిశ్చల నిష్క్రియాత్మకతను నిశ్చల శాంతిగా అని ఎప్పుడూ పొరబడకూడదు.

నిశ్చల ప్రశాంతత చాలా సానుకూల స్థితి. సంఘర్షణకు వ్యతిరేకం కాని సానుకూల శాంతి ఉంటుంది - చురుకైన శాంతి, అంటుకొని ఉండే తత్వాన్ని కలిగినది, శక్తివంతమైనది, ఇది నియంత్రిస్తూ స్థిర శాంతితో ఉంచుతుంది, ఇది ప్రతి దానిని క్రమబద్ధీకరిస్తూ వ్యవస్థీకరిస్తుంది. నేను అటువంటి ప్రశాంతతను గురించి మాట్లాడుతున్నాను. నేను ఎవరికైనా, "శాంతంగా స్థిరంగా ఉండు" అని చెప్పినప్పుడు, "వెళ్లి పడుకో, జడంగా నిష్క్రియంగా ఉండు, ఏమీ చేయకు" అని చెప్పడం నా ఉద్దేశ్యం కాదు, నేను చెప్పే ప్రశాంతత నిష్క్రియత్వానికి చాలా దూరంగా ఉంటుంది!... నిజమైన నిశ్చల శాంతి చాలా గొప్ప శక్తి, చాలా గొప్ప బలం. వాస్తవానికి బలంగా, శక్తివంతంగా ఉన్న వారందరూ సమస్యను మరొక వైపు నుండి చూస్తూ, ఎల్లప్పుడూ చాలా స్థిరంగా ఉంటారని చెప్పవచ్చు. బలహీనులు మాత్రమే ఆందోళన చెందుతారు. వ్యక్తి నిజంగా బలంగా మారిన వెంటనే, అతడు నిశ్చలంగా, ప్రశాంతంగా, ఉంటాడు. తనను ఆందోళన పరచాలి అనే ఆశతో బయటి నుంచి పరిగెత్తుకు వచ్చే ప్రతికూల తరంగాలను ఎదుర్కొనే శక్తితో ఉంటాడు. ఈ వాస్తవిక ప్రశాంతత ఎల్లప్పుడూ శక్తికి సంకేతం. ప్రశాంతత బలవంతుడిదే.

భౌతిక ప్రపంచంలో కూడా ఇది నిజం. నీవు సింహాలు, పులులు, ఏనుగులు వంటి జంతువులను గమనించావో లేదో నాకు తెలియదు, కానీ అవి ఏ పని చేయనప్పుడు, చాలా పరిపూర్ణమైన నిశ్చలతతో ఉంటాయి. ఒక సింహం నీ వైపు కూర్చుని చూస్తూ, "ఓహ్, నీవు ఎంత చంచలంగా ఉన్నావు!" అని చెప్తున్నట్లుగా ఉంటుంది. అది ప్రశాంత జ్ఞానంతో నిన్ను చూస్తోంది!, అది దాని ఊర్జాన్ని, శక్తిని, శారీరక బలాన్ని అన్నిటినీ కూడగట్టుకొని, కేంద్రీకరిస్తుంది.

- ఆందోళన రవ్వంతైనా లేకుండా - ఆజ్ఞ ఇచ్చినప్పుడు పనిలోకి దూకడానికి సిద్ధంగా ఉంటుంది.

అరగంట పాటైనా కదలకుండా కూర్చోలేని వ్యక్తులను చాలా మందిని నేను చూశాను. వారు పాదాన్నో, కాలునో, చేతినో, అదీ కాకపోతే వారి తలనో కదిలించాల్సి వచ్చేది. ప్రశాంతతగా ఉండగల శక్తి, బలం వారికి లేనందున వారు ఎప్పుడూ విరామం లేకుండా అటూ ఇటూ కదులుతూ ఉండేవారు.

ప్రశాంతంగా ఉండగల ఈ సామర్థ్యం అంటే, ఒక వ్యక్తి కోరుకున్నప్పుడు తన శక్తులన్నింటినీ సమీకరించి, తాను కోరుకున్నట్లు వాటిని ఖర్చు చేయడం, తాను కోరుకున్నట్లుగా, పని చేస్తున్నప్పుడు కూడా పరిపూర్ణ స్థిరత్వంతో వాటిని విభజించడం- ఇది ఎప్పుడూ బలానికి చిహ్నం. అది శారీరక బలం కావచ్చు లేదా ప్రాణిక బలం కావచ్చు లేదా మానసిక బలం కావచ్చు. కానీ నీవు రవ్వంత ఉద్రేకంలో ఉంటే, ఎక్కడో బలహీనత ఉందని చెప్పవచ్చు. నీ చంచలత్వం అన్ని విధాలుగా ఉంటే, బలహీనత కూడా అంతే సమగ్రంగా ఉంటుంది.

*CWM 8: 328-330* — శ్రీమాత

## మానసిక ప్రశాంతత

నిశ్చల నిశ్శబ్దత ఎప్పుడూ మంచిదే కానీ నా ఉద్దేశం ప్రకారం మానసిక ప్రశాంతతే సంపూర్ణ నిశ్శబ్దత కాదు. నా ఉద్దేశ్యంలో ఆటంకాలు, ఇబ్బందులు లేని మనస్సు, స్థిరంగా, తేలికగా, ఆనందంగా ఉంటుంది, తద్వారా స్వభావాన్ని మార్చే మహా శక్తికి తెరవబడుతుంది. ముఖ్య విషయం ఏమిటంటే ఇబ్బందికర ఆలోచనలు, తప్పు భావాలు, తికమక పెట్టే ఆలోచనలు, బాధాకర సంఘటనల దాడుల నుంచి బయటపడటం. ఇవి స్వభావాన్ని మసకబార్చి దానిని పూర్తిగా ఆక్రమిస్తాయి తద్వారా మహా శక్తి చేసే కార్యాన్ని కష్టతరం చేస్తాయి. మనస్సు నిశ్చలంగా, ప్రశాంతంగా ఉన్నప్పుడు, ఆ మహా శక్తి మరింత సులభంగా పని చేస్తుంది. నీవు కలత లేదా నిరాశ చెందకుండా నీ లోపల మార్చవలసిన విషయాలను చూడగలగాలి. అప్పుడు మార్పు మరింత సులభంగా చేయబడుతుంది.

స్థిరంగా, స్థిమితంగా ఆత్మలో స్థిరంగా ధీరత్వంతో ఉండటమే ఈ మానసిక ప్రశాంతత, బాహ్య ప్రకృతి నుండి అంతః పురుషుని వేరుచేయడంలో చాలా సహాయకారిగా ఉంటుంది, ఇది దాదాపు అనివార్యం కూడా. వ్యక్తి ఆలోచనల సుడిగుండం లేదా ప్రాణిక కదలికల గందరగోళానికి లోబడి ఉన్నంత కాలం, అతను ప్రశాంతంగా, ఆత్మలో స్థిరంగా ఉండలేడు. తనను తాను విడిచిపెట్టడం, అంటే తనలోని మిగిలిన భాగాల నుండి వెనుకకు మళ్లడం, వాటిని తన నుంచి వేరుగా భావించడం అనివార్యం.

*CWSA 29 : 160*

నీ సాధన కోసం ఏది సరైనది అని మనస్సు ఎలా కనుగొనగలదు లేదా ఎలా నిర్ణయించగలదు? నీ మనసు ఈ దిశగా ఎంత క్రియాశీలంగా ప్రయత్నిస్తుందో అంత గందరగోళం లోపల ఏర్పడుతుంది. సాధనలో మనస్సు ప్రశాంతంగా ఉండాలి, దైవం పట్ల ఆకాంక్షతో స్థిరంగా ఉండాలి - నిజమైన అనుభవం, పరివర్తన లోపలి మానసిక ప్రశాంత స్థితిలో లోపల నుండి, పైనుండి ఏర్పడుతుంది.

నీ మనస్సును శాంతింప చేయడం అంటే నీకు భంగం కలిగించే విషయాల గురించి ఆలోచించడం మానేయడం, శాంతి శక్తులు తమకు తాము నీలో వ్యక్త మయ్యి పని చేయనీయడం. “లోపల నివసించడం” అన్నది స్వయంగా వస్తుంది - అంటే, నీవు అంతర్గత శాంతిని, దానితో వచ్చే చేతనను మరింతగా నీ స్వరూపంగా, మిగతావన్నీ బాహ్యమైనవిగా, ఉపరితలంలోనివిగా అనుభూతి చెందుతావు.

భగవత్ శక్తి మీద, దాని కార్యం మీద విశ్వాసం లేకపోతే, ఈ యోగం చేసే అవకాశం లేదు. ఒక వ్యక్తి మానసిక తలం అంటే మనసు వేసే ప్రశ్నలు ఆలోచనలలో మాత్రమే జీవిస్తే, ఈ యోగం సాధ్యం కాదు. యోగ సామర్థ్యానికి పరీక్ష ఏమిటంటే, మనస్సును శాంతింప చేయడం, తనలో ఒక గొప్ప దైవిక శక్తిని, మదర్ శక్తిని అనుభవించడం, శక్తిని విశ్వసిస్తూ ప్రకృతిలో దాని కార్యానికి విరుద్ధంగా ఉన్న ప్రతిదాన్ని తిరస్కరించడం ద్వారా దాని పనితీరుకు సహాయం చేయడం.

*CWSA 31 : 27 - 28* — *శ్రీ అరవిందులు*

ప్రకరణం 4 :

# చేయగలిగినంత చక్కగా పనిచేయడం

## పనిమొత్తం ఒక అనుభవ పాఠశాల

నీవు ఏమీ చేయకపోతే, నీకు ఎలాంటి అనుభవం కలుగదు. జీవితమంతా ఒక క్షేత్రం. నీవు చేసే ప్రతి చర్య, నీకు కలిగే ప్రతి ఆలోచన, నీవు చేసే ప్రతి పని, ఒక అనుభవం కావచ్చు, తప్పనిసరిగా అది అనుభవం అవుతుంది. సహజంగా పని అనేది ఒక అనుభవ క్షేత్రం. కాబట్టి అంతర్ముఖం అయ్యేందుకు కావలసిన సమస్త పురోగతి కొరకు ఈ అనుభవాల మైదానాన్ని ఉపయోగించుకోవాలి.

నీవు చేసే పనిని సరిగా చేయక చింతనలో, ధ్యానంలో ఉండిపోయినట్లైతే నీవు పురోగతి సాధించావో లేదో నీకు తెలియదు. నీవు భ్రమలో ఉంటావు. పురోగతి సాధించాను అన్న భ్రమలో ఉంటావు. నీవు పనిచేయడం ప్రారంభించినట్లైతే నీ పనికి సంబంధించిన అన్ని పరిస్థితులు, ఇతరులతో నీ సంబంధాలు, భౌతిక పరిస్థితులు అంతా ఒక అనుభవక్షేత్రమౌతుంది. దీని ద్వారా నీవు సాధించిన పురోగతి, సాధించవలసిన అభివృద్ధిని గూర్చి తెలుసుకొంటావు. పని చేయకుండా నీలో నీవు నిమగ్నుడవై వున్నట్లైతే నీవు పూర్తిగా నీ కల్పిత భ్రమలోనే ఉంటావు. ఏ క్షణమైతే నీవు నీ చర్యలను బహిర్గతం చేసి ఇతరులతో, పరిస్థితులతో, భౌతిక వస్తుజాలంతో సంపర్కంలోకి వస్తావో, అప్పుడు నీవు ఖచ్చితంగా పురోగతిని సాధించావో లేదో నీకు తెలుస్తుంది. పని చేయడం ద్వారా, నీవు మరింత ప్రశాంతంగా, చైతన్యవంతంగా, దృఢంగా, నిస్వార్థంగా ఉన్నావా, ఎలాంటి బలహీనతలు, కోరికలు, ప్రాముఖ్యతలు, ఎలాంటి అవిశ్వాసం లేకుండా ఉన్నావా అనేది అంతా నీవు క్రియాశీలుడిగా ఉన్నప్పుడే గమనించగలవు. నీవు పూర్తిగా వ్యక్తిగతమైన ధ్యానంలో నిమగ్నమైతే, నీవు పూర్తిగా భ్రమలో ఉండవచ్చు. దానినుండి ఎప్పటికీ బయటకు రాలేవు. నీవు అసాధారణ విషయాలను గ్రహించానని విశ్వసిస్తావు. ఆ ధ్యాన నిమగ్నతలో జరిగేది కేవలం ఊహాత్మకమైన ఆభాస మాత్రమే. ఆ విధంగా నీవు కల్పించుకొనేది భ్రమనే.

*CWM 7 : 287 - 288*

బాహ్య జీవితం, నిత్యం జరిగే క్రియాకలాపం, ప్రతిక్షణం మేం చేసే గంటలపాటు ధ్యానానికి, చింతనకు సంబంధించిన అత్యావశ్యకమైన సంపూరకం కాదా? ప్రతి ఒక్కరికి ఇవ్వబడిన సమయం సాక్షాత్కారానికి, దానికోసం సంసిద్ధమవడానికి చేయబడే ప్రయత్నానికి మధ్యలో ఉన్న ఖచ్చితమైన దామాషా కాదా? ధ్యానం, ఏకాగ్ర చింతనకు ఐక్యతే ఫలితంగా లభిస్తుంది. పుష్పమన్నది వికసిస్తుంది; మా నిత్య కార్యకలాపం (కమ్మరి దగ్గర ఉండే) దాగలి లాంటిది. దాని ద్వారానే ధాతువులన్నీ చింతన అందించే ఉద్దీపన కోసం శుద్ధీకరింపబడేందుకు, పరిశుద్ధతను పొందేందుకు నిలపబడాలి, దాని ప్రభావానికి లోనుకావాలి. ఆ ధాతువులన్నీ సమగ్రాభివృద్ధి కోసం బయట కార్యకలాపం అవసరం లేకుండా పోయే మునుపే ఒక దాని తరువాత ఒకటిగా దాగలిపై విశుద్ధీకరించబడాలి. ఉద్దీపన, రూప నిర్మాణమనే ద్వైత కార్యానికి చేతనకు సంబంధించిన అన్ని కేంద్రాలు మేల్కొనడానికి ఈ క్రియాకలాపం నిన్ను అవతరింప చేయడానికి సాధనంగా మళ్ళుతుంది. కాబట్టి అహంకార దర్పం, సంతృప్తి అనేవి తుచ్ఛ అవరోధాలు. చాలా అణుకువతో అసంఖ్యాక ధాతువుల్లో, కొన్నింటిని శుద్ధి చేసి, రూపు దిద్దుకొనేందుకు లభించే చిన్న చిన్న అవకాశాల వల్ల కల్గే ప్రయోజనాన్ని పొందాలి. ఆ ధాతువుల్ని, అనువుగా మార్చి, వ్యక్తిగత నిరపేక్షంగా చేయడానికి, స్వార్థ విస్మరణను, పరిత్యాగాన్ని వాటికి బోధపర్చి, సౌమ్యతను, కారుణ్యాన్ని, భక్తిని వాటిలోనే పెంపొందించాలి. ఎప్పుడైతే ఈ వ్యక్తి ఉనికిలోని వైఖరులన్నీ వాటికి అలవాటైపోతాయో అప్పుడివి చింతనలో పాల్గొనడానికి, పరమ ఏకాగ్రతలో నీతో వాటిని అవి తాదాత్మ్యం చేసుకోవడానికి సంసిద్ధమౌతాయి. అందుకే ఆకర్షణీయమైన మార్పులు సమగ్రమవ్వకపోయినా, ఇది శ్రేష్ఠమైనదై మందకొడిగా, సుదీర్ఘంగా సాగే కార్యంగా నాకు అనిపిస్తుంది. అవి వ్యక్తికి సంబంధించిన దిశాజ్ఞానాన్ని మార్చుతాయి. ఖచ్చితంగా ఋజుమార్గంలో పెడతాయి. కాని లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రతి క్షణం, అన్ని విధాలా, అసంఖ్యాకమైన అనుభవాల అవసరాన్ని మనిషి తప్పించుకోలేడు.

*CWM 1 : 6 - 7* — శ్రీమాత

పని యోగ సాధనలో భాగం. అది ఈ ప్రాణికానికి దాని క్రియాకలాపాల్లోకి శక్తిని, ప్రకాశాన్ని భగవత్ సన్నిధిని ఆహ్వానించడానికి గాను ఉత్తమ అవకాశాన్ని అందిస్తుంది. అది సమర్పణ అవకాశాన్నీ, క్షేత్రాన్ని విస్తరింపచేస్తుంది.

*CWM 32 : 247* — శ్రీఅరవిందులు

# వికాసశీలమైన పరిపూర్ణత

తన స్వంత వ్యక్తిగత ఇష్టాలను తన లక్ష్యంగా పెట్టుకోకూడదు. ఇదే మొదటి నియమం.

నిర్భయత్వం, ధైర్యం, పట్టుదల అనేవి కావలసిన ప్రాథమిక లక్షణాలు.

తెల్సుకోవల్సిన దానితో పోలిస్తే తనకు ఏమీ తెలియదని, చేయవలసిన దానితో పోలిస్తే తాను ఏమీ చేయలేదని, ఉండవలసిన దానితో పోలిస్తే, తాను ఏమీ కాదు అనే స్పృహతో వ్యక్తి

ఉండాలి.

తన స్వభావంలో ఏమి లోపించిందో, దాన్ని పొందాలన్నా, ఇప్పటివరకు తనకు తెలియని దాన్ని గురించి తెలుసుకోవాలన్నా, ఇంతవరకు తాను సాధించలేని దాన్ని సాధించాలన్నా వ్యక్తిలో ఒక దృఢమైన సంకల్పం ఉండాలి.

వ్యక్తిగత కోరికలు లేకపోవడం వలన జనించే శాంతి, ప్రకాశాలతో నిరంతరం పురోగమించాలి.

ప్రతిక్షణం మంచిగా పురోగమించడాన్ని ఒక ప్రణాళికగా తీసుకోవాలి.

దైవాన్ని తెలుసుకొని, దైవాన్ని అవతరింపజేయడమే ఏకైక లక్ష్యంగా తీసుకోవాలి.

సహనంతో కూడిన పట్టుదలతో ఉండు. నీవు ఈ రోజు సాధించలేక పోయింది, రేపు సాధించగలవు.

*CWM 16 : 430*

సమస్యకు తగిన సమాధానం మన దగ్గర ఉంది. ప్రతి నిమిషం ఒక ఆకాంక్షతో నీ సంకల్పం యొక్క బహుమతిని తయారు చేసుకోవచ్చు. ఒక ఆకాంక్ష దానికదే చాలా సరళంగా, ఏదో “ఓ ప్రభూ నీ ఇచ్ఛయే జరుగుగాక”, అని మాత్రమే కాక “నేను ఎంత అత్యుత్తమంగా చేయగలనో అంత పనిని నాకు అనుగ్రహించు” అని స్పష్టపర్చుకొంటుంది.

ప్రతిక్షణం ఏది అత్యుత్తమమైనదో నీకు తెలియకపోవచ్చు లేదా ఎలా చేయాలో తెలియకపోవచ్చు. కాని సాధ్యమైనంత శ్రేష్ఠమైనదే కావాలని, శ్రేష్ఠమైనదే చేయాలని నీ ఇచ్ఛను దైవానికి సమర్పించు.

అద్భుతమైన ఫలితాలను నీవు చూస్తావు. చేతనతో, నిజాయితీ, పట్టుదలతో దానిని చెయ్యి. నిన్ను నీవు భారీ అంగలతో పురోగమిస్తున్నట్లు గమనిస్తావు. తన అంతరాత్మలో పూర్తి

ఉత్సాహంతో, తన పూర్తి సంకల్పబలంతో పనులు చేయాలి. ప్రతిక్షణం శ్రేష్ఠంగానే చేయాలి, అత్యుత్తమంగా చేయాలి. ఇతరులు చేసేదాంతో మనకు సంబంధం లేదు. దీనిని నేను మళ్ళీ మళ్ళీ పునరావృతం చేసి చెప్పలేను.

ఎప్పుడూ, "ఫలానా వారు దీనిని చేయలేరు, వారు వేరే విధంగా చేస్తారు. అతడు చేయకూడని దానిని చేస్తాడు" అని చెప్పకు - అది నీకు అనవసరమైన విషయం.

ఈ శరీరాన్ని వీలైనంత సచేతనంగా ఉంచుతూ, దానిని పరమాత్మ యొక్క అత్యంత పరిపూర్ణమైన, అత్యంత చైతన్యవంతమైన సాధనంగా మార్చడం కొరకు నీవు భౌతిక శరీరంతో ఈ భూమిపై ఉన్నావు. దైవం నీకు మానసిక, ప్రాణిక, భౌతిక తలాలతో కూడిన సారద్రవ్యాన్ని ఆయన ఆశించేదానికి దామాషా పద్ధతిలో ఇచ్చాడు. నీ చుట్టూ ఉన్న పరిస్థితులన్నీ కూడా ఆయన నీ నుండి ఆశించే దానికి దామాషాగానే ఉన్నాయి. ఎవరైతే నీతో "నా జీవితం చాలా అధ్వాన్నంగా ఉంది, నేను చాలా దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నాను" అని అంటారో, వాళ్లు గాడిదలు! ప్రతి ఒక్కరికి సంపూర్ణ అభివృద్ధికి తగిన జీవితమే ఉన్నది, తన సంపూర్ణ అభివృద్ధికి దోహదం చేసే అనుభవాలే అతని ముందున్నాయి. తన సంపూర్ణ సిద్ధికి సహాయం చేసే కష్టాలే ప్రతి ఒక్కరి విషయంలో ఉన్నాయి.

*CWM 4 : 117-18* శ్రీమాత

నీవే పని చేసినా, ఎంత పరిపూర్ణంగా చేయగలవో అంత పరిపూర్ణంగా చెయ్యి. అది మనిషిలోని పరమాత్మకు చేసే సేవ.

నీ కార్యంలో పరిపూర్ణతకు లోపం రాకూడదనేది నీ ఆదర్శం కావాలి. నీవు తప్పకుండా దైవానికి ఒక నిజమైన ఉపకరణం కాగలవు.

*CWM 14 : 306, 304* శ్రీమాత

# ఇది మీకు తెలుసా ?

మన కర్మలకు అధిపతి, వాటిని నడిపించేవాడు ఒకరే, ఆయన విశ్వజనీనం, సర్వోన్నతం, శాశ్వతం, అనంతం. మనకు పైన వున్న సర్వాతిశయ అజ్ఞేయుడు, లేదా అజ్ఞేయ సమగ్రుడు, అప్రకటిత, అనభివ్యక్త అనిర్వచనీయుడు : కానీ సర్వ జీవుల ఆధ్యాత్మ, సకల ప్రపంచాల అధిపతి, సమస్త ప్రపంచాలను అతిశయించువాడు, ప్రకాశం, మార్గదర్శకుడు, సర్వసౌందర్యం, సకల ఆనందం, ప్రేమించబడువాడు, ప్రేమించువాడు కూడ ఆయనే. ఆయనే విశ్వాత్మ మన చుట్టూ వున్న సృష్ట్యాత్మక శక్తి: ఆయన మనలోని అంతర్వర్తి. వున్న సమస్తమూ ఆయనే, వున్నదానికన్నా ఆయన ఎక్కువ, మనకు ఎరుక వున్నా లేకపోయినా మనం ఆయన అస్తిత్వం లోని అస్తిత్వం, ఆయన శక్తి యొక్క శక్తి, ఆయన నుండి ఉత్పాదించిన చైతన్యంతో వున్న చేతన: చివరకు మన మర్త్య అస్తిత్వం కూడ ఆయన పదార్థంతో తయారుచేయబడి వుంది, మనలో ఒక శాశ్వతత్వం వుంది. అది నిరంతరం వుండే దివ్య ప్రకాశం, దివ్యానందాల ఒక విస్ఫులింగం. మన అస్తిత్వానికి చెందిన ఈ సత్యం గురించి తెలుసుకోవడానికి జ్ఞానము, కర్మ, ప్రేమల వంటి ఏ మార్గమైనా ఫరవాలేదు, దానిని వాస్తవం చేసుకోవడం, ఇక్కడ లేదా ఎక్కడైనా దానిని ప్రభావవంతం చేసుకోవడం మొత్తం యోగలక్ష్యం.

కర్మల అధిపతి సాధకునికి ఒక్కసారిగా తనను తాను ప్రకటించుకోడు. తెర వెనుక వుంటూ ఎప్పటికీ పనిచేసేది ఆయన శక్తే, కానీ కర్తృత్వ అహాన్ని మనం త్యజించినపుడు మాత్రమే ఇది అభివ్యక్తమవుతుంది, మన పరిత్యాగం ఇంకా ఇంకా సంపూర్ణమవుతున్న కొద్దీ దానికి తగినట్లుగా దీని ప్రత్యక్ష చలనం ఎక్కువవుతూ వుంటుంది. ఆయన దివ్యశక్తికి మన సమర్పణ సమగ్రమైనపుడు మాత్రమే ఆయన సంపూర్ణ ఉనికిలో వసించే హక్కును మనము కలిగివుంటాము.

దీర్ఘమైన ఈ మార్గంలో మొదటి అడుగు మన సకల కర్మలను ఒక యజ్ఞంగా మనలో, ప్రపంచంలో వున్న దైవానికి అర్పించడం, రెండవ అడుగు మన కర్మల ఫలితంతో వున్న అనుబంధాన్ని త్యజించడం, మూడవ అడుగు కేంద్ర అహాన్ని, కర్తననే అహంభావనను నివృత్తి చేయడం.



మార్మికప్రపంచమును తెలిసిన , నిర్దేశించుచున్న ఒక దివ్యజ్ఞానం.
తన అస్తిత్వమును, సంఘటనలను రూపొందించే ఒక దివ్య సత్య వీక్షణ.
*సావిత్రి 271,* *శ్రీ అరవిందులు*

ప్రకరణం 5 :

# ఎల్లప్పుడూ నావైపు తిరిగి ఉండటం

## మనలో సాధన చేసేది దైవమే

విశ్వంలో జరిగిన అన్నింటిలో సమస్త చర్యల వెనుక దైవం తన శక్తి ద్వారా నిలిచి వున్నాడు, కానీ ఆయన తన యోగమాయతో తెర వేయబడి నిమ్నప్రకృతి లోని జీవుని అహంకారం గుండా పనిచేస్తాడు.

యోగంలో కూడ దైవమే సాధకుడు, ఆయనే సాధన. ఆయన శక్తి యొక్క ప్రకాశం, శక్తి, జ్ఞానము, చైతన్యము,ఆనందములతో ఆధారం మీద పనిచేస్తూ, ఎప్పుడైతే అది ఆమెకు ఉన్మీలనమవుతుందో అప్పుడు సాధనను సుసాధ్యం చేసే దివ్యశక్తులను అందులోకి ప్రవహింపజేస్తుంది.

దైవం పట్ల నిజమైన ప్రేమ అంటే తనను తాను ఇచ్చుకోవడం, కోరిక నుండి స్వేచ్ఛగా వుండటం, విధేయత, సమర్పణ కలిగివుండటం అది దేనిని కోరదు, ఏ స్థితిని విధించదు, ఎలాంటి బేరాన్ని చేయదు, ఈర్ష్య, అతిశయము, కోపములకు చెందిన ఏ రకమైన హింసతో తృప్తిపడదు. ఎందుకంటే ఇవన్నీ దాని నిర్మాణంలో లేవు.

దీనికి బదులుగా దివ్యజనని కూడ తమను తాము ఇచ్చుకుంటారు,కానీ స్వేచ్ఛగా- ఇది ఒక ఆంతరిక అర్పణకు సంకేతం- నీ మనసు, ప్రాణము, భౌతిక చైతన్యాలలోని ఆమె ఉనికి, నిన్ను దివ్యప్రకృతిలోకి పునఃసృష్టించే ఆమె శక్తి, నీ అస్తిత్వం లోని సమస్త చలనాలను తీసుకుని వాటిని పరిపూర్ణత, సఫలతల వైపుగా నిర్దేశిస్తుంది, ఆమె ప్రేమ నిన్ను ఆవరించుకుని తన హస్తాలలో నిన్ను మోస్తూ, భగవంతుని వైపుగా తీసుకెళుతుంది.

క్రింది పదార్థం వరకు నీ అన్ని భాగాలలో నువ్వు ఆకాంక్షించవలసింది ఇదే, ఇక్కడ కాలం గురించి గానీ, పూర్ణత గురించి గానీ పరిమితి లేదు.

*- శ్రీఅరవిందులు*

ప్రశ్న : అమ్మా ! దైవం సాధన ఎలా అవుతాడు ?

ఎందుకంటే మన అస్తిత్వంలో సాధన చేసేది దైవమే. దైవం లేకుండా సాధన వుండదు. దాని గురించి నీకు తెలియదు అంతే....నువ్వు

అనుకుంటావు- చేస్తున్నది నువ్వేనన్న భ్రమలో వుంటావు. యథార్థంగా నువ్వు ఈ భ్రమలో వున్నంతవరకూ నువ్వు ప్రయత్నం చేస్తూ వుండవలసిందే, కానీ సత్యమేమంటే నీలో సాధన చేస్తున్నది దైవమే, దైవం లేనిదే సాధన వుండదు.

ప్రశ్న : ఇక్కడ "దైవమే సాధకుడు, ఆయనే సాధన" అని వ్రాసివున్నది (ఇంకో విద్యార్థి) అయితే అమ్మా మనం ఎందుకు ప్రయత్నం చేయాలి? సాధన చేస్తున్నది దైవమే అయినపుడు ఆయనే చేయనీ. అప్పుడు స్వప్రయత్నం ఎక్కడ వుంది?

యథార్థంగా అవును, ఇది మనుష్యులు సోమరితనంతో చెప్పేది! నువ్వు సోమరి కాకపోతే నువ్వు ఇలా మాట్లాడవు! (బిగ్గర నవ్వు)

ప్రశ్న : వ్యక్తిగత ప్రయత్నం అంటే ఏమిటి ?

ఏ ప్రయత్నం వ్యక్తిగతమని భావిస్తామో అది. నువ్వు ప్రత్యేక వ్యక్తివనే ఎరుక నీలో వుంది. నువ్వు దైవమని, దైవమేనని భావిస్తున్నావా? కాదు (నవ్వుతూ) భగవంతుడంటే ఇది- నువ్వు మనోజ్ వని భావిస్తున్నంతవరకు, మనోజ్ ప్రయత్నం చేయాలి. నువ్వు మనోజ్ అన్న భావన నీ నుండి పూర్తిగా తొలగించుకోగలిగితే అప్పుడు దైవం తప్ప వేరేది కాదు, ప్రయత్నం చేసేది దైవమే. సహజంగా. అక్కడ మనోజ్ ఉన్నంతవరకు ప్రయత్నం చేస్తున్నది మనోజే.

ప్రశ్న : కానీ మనోజ్ ప్రయత్నం చేస్తున్నపుడు, మనోజ్ లోని దైవమే కదా ప్రయత్నం చేసేది?

ఒకవేళ మనోజ్‌కు దాని గురించి ఏమీ తెలియదనుకో !( నవ్వుతూ) దైవం లేకపోతే మనోజ్ ప్రయత్నం చేయలేడని నేను అంటాను. కానీ మనోజ్ ఇంకా దానిని తెలుసుకునే స్థితిలో లేడు, కాబట్టి తానే ప్రయత్నం చేస్తున్నానని అనుకుంటున్నాడు.

మనోజ్: కానీ ఇప్పుడు ఈ రోజు నేను తెలుసుకున్నానని మీరు అన్నారు కనుక....

(వెంటనే) హ, హ, హ, హ !..... (బిగ్గరగా నవ్వుతూ) మానసిక జ్ఞానం సరిపోదు, నీకు అనుభవ జ్ఞానం వుండాలి.

- శ్రీమాత

# దైవం వైపు ఉన్మీలనం

ఉన్మీలనం అంటే మదర్ వైపు మళ్ళడాన్ని నిలిపి వుంచే ఒక చైతన్యస్థితి, ఇది ఇతర చలనాల నుండి స్వేచ్ఛగా వుంటూ,దైవం నుండి పొందే దానిని ఆశిస్తూ, దానిని అందుకొనే శక్తి కలిగి వున్న స్థితి.

ఉన్మీలనం అంటే సరళంగా మదర్ వైపుకు మళ్ళడం, అలా నీలో ఏదీ ఆమె చర్యను నిరాకరించకుండా, ఆటంకపరచకుండా, ఆమె శక్తి పనిచేయగలగాలి. ఒకవేళ మనసు తన స్వంత భావనలలో మూసుకుపోయి, ప్రకాశాన్ని, సత్యాన్ని దానిలోకి తీసుకురావడానికి అనుమతించకుండా నిరాకరిస్తే, ప్రాణము తన కోరికలకు అంటిపెట్టుకుని మదర్ శక్తి తీసుకువచ్చే నిజమైన ప్రేరణాత్మక ప్రచోదనలను అనుమతించకపోతే, భౌతికం తన కోరిక, అలవాట్లు, జడత్వము లలో మూసుకుపోయి దానిలోకి ప్రకాశం, శక్తులు ప్రవేశించి, పనిచేయడానికి అనుమతించకపోయినా వ్యక్తి ఉన్మీలనం కానట్లే.

సమస్త చలనాలలో, అన్నీ ఒకేసారి ఉన్మీలనం కావడం సాధ్యం కాదు, కానీ ప్రతి భాగంలో ఒక కేంద్ర ఉన్మీలనం, మదర్ పనివిధానాలను మాత్రమే అనుమతించడానికి ప్రతిభాగంలో ఒక ప్రబలమైన ఆకాంక్ష లేదా సంకల్పం (కేవలం మనసులోనే కాకుండా) వుండాలి, అప్పుడు మిగిలినదంతా పురోగమిస్తుంది.

ఎల్లవేళలా దివ్యశక్తితో సంసర్గం లో వుండు. నువ్వు చేయవలసిన ఉత్తమకార్యం దానిని తన స్వంత కార్యం నిర్వర్తించడానికి అనుమతించడం: ఎక్కడ అవసరమైతే అక్కడ, అది క్రింది శక్తులను ఆధీనం లోకి తీసుకుని వాటిని శుద్ధి చెందిస్తుంది. ఇతర సమయాలలో వాటిని నీనుండి ఖాళీచేసి తనతో నిన్ను నింపుతుంది. ఒకవేళ నువ్వు నీమనసును నిర్దేశించనిస్తే, ఏది చేయాలో చర్చించి, నిర్ణయం తీసుకునేట్లు చేస్తే అప్పుడు దివ్యశక్తితో సంసర్గాన్ని కోల్పోతావు, క్రిందిశక్తులు తమకార్యం కొరకు చర్య తీసుకోవడం మొదలుపెడతాయి, అంతా గందరగోళం లోకి, ఒక తప్పుడు చలనంలోకి పరిణమిస్తుంది.

ఉన్మీలనం అన్నది సంకల్పం, నిజాయితీ, ఆకాంక్షల చేత తనంతటతానే జరిగే అంశం.

ఉన్మీలనానికి ఉత్తమ విధానం సమర్పణ: అయితే సమర్పణ లేనపుడు ఆకాంక్ష, నిశ్శబ్దాలు ఒక నిర్దిష్ట దశ వరకే పనిచేస్తాయి.


నిరంతరం గుర్తుంచుకోవడం ద్వారా మాత్రమే అస్తిత్వము పూర్తి ఉన్మీలనానికి సిద్ధమవుతుంది.

మదర్‌కు ఉన్మీలనమై వుండటమంటే ఎప్పటికీ నిశ్శబ్దంగా, సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో వుంటూ, అలజడిగా, దుఃఖంగా, బేజారుగా వుండకుండా ఆమె శక్తి నీలో పనిచేస్తూ, నిన్ను నిర్దేశిస్తూ, నీకు జ్ఞానాన్ని, శాంతిని, ఆనందాన్ని నీలో పనిచేయనివ్వడం.

నీ వరకు ఆ శక్తి ఎటువంటి ప్రయత్నము లేకుండా ప్రభావవంతంగా పనిచేస్తుందన్నది నిజం. అయితే దాని కార్యానికి అవరమైనది ప్రయత్నం కాదు, అస్తిత్వ ఆరోహణ.

యోగంలో అంతర భావన అదే - ఒక యుక్తమైన కర్మణ్యర్థకత చేత వ్యక్తి తన పరిమితత్వం కన్నా ఉన్నతమైనదానికి తనను తాను ఉన్మీలనం చేసుకుంటాడు, ఆ స్థితిని పొందడానికి మాత్రమే ప్రయత్నం ఉపయోగ పడుతుంది.

యోగిగా లేదా ఒక సన్యాసిగా లేక ఒక తపస్విగా వుండటమనేది ఇక్కడ ముఖ్యలక్ష్యం కాదు. రూపాంతరం ముఖ్య లక్ష్యం, ఈ రూపాంతరీకరణ నీ స్వీయశక్తి కన్నా అనంతంగా గొప్పదైన శక్తి చేతనే సాధ్యమవ్వగలదు. దివ్యమాత హస్తాలలో నిజమైన ఒక చిన్నపిల్లవాడిలా వుండటం ద్వారానే ఇది జరుగగలదు.



# తెరచుకోవడం ఎలా?

ప్రప్రథమంగా మీరు ఆ అవసరాన్ని అనుభూతి చెందాలి. ఇది చాలా ముఖ్యమయిన విషయం. ఒక విధమైన ఆంతరంగికమయిన నమ్రత ఉండాలి. ఆ కృప లేకుంటే మీరెంత అసహాయులో అది తెలియచేస్తుంది, అది నిజానికి మీరెంత అసంపూర్ణులు, అశక్తులు అనే విషయపు ఎరుకను కలగచేస్తుంది.

ఒక వ్యక్తి ఈ అనుభవాన్ని చక్కగా పొందవచ్చు. ఏమీ తెలియని వ్యక్తులు కూడా చాలా క్లిష్టమయిన పరిస్థితులలో ఉండటం మీరు చూస్తుంటారు లేదా ఒక సమస్యను పరిష్కరించవలసి వస్తుంది. లేదా ఒక స్పందనను అధిగమించవలసి వస్తుంది లేదా ఏదైనా ఒక సంఘటన వారిని కలవరపెట్టి ఉంటుంది. అప్పుడు వారు సమస్యలో చిక్కుకున్నట్లు గుర్తిస్తారు. ఏమి చేయాలో దిక్కుతోచదు. అప్పుడిది సంభవిస్తుంది. వారి లోపల ఒక విధమైన ఆక్రందన, ఒక పిలుపు, తాము చేయలేని దానిని చేయడం ఒక శక్తి కోసం పిలుపు వెలువడుతుంది. వ్యక్తి తాను సాధించలేని దానిని చేయగల ఒక శక్తి కోసం ఆకాంక్షిస్తాడు.

ఇది మొదటి షరతు. అపుడు కేవలం కృప మాత్రమే దానిని చేయగలదనే ఎరుకను మీరు పొందినప్పుడు, మీరున్న స్థితినుండి కేవలం దివ్య కరుణ మాత్రమే మిమ్మల్ని బయట పడవేయగలదు. మీ సమస్యను పరిష్కరించి, మీరు దానినుండి బయటకు రాగల శక్తిని యిస్తుంది. అపుడు చాలా సహజంగా మీలో ఒక తీవ్రమయిన ఆకాంక్ష జాగృతమవుతుంది. ఒక వికసనంగా అనుసరించబడే ఒక చేతన ఉదయిస్తుంది. మీరు పిలిచినట్లయితే, ఆకాంక్షించినట్లయితే, సమాధానం కోసం ఆశించినట్లయితే మీరు చాలా సహజంగా దైవకృపకు తెరుచుకోగలుగుతారు.

తరువాత ఈ విషయంపై మీరు చాలా ధ్యాస ఉంచవలసి వస్తుంది. (శ్రీమాత తన వేలును పెదవిపై ఉంచుతారు.) ఆ కృప మీకు సమాధాన మిస్తుంది. మిమ్మల్ని ఆ కష్టం నుండి గట్టెక్కిస్తుంది. కానీ ఒకసారి మీరా సమస్య నుండి విడివడి, కష్టంనుండి బయటపడిన తరువాత మిమ్మల్ని బయటకు తీసుకువచ్చింది ఆ కృపయేనని మరచిపోకండి. ఎందుకంటే అది మీవలన జరగలేదు.

నిజానికిదే ముఖ్యమయిన విషయం. చాలామంది కష్టం దాటాక, 'నేను కష్టం నుండి బాగానే బయటపడిపోయాను' అనుకుంటారు.

అక్కడే ఉంది. అపుడు మీకా తలుపును మూసి గడియ పెట్టేసుకున్నట్లే. మీకు తెలుసా? మీరు ఆపై దేనినీ అందుకోలేరు. ఇటువంటి మూర్ఖత్వం మీలో పోవాలంటే, మీరేమి చేయాలన్నా మీరు అశక్తులు అని గుర్తించాలి. మళ్ళీ మీకొక ఆకస్మికమయిన వైపరీత్యమేదో సంభవించాలి. లేదా ఒక భయంకరమైన కష్టం కలగాలి. ఎందుకంటే మీరు శక్తిహీనులని తెలుసుకున్నపుడే మీరు ఎంతో కొంత తెరుచుకోవటం నమనీయం కావటం ప్రారంభమవుతుంది. కానీ, మీరు చేసేదంతా మీ సొంత ప్రావీణ్యతపై, మీ సామర్థ్యంపై ఆధారపడిందని భావించినంత వరకూ మీరొక ద్వారాన్ని మూసివేస్తారు. ఒకటి మాత్రమే కాదు ఒక దాని మీద మరొకటి అలా అనేకమయిన ద్వారాలను మూసి గడియ వేస్తారు. మిమ్మల్ని మీరొక కోటలో బంధించుకుంటారు. అక్కడికి ఏవీ అడుగుపెట్టలేవు. అదొక పెద్ద లోపం - దానిని వ్యక్తి చాలా త్వరగా మరచిపోతాడు. చాలా సహజంగా అక్కడ వ్యక్తి తన స్వంత సామర్థ్యంతో తృప్తి పడిపోతాడు.

## స్వీకరణశక్తి పెరగాలి

తెరుచుకోవటం అంటే దివ్యశక్తిని స్వీకరించి, ఆ శక్తిని, ప్రభావాన్ని ప్రగతి కోసం వినియోగించుకోవటం. చైతన్యంతో సంస్పర్శలో ఉండాలనే నిరంతర ఆకాంక్ష, దివ్యశక్తి, చేతన ఎల్లవేళలా మీతో, మీలో మీ చుట్టూ మోహరించి ఉన్నాయనే విశ్వాసం. మీరు వాటిని స్వీకరించే మార్గంలో మరి దేనినీ నిలువనీయకపోవటం.

*

- మీపై మరియు మీలో పనిచేస్తున్న ఆ చైతన్యానికి తెరుచుకోండి. మీరు ఉండగలిగినంత నిశ్చలంగా, ప్రశాంతంగా ఉండండి.

*

- దివ్యప్రేమకు, వెలుగుకూ మరింత తెరుచుకో. మీ చివర లేఖకు నేను పంపిన సమాధానం సరిగ్గా యిదే మీ చేతనలో యింకా ఉధృతంగా ఎదగాలి. మరింత విశాలంగా ప్రేమించండి, వెలుగుకు మరింతగా తెరుచుకోండి, అన్ని

వైషమ్యాలు అంతర్థానమవుతాయి. యోగం చెయ్యాలంటే ఈ విశ్వమంత విశాలంగా, సమగ్రంగా ఉండాలి.

*CWM 14 : 151-52*

ప్రశ్న : ప్రియమైన మాతా! నాకేం చేయాలో తెలియదు. నేను మీకు తెరుచుకోవాలనుకుంటున్నా కానీ ఏదో ఆ వికసనాన్ని నివారిస్తుంది.

ప్రియపుత్ర! నీ కెందుకు యిబ్బందిగా అనిపిస్తున్నదంటే నువ్వింకా నీ స్వీయసంకల్పం కాక నీ జీవితాన్ని పాలించడానికి నా సంకల్పాన్ని అనుమతించాలనే దృఢనిర్ణయానికి రాలేదు. ఈ అవసరాన్ని నువ్వు అర్థం చేసుకున్న వెంటనే అంతా చాలా సులువుగా అనిపిస్తుంది. నీకెంతో అవసరమయిన ప్రశాంతతను చివరకు పొందగలుగుతావు. ఈ ప్రయత్నం ఆకాంక్షలో నేనెపుడూ నీకు తోడుగా ఉంటాను.

ప్రశ్న : మీ చేతులెపుడూ ఏమివ్వటానికయినా సిద్ధమే. కానీ నేను కేవలం చిన్న అంశాన్ని మాత్రమే స్వీకరించగలుగుతున్నాను. ఎందుకంటే నా స్వీకరణశక్తి పరిమితం కావటం వలన. సరిగ్గా యిది ప్రపంచం యిప్పుడున్న స్థితి. ఏదయితే మన స్వీకరణ లోపం వలన చాలా దుఃఖిస్తుందో కానీ దివ్యప్రేమకు తెరుచుకోగలిగినపుడది ఎంతో ఆనంద పారవశ్యతతో జీవించగలుగుతుంది. కానీ దీనికొక పరిహారం ఉంది.

'నిజాయితీతో కూడిన నిరవధికమయిన ఆకాంక్ష'.

నా ప్రేమ మీతో ఎపుడూ ఉంటుంది. మీరు దానిని అందుకోనపుడు అనుభూతి ఉండదు. మీ స్వీకరణశక్తి లోపించింది. దానిని పెంపొందించుకోండి. అందుకు - మీరు తెరుచుకోవాలి. మిమ్మల్ని మీరు నివేదించుకున్నపుడే తెరుచుకోగలుగుతారు. ఖచ్చితంగా ఎంతో కొంత ఎరుకతో మీరు ఆ దివ్యశక్తులను, దివ్యప్రేమను మీవైపు లాక్కోవాలని ప్రయత్నిస్తున్నారు. ఈ పద్ధతి సరియైనదికాదు. ఏ విధమయిన అంచనాలు లేకుండా, ఏ ప్రతిఫలం ఆశించకుండా నివేదించుకోండి. అపుడు మీకు స్వీకరించగల శక్తి వస్తుంది.

*CWM 14 : 155*

### *శ్రీమాతతో ఒక సాధకుని సంభాషణ*

ఒకరోజు నేను శ్రీమాతను అడిగాను 'నేను చాలాకాలంగా యోగాన్ని అనుసరిస్తున్నాను. కాని శ్రీ అరవిందుల యోగం ఎలా చేయాలో నాకు

ఖచ్చితంగా పూర్తిగ తెలియదు. నేను పుస్తకాలన్నీ చదివి ఈ యోగం చెయ్యాలని ప్రయత్నిస్తున్నాను. కానీ నేను ఎంతవరకూ పురోగమించాననేది సరిగ్గా నాకు తెలియదు. నాకు కొంచెం సాయం చెయ్యండి' అని మదర్‌ని అడిగాను.

ఆమె అన్నారు 'నువ్వు పూర్తిగా తప్పుగా చేస్తున్నావు'

'అప్పుడు నేను ఏం చెయ్యాలి?' అని ఆమెను అడిగాను.

'నేను నీకోసం యోగాన్ని చేస్తాను' అని ఆమె సమాధానమిచ్చారు. నేను ఎంతో హర్షాతిరేకానికి గురి అయ్యాను.

'నేను ఏమి చెయ్యాలి?' అని అడిగాను.

'నిన్ను నువ్వు, నాకు యిచ్చివేసుకో. నీ యోగాన్ని నేను చేస్తాను' అన్నారామె.

'అది ఎలా?' అని నేనడిగాను.

'నువ్వు నిజాయితీగా చెయ్యాలనుకుంటున్నావా?' అని అడిగారామె.

'అవును శ్రీమాతా. తప్పకుండా' అని జవాబిచ్చాను.

'ఉదయం లేవగానే నువ్వు చేసే మొదటి పని ఏమిటి?' అడిగారు శ్రీమాత.


'నేను పళ్ళు తోముకుంటాను' అన్నాను. 'ఎలా కడుక్కుంటావు?' అన్నారామె.

నేను ఆశ్చర్యంగా అన్నాను 'అందరిలానే' అని.

'అలా అయితే నువ్వది చాలా చేతనారహితంగా చేస్తున్నావు. బదులుగా నువ్వు దంతధావనం చేసేటపుడు నన్ను తలుచుకో. నేను చేస్తున్నానని భావించు లేదా నువ్వు ముఖం కడుగుకొనేటప్పుడది నీతోపాటు నేను కూడా చేస్తున్నానని భావించు. తినేటపుడు నేను కూడా నీతో తింటున్నానని, నీతోపాటు ఆహారాన్ని ఆస్వాదిస్తున్నానని ఊహించుకో'.

ఆమె యింకా యిలా అన్నారు. 'నువ్వు నిద్రించే సమయంలో నువ్వు మరింతగా నా పనిపట్ల ఎరుకను కలిగి ఉండాలి. నిన్ను నిద్ర పుచ్చనీయనీ. అపుడు నీకు రాత్రంతా ఎంతో చైతన్యవంతమయిన నిద్ర వస్తుంది. మేలుకొని నువ్వు నీ రోజును ప్రారంభించినపుడు, నువ్వు దానిని ఎంతో చైతన్యవంతంగా మొదలుపెట్టగలుగుతావు'

మూలం : ఉదార్ శ్రీమాత బిడ్డలలో ఒకరు. పుట. **141.**



విశాల దృక్పథంతో చూస్తే తనను ఆంతరంగికంగానూ, దానిని ఆధారంగా చేసుకొని బాహ్యంగానూ గురువుకి, దైవానికి ప్రవర్ధమానంగా శరణాగతి చెందడంలో తన సాధన ముడిపడి వుంది. ధ్యానం, ఏకాగ్రత, కర్మ, సేవ - ఇవన్నీ లక్ష్యం వైపు నడుపుకొంటూ పోయి, పని చేయడానికి ఒక ఉన్నత శక్తి చేతుల్లో తనను అప్పగించుకొనే ఏకమాత్ర లక్ష్యంలో వ్యక్తికి చెందిన అన్ని క్రియాకలాపాలను, తన వైపుకి మళ్ళించుకొని సంఘటితం చేసుకోవడానికి సాధనాలు.

శ్రీమాత ఆ వ్యక్తి స్వభావానికి, అవసరానికి అనుగుణంగా మార్గదర్శనం చేస్తుంది, సహాయం చేస్తుంది. ఎక్కడ అవసరమైతే అక్కడ ఆమె స్వయంగా తన శక్తితో జోక్యం చేసుకొని ఆ మార్గం కోరే వాటికి, అక్కడి కాఠిన్యతలకు ఎదురు నిలవగల సామర్థ్యాన్ని అతనికి అందిస్తుంది. సంపూర్ణమైన ప్రేమ, శాంతి, జ్ఞానం, చేతన స్వయంగా తానే అయ్యున్న శ్రీమాత స్వయంగా తన సహాయం కోసం ఎదురుచూచే ప్రతి ఆకాంక్షా పూరిత అంతరాత్మ ఎదుట ప్రత్యక్షంగా వుంది.

*CWSA 32 : 332*

శ్రీ అరవిందులు

## అహంకార కేంద్రితమైన ధోరణి నుండి దైవకేంద్రితమైన ధోరణిలోకి మారడం

**(నీ అస్తిత్వానికి దైవాన్ని సజీవకేంద్రంగా చేసుకో)**

సాధనకు సంబంధించిన తొలి దశలో, అంతా - ప్రతి ఒక్కరూ అహంకార కేంద్రితంగానే ఉంటారు. దానిలో ఎప్పుడూ తన స్వీయసాధన, స్వీయప్రయాస, స్వీయఅభివృద్ధి, స్వీయ పరిపూర్ణత, స్వీయ సిద్ధి అనేదే ముఖ్య భావన. అది చాలామంది విషయంలో నిర్నిరోధమైనది. ఎందుకంటే ఆ వ్యక్తిగతమైన ప్రయత్నం లేకుండా ప్రథమ దశలో ఆవశ్యకమైన మార్పులు లేకపోవడంతో ప్రోద్బలం, తగినంత సంకల్పబలం ఉండవు. ఈ అభివృద్ధి, పరిపూర్ణత లేదా సిద్ధి అనే వాటిలో ఏదీ ఈ అహంకారిక కేంద్రిత ప్రవృత్తి దైవకేంద్రిత ప్రవృత్తిగా, దివ్యచేతన యొక్క సిద్ధిగా, పరిపూర్ణతగా, అభివృద్ధిగా, ఆ దివ్యచేతన సంకల్పం, దాని వినియోగం ఈ శరీరంలో జరిగేలా మారిపోనంత వరకు, ఎటువంటి మిశ్రమంకాని శుద్ధమైన చరమ స్థితి లేదా పరిపూర్ణ స్థాయిని, నిజంగా అది సంతరించుకోదు. అవన్నీ గౌణ విషయాలు అయినప్పుడు దైవం యెడల భక్తి, దైవాన్ని ప్రేమించడం, శరీరంలో, హృదయంలో, సంకల్పంలో చేతనపరంగా దైవంతో ఏకత్వం పొందడం అన్నది ఏకమాత్ర దివ్యసంకల్ప సాఫల్యత అవుతుంది. ఈ ధోరణి అంతరాత్మకు దుర్లభమైనది కాదు. దీని సహజమైన స్థితి, సంవేదన.... అదే.

*CWSA 31 : 229*

కృష్ణుని నేరుగా సరళమైన ధోరణిలో ఎందుకు సమీపించకూడదు? సరళంగా సమీపించడం లేదా ఆ ధోరణితో ప్రవర్తించడమంటే విశ్వాసంలో ఉండటమని. నీవు ప్రార్థిస్తే ఆయన ఆలకిస్తాడనే నమ్మకం. జవాబు రావడంలో కొంత సమయం తీసుకొన్నా, ఆయనకు అంతా తెలుసునని, నిన్ను ప్రేమిస్తాడని, కాలం ఎంపికలో అతడు కుశలుడని నీవు విశ్వసించు. అంతలోపల నిశ్శబ్దంగా ప్రదేశాన్ని శుభ్రపర్చు, తద్వారా రాళ్ళురప్పలు, పొదలపైన ఆయన సాగిరాకూడదు. నీవు ఏమి చెప్పినా ఈ మానవుని కష్టాలు, సంఘర్షణలు నాకు తెలుసు. వాటి నివారణ తెలుసు. అందుకే ఆ ఇక్కట్లు, సంఘర్షణలు కనీస స్థాయికి తగ్గించబడాలని ఎప్పుడూ నొక్కి చెబుతాను.

అంతరాత్మవైపుకు తిరగడం, విశ్వాసం, సరళమైన సంపూర్ణమైన స్థిరనమ్మకం, భరోసా ఉంచడం. ఇదే నా సలహా, నేనేమంటున్నానో నాకు బాగా తెలుసు.

*CWSA 29:487* — *శ్రీ అరవిందులు*

## కఠిన ప్రమాణీకరణ అవసరం లేదు

ఆధ్యాత్మ స్వీయాభివ్యక్తి దివ్యాత్మ సంకల్పమే ఆధ్యాత్మిక జీవితానికున్న నియమం; ఆ సంకల్పం, ఆ స్వీయాభివ్యక్తి అమిత సరళత్వం లేదా అమిత సంక్లిష్టత, సంపన్నత లేదా వాటి సహజ సంతులనం ద్వారా రూపుదాల్చగలవు, - సౌందర్యం పుష్కలత, వస్తుజాలంలో గుప్తంగా ఉన్న ఒక మాధుర్యం, హాస్యం, జీవితంలో ఒక సంతోషం, ఒక కాంతి అన్నవి కూడా ఆధ్యాత్మ యొక్క శక్తులు, అభివ్యక్తులే. అన్ని దిశల్లోనూ లోపల ఉన్న ఆధ్యాత్మ ప్రకృతి సూత్రాన్ని నిర్ణయిస్తూనే జీవిత పరిస్థితిని, దాని వివరాన్ని, దాని చట్రాన్ని కూడా నిర్ణయిస్తుంది. సమస్తంలో అదేమాదిరి సానుకూలమైన సూత్రముంది. ఒక సంకుచిత ప్రామాణీకరణ మానసికంగా విషయాల అమరికకు అవసరమనిపిస్తున్నా ఆధ్యాత్మిక జీవితానికి మాత్రం అది నియమ సూత్రం కాజాలదు. ఒక అంతర్లీన ఏకత్వం మీద ఆధారపడే స్వీయాభివ్యక్తిలోని ఒక గొప్ప వైవిధ్యం, స్వేచ్ఛ అన్నవి రూపుదిద్దుకొంటాయి. కాని సర్వత్రా సక్రియమైన సామరస్యం, సత్యం వుండాలి.

*CWSA 21 : 1104* — *శ్రీ అరవిందులు*

ఇదిమిత్థంగా నిర్ణయించలేని స్థితి, కర్మ చేయ అవిశ్రాంత ఒత్తిడి వల్ల మన ప్రకృతి కర్మ చేస్తుంది. లోతింతని చెప్పలేని ప్రశాంతత నుండి దైవం స్వేచ్ఛగా పనిచేస్తాడు. మనపై ఈ నిమ్న ప్రకృతి పట్టును వదిలించుకోవాలంటే ఆ ప్రశాంతతలో మనం తప్పక మునిగిపోయి అదిగా అయిపోవాలి.

*CWSA 23 : 365* — *శ్రీ అరవిందులు*

ప్రశ్న : కాని అమ్మా తాను శక్తిహీనుడనని అనుకోవాలనుకొన్నప్పటికీ, తాను శక్తివంతుడనని నమ్మేదేదో వున్నది మనషిలో మరి?

అవును... అవును నిజాయితీగా ఉండటం మనిషికి చాలా కష్టం. అందుకే అతడిపై పడే దెబ్బలు అధికాధికమౌతాయి. ఒక్కొక్కసారి అవి భయంకరంగా తయారవుతాయి. ఎందుకంటే నిజాయితీ మాత్రమే నీ మూర్ఖత్వాన్ని భగ్నం చేస్తుంది. విపత్తులు సమర్థనీయమయ్యేది అందువల్లనే. నీవు తీవ్రమైన బాధలో ఉన్నప్పుడు మాత్రమే, నిన్ను ప్రగాఢంగా ప్రభావితం చేసే ముందు, మూర్ఖత్వం కొంచెంగా మాత్రమే కరుగుతుంది. ఏదో అలా కొంత కరిగిపోయినప్పటికీ ఏదో కొంత లోపల మిగిలే ఉంటుంది. అందుకే ఆ మూర్ఖత్వం చాలాకాలం ఉంటుంది.

దైవీకృప, దైవీ చేతన లేకుండా తానేమీ కాదని, తానేమి చేయలేడని, తెలుసుకొని, తన ఉనికే ఉండదని, తానొక శూన్యమనీ, తనకు వ్యక్తిత్వమంటూ ఉండదనీ, తెలుసుకునే అసలు లోతులలోనికి వెళ్ళడానికి జీవితంలో ఎన్ని దెబ్బలు అవసరమౌతాయి. అది తెలిసిన తక్షణం నుండి అంతా జరిగిపోయినట్లే. కష్టాలన్నీ మాయం. దానిని సమగ్రంగా ఎరిగినప్పుడు, నిరోధించేదేమీ ఉండదు. కాని అప్పటి వరకు... చాలా కాలంపడుతుంది.

*CWM 6 : 322-24* — *శ్రీమాత*

# నీవే

సమస్త ప్రేమకు, సమస్త ప్రకాశానికి నీవే మూల స్రోతస్సువి. నిన్ను నిన్నుగా మేం గ్రహించలేకపోయినా సంపూర్ణంగా, సమగ్రంగా అవతరింప చేయగలం. నీవు మా ఊహకు అందకపోవచ్చు గాక, కాని ప్రగాఢమైన నిశ్శబ్దంలో నిన్ను చేరుకోగలం.

నిజమైన ప్రేమ పల్లవించుగాక, అది అన్ని బాధలకు ఓదార్పు నిచ్చుగాక. నిజమైన శక్తి వసించు ఆ నిర్వికారమైన శాంతిని మాలో స్థాపించు; అంధకారాన్నంతటినీ చెదరగొట్టే సార్వభౌమిక జ్ఞానాన్ని మాకు ప్రసాదించు...

అనంతమైన లోతుల్ని మొదలుకుని ఈ బయట శరీరం దాకా, దీని సూక్ష్మ మూలకాల వరకు నీవు తిరుగాడుతావు, జీవిస్తావు, ప్రకంపిస్తావు. సమస్తాన్ని గతిలోకి తెస్తావు. ఈ నా సమస్త ఉనికితో బహువిభజనాశీలమైన దైనా.... సుసంబద్ధమైనదై బ్రహ్మాండమైన ఒక ప్రకంపనం ద్వారా ప్రాణవంతమయ్యే ఒక భాగం మాత్రమే. ఆ ప్రకంపనం నీవే.

*CWSA 32 : 332* *జూన్ 20, 1914 ది మదర్*

శ్రీఅరవిందులు ఇచ్చిన ఒక మంత్రం, ప్రార్థన.

**ఓం శ్రీ అరొబిందొమీరా**

నా మనసు, ప్రాణము, హృదయాలను నీ ప్రకాశం, ప్రేమ, శక్తుల వైపుగా ఉన్మీలనం గావించు. దానితో సకల విషయాలలో నేను దైవాన్ని చూడగలను.

(ఇది శ్రీఅరవిందులు ఒక సాధకునికి ఇచ్చిన మంత్రం)

**16-07-1938**

ate of Publication: 1st March 2024 Registered: PY/41/2024-26

**AKHILA - Akhila Bharata Patrika (Telugu)**

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

*Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo*



*Owner:* Sri Aurobindo Society
*Printer:* Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
*Publisher:* Pradeep Narang for Sri Aurobindo Society
*Published from:* Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
*Printed from:* Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

ingle copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001

# అఖిల

అఖిల భారత పత్రిక — ఏప్రిల్ 2024



# దివ్యమాత సంకేతం

# విషయ సూచిక

# సంకేతమంటే ఏమిటి?

నేనర్థం చేసుకొన్న దాన్నిబట్టి సంకేతం అంటే మరో స్తరంలో వున్నదాని సత్యాన్ని ఇంకో స్తరంలో తెలియజేసే రూపం.

ఉదా : ఒక జెండా, ఒక జాతి సంకేతం... కాని సాధారణంగా రూపాలన్నీ సంకేతాలే. మన నిజ అస్తిత్వానికి ఈ మన దేహం ఒక సంకేతం. ప్రతిదీ ఒక ఉన్నత సత్యపు ఒక సంకేతమే. ఏదేమైనప్పటికీ విభిన్న సంకేతాలున్నాయి.

**1.** తమ చుట్టుప్రక్క వస్తువులనుండి వేదఋషులు రూపొందించిన ఆచారసిద్ధమైన సంకేతాల్లాంటివున్నాయి. గోవు వెలుగుకు సంకేతం. ఎందుకనంటే 'గో' అనే పదానికి రెండర్థాలు -కిరణం, గోవు అని వున్నాయి. గోవు వారికి అత్యంత విలువైన సంపద, అది వారి జీవనాధారం, దొంగిలించబడడం,దాచివేయబడడం అనే ప్రమాదం దానికెప్పుడూ ఉండేది. ఒకసారి సృజించబడితే అటువంటి సంకేతం, సజీవమౌతుంది...

**2.** కృత్రిమంగా ఎంపికచేయబడిన లేక తెలిసి బుద్ధిపూర్వకంగా, మానసికంగా స్పష్టీకరించబడినటువంటి వాటిని గాక, మన రోజువారీ జీవితం నుండి సహజంగా రూపొంది, మన మామూలు జీవన మార్గాన్ని నియమించే వాటిని, జీవన సంకేతాలుగా చెప్తాం. అంతస్తు తరువాత అంతస్తుగా, శిఖరం తరువాత శిఖరంగా, యోగ మార్గానికి సంకేతంగా సనాతనులకు పర్వతం ఒక సంకేతం...


**3.** సంకేతాలకు వాటికే స్వంతమైన అంతర్గత ఔచిత్యం, శక్తి ఉన్నాయి. అనంత శాశ్వత సర్వవ్యాపక బ్రహ్మమునకు ఆకాశము లేక ఈథర్ ఉన్న స్థలం ఒక సంకేతం. జాతి ఏదైనా ఆ సంకేతానికదే అర్థం వుంటుంది. సార్వజనీనకంగా సూర్యుడు అతి మానస వెలుగు దివ్య ప్రజ్ఞానానికి సంకేతం.

**4.** సంఖ్యలకు, అక్షరమాలలకు సంబంధించినవి మానసిక సంకేతాలు. ఒకసారి వాటిని ఆమోదిస్తే అవి కూడా సక్రియమూ, ప్రయోజనకరమూ అవుతాయి. ఆ విధంగా క్షేత్రగణిత సంబంధ చిత్రాలను పలు రకాలుగా అన్వయించాలి.

*CWSA 30:137-38* — *శ్రీ అరవిందులు*

# శ్రీ అరవిందుల సంకేతం





The descending triangle represents Sat-Chit-Ananda.
The ascending triangle represents the aspiring answer from matter under the form of life, light and love.
The junction of both - the central square - is the perfect manifestation having at its centre the Avatar of the Supreme - the lotus.
The water - inside the square - represents the multiplicity, the creation.


క్రిందికి దిగి వస్తున్న త్రిభుజం సత్-చిత్-ఆనందాలకు ప్రతీక; పైకి అధిరోహిస్తున్న త్రిభుజం ప్రాణం, వెలుగు, ప్రేమరూపంలో పదార్థం నుండి వెలువడే ఆకాంక్షాపూరిత సమాధానానికి ప్రతీక.

రెండింటి సంధి ప్రదేశపు - కేంద్రీయ చతురస్రం - కేంద్రమందుగల కమలం పురుషోత్తముని అవతారమునకు సంకేతం.

చతురస్రం లోపల ఉన్న జలం, సృష్టి నానాత్వానికి సంకేతం.

*CWM 13:28-29* ***4 ఏప్రిల్, 1958***

# మదర్ సంకేతం



కేంద్రీయ వృత్తం పరమమైన మాతకు, మహాశక్తికి ప్రతీక. కేంద్రమందలి నాలుగు దళాలు, మదర్‌కు గల నాలుగు పార్శ్వాలు - పన్నెండు దళాలు ఆమె పన్నెండు లక్షణాలు.

*

పరమోన్నత చేతనకు సంబంధించిన తెల్లని కమలపు సంకేతాత్మక చిత్రణ. (విశ్వజనీన సృష్టిగా మదర్ రూపం) మహాశక్తి, తన నాలుగు పార్శ్వములు, పన్నెండు లక్షణాలతో కొలువై వున్నది.

*

## కేంద్రీయవృత్తం దైవచేతనకు ప్రతీక

నాలుగు దళాలు మదర్ నాలుగు శక్తులకు ప్రతీకలు.

పన్నెండు దళాలు తన కార్యంకోసం అభివ్యక్తమైన మదర్ పన్నెండు శక్తులు.


*CWM 13:63-64* *శ్రీమాత*

**15 ఏప్రిల్ 1934**

(సామాన్యార్థంలో) సంపూర్ణ అభివ్యక్తికి తప్పనిసరిగా అవసరమైన కంపనాలు పన్నెండుశక్తులు. ప్రప్రథమం నుండీ మదర్ శిరసుపై పన్నెండూ కన్పిస్తుండేవి. నిజంగా సూర్యకిరణాలు యేడు కాదు, పన్నెండు, పన్నెండు గ్రహాలు వగైరా...

*CWSA 32:598* *శ్రీ అరవిందులు*

# మదర్ సంతకం




మీ సంతకం పక్షి రెక్కలాగా ఉంది!

ఓ... అవును. అది ఒక పక్షి!

స్వర్గం నుండీ దిగివస్తున్న అనుగ్రహ పక్షి.


ఆ చుక్క చాలా ముఖ్యమైనది. ఆ చుక్క చూచే చేతన : కన్ను.

అక్కడ తోక, ఒక రెక్క కూడా ఉంది. కన్ను చూచే చేతన

*- శ్రీమాత : శిష్యునితో సంభాషణ (ఆగష్టు 11, 1961)*

# మహాశక్తి

(పరముని చిచ్ఛక్తి)



దివ్యమాత నాలుగు శక్తులు ప్రముఖమైన ఆమె నాలుగు వ్యక్తిత్వాలు, అంశములు, ఆమె దైవత్వమూర్తులు. వారిద్వారా ఆమె తన జీవులపై పనిచేస్తుంది. తన నుండి విసృజమైన వాటిని లోకాలలో క్రమబద్ధీకరించి సమరసంగావిస్తుంది. తన సహస్రానేక కార్యోన్ముఖ శక్తులను అవి చేయవలసిన కార్యానికి దిశానిర్దేశం చేసి వాటిని నడుపుతుంటుంది. దివ్యమాత ఒక్కరే, కాని ఆమె మనముందు భిన్న రూపాలలో ప్రత్యక్ష మౌతుంది. విశ్వంలో ఆమె కార్యం నిర్వహించే ఆమె శక్తులు, వ్యక్తిత్వాలు అనేకం. ఆమెనుండి వెలువడే రూపాలనేకం. విభూతులనేకం.

ఎవరిని మనం దివ్యమాతగా ఆరాధిస్తున్నామో ఆమెకనేక పార్శ్వాలు ఉన్నాయి. ఆమె వేగాన్ననుసరించడం, అధిక వేగవంతమైన మనస్సుకు, అత్యంత స్వేచ్ఛ కలిగిన బృహత్తమబుద్ధికి సైతం అసాధ్యం. దివ్యమాత పరాత్పరుని చేతన, శక్తి, తాను సృజించిన దానంతటికన్న యెంతో పైన ఉన్నదామె. ఆమె ధరించిన దేహాలద్వారా ఆమె పనిచేసే విధానాలను కొంతైనా దర్శించవచ్చు, కొంతైనా సంవేదించవచ్చు. ఆమె తన జీవులకు యేయే దేవతా రూపాలద్వారా అభివ్యక్తం గావడానికి అంగీకరించిందో అవి

ప్రవృత్తిలోనూ, చేసే కార్యంలోనూ యెంతగా పరిమితమై సృష్టి రూపం ధరిస్తాయో అంతంతగా మాత్రమే వాటిని గ్రహించగలుగుతాము.

మనలను, విశ్వాన్ని పరిపోషించు చిచ్ఛక్తితో యేకత్వం సిద్ధించినపుడు దివ్యమాత అస్తిత్వపు త్రివిధ మార్గాలను యెరుగ గలుగుతాము. దివ్యమహాశక్తి విశ్వాతీతమై, లోకాలన్నింటి పైన, అధిష్టించి యెన్నటికీ అభివ్యక్తంకాని గుహ్యాతిగుహ్యమైన పరాత్పరునికి ఈ సృష్టికి మధ్య సంధాన కర్త్రియైఉంటుంది. విశ్వాత్మక మహాశక్తియై ఆమె ఈ సర్వజీవులనూ సృజిస్తుంది. వాటిని తనలోనే భరిస్తుంది. వాటిలోనికి ప్రవేశించి, వాటికి ఆధారమౌతుంది. ఈ లక్షలాది వ్యక్తులను, శక్తులను నడుపుతుంది. వైయక్తికమైన ఆమెఅస్తిత్వపు యీ బృహత్తర ద్వివిధమార్గాల (విశ్వాతీతము, విశ్వాత్మకము అను) శక్తిని దేహంలో నిలుపుకొని వాటిని సజీవం, మనకు సన్నిహితం చేసి మానవ మూర్తిత్వానికి దివ్యప్రకృతికి నడుమ మధ్యవర్తిత్వం నెరపుతుంది.

విశ్వాతీత దివ్యశక్తి, దివ్యమాత సర్వలోకాలకు పైన నిలబడి తన శాశ్వత చేతనలో, ఆ సర్వేశ్వరుని భరిస్తుంది. అప్రతిహతశక్తికి, అనిర్వచనీయ పరముని సన్నిధికి ఆమె ఒక్కరే ఆశ్రయుమవుతుంది. అభివ్యక్తంగావలసిన పరమసత్యాలను తనలో పొదువుకుంటూ లేదా తనలోనికి ఆవాహనచేస్తూ తన రహస్య స్థావరాలలో దాగిన వాటిని క్రిందికి ఆమె అనంతచేతన వెలుగులోనికి కొనితెస్తుంది. అనంతశక్తిలో, అపరిమిత జీవనంలో వాటికి కార్యకారణశక్తి రూపాన్నిస్తుంది. జగత్తులోఒక దేహాన్ని తయారుచేస్తుంది. సర్వేశ్వరుడామెలో సదా నిలిచి వుండే సచ్చిదానందంగా అభివ్యక్తమయ్యే, ఏకము, ద్వికము నగు ఈశ్వర-శక్తి చేతనగ, ద్విత్వ సూత్రమగు పురుష-ప్రకృతిగ అభివ్యక్తమయ్యాడు. దివ్యలోకాలలో తెలియని ఆ లోకాలలోని సమస్తం ఆమెవల్ల ఆకృతి దాల్చింది. ఈ సృష్టి సమస్తం ఆమె సర్వేశ్వరునితో ఆడే ఆట. శాశ్వతుని నిగూఢతల, అనంతుని అద్భుతాల అభివ్యక్తి ఆమె చేతనే జరుగుతుంది. సర్వమూ ఆమెయే. ఎందుచేతనంటే సమస్తమూ పరమచిచ్ఛక్తి అంశమే. ఆమె నిర్ణయించినది, సర్వేశ్వరు డనుమతించినది, గాక యిచ్చుటగాని, మరెచటగాని, అన్యమేదీ మనలేదు. సర్వేశ్వరునకు ప్రేరితమై దేనిని తన సృజనాత్మక ఆనంద బీజరూపమున నిలిపి, దర్శించి రూపమిస్తుందో అది తప్ప మరేదీ ఆకారం దాల్చలేదు.

*CWSA 32:14-15* — *శ్రీ అరవిందులు*

# దివ్యమాత నాలుగు మహా శక్తులు

ఈ విశ్వాన్ని నడిపేటందుకు, భౌతిక జగత్తుతో కార్యకలాపాలు సాగించేటందుకు అమ్మ నాలుగు ప్రధాన అంశలు, ప్రస్ఫుటమైన శక్తులు, వ్యక్తిత్వాలు వెలువడినాయి. అందు మొదటిది ప్రశాంత, విశాలతర, సర్వ సమన్వయ విజ్ఞానం, నిశ్చల కోమలత్వం, అనంత కరుణ, సార్వభౌమ్య, అనుపమాన వైభవం, సర్వాతీత పరిపాలనా సామర్థ్యం కలది. రెండవది ఉత్కృష్ట శక్తి, అప్రతిహత ఆవేగం, పోరాట పటిమ, ప్రబల సంకల్పం, పట్టరాని వేగం, ప్రపంచాలను వణికింప జేసే శక్తి కలది. మూడవది విశుద్ధత, మాధుర్యం, ఆశ్చర్యం కలగలిసిన మార్మిక సౌందర్యం, సామరస్యత, సునిశిత సరళి, సంక్లిష్ట సూక్ష్మ విస్తారత సమ్మోహక ఆకర్షణ, మనోహర చలనశీలత కలది. నాలుగవది, ప్రత్యక్ష, ప్రగాఢ, ఆంతరిక జ్ఞానము శ్రద్ధా సహిత, లోపరహిత కార్యశీలత, అన్ని విషయముల యందు స్థిరమైన నిస్సందేహపూర్వకమైన పరిపూర్ణత కలిగి ఉంటుంది.

జ్ఞానము, శక్తి, సామరస్యత, పరిపూర్ణత వీటి బహువిధ గుణములు, ఈ గుణములను తమతో బాటు భూమి మీదకు తీసుకొని వస్తూ, వారి విభూతులుగా ఏతెంచిన మానవ రూపాల ద్వారా ప్రకటిస్తూ, అమ్మ ప్రత్యక్ష, సజీవ ప్రభావమునకు గురియగుట ద్వారా వారి భౌతిక ప్రకృతి దైవీతత్వమునకు తెరుచుకొని ఎదగగలిగిన సామర్థ్యానికి తగినట్టు వారియందు నిక్షేపించెదరు.

ఈ నలుగురికి మన మిచ్చిన గొప్ప నామములు - మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి.

## మహేశ్వరి

సర్వాధినేతయైన మహేశ్వరి ఆలోచించే మనస్సుకు సంకల్పానికి పైనున్న విశాల వ్యోమమునందు నివసిస్తూ వానిని పవిత్రీకరిస్తూ, విజ్ఞానముగా వృద్ధి చెందిస్తూ వానికి పైనున్న స్తరాల నుండి వెలువడే కాంతి ప్రవాహాలతో నింపుతుంది. ఆమె మనసు అతిమానస అనంతాలకు, విశ్వవిశాలతలకు, పరమోన్నత కాంతి శోభలకు, అద్భుత విజ్ఞాన భాండాగారాలకు, అవధులు లేని శ్రీమాత శక్తుల ఖేలనానికి తీసుకొనిపోగల మహామయి, జ్ఞానమయి.

సదా నిశ్చలంగా, అద్భుతంగా, విశాలంగా, ప్రశాంతంగా ఉండడం ఆమె లక్షణం. సమస్త విజ్ఞానము ఆమె యందుండుట వలన ఆమెను మరేదీ కదపజాలదు. తెలుసుకొన జూచినదేదీ ఆమెకు తెలియక మానదు. అన్ని వస్తువులను, జీవులను, వాని స్వభావాలను, కదలికలను, ప్రాపంచిక నియమాలను, కాల గమనాలను, వాటి భూత భవిష్యత్ వర్తమానాలను ఆమె గ్రహించి ఉంటుంది.

దేనినైనా స్పృశించగల సామర్థ్యం, అధీనం చేసుకోగల శక్తి ఆమెకుంది. ఊహింపజాలని ఆమె విశాల అసమాన విజ్ఞాన అతీత నిశ్చల శక్తి ముందు మరెవ్వరూ కడవరకూ మనజాలరు. సమత్వము, సహనము, మరల్చలేని ఇచ్ఛ సాయంతో ఆమె మనుష్యులందరితో వారి వారి ప్రకృతిని బట్టి, వస్తు విషయాల పట్ల వాని శక్తి సత్యతలను బట్టి ప్రవర్తించును. ఆమెకు పక్షపాతము లేదు. అయిననూ పరమాత్మ ఆదేశానుసారం కొందరిని ఉన్నతికి, కొందరిని అధోగతికి, ఆమె నుండి దూరముగా గల అంధకారము లోనికి నెట్టివేయును. విజ్ఞానులకు ఆమె మరింత మహత్వపూర్ణ విజ్ఞానము నిచ్చును, ముందుచూపు కలవారిని ఆమె సూచలననుసరింప జేయును.

దుష్టుల మీద వారి దుష్టత్వపు పర్యవసానముల నాపాదించును. అజ్ఞానులను, మూఢులను వారి హ్రస్వ దృష్టి ననుసరించి నడిపించును. ఒక్కొక్క వ్యక్తిని ఆమెవారి ఆవశ్యకతను బట్టి, ఆకాంక్షను బట్టి, వారు కోరుకొనే ప్రతిఫలాన్ని బట్టి, అందుకు కావలసిన తపనను కల్పిస్తూ లేక వారు కోరుకున్న స్వేచ్ఛ ననుసరించి అవిద్యా విధానాల యందు వికసించేటందుకు, లేక నశించేటందుకు కావలసిన విధంగా వారిలోని వేరు వేరు అంశాలను తీర్చిదిద్దును.

ఆమె దేని చేతనూ కట్టుబడి లేదు కనుక, ఈ సృష్టిలో దేనియందు ఆమెకు ఆకర్షణ లేదు కనుక ఇది సాధ్యపడుతుంది. అయిననూ విశ్వజనని హృదయం ఆమెలో అందరినీ మించి వ్యక్తమయ్యి ఉంది. ఆమె దయ అపారం, అనంతం ఆమె కళ్ళకు అందరూ ఆమె బిడ్డలే, పరమాత్ముని అంశలే - అఖరుకు అసురులు, రాక్షసులు, పిశాచాలు, తిరగబడి వ్యతిరేకులుగా మారినవారు కూడా. ఆమె కాదనేది వాయిదా వేయుటకు మాత్రమే, ఆమె విధించే శిక్ష కూడా ఒక వరమే. కాని ఆమె ప్రదర్శించే దయ ఆమె విజ్ఞానాన్ని,

ఆమె చేయవలసిన కార్యాన్ని ప్రక్కదోవ పట్టించేదిగా ఉండదు. వస్తువుల్లో ఉండే సత్యతకే ఆమె అత్యధిక ప్రాధాన్యత నిస్తుంది. జ్ఞానమే, ఆ మె శక్తికి కేంద్రము. మానవ ఆత్మను, ప్రకృతిని దివ్యసత్యమునకు అనుగుణముగా నిర్మించడమే ఆమె దీక్షాకార్యము.

## మహాకాళి

మహాకాళి స్వభావం వేరు. విశాలతరం కాకున్నా ఉచ్ఛతరం, జ్ఞానం కాకున్నా శక్తి, ప్రబలత ఆమె ప్రత్యేక లక్షణాలు. ఒక మహత్తర తీవ్రత, లక్ష్యాన్ని సాధించేందుకు మహెూత్సాహంతో కూడిన శక్తి, ప్రతి అడ్డంకిని, హద్దుని తుత్తునియలు చేయగల దివ్య ప్రచండత ఆమెలో ఉన్నాయి. ఆమెలోని దివ్యత్వమంతా మహామారుత వేగంతో జరిగే కర్మల శోభగా బహిర్గత మవుతుంది. వేగం, మరుక్షణంలో ప్రభావం చూపగల చర్య, తేజోవంతమైన ప్రత్యక్ష ఉత్పాతం, సర్వ శక్తులను ఏకం చేస్తూ జరిపే ఎదురుదాడి కోసమే ఆమె ఉన్నది. అసురునికి ఆమె ముఖకవళికలు భరింపరానివి, దైవాన్ని అసహ్యించుకొనేవారలకు ఆమె స్మరణ ప్రమాదాన్ని, నిర్దయను గుర్తుకు తెస్తుంది. యుద్ధాని కెన్నడూ వెనుకాడని సర్వలోక యోద్ధ ఆమె.

లోపాలు సహించని దగుట వలన, మానవుని లోని మార్పుకు ఇష్టపడనిదానితో ఆమె కఠినముగా వ్యవహరిస్తుంది. మొండి అజ్ఞానాన్ని, అంధకారాన్ని, ఆమె తీవ్రంగా పరిగణిస్తుంది. మోసం, కాపట్యం, దుష్టత్వం పట్ల ఆమె కోపం సత్వరం, భయంకరం, దుష్టసంకల్పాలు ఆమె దండనతో ఒక్కసారిగా సమసిపోతాయి. దైవకార్యం పట్ల ఉదాసీనత అశ్రద్ధ, అలసత్వం ఆమె సహించలేదు. కాలాతీతమైనా పట్టక, మొద్దు నిద్రపోయేవాణ్ణి, పనితనం లేనివాణ్ణి ఒక్క దెబ్బతో ఒకింత నొప్పి కలిగినా, మెలకువ తెప్పిస్తుంది.

వేగంగా, సూటిగా, స్పష్టంగా ఉండే స్పందనలు, వెనుదీయరాని, ఖచ్చితమైన కదలికలు, జ్వాలలా ఎగిసిపడే ఆకాంక్ష మహాకాళి కదలికలను సూచిస్తాయి. ఆమె అస్తిత్వం దేనికీ లొంగదు. గరుడయానం వలె ఆమె ఇచ్ఛ, దృష్టి, ఉన్నతమైనవి సుదూరమైనవి. ఆమె నడక వేగంగా ఊర్ధ్వం వైపు సాగుతుంది. సంహరించడానికైనా, సహకరించడానికైనా ఆమె చేతులు

ఎప్పుడూ విశాలంగా చాచి ఉంటాయి. ఆమె కూడా విశ్వజననియే కనుక ఆమె ప్రేమ కూడా క్రోధం లాగానే తీవ్రంగా ఉంటుంది. ఆమె లోతైన, ప్రగాఢమైన దయ కలది.

ఆమె శక్తిని పనిచేయ నీయుటకు సహకరిస్తే, ముందుకు కదలకుండా బంధించే అడ్డంకులు, సాధకులను, బాధించే వైరి వర్గాలు ఒక్క క్షణంలో ఉనికి కూడా లేదన్నట్లు ఛిద్రమవుతాయి. ఒక ప్రక్క ఆమె కోపం దుష్టులకు భయంకరమైనదైతే, ఆమె తాకిడి తీవ్రత బలహీనులలకు, భయస్తులకు బాధ కలిగిస్తే మహిమాన్వితులు, ధీరులు, ఉత్తములచే ఆమె పూజలందుకొంటుంది. వారిలో నున్న తిరగబడే స్వభావాన్ని ఆమె తాకిడి పటుత్వంగాను, సత్యానుగుణ్యంగాను మారుస్తుంది. వారిలోని వక్ర, వికృతతత్వాలను ఆమె సమ్మెటపోటులు సరిచేస్తూ చెడును, పనికిరానివాటిని బయటకు నెట్టుతాయని వారి అనుభవం.

ఆమె తోడు లేకపోతే ఒక్క రోజులో జరిగేది శతాబ్దాలు పట్టవచ్చు. ఆమె లేకుంటే ఆనందం అట్టహాసంగానున్నా పేలవంగా నుంటుంది. సున్నితంగా, మధురంగా, అందంగా నున్నా వెచ్చని ఉత్సాహపు తీవ్రతలను కోల్పోతుంది. జ్ఞానానికి ఆమె అజేయ దారుఢ్యాన్ని ఇస్తుంది; అందానికి, సామరస్యతకు ఔన్నత్యాన్ని, సర్వాధిగమనతను ఇస్తుంది; పరిపూర్ణత కోసం నెమ్మదిగా సాగే కఠిన శ్రమకు శక్తిని బలాన్నిస్తూ, కాలం పట్టే విధానాలకు సులువైన దారులను సృష్టిస్తుంది. అత్యున్నత ఆనందాలకు అధికాధిక ఉన్నతులలకు, మహా ఉదాత్త లక్ష్యాలకు, విశాలతర క్షేత్రాలకు ఏ మాత్రం తక్కువైనా ఆమె తృప్తి పడదు. అందువల్ల దైవం విజయం ఆమె వలనే సాధ్యం. ఎప్పుడో జరగబోవు గొప్ప సాఫల్యాలు ఇప్పుడే పొందడమనేది జ్వలనంతో, తీవ్రతతో, వేగంతో కూడిన ఆమె దయతోనే సాధ్యం.

## మహాలక్ష్మి

జగన్మాత ప్రభావాలు విజ్ఞానం, శక్తి మాత్రమే కాదు. ఆమె స్వభావానికి సంబంధించిన సూక్ష్మ రహస్యం ఒకటుంది. అది లేనిది విజ్ఞానం, శక్తి అసంపూర్ణం. అది లేనిదే పరి పూర్ణత అపరిపూర్ణం. వీటి పైనుండి శాశ్వత సౌందర్యం అద్భుతాలను ఆవిష్కరిస్తూ, దివ్య సామరస్యత యొక్క నిగూఢ

రహస్యాన్ని కలిగి ఉంటూ, పట్టరాని విశ్వశోభ, ఆకర్షణల ఇంద్రజాలంతో తప్పించుకోలేని విధంగా వస్తువులను, శక్తులను, జీవులను దగ్గరకు చేర్చి పట్టి ఉంచుతూ అవి కలిసి మెలిసి ఉండడం ద్వారా అంతర్గతంగా నున్న ఆనందం తెర వెనుకనుండి తన రూపాలను, గమనాలను ప్రదర్శించేలా చేస్తుంది. ఇది మహాలక్ష్మి లక్షణం. భూతల జీవుల హృదయాలను ఇంతగా రంజింప జేసే దివ్యశక్తి పార్శ్వం మరొకటి లేదు.

మహేశ్వరి భూతల స్వభావ పరిమితులను సమీపించేటందుకు, ధరించేటందుకు మరీ ప్రశాంతంగా, గంభీరంగా, నిరాదరణీయంగా అనిపించవచ్చు. మహాకాళి దాని దౌర్బల్యాలకు మరీ వేగంగా, దుర్భరంగా అనిపించవచ్చు. కాని అందరూ ఆనందంతో, కోరికతో మహాలక్ష్మి వైపు చేరుకొన చూస్తారు. ఆమె మత్తెక్కించే దైవమాధుర్యాన్ని ప్రదర్శిస్తుంది. ఆమెకు చేరువవ్వడం ఒక గొప్ప ఆనందం, ఆమెను హృదయంలో ధరించడమంటే మన ఉనికినే ముగ్ధంగా, అద్భుతంగా మలచడం, దయ, సౌందర్యం లాలిత్యం ఆమె నుండి సూర్యుని కిరణాలవలె వెలువడతాయి. ఆమె మహిమాన్వితమైన చూపు ఎక్కడ నిలిపినా, ఆమె ప్రేమాన్వితమైన మందహాసం ఎక్కడ కురిపించినా, ఆత్మ, అవధుల్లేని ఆనందాల లోతుల్లోకి పట్టుబడి, మునిగి, చిక్కుకుపోతుంది. ఆమె చేతి స్పర్శ, అయస్కాంతంలా ఆకర్షిస్తుంది. ఆ అదృశ్య మృదు ప్రభావం మనస్సు, ప్రాణ, శరీరాలను పవిత్రీకరిస్తుంది. ఆమె పాదం మోపిన చోట ముగ్ధమనోహరమైన ఆనందం మహిమాన్విత ఝరులుగా, సెలయేళ్ళుగా ప్రవహిస్తుంది.

అయిననూ ఈ సమ్మోహనాశక్తి అభీష్టాలను నెరవేర్చడం ఆమె సామీప్యాన్ని పొందడం అంత సులభం కాదు. మనస్సు, ఆత్మల సామరస్యం, సౌందర్యం. బాహ్య కదలికలు, చేతల ప్రతిదానిలో సామరస్యం, సౌందర్యం మహాలక్ష్మి అభీష్టం. ఎక్కడ నిగూఢ వైశ్వానంద స్పందనల పట్ల మక్కువ ఉన్నదో, భగవంతుని వైపు ఆనందంతో తరలివచ్చే జీవసమూహాల సమన్వయం, ఐకమత్యం ఉన్నాయో అటువంటి వాతావరణంలో ఆమె నివసించుటకు ఇష్టపడుతుంది. కాని అసహ్యాకరమైన, నీచమైన, పతనమైనవన్నీ, అసంపూర్ణమైనవి, అనైతికమైనవి, మలినమైనవన్నీ, క్రూరమైన, అనాగరికమైనవన్నీ ఆమె రాకను అడ్డుకుంటాయి.

ఎక్కడైతే ప్రేమ, సౌందర్యం ఉండవో లేక పుట్టనంవో ఆమె అక్కడ ప్రవేశించదు. ఎక్కడైతే అవి నీచమైనవాటితో కలగలసి, వికృతమౌతాయో, ఆమె అక్కడ నుంచి నిష్క్రమిస్తూ ఆమె సంపదలను ఇవ్వజాలదు. మనుష్యుల హృదయాలలో స్వార్థం, ద్వేషం, అసూయ, చెడ్డతనం, జుగుప్స, విరోధం చుట్టుముట్టినప్పుడు, ఆ పవిత్రమైన పాత్రలో కుతంత్రం, దురాశ, కృతఘ్నత కలగలసిపోయినపుడు, కోరికల్లో మొరటు దనం, ఆకాంక్షలో అపరిపక్వత భక్తిని అపవిత్రీకరించినపుడు, అటువంటి హృదయాలలో ఈ మహిమాన్విత, సుందర దివ్యత్వం నిలువజాలదు. ఒక దివ్య అప్రసన్నత ఆమెలో నెలకొని అక్కడి నుండి వైదొలగుతుంది. ఎందువల్లనంటే ఒత్తిడి చేయడం, పోరాడడం ఆమె లక్షణం కాదు. ఒక్కొక్కసారి ఈ బాధాకర, విషపూరిత క్షుద్ర శక్తులు బయటకు నెట్టివేయబడి కనుమరుగయ్యేంత వరకు తనను తెరచాటు కావించుకొని వేచిచూస్తూ ఆ తరువాతనే తన ఆహ్లాదకర ప్రభావాన్ని నూతనంగా ప్రభవింప జేస్తుంది.

వైరాగ్యపు పేలవత్వం, పరుషత్వం ఆమెను మెప్పించజాలవు.హృదయం లోని లోతైన భావాలను వెలువరచలేకపోవడం, ఆత్మ ప్రాణాలలోని సౌందర్యాన్ని మొండిగా అణచివేయడం ఏమాత్రమూ ఆమె సహించజాలదు. ప్రేమ, సౌందర్యాలతోనే భగవంతుని మనుషులతో అనుసంధానం కావిస్తుంది కనుక అవి లేనిదే ఆమె నివసించదు. ఆమె సర్వోత్తమ సృష్టితో జీవనం ఒక స్వర్గలోక కౌశలంగాను, సర్వ అస్తిత్వము దివ్యరస కావ్యంలా మారుతుంది. ఈ భూమిలోని సిరులన్నీ ఒక్కచోటికి చేర్చబడి పొందుపరచబడి ఒక ఉన్నత కార్యం కోసం వినియోగించబడతాయి. అత్యంత సరళంగా, సామాన్యంగా ఉండే వస్తువులు సైతం ఆమె ఏకత్వస్ఫూర్తితో, ఆమె చైతన్యపు ఉచ్ఛ్వాసతో అద్భుతంగా తయారవుతాయి.

ఆమెను హృదయంలో నిలుపుకొనినంతనే విజ్ఞానాన్ని అద్భుత శిఖరాలకు చేరుస్తూ దానికి జ్ఞానానికి పైన ఉండే పారవశ్యపు నిగూఢ రహస్యాలను విశదీకరిస్తుంది. భక్తిని భగవంతుని మధురాకర్షణతో స్వాగతిస్తుంది. బలానికి, శక్తికి, వాటి చేతలలోనున్న సామరస్యపూర్వక మహత్వానికి లయలను నేర్పుతూ, వాటిని నిర్దేశిస్తుంది. వాటిలోని పరిపూర్ణతకు కలకాలం నిలువగలిగే శోభను ప్రసాదిస్తుంది.

# మహాసరస్వతి

మహాసరస్వతి దివ్యమాత కర్మల నొనర్చే శక్తి, పరిపూర్ణత, క్రమబద్ధతలను కలిగి ఉండే అంశం, నలుగురి యందు ఆఖరుదైనా కార్యాచరణలో అత్యంత నైపుణ్యం కలిగినదై భౌతిక ప్రకృతికి అతి చేరువగా నుండును. విశ్వశక్తుల మహత్తర కదలికలను మహేశ్వరి నిర్వహిస్తుంది, మహాకాళి వాటికి కావలసిన శక్తిని ప్రేరణను ప్రసాదిస్తుంది, మహాలక్ష్మి వాని లయలను, గమనాన్ని ఆవిష్కరిస్తుంది. కానీ మహాసరస్వతి వాని నిర్వహణా విధానాన్ని, ఆచరణను, పరస్పర సంబంధాన్ని, ఆ శక్తుల సంయోజనాన్ని, ఫలితాల్లో ప్రయోజకతల్లో లెక్క తప్పనటువంటి నిశ్చయతను నిర్దేశిస్తుంది.

వస్తు విజ్ఞానం కళలు, సాంకేతికత మహాసరస్వతి పరిధిలోనివి. ఆమె ఎంచుకున్న వారిని ఆమె ప్రకృతిలోనికి స్వీకరించి వారికి సూక్ష్మపరిజ్ఞానాన్ని, సునిశిత దీక్షను, కర్మయోగి కలిగి ఉండే స్ఫురిత మనస్సును, హస్త లాఘవాన్ని, నిశిత దృష్టిని ప్రసాదిస్తుంది. లోకాల శ్రేణి విభజనలో ఈ శక్తి దృఢమైన అలుపెరగని శ్రద్ధా పూర్వకమైన, సమర్థవంతమైన నిర్మాణశీలత, యోజనాశక్తి, పరిపాలనాశక్తి సాంకేతికత, కళాత్మకత కలిగినది.

ఆమె రూపాంతరీకరణను, ప్రకృతి పునర్వ్యవస్థీకరణను చేపట్టినపుడు, ఆమె కార్యం కష్టసాధ్యంగా సునిశితంగా మన వ్యాకులతకు ఒకింతమందంగా, అనంతంగా సాగినట్టు అనిపిస్తుంది. కానీ అది స్థిరంగా, సమగ్రంగా, దోష రహితంగా సాగుతుంది. కర్మలలో ఆమె ఇచ్చు కర్తవ్యనిష్ఠతో, నిరవధికతతో, విరామమెరుగనిదై ఉంటుంది. మన పక్షం వహించి ప్రతి చిన్న వివరాన్ని పరిశీలిస్తూ, స్పృశిస్తూ, ప్రతి చిన్న లోపాన్ని అంతరాన్ని, వక్రతనూ, అపరిపూర్ణతనూ గుర్తించి, ఇంతవరకు జరిగినది, ఇక ముందు చేయవలసి ఉన్నది సుస్పష్టంగా పరికించి, నిశ్చితపరుస్తుంది. ఆమె దృష్టిలో అల్పమైనది, నిరర్థకమైనది అంటూ ఏదీ లేదు. ఎంత పట్టజాలనిదైనా, దాగొని ఉన్నా, నిద్రాణంగా ఉన్నా ఆమెనుండి తప్పించుకోలేదు.

మార్చుతూ పునర్మార్చుతూ ఒక్కొక్క అంశానికీ దాని సత్యానుగుణ్యమైన రూపాన్నిచ్చేంత వరకూ సమష్టిలో తన నిర్దేశిత స్థానాన్ని పొంది, తన విధి పూర్వక వస్తు వ్యవస్థీకరణ, పునర్వ్యవస్థీకరణల్లో, ఆమె చూపు అన్ని

ఆవశ్యకతలను వాటిని పొందేటందుకు ఒకేసారి పనిచేస్తుంది. ఆమె అంతః స్ఫూర్తి ఏది ఎంచుకోవాలో, దేనిని తిరస్కరించాలో తెలుసుకొని, సాఫల్యంతో సరియైన పరికరాన్ని, సరియైన సమయాన్ని, సరియైన పరిస్థితులను, సరియైన పద్ధతిని గుర్తిస్తుంది.

బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం, అలసత్వం ఆమెకు అసహ్యం. సోమరిపని, హడావుడి పని, కలగలుపు పని, గందరగోళం, ఇంచుమించు సరి పెట్టడం, ఒకటనుకొని మరొకటి చేయడం, ఒకదానిని మరొకదానికి వాడడం, వస్తువులను, ఉపకరణాలను దుర్వినియోగపరచడం, పనిని వదిలివేయడం లేక సగం మాత్రమే చేయడం, ఇవన్నీ ఆమె ప్రకృతికి విరుద్ధమైనవి. సహించరానివి. ఆమె పని పూర్తిచేసినతరువాత, ఏ ఒక్కటీ మరచిపోయిగాని, తప్పుగాగాని, విడిచి పెట్టబడిగాని, పాడుచేయబడిగాని మిగలదు. అంతా ఖచ్చితంగా, సవ్యంగా, పరిపూర్ణంగా, ప్రశంసనీయంగా ఉంటుంది. పరిపూర్ణమైన పరిపూర్ణత మాత్రమే ఆమెను ఒప్పించగలదు. సృష్టి కార్య పూర్ణత్వానికి అనంతమైన శ్రమ కావలసివస్తే, అందుకు ఆమె సిద్ధం. మనిషితోను, అతని వేలాది అసంపూర్ణతలతోనే అనాదిగా బాధింపబడుతున్న దివ్యమాత శక్తులన్నింటిలోను మొదటిది ఆమె.

దయతో, చిరునవ్వుతో, చేరువతో సాయం చేస్తూ, చిన్నవాటికే వెనుదీయక, అసంతృప్తి చెందక, ఎన్నిసార్లు ఓటమిపాలైనా పట్టువిడువక ఉంటూ, మనం చిత్తంలో ఏకోన్ముఖులమై, స్పష్టంగా నిష్కపటంగా ఉన్నంత వరకూ ఆమె చేయి మన ప్రతి అడుగులోను పట్టి ఉంచుతుంది. రెండు ధోరణుల మనస్సును ఆమె సహించజాలదు. ప్రదర్శించే వ్యంగ్యత్వం నాటకాన్ని, అనుకరణను, ఆత్మవంచనను, భేషజాన్ని ఆమె నిర్దయతో బయట పెడుతుంది. మన అవసరాలకు తల్లిగా, కష్టాలలో స్నేహితురాలిగా, అలుపెరుగని ప్రశాంత ఉపదేశకురాలిగా, మార్గదర్శకురాలిగా, తన వెచ్చని చిరునవ్వుతో మేఘాలుగా అలుముకున్న దుఃఖాన్ని అసహనాన్ని, నిరాశను పారద్రోలుతూ, నిరంతర సాయాన్ని తరచి తరచి గుర్తుకుతెస్తూ, శాశ్వత సూర్యకాంతివైపు దారి చూపిస్తూ, ఊర్ధ్వప్రకృతి సమగ్రతవైపు నడిపించే ప్రగాఢ, నిరంతర ప్రేరణను దృఢంగా ప్రశాంతంగా, స్థిరంగా అందిస్తుంది. అన్ని ఇతరశక్తులు తమ కార్యం పూర్తి అయ్యేటందుకు ఆమె మీద ఆధారపడతాయి.

ఆమె భౌతికంగా పునాదులను దృఢపరుస్తూ, కార్యరంగ వివరాలను విచారించి, సౌధం రక్షకకవచాన్ని కూర్చి, నిర్మిస్తుంది.

## ఈ మూడు విషయాలు నీలో ఉండాలి

నీవు రూపాంతరీకరణను, కోరుకుంటే వితండవాదం చేయకుండా, ఎదురు తిరగకుండా శ్రీమాతకు ఆమె శక్తులకు సమర్పించుకొని ఆమె కార్యాన్ని నిరాటంకంగా నీలో జరుపుకొనే అవకాశం కల్పించు. నీవు కలిగి ఉండవలసిన మూడు లక్షణాలు - ఎరుక, నమనీయత, నిరపేక్షాపూర్వక సమర్పణ. మనస్సు, ఆత్మలయందు, హృదయం, ప్రాణముల యందు, ఆఖరకు శరీర కణములయందు కూడా శ్రీమాత ఆమె శక్తుల వాటి ప్రభావం ఎరుకను నీవు కలిగియుండాలి. ఆమె నీ అజ్ఞానంలోను, నిద్రాణంగా నున్న భాగాలనూ, ఆదమరచిన క్షణాల్లోనూ కూడా పనిచేస్తూ ఉండి ఉన్నా, నీవు ఎరుకతో, సజీవ సంపర్కంతో ఉన్న దానితో అది సమానం కాదు.

ఆమె స్పర్శకు నీ స్వభావమంతయూ నమనీయంగా ఉండాలి. తనకు తాను సరిపెట్టుకొంటూ తనలోని మార్పును, విజ్ఞతను ప్రశ్నిస్తూ, అనుమానిస్తూ, వ్యతిరేకించే మూర్ఖమనస్సులా ఉండరాదు; అడ్డుపడుతూ, నిస్సహాయతలోనూ, జడత్వంలోనూ కూరుకుపోయి తన అల్పత్వం అజ్ఞానంతోనే మురిసిపోతూ తన ఆత్మ ప్రేరణలేని అలవాట్లను మొద్దు బద్ధకాన్ని, సోమరినిద్రను తట్టి లేపే ప్రతి స్పర్శకు గగ్గోలు పెట్టే మనిషిలోని భౌతికంలా ఉండరాదు.

నీ అస్తిత్వం ఆంతరంలోనూ బాహ్యంలోనూ ఒనర్చిన నిరపేక్షాపూర్వక సమర్పణ ఈ నమనీయతను నీ ప్రకృతిలోని అన్ని భాగాలకూ తీసుకువస్తుంది. పైనుండి క్రిందకు ప్రవహించే విజ్ఞానం, కాంతి, శక్తి, సామరస్యత, సౌందర్యం, పరిపూర్ణతలకు నిరంతరం తెరచుకొని ఉండటం ద్వారా నీలో అంతటా చైతన్యం మేల్కొంటుంది. చివరకు శరీరం కూడా మేల్కొని అప్పటి వరకూ నిద్రాణంగానున్న అతిమానస అతీత చైతన్యశక్తిచే దాని సర్వ విభూతులచే పైనుండి క్రిందనుంచి, అన్ని దిక్కుల నుంచి చుట్టుముట్టబడి పరమోన్నత ప్రేమానందాలకు పులకించిపోతుంది.

*CWSA 32:14-25* *శ్రీ అరవిందులు*

# పన్నెండు విశిష్ట గుణాలు

కిందటి సారి నేను పన్నెండు విశిష్ట గుణాల గురించి చూస్తున్నానని నీకు చెప్పాను.

(శ్రీమాత ఒక కాగితాన్ని బయటకు తీసారు). అవి అక్కడున్నాయి, ఎవరికో ఇవి కనబడ్డాయి.

**1.** చిత్తశుద్ధి **2.** వినమ్రత **3.** కృతజ్ఞత **4.** పట్టు విడువని ప్రయత్నం **5.** ఆకాంక్ష **6.** గ్రహణశీలత **7.** పురోగతి **8.** ధైర్యం **9.** మంచితనం **10.** దయాగుణం **11.** సమచిత్తత **12.** శాంతి

మొదటి ఎనిమిది దైవం వైఖరిని చూపిస్తాయి, చివరి నాలుగు మానవజాతి వైపు చూపిస్తాయి.

శ్రీ అరవిందుల వివరణను మేము కనుగొన్నాము (పన్నెండు దళాలతో రంగులతో ఉన్న పటం)

కేంద్రం, నాలుగు శక్తులు, శ్వేతవర్ణం. పన్నెండు దళాలు విభిన్న రంగుల్లో మూడు వర్గాలుగా ఉన్నాయి. పై వర్గం ఎరుపు, కాషాయి వర్ణాన్ని దాటుకొంటూ పసుపులోకి వెళుతుంది. తరువాత దళ వర్గం పసుపురంగు, ఆకుపచ్చరంగును దాటుకొంటూ నీలంలోకి వెళుతుంది. మూడవదళ వర్గం నీలం, ఉదారంగును దాటుకొంటూ ఎరుపులోకి వెళుతుంది. తెలుపు అనువుగా లేదనుకొన్నప్పుడు కేంద్రానికి బంగారురంగు (చూర్ణం) వాడుకోవచ్చు.

*శ్రీ అరవిందులు, మార్చి 20,1934*

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ జనవరి 19,1972*



# చిత్తశుద్ధి



మొట్టమొదటగా తనను తాను మోసగించుకోకపోవడం, దైవాన్ని మోసగించలేరని తెలుసు కదా. అత్యంత తెలివైన అసురులకు కూడా దైవాన్ని మోసగించడం సాధ్యం కాదు. అయితే ఆ విషయం అర్థమైనా కూడా తరచుగా జీవితంలో అనునిత్యం, రోజు వారి కార్యక్రమంలో తమను తాము మోసగించుకొనే ప్రయత్నం, అలా చేస్తున్నామని తెలియకుండానే చేస్తుంటారు. తనకు తానుగానే చాలా మటుకు యాంత్రికంగానే ఎల్లప్పుడు తాము చేసిన ప్రతి దానిని, తమ మాటలను, చేతలను సమర్థించుకోజూస్తుంటారు. మొదట జరిగేది అదే. స్పష్టంగా వ్యక్తుల మధ్య జరిగే పోట్లాటలు (తగాదాలు), అందులో మాట్లాడే 'తప్పు అవతలి వారిదే' అనే వాటిని గురించి నేను చెప్పడం లేదు. నిత్యం జీవితంలో జరిగే చాలా స్వల్ప విషయాల గురించి నేను మాట్లాడుతున్నాను.

నాకు తెలిసిన పిల్లవాడు తలుపును కొట్టుకుని, దాన్ని తిరిగి గట్టిగా తన్నాడు! విషయం అలాగే ఉంటుంది. ఎల్లప్పుడు అవతలి వారిదే తప్పిదం అని, వారే పొరపాటు చేశారని అనడం జరుగుతుంది. ఒకవేళ నీవు బాల్యావస్థను దాటినా, నీకున్న కొద్దిపాటి బుద్ధితో, నీవు ఇంకా అత్యంత బుద్ధిహీనమైన సాకును చెప్తావు. "అతడా పని చేయకుంటే నేనీ పనిని చేసి ఉండేవాడిని కాదు" కాని అది అసలు జరిగిన దానికి పూర్తిగా వ్యతిరేకం!

దీనినే నేను చిత్తశుద్ధితో ఉండటం అని అంటాను. నీవు ఎవరితోనైనా ఉన్నప్పుడు, నీవు చిత్తశుద్ధితో ఉంటే, నీ ప్రతిచర్య అప్రయత్నంగానే సరైన రీతిలోనే ఉంటుంది. ఆ విధంగా చేయనటువంటి వారితో కూడి ఉన్నప్పటికీ కూడా. కోపం తెచ్చుకొనే మనిషి సర్వసామాన్యమైన ఉదాహరణనే తీసుకో: బాధ పెట్టే మాటలు మాట్లాడటానికి బదులుగా, నీవు ఏదీ మాట్లాకుండా, నిశ్చలంగా, ప్రశాంతంగా ఉండు. ఆ కోపం నీకు సంక్రమించదు. ఇది తేలికైన విషయమేమీ కాదు. కేవలం నీలోనికే నీవు చూచుకోవాలి. ఇది చాలా ప్రాథమికమైన విషయం. నీవు చిత్తశుద్ధితో ఉన్నావా లేవా అనేదానికి ఇది

చాలా చిన్న ప్రారంభం. ప్రతి ఒక్క అంటురోగాన్ని అంటించుకొనే వారి సంగతి నేను మాట్లాడడం లేదు. మోటుగా పరిహసించే వారిని లేదా ఇతరులు చేసే బుద్ధిహీనమైన దానినే చేసేవారిని గురించి కూడా నేను మాట్లాడడం లేదు.

నేను చెప్పేది ఆలకించు. తీక్షణమైన దృక్కులతో నిన్ను నీవు చూచుకుంటే, వందలకొద్దీ కపట బుద్ధులను నీలో నీవు పట్టుకోగలుగుతావు. నీ సర్వ సాధారణమైన వైఖరిలో చిత్తశుద్ధితో ఉండటానికి నీవు ప్రయత్నిస్తున్నా కూడా. నీకది ఎంత కష్టమో తెలుస్తుంది.

*

సంపూర్ణంగా చిత్తశుద్ధితో ఉండాలంటే తప్పనిసరిగా ఎటువంటి ప్రాధాన్యత, ఎటువంటి కోరిక, ఎటువంటి ఆకర్షణ, ఎటువంటి అయిష్టత, ఎటువంటి దయ లేదా వైరము, ఎటువంటి అనురాగము, ఎటువంటి వికర్షణ ఉండకూడదు. మనిషి తప్పకుండా విషయాల యెడ సంపూర్ణ, సమగ్ర దృష్టి కలిగి ఉండాలి. అందులో ప్రతిదీ దాని స్థానంలో ఉండి, అన్ని విషయాల మీద ఒకరికి ఒకే విధమైన వైఖరి ఉంటుంది: సత్యదృష్టి వైఖరి.

*

చిత్తశుద్ధి అంటే అస్తిత్వ గమనాలన్నింటినీ అప్పటికే చేరుకున్న ఉన్నతోన్నత చేతనా, సాక్షాత్కార స్థాయికి పైకెత్తటం చేయాలి. చిత్తశుద్ధి అస్తిత్వంలోని అన్ని భాగాలు, గమనాలు, దివ్య ఇచ్ఛ కేంద్రం చుట్టూ ఏకీకరణతో, సామరస్యతతో ఉండాలని కచ్చితంగా అడుగుతుంది.

*

ఎప్పుడైతే చిత్తశుద్ధి ఉంటుందో, ఆ సహాయం, ఆ మార్గదర్శనం, ఆ అనుగ్రహం నీకు సమాధానం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నదని తెలుసుకుంటావు. నీవు ఇంక ఎంతో కాలం పొరపాటు పడవు.


- శ్రీమాత

నిరాబండరమైన చిత్తశుద్ధి అన్ని పురోభివృద్ధులకు ఆరంభం

(శ్రీమాతచే ఈ పుష్పానికి ఆధ్మాతిక ప్రాధాన్యత ఇవ్వబడింది)

శాస్త్రీయ నామం : అస్టర్ అమెల్లస్

# వినమ్రత



ప్రశ్న : వినమ్రతతో ఉండటానికి ఏది సరైన పద్ధతి, ఏది తప్పు పద్ధతి? ఇది చాలా తేలిక. “వినమ్రతతో ఉండమని” జనానికి చెప్పడం జరిగితే, తక్షణం వారనుకునేది “ఇతరుల ముందు వినయంతో ఉండటం”, అటువంటి నమ్రత తప్పే. అసలైన వినమ్రత దైవం ముందు వినమ్రత. అదే కచ్చితంగా, నిశ్చితంగా, భావనలో దైవంలేక తాను శూన్యం, వ్యక్తి ఏమీ చేయలేడు, ఏమీ అర్థం చేసుకోలేడు. ఒకవేళ ఒక వ్యక్తి గనుక అసాధారణ ప్రజ్ఞ కలిగి, సామర్థ్యం కలిగినవాడైనా దివ్య చైతన్యం ముందు అది ఎందుకూ కొరగాదు. ఈ భావనను ఎల్లప్పుడూ తప్పక ఉంచుకోవాలి.. ఏలననగా, అప్పుడు ఎల్లప్పుడూ గ్రహించడానికి అసలైన వైఖరిని కలిగిన వారవుతారు.

ఒక వినయపూర్వకమైన గ్రహణశీలత ఏదైతే ఉందో అది దైవానికి వ్యతిరేకంగా వ్యక్తిగతమైన టక్కుటమారాలను ఉంచదు.

ప్రశ్న : మాతా, మేము ఒక ప్రయత్నం చేస్తే, మాలో ఏదో చాలా ఆత్మ సంతృ ప్తిని పొంది, ఆ ప్రయత్నంలో బడాయిలు పోయి, సంతృప్తిని పొందుతుంది. అది సమస్తాన్ని చెడగొడుతుంది. అటువంటప్పుడు మేము దాని నుంచి తప్పించు కోవటం ఎట్లా?

ఆహా, చేసేదానినంతటినీ చూసే దొకటుంటుంది! ఏదైనా ఒక పని చేస్తుంటే ఎల్ల ప్పుడూ వారిని కని పెట్టి చూసేది ఒకటుంటుంది! ఇప్పుడు ఒక్కొక్కప్పుడు, అతడు గర్విస్తాడు. సహజంగానే, ఇది ఆ ప్రయత్నం నుంచి చాలా బలాన్ని లాగేసుకుంటుంది. నేను దానిని ఈ విధంగా అనుకుంటు న్నాను: తాను ఏదైనా చేస్తున్నప్పుడు తనను తాను చూచుకొనే అలవాటు, తన జీవనాన్ని చూచుకోవటం. ఒకరు తమను తామే పరిశీలించుకోవటం ఆవశ్యకమైన విషయమే. కాని దానిని మించి ఇంకా ఆవశ్యకమైనది సంపూర్తిగా చిత్తశుద్ధితో ఉండటం, తాను చేసేదానిలో స్వతస్సిద్ధంగా (సహజ సిద్ధంగా) ఉండటం, చాలా స్వతస్సిద్ధంగా ఉండటం: ఎల్లప్పుడూ తనను తాను పరి

శీలించుకోకుండా ఉండటం, తానేం చేస్తున్నానోనని చూసుకోకుండా ఉండటం, తనకు తాను న్యాయనిర్ణయం చేసుకుంటూ ఉండకుండా ఉండటం - అదే ఒక్కొక్కప్పుడు చాలా కఠినంగా. అది ఎటువంటిదంటే, యథార్థానికి సంతృప్తితో తనను తాను వెన్ను చరచుకుంటూ ఉండటమంత చెడ్డది, రెండూ సమానంగా చెడ్డవే.

## వినమ్రత

దాని నిరాడంబరతలో ఆరాధనీయం (పుష్పం ఆధ్యాత్మిక ప్రాముఖ్యత శ్రీమాతచే ఇవ్వబడింది)

శాస్త్రీయ నామం : అగ్రోస్టిస్ నెబులాసా

ఒకరు ఎంత చిత్తశుద్ధితో ఉండాలంటే, తాను ఆకాంక్షిస్తున్నాననే విషయం కూడా తెలియనంతగా, అతడు తనకు తాను ఆకాంక్ష అయిపోవాలి.

*CWM 5:44-45, 6:402* శ్రీమాత

## కృతజ్ఞత



భక్తితో పాటుగా నిరంతరం వెంట ఉండాల్సినది మరొకటి ఉన్నది. అదే 'దైవం' యెడల కృతజ్ఞత. దైవం ఉన్నాడనే బలమైన నమ్మకం నీలో కృతజ్ఞతా భావాన్ని నింపాలి. అది మహదానందంగా నీవు భావించాలి.

ఎంత పాశవిక ప్రవృత్తులను మనం ఎదుర్కొంటున్నా, అంతటా దైవం కూడా ఉన్నాడనే నమ్మకం కూడా బలంగా ఉండాలి. ఆ నమ్మకం అద్భుతమైన, అనంతమైన ఆనందాన్ని నీ హృదయంలో నింపాలి. దాని వలన జనించే కృతజ్ఞతా భావమే ఒక మధురమైన భావన!

కృతజ్ఞతా భావానికి మించిన ఆనందం మరొకటి లేదు. మనం ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తున్నా, పక్షుల పాటలకు పరవశిస్తున్నా, కుసుమాల సౌకుమార్యాన్ని తిలకిస్తున్నా, శిశువుల శైశవశత్వానికి ముగ్ధులమౌతున్నా, దాతృత్వపు కార్యక్రమాలను శ్లాఘిస్తున్నా, చక్కని వాక్యనిర్మాణం చూచి అబ్బురపడుతున్నా, సూర్యోదయ, సూర్యాస్త మయాలను చూచి ఆనందపడుతున్నా, అన్ని చోట్లా వెల్లి విరిసేది 'దివ్యత్వమే' అని భావించాలి.

'దివ్యత్వం' తో సంబంధం లేనిది ఈ ప్రపంచంలో లేనే లేదు. ఇందుకే దైవానికి సదా మనం కృతజ్ఞులమై యుండాలి.

*CWM 8:40*

మనం దైవానికి 'సర్వదా కృతజ్ఞులమే' అనే భావం మన హృదయాలలో నిరంతరం జ్వలిస్తూనే ఉండాలి. ఆ మధురమైన భావనలో మన 'అహం' 'అజ్ఞానం' కరిగిపోవాలి. అట్టి కృతజ్ఞతా భావపు వెలుగే సాధకుని గమ్యానికి చేర్చగలదు. సాధకుడు ఎంత కృతజ్ఞుడై ఉంటాడో అతని మార్గం అంత దగ్గర దవుతుంది.

శాస్త్రీయ నామం : ఇపోమొయి కార్నియా

## పట్టువిడవని ప్రయత్నం




అవసరమైతే అదేపనిని మళ్ళీ మళ్ళీ వేలసార్లైన మొదలుపెట్టి చేయడానికి సంకల్పించకపోతే తప్ప... నీకు తెలుసా, ఎంతోమంది నాదగ్గరకొచ్చి నిరాశతో "నేను అనుకొన్నాను ఆ పని పూర్తి అయిపోయిందని, కాని ఇప్పుడు అది మొదటికొచ్చింది, మళ్ళీ దాన్ని మొదలుపెట్టాలి" అని వాపోతారు. వాళ్ళకిలా చెబుతాను 'అదేమి కాదు, నీవు మళ్ళీ దాన్ని మొదలుపెట్టి, వంద సార్లైనా, రెండొందల సార్లైనా లేదా వేలసార్లైనా చేసి పూర్తి చెయ్యాల్సిందే; నీవు దానిలో ఒక అడుగు ముందుకెళ్తావు, నీవు సురక్షితం అనుకొంటావు. కాని పూర్వపు కష్టాన్ని కల్గించేదేదో ఎప్పుడూ నీ ముందుంటుంది. నీవు అనుకొంటావు సమస్య తీరిందని, కాని మళ్ళీ దాన్ని పరిష్కరించాల్సి వస్తుంది. అదేసమస్య కొంచెం వేరేలా కనిపిస్తుంది. కాని అదే ఎన్నివేలసార్లూ పునరావృతమయినా, అన్ని వేల సార్లు నేను ఆ పని చేసి తీరుతాను, కాని దాన్ని పూర్తి చేస్తాను అని దృఢంగా నిర్ణయించుకోకపోతే యోగం నీవు చేయలేవు. ఈ పట్టు విడువని ప్రయత్నం అత్యావశ్యకం.

*CWM 8:41-42, 14:163* — *శ్రీమాత*

శాస్త్రీయ నామం : కాలెండులా అఫిషినాలిస్

# ఆకాంక్ష



ఆకాంక్ష అనేది ఒక వ్యక్తికి ఉన్నత విషయాల వైపుకు పిలుపు భగవంతుని కోసం, ఉన్నతమైన లేదా దివ్యచేతనకు సంబంధించిన దానంతటి కోసం పిలుపు.

ఆకాంక్ష ఒక కోరిక రూపంలో ఉండకూడదు, అది ఆంతరిక అంతరాత్మ అవసరపు సంవేదన కావాలి. భగవదోన్ముఖమైన నిశ్శబ్దంగా నెలకొన్న సంకల్పమై భగవంతుణ్ణి కోరుకోవాలి.

*CWSA 29:60-61*

ఆదర్శవంతమైన సాధకుడు పవిత్ర బైబిల్ ప్రవచనంలా 'ప్రభువు కోసం నా తపన నన్ను తినివేసింది' అనుకోగలగాలి. ప్రభువు కోసం ఈ తపన, ఉత్సాహం దైవికమయిన ఫలితాల కోసం మొత్తం ప్రకృతి స్వభావ ఉత్సాహం. వ్యాకులత అనేది భగవంతుని పొందటానికి హృదయపు ఆతురత. తాను కోరుకొనే సంపూర్ణమూ, విశాలమూ అయినదానిని స్వీకరించటానికి తన అహాన్ని త్యజించి, తన అల్పమైన సంకుచితమైన మూసను ఛేదించు కుంటుంది. అది విశ్వజనీనం కావటం వలన అన్నిటినీ అతిశయించి వుంటుంది. విశ్వాతీతం కావటం వలన బృహత్తరమూ, ఉన్నతమయిన వ్యక్తిగత ఆత్మను, స్వభావాన్నీ అధిగమిస్తుంది.

*CWSA 23:58*

ప్రశ్న: శ్రీమాతా! నిజాయితీ అయిన ఆకాంక్ష అంటే సరియైన అర్థం అహంకార పూరితమయిన స్వలాభాపేక్షతో సమ్మిళితం కాని ఆకాంక్ష.

మీరొక చేతనాయుతమయిన ఆకాంక్ష స్థితిలో ఉండి చాలా నిజాయితీగా ఉన్నప్పుడు మీ చుట్టూ ఉన్నవన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మీ ఆకాంక్షకు సహాయకరంగా ఏర్పడతాయి. మిమ్మల్ని ప్రగతి చెందించటానికో, మిమ్మల్ని నూతనమయిన విషయంతో సంస్పర్శలో ఉంచటానికో లేక మీ ప్రకృతినుండి అంతర్ధానం కావలసిన ఒక విషయాన్ని తొలగించటానికో సహాయ పడుతుంది. ఇది చాలా గుర్తించవలసిన విషయం. మీరు నిజంగా ఒక తీవ్రమయిన ఆకాంక్షతో ఉంటే మీ ఆకాంక్షను సఫలీ కృతం చేయటానికి దోహదం చేయని పరిస్థితులు ఉండవు. అన్నీ కదలివస్తాయి. ఒక పరిపూర్ణమయిన


సంపూర్ణమయిన చైతన్యం మీ చుట్టూ అన్నిటినీ వ్యవస్థీకరిస్తున్నట్లుగా అన్నీ కదలివస్తాయి.

*CWM 29:56,14, 726:176* *శ్రీమాత*

## ఆకాంక్ష

అసంఖ్యాకంగా, దృఢంగా, నిర్విరామంగా, పదేపదే పునరావృతం అవుతూ వుంటుంది. (శ్రీమాత యిచ్చిన ఆధ్యాత్మిక సంకేతం)

శాస్త్రీయ నామం: నిక్టేంథస్ ఆర్బ్బార్



## స్వీకరణం (గ్రాహ్యత)

దివ్యక్రియాశక్తిని స్వీకరించగల సామర్థ్యం, ఆశక్తి ఉనికిని అందులో శ్రీమాత సన్నిధిని అనుభూతి చెందగలగటం వ్యక్తి దృష్టి, సంకల్పం, కార్యాచరణలో మార్గదర్శకంగా దానిని పనిచేయనివ్వడం.

*CWSA 29:266* *శ్రీ అరవిందులు*

నా ప్రేమ ఎల్లప్పుడు మీతో ఉంటుంది. మీరు దానినెందుకు అనుభూతి చెందలేక పోతున్నారంటే మీరు దానిని స్వీకరించలేక పోవటం వలన, మీ గ్రహణతాలోపం వలన. దానిని పెంపొందించుకోవాలి అందుకు మిమ్మల్ని మీరు తెరుచుకోవాలి. మిమ్మల్ని మీరు సమర్పించుకున్నపుడే అలా తెరుచుకోగలుగుతారు. ఖచ్చితంగా మీరు ఎంతో కొంత చైతన్యవంతంగా శక్తులను దివ్యప్రేమను పొందటానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పద్ధతి సరియైనది కాదు. మీరు లెక్కలు వేసుకోకుండా, తిరిగి ఏమీ ఆశించకుండా సమర్పణ చేస్తున్నప్పుడు మీరు స్వీకరించగల సామర్థ్యాన్ని పొందుతారు.

## శ్రీమాతా! గ్రాహ్యత దేనిపై ఆధారపడి ఉంటుంది?

అది మొదట నిజాయితీపై. నిజంగా స్వీకరించాలనుకుంటున్నారా లేదా అనే విషయం పై అవును నిజాయితీ, విధేయత అనే రెండు ముఖ్యమయిన విషయాలని నేను విశ్వసిస్తాను.

అహంకారాన్ని మించి మిమ్మల్ని మూసివేసేది మరేదీ ఉండదు. మీతో మీరు సంతృప్తి పడిపోయినపుడు మీ లోపాలను అంగీకరించలేనటువంటి

అహంభావాన్ని కలిగి ఉన్నప్పుడు మీరు తప్పులు చేస్తారు. మీరు అసంపూర్తిగా, అపరిపూర్ణంగా ఉంటారు. మీ స్వభావంలో ఏదో యిలా బిగువుగా తయారవుతుంది. అది ఒప్పుకోదు. ఇదే మిమ్మల్ని స్వీకరించకుండా నివారిస్తుంది. మీరు ఎలా అయినా ప్రయత్నించి మీలోని ఎంత చిన్న అంశమయినా అంగీకరించేటట్లు చేయగలిగితే "అవును నేను పొరపాటు పడ్డాను. నేను అలా చేయకుండా ఉండవలసింది. నేనలా చేయకూడదు. నేనలా భావించకూడదు. అవును అది పొరపాటే," మీరిలా అంగీకరించ గలిగితే, మొదట నేనిపుడు చెప్పినట్లుగా మీకు చాలా బాధగా అనిపిస్తుంది. కానీ మీరు అంగీకరించేంతవరకూ గట్టిగా పట్టుకొని ఉన్నపుడు వెంటనే అది తెరుచుకుంటుంది. విచిత్రంగా తెరుచుకొని వెలుగు వరదలా ప్రవేశిస్తుంది. ఆ తరువాత మీరు చాలా ఆనందిస్తారు. ఎంత సంతోషపడతారంటే మిమ్మల్ని మీరే ప్రశ్నించుకుంటారు. "నేనెందుకు యింతకాలం మూర్ఖంగా వద్దనుకున్నాను?" అని.

*CWM 14: 148, 6: 117*


## స్వీకరణ (గ్రాహ్యత)

దివ్య సంకల్పపు ఎరుక కలిగి దానికి సమర్పితం కావటం

(శ్రీమాత యిచ్చిన ఆధ్యాత్మిక సంకేతం)

శాస్త్రీయ నామం : గ్లాడియోలస్ గోర్టులానస్

# పురోగతి



అంతరంగిక పురోగతిలో మొదటి నియమం ప్రకృతిలోని ఏదైనా భాగంలో అనుచిత చర్య జరిగిన లేదా జరుగుతున్నా, అనుచిత కదలిక - అనుచిత ఆలోచన, అనుచిత భావన, అనుచిత సంభాషణ, అనుచిత చర్య. ఇక్కడ అనుచితం అనగా సత్యం నుండి, ఉన్నత చైతన్యం మరియు ఉన్నత వ్యక్తిత్వం నుండి, దైవమార్గం నుండి మరలించేదానిని గుర్తించడం. ఒకసారి దీనిని గుర్తించినట్లయితే దానికి వ్యాఖ్యానంతో పని లేదు లేదా వాదించ నవసరం లేదు. దివ్యప్రకాశం, దివ్యానుగ్రహం అవతరించుటకు

వాస్తవ చైతన్యం వైపు సరైన పయనం కొరకు ప్రత్యామ్నాయంగా మారుటకు అది దైవానికి అర్పించబడుతుంది.

CWSA 29:131 *శ్రీ అరవిందులు*

## సృష్టిలో దైవప్రభావ చిహ్నమే పురోగతి

భౌతిక జీవన ఉద్దేశ్యం పురోగతి. మీరు పురోగతిని ఆపివేస్తే మీరు మరణించుతారు. పురోగతి చెందకుండా మీరు గడిపే ప్రతిక్షణం మీ మరణానికి మరింత చేరువవుతుంది. మీరు సంతృప్తి చెందుతూ, ఇకపై అభిలషించకుండా ఉండే క్షణం నుండీ మీరు మరణించుట ప్రారంభిస్తారు. జీవితం ఒక ప్రయాణం, జీవితం ఒక ప్రయత్నం, అది భవిష్యత్తులోని ఈశ్వర ఆదేశాలు, జ్ఞానాన్ని అందుకునేందుకు ముందుకు సాగుతూనే ఉంటుంది. విశ్రాంతి కోరుకోవడం కంటే మరేది మరింత ప్రమాదకరం కాదు.

ప్రతి ఒక్కరికీ నేర్చుకోవడానికి, పురోగతి చెందటానికి ఎల్లప్పుడూ అవకాశం ఉంటుంది. ప్రతీ సందర్భంలో అనుభవ పాఠం నేర్చుకునేందుకు, పురోగతి సాధించేందుకు మనకు అవకాశం లభిస్తూనే ఉంటుంది.

పురోగతి: ప్రతీ క్షణం మార్గంలో పురోగమనం సాధించేందుకు మనకు ఉన్న అంతటినీ, అన్నింటినీ త్యజించుటకు సంసిద్ధుడై ఉండటమే.

వాస్తవమైన పురోగతి అంటే దైవ సామీప్యానికి చేరువ అవుతూ ఉండటమే.

*CWM 15:75, 77*

పురోగతి: మనము ఈ భూమిపై దీని కోసమే ఉన్నాము.

(శ్రీమాత తెలిపిన పుష్పం ఆధ్యాత్మిక ప్రాధాన్యత),

శాస్త్రీయ నామం : కాథారాంథస్ రోస్యూస్

## ధైర్యం



ఏ విధమైన రూపంలోనూ భయం లేకపోవడమే ధైర్యం.

*CWM 10:282*

భయం ఒక విధమైన మాలిన్యం, అతి పెద్ద భయంకరమైన మాలిన్యాలలో ఒకటి. భూమి పై దైవకార్యాన్ని విధ్వంసం చేయుటకు ప్రయత్నించే అదైవిక

శక్తుల నుండి నేరుగా వచ్చేవాటిలో ఒకటి. యోగాన్ని యథార్థంగా చేయాలనుకునేవారు, పూర్తి శక్తితో, పూర్తి చితశుద్ధితో పూర్తిగా వారి సామర్థ్యమంతటిని ఉపయోగించి సహనశీలతతో ఛాయామాత్రంగానైనా ఉన్న భయాన్ని తొలగించుకోవడమే ప్రధాన కర్తవ్యం. ఆ మార్గంలో పయనించేందుకు ప్రతీ ఒక్కరూ ధైర్యంగా ఉండాలి. అటువంటి స్వల్పమైన, అతి చిన్నదైన, దుర్బలమైన, నీచమైన కుచించుకుపోయేలా చేసే భయాన్ని ఎప్పటికీ దరిచేర్చరాదు.

ప్రబలమైన ధైర్యం, సంపూర్ణమైన చిత్తశుద్ధి, చిత్తశుద్ధితో కూడిన సమర్పణ కావాలి. అట్లాంటి వారు దానితో లెక్కలు కట్టరులేదా బేరసారాలు జరుపరు. మళ్ళీ తీసుకోవాలనే భావనతో ఏదీ ఇవ్వరు. రక్షించబడతామనే ఆలోచతో విశ్వసించరు. రుజువులు కోరుకునే విశ్వాసంతో ఉండరు - ఇదే మార్గంలో, ప్రయాణించేందుకు ఆవశ్యకమైనది, ఇది మాత్రమే మీకు అన్ని విపత్తులనుండి వాస్తవంగా రక్షణ కల్పిస్తుంది.

సంపూర్ణ ధైర్యం : ఏ రంగమైనా, ఏ ప్రమాదమైనా, ధోరణి మాత్రం అలాగే శాంతంగా, ధీమాగా ఉంటుంది.

*CWM 10 : 282; 8:260-61; 14:169-70; 8:40-41, 12:7*

శాస్త్రీయ నామం : క్యాలోట్రోపిస్ గైగాంటియా

# మంచితనం



కొంతమంది మనుషులు ఇలా అనడం తరచు వింటుంటాను - “నేను మంచిగా ఉండడం మొదలు పెట్టిన దగ్గరి నుండి అందరూ నాకు చెడ్డవారిగా కనపడుతున్నారు.” కాని ఆ అనుభవం నుండి మీరు నేర్చుకోవలసిన పాఠం సరిగ్గా అదే. మనసులో ఏదో ఉద్దేశం పెట్టుకుని మంచిగా ఉండాలని ప్రయత్నించ కూడదు. అవతలివారు మనతో మంచిగా ఉంటారని ఆశిస్తూ మనం మంచిగా ఉండకూడదు. కేవలం మంచిగా ఉండడం కోసమని మంచిగా ఉండడానికి ప్రయత్నించాలి.

ప్రతీ సందర్భంలోనూ ఇదే పాఠం వర్తిస్తుంది. మనం చేసే పనిని వీలైనంత మంచిగా, నాణ్యవంతంగా, ఏ ఫలితమూ ఆశించకుండా, ఫలాపేక్ష లేకుండా

చెయ్యాలి. చేసిన మంచిపనికి ప్రతిఫలం ఆశించే ఉద్దేశం ఉంటే మంచిగా ఉంటే జీవితం సాఫీగా అయిపోతుందనే ఉద్దేశంతో మంచిగా ఉంటే - దాని వల్ల చేసిన మంచి పనిలోని విలువ ఎగిరిపోతుంది.

మంచితనం మీద ఉన్న ప్రేమ కొద్దీ మంచిగా ఉండాలి. న్యాయం మీద ఉన్న ప్రేమకొద్దీ న్యాయబద్ధంగా ఉండాలి. నిర్మలత్వం మీద ఉన్న ప్రేమకొద్దీ నిర్మలంగా ఉండాలి నిరాసక్తత మీద ఉన్న ప్రేమ కొద్దీ నిరాసక్తంగా ఉండాలి. అలా జీవించ గలిగితే చాలా వేగంగా పురోగమిస్తారు.

నోట్లోని మిఠాయి కన్నా చేసిన మంచిపని హృదయానికి మరింత మధురమైనది. ఏదో ఒక మంచిపని చెయ్యకుండా గడపిన రోజు సారంలేని రోజు అవుతుంది.

హృదయాన్ని మంచితనంతో, సద్భావనతో సదా పూరితం చేసుకుని, నిశ్చల సద్భావనతో, వినమ్రంగా ఉండేది, అట్టహాసం లేనిది, ఏదో విధంగా ఉపయోగపడాలని సదా సిద్ధంగా ఉండేది. (శ్రీమాత ఇచ్చిన ఒక పూవుయొక్క ఆధ్యాత్మిక సంకేతం)


చిత్తంతో, సమత్వంతో దాన్ని అందరి మీద ప్రసరింప జేయాలి.

స్పష్టమైన, సమగ్రమైన దృష్టి కలిగి, ఏ వ్యక్తిగత ప్రతిస్పందనలు లేనిదై, అలుపెరుగని సేవాతత్పరతే భూమి మీద భగవంతుణ్ణి ప్రేమించి, సేవించడానికి అతి శ్రేష్ఠమైన మార్గము.

*CWM 3:264-65; 15:225; 14:186-87* — శ్రీమాత

శాస్త్రీయ నామం : రోసేడా ఓడోరాతా

# దయాగుణం



"ఔన్నత్యం, దయాగుణం అంతరాత్మ యొక్క పరంధామం. అవి లేని పక్షంలో మనం చూసేది బురదలోని పురుగును."

- శ్రీఅరొబిందో (సూక్తులు, సుభాషితాలు)

- శ్రీమాత వివరణ

"ఔన్నత్యం అంటే వ్యక్తిగత స్వలాభాపేక్షని త్రోసిపుచ్చడం. దయాగుణం అంటే ఇతరుల సంతృప్తిలో మన సంతృప్తిని వెతుక్కోవడం."

ప్రశ్న: శ్రీ అరొబిందో మహాలక్ష్మి గురించి ఇలా అంటారు... "దారిద్ర్యపు ఛాయ కలిగినది అంతా... ఆమె రాకని త్రోసిపుచ్చుతుంది."

జ : అవును. దరిద్రమైనది, దయారహితమైనది, ఆర్తిలేనిది, వైశాల్యం లేనిది, అంతరిక సంపత్తి లేనిది, శుష్కమైనది, జడమైనది, సంకుచితమైనది మహాలక్ష్మి రాకను నివారిస్తుంది. ఇది కేవలం ధనానికి సంబంధించిన విషయం కాదు సుమా! మహాలక్ష్మి దృక్పథంలో బాగా ధనికుడైనవాడు పరమ దరిద్రుడు అయ్యుండొచ్చు! అలాగే హృదయంలో దయాగుణం మెండుగా గల పేదవాడు గొప్ప ఐశ్వర్యవంతుడై ఉండొచ్చు...

దరిద్రుడు అంటే ఏ సుగుణాలు లేనివాడు, శక్తిసామర్థ్యాలు లేనివాడు, దయా గుణాలు లేనివాడు అన్న మాట. సంతోషం అంటే ఏంటో తెలియక దీనంగా బతికేవాడు. దయలేనప్పుడు సంతోషం కూడా ఉండదు. ముందు వెనుక చూచుకోకుండా మనస్ఫూర్తిగా ఇచ్చే గుణం ఉన్నవాళ్ళు ఎప్పుడూ సంతోషంగా ఉంటారు. వాళ్ళ అవసరాలు తప్ప మరొకటి తెలియని కుటిల స్వభావులు అన్నిటినీ వాళ్ళ వైపు లాక్కోవాలని ప్రయత్నించేవాళ్లు, ప్రపంచాన్ని జీవితాన్ని తమ ప్రత్యేక కోణం నుండి మాత్రమే చూచేవాళ్లు - - వీళ్ళకి సంతోషం అనేది ఉండదు. కాని ముం దు వెనుక చూచుకోకుండా, మనస్ఫూర్తిగా, దయతో తమని తాము సమర్పించు కునేవాళ్లకి శోకం అంటే ఏమిటో తెలియదు. తీసుకోవాలని అనుకునేవాడికి సంతోషం ఉండదు, ఇచ్చే గుణం కలవాడికి ఆ సమస్యే ఉండదు.


నైతికమైన దయాగుణం గురించి చెప్తాను. తోటివాడు ఏదైనా విజయం సాధిస్తే మనం కూడా సంతోషించడం అందుకు ఉదాహరణ. ధైర్యంతో, నిస్వార్థంతో, త్యాగభావంతో చేసే పనిలో గొప్ప సౌందర్యం ఉంటుంది. అది ఆనందాన్నిస్తుంది. అవతలివారి ఔన్నత్యాన్ని, ఆధిక్యతను గుర్తించడమే నైతిక దయాగుణం అని చెప్పుకోవచ్చు.

## దయ

బేరసారాలు లేకుండా తనని తాను సమర్పించుకుంటుంది.

శాస్త్రీయ నామం : ఇంపాటియన్ బల్సామినా

# సమచిత్తత



సమానత అంటే మనసు, ప్రాణికాలు నిశ్శబ్దంగా, నిశ్చలంగా వుండటం. జరిగిన విషయాల చేత, నీకు చెప్పిన విషయాలచేత, లేదా నీకు సంభవించిన వాటి చేత ప్రభావితం కాకుండా, కలత చెందకుండా వాటి వంక వేరుగా చూడటం, వ్యక్తిగత అనుభూతులు సృష్టించే విరూపాల నుండి స్వేచ్ఛగా వుండటం, వాటి వెనుక వున్న దానిని అర్థం చేసుకోవటం, అవి ఎందుకు జరిగాయి. వాటినుండి నేర్చుకోవలసినది ఏమిటి? వాటికి వ్యతిరేకంగా మనలో వున్నదేంటి? వాటిద్వారా ఎటువంటి ఆంతరిక లాభము, పురోగతి జరుగుతుంది అన్నది అవగాహన చేసికోవటం సమానతకు అర్థం. ప్రాణిక చలనాల మీద స్వీయాధిపత్యం పొందాలి - కోపము, సున్నితత్వము, గర్వము, కోరిక, అలాంటి తక్కినవి ఇవి మన భావోద్వేగ అస్తిత్వాన్ని తమ స్వాధీనం చేసుకోకుండా, ఆంతరిక శాంతిని కలత పెట్టకుండా చూడాలి. ఈ విషయాలను, ఆవేశంతో, ఒత్తిడికి లోనై మాట్లాడకుండా, చేయకుండా ఎప్పటికీ ఒక ఆత్మ నిశ్శబ్దంతో ఆంతరిక నిశ్చలత నుండి మాట్లాడటం, పనిచేయడం సమానత. ఈ సమానతను ఎంత పరిమాణంలోనైనా కలిగి వుండటం కూడ అంత సులభం కాదు. కానీ దీనిని ఆంతరిక స్థితికి, బాహ్యచలనాలకు ఆధారంగా చేసుకోవటానికి ఎప్పటికీ ప్రయత్నిస్తూ వుండాలి.

సమానతకు ఇంకో అర్థం కూడా వుంది. మనుష్యుల స్వభావాల పట్ల చర్యల పట్ల భావనలను, న్యాయ విచారణను, మొత్తం మానసిక పక్షపాతాన్ని మనసు నుండి తోసివేసి వాటి గురించిన సత్యాన్ని చూడడానికి సహాయం చేస్తుంది. వ్యక్తిగత భావం యెప్పటికీ విరూపం చేస్తూ వ్యక్తిని కేవలం అతడి చర్యలలో మాత్రమే చూచేటట్లు చేస్తుంది. చర్యలను మాత్రమే కాదు, వాటి వెనుకనున్న విషయాలను, తరచుగా అక్కడ లేనివి చూస్తాము. దాని ఫలితంగా తొలగించవలసిన విషయాలైన తప్పుగా అర్థం చేసుకోవడం, తప్పుగా నిర్ణయించడాలు అక్కడ వుంటాయి, అల్ప పర్యవసానాలు విస్తృత భాగాలను ఆరోపిస్తాయి. ఈ కారణంగా ఇటువంటి జీవనవిధానంలో వ్యక్తిగత అనుభూతి, సున్నితత్వం మానవస్వభావంలోని ఒక స్థిరమైన భాగంగా, స్వీయరక్షణకు

అవసరమైనవిగా కనిపిస్తాయి. అయినప్పటికీ అక్కడ కూడా మనుష్యుల పట్ల, విషయాలపట్ల, ఒక విస్తృత సమాన దృక్పథం అన్నది రక్షణకు ఇంకా ఉత్తమమైన చలనం. దానిని అధిగమించడానికి సాధకుడు ఆత్మ నిశ్శబ్ద శక్తిలో జీవించడం అతడి పురోగమనానికి అవసరం.

సమానత అంటే తాజా అజ్ఞానము కాదు. లేక అంధత్వము కాదు. అది దృష్టిలో ఒక అస్పష్టతను, అన్ని రంగులలో ఒక కళంకాన్ని కోరుకోదు, ఆవశ్యకంగా ప్రవేశపెట్టదు. అక్కడ భేదముంటుంది. ప్రకటనలో వైవిధ్యము ఉంటుంది. ఈవైవిధ్యాన్ని మనం ప్రశంసించాలి. ఎందుకంటే మన నేత్రం ఒక పాక్షికమైన తప్పు ప్రేమ, ద్వేషం, ప్రశంస, జాలి, అనిష్టత, ఆకర్షణ, వికర్షణలతో అస్పష్టమైనప్పటికన్నా, ఇంకా ఎక్కువ యుక్తంగా సమానతలో ఉన్నప్పుడు చేయగలుగుతాము. ఈ వైవిధ్యతకు వెనుక దాని అంతరంలో నివసించే పూర్ణతను, నిశ్చలతను ఎప్పుడూ చూడాలి. అనుభూతించాలి. కనీసం తెలుసుకొని వుండాలి. ఒకవేళ ఇది మన నుండి దాగి వున్నా, మన మానవ పరిమాణాలకు సమత్వంతో పరిపూర్ణంగా లేదా అపరిణితంగా, పూర్తి కాకుండా కనిపించినా, లేదా చెడు, అసత్యాలు కనిపించినా వివేచనాత్మక ప్రయోజనం మీద ప్రత్యేక అభివ్యక్త దివ్యావశ్యకతల మీద విశ్వాసముంచాలి.

CWSA 29:130-31; 23:224-25 - *శ్రీ అరవిందులు*

## సమచిత్తత

మార్పుకు లోనుగాని శాంతి, స్థిరత (మదర్ తెలిపిన ఆధ్యాత్మిక విశిష్టత)

శాస్త్రీయ నామం: బెగోనియా

### శాంతి



అస్తిత్వంలో దైవ ఉనికి ఉందనటానికి ప్రథమ సంకేతం వ్యక్తిలోని శాంతి.

*

నీ అస్తిత్వ లోతులలో హృదయ లోతుల్లో, అక్కడ ఎప్పటికీ నిండైన ప్రేమ, జ్ఞానములతో ప్రకాశమానంగా, శాంతితో ఉన్న దివ్య సన్నిధి ఉంది.

అది అక్కడ ఉంది కాబట్టి నువ్వు దానితో సంయోగం చెందవచ్చు. అది నిన్ను దేదీప్యమానంగ ప్రకాశించే ఒక చైతన్యంలోకి పరివర్తన చెందిస్తుంది.

నీవు నేను కలిసి నీ అస్తిత్వ ఉపరితలంలోని సమస్త బాహ్య శబ్దాన్ని నిశ్శబ్దం చేయడానికి ప్రయత్నించాలి. తత్ఫలితంగా ఆ నిశ్శబ్దంలో, శాంతిలో నీవు ఆంతరిక వైభవంతో సంయోగం చెందుతావు.

ఆ రోజు నీ నూతన జన్మదినమవుతుంది.

*

ప్రశ్న : అమ్మా,నన్ను ఇంకా ప్రశాంతంగా ఉండేటట్లు చేయండి.

నీకు అలజడిగా ఉన్నప్పుడల్లా బాహ్య శబ్దం లేకుండా నీలో నీవు మాట్లాడుకోవడము, అదే సమయంలో నన్ను తలచుకోవడము పునరావృతం చేస్తూ ఉండాలి.

ఓ నా హృదయమా! “శాంతి శాంతి” అంటూ ఫలితంతో సంతృప్తి చెందే వరకూ నిలకడగా చేయాలి.

*

.. కొద్ది నిముషాలు నిశ్శబ్దాన్ని పాటించడము ఎప్పటికీ మంచిది. కనీసం రోజులో రెండు మార్లు అలా చేయాలి. కానీ అది నిజమైన నిశ్శబ్దం కావడం తప్ప మాట్లాడడం నుండి విముఖత చూపించడం కాకూడదు.

*

జబ్బుకి గొప్ప ఔషధము శాంతి, నిశ్చలతలు.

మన కణాలలోకి శాంతిని తీసుకురాగలిగినపుడు మన జబ్బు నయమవుతుంది.

CWSA 12:114; 17:365-66; 16:150; 3:196; 15:151 - శ్రీ మాత

శాంతి అనేది ఒక ప్రశాంత కెరటం రహిత మహదానందానికి సమానమైన సునిశ్చత మొత్తంలోకిచేర్చబడిన ఒక నిశ్శబ్ద గాఢత.

*

ఒక నిర్దిష్ట అర్థంలో ఈ జడత, శ్రమ, తమస్సులకు కాంతి, అంధకారాల ప్రతిరూపాలు - ఉన్నత తత్వం శాంతిలో విశ్రాంతిని కనుగొంటుంది. నిమ్న

తత్వం శక్తికి విశ్రాంతినివ్వడంలో తిరిగి అధోచేతనకు, తమస్సుకు చేరుకోవడంలో శాంతిని పొందాలనుకొంటుంది.

*

ఉన్నత ఆధ్యాత్మిక చైతన్యానికి చెందిన శాంతి, శక్తి, కాంతి, ఆనందాలు అన్నీ ఊర్ధ్వంలో ముసుగుతో ఉంటాయి. అది దిగి రావడానికి ఊర్ధ్వం వైపుగా ఒక ఉన్మీలనం అవసరం - క్రిందికి దిగివచ్చే ప్రభావానికి ఉత్తమ స్థితి మనసు నిశ్చలత, ఏకీకృతమైన ఒక నిర్దిష్ట విస్తార ఉదాసీనత.

CWSA 29:137; 30:477, 482 - *శ్రీ అరవిందులు*

**శాంతి**

శాంతి సదా, ప్రతి స్థితి యందు నీవు కోరుదానినే (నేను) కోరటమొక్కటే అచంచలమైన శాంతిని భోగించుటకు యేకైక మార్గం (మదర్ తెలిపిన ఆధ్యాత్మిక విశిష్టత)

శాస్త్రీయ నామం : కుర్క్యుమా డెడో ఆరియా

# ఐదు మానసిక పరిపూర్ణతలు

**(నిజాయితీ, విశ్వాసం, భక్తి, ఆకాంక్ష, సమర్పణ)**

**(తెల్లని చంపక పుష్పాన్ని చూపుతూ, రేకులను లెక్కించుతూ)** ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు మానసిక పరిపూర్ణతలు అన్నారు. ఐదు మానసిక పరిపూర్ణతలుయేవి? ఎందుకంటే అవి మారవచ్చు. వాస్తవంగా నా రహస్యాలను చెప్పాలంటే, దానినెవరికయినా యిచ్చిన ప్రతిసారి, ఒకే రకమైన పరిపూర్ణతలు గావు. అది మనుషుల అవసరాల మీద ఆధారపడి ఉంటుంది. ఒకే వ్యక్తికి యిచ్చినప్పటికీ భిన్న సమయాలలో భిన్నమయిన మానసిక పరిపూర్ణతలనివ్వవచ్చు, కాబట్టి అది నిర్దిష్టంగా ఒకేలా ఉండదు. కాని మొదటిసారి ఈ పూవుకు 'మానసిక పరిపూర్ణత' అని పేరునిచ్చినప్పుడు ఆ పరిపూర్ణతలను వ్రాసి పెట్టుకున్నారు. కాని నాకు సంబంధించినంత వరకు దానర్థం చాలా అస్థిరమైనది - పరిస్థితుల మీద, అవసరాల మీద ఆధారపడి ఉంటుందని చెప్పాను గదా...

విషయం యేదైనా గాని అసలు సంగతేమిటంటే, ఎన్ని రకాలుగా కలిపి అన్నీ చెప్పినప్పటికీ, చివరికి యిచ్చినప్పటికీ వాటన్నింటిలో మొట్టమొదటిది నిజాయితీ, ఎందుకంటే నిజాయితీ లేకుంటే, తాను అర అడుగు కూడా ముందుకెళ్ళలేడు. కాబట్టి అదెప్పుడూ మొదటిగా ఉంటుంది.

కాని మీరు కావాలనుకుంటే దానిని 'పారదర్శకత' అనో మరొక పదంతోనో తర్జుమా జేసుకోవడం సాధ్యమే.

ఇహ రెండవది, ముందుకు వెళ్ళాలనుకుంటే ఆవశ్యకమయింది. తప్పని సరి అయినది విశ్వాసం. లేక మరొకమాట, అది బహు పరిమితంగా కన్పించినప్పటికీ నాకదెంతో ప్రధానమయింది. ఎందుకంటే (ఇది అనుభవానికి చెందిన ప్రశ్న) దివ్యత్వం పట్ల పూర్తి నమ్మకంతో ఉండకపోతే ఎంతో సులభంగా మీకు విశ్వామున్నదన్న భావంతోనే ఉండిపోతారు. అయినప్పటికీ దివ్యశక్తిలో, దివ్య సహృదయతలో నమ్మకాన్ని, లేక దైవానికి మీపై ఉండే దృఢ నమ్మకాన్ని పోగొట్టుకుంటారు. కాబట్టి, దివ్య అనుగ్రహానికి సమగ్ర, సంపూర్ణ విశ్వాసాన్ని జోడించకపోతే కష్టాలుంటాయి. కాబట్టి రెండూ అవసరం.

ఈ వరుసలో ఇప్పుడు భక్తినుంచాము. అవును, అంతా భక్తిమయమవడం, ఎంతో బాగుటుంది, కాని దీనిని వెన్నంటి యితర విషయాలెన్నో ఉండకపోతే, అది గూడా పలు తప్పులను చేయవచ్చు. అది గూడా పలు కష్టాల నెదుర్కోవచ్చు.

మీకు భక్తి ఉన్నది, అహంభావాన్నీ ఉంచుకున్నారు. అప్పుడు మీ భక్తిలో నుండి భయంకరమైన అహంభావిక విషయాలు అన్నిరకాలవీ బయటపడ్తాయి. చెప్తున్నదేమంటే మీ గురించే ఆలోచిస్తారు, యితరుల గురించి కాదు, ప్రపంచాన్ని గురించి కాదు, పని గురించి కాదు, చేయవలసినదేదో దాన్ని గురించీ గాదు - మీ భక్తి గురించే మీరాలోచిస్తారు.

కాని నిరంతరం భక్తితో పాటుండవలసిన మరొక చలనమున్నదక్కడ. అన్నింటికీ దైవం ఉన్నాడన్న కృతజ్ఞతా భావం; ఆ అద్భుతమయిన కృతజ్ఞతా సూచిక స్మరణ యొక్క అనుభూతి. దైవం ఉన్నాడన్న వాస్తవం పట్ల, విశ్వంలో దివ్యమైనదేదో ఉన్నదని, కేవలం మనం చూచే రాక్షసత్వమే గాదని, అక్కడ దైవత్వమున్నదనే, దైవమున్నాడనే - భావన మిమ్మల్ని ఉదాత్తమైన ఆనందంతో నింపుతుంది. ప్రతిసారి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని దివ్య ఉనికి యొక్క

ఈ ఉదాత్తమైన సత్యంతో మీరే కొంచెం సంపర్కంలోకి వచ్చినా, ప్రతిసారి హృదయమెంతో గాఢమయిన, ఎంతో అద్భుతమయిన ఆనందంతో, విషయాలన్నీ అమిత ఉల్లాసభరితంగా రుచించుతుండడం వలన అటువంటి ఓ కృతజ్ఞతతో నిండిపోతుంది.

కాబట్టి కృతజ్ఞత లేని భక్తి ఎంతో అపరిపూర్ణమయినదని గ్రహించాను. భక్తితో పాటు కృతజ్ఞత కూడా రావాలి.

పరిపూర్ణతలలో ధైర్యం ఒకటని మనమొకసారి మాట్లాడుకున్నట్లు గుర్తు. జాబితాలో ఒకసారి వ్రాసినట్లు గుర్తు. కాని ఈ ధైర్యమంటే అర్థం ఉత్తమోత్తమ సాహసం పట్ల అభిరుచి ఉండడం. ఉత్తమోత్తమ సాహసం పట్ల ఈ అభిరుచి ఉండడమనేది ఆకాంక్ష - మిమ్మల్నేది పూర్తిగా ఆక్రమించుకుంటుందో, ఎటువంటి గణన చేయకుండా, ఎటువంటి మినహాయింపు లేకుండా, విరమించకుండా, దైవాన్ని కనిపెట్టే గొప్ప సాహసానికి, దైవాన్ని కలుసుకునే గొప్ప సాహసానికి, దివ్య సాక్షాత్కారమనే మరింత గొప్ప సాహసానికి నడిపే ఆకాంక్ష. వెనుకకు చూడకుండా "జరుగబోతున్నదేమిటని ఒక్క నిమిషమైనా అడుగకుండా ఆ సాహసంలోనికి మిమ్మల్ని మీరే నెట్టివేసుకోండి. ఎందుకంటే జరుగబోతున్నదేమిటని మీరడిగితే ఎప్పటికీ ఆరంభింపరు. అక్కడే ఆగిపోయి, ఉన్నచోటే వ్రేళ్ళూనుకుని, ఎప్పుడూ ఏదో పోగొట్టుకుంటామన్న మీ సమతుల్యతను కోల్పతామన్న భయంతో ఉండిపోతారు.

అందువల్ల ధైర్యాన్ని గురించి మాట్లాడను. కాని నిజానికది ఆకాంక్ష. అవి రెండూ కలిసే ఉంటాయి. నిజమయిన ఆకాంక్ష ఏదో ధైర్యంతో నిండి ఉంటుంది.

ఇప్పుడిక సమర్పణ. ఆంగ్లంలోని ఈ 'సమర్పణ' పదానికి ఖచ్చితంగా అదే అర్థానిచ్చే ఫ్రెంచి పదం లేదు. కాని, శ్రీ అరవిందులు చెప్పారు. మనమిది చదివినట్లున్నాము. - యోగం చేయడంలో మొట్టమొదటి, తప్పనిసరిగా ఉండవలసిన స్థితి సమర్పణ అని. కాబట్టి, వారేమి చెప్పారో అది మనం అనుసరించితే, అవసరమయిన లక్షణాలలో ఉండవలసినది యిదొక్కటే గాని, ఇది యోగం ఆరంభించడానికి ఆవశ్యకమయిన ప్రథమ వైఖరి అని తెలుస్తుంది. తాను సంపూర్ణంగా సమర్పించుకోవాలని నిర్ణయించుకోకపోతే యోగాన్ని ఆరంభింపలేరు.



# మానసిక పరిపూర్ణత


అక్కడున్నది ఒకే ఒక పరిపూర్ణత గాదు, ఐదు. అవి నిజాయితీ, విశ్వాసం, భక్తి, ఆకాంక్ష, సమర్పణలు (అమ్మచే యివ్వబడిన ఆధ్యాత్మిక విశిష్టత, వివరణ)

శాస్త్రీయ నామం : ప్లూమేరియా రుబ్రా

కాని ఈ సమర్పణ సంపూర్ణంగా ఉండడానికి ఈ లక్షణాలన్నీ అవసరము, మరొకటి జోడిస్తాను - ఎందుకంటే మనకింత వరకు ఉన్నది నాలుగు మాత్రమే - సహిష్ణుత, తట్టుకుని ఉండడాన్ని జోడిస్తాను. అది చాలా కష్టం గనుక, నిరుత్సాహపడి విడిచిపెట్టకుండా కష్టాలనెదుర్కొనే సామర్థ్యం లేకపోతే, అశక్తుడవైతే... దెబ్బలు తింటూ కూడా, యెవరో అన్నట్లు వాటిని కప్పిపుచ్చుకొంటూ - నీలోని లోపాల కారణంగా దెబ్బలు తిన్నప్పుడు, వాటిని జేబులో వేసుకొంటే - నీవెంతో దూరం పోలేవు. నీకలవాటైన అల్ప జీవితానికి సంబంధించిన దృష్టిని కోల్పోయే మొదటి మలుపులోనే, క్రుంగుబాటుకు లోనై నీ ఆట ముగిస్తావు. జీవితం పట్ల మీకెక్కడ సరైన దృష్టి ఉండదో ఆ మొదటి మలుపులో నిరుత్సాహపడి ఆట వదిలేస్తారు.

దీనినెలా చెప్పాలి? మనకు బాగా తెలిసిన రూపంలో దీన్ని ఇంకా 'తదేక దీక్ష' లేక 'పట్టుదల' అంటాము. అవసరమయితే అదే విషయాన్ని మళ్ళీ మళ్ళీ వేయిసార్లయినా ఆరంభించాలని నిర్ధారించుకోగలిగినది అని తప్ప.


CWM 8: 36-41 - శ్రీ మాత




అస్తిత్వంలో నిరంతరంగా జ్వలిస్తుండే అగ్నిలాంటి ఆకాంక్ష... నీలో ఏదైనా కోర్కె చెలరేగినా, దేనిపైనైనా మక్కువ ఏర్పడినా, దేనియందైనా ఆకర్షణ కలిగినా, దానిని ఈ అగ్నిలోనికి విసరివెయ్యి. పట్టువిడువకుండా దీనిని కొనసాగిస్తే నీ సాధారణ చేతనలో, యథార్థమైన చేతనలో, క్షణిక కాంతిని దర్శించగలవు. ఆరంభంలో కోరికలన్నింటి మక్కువలన్నింటి ఆకర్షణలన్నింటి యిష్టాలన్నింటి కోలాహలం వెనుక అది కొడిగట్టిన దీపం వెలుగుగా ఉండవచ్చు. కాని నీవు వీటన్నింటి వెనుకకు వెళ్ళాలి. స్థిరంగా, ప్రశాంతంగా, దాదాపు నిశ్చలనీరవంగా ఉండే ఆ యథార్థ చేతనను కనుగొనాలి.

*CWM 4:12* — *ది మదర్*

# శ్రీ అరొబిందో అంతర్జాతీయ విద్యాకేంద్రం సంకేతం




The effective manifestation of Ishwara and Ishwari in union.

ఈశ్వర, ఈశ్వరి ఒకటైనపుడు అది ప్రభావవంతమైన అభివ్యక్తి అవుతుంది.


శ్రీ అరొబిందో అంతర్జాతీయ విద్యాకేంద్రపు సంకేత విశిష్టత.

ప్రపంచమంతట్నించీ విద్యార్థులను చేర్చుకొనే ఒక అంతర్జాతీయ విశ్వవిద్యాలయ కేంద్రాన్ని పాండిచెరీలో స్థాపించడం, తన కార్యపు పురోభివృద్ధిగా శ్రీ అరవిందులు భావించిన, ఆధునిక రూపాల్లో ఒకటి.

తన కార్యం నిర్నిరోధ ఔద్ధత్యంతో కొనసాగుతుందనే వాస్తవికతకు ఘనిష్టరూపమివ్వడానికి ఆత్యంతికంగా తగిన జ్ఞాపకచిహ్నంగా ఇది పరిగణించబడింది.

*CWM 12:111* — *ది మదర్*

# శ్రీ అరొబిందో సొసైటీ సంకేతం



సొసైటీ ప్రగాఢ అకాంక్షకు ప్రతీకగా, మదర్ ఈ సంకేతాన్ని సృష్టించారు. ఒక వజ్రంలోనే ఒకదానినొకటి ఖండిచుకొను రెండు త్రిభుజాల శ్రీ అరవిందుల సంకేతమిది. క్రిందికి దిగి వస్తున్న త్రిభుజం సత్-చిత్-ఆనందాలకు ప్రతీక.

ఆరోహిస్తున్న త్రిభుజం, ప్రాణం, వెలుగు, ప్రేమల రూపంలో పదార్థం నుండి ఆకాంక్షతో వెలువడుతున్న సమాధానానికి ప్రతీక. రెండింటి సంధి స్థలంలో కేంద్రీయ చతురస్రం - పురుషోత్తముని అవతార పరిపూర్ణ అభివ్యక్తి - కమలం - ఉన్నది. చతురస్రంలోని జలం, నానాత్వానికి, సృష్టికి ప్రతీక.

శ్రీ అరవిందుల శిష్యులలో అత్యంత ప్రముఖులైన నళినీ దాను 'వజ్రం ఆకారాన్ని' గురించి అడిగినపుడు వారు వజ్రం విశిష్టతను గురించి వివరంచారు. శ్రీ అరవిందులు చెప్పిన దాన్ని బట్టి వజ్రం అత్యంత తీవ్రమైన మదర్ వెలుగు. భవిష్యత్తులో తప్పక జరిగి తీరవలసిన మానవజాతి రూపాంతరీకరణను సాధించే శ్రీ అరవిందుల, మదర్ వెలుగుకు గల శక్తిని సొసైటీ సంకేతం తెలియజేస్తోంది.



**AKHILA - Akhila Bharata Patrika (Telugu)**

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

*Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo*




*Owner:* Sri Aurobindo Society
*Printer:* Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
*Publisher:* Pradeep Narang for Sri Aurobindo Society
*Published from:* Society House, 11 Saint Martin Street, Puducherry - 60500
*Printed from:* Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in Ind**

---


A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001


# అఖిల

## అఖిల భారత పత్రిక

## మే 2024



# ప్రళయం


## విషయ సూచిక



## సంపాదకీయం

ఈ సహస్రాబ్ది ప్రారంభం నుండి యుగాంతం గురించి, చాలా జోస్యం ప్రచారంలో వుంది. అదే సమయంలో రాబోయే ఒక నూతన యుగం గురించి, సత్యయుగం గురించి కూడా ఎక్కువగానే వింటున్నాం. మానవ ఊహకందిన ఈ రెండు ఊహాగానాలలో బహుశా తక్కువగా అర్థం చేసుకొన్న ఒక పాక్షిక సత్యం వుండవచ్చు. పాత ప్రపంచం నిజంగానే చనిపోతోంది, నూతన ప్రపంచం రూపం తీసుకొంటోంది. దీనర్థం యేమిటి, దీనిలో వున్న సూచనలేమిటి అనేది ప్రళయం అనే శీర్షిక గల ఈ సంచికలోని విషయం

*అనువాదం : కె.వి. రావు*



సమస్తమూ ధ్వంసం అయినా, అలా అవ్వాలనే ఉద్దేశ్యం నాకు లేదు - ఆ విధ్వంసానికావలగా వున్న నూతన సృష్టిని నేనుచూస్తాను. ప్రపంచంలో జరుగుతున్న దానికి సంబంధించి, అది నన్నేం కలత చెందించదు. నాకు తెలుసు మొత్తమంతా ఆ విధంగానే జరుగుతుందని, గాంధీ సత్యాగ్రహం విషయంలో ఎటువంటి భ్రమలు నాకు లేవు. అది ఒక పెద్ద గందరగోళంగా లేక ఒక గొప్ప భంగపాటుగా ముగుస్తుందని నేను జరుగబోయేదానిని గురించి చెప్పిన విషయాన్నే నిజం చేసింది. నేను చేసిన పొరపాటేమిటంటే 'మరియు' వుండవలసిన చోట 'లేక' అని పెట్టడమే. మేధావంతులైన ఆదర్శవాదుల ఆశల విషయంలో వారి భావాలలో నేను భాగస్వామిని కాలేదు, కనుక నేను నిరాశ చెందలేదు. అందుచేత 'లేక' అని ఉన్న చోట 'మరియు' అని ఉండాలి.

*CWSA 35:209*

శ్రీ అరవిందులు

# గతం

## ఏడవ సృష్టి, ప్రళయం

చివరకు, మృత్యువు వున్నంత కాలం, అన్నీ ఎప్పుడూ చెడుగానే ముగుస్తాయి. మృత్యువుపై విజయం సాధించినప్పుడు మాత్రమే, విషయాలు చెడు ముగింపునకు రాకుండా ఉంటాయి. అంటే అచేతనకు తిరిగి చేరుకోవడం అనేది, ఒక నూతన పురోగతిననుమతించడానికి, అవసరం ఉండదు.

పురోభివృద్ధి అనబడే మొత్తం ప్రక్రియ, కనీసం భువి మీద (ఇతర గ్రహాల మీద అదెలా ఉంటుందో నాకు తెలియదు) ఆ విధంగా ఉంది. బహుశా (ఖగోళ చరిత్ర గురించి నాకు పెద్దగా తెలియదు) విశ్వాలు కూడా - విశ్వాలు భౌతికంగా అదృశ్యమైపోతాయనేది వాళ్ళకు తెలుసా, విశ్వం అంతం గురించి భౌతిక చరిత్ర నమోదైందని? ఒక విశ్వం సృష్టించబడిందని, తరువాత ప్రళయంలోనికుపసంహరించుకొన్నదనీ ఆ తరువాత మరో నూతనమైనది వచ్చిందనీ సంప్రదాయాలు మనకు తెలుపుతున్నాయి. వాళ్ళననుసరించి, మనదియేడవ విశ్వం, అది ప్రళయానికి తిరిగిపోక, పురోగమనిస్తూనే ఉంటుంది. ఉపశమించడం ఉండదు. ఇందుచేత, వాస్తవానికి, ఆ విధమైన శాశ్వతత్వానికి ఒక నిర్నిరోధ పురోగతికి అవసరం, మనిషిలో ఉంది. కారణం ఆ అవసరానికి సమయాసన్నమైంది.

*మదర్ : శిష్యునితో సంభాషణ నవంబర్ 13, 1963*

## సృష్టి ప్రళయానికి చేరుకొంటుందా?

వేదాలకన్నా పురాతనమైన ఒక చాలా పాత సంప్రదాయం చెప్పేదేమిటంటే ప్రస్తుత అభివ్యక్తి యేడవది, అంతకు ముందు జరిగిపోయిన ఆరు సృష్టులు ప్రళయానికి చేరాయి. కాని ప్రస్తుత సృష్టి నిరంతరంగా రూపాంతరీకరించబడుతుంది, సృష్టికర్త దగ్గరకు తిరిగి చేరదు.

*CWM 19*

## భయమూ, వెనుకటి ప్రళయాల స్మృతి

ఒకేఒకదారి ఉన్నదని మరీ మరీ అన్పిస్తోంది... (నవ్వుతూ) అదొక వినోదం కలిగించే దృశ్యం. మనసు మీద బైఠాయించడం - మనసు మీద కూర్చో అంతే. నోరు మూసుకో. అదొకటే మార్గం.

మనసు మీదకూర్చో (మదర్ తలపై చిన్నదెబ్బ వేస్తారు) నోరు మూసుకో. గత ప్రళయాలన్నింటి స్మృతి ఉపచేతనలో ఉన్నది. ప్రతిదీ, అదృశ్యమైపోతుంది, కుప్పకూలిపోతుంది అనే అభిప్రాయాన్ని మనకు యెల్లప్పుడూ ఈ స్మృతి కలిగిస్తోంది.

కాని సత్యవెలుగులో విషయాల వంక చూచినపుడు, మరింత సుందరమైన సృష్టి ఉండవచ్చుననిపిస్తోంది. ఇదియేడవది, చివరిది అని థియోన్‌చెప్పాడు నాకు. శ్రీ అరవిందులు (థియోన్ చెప్పిన దాన్ని వారికి చెప్పాను) అంగీకరించారు, వారేమన్నారంటే 'ఈ సృష్టి అతి మనసు వైపు రూపాంతీకరణను చూస్తుంది'. కాని అతిమనసును చేరడానికి, మనసు నోరు మూసుకోవాలి! ఎల్లప్పుడూ నాకో అభిప్రాయం కలుగుతోంది (నవ్వుతూ) మనసు తలపై ఒక పసిబిడ్డ కూచొని (చిన్న బిడ్డ కాళ్ళూపుతున్నట్లు సంజ్ఞ చేస్తూ) మనసు తలపై ఆడుకుంటున్నట్లుగా ఉంటున్నది. నేను చిత్రించగలిగితే, నిజంగా నవ్వు తెప్పించే బొమ్మ అవుతుంది. మనసు, అతిపెద్ద ఐహిక మనసు (మదర్ తమ బుగ్గలనుబ్బిస్తారు) తాను ఎంతో ముఖ్యమైనదానని, విడిచి పుచ్చనలవి గాని దానని అనుకొనే మనసు, దాని తలమీద ఒక బిడ్డ కూచొని ఆటలాడుతున్నట్లు! చాలా తమాషా.

ఆహ్, మాన్ పెటిట్, మనకు విశ్వాసం లేదు! విశ్వాసం కలిగిన వెంటనే... 'మాకు ఒక దివ్య జీవనం కావాలి" అని అంటాం. కాని మనం అదంటే భయపడతాం. భయం అదృశ్యమైన తక్షణం, మనం నిజాయితీ పరులం అవుతాం. నిజంగా అంతా మారిపోతుంది.

'ఈ జీవితమింకెంతమాత్రం వద్దు' అంటాం. కాని (నవ్వుతూ) మనలో ఏదో దాన్నే పట్టుకుని వ్రేళ్ళాడుతుంటుంది.

అవును!

మన పాత భావాలకే మనం అంటిపెట్టుకొంటాం. మన పాత... నశించిపోయే ఈ పాత ప్రపంచానికే మనం భయపడతాం!

అదే సమయంలో దివ్య శిశువు మనసు తలపై కూచొని ఆటలాడు తుంటాడు! ఆ చిత్రం చిత్రించగలననుకొంటాను, అదెంతో అద్భుతంగా ఉంటుంది.

మనం ఎంతో చిలిపివాళ్ళం. దైవం తప్పు చేశాడు అని సైతం చెప్పగలం. (మదర్ ఒక విధమైన రోషంతో కూడిన హుందాతనాన్ని ప్రదర్శిస్తారు)

'విషయాలనలా నడుపగూడదు' అని అంటాం. అది హాస్యాస్పదం మాన్‌పెటిట్.

(నిశ్శబ్దం)

అత్యుత్తమ చికిత్సగా (అంటే అత్యంత తేలిక మార్గం) నాకు అన్పించేది నీ ఇచ్ఛయే. నీవు ఇచ్ఛయించినదే, సమస్త చిత్తశుద్ధితో. సమస్త చిత్తశుద్ధిగా, ఆ పిదప, అర్థం చేసుకోవడం జరుగుతుంది. అప్పుడు నీవు అర్థం చేసుకొంటావు. కానీ నీవు మానసికంగా అర్థం చేసుకోలేవు, ఇక్కడ కాదు (మదర్ తన శిరసును స్పృశిస్తారు)
నీ ఇచ్ఛయే.

*మదర్ ఒక శిష్యునితో సంభాషణ, ఏప్రిల్ 12, 1972*

## సత్యసృష్టి

... సత్యసృష్టిలో ప్రళయం లేకుండా అనవరత వికాసమే ధర్మం" (శ్రీ అరవిందులు) ఈ అనవరత వికాసమంటే యేమిటి?

దీనిని గురించి మనం ఇదివరకే అనేకసార్లు మాట్లాడుకున్నాం అనుకొంటాను. సృష్టి ప్రక్రియలో, సృష్టి చలనం వెనుక, దానిని నిలిపి ఉంచుకోవడం (స్థితి) అదే చలనమూ, అఖండత్వాన్ని కోల్పోవడమూ, లేక ధ్వంసంగావడమనే చలనమూ (లయం) వెంటనంటి వచ్చేవి. చాలా తరచుగా అది పునరావృతం గావడం కూడా ఉండేది 'ఆరంభమయ్యేదంతా అంతం కూడా అవుతుంది' వగైరా, వగైరా.

వాస్తవానికి మన విశ్వచరిత్రలో, సృష్టితో ఆరంభమై, కొనసాగడం అనే శక్తితో కొనసాగడం, అఖండత్వాన్ని కోల్పోయి, ఒక విధ్వంసం, దివ్యమూలానికి తిరిగి చేరుకోవడం, అంటే ప్రళయం అని చెప్పబడే దానితో అంతంగావడం అనేది వరుసగా 6సార్లు జరిగింది. అందుచేతే ఈ సంప్రదాయం ఏర్పడింది. కాని యేడవ సృష్టి పురోగమించే సృష్టి. అంటే సృష్టి ప్రారంభ బిందువు నుండి కేవలం దాన్ననుసరిస్తూ కొనసాగడం మాత్రమే గాక, పురోగమనాత్మక సృష్టి ఉంటుంది. ఇకనెంత మాత్రం అఖండత్వాన్నికోల్పోని, ఆది దివ్యమూలానికి

తిరిగి చేరుకోవలసిన అవసరం గాని లేని దైవాన్ని అధికాధికంగా సంపూర్ణంగా ప్రకటించే పురోగమనాత్మక సృష్టి ఉంటుంది. సరిగ్గా మనమిప్పుడున్న సమయం యేడవ సృష్టి అని ప్రకటించబడింది. అంటే అది ప్రళయంతో, ఆదిమూలానికి తిరిగి చేరుకోవడం గాని, ఒక విధ్వంసం గాని అదృశ్యమైపోవడంతో గాని అంతంగావడం గాని ఉండదు. కాని దాని స్థానంలో ఒక అనవరత పురోగమనం ఉంటుంది. ఎందుచేతనంటే, తన సృష్టిలో దివ్యమూలం అధికాధికంగా పరిపూర్ణ వికాసం దాని ఉద్దేశం గనుక.

ఇది, శ్రీ అరవిందులు చెప్పేది. ఒక నిరంతర వికసనాన్ని గురించి వారు చెప్తున్నారు. అంటే దైవం అధికాధికంగా మరింత సంపూర్ణంగా అభివ్యక్తమౌతాడు. ఒక పురోగమనాత్మక సృష్టిలో అధికాధికంగా పరిపూర్ణంగా దైవం అభివ్యక్తమౌతాడు. ఈ పురోగమన స్వభావమే, ఆది మూలానికి సృష్టి తిరిగి చేరేటట్లు చేస్తుంది. విధ్వంసం ఇకనెంత మాత్రం అవసరం లేదు. పురోగమనించనిదంతా అదృశ్యమైపోతుంది. అందువల్లనే అవి పురోగమించవు గనుక, భౌతిక దేహాలు మరణిస్తాయి. కొంత సమయం వరకూ అవి పురోగమిస్తాయి. ఆ తరువాత అక్కడితో ఆగిపోతాయి. చాలా తరచుగా కొంతకాలం పాటు స్థిరంగా బహుశా వుండవచ్చు. ఆ తరువాత క్షీణించి అదృశ్యమైపోతాయి. అలా ఎందుకనంటే, ప్రస్తుతం ఉన్నట్లుగా ఉన్న భౌతిక పదార్థానికి నిరంతరం పురోగమించడానికి చాలినంత నమ్యత లేదు.

భౌతిక దేహం ఇకనెంత మాత్రం అఖండత్వాన్ని కోల్పోయే అవసరం గాని, అంటే మృత్యువు వాత పడవలసిన అవసరం గాని లేనివిధంగా దానిని పరిపూర్ణం చేయడానికి తగినంత నమ్యంగా చేయడం అసాధ్యం కాబోదు. భౌతిక దేహం నిరంతరం పురోగమించేందుకు సమ్మతించే, అంటే తన వికసనంలో దైవ చలనాన్ని అనుసరించేందుకు అనుమతించే, ఇంత వరకు అభివ్యక్తమైన సమస్త క్రియాశక్తులకన్న ఉన్నతతర క్రియాశక్తియైన అతి మనస్సు అవతరణ వల్ల తప్ప మరిదేనివల్లా అది సిద్ధించదు.

*CWM 7:204-06*

## వస్తువులు / విషయాలు వాటి స్థానంలో లేవు

వస్తువులు వాటి స్థానంలో లేవనే విషయాన్ని, నా బాల్యంలోనే నేనర్థం చేసుకొన్నాను. ఆ తరువాత మాత్రమే, నాకు గుప్తజ్ఞానాన్ని బోధించిన వ్యక్తి

నాకు దాని గురించిన వివరణ యిచ్చాడు. ఎందుకనంటే అతని, జగదుత్పాదన వ్యవస్థలో ప్రతి విశ్వం పరాత్పరుని ఒక పార్శ్వం తనను తాను అభివ్యక్తం చేసుకొంటుందని, ప్రతి విశ్వం పరాత్పరుని ఒక పార్శ్వం మీద నిర్మితమైందని, ఒక దాని తరువాత ఒకటిగా అవన్నీ పరాత్పరుని తిరిగి చేరతాయనీ చెప్తూ ఒకదాని తరువాత ఒకటిగా సంభవించే వివిధ విశ్వాల ప్రళయాలు జరుగుతాయనీ వివరించాడు. ఒకదాని తర్వాత ఒకటిగా అభివ్యక్తమైన సమస్త పార్శ్వాలను ఆయన పేర్కొన్నాడు. ఎటువంటి తర్కమో! అసాధారణమని - దాన్నెక్కడో అట్టేపెట్టాను. ఎక్కడ అనేది మరచిపోయాను. ఈసారి, అది వరుసలో కచ్చితంగా ఎన్నో సంఖ్యో గుర్తులేదు. కాని తిరిగి ఉపసంహృతం కాని విశ్వం, అదియేదై వుండాలో అదిగా అయ్యేంతవరకు పురోగమన పథాన్ననుసరించే విశ్వం, చెప్పాలంటే అనంతంగా కొనసాగే విశ్వం. ఈ విశ్వం సమతూకానికి ప్రాతినిధ్యం వహించింది. గమన రహితమైనది గాక, పురోగమన సమతూకం అంటే, ప్రతిదీ దాని స్థానంలో ఖచ్చితంగా ఉంటుంది. ప్రతి కంపనం, ప్రతి కదలిక దాని స్థానంలో అది ఉంటుంది. ఇంకా క్రిందికి పోతే, సకలంతో వుండే సంబంధంలో ప్రతి రూపం, ప్రతి కార్యకలాపం, ప్రతిదీ కచ్చితంగా దాని స్థానంలో అది ఉంటుంది.

నాకు చాలా చాలా ఆసక్తి వుంది. ఎందుకనంటే, కేవలం అవి వాటి స్థానంలో లేవు. అంటే, స్థలంలో మాత్రమే గాక, కాలంలో కూడా అవి వాటి స్థానంలో లేవు. ప్రపంచాలతో ఆరంభమై, నక్షత్రాలు వగైరా, విశ్వంలో వాటి స్థానం, ప్రతిదీ కచ్చితంగా దాని స్థానంలో అది వుంది. కనుక ప్రతిదీ కచ్చితంగా దాని స్థానంలో, అత్యంత బ్రహ్మాండమైన దాని దగ్గర్నుండి, అత్యంత సూక్ష్మమైన దాని వరకూ, సకలం పురోగమనాత్మకంగా పరాత్పరమైన దానిని మళ్ళీ తిరిగి ఆవిర్భవింపజేయడానికి, ఉపసంహరించబడవలసిన అవసరం లేకుండా ప్రకటిస్తుంది. ఈ సృష్టిలో, ఈ విశ్వంలో ఒక దివ్య ప్రపంచ పరిపూర్ణత - శ్రీ అరవిందులు అతి మనస్సు అని పిలిచేది - అభివ్యక్తం కాగలుగుతుంది అనే వాస్తవానికి దీనిని ఆధారం చేసుకొన్నారు. ఈ సృష్టి సారభూత ధర్మం సమతూకం, ఈ కారణం చేత సృష్టిలో పరిపూర్ణత సిద్ధింపజేసుకోగలం.

*CWM 10:106-07*

## పరమోత్కృష్ట చేతన, నిరంతర వికసనం

విశ్వం నిరంతర గమనంలో ఉంది. పరమోత్కృష్టచేతనా వికాసం అది. అంతకు ముందు జరిగిపోయిన దానిచే, సంభవించే సమస్తమూ నిబంధించబడుతుంది. విశ్వం ఉన్నదున్నట్లుగా కొనసాగుతుంది, ఎందుచేతనంటే అదలా ఉండి వున్నది గనుక, అదేదై ఉండి ఉన్నదో, అది అంతకు పూర్వమేదై వున్నదో దాని ఫలితం. అదెలా వుండబోతోంది అనేది అదిప్పుడేమై వున్నదో దాని పర్యవసానం!

విశ్వ వికసనం కొనసాగుతుందా లేక అదెక్కడైనా ఆగిపోతుందా? ఆరంభమనే, ఆరంభించాలనే నిర్ణయం అనే అభిప్రాయాన్ని కలిగించేదేది?

ఆరంభించాలనే నిర్ణయం ఎచటి నుండి వస్తుంది? (నవ్వుతూ) బహుశా పరాత్పరుని నుండి కావచ్చు, నాకు తెలియదు. ఇప్పుడున్న విశ్వం వంటి దాని కోసం ఆయన ఒకరోజున నిర్ణయించుకొని వుండవచ్చు, విశ్వం కోసం, తనను తాను విషయంగా చేసుకోవడం ఆరంభించి ఉంటాడు.

ఈ విశ్వపు ప్రతి మౌలికాంశం శాశ్వతం, ఎందుచేతనంటే, విశ్వం శాశ్వతం గనుక. ఇప్పుడు శాశ్వతమైన దానిలో 'ఆరంభం' అనే దానిని గురించి మాట్లాడడం కష్టం. అదెల్లప్పుడు వుండే వుంది, ఎల్లప్పుడూ వుంటుందనేది స్పష్టం. ఉదాహరణగా మాత్రమే తీసుకో (ఇదొక ఉపమానం, గుర్తుంచుకో, నేను చెప్పదగని విషయాలను గురించి, నేను చెప్పేటట్లు చేయకు) అసంఖ్యాకంగా అతి సూక్ష్మ వస్తువులు నిండుగా వున్న ఒక గోళాన్ని తీసుకో. ఈ మౌలికాంశాలన్నింటి సంబంధాన్ని నీవు మార్చినట్లయితే, వాటి సంఖ్య ఎంతో పెద్దది, తాత్త్విక దృక్పథంపరంగా చూస్తే అది అనంతంగాక పోయినప్పటికీ వర్ణనాత్మక దృక్పథం నుండి, అది అనంతం అని చెప్పవచ్చు. వాటి మధ్య బాంధవ్యాల సంభావ్యతలు అనేకం, వాటిని తేలికగా అనంతం అనవచ్చు. ప్రతి మౌలికాంశమూ శాశ్వతం. కూటములు అనంతం, కాని ఒకే రకమైన కూటమి, తనను రెండుసార్లు తిరిగి ఏర్పరుచుకోదు. అలా విశ్వం శాశ్వతంగా నూతనం, అయినప్పటికీ అది శాశ్వతంగా అదే.

సంప్రదాయాన్ననుసరించి యేం చెప్పారంటే...

అవును, అవును, ఇది సంప్రదాయానికి సంబంధించిన సమస్య కాదు. ప్రళయాన్ని గురించి మాట్లాడేవారున్నారు. ఆ విషయంనాకు తెలుసు. కాని

తేలిగ్గా తీసుకొంటే దానర్థం (క్షమించు, కొంచెం తేలికగా మాట్లాడాలెవరైనా, లేకపోతే యిది సహించశక్యంగానిదవుతుంది) ఏదో ఒక రోజు పరాత్పరుడలిసిపోవచ్చు, తాను చేసిన విశ్వంలాంటి దాన్నిచూచి అసంతృప్తి చెందవచ్చు, మరొకదాన్ని సృజించాలని అనుకోవచ్చు! దాన్నే జనం 'ప్రళయం' అంటారు. కాని అది దేనినీ మార్చదు. విశ్వపు సకల మౌలికాంశాలూ శాశ్వతం, శాశ్వతంగా వాటి కూటములు విభిన్నం.

*CWM 4:217-18*

## పురోగమనాత్మక సమతూకం

మొదటి ఆరు (ప్రళయాలు) అవును అది నిజం. వరుస కూడా చెప్పారు. ఆ వరుసలో.. ఎందుకనంటే ప్రతి సృష్టీ, ఒక విధమైన కొన్ని ఆపాదిత శక్తులపై నిర్మితమైంది. ఈ ఆపాదిత శక్తుల వరుస క్రమం ఇవ్వబడింది. అవి నాకు తెలుసు, ఎక్కడో వాటిని వ్రాసాను కూడా. కాని అది నా దగ్గర లేదు. అందుచేత నీకు దానినివ్వలేను, పొరపడవచ్చు. కానీ ఏదో ఒక రోజు, దానిని వ్రాసిన కాగితాన్ని తీసుకొచ్చిస్తాను. నాకు తెలిసిందంతా యేమిటంటే, ఈసారి సృష్టి సమకూతం మీద ఆధారపడి ఉంది. కాని అదొక ప్రత్యేక సమతూకం, ఎందుచేతనంటే అదొక పురోగమనాత్మక సమతూకం. అది నిలకడగా ఉన్న సమతూకం కాదు. ప్రస్తుత సృష్టి ఆపాదిత శక్తి సమతూకం. అందుకనే ఈ సృష్టిలో, ప్రతిదీ కచ్చితంగా దాని స్థానంలో ఉన్నందున, ఒక పరిపూర్ణ సమతుల్యతలో వున్నందున, ఇకనెంత మాత్రం కీడుకు తావుండదు. కీడు అంటే ఏమిటి? వస్తువులు / విషయాలు వాటి స్వస్థానంలో లేకపోవడమే. స్వతహాగా చెడ్డదైనదేదీ లేదు, కేవలం అది వున్న స్థానం తప్పు, అది దాని యథార్థస్థానం కాదు.

*CWM 6:71*

## అసురుల భవిష్యత్తు

నాలుగు గొప్ప అసురులున్నారు. ఆ నలుగురిలో యిద్దరు మార్పుచెందించబడ్డారు. వాళ్ళు దివ్యకార్యంలో పాలుపంచుకొంటున్నారు. తక్కిన ఇద్దరు, గట్టిగా అదివరకటిలాగానే ఉండిపోయారు. ఎంతకాలం అలా పట్టుకొని ఉండిపోతారు? చూద్దాం. మారడమా అంటే సకల సమగ్రతలో వాళ్ళ స్థానాన్ని వాళ్ళు తీసుకొని, నిశ్చలంగా ఉండడం లేక అదృశ్యమైపోయి

అంటే, వారి మూలంలో వాళ్ళు తిరిగి లయమైపోవడం అనేది రెండిట్లో ఎంచుకోవడం వాళ్ళముందుంది.

వారిలో ఒకరు మారిపోవడానికి గట్టి ప్రయత్నమే చేశాడు గాని, సాధించలేకపోయాడు. అది జరిగే సమయానికి, అతనికది చాలా అసుఖం కలిగించేదిగా కన్పించింది. మరెప్పుడైనా చూద్దామని అప్పటికి విరమించుకొన్నాడు. మరొకతని విషయంలో అతను ప్రయత్నించడానికే అంగీకరించ లేదు. అతడు ప్రపంచంలో చాలా చాలా ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించాడు. ఎందుకనంటే విషయాలు తెలియని జనం అతనిని 'జాతుల ప్రభువు' అని సంబోధిస్తారు. వాస్తవానికి కొంచెంసేపటి క్రితం ప్రపంచాన్ని శాసించే, వాళ్ళ పాలననెంతమాత్రం వదలుకోవడానికిష్టపడని క్రియాశక్తుల గురించి మాట్లాడాను. దానితో వాళ్ళు పూర్తి సంతృప్తిపడ్డారు. ఆతని అంత్యం ఏదో ఒక రోజు వస్తుందని అతనికి తెలియదని కాదు కాని చేయగలిగినంత వరకు అతడు దానిని యింకా వాయిదా వేస్తుంటాడు.

వారికి మానవ ప్రమాణాలు లేవు గనుక, అలా చాలా కాలంపాటు కొనసాగవచ్చు, కాదా? వాళ్ళ ప్రభావానికి ఒక్క మానవచేతనైనా, దానికి ప్రతిస్పందించ సిద్ధంగా ఎక్కడో వున్నదని భూమిపై కనుగొనినంతకాలం వాళ్ళుంటారు. కాబట్టి సమస్యను నీవూహించవచ్చు. ఇప్పుడు వాళ్ళు వ్యక్తుల ద్వారా గాక జాతుల ద్వారా వాళ్ళ ప్రభావాన్ని చూపుతుంటారు.

*CWM 6:171-72*

## పరిపూర్ణతా వికసనం

మనం యేదికాదో, యేదిగా అవ్వాలనుకొంటామో దానినంతా మనం 'దైవం' అని అంటాం. అనంతంగా వున్నతమైనదని మనకు కన్పించేదంతా మనం చేసినదానికంతా మాత్రమే గాక, మనం చేయగలుగుతామని అనుకొనే దాన్నంతట్నీ కూడా, మన అవగాహన మన ప్రస్తుత సంభావ్యతను అధిగమించిన దానినంతా మనం 'దైవం' అని అంటాం.

దీన్నొక తమాషాగా నేనుచెప్పడం లేదు. కాని ఎందుచేతనంటే, మనం కొన్ని వేల సంవత్సరాల వెనక్కుపోతే, మనుషులు దైవం అన్నప్పుడు నేను నమ్ముతున్నట్లు, అసలెప్పుడైనా దైవం అని వారంటే - బహుశా అధిమనస్సు

భగవంతుళ్ళలాంటి ఒక స్థితిని గురించి పలికి వుంటారు. స్పష్టంగా, చాలాకాలం పాటు భువిని శాసించి, భువిపై అనేకమైన వాటిని రూపొందించిన ఈ రకమైన అధిమనస్సు భగవంతుళ్ళు, మనకు అతి మనస్సుయేదై వుంటుందని మనం ఊహించామో దానికన్న  చాలా తక్కువ స్థాయికి చెందిన వాళ్ళుగా మనకు కన్పిస్తారు. మనం కచ్చితంగా దేనినైతే దైవం అని చెప్పుకొంటున్నామో భువిపైకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామో ఈ అతిమనస్సు, ఈనాడు మనకు అధిమనస్సు ఎలా అన్పిస్తున్నదో, అలా ఇప్పటికే కొన్ని వేల, లేక లక్షల సంవత్సరాల తర్వాత అన్పిస్తుందేమో. సృష్టిలో, అంటే ఆతని స్వీయ విసృజనలో, దైవం పురోగమనాత్మకం అనడంలో నాకు గట్టి నమ్మకం వుంది. సృష్టికి బయట ఆ ఏమిటో, మనం ఊహించలేం. కాని ఈ విధమైన నిరంతర అస్తిత్వంలో ఆతడు అభివ్యక్తమైన వెంటనే, ఆతడు తనను తాను అధికాధికంగా, తన అస్తిత్వంలో అత్యంత సుందరమైన వాటిని చివర్లో అభివ్యక్తం చేయడానికి మినహాయించి ఉంచుకొన్నట్లుగా అన్పిస్తోంది.

ప్రపంచం పురోగమనిస్తున్న కొద్దీ, ఆతడు ప్రపంచంలో ప్రకటించేది మరింతకింతగా మనం దివ్యం అని చెప్పుకొనేదవుతుంది.

బాహ్య, పరిణామాత్మక చేతన వున్న వారికి భూమి యెలా అభివృద్ధి చెందినదనే విషయంలో కొంత అవగాహన ఉన్నవారికి విశదీకరించడానికి శ్రీ అరవిందులు అతిమనసు అనే పదాన్నుపయోగించారు. ఈ సమస్తానికీ ఆవలకుపోయే, మానవ సృష్టికన్న, మనిషి కన్న, ఆతనినే శ్రీ అరవిందులు యెల్లపుడూ మానవజీవి అనిపిలిచే ఆతనికన్న అత్యున్నతమైన దీనిని విశదీకరించేందుకు శ్రీ అరవిందులు 'అతిమనస్సు' అనే పదాన్నుపయోగించారు. రాబోయే ఈ ఏదో, మనిషికన్న మహనీయమైనది, ఉత్తమమైనది. తనను తాను అర్థమయ్యేటట్లు చేసుకొన డానికి వారు దానిని అతిమానసికం అన్నారు. మనం కేవలం, ఇతఃపూర్వం అభివ్యక్తమైన దానికంటె మరెంతో దివ్యమైనదీ ఈ ఏదో అని చెప్పవచ్చు.

*CWM 8:33-34* — శ్రీమాత

## స్పందించే అభివ్యక్తి

ఈ అభివ్యక్తి తాలూకు అనుభవం నాకు ఉంది. స్పందిస్తున్న అభివ్యక్తిఅని దాన్ని మనం పిలవచ్చు, ఇది విస్తరిస్తుంది సంకోచిస్తుంది, విస్తరిస్తుంది, సంకోచిస్తుంది.... అలా ఒక సమయం వస్తుంది, అప్పుడు ఎటువంటి విస్తరణ వస్తుందంటే, అందులో నీటివంటి కదలిక, అవసరానికి అనుగుణంగా మారే గుణం, మారగలిగే సామర్థ్యం ఉన్నస్థితి వస్తుంది. అప్పుడు ఇంకొక కొత్త రూపాన్ని తీసుకొనడానికి ఆ అభివ్యక్తిని తిరిగి ఉపసంహరించుకోవలసిన అవసరం ఉండదు. అప్పుడక్కడ నిరంతర ప్రగతిశీలమైన రూపాంతరీకరణ జరుగుతుంది. ఇది ఏడవ సార్వత్రిక సృష్టి అని, ఇదివరకే ఆరు ప్రళయాలు వచ్చాయని, ఇది ఏడవ సృష్టి అని, అయితే ఇది తిరిగి ఉపసంహరించ బడకుండా తనను తాను మార్చుకోగలదని చెప్పే ఒక మార్మికవేత్త నాకు తెలుసు. అటువంటి వాటికి ఎటువంటి ప్రాముఖ్యత లేదు అనేది స్పష్టమే, ఎందుకంటే ఒక వ్యక్తికి శాశ్వతత్వపుచేతన ఉన్నప్పుడు అది(అభివ్యక్తి) ఇలా ఉందా అలా ఉందా అన్నది పెద్ద విషయమే కాదు. పరిమిత మానవ స్పృహలో మాత్రమే ఈ రకమైన ఆశయం లేదా శాశ్వతమైన దాని అవసరం ఉంటుంది, ఎందుకంటే మన లోపల, "శాశ్వతత్వపు జ్ఞాపకం" అని పిలవబడేది ఒకటి ఉంది. శాశ్వతత్వం యొక్క ఈ జ్ఞాపకం వలన అభివ్యక్తిలోకూడా శాశ్వతత్వం ఒక భాగం కావాలని కోరుకుంటుంది. కానీ ఈ శాశ్వతత్వం యొక్క భావం మనలో చురుకుగా పనిచేస్తూ ఉంటే, మనం దుఃఖించము. చెడిపోయిన వస్త్రాన్ని విసిరివేసినప్పుడు మనం దుఃఖించము - మనం దానిపట్ల మమకారం కలిగిఉండవచ్చు, కానీ మనం దుఃఖించము! విశ్వం ఒక రోజు అదృశ్యమై పోయినప్పుడు, అది దాని పనిని పూర్తిగా నెరవేర్చిందని అర్థం, ఇక దానికి వేరే సంభావ్యతలు ఏమి మిగిలి లేవు గనక దాని స్థానంలో ఇంకో విశ్వం ఆవిర్భవించాలి.

*CWM 10:217*

## ప్రయాసలు మరియు ప్రయత్నాలు

నేను ఈ పరిణామం యొక్క వంపు తిరిగిన రేఖను ఆసాంతం అనుసరించాను. మీరు చేతనలో అభివృద్ధిలో చాలా చిన్నగా ఉన్నప్పుడు,

- అది తనంతట తానుగా రూపాంతరం చెందుతూ ఉండవచ్చు, కానీ అది ఎల్లప్పుడూ భూమిగానే కొనసాగుతూ ఉండాలి అనుకుంటారు. అటు తరువాత, మీరు కొంచెం పరిణతి చెందినప్పుడు, మీరు దానికి చాలా తక్కువ ప్రాముఖ్యత ఇస్తారు. అలాగే మీరు శాశ్వతత్వం యొక్క భావనతో నిరంతరం సంయోగంలో ఉన్నప్పుడు, అది కేవలం ఒక ఎంపికకు సంబంధించిన విషయం మాత్రమే అవుతుంది. ఇకపై దాని అవసరం లేదు, ఎందుకంటే అది నీ క్రియాశీల చేతనను ప్రభావితం చేయలేదు.

కొన్ని రోజుల క్రితం, (ఎప్పుడో సరిగా నాకు గుర్తు లేదు కానీ, ఈ మధ్యనే )నేను ఈ చేతనలో ఒక ఉదయం మొత్తం జీవించాను, అక్కడ నేనేం చూశానంటే జీవి యొక్క పరిణామం తాలూకు వంపుతిరిగిన రేఖలో, భూమి యొక్క జీవితకాలం పొడిగించబడాలి అనే అవసరం చాలా లోతుగా ఉన్నట్లు అనిపించింది. భూమి యొక్క జీవితకాలం నిరవధికంగా పొడిగించడానికిఈ అవసరం వస్తుగతం చేయబడింది, కాబట్టి చెప్పాలంటే, అది ఇకపై అంత లోతుగా లేదు, ఇది ఎలా ఉందంటే ఒక కళా ప్రదర్శన చూసి అది ఇలా ఉండాలా లేదా అలా ఉండాలా అని నిర్ణయించడం లాంటిది. ఇది దృక్కోణంలో ఆసక్తికరమైన మార్పుగా మనం అనుకోవచ్చు.

ఇది ఒక కళాకారుడి లాంటిది, కానీ ఒక కళాకారుడు తనను తాను ఒక ఆ కళారూపం గా మార్చుకుంటాడు . ఒక ప్రయత్నం, రెండవ ప్రయత్నం, మూడవ ప్రయత్నం, తనకు అవసరమైనన్ని ప్రయత్నాలు చేసి, అటుపై ఒక రకమైన సంపూర్ణత, ఇంకాసరికొత్త అభివ్యక్తులకు, ఆ కొత్త వ్యక్తీకరణల అవసరాలకు అనుగుణంగాగ్రాహ్యశక్తిని సాధించినప్పుడు అన్నింటినీ తిరిగి లోపలికి తీసుకొని, అన్నింటినీ మళ్ళీ కలగలిపి, అన్నింటినీ మళ్లీ బయటకు వ్యక్తం చేయవలసిన అవసరం లేదు. కానీ ఇది అంతకంటే ఎక్కువ ప్రాధాన్యత ఉన్న విషయం కాదు, అది నేను చెప్పినట్లు, ఎంపికకు సంబంధించిన విషయం మాత్రమే. అన్నింటికంటే, అభివ్యక్తి అనేది వస్తుగతమైన ఆనందం కోసం రూపొందించబడింది-ఆనందం లేదా ఆసక్తి లేదా, అలాగే... ఒకసారి రూపుదిద్దుకున్నది తగినంత మార్పుకు అవకాశం ఉండి, తగినంత గ్రహణశక్తిని కలిగి, సులభతరంగా మార్చుకోగలిగి, విశాలతరమై ఎప్పటికప్పుడు అభివ్యక్తి చెందుతున్న నూతన శక్తులచే కొత్త మూసలోకి పోసుకోగల సామర్థ్యం

ఉంటే గనక ఇకపై దానిని తుడిచి వేసి మళ్ళీ తయారు చేయవలసిన అవసరం ఉండకపోవచ్చు.

ఆ వంపు తిరిగిన పరిణామ క్రమంతో పాటు "ప్రారంభం ఉన్నదానికి ముగింపు ఉండాలి" అనే సామెత కూడా వచ్చింది - ఇది నిజం కాకపోయినా అది మానవ మానసిక నిర్మాణాలలో ఒకటిగా కనిపిస్తుంది. కానీ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఒకరు దానిని పై నుండి లేదా మరింత ఖచ్చితంగా చెప్పాలంటే కేంద్ర బిందువు వద్ద నుండి చూసినప్పుడు సమస్య తీవ్రత క్రమంగా తగ్గుతుంది.

ఇది అంతా ఒకటిగానే అనిపిస్తుంది ... ఇది ఒక "సూత్రం" కాదు, ఎందుకంటే ఇది కేవలం ఒక సూత్రం కాదు ఒక నియమం - వ్యక్తుల కోసమే కాక ప్రపంచాలు మరియు విశ్వాల కోసం చేయబడిన ఒక నియమం.

*CWM : 10-217-19* *శ్రీ మాత*

# వర్తమానం

ఏది తుడిచి పెట్టుకుపోతోంది

సరే, ఒక్కటే మార్గం.... మీరు వినకుండా ఉండగలిగితే, మంచిది, కానీ మీరు వింటే, ఒకే ఒక్క సమాధానం: "మీరు చెప్పేది నేను పట్టించుకోను, నేను పట్టించుకోను"-నిరంతరంగా. "మీరు తెలివితక్కువవారు అవుతారు"- నేను పట్టించుకోను. "నువ్వు నీ పనులన్నీ పాడుచేస్తావు"-నేను పట్టించుకోను.... ఆ దిక్కుమాలిన వాదనలన్నింటికీ ఒకటే సమాధానం: నేను పట్టించుకోను.

ప్రతిదీ చేసేది పరమాత్మ అని మీరు అనుభవం పొందినట్లైతే, అచంచలమైన విశ్వాసంతో, మీరు ఇలా అంటారు: "మీ వాదనలన్నీ పనికిరానివి. దైవం యొక్క సహవాసంలో చేతనలో ఉండే ఆనందం, ప్రతిదీ అధిగమిస్తుంది" - ఇది సృష్టిని అధిగమిస్తుంది, జీవితాన్ని అధిగమిస్తుంది, సంతోషాన్ని, విజయాన్ని అధిగమిస్తుంది, ఇది ప్రతిదానిని అధిగమిస్తుంది (శ్రీ మాత ఒక వేలు పైకి చూపించారు):

అంతే. అప్పుడు అంతా బాగానే ఉంటుంది. ఇంకా అది ముగిసిపోతుంది.

అది ప్రకృతిలోని అన్ని చెత్త వస్తువులను ప్రకాశవంతమైన పగటి

వెలుగులోకి, బహిరంగ ప్రదేశంలోకి, ఆ శక్తితో సంబంధంలోకి నెట్టినట్లే.

అవును!

... వాటితో ఇంక మనకు పూర్తిగా తెగతెంపులయ్యింది

అదే కాకుండా మనలో ఉన్న సత్సంకల్పాల మీద దాడి జరిగినట్లుంటుంది.

కొంత సమయం తరువాత, ఇది ఖచ్చితంగా అద్భుతంగా మారుతుంది, కానీ కొన్ని క్లిష్టమైన సమయాల ద్వారా జరుగుతుంది.

అవునవును, నిజంగానే ప్రతిదీ తుడిచిపెట్టుకుపోతుందా అని మీరు సంశయంతో ఆశ్చర్యపడే సందర్భాలు ఉన్నాయి. (శ్రీ మాత నవ్వుతూ) అది అసంబద్ధం! అసంబద్ధమైనది. తుడిచిపెట్టుకు పోయేది ప్రతిఘటన మాత్రమే.

*శ్రీ మాత శిష్యునితో సంభాషణ: ఏప్రిల్ 12, 1972*

## ముప్పు మరియు ప్రమాదం

ఈ ఆదర్శం కోసం, భౌతిక మరియు ఆర్థిక జీవితానికి తెలిసి తెలిసి మనమిచ్చే అధిక ప్రాధాన్యత నిజానికి మనిషి యొక్క పూర్వ స్థితికి, అతని ప్రారంభ అనాగరిక స్థితికి, ప్రాణం, పదార్థంపై దానికుండే మక్కువకు నాగరిక తిరోగమనం, అభివృద్ధి చెందిన మానవజాతి దాని సంపూర్ణంగా అభివృద్ధి చెందిన శాస్త్రవిజ్ఞానం యొక్క మానసిక వనరులతో జరిగే ఆధ్యాత్మిక తిరోగమనం.

మానవ జీవితం యొక్క మొత్తం సంక్లిష్టతలో ఒక అంశంగా, పరిపూర్ణమైన మానవుని ఆర్థిక భౌతికపరమైన ఉనికికి మనమిచ్చే ఈ ప్రాధాన్యత మొత్తం ఒక నిర్దిష్టమైన స్థానాన్ని కలిగి ఉంది: దానికి మనమిచ్చే ఏకైక లేదా ప్రధానమైన ప్రాముఖ్యతలో మానవాళికి, పరిణామానికి పెను ప్రమాదం నిండి ఉంది. మొదటి ప్రమాదం నాగరిక రూపంలో పాత ప్రాణిక భౌతిక ఆదిమ అనాగరికుల పునరుత్థానం. సైన్స్ మనకు అందుబాటులోఉంచిన సాధనాలు బలమైన ఆదిమ ప్రజలచే అభివృద్ధి చెందిన నాగరికతను అణిచివేసే నాశనమొందించే ప్రమాదాన్ని తొలగిస్తాయి, అయితే ఇది మనలో, నాగరిక మానవునిలో అనాగరికుల పునరుజ్జీవనంజరిగితే అది ఇంతకంటే ప్రమాదకరం, ఇది మనం మన చుట్టూ చూస్తూనే ఉన్నాం. మనలోని ప్రాణిక భౌతిక మనిషిని నియంత్రించడం ఉద్ధరించడం అనే ఉన్నతమైన కఠినమైన మానసిక నైతిక

ఆదర్శంమరియు మానవుని తననుండి తాను అతని ఆంతరిక ఉనికిలోకి విముక్తి కలిగించుకునే ఆధ్యాత్మిక ఆదర్శం లేకుంటే అటువంటి ప్రమాదం ఖచ్చితంగా వస్తుంది. ఈ తిరోగమన పరిస్థితి తప్పించుకున్నప్పటికీ, మరొక ప్రమాదం ఉంది, పరిణామం చెందాలనే లోతైన కోరికఆగిపోవాలంటే, ఒక ఆశయం కానీ ఆదర్శం కానీ లేకుండా స్థిరమైన సౌకర్యవంతమైన యాంత్రిక సామాజిక జీవనంలో నిలచి పోవడం మరొక సాధించగలిగిన ఫలితం. హేతువు తనకు తానుగా జాతి యొక్క పురోగతిని ఎక్కువ కాలం కొనసాగించలేదు, అది ప్రాణానికి శరీరానికి మరియు మనిషిలోని ఉన్నతమైనదానికి గొప్పదైనదానికి మధ్యవర్తిగా ఉంటేనే అది పని చేయగలదు. ఎందుకంటే అది ఒక ఆంతరంగిక ఆధ్యాత్మిక ఆవశ్యకత, తనలో ఇంకా సాధించబడని విషయాల నుండి వచ్చిన ఒక ప్రచోదన అతనిలో పనిచేస్తూ ఉంటుంది. ఒకసారి పరిణామంలో మానసిక స్థాయిని సాధించాక అది పరిణామం తాలూకు వత్తిడి, ఆధ్యాత్మిక లక్ష్యం కోసం చేసే పోరాటం. అది త్యజించ బడితే, అతను తిరోగమించినట్టే మళ్ళీ మొదటినుండి ప్రారంభించవలసిందే, తనకు ముందు ఆవిర్భవించి నశించి పోయిన జీవులవలె తాను అంతరించి పోవలసిందే, అప్పుడది ఉన్నస్థితిని నిలిపి ఉంచడంలో, పరిణామం యొక్క ఆశయాన్ని నెరవేర్చడంలో జరిగిన ఒక వైఫల్యంగా భావించాలి. ఉత్తమంగా అతను ఇతర జంతు జాతుల మాదిరిగానే కొన్ని రకాల మధ్యస్థమైన ఒక మాదిరి పరిపూర్ణతలో నిలిచిపోతాడు, అయితే ప్రకృతి అతని స్థాయిని దాటిన ఉన్నతమైన సృష్టికి తన మార్గాన్ని అనుసరిస్తుంది.

*CWSA 21:1090*

## పరిణామంలో సంక్షోభం

ప్రస్తుతం మానవజాతి పరిణామం సంక్షోభంలో ఉంది, దానిలో తను సాధించవల్సిన స్థితి యొక్క ఎంపిక నిక్షిప్తమై ఉంది. మానవ మనస్సు కొన్ని దిశలలో అపారమైన అభివృద్ధిని సాధించింది, మరికొన్నింటిలో అది నిర్బంధించబడి దిగ్భ్రాంతి చెందుతున్నది ఇకపై దాని మార్గాన్ని కనుగొనలేని స్థితిలో ఉన్నది. మానవుని చురుకైన మేధాశక్తి మరియు సజీవ సంకల్పంతో బాహ్య జీవితం యొక్క నిర్మాణం జరిగింది, ఆ నిర్మాణం నిర్వహించలేనంత పెద్ద సంక్లిష్టమైన నిర్మాణం, అతని మానసిక, ప్రాణిక, శారీరక ఆశయాల

సాధన కోసం నిర్మించబడిన సంక్లిష్టమైన రాజకీయ, సామాజిక, పరిపాలనా, ఆర్థిక, సాంస్కృతిక యంత్రాంగమది. అతని మేధోపరమైన, ఇంద్రియపరమైన, సౌందర్య పిపాస మరియు భౌతిక సంతృప్తి కోసం జరిగిన వ్యవస్థీకృత సామూహిక సాధనమది.

మానవుడు సృష్టించుకున్న నాగరికత అతని పరిమిత మానసిక సమర్ధతకు అవగాహనకు మించి పెరిగిపోయింది. అతని పరిమితమైన ఆధ్యాత్మిక నైతిక సామర్థ్యంతో అతను దానిని వినియోగించుకోలేడు అలాగే నిర్వహించనూ లేడు. అటువంటి నాగరికత అతని తప్పులు చేసే నైజం కలిగిన అహంకారానికి దాని వింత కోరికలకు ప్రమాదకరమైన సేవకుడి వలె తయారవుతుంది. గొప్ప దృష్టి కలిగిన మనస్సు కానీ, జ్ఞానంతో నిండిన అంతరదృష్టి కలిగిన ఆత్మకానీ ఇంకా అతని చైతన్యం యొక్క ఉపరితలంపైకి రాలేదు, అది జరిగితే ఈ జీవిత ప్రాథమిక సంపూర్ణతను దానిని మించిన దాని స్వేచ్ఛాయుతమైన పెరుగుదలకు ఒక అవసరమైన పునాదిగా ఉంటుంది. జీవిత సాధనాల యొక్క ఈ కొత్త సంపూర్ణత, అతని ఆర్థిక భౌతిక అవసరాల యొక్క ఎడతెగని అసంతృప్తి ఒత్తిడి నుండి విముక్తి కోసం, భౌతిక ఉనికిని అధిగమించే ఇతర గొప్ప లక్ష్యాల సంపూర్ణ సాధనకు ఒక అవకాశంగా ఉంటుంది. ఉన్నతమైన సత్యం, సంక్షేమం, సౌందర్యం యొక్క ఆవిష్కరణ కోసం, మనిషి యొక్క ఉన్నత దైవిక చైతన్యం కోసం పరిపూర్ణత కోసం జీవితంలో అది జోక్యం చేసుకుంటుంది, ఉపయోగించుకుంటుంది: కానీ అందుకు బదులుగా అది అనేకంగా పెరుగుతున్న కొత్త కోరికలు, దూకుడుగా విస్తరిస్తున్న సమిష్టి అహంకారం కోసం ఉపయోగించబడుతుంది. అదే సమయంలో శాస్త్రవిజ్ఞానం విశ్వ శక్తి యొక్క అనేక ప్రయోజనాలను మనకు అందుబాటులో ఉంచింది, మన జీవితాన్ని భౌతికంగా ఒకటిగా చేసింది. కానీ ఈ సార్వత్రిక శక్తిని ఉపయోగించేది ఒక అల్పమైన మానవ వ్యక్తిత్వం లేదా మతోన్మాద పూరితమైన అహంకారం, దాని జ్ఞానం దాని కదలికల వెలుగులో విశ్వజనీనమైనది ఏమీ లేదు, మానవ ప్రపంచం యొక్క ఈ భౌతిక కలయికలో నిజమైన జీవిత ఐక్యతను, మానసిక ఐక్యతను, ఆధ్యాత్మిక ఏకత్వాన్ని సృష్టించగలిగే అంతర్గత జ్ఞానం లేదా శక్తి లేదు. అక్కడ ఉన్నదంతా మానసిక ఆలోచనల ఘర్షణ, వ్యక్తిగత, సామూహిక శారీరక కోరికలు, అవసరాల గందరగోళం, ప్రాణికమైన ఆకాంక్షలు, కోరికలు, అజ్ఞాన

జీవన ప్రేరేపణలు, ఆకలికేకలు, వ్యక్తుల జీవన సంతృప్తి కోసం పిలుపులు రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిష్కారమార్గాలు, సందడితో నిండిన కలగలుపు నినాదాలు, మనుషులు  అణచివేయుడానికి, అణచివేయుబడడానికి, చంపడానికి, చంపివేయబడడానికి సిద్ధంగా ఉన్న కొన్ని సర్వరోగనివారిణిగా భావించే మార్గాలు,తమవద్ద ఉన్న అపారమైన అతిబలీయమైన మార్గాల ద్వారా ఒక ఆదర్శవంతమయిన పరిష్కారం దొరుకుతుందనే నమ్మకంతోఏదో విధంగా వాటిని ఎలాగైనా ఎదుటివారిపై రుద్దడానికి సిద్ధంగా ఉన్నారు. మానవ మనస్సు జీవితం యొక్క పరిణామం తప్పనిసరిగా పెంపొందుతున్న విశ్వజనీనత  వైపు దారి తీయాలి. కానీ అహంకారంతో కూడిన విభజనాత్మకమైన మనస్సుతో విశ్వజనీనతను ఆహ్వానించడమంటే అది విస్తారమైన పొంతనలేని ఆలోచనలు, ప్రేరణలను మాత్రమే సృష్టించవచ్చు, కలగలిసిపోయి పూర్తిగా జీర్ణించుకోబడని మానసిక, ప్రాణిక భౌతిక పదార్థంతో కూడిన గందరగోళంతో నిండిన సమూహంగా ఉండే ఒక పెద్ద ఉనికికి చెందిన పదార్థం తయారు అవుతుంది, ఇది ఆత్మ యొక్క సృజనాత్మక సామరస్యపూరిత ప్రకాశం ద్వారా స్వీకరించబడనందున, సార్వత్రిక గందర గోళంలో అసమ్మతిలో మునిగిపోవలిసిందే, దానినుండి గొప్ప సామరస్యపూరిత జీవితాన్ని నిర్మించడం అసాధ్యం.

*CWSA 21: 1089-91*

## ప్రతిఘటన యొక్క స్థానాలు

ఈ రెండు స్థానాలు  అత్యంత ప్రతిఘటనను కలిగి ఉంటాయి. మానవ చేతనలో ఇది అజ్ఞానం, అచేతన,చెడును కోరుకోవడమనే శక్తులకు  లోబడి ఉంటుంది. ఇది చాలా వరకు పురోగతిని సత్యం వైపుకు ముందుకు సాగడాన్నినిరాకరిస్తుంది. దురదృష్టవశాత్తు, ప్రతి మానవుడిలో ఇది ప్రతిఘటన యొక్క స్థానం, ఇది చాలా  సంకుచితంగా ఉండే బుద్ధిమాంద్యం, అది తాను ఉపయోగించని దేన్నీ అర్థం చేసుకోవడానికి నిరాకరిస్తుంది. ఈ విషయాలను చేపట్టి వాటిని మార్చాలనుకోవడం నిజంగా వీరోచిత చర్య. మేము దీన్ని కూడా చేయడానికి ప్రయత్నిస్తున్నాము. ఇది చేస్తేనే గాని, భూమికున్న పరిస్థితులను మార్చడం సాధ్యం కాదు.

రాజకీయమైన విత్తపరమైన పరిస్థితుల కంటే ఆర్థిక సామాజిక

స్థితిగతులను మార్చడం సాపేక్షంగా చాలా సులభం.

*CWM 9: 167-68*

## తీవ్రమైన బెదిరింపు

అక్కడ ఇదీపరిస్థితి. గత యుద్ధం తరువాత ఇది చాలా దారుణంగా తయారైంది. ప్రతి సంవత్సరం, ఇంకా అధ్వాన్నంగా పెరిగిపోతుంది. వ్యక్తి అటువంటి విపత్కర పరిస్థితిలో దురదృష్టవశాత్తు తన మూల వనరుల అంతానికి అంచున తాను ఉన్నట్లు గ్రహిస్తాడు. చాలా క్లిష్టమైన ఈ సమస్యను సరళతరం చేయడానికి భూ వాతావరణంలో ఒక యుక్తి ఉంది. ఆ యుక్తి అసంబద్ధంగా కనిపించవచ్చు. కాని దురదృష్టవశాత్తు అది అభూత కల్పన కంటే చాలా ఘోరంగా వుంది. అది విపత్తు ఒక హఠాత్పరిణామం జరిగితే, తరువాత అదే మెరుగ్గా అవ్వవచ్చు. నిషేధాలు, అసాధ్యాలు, నియమాలలో ప్రతి ఒక్కరూ చిక్కుకుపోయి, ప్రతిక్షణం క్లిష్టంగా మారి ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నట్లు అనిపిస్తుంది. నిజంగా ప్రతిదీ కూల్చివేయబడితే బహుశా అది ఉత్తమంగా తరువాత రూపుదిద్దుకోగలదనే ఒక ప్రశంసనీయమైన ఉపాయం ఒకటి వాతావరణంలో ఉన్నది. అన్ని ప్రభుత్వాలు తమకు తాము అటువంటి పరిస్థితుల్లో చిక్కించపజేసుకొన్నాయి.

ఆ పరిస్థితులే వారిని కట్టేసినట్లు ముందుకు సాగడానికి వీటినన్నింటినీ త్రెంచి వేసుకోవాలని వారికి అనిపిస్తున్నట్లు ఉంది. (నిశ్శబ్దం) దురదృష్టవశాత్తు ఇది సంభావ్యత అవకాశాన్ని మించి ఉంది. ఇది చాలా తీవ్రమైన బెదిరింపు. జీవితం ఇంకా అసాధ్యమన్నట్లు అవ్వలేదు ఎందుకంటే మనిషి విపత్తు నుండీ బయటకు రావడానికి అశక్తుడుగా ఉన్నట్లు భావిస్తున్నాడు. సమస్యల గందరగోళంలో మానవజాతి తనను బంధించుకొంది. ఇది ఒక నీడలాంటిది. దురదృష్టవశాత్తు చాలా క్రియాశీలకమైన నీడ. అది ఒక కొత్త ఆశకు చెందినది, మానవచేతనలో పైకెగిసినది, మరింత సామరస్యం కోసం ఏర్పడిన ఒక ఆవశ్యకత, ఒక ఆశ. ఈ ఆవశ్యకత జీవితానికి మల్లేనే చాలా తీక్షణమైనది. ఇప్పుడది సంభాళించబడుతుంది, దానికే అది మరింత విరుద్ధమైనదిగా అవుతుంది. ఏదో ఒక విస్ఫోటనమే జరుగుతుందేమో అని ఆశించేలా ఈ వైరుధ్యాలు ఒకదానికొకటి ఎదురుపడుతున్నాయి.

*CWM 9:168-69*

## నిర్ణయాత్మక మలుపు

అన్నింటికన్నా తెలుసుకోవాల్సిన ఒక పెద్ద సమస్య ఏమిటంటే, మానవీయత స్వచ్ఛమైన బంగారం స్థాయికి చేరుకుందా? లేదా ఇంకా పుటం పెట్టవలసిన అవసరం ఉందా? అని.

ఒక విషయం నిరూపణమౌతుంది. మానవీయత ఇంకా మేలిమి బంగారం స్థాయికి మారలేదు. అది సుస్పష్టం.

కానీ ప్రపంచ చరిత్రలో ఏదో జరిగింది. అది మానవజాతిలో చాలా కొద్దిమంది, ఎంపిక చేయబడిన వారు మాత్రం స్వచ్ఛమైన బంగారంలా రూపాంతరం చెందడానికి సిద్ధంగా ఉన్నారని, వారు హింస అనేది లేకుండానే తమ శక్తిని, విధ్వంసం లేకుండా నాయకత్వాన్ని విపత్తు లేకుండా తమ ధైర్యాన్ని ప్రదర్శించి రూపాంతరం చెందగలరని మనం ఆశించేలా చేస్తుంది. కానీ తర్వాతి పేరాలో శ్రీ అరవిందులు సమాధానమిస్తున్నారిలా: "ఒకసారి మనిషి ఆధ్యాత్మికపరంగా ఉండేందుకు అంగీకరించగల్గితే..." సమ్మతించగల్గితే.. అతనిలో భాగమేదో 'ఆధ్యాత్మికం' కోసం - అడుగుతుంది, ఆకాంక్షిస్తుంది, కాని తక్కినదంతా దానిని నిరాకరించి ఎప్పటిలాగే కొనసాగాలని కోరుకొంటుంది. మిశ్రమ లోహం కొలిమిలో కాలి శుభ్రపడాల్సి ఉంది.

ఈ సమయంలో మనం మరోసారి పృథ్వి చరిత్రలో ఒక నిర్ణయాత్మక మలుపులో ఉన్నాము. ప్రతి వైపు నుండీ 'అసలేం జరుగబోతుంది' అని నన్ను ప్రశ్నిస్తున్నారు. ప్రతిచోటా వేదన, నిరీక్షణ, భయం. ఏం జరుగబోతోంది? అని. నా దగ్గర ఒకే సమాధానం ఉంది. ఈ మానవుడు ఆధ్యాత్మీకరించబడడానికి అంగీకరించగల్గితే.....

బహుశా కొద్దిమంది వ్యక్తులు స్వచ్ఛమైన బంగారంగా మారితే సరిపోతుంది. ఎందుకంటే ఈ ఘటన సంభావ్యతను, గమనాన్ని మార్చడానికి సరిపోతుంది. మేము ఈ అవసరాన్ని చాలా అత్యవసర మార్గంలో ఎదుర్కొంటున్నాము.

పరమాత్మ మన నుండి వాంఛించే ఈ ధైర్యాన్ని, వీరత్వాన్ని వ్యక్తి తన సొంత కష్టాలు, తన లోపాలను, తన స్వంత అస్పష్టతలతో పోరాడడానికి ఎందుకు ఉపయోగించకూడదు? మొత్తం నాగరికతను అంధకారంలో

ముంచెత్తే భయంకరమైన, భారీ విధ్వంసాలలో ఒక దానిని, మరోసారి దాటవలసిన అవసరం లేకుండా, అంతర్గత శుద్ధి కొలిమిలో వీరోచితంగా ఎందుకు దహించబడకూడదు? ఇదే మన ముందున్న సమస్య, దీనిని ప్రతి ఒక్కరూ తమ స్వంత మార్గంలో పరిష్కరించుకోవాలి.

ఈ సాయంత్రం, నన్ను అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తున్నాను. అది శ్రీ అరవిందులు చెప్పిన దాని నుండే.

"ఒకసారి మనిషి ఆధ్యాత్మీకరించబడడానికి సమ్మతిస్తే..." ఇక్కడ నేను జోడిస్తున్నాను - మానవీయ దృక్కోణం నుండీ... కాలం ఒత్తిడి చేస్తోంది.

*CWM 9:74-75*

## ప్రభాతానికి ముందు రాత్రి

ప్రస్తుత పరిస్థితుల గురించి విలపిస్తున్న మీ సమీక్షకులకైనా ప్రస్తుతానికి చల్లని ఓదార్పును ఇవ్వగలనా అని భయపడుతున్నాను. ప్రస్తుత పరిస్థితులు చాలా చెడుగా, అధ్వాన్నంగా తయారవుతున్నాయి. అవి ఏ సమయంలోనైనా సాధ్యమైనంత ఘోరంగా, ఇంకా అధ్వాన్నంగా పెరగవచ్చు. విరుద్ధమైనది అది ఏదయినా ప్రస్తుత గందరగోళమైన ప్రపంచంలో సంభవించేలా కనిపిస్తుంది. బయటకు ప్రకటితమయ్యే మానవీయతను విముక్త పరచడానికి ఒక ఉత్తమ ప్రపంచం మనుగడలోకి రావడానికి, ఇదంతా అవసరమని వాళ్ళు గ్రహించడం చాలా ఉత్తమం. ఇదంతా తరువాత కాలంలో జరగడానికి, వాయిదా వేయడానికి జరుగలేదు. యోగంలో వ్యక్తిలో దాగి లేదా సక్రియంగా ఉన్న అంశాలన్నీ వెలుగులోకి తేబడాలి. తద్వారా అదే శుద్ధీకరణ నిమిత్తం అవన్నీ లోలోతుల్లో నుండి బయటకు ఉబికి రావడానికి లేదా బయటకు త్రోసివేయబడటానికి పరస్పరం పెనుగులాడుకోవచ్చు. ఒక సామెతను వారంతా గుర్తుపెట్టుకోవాలి: ప్రభాతానికి ముందు రాత్రి గాఢాంధకారంలో ఉంటుంది. అలాగే ప్రభాత ఆగమనం నిర్నిరోధమైనది. వారంతా ఇది కూడా గుర్తు పెట్టుకోవాలి. నూతన ప్రపంచం మేము దర్శించిన దాని రాక పాత ప్రపంచంమల్లే అల్లిక, అమరికతో ఉండదు. నమూనాలోనే తేడా ఉంటుంది.

కానీ అది వేరే సాధనాల ద్వారా వస్తుంది. బయట నుండీ కాదు, ఆంతర్యం నుండి వస్తుంది. కాబట్టి ఉత్తమ మార్గమన్నది బాహ్యంలో సంభవించే దు:ఖపూరితమైన వాటితో ఆక్రమించబడుతూ ఉండకూడదు. కాని వాటికవిగా

ఆంతర్యంలో ఎదగాలి. తద్వారా నూతన ప్రపంచానికీ, అది ఇక ఏ రూపమైన తీసుకోవచ్చు. దానికై సంసిద్ధంగా ఉండాలి.

*CWSA 31:691*

## భారీవరద

(ప్రళయానికి సంబంధించిన అనుభవాన్ని గురించి మదర్ కథనం):

గత రాత్రి, సరిగ్గా **10** నుండి **11** గంటల మధ్య ఆసక్తికర సంఘటన ఒకటి జరిగింది. నేను ఒక బండిలో ఉన్నాను. నేను ఆ బండిని సరిగ్గా చూడలేదు కానీ, నేను దానిలో ఉన్నాను. నా ముందు ఎవరో వ్యక్తి బండిని నడుపుతున్నాడు, కానీ నేను ఆ వ్యక్తి వెనుక భాగాన్ని మాత్రమే చూశాను. నేను ఆ వ్యక్తి ఎవరనే విషయాన్ని పట్టించుకోలేదు- అతను కేవలం నడపడానికే ఉన్నాడు.

అది విధ్వంస తలుపులు తెరుచుకున్నట్లుగా ఉంది. వరదలు - సముద్రమంత ముంపు - కిందకు దేని మీదకో దూసుకు వస్తున్నాయి.... భూమి మీదకా? ఆపనలవి కాని శక్తితో, పిచ్చి వేగంతో ప్రవహించే బలీయమైన ప్రవాహం. ఆ నీరు ఉప్పునీరు, ఆ నీటికి పారదర్శకత లేదు. నీటి ప్రవాహానికంటే ముందు ఒక నిర్దిష్ట ప్రదేశానికి చేరుకోవడం అత్యవసరం. అంటే నాకంటే ముందు అక్కడకి నీరు చేరినట్లయితే, ఏమీ చేయలేము. అలా కాక నేను అక్కడికి ముందుగా చేరుకుంటే(నేను చెప్తున్న “నేను”, శరీరానికి సంబంధించిన నేను కాదు), ఒకవేళ నేను అవతల తీరానికి, నీటి ప్రవాహానికంటే ముందు చేరుకుంటే, నేను పూర్తిగా సురక్షితంగా ఉంటాను. ఆ సురక్షిత స్థానం నుంచి, నేను సహాయం చేయగలను, నా వెనకాల ఉన్నవారికి సహాయం చేసే అవకాశం నాకు ఉంటుంది.

ఆ బండి ముంపుకంటే వేగంగా ముందుకు వెళ్తోంది (నేను బండి ముందుకు వెళ్లడం చూశాను, ఇంకా దాని కదలిక ద్వారా అనుభూతి చెందాను) అది బలీయమైన వరదే, కానీ బండి దానికంటే వేగంగా ముందుకు వెళ్తోంది. అది చాలా అద్భుతంగా ఉంది. దారిలో కొన్ని స్థానాలలో కొన్ని ప్రత్యేక ఇబ్బందికర ప్రమాదకర స్థలాలు ఉన్నాయి, అయితే నేను వాటిని ప్రవాహం కంటే ముందే దాటుకుంటూ వెళ్లాను, అంటే నీరు ఆ మార్గాన్ని అడ్డుకోడానికి కొద్దిసేపటి ముందు నేను దానిని దాటాను. మేము ముందుకు వెళుతూనే

ఉన్నాము. అప్పుడు చివరి ప్రయత్నంతో (నిజానికి ప్రయత్నమే లేదు, ఉన్నది సంకల్పం మాత్రమే), చివరి ప్రేరేపణ ద్వారా, మేము అవతలి తీరానికి చేరుకున్నాము. అప్పుడు నీరు కూడా ప్రవాహంలా వెన్నంటి వచ్చింది. అది అద్భుతమైన వేగంతో వచ్చింది. మేము అనుకున్నది సాధించాం. అప్పుడు అవతలి తీరం రంగు మారింది. అది... దాని రంగు ప్రధానంగా నీలంగా మారింది. ఆ బలిష్టమైన నీలం రంగు, అది శక్తి, భౌతిక ప్రపంచంలో ఎక్కువగా ప్రభావం చూపే నిర్వహణ శక్తి. మేము ఆవల తీరంలో ఉన్నాము, అక్కడ బండి ఆగిపోయింది. మొత్తం సమయాన్ని దృష్టిలో పెట్టుకొని, మార్గం నుంచి అటు ఇటు మరలకుండా, మేము వేగంగా వెళ్తున్నాము, నేను చుట్టూతా చూస్తూ, 'ఆ.., ఇప్పుడు నేను నా వెనుక ఉన్నవారికి సహాయం చేయడం ప్రారంభించగలను' అన్నాను.

*మదర్: ఒక శిష్యునితో సంభాషణ, జూలై 12, 1960*

## ప్రపంచ పరిస్థితి

దానిలో దాదాపు తెలియరాని దాని లక్షణాలన్నీ ఉన్నాయి... పోల్చి చూస్తే భూమి చిన్నదిగా అనిపించింది, నువ్వు చూడు. ఉదాహరణకు వరదల సమయంలో భూమిపైకి నీరు విడుదలైనప్పుడు ఏమి జరుగుతుందో, ఇక్కడ కూడా అదే విధంగా ఉంటుంది, కానీ చాలా ఎక్కువ స్థాయిలో ఉంటుంది.

ఆహ్లాదకర విషయం ఏమిటంటే, విపరీతమైన బాణం లాంటి వేగం, ఇది నిజంగా చాలా ఆసక్తికరంగా ఉంది. నేను ఎప్పుడూ సమయానికే చేరుకుంటాను, సరిగ్గా సమయానికి, సరిగ్గా సమయానికే చేరుకుంటాను. ఒకసారి నేను అవతలి వైపుకు వెళ్ళాను (ఏమి మిగలదని స్పష్టంగా అనిపించింది, ఎందుకంటే ఇది చాలా శక్తివంతమైన వరద) ప్రమాదం ముగిసింది, ఇక పై తాకడానికి అవకాశం లేదు ఇది ప్రధాన భావన. ప్రతిదీ ఆగిపోయింది. ఇక ఏమీ తాకదు.

నేను వెనక్కి తిరిగి చూసేసరికి, నీళ్లన్నీ క్రిందకి ప్రవహిస్తున్నాయి, అప్పుడు నేను' ఇప్పుడు మనం ఇక్కడ ఏదైనా చేయగలమా చూద్దాం' అని అనుకున్నాను. నా వెనుక నాకు ఆసక్తిని కలిగించే వారు ఎవరో ఉన్నారు, ఎవరో లేదా ఏదో - అది ఏదో ఉంది, అది చాలా ఇష్టపడే విధంగా ఉంది, ఇక్కడ మరొక వైపు ఉన్నది నీలం రంగులో ఉంది. నిజానికి అవి వ్యక్తులు కాదు, కానీ నన్ను

చాలా దగ్గరగా అనుసరిస్తున్న వాటికి ప్రతినిధిగా ఉన్న జీవులు అవి. నేను అక్కడ ఉన్నప్పుడు, అది కూడా ఉంది, కానీ అది నాతో పాటు ముందుకు రాలేక పోయింది. అది వెనుక ఉండిపోయింది - నా వేగం పెరిగేకొద్దీ, దాని వేగం తగ్గింది. అది ముందుకు కొనసాగించలేకపోయింది. కానీ అది నాకు ఒక ప్రత్యేక మార్గంలో ఆసక్తిని కలిగించింది. 'ఓహ్, అతను చాలా దగ్గరగా ఉన్నాడు (అతను లేదా అది). అతను దానిని చేయగలడు.' అని నేను అనుకున్నాను. అప్పుడు ఆ సమయంలో, ఈ సమస్త విధ్వంసక సంకల్పం, తన పరికరమైన నీటితో, ప్రతీకాత్మకంగా నీరు, వేగంగా ప్రవహించి, ప్రతిచోటా వ్యాపించడం నేను చూశాను.

కానీ ఈ మార్గంలో ఉన్న వారందరినీ రక్షించే అవకాశం ఉంది, అని నేను వెంటనే అనుకున్నాను. ఇది నా మొదటి కోరిక: 'నేను వాళ్లకు దాటడానికి సహాయం చేస్తే, వాళ్లు దాటగలరో లేదో చూద్దాం.' నాకు కొన్ని ప్రమాదకర ప్రదేశాలు గుర్తుకు వచ్చాయి (గతంలో వేగంగా వెళుతున్నప్పుడు), 'ఓహ్, ఇక్కడ మనం ఇంకా దీన్ని చేయగలము, అక్కడ ఇంకా చేయవచ్చు' అని నేను గమనించాను నా చేతన అదే వేగంతో కదిలింది, నేను మార్గంలో ప్రతిదీ గమనించాను, నేను మరొక వైపుకు వెళ్లి అక్కడ స్థిరంగా ఉన్నప్పుడు, నేను తిరిగి సందేశాలను పంపడం ప్రారంభించాను.

దిగువన, నీరు గొప్ప అదును కలిగి ఉంది. ఇది నిస్సహాయంగా ఉంది. కానీ ఇక్కడ, ఈ మార్గంలో, నీరు వచ్చి ప్రవహిస్తున్నప్పటికీ కూడా... ఇప్పటికీ ఒక ఆశ ఉంది. ఈ చీలిక ప్రదేశాలను దాటడానికి ఇతరులకు సహాయం చేయడానికి నేను బహుశా నా వద్ద ఒక నిర్దిష్ట శక్తిని కలిగి ఉన్నాను. కానీ నేను నిద్రలేచినందున, నేను అది ఏమిటని చూడలేదు. కాబట్టి ప్రతిదీ ఆగిపోయింది. నేను అకస్మాత్తుగా మేల్కొన్నందున, దాని అర్థం ఏమిటో నేను తెలుసుకోలేక పోయాను.

వాహనం, ముందుకు సాగడం అనేది సందేహాత్మక ఛాయకు అతీతంగా ఉన్న సాధన. విధ్వంసక శక్తుల వేగం కంటే సాధన వేగం ఎక్కువని నాకు అర్థమైంది. ఇది నిర్దిష్ట విజయంతో ముగిసింది, ఏ సందేహాత్మక నీడా లేదు. నేను అక్కడ (చతురస్రంలో) బలంగా స్థిరపడినప్పుడు, ఈ శక్తికి సంబంధించిన భావన కలిగింది, అది ఇతరులకు సాయం చేయడానికి తగినంత శక్తి.

ఇవి విశ్వ శక్తులు. ఇది యుద్ధం అని నేను చెప్పలేను. నేను చాలా యుద్ధాలను ముందుగా దర్శించాను. ఊహించాను - విస్తృతమైన యుద్ధాలు, స్థానిక యుద్ధాలు, చాలా యుద్ధాలు - ఇప్పటి వరకు ఆ రూపంలో నాకు ఎప్పుడూ కనబడలేదు. అవి ఎల్లప్పుడూ అగ్నికీలల్లా వచ్చేవి - జ్వాలలు, మంటలు, ఇల్లు దహించుకుపోవడం. కానీ ఉప్పెనలా కాదు.

## ప్రళయమా?

ఆహ్, మనం ఇప్పటికే కొన్ని చూసి ఉన్నాము. ఇప్పటి ప్రజలు చాలామంది 1962లో ప్రళయం వస్తుంది అని ప్రకటించారు...కొంతమంది భూమి అంతం అని ఊహించారు, కానీ అది అవివేకం! భూమి ఒక నిర్దిష్ట ఉద్దేశ్యంతో నిర్మించబడింది, ఆ పనులు జరగడానికి ముందు, అది అదృశ్యం కాదు.

కానీ కొన్ని మార్పులు జరగవచ్చు.

*మదర్ : ఒక శిష్యునితో సంభాషణ, జూలై 12, 1960*

## ఈ పృథ్వి స్థితి

ఈ భూమి పరిస్థితి యిది. అది అంత తేజోమయంగా లేదు కానీ మనకింకా ఒక సాధ్యత మిగిలి ఉంది. బాహ్యంగా అన్ని విషయాలు పూర్తిగా దిగజారిపోతున్నా, ఈ విపత్తును నివారించలేకపోయినప్పటికీ మనకక్కడ నా ఉద్దేశ్యంలో ఎవరికయితే అతిమానసమొక అర్థంలేని స్వప్నం కాదో, ఎవరికైతే దాని వాస్తవికతపై విశ్వాసముందో, ఎవరికైతే దానిని సిద్ధింప జేసుకోవాలనే ఆకాంక్ష ఉందో - నేను పాండిచ్చేరి ఆశ్రమంలో చేరిన వారి గురించి చెప్పడం లేదు - ఎవరికైతే శ్రీ అరవిందులు ఇచ్చిన జ్ఞానంతో అనుబంధం ఉండి, ఆ జ్ఞానానికి అనుగుణంగా జీవించాలనుకుంటున్నారో, వారికి తమ ఆకాంక్షను సంకల్పాన్ని, ప్రయత్నాన్ని మరియు తమ శక్తులను పోగుచేసుకొని దానిని సిద్ధింపజేసుకొనే సమయాన్ని తగ్గించుకొనే ఈ అద్భుతాన్ని సాధించగల సాధ్యత వారికుంటుంది. వ్యక్తిగతంగా కొంత మేరకు సామూహికంగా దీనిని సిద్ధింప జేసుకోవడానికి కావలసిన ప్రదేశం, కాల పరిమాణాన్ని జయించగలుగుతారు. కాలాన్ని ప్రయత్న తీవ్రతతో భర్తీ చేసి తగినంత వేగంతో, తగినంత దూరం ప్రస్తుత ప్రపంచ పరిస్థితి యొక్క పరిణామాల నుండి తమను విడిపించుకోగలిగే సాధ్యత, శక్తి, సామర్థ్యం, మొదలగు సత్యాలను ఎంతగా కేంద్రీకరించాలంటే ఈ స్థితి వలననే వారు

ఈ పరిణామాలకతీతంగా ఉండగలరు. వాటికన్న పైన భద్రంగా ఉండగలరు. ఆ వెలుగు సత్యాల రక్షణను ఆస్వాదించగలరు. నిర్మలత, అంతర పరివర్తన వలన కలిగిన దివ్య నైర్మల్యం. అప్పుడు ఒక తుఫాను ఈ ప్రపంచాన్ని చుట్టి వెళ్ళినా భవితపై ఈ మహత్తరమైన ఆశను నశింప చెయ్యలేదు. ఆ పెనుగాలి ఆరంభంలో ఉన్న సిద్ధిని తుడిచివేయలేదు. సులభతరమయిన ప్రశాంతిలో నిదురలోకి పోక సంఘటనలను తమ స్వీయ లయబద్ధత జరిగిపోనీయకుండా ఒక వ్యక్తి తన సంకల్పాన్ని, ఉత్సాహాన్ని, ఆకాంక్షను తీవ్రతరం చేసుకొని వెలుగులోకి, పైకి ఎగసి, తమ శిరసును పైకెత్తగలరు. తగినంత విశాలమైన జాగా చెలరేగే తుఫానును దాటి ఎదగటానికి, ప్రవర్ధమానం కావటానికి ఉంటుంది. ఇది సుసాధ్యం. గత యుద్ధంలో అది అప్పటికే చిన్నగా ప్రారంభమయింది. శ్రీ అరవిందులు ఉన్నప్పుడే అది మళ్ళీ జరుగవచ్చు. కానీ దానిని కావాలనుకోవాలి. తాను చేయవలసిన పనిని వీలయినంత నిజాయితీతో సంపూర్ణంగా చేయాలి.

*CWM 9:169-171*

## ప్రపంచ యుద్ధం

"ఒకవేళ యుద్ధం కనుక వస్తే అది అధికశాతం మానవతను నాశనం చేయటమే కాక, అణు ప్రసారం వలన జీవించి వున్న వారి జీవన పరిస్థితులను దుర్భరం చేస్తుంది. ఒకవేళ అటువంటి యుద్ధం వచ్చే అవకాశం ఇంకా ఉంటే అది అతిమానస సత్యం మరియు కొత్త జాతి ఆవిర్భావాన్ని ప్రభావితం చేయదా?"

"ఇవన్నీ కూడా మానసికమయిన ఊహాగానాలు. ఈ మానసిక ఊహల ప్రపంచంలోకి అడుగు పెడితే సమస్యలకీ, వాటి పరిష్కారాలకీ అంతు ఉండదు. కానీ అదంతా మిమ్మల్ని ఒక్క అడుగు కూడా ముందుకు తీసుకువెళ్ళలేదు."

"మనసుకు చాలా ఆరోగ్యకరమైన, భద్రమైన వైఖరి ఏమిటంటే మనకు చాలా ఆశాజనకంగా, దృఢంగా ప్రస్తుత స్థితిని అతిమానస సృష్టి అనుసరించి వస్తుందని చెప్పి ఉండటం, అందు వలన భవిష్యత్తుకు సంసిద్ధమయేవన్నీ, అవి ఏమయినప్పటికీ తమ ఆవిర్భావానికి కావలసిన పరిస్థితులే. మనం సరిగ్గా దర్శించలేకపోతున్నాం కాబట్టి, వాటి గురించి నిశ్శబ్దంగా ఉండటం ఉత్తమం."

*CWM 15:111-112*

ఉదయం నుండి అలానే ఉంది. సమ్మెలు, పోట్లాటలు, అస్తవ్యస్తాలు.

ఈ అస్తవ్యస్తతను సృజించిన వారి సాయంతోనే మళ్ళీ ఒక క్రమాన్ని పునఃప్రతిష్టించాలనే ఒక భావన. అది జరగవలసిన విషయం. సాధారణమయిన సహృదయత, అన్ని విధాలయిన నైతికము, సాంఘికమయిన నియమాల పునాది ఉన్నప్పటికీ - అంతా నేలమట్టమయిపోయింది. వ్యక్తి పైకి లేవాలి. దైవ సంకల్పం, దివ్యమయిన సామరస్యత అక్కడ ఉండాలి. మనకు కావాలసినదదే. ఎవరైతే సాధారణ న్యాయానికి, సాధారణ సాంఘిక సంప్రదాయాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసారో తామొక ఉన్నత చేతనకూ, నిజమైన సత్యానికీ సంబంధంలో ఉన్నారనీ ఋజువు చేస్తారు.

ఇది చేయటానికి సరైన సమయం (పైకి ఎగసినట్లుగా శ్రీమాత సంజ్ఞ చేస్తారు) వ్యవస్థీకరించే శక్తి దృష్టిలో, అది చాలా శక్తివంతమయిన శక్తి. అదొక అద్భుతం. ఈ శక్తిని అత్యున్నత స్థాయికి చెందిన సత్యమయిన చేతన అధీనంలో ఉంచినట్లయితే కొంత దేనినయినా సాధించవచ్చు.

ఎవరైనా సరే పైకి దూకడానికి ప్రయత్నించాలి.

క్రమబద్ధతను పున: ప్రతిష్టించాలనుకొనే వారందరూ పాత ఆలోచనలోకి వెనుకకు లాగుతారు. అందువలన వారెపుడూ సఫలీకృతులు కాలేరు. అది ముగిసిపోయింది. మంచి కోసమే ముగింపుకు వచ్చేసింది. మనం ఊర్ధ్వ ముఖంగా వెళ్తున్నాం. కేవలం ఎవరైతే పైకి లేవగలుగుతారో వాళ్ళే పని చేయగలుగుతారు.

మీకు అడగటానికి ఏమీ లేదా?

నేను ఏ దిశగా కదులుతున్నానేది నాకు సరిగ్గా తెలియదు. ఒకే దిశ ఉంది. భగవంతునివైపుకి. మీకు తెలుసు కదా? అది బాహ్యంగా ఎంతో అంతరంగంలో కూడా అంతే. ఎంత ఊర్ధ్వ ముఖమో అంతే అధోముఖంగా కూడా ఉంటుంది. అది అన్ని దిశలా వ్యాపించింది. ప్రపంచం కూడా తానే. అందులో భగవంతుణ్ణి కనుగొనేందుకు ఆయనను అంటిపెట్టుకొని ఉండాలి. కేవలం ఆయననే. మరో మార్గం లేదు.

*

## రాగల మహా విపత్తు

కొద్ది రోజుల క్రితమే ఆ పెను ప్రమాదం పొంచి ఉన్న భావన కలిగింది. ఆ క్షణంలో నాలో సర్వస్వం (ఎలా చెప్పాలి) నిజమైన విజయం కోసం ఆకాంక్ష అనవచ్చు ఇదో - అదో కావాలనుకోవటం కాదు. నిజమైన విజయం. ఇదే అన్ని కష్టాలనీ తెచ్చిపెట్టింది - ఈ ప్రత్యేకమయిన సంకల్పాలు. అప్పుడు అకస్మాత్తుగా ఒక వెలుగులాగ అంతా గోచరించింది. విజయం సంభవం అని తెలియజేస్తున్నది. అయినప్పటికీ ఒక అద్భుతం కాదు. అదిఒక ప్రమేయం, ఒక సర్వోన్నత, ప్రజ్ఞ యొక్క జోక్యం. అది యథార్థంగా, స్థూలంగా ఉంటుందా? మనం చూద్దాం. అది వస్తుంది. అది యిలా వస్తుంది. (ఒక ఎత్తులో రెండు అరచేతులూ క్రింది వైపుకు చూపుతూ) ఒక సాధ్యతలా.

లేదు అది చాలా ఇటీవలి కాలంలో జరిగింది. అది అకస్మాత్తుగా జరిగింది అనలేను కొద్ది రోజులలోనే సంభవించింది.


ఎందుకంటే కొంతకాలం నేను చాలా అనుమానించాను.

అది అంత మంచి వైఖరి కాదు.

నాకా వైఖరి లేదు కానీ ఏదో నిరాశావాద వాతావరణం కమ్ముకుంది.

భగవంతుణ్ణి కోరుకొనే వారు దైవం ఈ వాతావరణాన్ని ఉద్దేశ్యపూర్వకంగా కల్పిస్తుందని అనుకోరు. మీరు దానిని పట్టించుకోకూడదు. ఎందుకంటే అది అసుర మార్గం. ఈ నిరాశావాదం అసురుడి ఆయుధం. అతను ఈ పరిస్థితిని గుర్తిస్తాడు. (కంపించడం యొక్క సంజ్ఞ). మంచిది. నేను సాధ్యమనుకున్నది సిద్ధిస్తే అది నిజంగా సహజంగా అసుర శక్తులపై ఒక ఖచ్చితమయిన విజయం అవుతుంది. అతను వీలయినంత బాగా పోరాడుతాడు. అది ఎల్లప్పుడూ ఒక అసురుడే. మీరు నిరాశావాదపు తోకను చూసిన వెంటనే అది ఒక అసురుడని తెలుసుకోండి. అది అతని గొప్ప ఆయుధం.

*CWM 11:256-57* శ్రీమాత



ఇది నీకు, అలాగే ప్రతిఒక్కరికీ ఇబ్బందికరమైన తరుణం అని నాకు తెలుసు. అలాగే మొత్తం ప్రపంచానికి కూడాను; గందరగోళం, సమస్య, అస్తవ్యస్తత, చింతాగ్రస్తత ప్రతిచోటా, అన్ని విషయాల్లో ఉండడమన్నది సాధారణ స్థితి. ఉత్తమమైన అంశాలు ఉత్పన్నమవ్వవలసి ఉంది. అవి ఒక తెర వెనుక వృద్ధి చెందుతూ సంసిద్ధమౌతున్నాయి. అధ్వాన్నమైనవి ప్రతిచోట ఆధిక్యత వహిస్తున్నాయి. ప్రకాశవంతమైన ఒక తరుణం వచ్చేవరకు ఒక్కొక్క అంశంపై పట్టువిడువకుండా ఉండాలి.

# భవిష్యత్తు

అంతరించేను కలియుగం,
అవతరించేను దైవం.
విప్లవాగ్నిలో రగిలెను లోకం.
విష్ణుహస్తాన్ని వీడి సుదర్శనం
అవనిని ఆవరించెను. నవశకానికిది ఆరంభం.

వెనకటిదంతా నుసియై రాలిపోవును,
నామరహితమై ఇలనుండి మాయమౌను.
నరుడి విశాలవృద్ధిని అరికట్టే సంకెళ్లు
పటాపంచలౌను, బంధములు విడిపోవును.

స్వేచ్ఛ, దైవం, అమరత్వాలత్రయం
మూడింటిదీ ఒకటేతత్వం.
ప్రేమ, ప్రజ్ఞ, ధర్మం, ఆనందమప్రతిహతబలం,
అనుచ్యమైనహ్లాదంలో అవుతాయి ఐక్యం.

ఏనాడో ఊహించిన లోకం, నేడు కాబోతోంది నిజం,
పట్మోస్లోజాన్దర్శనం, షెల్లీ కవిత్వ మహత్యం,
కల అని, కల్లని లోకులు కాదన్న అద్భుతం,
విరిసిన ఆనందపురి, స్వాగతించు స్వర్ణయుగం.

కలియుగం ఈనాడు అంతరిస్తోంది
గతిస్తున్న గతం తుదిశ్వాస విడుస్తోంది
అఖిలావని అతలాకుతలమవుతోంది,
మాలిన్యం లేని పుడమి పునీతమవుతోంది.

ఇది మానవప్రగతి కలియుగం అంతరించి
స్వర్ణయుగం వచ్చింది. పాపాలని పరిహరించి,
వేదనలన్నీ తీర్చే ఎదలో కొలువైన దైవం
మొదలాయెను మానవుడి అంతులేని పయనం.

ఎన్నోయుగాల బాధల పీడనిపట్టు
ఊపిరాడనీయక నరుని చుట్టుముట్టు
వెనకటి పీడల అగ్గి ఆగక రగులుతోంది.
కాస్తంత తీపిని, ఇంకొంత చేవని బతుకు కోరుతోంది.

దిక్కులుతాకే రెక్కలతో నింగికి ఎగశాడు
ఎదలో ఆరని తపనలతో భానుడిలా వెలిగాడు.
అనంతం అతడి జన్మస్థానం,
అమరత్వం తన ఆఖరు గమ్యం.

ఆత్మతేజం పార్థివ దేహాన్ని పూరిస్తోంది,
సురలోకం చేతులు చాచి భువిని స్పృశిస్తోంది.
జననాలనగాలను దాటి నింగిని తాకెను మానవుడు.
తనబాటకు బాసటయై నిలిచి అనుగ్రహించెను దేవుడు.

## ప్రపంచం రక్షింపబడాలి

ఏది ఏమైనా (రకరకాల ప్రశ్నలకు జవాబులు) అదంతా ప్రస్తుత మానవ నాగరికత గురించిన ప్రశ్న కంటే భిన్నమైన విషయం. రక్షించబడవలసింది ఇదికాదు. ఈ ప్రపంచం రక్షింపబడాలి; దీన్ని కాపాడాలి. ఈ కార్యం ఏమంత సులువు అయినది కాదు. గాని ఇది జరగాలి. కొందరు కోరుకున్నట్లు, ఊహించినట్లు, వారు అనుకొన్న రీతిలో అంతత్వరగా కాకున్నా ఇది జరగాలి. ప్రస్తుత మున్న నాగరికత తప్పక మారాలి. అది ఒక విధ్వంసం వల్ల నా లేక ఒక మహా సత్యపీఠంపై ఒక నవీన నిర్మాణం ద్వారానా అన్నదే ఇక్కడ విషయం.

మదర్ ఈ ప్రశ్నను అలాగే ఎటూ తేల్చకుండా ఉంచారు. నేను కూడా అదే చెప్తాను. ఒక తెలివైన మనిషి, తాను గెల్చాక ప్రవక్త లేదా మద్రాసు జ్యోతిష్యకేంద్రానికి నిర్దేశకుడో అయ్యుంటే తప్ప ఈ స్థితిలోనే ఉండటంతోనే సరిపుచ్చుకోవల్సి ఉంటుంది. ఆశావాదమో లేదా నిరాశావాదమో సత్యం కాదు. అవి మనస్సు వైఖరులు, స్వాభావికమైన మనో స్థితిలు మాత్రమే. అటు అతి ఆశావాదంలోనో లేదా అతి నిరాశావాదంలోనో ఉండకుండా 'వేచి చూద్దాం'.

*CWSA 35:221*

## వెనుకంజలు ముందుకు దూకడానికే

సాధారణంగా ప్రకృతిలో ఏ విషయాలైనా ఎప్పుడూ అశుభకరంగా అంతమయ్యి పోతాయనే విశ్వాసముంటుంది. ఎవరైతే వాళ్ళవాళ్ళ జీవితంలో గొప్ప విజయాలను చవిచూచి, ఆనందించారో వాళ్ళు ఆసాంతానికి దుఃఖానికి గుర్రైయ్యారనే కథ ప్రతి ఒక్కరికీ తెలుసు. ఎవరెవరికి అసాధారణమైన శక్తియుక్తులు గలవో, వాటిని కడపటికి పోగొట్టుకొన్నారు. ఒక జాతి కూడా చాలాకాలం పాటు ఒక నమూనాగా అద్భుతమైన నాగరికతతో ఉన్నది కూడా ఎంతగా వెలిగిందో అంత గుర్తుంచుకోనంత దయనీయ స్థితికి ఆ జాతి, ఆ నాగరికత నశించిపోయింది. ఈ పుడమి కథ ఓటములు వెంబడించే విజయాల గాథగానే కన్పిస్తుంది గానీ విజయాలు వెంబడించే పరాజయాల గాథగా కనిపించడం లేదు.

కాని నిజానికి విశ్వసంబంధమైన దైవానికి చెందిన విషయాలను గూర్చిన ప్రశ్న తలెత్తినప్పుడు సత్యమన్నది తనకు తాను ఎలా అభివ్యక్తమౌతుందో తెలుసుకొనే నిమిత్తం, విశ్వజనీనమైన దృష్టి, దైవికపరమైన అవగాహన కావాల్సి ఉంటుంది. మనుషుల్లో సామాన్యంగా ఒకరకమైన నిరాశావాదముంటుంది. అవి ఏవైనా గాని శుభకరంగా మొదలైనా, చెడ్డగానే ముగిసిపోతాయని అంటుంది. అది నిజానికి వాళ్ళలోని బలహీనత, కపటం, దంభం, దుష్టత, ఎప్పటికీ దానిదే పైచేయిలా కనిపిస్తుంది.

అందుకే వాళ్ళ వ్యక్తిగత కోణంలో ప్రపంచాన్ని చూచిన వాళ్ళంతా 'ప్రపంచం దుష్టమైనది, దీనిని అంతం చేసేయ్యాలి, ఎంత వీలైతే అంతగా దీని నుండి బయట పడాలి' అన్నారు. ప్రబోధకులంతా దీనిని బోధించారు. కాని వారి బోధ వారి మానవీయ వ్యక్తిగత కోణంలో వుండి వాళ్ళ దృష్టి చాలా

సంకుచితంగా ఉందనే నిరూపించింది. నిజానికి ప్రకృతి చలనాలు కెరటాల్లాంటివి. అవి ముందుకు సాగివస్తాయి. మళ్ళీ వెనుకకు పోతాయి, మళ్ళీ ముందుకు, మళ్ళీ వెనుకకు... సార్వజనీన జీవనంలో పార్థివ జీవనంలో చూడడానికి వెనుకంజ లాగా ఉన్నా, వికాసోన్ముఖమైన, ముందడుగు అది. ఈ వెనుకంజలు, ఉపసంహరణలు బయటకు కనిపించేవే. తాను వెనుకకు ఒక అడుగు తీసుకున్నాడంటే, ఇక ముందుకు దూకుతాడు. నీవు వెనుదీస్తున్నట్లు కనిపించినా అది మున్ముందుకు సాగిపోయే నిమిత్తమే.

*CWM 4:22-23*

## సత్యమా లేక అగాధమా!

(నూతన సంవత్సర సందేశాన్ని గూర్చి "మనుషులు, దేశాలు, ఖండాలు! ఇక్కడ ఎంపిక తప్పించుకోలేనిది. సత్యమా లేక అగాధమా?" ఒక సాధకుడు మీ సందేశంలో 'అగాధం' అన్న దాని అర్థమేమిటి? అని మదర్‌ని అడిగాడు. మదర్ దీనికి ఆంగ్లంలో జవాబిచ్చారు).

ఈ క్షణాన ఒక ఉద్రిక్తత నెలకొని ఉంది. వారంతా యుద్ధం మొదలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఒక అంధకాంక్షను ఈ ప్రజలు వాళ్ళ అంతర్జాతీయ సంబంధాల్లోకి తెస్తున్నారు. ఈ పరిస్థితి మూలంలో వున్నదంతా భయం, ఒక మామూలు అపనమ్మకం, వాళ్ళు నమ్మే స్వప్రయోజనాలు (డబ్బు, వ్యాపారం) ఈ మూడింటి కలయిక. ఎప్పుడైతే ఈ మూడూ మానవత్వంలోని అధమ కాంక్షల్ని తెరమీదకు వచ్చినప్పుడు, అప్పుడు దాన్నే నేను 'అగాధం' అని పిలిచాను.

ఒక వ్యక్తి దైవాన్వేషణకు తన జీవితాన్ని సమర్పించుకోవాలని నిశ్చయించుకొన్నప్పుడు అతడు గనుక నిజాయితీకలవాడైతే, అతని సంకల్పంలో చిత్తశుద్ధి ఉంటే, దానితో నిజాయితీగా పని చేస్తుంటే, ఇక ఖచ్చితంగా భయానికి ఆస్కారం ఉండదు. ఎందుకంటే అతనికి ఇప్పుడు జరుగుతున్నది లేదా జరుగబోయేది అతనిని సాక్షాత్కారానికి దగ్గర దారిలో నడిపించగలదు.

అది దైవానుగ్రహం నుండీ వచ్చే ప్రతిస్పందన. దివ్యానుగ్రహమంటే ప్రతిదాన్నీ నీ జీవితం కోసం మెత్తగా సుగమం చేసిపెడుతుందని ఈ లోకులు నమ్ముతారు. కాని ఇది నిజం కాదు.

దైవానుగ్రహం నీ ఆకాంక్షని సిద్ధింపజేసుకోవడానికి పనిచేస్తుంది. ప్రతీది

చాలా త్వరితమైన, సమగ్రమైన సమ్యక్ సిద్ధిని పొందేందుకు సమకూర్చ బడుతుంది. అక్కడ భయపడాల్సింది లేదు.

భయమన్నది నీలో నిజాయితీ లేమి వల్ల ఏర్పడుతంది. నీవు సౌకర్యవంత జీవితాన్ని, నీకు అనుకూలమైన పరిస్థితుల్ని కోరుకొన్న పక్షంలో నీవు ఇక నియమాలను, నిబంధనలను విధించుతావు. అప్పుడు భయపడడం మొదలుపెడతావు.

కాని సాధనలో భయానికి తావులేదు.

*CWM 15:180-181*

## పరివర్తనకు తీవ్ర వ్యతిరేకత

చాలా పెద్ద వ్యతిరేకత బాగా సచేతనంగా ఉన్న మనుషుల్లో మానసికమైన స్వీకరణా మృదుత్వం కొరవడిన కారణంగా ఎదురవుతుంది. మనస్సు దానికదిగా (శ్రీఅరవిందులు వ్రాసినట్లు) దానిదైన అజ్ఞాన పూరిత వైఖరిలోనే అన్నీ కొనసాగాలని కోరుకోవడం కారణంగా ఎదురవుతుంది. నిజానికి మనం జడం అని చెప్పుకొనే పదార్థం చాలా సున్నితంగా, తేలిగ్గా ప్రతిస్పందిస్తుంది. చాలా బాగా...! అది అసలు వ్యతిరేకించదు. ఉదాహరణకు మొక్కల్లో లేదా జంతువుల్లోనే, మనుషుల్లో కంటే వేగవంతమైన ప్రతిస్పందన కనిపిస్తుంది. ఒక వ్యవస్థీకృతమైన మనస్సుపై పనిచేయడం చాలా కష్టం. ఒక ప్రణాళిక బద్ధమైన, నిర్వహణ పూరితమైన మానసిక చేతనతో జీవించే మనుషులు రాయికి మల్లె గట్టిగా ఉంటారు. ఇదే వ్యతిరేకిస్తుంది. నా అనుభవం ప్రకారం ఏది అచేతనమైనదో అది ఖచ్చితంగా, తేలిగ్గా అనుసరించగల్గుతూ ఉంది. కుళాయి, నుండీ నీళ్ళు వదలటం, సీసాల్లో శుభ్రపరిచే ద్రవం, గాజు, స్పాంజ్ ఇలా వీటిని తిలకిస్తున్నప్పుడు సంతోషం కల్గుతుంది. ఒక స్వీకృతి తెలియజేస్తూ ఒక ఉల్లాసవంతమైన పవనంతో నిండి ఉన్నాయవి. అక్కడ అహంకారమన్నది చాలా స్వల్పం. నీవు చూడు, అది ఒక సచేతనమైన అహంకారం కాదు.

అహంకారమన్నది జీవి ఎదిగే కొద్దీ మరీ సచేతనంగా, వ్యతిరేకంగా బలపడుతూపోతుంది. తొలిదశలో, చాలా సరళ స్వభావ జీవులు, పసిపిల్లలు ముందు త్వరగా దేనికైనా స్పందిస్తారు. ఎందుకంటే వాళ్ళలో క్రమబద్ధంగా, వ్యవస్థీకృతమైన అహంకారం ఉండదు. కాని ఈ పెద్దవాళ్ళు ఎవరెవరు వాళ్ళపైన వాళ్ళు పనిచేశారో వాళ్ళపైనే వాళ్ళు ఆధిక్యత సంపాదించారో,

ఎవరు వ్యవస్థీకరించుకొన్నారో, ఎవరు ఉక్కుతో తయారైన అహంకారంతో ఉన్నారో, వాళ్ళందరికీ ఇది చాలా కష్టం.

దీనంతటికీ అతీతంగా పోయి, తమ అహంకారాన్ని సమర్పణ చేసుకోగల పర్యాప్త జ్ఞానంతో ఉంటే తప్ప ఇది సాధ్యం కాదు. ఈ వ్యక్తి విషయంలోనే సాక్షాత్కారం చాలా సహజంగా, గొప్పగా సంభవిస్తుంది. దాన్ని సాధించగల్గడం చాలా కష్టమే. కాని ఫలితం చాలా దూరంలో ఉన్నా, అది సంపూర్ణమైనది.

*శ్రీమాత శిష్యునితో సంభాషణ, జూన్ 6, 1958.*

## అంతిమ తీర్పు

దాని చర్య అంతిమ తీర్పులో వివరించిన దానిని పోలి వుంది, అది అదృశ్యమవ్వడానికి నియమించబడి అసత్య ప్రపంచానికి చెందినదానికి, అదే అజ్ఞాన, జడ ప్రపంచానికి చెందినా రూపాంతరం చెందగల ప్రపంచానికి మధ్యన మనం భేదమెంచేట్లుగా చేసే దాని పూర్తి సంకేతాత్మక ప్రకటన. ఒకటి ఒక వైపుకు, ఇంకొకటి ఇంకోవైపుకు సాగుతుంది. ఈ నూతన పదార్థంతో రూపాంతరం చెందగల మొత్తం ఇంకా ఎక్కువగా వ్యాపిస్తుంది, ఈ నూతన చైతన్యం ఈ రెండింటికి మధ్యన ఒక బంధం లాగ పనిచేసే వరకు పెరుగుతుంది, కానీ సరిదిద్దడానికి వీలు కానంతగా వున్నది, అసత్యానికి, అజ్ఞానానికి చెందిన మొత్తం అదృశ్యమవుతుంది. ఇది గీతలో కూడ బోధించబడింది. మనం ప్రతికూలమైనదని, అదివ్యశక్తులని పిలిచేదంతా, రూపాంతరం చెందగలిగినదంతా ఉద్ధరించబడుతుంది, నూతన చైతన్యం వైపు సాగుతుంది, మారకుండా అంధకారంలో వున్నదంతా, లేదా చెడుసంకల్పానికి చెందినదంతా నశిస్తుంది, విశ్వం నుండి అదృశ్యమవుతుంది. ఈ శక్తులకు ఉత్సాహంగా ప్రతిస్పందించిన మానవజాతి మొత్తం భాగం తప్పనిసరిగా వాటితో పాటుగా అదృశ్యమవుతుంది. అంతిమ తీర్పులో వెల్లడిచేయబడిన భావన ఇదే.

*

(**1958**, మార్చి **19**న ప్రచురితమైన ఈ సంభాషణ తర్వాత దీనిని కొనసాగించే సంభాషణ పై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపించే అంతిమతీర్పు గురించిన నిర్దిష్ట వ్యాఖ్యలను ఆశ్రమ బులెటిన్' లో మదర్ జోడించారు, అదే అంశంపై **1958**, ఫిబ్రవరిలో ఒక మొత్తం పేరాను చేర్చడం జరిగింది.)

ఒక విషయం స్పష్టం : మానవజాతి అటువంటి ఒక సాధారణ ఉద్రిక్త స్థితికి చేరింది- ప్రయత్నంలో ఉద్రిక్తత, చర్యలో ఉద్రిక్తత, నిత్యజీవితంలో కూడ ఉద్రిక్తతే- అటువంటి ఎక్కువైన ఒక అత్యుత్సాహంతో, అటువంటి మొత్తం అవిశ్రాంతతత ఒక దశకు జాతి చేరిందన్నది చూపుతుంది, ఇక్కడ ప్రతిఘటనతో లేదా ముందుకు దూకడంతో జాతి ఒక నూతన చైతన్యానికి నిర్గమించాలి, లేదంటే వెనక్కు మళ్లి అస్పష్టత, జడత్వానికి చెందిన ఒక అగాధంలో మునిగిపోవాలి.

ఈ ఉద్రిక్తత ఏదో కొంత తప్పనిసరిగా విచ్ఛేదమయ్యేంత మొత్తంగా, సర్వ సాధారణంగా వుంటుంది, ఇది అలాగే కొనసాగదు. ఇదంతా ఒక నూతన శక్తి సిద్ధాంతం, చైతన్యం, శక్తి పదార్థంలో నింపబడ్డాయనడానికి ఒక ఖచ్చితమైన సంకేతం, దీని మూల ఒత్తిడి చేతనే ఈ కుశాగ్రస్థితి ఉత్పాదనమయ్యింది. దీనిని బాహ్యంలో ఒక ఉగ్ర పరిణామాన్ని తీసుకురావాలనే ప్రకృతి చేత ఉపయోగించబడిన పాత అలవాటైన సాధనాలని అనుకోవచ్చు, కానీ ఇక్కడ ఒక నూతన దృగ్గోచర విషయం వున్నది, ఇది అక్కడక్కడా విస్తరించుకుని వున్న కొద్దిమందికి మాత్రమే స్పష్టంగా కనిపిస్తుంది, ఈ దృగ్గోచర విషయం ప్రపంచంలోని ఒక అంశంలో లేదా ఒక స్థలంలో స్థానికం చేయబడి వుండదు, ఎందుకంటే సంకేతాలు భూమి మొత్తంపైన వున్న ప్రతి దేశంలో కనిపిస్తాయి : ఒక నూతనమైన, ఉన్నత, ఆరోహించే పరిష్కారాన్ని, కనుక్కోవాలనే సంకల్పము, ఒక విశాలత్వం లోకి, ఇంకా ఎక్కువ పరిపూర్ణత లోకి వృద్ధి చెందాలనే ఒక ప్రయత్నము వుంటాయి.

అటువంటి మరింత సాధారణంగా, ఎక్కువ విశాలంగా, ఎక్కువ సామూహిక స్వభావంతో వున్న భావాలు నెరవేరుతున్నాయి, ప్రపంచంలో నెరవేరే పనిలో వున్నాయి. రెండూ కలిసి ముందుకు సాగుతాయి. వినాశనానికి ఇంకా సంపూర్ణ సంభావ్యత, వినాశపు సంభావ్యతను నిరోధం లేకుండా ఎక్కువ చేసే అన్వేషణాత్మకత, ఇంతకు మునుపు ఉన్నదానికన్నా ఇంకా ఎక్కువ పరిమాణంలో వుండే ఒక వినాశనం : అదే సమయంలో ఇంకా ఎక్కువ ఉన్నత, విశాల, భావాలకు, సంకల్పాలకు చెందిన జన్మ, లేక అభివ్యక్తత వున్నపుడు అది మునుపుకన్నా ఒక విస్తారమైన, ఇంకా ఎక్కువ విశాలము, మొత్తము, పరిపూర్ణము అయిన పరిష్కారాన్ని తీసుకువస్తుంది.

ఒక ఆరోహించే పరిణామానికి చెందిన నిర్మాణాత్మకమైన, వృద్ధిచెందే

పరిపూర్ణ దివ్య శక్తులకు,ఇంకా ఇంకా ఎక్కువ శక్తివంతమైన వినాశనం చేస్తూ, నియంత్రించలేనంత ఉన్మాదంతో వున్న శక్తులకు మధ్యన ఈ సంఘర్షణ, ఈ యుద్ధము తప్పనిసరిగా, తప్పులేకుండా ఉన్నట్లుగా కనిపిస్తుంది, ఇది తన గమ్యానికి ముందు చేరాలనే జాతికి చెందిన పోటీ, యుద్ధం. సమస్త ప్రతికూల, అదివ్యశక్తులు, ప్రాణప్రపంచానికి చెందిన ఈ శక్తులు భూమి మీదకు దిగివచ్చి, భూమిని తమ చర్యకు క్షేత్రంగా ఉపయోగించుకుంటున్నట్లుగా కనిపిస్తున్నది. అదే సమయంలో ఒక నూతనమైన ఉన్నత శక్తివంతమైన ఆధ్యాత్మిక శక్తి కూడ భూమికి ఒక నూతన జీవితాన్ని ఇవ్వడానికి భూమిమీదకు దిగి వచ్చింది. ఇది యుద్ధాన్ని ఇంకా తీవ్రం చేసింది. ఉగ్రత, ఇంకా స్పష్టంగా నిర్దిష్టంగా కనిపిస్తూంది, కనుకనే మనం ఒక శీఘ్రపరిష్కారాన్ని ఆశించాలి.

*

## అనుగ్రహంతో ముక్తి

అతిమనసుతో ఏకతను పొంది, తనను తాను విముక్తి చెందించుకోగల మానవచైతన్యానికి చెందిన మానవజాతి పూర్తిగా రూపాంతరం చెందుతుంది. బాహ్యరూపంలో ఇంకా ప్రకటితం కాని తన భవిష్య యథార్థం వైపుగా అది కదులుతోంది. సరళమైన జంతువుకు, ప్రకృతికి దగ్గరగా వున్న భాగము ప్రకృతి చేత తిరిగి హరించి వేయబడి, పూర్తిగా జీర్ణితమౌతుంది. కానీ ఈ వక్రతకు మనసును తప్పుగా ఉపయోగించిన, కలుషితమైన మానవచైతన్య భాగం నిషేధించబడుతుంది.

అటువంటి జాతి సఫలం కాని ఒక ప్రయత్నానికి చెందినదిగా, ప్రపంచ చరిత్రలో కాలక్రమంలో అదృశ్యమైన అనేక ఇతర నిష్ఫల జాతుల్లా తొలగించబడుతుంది.

గతంలో కొద్దిమంది ప్రవక్తలకు ఇటువంటి అలౌకిక దర్శనం వుండేది, కానీ సర్వసాధారణంగా విషయాలు మిశ్రమమయ్యి, వారి అలౌకిక దర్శనంతో పాటు సమ్మతించే మానవజాతి భాగాన్ని ఉద్ధరించి, ఈ భౌతిక ప్రపంచాన్ని రూపాంతరం చెందించే అతిమానసప్రపంచ దర్శనం వారికి లేదు. వక్రత చెందిన మానవచైతన్యపు భాగంలో జన్మించిన వారికి, భరోసానివ్వడానికి విశ్వాసం ద్వారా పొందే ముక్తి బోధించబడింది : పదార్థంలో దైవం చేసిన

త్యాగం మీద విశ్వాసమున్న వారు అర్థం కాకున్నా, మేధ లేకున్నా కేవలం విశ్వాసంతోనే అప్రయత్నంగానే వేరే ప్రపంచంలో రక్షించబడతారు. వారు అతిమానస ప్రపంచాన్ని ఎప్పటికీ చూసివుండరు, పదార్థంలో దైవం యొక్క పూర్తి ప్రకటనకు దారితీసే ముకుళనాన్ని, పదార్థంలోకి దిగివచ్చిన దైవం త్యాగాన్ని చూసివుండరు.

## అంతం కాదిది ఆరంభం

మనం చేసేది ఏదైనా మనం విజయవంతమైనపుడు అది ఒక ఆరంభమవుతుంది తప్ప ముగింపు కాదు. ఇది పృథ్విపైన ఒక నూతన చైతన్యానికి పునాది-అభివ్యక్తానికి చెందిన అనంత సంభావ్యతలతో వున్న ఒక చైతన్యం. అభివ్యక్తంలో శాశ్వత పురోభివృద్ధి వుంది, దానికి అతీతంగా పురోభివృద్ధి లేదు.

ఒకవేళ భౌతిక ఆచ్ఛాదన నుండి అంతరాత్మ విముక్తి లక్ష్యమైతే, అప్పుడు అతిమానసీకరణ అవసరం లేదు. ఆధ్యాత్మిక ముక్తి, నిర్వాణము సరిపోతాయి. అతి భౌతిక తలాలకు పెరగటం లక్ష్యమైనా కూడా అతిమానసీకరణ అవసరముండదు. వ్యక్తి కొంత స్వర్గంలోకి దాని ప్రభువును ఆరాధించడం ద్వారా ప్రవేశించవచ్చు. కానీ అది పురోభివృద్ధి కాదు. ఇతర ప్రపంచాలు విలక్షణ ప్రపంచాలు, ప్రతిది దాని స్వంత రకానికి, ధర్మానికి చెందినదిగా వుంటుంది. పరిణామము భూమిమీద జరుగుతుంది కాబట్టి భూమి పురోభివృద్ధికి సరైన క్షేత్రం. ఇతర ప్రపంచాలలోని జీవులు ఒక ప్రపంచం నుండి ఇంకో ప్రపంచానికి పురోగమించరు. వారు తమ స్వంత రకానికి స్థిరపడి వుంటారు. పూర్తి మత వేదాంతి అంతా బ్రహ్మమే, జీవితం ఒక స్వప్నం, ఒక అవాస్తవం, కేవలం బ్రహ్మం మాత్రమే ఉనికిలో వుంటాడు అంటాడు. వ్యక్తి ముక్తి గానీ, నిర్వాణాన్ని గానీ పొందినపుడు అతని శరీరం పడిపోయేంతవరకే జీవిస్తాడు- ఆ తర్వాత అతనికి జీవితం వుండదు.

వీళ్లు రూపాంతరాన్ని విశ్వసించరు, ఎందుకంటే వీరికి మనసు, జీవితము, శరీరము ఒక అజ్ఞానం, ఒక భ్రాంతి- రూపం లేని, అనుబంధం లేని ఆత్మ లేదా బ్రహ్మం మాత్రమే సత్యం. జీవితం అనుబంధాల ఒక అంశం: స్వచ్ఛమైన ఆత్మలో సమస్త జీవితము, అనుబంధాలు మాయమవుతాయి. ఒక భ్రమగా (రూపాంతరం చెందిన) తప్ప ఇతరమేదీ కానీ ఒక భ్రమను రూపాంతరం

చెందించే సంభావ్యత గానీ, ప్రయోజనం గానీ ఏముంది? వారికి ' నిర్వాణ జీవితమనేది' వుండదు.

అజ్ఞానాన్ని జ్ఞానంలోకి రూపాంతరీకరించడమనే విధానాన్ని ఒక లక్ష్యంగా చేసుకునేది కొన్ని యోగాలలో మాత్రమే ఉంటుంది, భావన వేరుగా వుండచ్చు- కొన్నిసార్లు ఒక దివ్యజ్ఞానం లోకి, ఒక శక్తి లేదా ఒక దివ్య స్వచ్ఛత, లేదా ఒక నైతిక పరిపూర్ణత, లేదంటే ఒక దివ్యప్రేమలోకి కావచ్చు.

## అతి మనసు, పర్యవసానాలు

అతిమానసం దిగివచ్చినపుడు పర్యవసానాలు వుండవలసిన అవసరం లేదు. గొప్ప మార్పులు ఆవశ్యకంగా వుంటాయి కానీ అవి పర్యావాసానానికి బద్ధమై వుండవు. పరిణామం కోసం అధిమానస శక్తుల నుండి ఒక బలమైన ఒత్తిడి వున్నపుడు, శక్తుల ప్రతిఘటన, ఘర్షణల వల్ల అక్కడ పర్యవసానాలు ఉంటాయి. అతిమానసం తన పూర్ణతలో విషయాలపై ఒక గొప్పదైన పూర్తి ఆధిపత్యంతో, నాటకీయ ఘర్షణ, ఉగ్రతలు కాని ఇతర సాధనాల చేత వచ్చే ప్రతిఘటనను అధిగమించగల సమత్వ శక్తిని కలిగివుంటుంది. సకల విషయాలు మూడు విశ్వశక్తుల ఆధీనంలో వుంటాయి- సృష్టి, స్థితి, లయం. సృష్టించబడినది కొంతకాలం నిలుస్తుంది, తర్వాత క్రిందకు రాలిపోవడం మొదలవుతుంది. వినాశక శక్తిని తీసివేయడమనేది నశింపు లేకుండా నిలిచి వుంటూ ఎప్పటికీ అభివృద్ధి చెందే ఒక సృష్టిని సూచిస్తుంది. అజ్ఞానం నుండి పురోభివృద్ధి చెందాలంటే వినాశనం అవసరం. జ్ఞానంలో, సత్య సృష్టిలో ఎటువంటి ప్రళయము లేని స్థిరమైన ఒక వికసనం ధర్మంగా వుంటుంది.

*

ఒక సాధారణ అవరోహణలో మనుష్యులు భౌతిక మనసు నుండి బయటపడరు. ఎవరైనా భౌతిక మనసులో నిలిచిపోవాలని ఎంపిక చేసుకుంటే లక్షలాది అవరోహణలు క్రిందకు దిగి వచ్చినా అతనికి తేడా వుండదు.

*

భూమిమీదకు దిగివచ్చే అతిమనసు అహంకారానికి అంటిపెట్టుకుని వుండే మనిషిలో ఏ మార్పు తీసుకురాదు.

# అఖిల

అఖిల భారత పత్రిక

జూన్ 2024

## నూతన సృష్టి



# విషయ సూచిక






## సంపాదకీయం

జల ప్రళయం తరువాత నూతన జీవనం తిరిగి పొటమరిస్తుంది. వేసవిలో పండుటాకులను రాల్చిన తరువాత, వసంత వికాసం మన కోసం ఎదురు చూస్తూంటుంది. విధ్వంసం నూతన సృష్టిని సన్నద్ధం చేస్తుంది. ప్రస్తుత సంచికలోని విషయం ఇది.

*అనువాదం : కె.వి. రావు*



ఓ ఆనందం, ఓ వెలుగు, ఓ శక్తి, ఓ శ్వేతాగ్ని ప్రేమ
ఏకైక అపరిమేయ ఆలింగనంలో సమస్తాన్ని బంధించాయి
ఏకైకతా యెడదపై సృష్టి తన సత్యాన్ని కనుగొనె
ప్రతిదీ సమసమస్తపు ఆత్మగా, స్థలంగా తయారయ్యె

గొప్ప ప్రపంచ స్పందనలు ఒకే అంతరాత్మ హృదయ స్పందనలు
సంవేదించుటన భగవంతుని ఒక జ్వాలావిష్కరణయే
బహు తంత్రుల ఏకైక వీణియ సమస్త మనము
సమస్త జీవనం, సమావేశమగు బహు జీవితాల ఒకే గానం
ఏలన లోకాలనేకం, కాని ఈ ఆత్మ ఒక్కటే

ఈ జ్ఞానమిప్పుడు జగత్తు బీజముగ తయారుకాబడె
ఈ బీజం దివ్యవెలుగు రక్షణలో నిక్షిప్తమయ్యె
ఒక అజ్ఞాన కోశము దానికవసరము లేదు

బ్రహ్మాండమైన పట్టు సమాధి నుండి
ఆ ఏకైక హృదయ స్పందనల నుండి
నగ్న ఆధ్యాత్మ విజయమ్ము నుండి
ఒక నూతన అద్భుత సృష్టి పైకి లేచె.

*సావిత్రి 322-23*

# అతిమానసిక దివ్య క్రియాశక్తి చేయాలి

## వాతావరణ లక్షణం

వాతావరణ అసలు లక్ష్యమే మారిపోయింది. పర్యవసానాలు, అనంతంగా వైవిధ్యంగా ఉంటాయి, తప్పదు, కాని గ్రహింపుకొస్తాయి. అంటే, సాధారణ చలనాల పర్యవసానాలకు, అతిమానసిక చర్య పర్యవసానాలకు మధ్య భేదాన్ని తెలుసుకోవడం సాధ్యమౌతుంది. ఎందుకనంటే అతిమానసిక పర్యవసానాలకు ఒక ప్రత్యేక స్వభావం, ఒక ప్రత్యేక శీలం ఉంటాయి.

ఎవరైనా సరే, ఏ క్షణంలోనైనా, ఏ విధంగానైనా, ఒక అతిమానసిక ప్రతిభావంతుడవుతాడని దానర్థం కాదు, దాన్నాశించగూడదు.

*

అదివరకసలవి లేనే లేవు అనే అర్థంలో 'క్రొత్తవి' అని అనడం లేదు, కాని అవి విశ్వంలో అభివ్యక్తం కాలేదు అనే అర్థంలో అవి క్రొత్తవి. అదివరకే అవి అచట అంతర్వలనమై లేకపోయి వుంటే అవి అసలెన్నటికీ రానేరావు! అది స్పష్టం, అనంత కాలం నుండి పరాత్పరునిలో అదివరకే ఉండి ఉండనిదేదీ మనలేదు. కాని అభివ్యక్తిలో అది క్రొత్తది. పంచ భూతాలలో అది క్రొత్తది కాదు, కాని అది క్రొత్తగా అభివ్యక్తమైంది. అది అనభివ్యక్తమై ఉన్నదాని నుండి క్రొత్తగా వచ్చింది. క్రొత్తది, అంటే అర్థం ఏమిటి? దానికర్థం లేదు, ఒక 'క్రొత్తది'! అభివ్యక్తి (దృగ్గోచర సృష్టిలో - అను)లో మనకది క్రొత్తది. అంతే"

*CWM 8:178,314*

## ప్రకృతి ధర్మాల మార్పు

నేనింతకు ముందు చెప్పిన దానికి ఒక వాడుక మాటను బహుశా కలుపుతాను. అది కేవలం ఒక వివరణను చిత్రీకరించడం మాత్రమే. మరీ ముఖ్యంగా ఆరోగ్యం దృక్పథం నుండి, ప్రకృతి ధర్మాలని పిలువబడేవి, కారణాలు, ఫలితాలు పదార్థ క్షేత్రంలో 'అనివార్య' పర్యవసానాలు గురించి కొంతకాలం క్రితం అడిగిన ప్రశ్నలకు పరోక్ష సమాధానం అవుతుందది. ఉదా : కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకొనకపోతే, తినగలిగినంత తినకపోతే, కొన్ని నియమాలను పాటించకపోతే, తప్పని సరిగా కొన్ని పర్యవసానాలు

ఉంటాయి. అది యథార్థం. ఏ రెండు విశ్వజనీన మిశ్రమాలు ఒకే విధంగా ఉండవు అని నేనిప్పుడే చెప్పిన దాని వెలుగులో దీనిని చూచినట్లయితే, ధర్మాలు ఎలా ప్రతిష్ఠించబడ్డాయి, ఈ ధర్మాల పరిపూర్ణ సత్యమేది? అది వుండదు.

ఎందుకనంటే, కొంచెం ఉన్నతమైన తర్కంతో, నీవు తార్కికుడవైతే రెండు వస్తువులు, రెండు మిశ్రమాలు, రెండు విశ్వజనీన అభివ్యక్తులు, ఎప్పటికీ ఒకటిగా ఉన్నప్పుడు, ఎలా ఏదైనా తనను తాను పునరావృతం చేసుకొంటుంది? పైకి మాత్రమే అలా కన్పించవచ్చు, కాని అది వాస్తవం గాదు. ఈ విధంగా కఠిన ధర్మాలను స్థిరీకరిస్తే - పైకి కన్పించే ఉపరితల ధర్మాలనుండి నిన్ను నీవు పూర్తిగా ఎడంగా ఉండి పొమ్మని గాదు, ఎందుకనంటే మనస్సు అనేక ధర్మాలను సూత్రీకరిస్తుంది, ఉపరితలం చాలా విధేయంగా, ఈ ధర్మాలకనుగుణంగా నడుచుకొంటుంది, కాని అది పైకి కన్పించడం మాత్రమే - కాని ఏదెలా వున్నా ఆధ్యాత్మ సృజన శక్తి నుండి నిన్ను దూరం చేస్తుంది. దైవకృపకు సంబంధించిన యథార్థత నుండి నిన్ను దూరం చేస్తుంది. ఎందుకనంటే, నీ ఆకాంక్షతో లేక నీ వైఖరితో నీవొక ఉన్నత అంశాన్ని ఒక నూతన అంశాన్ని - ఇప్పుడు ఒక అతిమానస అంశం అనబడేదాన్ని - ప్రస్తుతమున్న మిశ్రమాలలో ప్రవేశపెడ్తావు. అప్పుడు వాటి స్వభావాన్ని అకస్మాత్తుగా మార్చుతావు. ఆవశ్యకమూ, తప్పించుకోలేనివీ ధర్మాలని చెప్పబడేవన్నీ అసంగతాలుగా తయారవుతాయి. అంటే, నీకు నువ్వే, నీ అవగాహనతో, నీ వైఖరితో, కొన్ని గట్టిగా చెప్పబడిన సూత్రాలనంగీకరిచడంతో మహిమ, సాధ్యంకాబోయే మహిమ జరుగకుండా తలుపులు మూసివేస్తావు. అవెలా సంభవిస్తాయో తెలుసుకొన్నప్పుడు అవి మహిమలు కావు, కాని బాహ్య చేతనకు, అవి మహిమలుగా కన్పిస్తాయి. చాలా సహేతుకంగా కన్పించే తర్కంతో, నీకు నువ్వే 'మంచిది, నేను దీనిని చేస్తాను, అది అవశ్యం సంభవిస్తుంది, లేక నేను దానిని చేయనపుడు అవశ్యం ఈ మరోరకంగా జరుగుతుంది' అని చెప్పుకొంటావు. ద్వారం మూసేసేది నీ అంతట నీవే. నీకు, దైవ కృపకు సంబంధించిన స్వతంత్ర చర్యకు మధ్య ఒక ఇనుప తెరను నీవు పెట్టినట్లవుతుంది.

*CWM 8:315-16*

యోగి, ఋషి, ద్రష్ట, కర్మ ప్రేరిత మనిషి, సృష్టికర్త - ఇవి అతని అస్తిత్వ శిఖరాలు, ఆతని కావల అతి మానస జీవి వున్నాడు. ఆధ్యాత్మిక మానవతాతీడున్నాడు.

*CWSA 12:231* — *శ్రీ అరవిందులు*

## మానవాతీతుని అవతరణ

ఒక నూతన సృష్టి కోసం, మానవాతీతుని సృష్టి కోసం, మనుషులను సన్నద్ధం చేయడం కోసం భువిపై ఒక నూతన చేతన ఈ సంవత్సరం ప్రారంభం నుండి పనిచేస్తున్నది. ఈ సృష్టి సాధ్యంగావడానికి, మనిషి దేహంగా అయిన ద్రవ్యం, ఒక పెనుమార్పుకు లోనుగావలసి ఉంది. చేతనను మరింత అధికంగా స్వీకరించేదిగా, దాని కార్యవిధానం క్రింద మరింత సవ్యంగా తయారవ్వాలి.

దైహిక విద్యద్వారా సముపార్జించుకొనవలసిన లక్షణాలు సరిగ్గా యివే.

అటువంటి ఫలితాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ క్రమశిక్షణను మనం అనుసరించితే, అత్యంత ఆసక్తికర ఫలితాన్ని పొందడం ఖాయం.

అందరి పురోగతికీ, ఘన సాధనకూ, సర్వులకూ నా ఆశీస్సులు.

*ఏప్రిల్ 1, 1969* — *CWM 12:278*

## పరిణామ ధర్మంలో మార్పులు

భువి స్వభావంలో అతి మనస్సు జోక్యం వల్ల ఒక ఫలితమేమంటే, పరమోన్నత సృజనాత్మక సత్య శక్తి అవతరణ. పరిణామ ధర్మంలో అదొక మార్పు, దాని పద్ధతి, దాని యేర్పాటు, జ్ఞానం ద్వారా పరిణామ సూత్రపు ఒక పెద్ద అంశం పదార్థ విశ్వపు క్రియా శక్తులలోనికి ప్రవేశించవచ్చు. ఒక ప్రప్రథమ ఆరంభం నుండీ, నూతన సృష్టిలో తనను తాను విస్తరింపజేసుకొని, ఇప్పుడు అజ్ఞానంలో జరుగుతున్న పరిణామం మొత్తం క్రమంలో, అభివ్యక్తమౌతుండే ఫలితాలను పుట్టించవచ్చు. దాని అత్యున్నత జ్ఞాన సాధనలో సైతం, ఒక అల్పతర అజ్ఞానంగా పరిగణించబడే దానివైపు సాగే నిశ్చేతనకు సంబంధించిన సంపూర్ణ చేతనా వ్యతిరేక స్థితి నుండి అది నిజంగా ఆరంభమౌతుంది. జ్ఞానాన్ని సరాసరి, సంపూర్ణంగా స్వాధీనం చేసుకొనడం గాక, దానికి ప్రాతినిధ్యం వహించడమే గనుక అలా జరుగుతుంది. ఉన్నతతర

జ్ఞాన, శక్తులను, సాధనోపాయాలను నిండుగా అభివృద్ధిచేయ మనిషి మొదలుపెడ్తే, అభివృద్ధి చెందుతున్న జంతువు తన మనస్తత్వ తలుపులను సచేతన చింతన, ప్రాథమిక హేతుబుద్ధి ఆరంభ దశలకు తెరచితే - అతని అత్యున్నత స్థితి యందు నేడు సైతం, తిరిగి ప్రాథమిక స్థాయికి పతనం కాని స్థితికి చాలా దూరంగానే ఉన్నాడు. మొక్క తన ప్రథమ అధోచేతన ప్రతిచర్యలను అభివృద్ధి పరచుకొని, ఒక విధమైన ప్రాథమిక నాడీ సున్నితత్వాల సంస్పర్శను పొందితే, అధ్యాత్మ అంధరూపమైన పదార్థం, దానిలో దాగి వున్న శక్తితో మరింత సజీవమైతే, వస్తువుల రహస్య అర్థాన్ని మరింత చురుకుగా అది దాచి ఉంచిన గుహ్య సత్యతలను ఉదా : దాని మూగనిశ్చేతనలో సైతం, అది సదా గతాన్ని నిక్షిప్తం చేసి ఉంచుతుంది లేక, నూతన మానవ మేధస్సుకు సంబంధించిన ఒక సూక్ష్మతర సాధారణీకరించబడిన అవగాహనకు, దాని అంతర్వలమైవున్న క్రియాశక్తులు, అదృశ్య చలనాల, కార్యవిధానాల తెరమరుగైన శక్తులను బహిర్గతం చేయడం, భవిష్యత్తులో మహనీయమైన మార్పులకు వాగ్దానమిస్తున్న అపరిమేయ మార్పు అవుతుంది. కాని దానర్థం అది ఒక ఉద్ధరణ మాత్రమే గాని, విశ్వజనీన క్రమపద్ధతికి భంగం కలిగించేది అవ్వదు. పరిణామం తనంతటతనే పరిణమిస్తుంది, కాని అది చిందరవందర గావించబడదు లేక కుంటుపడదు.

*CWM 13:570-71*

## ఒక నూతన బ్రహ్మాండమైన శక్తి

యథార్థంగా ప్రపంచంలో దివ్య శక్తి ఉంది, అదొక నూతన బ్రహ్మాండమైన దివ్యశక్తి. ప్రపంచంలోనికి దివ్య సర్వశక్తివంతత్వమును అభివ్యక్తం చేయడానికి, చెప్పాలంటే 'అభివ్యక్తమయ్యే దానిగా' చేయడానికి అది వచ్చింది.

నిశిత పరిశీలన, సావధానత ద్వారా నేనీ నిర్ణయానికొచ్చాను. మనం 'అతిమానసికం అనే దానిని నేను దర్శించాను. అంతకంటె మంచి మాట లేనందున, ఆ పదం వాడాను. అది మనం 'దైవం' అని పిలిచే ఉన్నత శక్తికి సృష్టిని మరింత అణుకువగా అసలు తయారుచేస్తూ వచ్చింది. ఎందుచేతనంటే మనం (మనం ఏమైవున్నామో దానితో పోలిస్తే అది దైవం. కాని...) అదేదో (ఒత్తిడిని, అవతరణను సూచించే సంజ్ఞ) పదార్థాన్ని మరింతగా స్వీకరించగలదిగా... దివ్య క్రియాశక్తికి బదులు పలికేదిగా చేస్తుంది. ఎలా

దానిని వివరించగలను? ప్రస్తుతం, మనకు అదృశ్యం లేక గ్రహిచనలవిగానిదిగా కన్పించేదంతా అసత్యం మనకు (నా అర్థం సామాన్య మానవజీవి అని) కొన్ని 'ఘనిష్టాలు' కొన్ని కావు అని మనం అంటాం. కాని పదార్థం కాని ఈ దివ్యశక్తి ఈ మహాబలం భూ సంబంధ పదార్థ వస్తువులకన్నా భువిపై మరింత ఘనిష్టంగా తయారవుతోంది. అదీ విషయం.

ఆ విధంగా అతిమానసిక జీవులు, తమను తాము రక్షించుకొంటారు, కాపాడుకొంటారు. చూడ్డానికది పదార్థం కాదు, కాని పదార్థంపై దాని ప్రభావం, పదార్థ వస్తువుల కంటె చాలా హెచ్చుగా ఉంటుంది. రోజు, రోజూ, గంట గంటకూ ఇది యథార్థతరం అవుతోంది. మనం 'దైవం' అని పిలువబడే దానితో నడుపబడినపుడు ఈ అనుభూతికి శక్తి ఉంటుంది. నిజమైన శక్తి ఉంటుంది - పదార్థాన్ని కదిలించే శక్తి, అర్థమైందా, అది పదార్థ సంబంధ దుస్సంఘటనకు కారణం కాగలదు. లేదా పూర్తిగా భౌతిక దుస్సంఘటన నుండి కాపాడగలదు. పూర్తిగా భౌతిక ఘటన పర్యవసానాలను రద్దుచేయగలదు - అది పదార్థం కంటె దృఢమైనది. ఇది సంపూర్ణంగానూ తన, అవగాహనకందని వాస్తవం. కాని అది (గాలిలో రెక్కలు రెపరెపలాడించు సంజ్ఞ) సాధారణ మానవ చేతనలో ఒక విధమైన హడలు పుట్టిస్తుంది.

అదీ సంగతి. అదిగా కన్పిస్తోంది... అదివరకున్నట్లుగా విషయాలికెంత మాత్రం వుండవు. క్రొత్తదేదో వుంది. అదివరకు ఉన్నట్లుగా విషయాలికెంతమాత్రం వుండవు.

మన లౌకిక జ్ఞానం, మన మానవతర్కం, మన ఇంగిత జ్ఞానం కుప్పకూలి పోతాయి. అంతమౌతాయి. ఇకనెంతమాత్రం క్రియాశీలకంగా ఉండవు. ఇకనెంతమాత్రం వాస్తవికత లేనివవుతాయి. ఏ మాత్రం సుసంగతమైనవవ్వవు.

నిజంగా ఒక నూతన ప్రపంచం

*ది మదర్: ఒక శిష్యునితో సంభాషణలు మే 6,1972*

## ఒక నూతన ప్రపంచం పుట్టింది

ఈ నూతన ప్రపంచం జన్మించినదని నేనిదివరకే మీ అందరకు ప్రకటించాను. నిజం చెప్పాలంటే అనేకమందికి భేదం బాగా గ్రహింపునకు రానివిధంగా పాత ప్రపంచం దానిని ఆవరించి వేసింది. అయినప్పటికీ నూతన

క్రియాశక్తుల చర్య చాలా క్రమ విధానంలో చాలా పట్టువిడువకుండా, చాలా స్థిరంగా, కొంతవరకు చాలా ప్రభావవంతంగా కొనసాగుతున్నది. ఈ చర్య అభివ్యక్తులలో ఒకటి నిన్నటి సాయంత్రం నా అనుభవం. యథార్థంగా చాలా క్రొత్తది. దాదాపు, నిత్యానుభవాలలో, దానినంతా మెట్టుమెట్టుగా యిచ్చిన దాని ఫలితం. దానిని సంక్షిప్తంగా, మెలికలు లేకుండా తిన్ననైన రీతిని తెలియజేయవచ్చు.

మొదటగా, ఆధ్యాత్మిక జీవితం, దివ్య సత్యతలకు సంబంధించిన ఒక 'నూతన భావన' మాత్రమే కాదది. ఈ భావనను శ్రీ అరవిందులు వివరించారు. అనేకసార్లు నాకు నేనుగా కూడా దానిని వ్యక్తం చేశాను. దాన్నీవిధంగా రూపొందించవచ్చు. దివ్య సత్యతలోనికి, జీవితం నుండి పాత ప్రపంచాన్ని అదెక్కడ ఎలా ఉన్నదో అలాగే వదిలివేసి, తప్పించుకొనిపోవడం పాత ఆధ్యాత్మికత. తద్విరుద్ధంగా, మన నూతన దర్శనం, జీవితాన్ని దివ్యీకరించడం, దివ్య ప్రపంచంలోనికి పదార్థ ప్రపంచాన్ని రూపాంతరీక రించడం, ఇది చెప్పాం. తిరిగి తిరిగి చెప్పాం. న్యూనాధికంగా అర్థం చేసుకున్నారు. నిజానికి మేం చేయాలనుకున్న దాని, మౌలిక భావన అది. కాని ఇప్పుడున్న పాత ప్రపంచాన్ని మెరుగుపర్చడం ద్వారా విశాలం చేయడం ద్వారా కొనసాగించడం గావచ్చు. ఒక భావనలా ఇది పైన అక్కడ చింతనాక్షేత్రంలో ఇంతకాలం వున్నది. కాని వాస్తవానికి, అది అంతకంటే అధికమని చెప్పలేం - కాని జరిగిందేమిటి, నిజంగా సరిక్రొత్తది, ఒక నూతన ప్రపంచం పుట్టింది, పుట్టింది, పుట్టింది. తనను తాను రూపాంతరీకరించు కొంటున్న పాత ప్రపంచం కాదది, పుట్టిందొక నూతన ప్రపంచం, ఈ రెండూ యెచట పెనవేసుకొన్నాయో - అలా మార్పుచెందే సంధి సమయంలో సరిగ్గా మధ్యస్థ సమయంలో మనం ఇప్పుడున్నాం. ఎక్కడ సర్వశక్తివంతమై, సాధారణ చేతనపై పూర్తిగా పెత్తనం చేస్తూ యింకా మరోటి ఉన్నదో, కాని ఎక్కడ నూతనమైనది ప్రశాంతంగా లోపలికి నెమ్మదిగా, యింకా చాలా వినయంగా, తెలియకుండా ప్రాకుకుంటూ ప్రవేశిస్తున్నదో అది బాహ్యంగా దేనినీ ఎక్కువగా కలత పెట్టకుండా ఉండేంతగా తెలియకుండా, ప్రస్తుతానికి అధిక జనాభా చేతనలో పూర్తిగా అగ్రాహ్యంగా ఉంటూ ప్రవేశిస్తున్నది. అయినప్పటికీ అది పనిచేస్తున్నది, యెదుగుతున్నది. స్పష్టంగా కనిపించేటట్లు తయారై తనను తాను ధృవీకరించుకోవడానికి చాలినంత బలంగా తయార్యేంత వరకు అది అలానే పనిచేస్తుంది. ఎదుగుతుంది.

మతాల కాలం చెల్లింది.

ఏదెలా వున్నా, సంగ్రహంగా, శ్రీ అరవిందులు అధిమనస్సు సృష్టి అని చెప్పేది లక్షణ రీత్యా పాత ప్రపంచం, అది దేవుళ్ళ కాలం, పర్యవసానంగా మతాల కాలం. నేనుచెప్పినట్లు, పైనున్న దానివైపు మానవ కృషికి సంబంధించిన పుష్పం, అసంఖ్యాక మత రూపాలు పైకి లేవడానికాస్కారమిచ్చింది. ఉత్తమమైన అంతర్మాతలకు, అగోచర లోకానికి మధ్య ఒక మతపరమైన బాంధవ్యానికి ఆస్కారమిచ్చింది. దానంతటి అసలు శిఖరాన ఒక ఉన్నత సంసిద్ధివైపు ఒక కృషిగా, మతాల ఐకమత్యత అనే భావంపైకి లేచింది. 'ఒకే ఒక్కటి' ఈ అభివ్యక్తులన్నింటి వెనుక ఉన్నది అనే భావం పైకి లేచింది. చెప్పాలంటే ఈ భావం యథార్థంగా మానవ ఆకాంక్ష అంతిమ పరిమితి. సరే, అది సరిహద్దు వద్ద, సంపూర్ణంగా అధిమనస్సు ప్రపంచానికి అధి మనఃసృష్టికి ఇంకా సంబంధించి వున్నదేదో కొంత, అచటి నుండి ఈ 'మరోదాని' వైపు అది గ్రహించలేని నూతన సృష్టి వైపు చూస్తున్నట్లు కన్పించేది, దానిని చేరుకోవాలని ప్రయత్నిస్తున్నది, వస్తున్నట్లు అనుకొంటున్నది, కాని గ్రహించలేకపోతున్నది. దానిని సంగ్రహించడానికి, వేరేరకంగా చూడగలిగేటట్లు వెనుదిరగడం అవసరం. అధి మనస్సు సృష్టిని విడిచిపెట్టడం ఆవశ్యకం. నూతన సృష్టి, అతిమానసిక సృష్టి, దాని స్థానమాక్రమించడం ఆవశ్యకం.

ఇక ఇప్పుడు ఈ పాత విషయాలన్నీ, ఎంతో పాతవిగా, ఎంతో కాలంచెల్లినవిగా ఎంతో సంశయాస్పదమైనవిగా కన్పిస్తాయి. నిజమైన సత్యం వ్యవహారం అలా వుంది.

*CWM 9:149-51*

## పదార్థంపై ఒత్తిడి చేస్తున్న బంగారు దివ్య క్రియాశక్తి

పదార్థపు గట్టిదనం లేనప్పటికీ, బ్రహ్మాండమైన భారం కలదిగా కన్పించే ఒక బంగారు దివ్య క్రియాశక్తి క్రిందికి ఒత్తుతూన్నట్లున్నదని (ఒత్తుతున్న సంజ్ఞ) నేనది వరకే మీకు చెప్పాలనుకొంటున్నాను.

అవునవును. ఆంతరికంగా దైవం వైపు తిరిగేందుకు బలవంతపెడ్తూండే విధంగా పదార్థంపై వత్తిడి కలిగిస్తోందది, ఆ తిరగడం, బాహ్యంగా తప్పించుకోవడానికి గాక (ఊర్ధ్వంవైపు సంజ్ఞ) ఆంతరంగికంగా దైవం వైపు

తిరుగడం. కనుక పైకి కన్పించే ఫలితంగా, విపత్తులు అనివార్యం. అయినప్పటికీ, అనివార్య విపత్తు అవగాహనతో, అదే సమయంలో, తమంతట తాముగా పూర్తిగా మహిమలుగా, విషమ స్థితికి, ఘటనలకు పరిష్కారాలు కూడా ఉంటాయి. రెండు చివరలు మరింత చిట్టచివరివిగా యెడమైపోతున్నట్లు వుంటుంది. ఏది మంచో అది మరింత ఉత్తమమైనదిగా, చెడ్డది మరింత నికృష్టంగా తయారవుతున్నట్లనిపిస్తుంది. అదలా ఉంటుంది. ప్రపంచంపై ఒత్తిడి కలిగించే ఆ భయంకర దివ్యశక్తితో అలా ఉంటుంది - అది నా అభిప్రాయం.

అవును, అది గ్రాహ్యమౌతున్నది.

అవును, దానినలా సంవేదిస్తాం (మదర్ గాలిలో వ్రేళ్ళాడిస్తారు) ఒక ఉదాసీన రీతిలో సాధారణంగా సంభవించే అనేకమైనవి, ఆ పరిస్థితులలో తీవ్రతరమౌతాయి. స్థితులు, విభేదాలు నిశితమౌతాయి. దుస్సంకల్పాలు నిశితమౌతాయి. అంతే గాక, అదే సమయంలో అసాధారణ మహిమలు, అసాధారణంగా చనిపోబోతున్న వారు రక్షించబడ్డారు, విడదీయలేని చిక్కు సమస్యలు, అకస్మాత్తుగా విడిపోతాయి.

వ్యక్తుల విషయంలో కూడా అదే జరుగుతుంది.

దైవం వైపు తిరగడం తెలిసిన వారికి (ఎలా చెప్పాలి) చిత్తశుద్ధితో దైవాన్ని పిలిచే వారికి, అదొకటే ముక్తిమార్గమని అనుభూతి చెందేవారికి, బయటపడే మార్గమదొక్కటే అనుకొనేవారికి, నిజాయితీగా తమను తామర్పించుకొనే వారికి (గాలిలో దూసుకుపోతున్నట్లు సంజ్ఞ) అప్పుడు, కొద్ది నిముషాలలోనే అదొక అద్భుతంగా జరుగుతుంది. చిన్న విషయాలకు (చిన్నది, పెద్దదనేదేదీ లేదు, ముఖ్యం, అముఖ్యం అనేదేదీ లేదు) కూడా అది అంతే. విలువలు మారిపోతాయి.

ప్రపంచం గురించిన దృష్టే మారిపోయినట్లవుతుంది (మౌనం)

నిజం చెప్పాలంటే అతిమానసిక అవతరణచే ప్రపంచంలో జరిగే మార్పుకు సంబంధించిన దాన్ని గురించి ఒక అభిప్రాయం కలిగించడానికే ఇది చెప్తున్నాను. తటస్థం అనిపించే విషయాలు, పరిపూర్ణం అవుతాయి. ఒక చిన్న తప్పు, దాని పర్యవసానాలలో ఉన్నది ఉన్నట్లుగా చెప్పే విషయంగా అవుతుంది. ఒక చిన్న చిత్తశుద్ధి, ఒక చిన్న యథార్థ ఆకాంక్ష ఫలితం మహిమోపేతమైనది

అవుతుంది. జనంలో విలువలు తీవ్రతరమౌతాయి. పదార్థ దృక్కోణం నుండి చూచినా, అతిచిన్న లోపం, చాలా చిన్న దానికి కూడా అతిపెద్ద పర్యవసానాలు ఉంటాయి. ఆకాంక్షలో అతికొద్ది చిత్తశుద్ధి వున్నా అద్భుత ఫలితాలనిస్తుంది. విలువలు తీవ్రతరమౌతాయి, నిశితత్వాన్ని సంతరించుకొంటాయి.

*CWM 11:313-314*

## దైవానికి మరింతగా ప్రతిస్పందించేట్లు పదార్థాన్ని తయారు చేయడం

నేనీ నిర్ణయానికొచ్చాను. నేను చూచాను, నేను పరిశీలించాను, ఇంతకంటే మంచి మాటలేనందు వల్ల 'అతిమానసికం' అని మనం పిలిచే, ఈ అతిమానసికం ఉన్నత శక్తిని సృష్టిని మరింత సులభతరంగా స్పందించే విధంగా తయారు చేస్తుంది. మనం దానిని 'దివ్యం' అని ఎందుకంటున్నామంటే, మనమిప్పుడేదై వున్నామో దానితో పోలిస్తే అది దివ్యం. కాని... (అవతరణ, ఒత్తిడి సంజ్ఞ) దివ్యక్రియాశక్తికి, అది పదార్థాన్ని మరింత సులభతరంగా స్పందించే విధంగా ఇంకా అధికంగా తప్పకుండా చేస్తుంది. దాన్నెలా చెప్పగలం? ప్రస్తుతం మనకు కన్పించని యింద్రియ గ్రాహ్యం కానిది అసత్యం (అంటే నా అర్థం సామాన్య మానవ జీవి విషయంలో) 'ఘనిష్ట'మైనవి, కానివి వున్నాయని మనం అంటాం. అయినప్పటికీ ఈ బలమైన శక్తి, ఈ మహాశక్తి పదార్థం కాదు. భువిపై, భువి సంబంధిత పదార్థ వస్తువులకన్న అధిక ఘనిష్టంగా శక్తివంతమైనదౌతుంది. అవును అది, అది..

అతి మానస జీవుల రక్షణ, కాపాడుకొనే ఉపాయం ఇది. చూడడానికది పదార్థం కాదు. పదార్థ వస్తువులకన్న పదార్థంపై ఒక మహాశక్తి దానికి ఉంది. రోజురోజుకూ, గంటగంటకూ అధికాధికంగా యథార్థం అవుతోంది. మనం దైవం అని పిలిచే దానితో దిశానిర్దేశం చేయబడినపుడు, అది నిజంగా అది అర్థమౌతోందా - పదార్థాన్ని కదిలించగల శక్తిదానికి వున్నది. అది ఒక పదార్థ సంబంధ హఠాత్సంఘటనను కృతిల్లజేయగలదు. పూర్తిగా పదార్థ విషయకమైన దాని పర్యవసానాలను తుడిచి వేయగలదు. అది పదార్థం కన్న బలవత్తరమైనది. ఇది పూర్తిగా నూతనమైనది, అగ్రాహ్యమైనది. అందుచేత జనం సాధారణ చేతనలో అది ఒక విధమైన ఆందోళనను కలిగించగలదు. అవును, అది అదే. అదివరకేదై వున్నదో అది కానట్లు కన్పిస్తున్నది. యథార్థంగా ఏదో నూతనమైనది వున్నది - ఇదివరకటిదికెంత మాత్రం కాదు.

మన ఇంగితజ్ఞానమంతా, మన తర్కమంతా, మన లోక జ్ఞానమంతా, నేలకేసి కొట్టబడింది. నిరుపయోగం! ఇకనెంతమాత్రం శక్తి లేదు, ఏ మాత్రం సత్యత లేదు, ఇప్పుడున్న దానికి దానికీ ఏ మాత్రం సంబంధం లేదు. యథార్థంగా అదొక నూతన ప్రపంచం.

*CWM 11:315-16*

# ఘనమైన మార్పు

## నూతన సృష్టికి సిద్ధం కావడం

శ్రీ మాత : ఈ ప్రపంచం ఒక పెద్ద మార్పు కోసం సిద్ధం అవుతోంది, మీరు సహాయం చేస్తారా? మీరు మాట్లాడే ఆ గొప్ప మార్పు ఏమిటి? దానికి మేము ఎలా సహాయపడగలం?

భూమిపై ఒక నూతన జాతి అవతరించడమే గొప్ప మార్పు. జంతు జాలానికి, మనిషి ఏవిధంగానో, మనిషికి నూతన జాతి ఆవిధంగా ఉంటుంది. మానవుల్లో ఎవరైతే ఈ నూతన చైతన్యాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారో, వారికి జ్ఞానోద్దీపన కలుగజేయడానికి ఈ కొత్త జాతి చైతన్యం ఇప్పటికే భూమిపై పనిచేస్తోంది.

మీకు సహాయం చేయమని మీరు మమ్మల్ని కోరారు, నేను మీకు ఏవిధంగా సహాయ పడగలను? నేను ఏమి చేయాలి?

భువి పైకి దిగి వస్తున్న ప్రగతిశీల చైతన్యాన్ని, నూతన విషయాలను స్వీకరించడానికి ఏకాగ్రతతో సిద్ధంగా ఉండాలి.

నూతన చైతన్యం భువికి రావడానికి ఎలాంటి మన సహాయమవసరం లేదు. కానీ భువికి దిగివస్తున్న ఆ చైతన్యం వ్యర్థం కాకుండా దానిని స్వీకరించడానికి మనం సన్నద్ధులమై ఉండాలి.

గత సంవత్సరమే భువికి దిగిన ఈ నూతన చైతన్యం, స్వేచ్ఛగా పని చేయడానికి సాధకులు ఏమి చేయాలి?

(1) స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలి, మరియు

(2) మృదు మనస్కులుగా ఉండాలి.

నూతన చైతన్యాన్ని స్వీకరించడానికి మనల్ని మనం సిద్ధం చేసుకోవడానికి మొదటి అనివార్యమైన షరతు ఏమిటంటే, నిజమైన, అప్రయత్న సిద్ధమైన విధేయత, ఇది మనం సంపాదించుకోవలసిన అద్భుతమైన విషయాల ముందు మనకేమీ తెలియదని, మనదేమీ లేదని, లోతుగా భావించేలా చేస్తుంది.

*CWM 15: 107-108*

## అహమే పెద్ద అవరోధం

ఒక ముఖ్యమైన షరతు : అహం అనేది అంతం కావాలి. అహం ఇప్పుడు అవరోధం. ఈ అహాన్ని దివ్య చైతన్యంతో భర్తీ చేయాలి. శ్రీ అరొబిందో స్వయంగా దీనిని "అతి మానసము" అని పిలిచారు. ఇందులో ఎలాంటి అపార్థానికి చోటులేకుండా, మనం కూడా దానిని "అతి మానసం" అని సంబోధిద్దాము. ఎందుకంటే ఎవరైనా దైవం గురించి మాట్లాడితే, ప్రజలు వెంటనే భగవంతుడిని గురించే అనుకొంటారు. అది మొత్తాన్ని పాడు చేస్తుంది. ఇది అది కాదు. అది కానే కాదు. (శ్రీమాత తన మూసిన పిడికిలిని నెమ్మదిగా క్రిందకి తెస్తుంది) ఇది భూమిపై అతి మానస ప్రపంచ అవరోహణ, ఇది పూర్తిగా ఊహాజనిత విషయం కాదు. (శ్రీమాత పైకి చూస్తూ....) ఇది పూర్తిగా భౌతిక శక్తి. కానీ (శ్రీమాత నవ్వుతూ...) దానికి భౌతిక సాధనాల అవసరం లేదు. ఓ నూతన ప్రపంచం, ఈ ప్రపంచం లో శరీరం తీసుకోవాలి అనుకొంటుంది.

*CWM 11:316*

ఇంకో సారి ప్రపంచ యుద్ధం జరిగితే, అది మానవాళిలోని ప్రధాన భాగాన్ని నాశనం చేయడమే కాకుండా, అణ్వాయుధాలను వాడటం వలన, యుద్ధం తర్వాత జీవించి ఉన్న మానవాళి, జీవన పరిస్థితులను కష్టసాధ్యం చేస్తుంది. ఒకవేళ అలాంటి యుద్ధం జరిగే అవకాశం ఇంకా ఉన్నట్లయితే అది అతి మానస ఆగమనంపై మరియు భూమిపై కొత్త జాతిపై ప్రభావం చూపలేదా?

ఇవన్నీ మానసిక ఊహాగానాలు, మీరు మానసిక ఊహల తలంలోకి ప్రవేశించిన తర్వాత సమస్యలకు, వాటి పరిష్కారాలకు అంతం ఉండదు. అవన్నీ నిన్ను సత్యానికి, ఒక్క అడుగు కూడా దగ్గరగా తీసుకురావు. మనస్సుల సురక్షితమైన, అత్యంత ఆరోగ్యకరమైన దృక్పథం ఇలా ఉంటుంది అతి

మానస సృష్టి, వర్తమాన సృష్టిని అనుసరిస్తుందని, మనకు సానుకూల విధానంలో ఖచ్చితంగా తెలుపబడింది. కనుక భవిష్యత్తు కోసం ఏదైతే సిద్ధం అవుతుందో దానికి అవసరమైన పరిస్థితులు ఉండాలి. అవి ఏ పరిస్థితులైనా గాని ఈ పరిస్థితులు ఏమిటో మనం సరిగా ముందుగా ఊహించలేము. కనుక వాటి గురించి మౌనంగా ఉండటం మంచిది.

ఇబ్బందులను ఊహించడం అంటే, అవి జరగడానికి సహాయం చేయడమే. ప్రతిక్షణం, దైవకృప పై పూర్తి నమ్మకంతో శ్రేష్ఠమైన దానిని గురించి ఆలోచించడమే అతి మానసానికి సహకరించడం.

*CWM15: 111-12*

## నూతన ప్రపంచంతో సహకరించి పనిచేయడం

ఎంత సమయం పడుతుందో ముందుగా ఊహించడం చాలా కష్టం. ఇది కొంత మంది వ్యక్తుల సద్భావన మరియు గ్రహణ శక్తి పై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే వ్యక్తి ఎల్లప్పుడూ, సమూహం కంటే వేగంగా అభివృద్ధి చెందుతాడు. దాని స్వభావం ప్రకారం మానవజాతి మిగిలిన సృష్టికన్నా ముందుగా అతి మానసాన్ని అవతరింపజేయడానికి ఉద్దేశించబడినది.

ఈ సహకారానికి ఆధారంగా, మారాలనే సంకల్పం తప్పనిసరిగా ఉంటుంది. పరిస్థితులు ఇప్పుడెలా ఉన్నాయో ఇకపై అలా ఉండవు. దాన్ని చేరుకోవడానికి చాలా మార్గాలు ఉన్నాయి, విజయం సాధించినపుడు అన్ని పద్ధతులు కూడా మంచివే. వ్యక్తి తను ఉన్న స్థితిపై తీవ్ర అసహ్యం కలిగి వీటన్నిటి నుండి బయటపడి వేరొకదాన్ని సాధించాలని తీవ్రంగా కోరుకొంటాడు - ఇది చాలా సానుకూలమైన వైఖరి. తనలో ఒక స్పర్శను, చాలా అందమైన సత్యాన్ని అనుభూతి చెందవచ్చు, మరియు ఆ సత్యాన్ని చేరడానికి మిగిలిన అన్నింటినీ ఇష్టపూర్వకంగా వదిలివేయాలి అనుకొంటాడు. ఎందుకంటే ఆ సత్యాన్ని చేరే మార్గం లో ఏదీ భారం కాకూడదు.

ప్రతి వ్యక్తి విషయంలోనూ అనివార్యమైనది ఏమిటంటే, పురోగతి కోసం తీవ్రమైన సంకల్పం, పురోగతికి ఆటంకం కలిగించే ప్రతీదానినీ సుముఖంగా, మరియు సంతోషంగా త్యజించడం. ముందుకు వెళ్ళకుండా నిరోధించే ప్రతీదానినీ దూరంగా 'విసిరి వేయడం, "ఇది రేపటి నిజం, అనివార్యం" అని, అది ఏదీ కాదు, ఎవరిది ఎలాంటి చెడుసంకల్పమైన చివరకు ప్రకృతి నుండి

కూడా ఏదీ ఈ రేపటి వాస్తవాన్ని ఆపలేదు అని బలమైన నమ్మకంతో అజ్ఞాతంవైపుకు తిరిగి ఉండటం. ఇదేదో చాలా సుదూర భవిష్యత్తు కాదు. ఇది ఇప్పటికే సాధించబడిన వాస్తవం. ఇప్పుడిపుడే రూపు దిద్దుకొంటున్న ఈ వాస్తవికతకు అనుగుణంగా ఎలా తమను మార్చుకోవాలో, పాత అలవాట్ల భారంతో ఎలా అణగిపోకూడదో, తెలిసిన వారికి దర్శించడమే కాకుండా నిజీకరించుకొనే అదృష్టం తప్పకుండా ఉంటుంది.

ప్రజలు నిద్రపోతారు, వారు మర్చిపోతారు, వారు జీవితాన్ని తేలికగా తీసుకొంటారు, వారు మర్చిపోతారు, అన్ని సమయాల్లోనూ మర్చిపోతారు. కానీ మనం ఒక అరుదైన సమయంలో, ఒక ప్రత్యేకమైన సమయంలో ఉన్నామని గుర్తించగల్గాలి. మనకు అపారమైన అదృష్టం కలిగింది. ఓ కొత్త ప్రపంచం ఆవిర్భావ సమయంలో ఉండే మహోన్నత అవకాశం మనకు ఉంది. మన పురోగతికి అవరోధం కలిగించే ప్రతీదానిని మనం చాలా సులభంగా వదిలించుకోగలం.

కాబట్టి ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ వాస్తవాన్ని గుర్తుంచుకోవడం అనిపిస్తుంది. వ్యక్తికి స్పష్టమైన అనుభవం లేనప్పటికి దాని నిశ్చాయకతలు దానిలో నమ్మకాన్ని కలిగి ఉండటం. ఎల్లప్పుడూ దానిని గుర్తుంచుకొని, నిరంతరం మననం చేయాలనే ఆలోచనలో నిద్రపోవడం, ఆ గ్రహింపుతోనే మేల్కొనడం. ఇదంతా చేయడానికి ఓ నూతన ప్రపంచం ఆవిర్భావానికి సాక్షీభూతంగా మనం ఉంటామనే గొప్ప సత్యాన్ని నేపథ్యంగా కలిగి ఉండాలి.

అందులో మనం పాల్గొనవచ్చు. మనమే ఈ కొత్త ప్రపంచంగా మారవచ్చు. నిజంగా అటువంటి అద్భుతమైన అవకాశం ఉన్నపుడు, దానికోసం ప్రతీదీ వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలి.

*CWM 9: 159-60*

## అసాధారణ మలుపు

మనం ప్రపంచ చరిత్రలో అసాధారణ మలుపులో అసాధారణ సమయంలో జీవిస్తున్నాము. బహుశా, ఇంతకు ముందెన్నడూ, మానవజాతి ఇలాంటి ద్వేషం, రక్తపాతం, గందరగోళానికి సంబంధించిన చీకటి కాలాన్ని చూడలేదు. అదే సమయంలో, ప్రజల హృదయాలలో ఇంత బలమైన, ఉత్సాహభరితమైన ఆశ ఎప్పుడూ ఉదయించలేదు. నిజమే, మనం మన

హృదయ స్వరాన్ని వింటే, మనం కొద్దో గొప్పో చేతనతో, న్యాయం, సౌందర్యం, సామరస్యపూర్వకమైన మంచి-సంకల్పం, సోదరభావం కలగలసిన ఒక కొత్త పాలన కోసం ఎదురు చూస్తున్నామని వెంటనే గ్రహిస్తాము. ఇది ఇప్పటి ప్రపంచ వాస్తవ స్థితికి పూర్తి విరుద్ధంగా కనిపిస్తోంది. కానీ తెల్లవారుజాము కంటే రాత్రి ఎక్కువ చీకటిగా ఉండదని మనందరికీ తెలుసు. ఈ చీకటి, సమీపిస్తున్న తెల్లవారుజామునకు సంకేతం కాదా? పైగా రాత్రి చీకటి దట్టంగా, చాలా భయంకరంగా ఉండకపోతే, బహుశా తెల్లవారుజాము చాలా ప్రకాశవంతంగా, స్వచ్ఛంగా, ఉండకపోవచ్చు.... రాత్రి చెడు కలల తర్వాత ప్రపంచం కొత్త చేతనలో మేల్కొంటుంది.

ఇప్పుడు నాటకీయంగా ముగుస్తున్న నాగరికత, మేధా శక్తి మీద, పదార్థంతో, ప్రాణిక తత్వంతో వ్యవహరించే మేధస్సుపై ఆధారపడింది. ఇప్పుడు ప్రపంచానికి జరుగుతున్న దాని గురించి మనం ఇక్కడ చర్చించాల్సిన అవసరం లేదు. కానీ ఒక కొత్త పాలన వస్తోంది, అది ఆత్మది. మానవత తరవాత వచ్చే దివ్యత్వానిది.

అయినప్పటికీ, మనం ఇలాంటి అద్భుతమైన సమయంలో భూమిపై జీవించే అదృష్టవంతులమైతే, జరుగుతున్న సంఘటనలను చూస్తూ నిలబడితే సరిపోతుందా?

తన హృదయం తన కంటే, తన కుటుంబ పరిమితుల కంటే ఎక్కువ విస్తరించి ఉందని నమ్మినవారు, వారి ఆలోచనలు చిన్న వ్యక్తిగత ఆసక్తులు, స్థానిక ఆచారాల కంటే ఎక్కువగా ఉన్నాయని భావించే వారందరూ, సంక్షిప్తంగా, వారు తమకు తామే అని లేదా తమ కుటుంబానికి లేదా దేశానికి చెందినవారు కాదని గ్రహించిన వారందరూ, కానీ తాము మానవజాతి ద్వారా అన్ని దేశాలలో తనను తాను అభివ్యక్త పరుచుకునే భగవంతునికి చెందినవారమని గ్రహించిన వారందరికీ నిజానికి వారు పైకి ఎదగాలని, ప్రభాత ఆగమనం కోసం పనిచేయాలని తెలియాలి.

*CWM 2: 158-59*

## అతిమానవతత్వానికి మనిషి మార్గం:

మానవజాతిలో, తమ అంతర స్వభావాన్ని పెంపొందించుకున్న అతి కొద్దిమంది, తమ అంతరాత్మకు సంబంధించిన నిజమైన శాసనాన్ని

కనుగొనడంలో తమ శక్తిని కేంద్రీకరించిన వారు, ఎక్కువ లేదా తక్కువ మోతాదులో అంతఃస్ఫూర్తిని కలిగి ఉంటారు.

మనస్సు సంపూర్ణంగా నిశ్శబ్దంగా, చక్కగా మెరుగు పెట్టిన అద్దంలా స్వచ్ఛంగా, గాలిలేని రోజున ఒక కొలనులా కదలకుండా ఉన్నప్పుడు, పై నుండి, నక్షత్రాల కాంతి చలనం లేని నీటిలో పడి ప్రతిబింబించినట్లు, అతిమానస కాంతి, లోపల ఉన్న సత్య కాంతి, నిశ్చల, నిశ్శబ్ద మనస్సులో ప్రకాశించి అంతఃస్ఫూర్తికి జన్మనిస్తుంది. నిశ్శబ్దం నుండి ఈ స్వరాన్ని వినడానికి అలవాటుపడిన వారు, వారి చర్యలను ప్రేరేపించే ఉద్దేశ్యంగా దీనిని మరింత ఎక్కువగా తీసుకుంటారు. ఇతరుల విషయానికొస్తే, సగటు మనుషులు, తార్కిక క్లిష్ట మార్గాలలో సంచరిస్తే, వారు ఈ ఉన్నత ప్రవృత్తి, బలమైన, విఫలం కాని చేయి అనే అంతఃస్ఫూర్తి మార్గనిర్దేశం ద్వారా జీవితంలో మలుపుల గుండా నేరుగా వారి మార్గాలలో వెళతారు.

ఈ అపూర్వ, అసాధారణ శక్తి ఖచ్చితంగా రేపటి (తర్వాత వచ్చే) మనుష్య జాతికి సహజంగా, సర్వసాధారణంగా ఉంటుంది. కానీ బహుశా దీనిని నిరంతరంగా ఉపయోగించడం తార్కిక బుద్ధికి హానికరం. మనిషి, కోతికి ఉండే తీవ్ర శారీరక సామర్థ్యం కోల్పోయినట్లే, అతిమానస మానవుడు కూడా మనిషికి ఉండే తీవ్ర బుద్ధి శక్తిని అంటే తనను తాను, ఇతరులను మోసం చేసే సామర్థ్యాన్ని కోల్పోతాడు.

ఈ విధంగా, అతను చాలా సరైనదిగా అనుకునే, వ్యర్థంగా గర్వించే తెలివితో సహా అతను ఇంకా అభివృద్ధి చేసుకున్నదంతా ఇప్పుడు అతనికి సరిపోదని ధైర్యంగా ప్రకటించినప్పుడు, ఆ మనిషి ప్రయాణించడానికి అతిమానస తత్వ మార్గం తెరవబడుతుంది. అప్పుడు లోపల ఉన్న ఈ గొప్ప శక్తిని కనుగొని వెలికితీయడంలో, దానిని ముక్తం చేయడంలో అతనికి చాలా గొప్ప నిమగ్నత ఉంటుంది. అప్పుడు తత్వశాస్త్రం, కళ, విజ్ఞానశాస్త్రం, సామాజిక అస్తిత్వం లాంటి ముఖ్య సాధనాలు ఇకపై మనస్సు, లేకపోతే ప్రాణిక శక్తి ఆధీనంలో ఉంటూ అవి వాటి కోసం గీసుకున్న వృత్తంలో పని చేయవు. కానీ మనస్సు, ప్రాణిక శక్తుల వెనుక ఉన్న గొప్ప సత్యాన్ని కనుగొనడానికి, అలాగే ఆ సత్య శక్తిని మన మానవ అస్తిత్వంలోకి తీసుకురావడానికి సాధనంగా పనిచేస్తాయి. ఈ ఆవిష్కరణే మన వాస్తవికత, ఎందుకంటే ఇది మన అత్యున్నత స్వీయ స్వభావం.

*CWM 2: 163-64*

## కొత్త యుగానికి మార్గదర్శకులు:

అందువల్ల, జంతుతత్వ మానవత్వం అత్యధిక మానసిక స్థాయి మానవత్వంగా మార్చబడినట్లుగా, ప్రస్తుత మానవత్వం ఆధ్యాత్మిక మానవత్వంగా పరిణామం చెందడం లేదా. మార్పు చెందడాన్ని మానవుని గొప్ప అవసరంగా, ఆధ్యాత్మిక పరిణామాన్ని తమ విధిగా గుర్తించిన వారే, నూతన యుగంలో మానవాళి భవిష్యత్తుకు అత్యంత సహాయం చేసే వ్యక్తులు. వారు నిర్దిష్ట మత విశ్వాసాల పట్ల తులనాత్మకంగా అనాసక్తంగా ఉంటారు. వారు ఆ మత విశ్వాసాలకు సహజంగా ఆకర్షింపబడ్డ మిగిలిన వారిని, వారి ఇష్టాయిష్టాలకు వదిలివేస్తారు. వారు ఆధ్యాత్మిక పరివర్తన పై మాత్రమే విశ్వాసాన్ని కలిగి ఉంటారు. యంత్రాంగాలు, బాహ్య సంస్థల ద్వారా ఈ మార్పును ప్రభావితం చేయవచ్చని వారు తప్పుగా భావించరు. ప్రతి మనిషి అంతరాత్మ స్పందన బట్టి అంతర్లీనంగా జీవించాలని, అలా జీవించలేకపోతే ఎప్పటికీ సత్యాన్ని అభివ్యక్తం చేయలేరని, వారికి తెలుసు.

ఈ వ్యక్తులలో, ఈ గొప్ప పరివర్తనను గ్రహించే మొదటి వ్యక్తి స్త్రీ అయి ఉండాలి, ఎందుకంటే కొత్త జాతికి సంబంధించిన మొదటి నమూనాలకు ఈ ప్రపంచంలో జన్మనివ్వడం ఆమె ప్రత్యేక కర్తవ్యం. దీన్ని చేయగలగాలంటే, ఈ ఆధ్యాత్మిక పరివర్తనకు సంబంధించిన ఆచరణాత్మక ఫలితాల గురించి కొద్దో గొప్పో ఆమె అవగాహన చేసుకోవాలి. ఈ ఆధ్యాత్మిక పరివర్తన కేవలం బాహ్య పరివర్తనల ద్వారా ప్రభావితం కాదు, అటువంటి బాహ్య పరివర్తనల అభివ్యక్తి ద్వారా మనం ఆధ్యాత్మిక పరివర్తనను అవగాహన చేసుకోలేము.

ఇవి మేధావుల రంగంలో ఉన్నట్లు, నైతిక, సామాజిక రంగాలలో ఖచ్చితంగా అల్పంగా.

మత విశ్వాసాలు, ఆరాధనలు వాటి ప్రాముఖ్యతను కోల్పోవడంతో, నైతిక పరిమితులు / అనుశాసనాలు, ప్రవర్తనా నియమాలు లేదా ఆచారాలు కూడా వాటి ప్రాముఖ్యతను కోల్పోతాయి.

*CWM 2: 166-67*

## మానవుడు, అతి మానవుడు

వాస్తవానికి, మానవ జీవితంలో, నైతికతకు సంబంధించిన సమస్య అంతా, ప్రాణిక సంకల్పం - దాని ప్రేరణలకు, మనస్సు దాని శాసనాలకు మధ్య సంఘర్షణలో కేంద్రీకృతమై ఉంటుంది.

మనస్సుకి ప్రాణిక సంకల్పం సమర్పించబడినప్పుడు, వ్యక్తి లేదా సామాజిక జీవితం నైతికంగా మారుతుంది. కానీ ప్రాణిక సంకల్పం, మానసిక శక్తీ, ఈ రెండూ సమానంగా ఉన్నతమైన దానికి, అంటే అతిమనస్సుకు సమర్పించుకున్నప్పుడు మాత్రమే, మానవత్వాన్ని (మనుష్య జీవితాన్ని) దాటుకొని, నిజమైన ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమవుతుంది, అదే అతిమానవుని జీవితం. ఎందుకంటే అతని శాసనం అతని లోపల నుండి వస్తుంది, అది ప్రతి జీవి లోపలి మధ్యభాగంలో ప్రకాశించే దైవిక శాసనం, అది అక్కడి నుంచి జీవితాన్ని పరిపాలిస్తుంది, దైవిక శాసనం దాని అభివ్యక్తిలో బహుళత్వాన్ని కలిగి ఉంటుంది, కానీ దాని మూలంలో అది ఏకమే. దాని ఐక్యత కారణంగా, అది అత్యున్నత ఆజ్ఞ, సామరస్యాల శాసనం.

అందువల్ల వ్యక్తి అహంకార పూరిత ఉద్దేశ్యాలు, చట్టాలు లేదా ఆచారాల ద్వారా మార్గనిర్దేశం చేయబడడు, అన్ని స్వార్థ లక్ష్యాలను విడిచి పెడతాడు. అతను పాటించే శాసనం పరిపూర్ణ నిరాసక్తతతో ఉంటుంది. అతనికి ఇహ పరాలకు సంబంధించి వ్యక్తిగత లాభాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రవర్తించడం ఊహించడానికి కూడా సాధ్యం కాని అసాధ్యంగా మారుతుంది. ప్రతి కార్యము దానిని ప్రేరేపించే దివ్య శాసనానికి సంపూర్ణమైన, సరళమైన, సంతోషకరమైన విధేయతతో, ఎటువంటి బహుమతి లేదా ఫలితాల కోసం ఆశపడకుండా చేయబడుతుంది, ఎందుకంటే అంతరాత్మతో తాదాత్మ్యత చెంది, తన లోపల ఉన్న దివ్య విధాన సంకల్పాన్ని అనుసరిస్తూ, అటువంటి స్ఫూర్తి కింద పనిచేయడం ద్వారా వచ్చే ఆనందమే అత్యున్నత బహుమతి.

ఈ విధంగా చేయడం ద్వారా అతిమానవుడు తన సామాజిక ప్రమాణాన్ని కూడా కనుగొంటాడు. తనలో దివ్య శాసనాన్ని కనుగొనడం వలన అతను ప్రతి జీవిలో అదే దివ్య శాసనాన్ని గుర్తిస్తాడు, దివ్య శాసనంతో తాను తాదాత్మ్యత చెందడం ద్వారా అతను అందరిలో ఉన్న దివ్య శాసనాన్ని గుర్తిస్తాడు, తద్వారా భూ ప్రపంచంలోని అన్నిటిలోని ఏకత్వం గురించి

తెలుసుకుంటాడు, అంటే మూల సారం, ప్రధానాంశ పదార్థాల ఏకత్వమే కాకుండా, అత్యంత బాహ్యతలాలైన భౌతిక, ప్రాణిక తలాలలోని ఏకత్వాన్ని సైతం గుర్తించగలడు.

అతను కేవలం మనస్సో, ప్రాణికమో, లేక భౌతిక శరీరమో కాదు, వాటిని తన అధీనంలోకి తీసుకొని, వాటికి సూచన చేస్తుండే వాటికి జీవనాధారమైన నిశ్శబ్ద, శాంతిమయ, శాశ్వత అంతరాత్మ, ఈ అంతరాత్మను, అతను ప్రతి చోటా అంటే అందరి మనసుల్లోనూ, ప్రాణికాల్లో, భౌతిక శరీరాల్లో కూడా గుర్తించగలడు. అతను ఈ పరమాత్మను దివ్య సృష్టికర్తగా, అన్ని పనులను చేసే వానిగా, అన్ని అస్తిత్వాలలో ఉండే ఏకత్వంగా గుర్తించగలడు. ఎందుకంటే విశ్వ అభివ్యక్తికి సంబంధించి అనేక ఆత్మలు ఒకే పరమాత్మ యొక్క ముఖాలు మాత్రమే అని అతను తెలుసుకొని ఉంటాడు. అతను జీవుల రూపాలలో (ప్రతి జీవిలోను) తనకు కనిపిస్తూ ఉన్నది అనేక ముఖాలను ప్రదర్శించే విశ్వ విశ్వవ్యాప్త దివ్యత్వం అని గ్రహిస్తాడు. అతను దానిలో తనను తాను విలీనం చేసుకుంటాడు, తన స్వంత మనస్సుని, ప్రాణికాన్ని, శరీరాన్ని పరమాత్మ యొక్క ఒక ప్రదర్శనగా గ్రహిస్తాడు, ప్రస్తుతం మనం ఇతరులను వేరే మనుషులుగా భావించినట్లు కాకుండా, వారిని అతను మనః ప్రాణ శరీరాలలో అతని సొంత అంతరాత్మగా అనుభూతి చెందగలడు. అతను తన శరీరానికి మిగిలిన వారి శరీరాలకి మధ్య ఉన్న ఏకత్వాన్ని అనుభూతి చెందగలడు, ఎందుకంటే అతను అన్ని భౌతిక పదార్థాల ఐక్యత గురించి నిరంతర స్పృహలో ఉంటాడు. అతను అన్ని అస్తిత్వాలలో ఉన్న విశ్వవ్యాప్త మనస్సు, హృదయాలతో తనను తాను ఐక్యం చేసుకుంటాడు. సంక్షిప్తంగా చెప్పాలంటే, అతను తనను తానే ఇతరులందరిలో, ఇంకా ఇతరులందరిలో తనను చూసి అనుభూతి చెందగలడు, తద్వారా ఐక్యత యొక్క పరిపూర్ణతలో నిజమైన సంఘీభావాన్ని గ్రహించగలడు.

*CWM 2: 167-68* మదర్

విశ్వవ్యాప్త ఉనికిలో మనం ప్రత్యేకంగా సానుకూల సమయంలో ఉన్నాము, భూమిపై, ప్రతిదీ కొత్త సృష్టి కోసం లేదా శాశ్వత సృష్టిలో కొత్త అభివ్యక్తి కోసం సిద్ధమవుతున్న సమయం ఇది.

*CWM 16: 353* మదర్

# నూతన జాతి క్షణిక దర్శనాలు

మానవుడు పరిణామ జీవి : అతనే చరమం కాదు. ఎందుకంటే పరిణామం అతనితో ప్రారంభం కాలేదు. అతను దాని వ్యక్తమవుతున్న మకుటము కాదు, దాని అత్యున్నత బహిర్గమనము కాదు, ప్రకృతి చిట్టచివరి ఫలితార్థము కాదు. ప్రకృతి మనిషిలో తన అత్యున్నత సంభావ్యతలను తీసుకురాలేదు : అతని ద్వారా ఆమె చైతన్యానికి, అస్తిత్వానికి చెందిన సర్వోన్నత ఎత్తులకు చేరలేదు. ఇంకా దిగువ మానవత అయిన కీటకము, జంతువు అతని ముందున్నాయి గనుక అతని తర్వాత అతిమానవత, అతిమానవుడు ఉండి తీరాలి.

మనిషి తనకు తానే అతిమానవుడు కావచ్చు, వర్తమానంలో అతను కానిదంతా కావచ్చు . కానీ దానికి అతను తనను తాను అధిగమించాలి, ఇది ప్రస్తుత అసంపూర్ణ చైతన్యానికి అంటిపెట్టుకుని ఉండటంతో జరుగదు, అతను పరిణామంలోని తదుపరి దశను తీసుకోవాలి. తనలోని ఆధ్యాత్మిక దేవతను కనిపెట్టి, విడుదల చేయాలి, తనలోని దైవత్వ సంభావ్యతలను వాస్తవం చేసుకోవాలి, మహాశక్తిమంతునిగా కావాలి భూ ప్రకృతి మార్మికత ప్రారంభమైనప్పటినుండీ బందీగా వున్న యథార్థ పదార్థం నుండి బయటకు రావడనికి సంఘర్షిస్తున్న దైవం కావాలి.

*CWSA 12:262-65*

ఒక పదార్థ, జంతు ప్రపంచంలో మానవ సంభావ్యత ప్రకటన అన్నది దివ్యకాంతి ఆగమన ప్రథమప్రకాశం- పదార్థం నుండి జన్మించవలసిన ఒక దేవత యొక్క సుదూరప్రారంభ సూచన. మానవ ప్రపంచంలో అతిమానవ అభివ్యక్తి ఆ సుదూర ప్రకాశ వాగ్దాన సఫలత.

మానవునికి అతిమానవునికి భేదం, మనసుకు, దానికి ఎంతో ఆవల ఉన్న చైతన్యానికి మధ్యన బేధం వంటిది, అది ఆలోచించే మనసు ఎలా అయితే వృక్ష, జంతు చైతన్యానికి అతీతమైనదో అలా ఉంటుంది . ఇక్కడ మనిషిని వేరు చేసే అసలు తత్వం మనసే, అలా అతిమానవుడిని వేరు చేసే అసలు తత్వం అతిమనసు లేదా ఒక దివ్య జ్ఞానం.

మానవుడు ఆరోహించే సహజ ఉచ్ఛ బిందువు కాదు అతిమానవుడు, అలాగే మానవుని గొప్పతనానికి, జ్ఞానానికి, శక్తికి, మేధకు, సంకల్పానికి,

గుణానికి, తెలివికి, శక్త్యుత్పాదకతకు, పవిత్రతకు, ప్రేమకు, స్వచ్ఛత లేక పరిపూర్ణతకు చెందిన ఒక ఉత్తమశ్రేణి కాదు. అతి మనసు మానసిక మానవునికి, అతని పరిమితులకు అతీతమైనది, మానవస్వభావానికి యుక్తమైన అత్యున్నత చైతన్యాని కన్నా ఒక గొప్ప చైతన్యం.

*CWSA 12: 157*

## మానవునికి అతిమానవునికి మధ్యన మధ్యంతరాలు

**మధురమయి శ్రీమాతా, మానవునికి అతిమానవునికి మధ్యన ఏవైనా మధ్యంతర స్థితులు ఉన్నాయా?**

చాలా ఉండటానికి అవకాశముంది.

**మానవునికి, అతిమానవునికా? నూతన అతిమానస జాతి గురించి నువ్వు మాట్లాడటం లేదు కదా! నిజంగా మనం అతిమానవుడని పిలిచేదాని గురించే మాట్లాడుతున్నావా, అంటే తన సాధారణ మానవ జన్మతో పొందిన భౌతిక అస్తిత్వాన్ని మానవ పద్ధతిలో రూపాంతరం చెందించాలని ప్రయత్నించే మానవుని గురించేనా ? ఏవైనా దశలున్నాయా అనా?-** ఖచ్చితంగా అక్కడ అసంఖ్యాక పాక్షిక సాక్షాత్కారాలు ఉంటాయి, వారి వారి సామర్థ్యాన్ని బట్టి రూపాంతరీకరణ స్థాయి మారుతుంది, ఫలించి లేదా ఫలించకుండా, నిర్దిష్టంగా పరిగణించదగిన సంఖ్యలో ప్రయత్నాలుంటాయి అతిమానవుని పోలిన దానిని చేరడానికి ముందు, ఎక్కువతక్కువగా విజయవంతమైన ప్రయత్నాలు వుంటాయి. తమ సాధారణ స్వభావాన్ని అధిగమించాలని శ్రమించే వాళ్ళంతా, తమకు దివ్యసత్యంతో అనుబంధాన్ని తీసుకువచ్చిన, ఇంకా లోతైన భౌతిక అనుభవాన్ని వాస్తవం చేసుకోవాలని ప్రయత్నించే వాళ్ళంతా, అతీతంలోకి లేదా సర్వోన్నతుని వైపు మళ్ళటానికి బదులు, తాము తమలో వాస్తవం చేసుకున్న చైతన్య మార్పును బాహ్యంలో భౌతికంగా వాస్తవం చేసుకోవాలని ప్రయత్నించే వారంతా శిక్షణ పొందుతున్న అతి మానవులే. వారి ప్రయత్నాల విజయంలో అసంఖ్యాక భేదాలుంటాయి. సాధారణ మనిషిలా, సాధారణ జీవితాన్ని గడపకుండా ఉండటానికి ప్రయత్నించిన ప్రతిసారి, మన చలనాల్లో, మన చర్యప్రతిచర్యల్లో దివ్యసత్యాన్ని ప్రకటించడానికి, సాధారణ అజ్ఞానంతో కాకుండా ఆ సత్యంతో మనం పాలించబడినపుడు మనం శిక్షణ పొందుతున్న అతిమానవులమే, మన ప్రయత్నాల విజయాన్ని బట్టి కొద్దోగొప్పో అర్హత కలిగి వుంటాం, మార్గంలో ఎక్కువతక్కువగా పురోగమిస్తాం.

*CWM 9:410*

ఇవన్నీ దశలు, కనుక యథార్థానికి ఈ జాతి రూపాంతరీకరణలో, ఈ ఇద్దరిలో ఎవరు ముందు చేరతారు అని తెలుసుకోవడమే ప్రశ్న. దివ్యసత్య ప్రతిబింబంలో తన భౌతికశరీరాన్ని రూపాంతరం చెందించాలనుకునేవారా, లేక పాతశరీరం తన బాహ్య సమగ్రతలో జీవించడాన్ని కొనసాగించలేక శకలాలై అఖండత్వాన్ని కోల్పోవడాన్ని కొనసాగించే పాత అలవాటు వున్న శరీరమా, ఇది రూపాంతరానికి నశింపుకు మధ్యనున్న ఒక జాతి. ఎందుకంటే అక్కడ ఆగిపోయే స్థానాలు కేవలం రెండే ఉంటాయి, రెండు విషయాలు ఏది, ఎంతవరకు విజయవంతమయింది అన్నదానిని సూచించగలదు, లేదా విజయం, అతిమానవుడు కావడం- అప్పుడు మనం ఇలా అనవచ్చు, “ఇప్పుడు నేను గమ్యాన్ని చేరాను అని”.... లేదంటే మరణం. అంతవరకు సామాన్యంగా వ్యక్తి “మార్గంలో వున్నట్లే”.

ఒకటి లక్ష్యాన్ని సాధించడం, ఇంకొకటి జీవితం హఠాత్తుగా విచ్ఛేదం గావడం - ఈ రెండిటిలో ఏదో ఒకటి తాత్కాలికంగా పురోగతిని అంతం చేస్తుంది. మార్గంలో ప్రతిది ఎంతో కొంత దూరం వెళ్లింది, కానీ గమ్యం చేరేవరకూ ఎవరూ ఏదశలో వున్నది చెప్పలేరు. చివరి అడుగే లెక్కలోకి వస్తుంది. కనుక కొన్ని వందలు లేక వేయి సంవత్సరాలు తర్వాత వచ్చినవారు వెనక్కు తిరిగి చూచుకుని ఇలా అనగలుగుతారు, ఈ దశ లేదా ఆదశ, ఈ సాక్షాత్కారం లేక ఆ సాక్షాత్కారం అక్కడ వుంది....” అది చరిత్ర, అది ఆ సంఘటనకు చెందిన చారిత్రాత్మక భావన. అంతవరకు మనమంతా చలనంలో, కార్యనిర్వహణలో వుంటాం,

మనం ఎంతదూరం పయనించాము, ఇంకా ఎంత దూరం వెళ్ళాలి? అన్నదాని గురించి ఎక్కువ ఆలోచించకపోవడం మంచిది, ఎందుకంటే అది నిన్ను వికలాంగుని చేసి నువ్వు సరిగ్గా పరిగెత్తనివ్వకుండా చేస్తుంది. పరిగెత్తడం గురించి తప్ప వేరే దేని గురించి ఆలోచించకపోవడం మంచిది. సరిగ్గా పరిగెత్తాలంటే అదొక్కటే మార్గం. నువ్వు వెళ్ళాలని కోరుకునే దాన్ని చూడు, ముందుకు పోయే చలనంలో నీ మొత్తం ప్రయత్నాన్నిపెట్టు. ఎంత దూరం వెళ్ళావన్నదాంతో నీకు సంబంధం లేదు, నేను చెబుతున్నాను,” ఇది చరిత్ర”, ఇది తర్వాత వస్తుంది. మన ప్రయత్నంలోని చరిత్రకారులు మనతో చెబుతారు

- ఎందుకంటే ఒకవేళ మనం ఇంకా అక్కడ వున్నాం - మనంఏం - చేసింది, ఎలా చేసింది వారు చెబుతారు. ఈ క్షణంలో ఏదీ అవసరమో అది చేయాలి : ఇది మాత్రమే ముఖ్యం.

*CWM 9: 411*

## అతి మానవుడు

తర్వాత మదర్ అతిమానవుని చైతన్యంగా గుర్తించిన దాని ఆగమనం గురించి ఇలా అన్నారు.

అది రాత్రి మెల్లగా వచ్చింది, ఈ ఉదయం మేల్కొన్నపుడు అక్కడ ఒక సువర్ణ ఉషోదయంలా వాతావరణం తేలికగా ఉంది. “అవును, ఇది నిజం, నిజంగా కొత్తది” అని శరీరం అనుభూతి చెందింది. ఒక సువర్ణకాంతి, పారదర్శకంగా.....ఉదారంగా ఉంది, “ఉదారత” అంటే ఒక నిర్దిష్టత - ఒక సామరస్యపూరిత నిర్దిష్టత. అది కొత్తగా ఉంది “శుభ సంవత్సరం” అని నేను మనుష్యులతో అన్నపుడు, దీనినే నేను వాళ్లకు అందిస్తాను. ఈ ఉదయం నేను ఈ విధంగా సమయాన్ని గడిపాను, యాదృచ్ఛికంగా “శుభసంవత్సరం, శుభసంవత్సరం”అంటూ. కనుక.....

*CWM 11; 148*

ఇది ప్రకాశవంతమైనది, నవ్వుతుంది, శక్తివంతంగా దానశీలమైనది. సాధారణంగా మనిషిలో దానగుణం అన్నది కొంచెం బలహీనంగా వుంటుంది, అంటే ఇది యుద్ధం చేయ, ఘర్షణ పడ ఇష్టపడదు. ఇది అలాంటిది కాదు! తనను తాను ప్రభావితం చేసుకునేది.

(మదర్ కుర్చీ చేతుల క్రింద తన పిడికిలి బిగించారు.)

ఇది మొత్తంగా నూతనమైనది కాబట్టి నాకు ఆసక్తి కలిగించింది. అలాగే ఎంతో వాస్తవమైనది! ఇంత యథార్థమైనది (మదర్ తన కుర్చీ చేతులను స్పర్శించారు) సాధారణంగా భౌతిక చైతన్యం ఇతరులను ఎలా స్పర్శిస్తుందో అంత యథార్థమైనది. అంటే ఇది చైత్యపురుష ద్వారా ఆంతరిక అస్తిత్వం లోకి సాగలేదు, ఇది నేరుగా శరీరం పై ప్రభావం చూపింది.

ఇది ఏంటి? బహుశ ఇది అదే అయి వుంటుంది. ఇది వచ్చింది గనుక, శరీర సంవేదన ఒక విధమైన నిశ్చయత, తెలుసుకోవడానికి ఒక కుతూహలం

గానీ, అనిర్దిష్టత గానీ లేని ఒక నిశ్చయత "ఇది ఏమై వుంటుంది? అతిమానసం ఎలా వుంటుంది ? భౌతికంగా, ఇది భౌతికంగా ఎలాంటిది?" అని శరీరం తనను తాను ప్రశ్నించుకునేది. ఇప్పుడు దీని గురించి అదేమీ ఆలోచించడం లేదు, అది సంతృప్తిగా వుంది. బహుశ ఇది అదే అయివుంటుంది.

ఇది సిద్ధంగా వున్న శరీరాలకు వ్యాపింస్తుందా ?

అవును, అవునని విశ్వసిస్తున్నాను. ఇది ప్రవేశించబోయే, తనను తాను ప్రకటించుకోబోయే రూపనిర్మాణమన్న భావన నాకుంది, శరీరాలలో - ప్రవేశించడానికి, తనను తాను ప్రకటించుకో వడానికి - ఈ శరీరాలే అతిమానస శరీరాలు అవుతాయి. లేదంటే బహుశ ... అతిమానవుడు కావచ్చు, నాకు తెలీదు. రెండింటికి మధ్యనున్న మధ్యంతర వ్యక్తి బహుశ అతిమానవుడు కావచ్చు. ఇది చాలా మానవీయమైనది, దివ్యనిష్పత్తులతో వున్న మానవుడు అని చెప్పవచ్చు. బలహీనతలు, ఛాయలు లేని ఒక మానవుడు. ఇదంతా కాంతి- అంతా కాంతి నవ్వుతూ వుంది.... అదే సమయంలో మధురంగా..

అవును, బహుశ అతిమానవుడు.

*CWM 11;153*

## ప్రపంచ వ్యక్తిత్వం

ఒక ప్రపంచ వ్యక్తిత్వానికి ఉండే స్వాభావిక లక్షణ రూపమేమిటి?

దీని స్వాభావిక లక్షణం ఖచ్చితంగా చేతనలో ఈ పరివర్తన. చిన్నగా, వేరు వ్యక్తిగా, ఇతరుల నుండి వేరైన మనిషిగా తనను భావించడానికి బదులు తాను విశ్వ మానవుడినని భావిస్తూ సర్వజనులనూ తన వారిగా, సన్నిహితంగా ఐక్యభావనతో అందరితో తాదాత్మ్యం చెందుతాడు ఈ వ్యక్తి.

"ఈ వ్యక్తి ఎలా మాట్లాడుతాడు? ఎలా ప్రవర్తిస్తాడు?"

ఎలా మాట్లాడతాడా...! వేసే ప్రశ్న మంచిగా లేదు. ఎందుకంటే అతడెలా మాట్లాడుతాడు అని నీవడిగితే అతడు అందరిలానే, అతని గొంతుతో, అతని నోటితోనే అతని మాటల్లోనే మాట్లాడతాడు. ఆ మాట్లాడే స్వభావం ఏమిటి అన్నప్పుడు సహజంగానే, అతను నివసిస్తున్న చేతన స్థాయిలోనే తాను ప్రకటిస్తున్నట్లయితే, అతడు విశ్వచేతనాస్థాయిని వ్యక్తపరుస్తాడు. సామాన్య

ప్రజలు చూచేదానికి భిన్నమైన రీతిలో చూస్తాడు, ఆయా విషయాలను అతడు ఎలా చూస్తాడో సంవేదిస్తాడో దాని ప్రకారమే భిన్నంగా వ్యక్తపరుస్తాడు. అతడు పనిచేయాల్సి వస్తే అతనిలోని అన్ని భాగాలు సామరస్యపూరితమై, అతని కార్యాచరణ చాలా స్పష్టంగా అతని చేతనాస్థాయిని ప్రకటిస్తూ పనిచేస్తాడు. ఇప్పుడు కొంతమంది మనుషుల్లో వారికే చెందిన ఒక భాగంలో చాలా నిశ్చయమైన అనుభవాలు ఉంటాయి. అవి వారి ఇతర భాగాలకు అవశ్యం లేక వెంటనే తర్జుమా కావలసిన అనుభవాలు కావు. సాధన ద్వారా లేదా ఏకాగ్రత లేదా అనుగ్రహం ద్వారా ఒక మనిషి ప్రపంచ వ్యక్తిత్వానికి సంబంధించిన చేతనను సముపార్జించడం సాధ్యమే. కాని తాను పూర్తిగా సర్వసాధారణంగా, నిర్వచించలేని రీతిలో భౌతికంగా ప్రవర్తించడం కొనసాగిస్తుంటాడు. ఎందుకంటే తన అస్తిత్వంలోని సర్వాన్ని సమైక్య పర్చుకోవడంలో అతడు శ్రద్ధ వహించలేదు. తనలోని ఒక అంశం విశ్వజనీనంగా, సచేతనంగా ఉన్నా, తాను ఆహారాన్ని భుజించడం, నిద్రించడం, నడవడం, పనిచేయడం మొదలు పెట్టడంతోనే తతిమ్మా జంతు మానవుల్లానే చేస్తాడు. అది జరగవచ్చు. కాబట్టి, ఇది పూర్తిగా వ్యక్తిగతమైన ప్రశ్న. అది ప్రతి ఒక్క వ్యక్తి అభివృద్ధి దశపై ఆధారపడి ఉంటుంది.

ఒకవేళ ఒక వ్యక్తి అస్తిత్వంలో అన్ని భాగాలను సమైక్యపర్చడంలో శ్రద్ధ వహిస్తే, తన అస్తిత్వంలోని అన్ని అంశాలను కేంద్రీయ సత్యంతో తాదాత్మ్యం చెందించితే అప్పుడిక సహజంగానే అతడు పూర్తి అహంకార రహితంగా ఇతరులను అర్థం చేసుకొని పనిచేస్తాడు. ఆ అవగాహన అతనికి తాను ఇతరులతో తాదాత్మ్యం చెందినప్పుడు కల్గుతుంది. కాబట్టి అతను ద్రష్టలాగా పనిచేస్తాడు. కాని కేంద్రీయ చేతన చుట్టూ తన పూర్తి అస్తిత్వాన్ని సమైక్య పర్చడంలో శ్రద్ధ వహించడంపై అది ఆధారపడి ఉంది. ఉదాహరణకి ఆహారం, నిద్ర లాంటి భౌతిక విషయాలనే తీసుకొన్నప్పుడు ఆ వ్యక్తి తన చేతనను శరీరంలోకి ప్రవేశపెట్టడంలో శ్రద్ధ వహించకపోతే ఆహారం, నిద్రల అవసరం పూర్వంలానే యథాతథంగా ఉంటుంది. తద్వారా వాటి మీద తనదైన నియంత్రణ ఉండదు. మరోవిధంగా తనలోని అన్ని భాగాలను సమైక్య పర్చుకోవడంలో జాగ్రత్త వహిస్తే తన శరీరాన్ని పనిచేయించే ధాతువుల్లోకి తన నూత్న చేతనను చొప్పించితే అతడి నిద్ర కూడా సచేతనమైన నిద్రగా మారుతుంది. విశ్వరీతికి చెందింది అవుతుంది; ఆ వ్యక్తి తన సంకల్ప మాత్రం

చేత ప్రపంచంలో ఏ మూల ఏం జరుగుతుందో, ఏ వ్యక్తిలో ఏమున్నదో అంతా తెలుసుకోగల సామర్థ్యాన్ని పొందుతాడు; అతడి చేతన విశ్వవ్యాప్తమై, సహజంగానే అతడు ఏమేమి తెల్సుకోవాలనుకుంటున్నాడో వాటన్నింటితో సంబంధం కల్పిస్తుంది. భౌతిక దృష్టితో చూడడం మినహాయించితే, ఒక నిరర్థకమైన, అచేతనమైన నిద్రకు బదులుగా, అతడు ఒక ఫలప్రదమైన బొత్తిగా సచేతనమైన నిద్రను పొందుతాడు.

*CWM 8:380-81* *శ్రీమాత*

## విజ్ఞానమయ జీవనుడు

విజ్ఞానమయ సత్యజీవనం స్వయంగా దైవం కోసమే పనిచేస్తూ ప్రపంచంలో, సమస్తంలో ఉన్న దైవం కోసమే వశిస్తుంది. దైవ సన్నిధి, వెలుగు, శక్తి, ప్రేమ, ఆనందం, సౌందర్యాలు అధికాధికమౌతూ వ్యక్తిని, ప్రపంచాన్ని స్వాధీనం చేసుకోవడమే, విజ్ఞానమయ జీవనుడి జీవితార్థం అవుతుంది. ఈ విజ్ఞాత పదార్థాన్ని వినియోగించుకొంటున్నా, అతడిలో ఏ పదార్థ లేదా ప్రాణిక బంధం లేదా కోరిక గాని లేకుండా దానిని వినియోగించుకొంటాడు. ఆధ్యాత్మనే దానిదేయైన పదార్థ రూపంలో దాని అనుమతి, అంగీకారంతోనే దాని స్వీయ ఉద్దేశ్యపూర్తికై తాను వినియోగిస్తున్నాను అని భావిస్తాడు. భౌతిక వస్తువుల ఎడల, వాటిలోని రహస్య చేతన ఎడల, దైవసేవకు, ఉపయోగానికి సంబంధించిన దాని మూగ సంకల్పం ఎడల ఎఱుక, అతడు ఉపయోగించే వాటిలో దైవం, బ్రహ్మం, ఆరాధన, తన దివ్యపదార్థాన్ని, పరిపూర్ణంగా, దోషరహితంగా ఉపయోగించడంలో శ్రద్ధ, పదార్థపు జీవితంలో, యథార్థ లయకు, సక్రమ సామరస్యతకు, పదార్థాన్నుపయోగించడంలో సౌందర్యం యెడల అతనిలో ఒక విధమైన గౌరవం ఉంటుంది.

## అతిమానస విజ్ఞాత

అతిమానస విజ్ఞాత అయిన వ్యక్తి ఆధ్యాత్మిక వ్యక్తిగా ఉండబోతాడు. ఒక నిర్ణీత వ్యక్తిత్వంతో ఒక స్థిరమైన గుణాల కలబోతతో గుర్తించబడిన నమూనా వ్యక్తి భావనలో ఉండదు అతని మూర్తిమత్వం. అంతక్రితంలా కాక అతడు విశ్వ, విశ్వాతీత, చేతనకు ఒక అభివ్యక్తిగా ఉంటాడు. కాలం ద్వారా అస్థిరమైన తరంగాల రూపాన్ని, వ్యక్తిత్వాన్ని బయటకు త్రోసే ఒక

చపల అవైయక్తిక బహిర్ ప్రవాహంగా అతడి ఉనికి ఉండదు. ఒక దృఢమైన కేంద్రీకృత పురుషుడు తమ లోలోపల లేకుండా ఆ ఫలానా సమయానికి ఏ మౌలికాంశం ముందుకు చొచ్చుకొస్తుందో దాని ప్రకారం ఒక గందరగోళమైన బహురూప వ్యక్తిత్వంతో పనిచేస్తున్నవారు కొందరుంటారు.

కాని ఈ విజ్ఞానమయ చేతన ఒకసామరస్య పూరితమైన చేతన, ఇది స్వీయ జ్ఞానం, స్వీయ నియంత్రణతో ఉంటుంది. దీనిలో పైన ప్రస్తావించిన అసంబద్ధమైన అస్తవ్యస్థత ఉండదు.

*CWSA 21:1020-1031*

## దివ్య శరీరం

నూతన వర్గానికి చెందిన శరీరం, దివ్య శరీరం, ఇప్పటికే వికాసం చెంది ఉన్న పరిణామ రూపాన్ని కొనసాగించాలి. ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాకృతిక వర్గానికి చెందిన శరీరానికి కొనసాగింపుగా ఉండాలి. అది మానవ శరీరం నుండీ దివ్య శరీరానికి కొనసాగింపు. ఏదో గుర్తించదగనిదిగా సంబంధాన్ని తుంచివేయడం కాదు. పైగా ఏ భాగం మేరకు పరిపూర్ణత సాధించబడిందో దానికి తదుపరి అనుగమనం, శేష పరిణామం. ఈ మానవ శరీరం, దానిలోని భాగాలు ఉపకరణాలుగా దివ్య జీవనానికి సేవలందించడానికి తగినంతగా పరిణామం చెంది ఉన్నాయి. అయినా ఇవి ఇంకా పరిపూర్ణతనొందవలసి ఉన్నది. వీటి పరిమితుల స్థాయి, ఉపయోగం తొలగిపోవాలి. వీటిల్లోని లోపభూయిష్ఠమైన బలహీనత, జాడ్యం, రోగాల్తో కూడిన విశేషాధికారం అంతమైపోవాలి. ఈ శరీర అంగాల ప్రజ్ఞాన సామర్థ్యం క్రియాశీలక కార్యాచరణ ప్రస్తుత పరిమితుల్ని దాటిపోవాలి. నూతన శక్తుల్ని వేటినైతే ప్రస్తుత మానవ జాతిలో సాక్షాత్కరించుకొనే ఆశ కూడా లేదో కలలోనైనా చూడాలనుకోదో - వాటిని ఊహించడం మాత్రం చేయగలదు - వాటిని ఈ శరీరం సముపార్జించుకోవాలి. ఇప్పుడే చాలా తెలియాల్సి ఉంది. పనిచేయాల్సి ఉంది. అది ఈ శరీరంలో వశించే ఆత్మ నేరుగా తన ఆధ్యాత్మిక శక్తితో లేదా నూతన శరీరం తన స్వయం శక్తితో కనుగొన్న పరికరాలు, యంత్రాంగం ద్వారా సాధించబడాలి. ఈ శరీరం స్వయంగా ఇతర శరీరాలతో సమాచార వినిమయం చేసుకోగల స్థాయిల్ని, నూతన సాధనాలను, జ్ఞానాన్ని సముపార్జించే క్రొత్త ప్రక్రియల్ని, కొత్త అనుభవాలను, తనను తన సాధనాలను మలిచే

నేర్పుగల ఊర్జాలను సముపార్జించుకోగలగాలి. శరీరానికి తన నిర్మాణ వ్యవస్థకు అనువైన సాధనాలను బహిర్గత పర్చడం, తనవిగా చేసుకోవడం, దూరాన్ని రద్దుచేసి, దూరాన్ని సమీపంగా మార్చడానికి కావాల్సిన సహజ ఉపకరణ అమరికను లేదా ద్రవ్యాన్ని ప్రస్తుత శరీర అనుభవానికి ఆవల వున్న దానిని చింతన చేయడం దాని పరిధిలో ప్రస్తుతం లేని కార్యాన్ని చేబూనడం, ప్రస్తుత భౌతిక చట్రాన్ని స్థిరీకరించి దానికనువైన పరిస్థితులకు లోబడి పనిచేయడానికి అనుమతింపబడని సూక్ష్మ శక్తులను, మృదు స్వీకరణ శక్తులను వృద్ధిపర్చుకోవడం ఈ శరీరానికి అసాధ్యం కాదు. ఈ శక్తులు ఇంకా అసంఖ్యాకమైన శక్తులు ప్రకటితం కాగలవు. మనం ఊహించడం మాత్రమే చేయగల ఒక అనూహ్య అపరిమిత స్థాయిలో పనిచేయగల పరికరంగా ఈ శరీరం కాగలదు. మొదటగా అవగతమౌతున్న సత్యచేతన నుండీ సర్వోన్నతాల వరకు ఈ పరిణామం ఉండగలదు. అది అతిమానస పొలిమేరలు దాటి దాని ఆదిస్థానమైన సమస్తాన్ని సృష్టించే మూలసారం, ప్రకాశమయ, మాధుర్యభరిత ఆనందం, తపస్సులో క్రియాశీలత, అస్తిత్వంలోని ఉన్నత సత్యానికి చెందిన లోకాలను శాసించే, వ్యవస్థీకరించే పరాత్పరుని సత్, చిత్, ఆనందాలను స్పృశించిన జీవరూపాల రేఖాకృతులను వృద్ధి చెందించడం మొదలు పెడుతుంది. భౌతిక రూపాంతరీకరణ ఈ నిరంతర ప్రగతిశీల మార్గాన్ని అనుసరించగలదు. ఆధ్యాత్మ స్వీయాభివ్యక్తీకరణ వైభవాన్ని మహోన్నత మహత్వాన్ని దివ్య శరీరం ఇక్కడ ఈ పృథ్విపై దివ్యజీవనంలో ప్రతిబింబింపజేయగలదు లేదా పునరుత్పాదన చేయగలదు.

*CWSA 13:556-57* *శ్రీ అరవిందులు*



శ్రీ అరవిందుని తత్త్వ దర్శనానికి ఒక సుదృఢ రూపాన్ని ఇచ్చే కార్యం శ్రీమాతకు అప్పగించబడింది. ఒక నూత్న ప్రపంచ సృష్టి, ఒక నూతన మానవ జాతిని, ఒక నూతన చేతనను ఆవిర్భవింప చేసే, అభివ్యక్తం చేసే కార్యానికి శ్రీమాత పూనుకొన్నారు. అసలు వస్తు స్వభావరీత్యానే అదొక సామూహిక ఆదర్శం కోసం సామూహిక కృషిని ఆహ్వానిస్తుంది. తద్వారా సమగ్ర మానవ పరిపూర్ణత్వం నిజీకరింపబడుతుంది.

శ్రీమాత ద్వారా ఈ ఆశ్రమ స్థాపన, నిర్మాణమన్నది ఈ లక్ష్యాన్ని నెరవేర్చుకొనే వైపుగా వేసిన మొదటి అడుగు. అరొవిల్లి పరియోజన రెండవ అడుగు. అది పూర్తిగా బాహ్యకార్యం. ఇది సామూహిక మానవజాతి జీవనం ఆత్మకు ప్రకృతికి, స్వర్గానికి భూమికి, శరీరానికి అంతరాత్మకు మధ్య సామరస్యాన్ని, సమన్వయాన్ని సుస్థాపించే ప్రయత్నపు ఆధారాన్ని విశాలపర్చడం కోసం సాధన చేస్తుంది.

---

*(మదర్ ఈ అంశాన్ని 1972లో మళ్ళీ చదివినప్పుడు 'పూర్తిగా బాహ్యకార్యం' అని ఆఖరి వాక్యంలో జోడించారు.)*

# మానవజాతి, నూతన సృష్టి

## అతిమానస ఓడ

నేనొక బ్రహ్మాండమయిన ఓడలో ఉన్నాను. అది జరుగనున్న మహా కార్యానికి ప్రాతినిధ్యం వహించే ప్రదేశం. ఈ ఓడ ఒక మహానగరమంత పెద్దది. చాలా కట్టుదిట్టంగా వ్యవస్థీకరించబడి కొంతకాలంగా ఖచ్చితంగా పనిచేస్తున్నది. ఎందుకంటే దాని వ్యవస్థ పరిపూర్ణంగా ఉంది. అతిమానస జీవనానికి చెందవలసిన వారక్కడ శిక్షణ పొందుతున్నారు. ఈ జనులు కనీసం వారిలో కొంత భాగం అతిమానస పరివర్తనను పొంది ఉన్నారు. ఆ నౌకతో సహా ఉన్నదంతా ఏదీ భౌతిక పదార్థం కానీ, సూక్ష్మ భౌతికం కానీ కాదు. ప్రాణికం లేదా మానసికం కాదు. అది అతిమానస పదార్థం. ఈ పదార్ధం చాలా భౌతికమయిన అతిమానస పదార్ధం. తొలుతగా ఆవిష్కరించబడిన ఈ భౌతిక జగత్తుకు అతిసన్నిహితమయిన అతిమానస పదార్ధం. ఆ కాంతి అరుణిమ స్వర్ణ వర్ణాల కలగలుపు. ఒక సమరూపమయిన ప్రకాశవంతమైన నారింజ రంగు. అంతా అలానే ఉంది. ఆ కాంతి అలా ఉంది. వ్యక్తులు అలానే ఉన్నారు. అన్నీ ఆ రంగులోనే ఉన్నాయి. విభిన్నమయిన రంగుమార్పు, కానీ వస్తువులు ఒకదాని నుండి ఒకటీ వేరుగా తెలుస్తున్నాయి. మొత్తంగా చూస్తే ఒక ఛాయారహిత ప్రపంచం. అక్కడ వర్ణవైవిధ్యం ఉంది గానీ నీడలు లేవు. అక్కడ వాతావరణం సంతోష భరితంగా నిశ్చలంగా క్రమబద్ధంగా ఉంది. అన్ని పనులూ చాలా సునాయాసంగా నిశ్శబ్దంగా జరిగిపోతున్నాయి. అదే సమయంలో విద్యావిధానం వివరాలు, అన్ని క్షేత్రాలలో వ్యక్తులు సంసిద్ధమవుతున్న శిక్షణని చూశాను.

ఈ మహత్తరమైన నౌక అతిమానస ప్రపంచం తీరానికి అప్పుడే వచ్చింది. అతిమానస ప్రపంచంలో భవిష్యత్తులో నివసించే మొదటి బృందం దిగి రాబోతున్నారు. తొలిసారిగా దిగిరావటానికి అన్ని ఏర్పాట్లు జరిగాయి. తెప్ప మీద చాలామంది దీర్ఘ శరీరులు నియమించబడ్డారు. మొదటి నుండి ఈ తతంగానికి మొత్తం బాధ్యతను నేనే వహించాను. అన్ని బృందాలని స్వయంగా సంసిద్ధం చేశాను. నేను ఆ ఓడ వంతెన మీద నిలబడి ఉన్నాను. ఆ బృందాలను ఒకరి తర్వాత ఒకరిని ముందుకు పిలుస్తూ వాళ్ళని ఒడ్డుకు చేరుస్తున్నాను.

అక్కడున్న దీర్ఘ శరీరులు వాళ్ళు దిగిరావటాన్ని చూస్తున్నారు. ఒడ్డుకు వెళ్ళటానికి సిద్ధంగా ఉన్న వాళ్ళని అనుమతిస్తూ సిద్ధంగా లేని వారిని నౌకపై ఇంకా శిక్షణను కొనసాగించవలసిన వారిని వెనుకకు పంపుతూ ఉన్నారు. అక్కడ నిలబడి అందరినీ చూస్తూ, ఇక్కడ నుండి వెళ్ళిన నా చైతన్య పార్శ్వం చాలా ఆసక్తికరంగా నిలిచి ఉండిపోయింది. నేను అందరినీ చూసి గుర్తించాలని అనుకున్నాను. వాళ్ళలా ఎలా మారిపోయారో చూడాలని అనుకున్నాను. ఎవరైతే వెంటనే అనుమతించబడ్డారో వారి గురించి తెలుసుకోవాలనుకున్నాను. ఎవరైతే శిక్షణ కొనసాగించడానికి ఆపివేయబడ్డారో వారిని చూడాలనుకున్నాను. నేనలా పరిశీలిస్తున్నప్పుడు కొంత సమయం తర్వాత, నన్నెవరో వెనుకకు లాగుతున్నట్లుగా అనిపించింది. నా శరీరాన్ని ఒక చైతన్యమో, లేక మరెవరో తట్టి లేపుతున్నట్లుగా అనిపించింది. నేను ప్రతిఘటించాను. 'అపుడే కాదు, అపుడే కాదు'. అక్కడెవరున్నారో నేను చూడాలి. నేను దానినంతటినీ చూస్తూ, అందులో నిమగ్నమయిపోయి చాలా ఆసక్తిగా గమనిస్తున్నాను. అది అలా జరుగుతూ వుంది. అకస్మాత్తుగా గడియారం యిక్కడ మూడు గంటలు కొట్టింది. అది నన్ను బలవంతంగా వెనక్కి తీసుకువచ్చింది. అకస్మాత్తుగా శరీరంలోకి వచ్చిపడిన భావన కలిగింది. అలా అకస్మాత్తగా వెనుకకి పిలవబడడం వలన నిర్ఘాంతపోయి వెనుకకు వచ్చాను. నా జ్ఞాపకాలు పదిలంగా ఉన్నాయి. నేను ఆ అనుభవాన్ని పూర్తిగా స్మరణకు తెచ్చుకొని, పదిలపరచుకునే వరకూ నేను కొంత సేపు నిశ్శబ్దంగా, నిశ్చలంగా ఉండిపోయాను.

ఈ నౌక మీద వున్న వ్యక్తుల స్వభావం మనకు భూమిమీద తెలిసిన వాటిలా లేదు. ఇక్కడ వస్త్రాలు వస్త్రంతో తయారుచేయబడలేదు. అది శరీరంలో ఒక భాగమే. వివిధ రూపాలను తీసుకున్న ఒకే పదార్థం. దానికొక విధమైన నమనీయత ఉంది. ఏదైనా మార్పుచేయవలసినపుడు అది బాహ్యమైన, కృత్రిమమైన పద్ధతులలో చైతన్యం యొక్క అంతర కార్యం చేయబడుతుంది. ఏదైతే ఆ పదార్థానికొక రూపాన్ని, గోచరత్వాన్ని యిస్తుందో, ఆ జీవశక్తి తన స్వీయ రూపాలను రూపొందిస్తుంది. అన్ని వస్తువులలో ఒకే ఒక పదార్థం ఉంటుంది. అవసరాన్ని, ఉపయోగాన్ని బట్టి దాని ప్రకంపన స్వభావాన్ని మారుస్తుంది. వెనుకకు శిక్షణకు పంపబడిన వారు ఒకే విధమైన వర్ణాన్ని కలిగి లేరు. వారి శరీరాలలో అక్కడక్కడ గౌర వర్ణపు మచ్చలున్నాయి. పృథ్వీతత్వాన్ని పోలిన ఒక పదార్థం. వాళ్ళు కళావిహీనంగా, పూర్తిగా కాంతి

చొరనట్లుగా, పరిపూర్ణంగా పరివర్తన చెందనట్లుగా ఉన్నారు. అలా అని మొత్తం ఒకేలా లేరు. కొన్ని ప్రదేశాలలో మాత్రమే అలాఉన్నారు. తీరంపై ఉన్న పొడగరి వ్యక్తులకి ఈ రంగులేదు. కనీసం ఈ నారింజ రంగు లేదు. వాళ్ళు మరింత పాలిపోయినట్లుగా మరింత పాలిపోయి ఉన్నారు. శరీరంలో కొంతభాగం తప్ప మిగిలినదంతా కేవలం ఒక రేఖాచిత్రంగా కనిపిస్తుంది. వాళ్ళు చాలా పొడుగ్గా ఉన్నారు. వాళ్ళకి లోపల అస్థిపంజరం ఉన్నట్లు లేదు. వాళ్ళు అవసరాన్ని బట్టి ఏ ఆకారం కావాలంటే ఆ ఆకారం తీసుకోగలుగుతున్నారు. వాళ్ళు నడుము నుండి పాదాల వరకు మాత్రమే శాశ్వతమైన సాంద్రతను కలిగి ఉన్నారు. మిగిలిన శరీరాలలో అది లేదు. వాళ్ళ శరీర ఛాయ పాలిపోయినట్లుగా చాలా తక్కువ అరుణ వర్ణాన్ని కలిగి స్వర్ణ శ్వేత వర్ణాలతో ఉంది. వారి నుండి వస్తున్న తెల్లని కాంతి పూర్తిగా పారదర్శకంగా లేదు. కానీ తక్కువ సాంద్రతతో, నారింజ రంగు కన్నా మరింత సూక్ష్మంగా ఉంది.

నన్ను వెనుకకు పిలిచినపుడు, నేను 'అప్పుడే కాదు' అంటున్నపుడు తక్షణం నన్ను నేను చూసుకున్నాను. అతిమానస ప్రపంచంలో నా రూపం కనిపించింది. అది ఈ దీర్ఘ శరీరులకీ ఓడలో ఉన్నవారికీ మధ్యస్థంగా ఉంది. శరీరం పైభాగం ముఖ్యంగా నా శిరస్సు కేవలం నారింజరంగు అంచు వున్న శ్వేతవర్ణంలో ఒక రేఖా చిత్రంలా ఉంది. పాదాలవైపు వెళుతుంటే ఓడలో ఉన్నవారి శరీర వర్ణంలా ఉంది. నారింజ రంగు అంచువున్న శ్వేతవర్ణంలో ఒక రేఖాచిత్రంలా ఉంది. నారింజ రంగులో, పైకి వెళ్ళేకొద్దీ మరింత పారదర్శకంగా శ్వేతవర్ణంలో పాక్షిక పారదర్శకత మాత్రమే కలిగి ఉంది. ఎరుపురంగు వెలసిపోయింది. శిరస్సు కేవలం రేఖారూపంగా దాని కేంద్రంలో ప్రకాశవంతమయిన సూర్యునితో ఉంది. దాని నుండి సంకల్ప కిరణాలు వెలువడుతున్నాయి.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ ఫిబ్రవరి 3, 1958*

## మన ప్రపంచానికీ అతిమానస జగత్తుకూ మధ్య వ్యత్యాసం

ఒక విషయం మీకు నేను నొక్కి చెబుదామనుకుంటున్నాను. అది మన ప్రపంచానికీ, అతి మానస ప్రపంచానికీ మధ్య వున్న ముఖ్యమయిన వ్యత్యాసం. చైతన్యవంతంగా అక్కడికి వెళ్ళాకే నాకు ఆ తేడా ఎంతో అపారమైనదని తెలిసింది. ఆంతరంగికంగా చాలా లోతులో జరిగేది తప్ప మిగిలినదంతా

యెక్కడ నాకు చాలా కృత్రిమంగా అనిపించింది. సాధారణ భౌతిక జీవనం యొక్క ఏ ఒక విలువ కూడా సత్యంపై ఆధారపడి లేదు. మనలను అలంకరించుకోవడానికి వస్త్రం కొని దానిని కుట్టి ధరించినట్లుగా మనం వస్తువులను బయట నుండి తీసుకొని మనలను పోషించుకోవటానికి మన శరీరంలో ఉంచుకోవాలి. మన జీవితంలో ప్రతీదీ కృత్రిమమే.

అతిమానస ప్రపంచంలోలా ఒక సత్యమయిన నిజాయితీతో కూడిన యాదృచ్ఛికమయిన జీవనం చైతన్యవంతమయిన సంకల్పం నుండి విషయాలు వెడలి వస్తాయి. పదార్థంపై ఒక శక్తి పనిచేసి మనం నిర్ణయించి నట్లుగా ఈ పదార్థాన్ని రూపుదిద్దుతుంది. ఈ శక్తి, ఎరుక ఉన్నవ్యక్తి తనకేది కావాలో దానిని పొందగలడు. అంతేకానీ తను కావాలనుకున్న దానిని కృత్రిమ సాధనాలతో పొందలేడు.

సాధారణ జీవితంలో అంతా కృత్రిమమే. మీరు జన్మించిన పరిస్థితులు, అవకాశాలను బట్టి మీకొక ఉన్నత స్థానమో, ఒక సౌకర్యవంతమైన జీవనమో ఉండవచ్చు. కానీ అది యాదృచ్ఛికం. సహజం, మీ ఉనికి యొక్క నిజాయితీ అయిన వ్యక్తీకరణ మీ అవసరం ఎందుకంటే జీవితంలో అదృష్టం మిమ్మల్ని ఈ విషయాల సంసర్గంలో ఉంచింది. ఏ మాత్రం పనికిరాని వ్యక్తి ఒక ఉన్నత స్థానంలో ఉండవచ్చు చాలా అద్భుతమైన సృజన మరియు సామర్థ్యాలు కలిగిన వ్యక్తి ఒక నిమ్నతర, పరిమిత స్థాయిలో ఉండిపోవచ్చు. కానీ ప్రపంచం నిజాయితీగా ఉంటే అతను సంపూర్ణంగా ఉపయుక్తమౌతాడు.

ఈ కృత్రిమత్వం, ఈ కపటత్వం పూర్తిగా సత్యం లోపించడం (నేను చాలా విస్తుపోయాను) నాకు చాలా ఆశ్చర్యకరంగా అనిపించింది. ఇంత బూటకమయిన ప్రపంచంలో విషయాలను ఎలా సత్యవంతంగా అంచనా వేయగలం?

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ ఫిబ్రవరి **3, 1958***

## మానవత ఆవరణలు మరియు అతిమానస సృష్టి

ఉదయం నుండి సాయంకాలం వరకూ శ్రీ అరవిందులు అక్కడే ఉన్నారు. ఒక గంటపైన ఆయన నన్ను ఒక వాస్తవమైన మానవతా స్థితి యొక్క సజీవమైన దర్శనంలో ఉంచారు, అది అతిమానస సృష్టికి వివిధ మానవతా

పొరలలో, అది ఎంతో అద్భుతంగా, స్పష్టంగా, యథార్థంగా, సజీవంగా ఉంది. అక్కడ పాశవికత లేని మానవత మానసిక ప్రగతితో ప్రయోజనం పొంది, జీవితంలో సామరస్యతను సృజిస్తుంది. కీలకము, కళాత్మకము, కవితాత్మకమైన ఒక సామరస్యత - దేనితో అయితే అధికశాతం జనులు జీవించడంలో తృప్తి చెందుతారో వాళ్ళొక విధమైన సామరస్యతను ఒడిసి పట్టుకొని, ఒక నాగరికమైన పరిస్థితులలో, సాంస్కృతికంగా జీవించినట్లుగా సంస్కారవంతమైన అభిరుచులతో, అలవాట్లతో జీవిస్తారు. ఈ జీవితంలో నిర్దిష్టమైన సౌందర్యముంటుంది. ఏదైనా ఉపద్రవం జరిగితే తప్ప వాళ్ళు ఆనందంగా తృప్తిగా జీవించేస్తారు. (ఎందుకంటే ఈ వ్యక్తులకొక అభిరుచి ఉంటుంది. మేధాపరంగా పరిణితి చెంది ఉండటం వలన) వాళ్ళు నూతన శక్తులచే భవిష్య జీవనంచే ఆకర్షించబడి ఉదాహరణకి వాళ్ళు మానసికంగా, మేధాపరంగా శ్రీ అరవిందులకు శిష్యులు కావచ్చు. కానీ భౌతికంగా మార్పు చెందవలసిన అవసరాన్ని వాళ్ళు ఏ మాత్రం అనుభూతి చెందక పోవచ్చు. ఒకవేళ వాళ్ళు కావాలని ఒత్తిడి చేయబడితే, అన్నిటికన్నా ప్రథమంగా అది అపరిపక్వమూ, అన్యాయమూ అయి ఎంతో అస్తవ్యస్తతను కలిగించి వారి జీవితాలలో పూర్తిగా అనవసరంగా కలకలం సృష్టిస్తుంది.

ఇది చాలా స్పష్టం. అప్పుడు అక్కడ చాలా అరుదైన వ్యక్తులుంటారు. పరిణామానికై సంసిద్ధం కావటానికి కావలసిన ప్రయత్నం చేయటానికి సుముఖంగా ఉండి నూతన శక్తులను చేరుకోగలవారు పదార్థాన్ని అన్వయించుకోవటానికి ప్రయత్నించగలవారు, వ్యక్తీకరణలో మార్గాలను అన్వేషించగలవారు - వీరు శ్రీ అరవిందుల యోగానికి సంసిద్ధంగా ఉన్నవారు. వారు అతి తక్కువ సంఖ్యలో ఉంటారు. వారిలో కొందరు ఎటువంటి త్యాగమయినా చేయగలరు. ఎంత కష్టతరమూ బాధాకరమైన జీవితాన్నయినా ఎదుర్కోవటానికి సంసిద్ధంగా ఉంటారు. అటువంటి జీవితం ఈ భవిష్య పరిణామానికి సరిపడుతుందనుకొన్నా వాళ్ళు ఏ విధంగానూ ఇతరులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించకూడదు. వారి ప్రయత్నంలో భాగస్వాములను చేయకూడదు. అది పూర్తిగా అసమంజసమే కాక, అసమర్థత కూడ అవుతుంది. ఎందుకంటే అది విశ్వజనీనమయిన లయను గమనాన్ని మారుస్తుంది. కనీసం పృథ్వి గమనాన్నయినా మారుస్తుంది. సహాయం

చేయటానికి బదులు, అది విభేదాలను సృజించి అయోమయంగా ముగుస్తుంది.

కానీ అది ఎంత సజీవంగా ఎంత వాస్తవంగా ఉందంటే నా వైఖరి ఎలా చెప్పను? ఉదాసీనం కాక ఒక క్రియాత్మకమైన సంకల్పం యొక్క ఫలితం కావాలి. అందువలన చేసే పనిలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అది చాలా ప్రశాంతతను తీసుకు వచ్చింది. ఒక శాంతి, నిశ్చలత, విశ్వాసం ఏదయితే పూర్తిగా నిశ్చయాత్మకమో దానిని ఇచ్చింది. ఒక నిశ్చయమైన మార్పు అందుకు ముందు ఉన్నస్థితిలో ఏదయితే మొండితనం, అస్తవ్యస్తత, అచేతన, అన్ని రకాలైన చింతించదగిన విషయాలు - అన్నీ అదృశ్యమైపోయాయి. అది ఒక మహత్తరమైన విశ్వజనీన లయ - ఎందులో అయితే అన్ని తమ తమ స్థానాలను తీసుకుంటాయో - ప్రతి విషయం బాగానే ఉంటుంది. పరిమితమైన సంఖ్యలో ఉన్నప్పుడు పరివర్తన కోసంచేసే కృషి మరింత అపురూపము, సిద్ధి పొందడానికి మరింత శక్తివంతం అవుతుంది. నూతన సృష్టి వైతాళికులకిది మంచి ఎంపిక అవుతుంది. ~~ఈ~~ ప్రచారం చేయడం, సంసిద్ధం కావటం, లేదా పదార్థాన్ని మథించటం అనే భావనలన్నీ బాల్య చేష్టలలా ఉంటాయి. అది కేవలం మానవీయ అసహనత.

ఆ దర్శనం ఎంతో ఉన్నతంగా సుందరంగా ఉండి, చాలా నిశ్చలంగా, ఆనందంగా ఉంది. అది దివ్యప్రేమభరితంగా ఉంది. క్షమించే దివ్య ప్రేమ కాదు - అసలు కాదు. కానే కాదు. ప్రతీదీ తమ సముచిత స్థానంలో తమలోని అంతర లయను పరిపూర్ణంగా సిద్ధింపచేసుకుంటుంది.

*CWM 11:24-25*

## అతిమానసం ప్రభావంలో మానవజాతి

అది మొక్కలు వాటి స్వచ్ఛందమైన సౌందర్యం యొక్క దర్శనం తరువాత వచ్చింది (అది చాలా అద్భుతంగా ఉంది), తరువాత జంతువులు అవి చాలా సామరస్యపూరిత జీవితాన్ని కలిగి ఉన్నాయి (మనుషులు అందులో కలగచేసుకోనంతవరకు) అంతాసరైన స్థానంలో ఉంది అప్పుడు మానవాళి అసలైన మానవాళిగా వారి మానసిక ప్రశాంతత యొక్క అత్యుత్తమ స్థాయిలోనుండి సృష్టించబడిన సౌందర్యం, సామరస్యత, మనోహరమైన ఆకర్షణ, మనోజ్ఞత, జీవితంపట్ల అభిరుచి. సౌందర్యంలో జీవించడంలో

అభిరుచివలన సహజంగానే అసభ్యమైనది వికారమైనది అణచివేయబడింది. అది ఒక అత్యుత్తమ మానవాళి - తన అత్యున్నత స్థాయిలో ఉంది, చాలా బాగుంది. తమ మానవస్థితి పట్ల సంతృప్తిని కలిగి సామరస్యతలో జీవిస్తున్నది గనుక అది ఒక కొత్త సృష్టి యొక్క ప్రభావంలోకి సర్వ మానవాళి ఎలా పురోగమిస్తోందో తెలిపే ఒక వాగ్దానంలా ఉంది. అప్పుడు అతిమానస చైతన్యం మానవజాతిని ఎలా మార్చగలదో అనేది నాకు కనిపించింది. అది జంతు జాతులతో పోల్చినప్పుడు మానవుని స్థితి ఎలావున్నదో అలా ఉంటుంది. అది చాలా వరకు కలగలిసిపోయిఉంది, సహజంగానే చాలా విషయాలు మెరుగై ఇంకా సంపూర్ణంగా వినియోగించబడి పరిపూర్ణత సాధించాయి. జంతుప్రవృత్తి మనస్సు ప్రభావానికి లోబడి పూర్తిగా ఇంకొక విధంగా కలగలుపుగా తయారయ్యింది. అదేవిధంగా సామరస్యత సాధించిన మానవజాతికి చెందిన ఉదాహరణలు కొన్ని సమతుల్యత సాధించిన మనుషులలో మనం చూడవచ్చు. అది భవిష్యత్తులో అతిమానస ప్రభావంతో మానవ జాతి ఎలావుంటుందో చూపుతుంది. అయితే అది ఇంకా చాలా అభివృద్ధి చెందిన స్థాయి.

అది ఇప్పుడే సాధ్యం అని మనం అనుకోరాదు. అది ఇంకా చాలా దూరంలో ఉన్నది.

ఇప్పుడున్నది సుస్పష్టంగా ఒక మధ్యంతర స్థితి. ఇది ఇంకా చాలా సమయం కొనసాగవచ్చు, ఇంకా బాధాకరంగా కూడా ఉండవచ్చు. ఎంత ప్రయత్నం చేసినా అంతగా బాధాకరంగా ఉన్నప్పటికీ సాధించాల్సిన లక్ష్యానికి చెందిన స్పష్టమైన దర్శనంతో అది పరిపూర్తి చేయబడుతుంది, ఆ లక్ష్యం సాధించబడుతుంది అనేందుకు ఖచ్చితమైన హామీగా అది ఉంటుంది. అయితే అది పొరపాటు జరిగే అవకాశాన్ని పూర్తిగా తొలగించి, మానసిక స్థాయిలోని జీవితంలోని వైకల్యమంతా, వికారమంతా పూర్తిగా తొలగి ఒక అత్యంత ఆనందంతో నిండిన ఒక మానవజాతి, తమ మానవ స్థితి పట్ల అత్యంత సంతృప్తి కలిగి వారికి కావాల్సిన దానికంటే మరేదైనా కోరవలసిన ఆవశ్యకత లేక కేవలం తమ మానవ సౌందర్యంతో సామరస్యంతో సంతృప్తిచెంది ఉంటుంది.

*CWM 11:25-26*

## ఒక ఉన్నతమైన మానవాళి

నేను చూస్తూవచ్చాను, నేను దానిని చాలా నిర్దిష్టంగా చూశాను. ఎవరైతే రూపాంతరీకరణను సంసిద్ధం చేయడానికి అతిమానసాన్ని సాధించడానికి తయారుగా ఉన్నారో (వారి సంఖ్య చాలా పరిమితం) వారిని పక్కన పెడితే, సాధారణ మానవాళిలో ఇంకా ఇంకా ఉన్నతమైన మానవజాతి అభివృద్ధి చెందవలసి ఉంది. అది భవిష్యత్తులో వచ్చే అతిమానస ఉనికి పట్ల ఇప్పటి మానవుల దృష్టి, ఉదాహరణకు మానవుల పట్ల జంతుజాతికున్న దృష్టే దానికి ఉంటుంది. ఎవరైతే రూపాంతరీకరణకు పనిచేస్తున్నారో వారితోపాటు అందుకు సిద్ధంగాఉన్న ఉన్నత మానవజాతి కూడా ఉండాలి. ఒక మధ్యంతరమైన జాతి, వారిలో కానీ, జీవితంలో కానీ, జీవితంతో సామరస్యత చెందినదై ఉండాలి. ఇంకా తమకంటే అత్యంత ఉన్నతమైన ఒక దానిపట్ల అదే ఆరాధ్యభావన, భక్తి, విశ్వాసంతో నిండిన సమర్పణ, దానిని పొందడానికి ప్రయత్నం చేయక, కేవలం దానిని ఆరాధిస్తూ, దాని ప్రభావ అవసరాన్ని అనుభూతి చెందుతూ, దాని రక్షణకై, దాని ప్రభావంలో జీవించే ఆవశ్యకత కలదై, దాని రక్షణలో ఉండడంలోని ఆనందంతో ఉండాలి. ఇదంతా చాలా స్పష్టంగా ఉంది. కానీ ఈ వేదన కాదు, ఏదో కోరుకోవడంలోని బాధ దుఃఖం, అది పొందడం నీ విధిలో లేదని తెలిసికూడా, ఇంకా అందుకు ఆవశ్యకమైన రూపాంతరీకరణ నీ జీవితంలో ఇంకా అసంపూర్ణంగానే ఉంది గనకఈ దుఃఖం, గందరగోళ పరిస్థితి సృష్టించబడింది. ఉదాహరణకు ఒకానొక ప్రధానమైన సమస్యని తీసుకుంటే మానవజాతికి సహజమైన, స్వచ్ఛందమైన, చెప్పాలంటే న్యాయమైన లైంగిక భావన, సహజంగానే స్వచ్ఛందంగానే జంతుప్రవృత్తితో పాటు అదృశ్యం అవుతుంది. ఇంకా చాలా విషయాలు అదృశ్యం అవుతాయి, ఉదాహరణకు ఇప్పుడు ఉన్నట్టుగా తిండి నిద్రల అవసరం ఉండదు. లైంగికమైన పద్ధతిలో పునరుత్పత్తి జరగాల్సిన అవసరం లేనప్పుడు మన (పరమానందం అనేది పెద్ద మాట) ఆనందానికి సంతోషానికి ఒక ప్రధానమైన స్రోతస్సుగా ఉన్న లైంగికచర్యతో అసలు అవసరంలేని విధంగా ప్రకృతి పనిచేస్తుంది. అందువల్ల జీవితంలోని ఆనందాన్ని పొందే సమర్థత ఒక మెట్టు పైకి వెళ్తుంది లేదా ఇంకో విధంగా మార్పు చెందుతుంది. అయితే సనాతన ఆధ్యాత్మిక సాధకులు లైంగిక ప్రవృత్తిని వ్యతిరేకించారు.

అది అర్థంలేనిది, ఎవరైతే ఈ స్థాయిని మించి వెళ్లారో వారికే అది సాధ్యం, అప్పుడు అందులో జంతుప్రవృత్తి ఇక ఏమాత్రం ఉండదు. అది సహజంగానే పడిపోవాలి, ఎటువంటి ప్రయత్నం ప్రయాస లేకుండా. దానిని ఒక ఘర్షణకు ప్రయాసకు కేంద్రంగా చేసుకొని ఉండడం మూర్ఖత్వం. ఎప్పుడైతే చైతన్యం మానవస్థాయినుండి బయటపడుతుందో ఇటువంటి ప్రవృత్తి సహజంగానే అంతరించిపోతుంది. ఇక్కడ కూడా ఒక సంక్లిష్టమైన మధ్యంతర మార్పు జరగవలసి ఉంది. ఎందుకంటే మార్పు చెందుతున్న జీవులు ఒక అస్థిరమైన సమతాస్థితిలో ఉన్నారు, అయితే వారి అంతరంగంలో ఒక జ్యోతి దానిని బాధగా కానీయని ఒక అవసరం ఉంది. అది బాధతో కూడిన ప్రయత్నం కాదు, అది చిరునవ్వుతో చేసేది. ఎవరైతే దానికి సిద్ధంగా లేరో (ఆ స్థాయిలో లేరో) వారిపై దీనిని రుద్దడం అర్థంలేని పని.

అది చాలా సాధారణ విషయం, వారంతా మానవులే అన్న విషయం గుర్తుంచుకోవాలి, మానవాతీతులుగా మారినట్టు నటించకూడదు.

ఎప్పుడైతే స్వచ్ఛందంగా ఆ మానసిక ప్రేరణను తొలగించుకోలేక పోతున్నావో అప్పుడే అది బాధాకరంగా ఉంటుంది, అయితే నీ లోతైన ఆంతరంగిక అవసరానికి అదివిరుద్ధంగా ఉన్నప్పుడు అది సులభం అవుతుంది. అప్పుడు నీ బయట సంబంధాలని తెంచుకుంటే ఇక అది అక్కడితో అంతమైనట్టే.

ఇదే అన్నిటికంటే గట్టిగా ఒప్పించగలిగే ఉదాహరణ.

ఆహారం విషయంలో కూడా అంతే. జంతు ప్రవృత్తి అంతమైనప్పుడు ఆహారం తీసుకోవడం అనే ఆవశ్యకత పూర్తిగా తొలగిపోతుంది. అప్పుడు మధ్యంతర స్థితిలో కొంత అతి తక్కువ మోతాదులో శుద్ధ భౌతికమైన ఆహారాన్ని తీసుకోవచ్చు అంటే పుష్పాలను వాసన చూసినా కూడా కావాల్సిన పోషణ లభిస్తుంది. అత్యంత సూక్ష్మమైన పద్ధతిలో పోషణ పొందగలిగే విధానాన్ని నేను చూశాను.

*CWM 11:27-29*

**Vol. 54, No. 6**
**June 2024**

Date of Publication:
1st June 2024

TN/PMG (CCR)/ WPP 473/24-26
Registered: PY/41/2024-26

## AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

*Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo*



**Flower: New Creation**

*Strong, lasting and fragrant, it rises straight towards the sky.*

*(Spiritual name and significance of the flower given by the Mother)*

*Botanical name:* Polianthes tuberosa

**Cover page painting:**

Ritam Upadhyay

*Owner:* Sri Aurobindo Society
*Printer:* Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
*Publisher:* Pradeep Narang for Sri Aurobindo Society
*Published from:* Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
*Printed from:* Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

---

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001



# అఖిల

అఖిల భారత పత్రిక

జూలై 2024

## సారళ్యత

# విషయ సూచిక





# సంపాదకీయం

సారళ్యతలో గొప్ప సౌందర్యం ఉంది. ప్రకృతి తొలి సృష్టులలో దీనిని స్పష్టంగా చూడగలం. మానసీకరించబడిన మనిషి రాకతో, పరిణామాలు అధికాధికంగా సంక్లిష్టతలోనికి ప్రవేశించినందున ఈ సారళ్యత అంతులేని మానవ అజ్ఞాన సంక్లిష్ట చిక్కులో చిక్కుపడి కన్పించకుండా పోయింది. మానవ పరిణామ క్లిష్ట పరివర్తనా దశలో నిలబడి వున్నాం. ఈ సమయంలోనే ఈ అపరిమేయ సంక్లిష్టత ఒక దివ్య సరళత్వానికి దారివ్వాలి. ఈ ముఖ్య కాని అరుదైన లక్షణానికి ఈ సంచిక అంకితం అయ్యింది.

*అనువాదం : కె.వి. రావు*



ఒక అభివ్యక్తి నుండి ఎప్పుడయితే కృషి అంతరిస్తుందో అప్పుడది చాలా సరళం అయిపోతుంది. ఒక పుష్పం సాదాసీదాగా వికసించి తన సౌందర్యాన్ని అభివ్యక్తం చేసి తన పరిమళాన్ని ఏ మాత్రం దర్పం, ఆర్భాటం లేకుండా సరళంగా వెదజల్లుతుంది. ఈ సరళత్వంలోనే మహత్తరమయిన శక్తి ఉంది. ఆ శక్తి మిశ్రమం కానిది, అపకార ప్రతిక్రియలను తలెత్తనీయనిది. ప్రాణిక శక్తిని నమ్మకూడదు. కర్మ మార్గంలో అది ప్రలోభపెడుతూ ఉంటుంది. దాని ఉచ్చులో పడిపోయే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. ఎందుకంటే అది సత్వర ఫలిత రుచిని చూపిస్తుంది. మనం పనిని బాగా చేయాలనే మొదటి ఆత్రుతలో ప్రాణిక శక్తిని వినియోగించుకోవాలనే మాయలో పడిపోతాం. కాని చాలా త్వరలో ఇది మన కార్యాన్ని సరైన మార్గం నుండి మళ్ళించి, మన పనిలో ఒక భ్రమ, మృత్యు బీజాన్ని ప్రవేశపెడుతుంది.

సరళత ! సరళత! నీ సన్నిధి పవిత్రత ఎంత మధురం?

*CWM 1:17* — *శ్రీమాత*

# సారళ్యత ఒక దివ్యగుణం

## నిజమైన ఆధ్యాత్మికత

"ఆధ్యాత్మిక అనుభవాలను" తెలియజేస్తూ నాకు ఒక పదిపేజీల ఉత్తరాలు వస్తుంటాయి. సంపూర్ణంగా ప్రాణిక చేతనలోని వారొక విషయాన్నర్థం చేసుకోలేదు. అరొవిల్లిలో కూడా అంతే. వారికేం అర్థం కాదు.

అందుకని నేను వ్రాశాను (శ్రీమాత గుర్తు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తారు) నేనేమి వ్రాశానంటే... నాకు గుర్తులేదు. నిజమైన ఆధ్యాత్మికత... అంటే సరళతలో నిజమైన ఆధ్యాత్మికత అంటాను. పెద్ద పెద్ద అక్షరాలలో నేను నిజమైన "ఆధ్యాత్మికత" చాలా సరళం అని వ్రాసి ఉండవలసింది (శ్రీమాత నవ్వుతారు) అది మరింత మెరుగ్గా ఉంది.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ, మార్చి 6, 1971*

## దైవపు సర్వశక్తిమంతత్వం

దైవ సర్వశక్తిమంతతను గురించిన మానవభావన, లయ, హేతుబద్ధత లేకుండా, ఎంతో పాతవైన చిత్తచాపల్యాల పరంపర ద్వారా పనిచేసే సర్వశక్తిమంతత అనేది అని ~~ఈ~~ గత కొద్దిరోజులుగా (అన్ని రకాల విషయాల వల్ల - అంటే జనం, సంభవించే సంఘటనలను) ఎక్కువగా చూస్తూ ఉండిన విషయం. ఇష్టానుసారం అత్యంత బుద్ధి తక్కువ పనులు చేయగల సామర్థ్యం అని భావిస్తారు.

స్పష్టంగా అది ఒక ఉన్నత సామరస్యతకు అనుగుణమైనది కాదు! అయినప్పటికీ మానవులు అలానే ఉంటారు. వాళ్ళు ఆరాధించే లేదా అభివ్యక్తం కావాలని వాళ్ళు కోరుకున్న దైవం, అర్థం పర్థం లేకుండా నిర్హేతుకంగా, వాళ్ళు అనుకున్న విధంగా చేయకపోతే ఆ దైవానికి ఏ మాత్రం శక్తి లేనట్లే అని భావిస్తారు.

మీకు సులభంగా అర్థం కావటానికి నేను కొంత ఎక్కువ చేసి చెపుతున్నాను అది అలా కాదు. వాళ్ళు తమను తాము వంచించుకుంటారు (అలా వాళ్ళకు చెబితే నిరసిస్తారు) కానీ వాళ్ళు తమను తాము మోసగించుకొని నేను చెప్పిన స్థితికి దిగజారిపోతారు.

మీరా సామరస్య చేతనలోనికి ప్రవేశించడంలో కృతకృత్యులయితే (వ్యక్తిగతమూ, ప్రాంతీయమూ కాని సామరస్యత) ఒక విశ్వజనీనమైన సామరస్యత, ఇంకా విశ్వాతీతమయినది, ఎందులో అయితే ఈ విశ్వం కేవలం ఒక భాగమయి ఉంటుందో, నీకు అప్పుడీ విలువలన్నీ పూర్తిగా మారిపోతాయి.

విషయాలన్నీ చాలా సరళంగా అనిపించినా అదే సమయంలో అవి చాలా సంక్లిష్టం కూడా.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ, జూలై 5, 1967*

## నిజాయితీ, నిరాడంబరత

ఒక పసిపిల్లవాడి వచ్చీరాని మాటల్లా ఉంటుందది. ఎందుకంటే ఈ ప్రస్తుత అనుభవాల వ్యక్తీకరణ మేధాపరమైనది అసలు కాదు. అది జీవ కణాల, అత్యంత పదార్థ రూపపు అనుభవమని అర్థం చేసుకోలేని వారికి అర్థంలేని పసిపిల్లల మాటలలాగానే ఉంటుంది. ఒక పసివాడికి కలిగే అనుభవంలా. ఏ విధమైన మేధాపరమైన సంక్లిష్టతలూ, వివరణలూ లేకుండా ఉంటుంది.

ఈ సరళత, సంక్లిష్టతా, ఆడంబరతా లోపం, ఈ విషయాలకొక మహత్తరమైన విలువను ఇస్తుంది. వాటికొక పరిపూర్ణమైన నిజాయితీని సరళత్వాన్ని ఇస్తుంది. మానసికంగా, ప్రాణికంగా, మేధాపరంగా వ్యక్తీకరించ బడిన దానిలో ఆ అనుభవం కన్నా రూపంలో, పదాలలో వ్యక్తీకరణలో అధికంగా ఉంటుంది. అది విశాలమౌతుంది. సమగ్రం అవుతుంది. చెప్పినది చెప్పవలసిన దానిని మించి ఉంటుంది. ఇక్కడ అది పరిపూర్ణమయిన స్వచ్ఛమయిన అనుభవం. దేనికయితే మాటలు ఒక క్షీణత, కుచించుకుపోవడంలా అనిపిస్తూ, అదే సమయంలో ఆ అనుభవంలో సహజంగా లేని ఒక సంక్లిష్టతను తీసుకురావడం అనిపిస్తుంది. అనుభవం చాలా సరళమయినది. చాలా సరళం, నిజంగా స్వచ్ఛమయినది ఒక వ్యక్తి ఏమి చెప్పినా దాని స్వచ్ఛతను, సరళత్వాన్ని తగ్గించిన దానిని జోడించినట్లవుతుంది.

ఈ విషయాలు చెప్పే వ్యక్తికి మంచిదే. ఎవరైతే అదే విధమయిన "హృదయ స్థితిలో"ఉంటారో వారికి మాత్రమే మంచిది. కానీ జనులకు కాదు. (శ్రీమాత తలను ఊపుతారు) అది అర్థంకాని విషయంగా ముగిసిపోతుంది.

# దివ్య నిరాడంబరత అవసరం

సృష్టి యొక్క ఒక పార్శ్వం వుంది (చాలా అధునాతన పార్శ్వం అయి ఉండవచ్చు) అది అసామరస్యత, అయోమయతలకు సంబంధించిన అస్తవ్యస్థత, అయోమయం నుండి బయటకు రావలసిన అవసరం. ఒక అయోమయం, గందరగోళం, సమస్త రూపాలను ధరించి, ఘర్షణలుగా పసలేని ప్రయత్నంగా, వ్యర్థమైన శక్తిగా మారుతుంది. అది మీరు ఏ స్థాయిలో నిలబడి ఉన్నారనే దానిపై ఆధారపడి ఉంటుంది. కాని భౌతికంగా క్రియా రూపంలో అది అనవసరమైన సమస్యలు, సంక్లిష్టతలూ, వస్తువులు మరియు శక్తి, సమయం వ్యర్థం కావటం, అవగాహన లేకపోవటం, అపార్థం, అయోమయం, అస్తవ్యస్థత - దానినే ప్రాచీన కాలంలో వేదాలలో వికృతము, కుటిలము అని చెప్పారు. (దానికి ఫ్రెంచి పదం నాకు తెలియదు) సూటిగా గమ్యం వైపు దూసుకుపోకుండా అది వక్రంగా అనవసరమైన వంకర టింకర దారిలో వెళు తుంది. స్వచ్ఛమైన దివ్య కార్యపు సామరస్యతకు ఆ విషయాలు చాలా దూరం. చాలా సరళంగా ఒక పిల్లల ఆటలో బాలక్రీడలా కనిపిస్తుంది. మరియు సూటిగా అర్థంలేని, ఉపయోగం లేని మలుపులు, వంకరలు, మడతలు లేకుండా తిన్నగా ఉంటుంది. అవును అది స్పష్టంగా అదే సులభ గ్రాహ్య విషయం. ఆ అస్తవ్యస్థత స్వచ్ఛమైన దివ్య సరళత అవసరాన్ని ప్రేరేపించడానికి మార్గం.

అంతా చాలా సరళంగా ఉండాలని శరీరం దృఢంగా, చాలా దృఢంగా అనుభూతి చెందుతుంది. కానీ వ్యక్తికి, - ఆ విధమైన వ్యక్తిగత కూర్పు - రూపాంతరం చెందడానికి మరింత సరళంగా మారవలసి ఉంది. మనిషి ఇప్పుడు అధ్యయనం చేయడానికి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న ప్రకృతి సంక్లిష్టతలన్నీ చాలా చిన్న విషయాల్లో కూడా ఉంటాయి వాటిని (మన అతి చిన్న భౌతిక కార్యాలు కూడా మనం ఊహించలేనంత సంక్లిష్టమయిన వ్యవస్థ యొక్క ఫలితమయి ఉండవచ్చు. ఖచ్చితంగా మానవ మేధకు అవన్నీ ఆలోచించి ప్రణాళిక చేయడం అసాధ్యం.) శాస్త్ర విజ్ఞానమిపుడు పరిశోధిస్తుంది. దివ్యమైన పనితీరు కోసం - అస్తవ్యస్థత, అయోమయాల నుండి బయటపడడానికి మరింత సరళం కావాలన్నది స్పష్టం

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ, మే 15,1963*

వేరే మాటలలో చెప్పాలంటే ప్రకృతి లేదా వ్యక్తీకరణ కోసం ప్రకృతి చేసే ప్రయత్నంలో, విశ్వసించలేనటువంటి, అంతంలేని సంక్లిష్టతలోకి వెళ్ళటానికీ, వాస్తవమైన సరళతను ఉత్పన్నం చేయడానికి ఒత్తిడి చేయబడుతుంది.

అది తిరిగి మళ్ళీ వెనుకకు అదే చోటికి తీసుకు వస్తుంది. అధికమయిన సంక్లిష్టత దగ్గరికి శూన్యంగాని సరళతను, ఒక సంపన్న సరళతను సాధ్యం చేస్తుంది. అన్నిటినీ ఆలింగనం చేసుకొనే సరళత - ఎందుకంటే ఆ సంక్లిష్టతలు లేనపుడు సరళత శూన్యంగా ఉంటుంది. గత కొన్ని రోజులుగా ఇది నా అనుభవం.

శరీర నిర్మాణ శాస్త్రంలో వాళ్ళు యిటువంటివి కనుగొంటున్నారు. ఉదాహరణకు శస్త్ర చికిత్సలలో నమ్మశక్యం కానటువంటి చాలా జటిలమైన విషయాలను కనుగొంటున్నారు. అదే విధంగా పదార్థాన్ని విభజించడంలో కూడా చాలా భయంకరమైన జటిలత. అవన్నీ కూడా ఏకత్వాన్ని వ్యక్తీకరించడానికి చేసే ప్రయత్నాలే. ఆ ఏకైక సరళత - ఒక దివ్య స్థితి.

(నిశ్శబ్దం)

అది వేగంగా జరుగవచ్చు. కానీ ప్రశ్న ఏమిటంటే తగినంత, తీవ్రమైన ఆకాంక్ష, ప్రభావవంతంగా దానిని ఆకర్షించగలిగిన, అంతటినీ పరివర్తన చెందించగల ఆకాంక్ష. సంక్లిష్టతలను సరళత్వంగా, క్రూరత్వాన్ని ప్రేమగా, మలచగలిగిన ఆకాంక్ష, దగ్గరకు సమస్య చేరుతుంది.

విషయాలు అలా ఉన్నాయని ఫిర్యాదు చెయ్యటం, అది దయనీయం అనటం వలన ప్రయోజనం లేదు. అవి ఉండవలసిన విధంగానే ఉన్నాయి. ఎందుకు? విషయాలు ఆ విధంగా లేనప్పుడు బహుశా ఎందుకో?... మనకు తెలుస్తుంది. లేదా మరొక విధంగా చెప్పాలంటే ఎందుకు అనేది మనకు తెలిస్తే ఇకపై అవి అలా ఉండవు.

అది అలా ఉండి ఉండకపోతే బాగుండేది, మొదలైన ఊహాగానాలు ఆచరణ యోగ్యం కాదు. అవి అసందర్భమైనవి, ఏ మాత్రం ప్రయోజనం లేనివి.

మనం చేయవలసిన దానికి స్వస్తి చెప్పటానికి దానిని త్వరితం చెయ్యాలి. అంతే అది మాత్రమే ఆచరణీయం.

శరీరం విషయానికొస్తే అది చాలా ఆసక్తికరం. కానీ అదొక పెద్ద పర్వతం. చూడు! అది కనిపించే చిన్న చిన్న అనుభవాల పర్వతం, ఆ అధిక సంఖ్యాకమైన అనుభవాలే పెద్ద ఆకారాన్ని దాల్చుతాయి.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ, మే 15,1963*

# సారళ్యత - సంక్లిష్టత

మనం సరళంగా ఉండాలని శ్రీ అరవిందులు కోరుతున్నారు.

అదొక అప్రయత్న ఆనంత స్థితి

భయంకరమైనదేమిటీ అంటే ఈ వ్యవస్థీకరించే మనసు, అది భయంకరం. అది లేకుండా మనం ఏం చేయలేమని, నిరోధించడం చాలా కష్టమని మనల్ని యెంతగానో నమ్మించింది. నిజానికది మొత్తం మానవజాతినే నమ్మించింది. ఈ మానసిక వ్యవస్థీకృత శక్తి లేకుండా, చెప్పుకోదగిన దేన్నీ సాధించలేమని, మానవజాతిలో శ్రేష్ఠులని పిలువబడేవాందరు నమ్మారు.

కాని వికసించే గులాబిలా, అదే సరళమైన సంతసంతో మనం ఉండాలని శ్రీ అరవిందులు కోరుతున్నారు. సరళంగా ఉండు, సరళంగా ఉండు, సరళంగా ఉండు, నేనామాట విన్నపుడు లేక చూచినపుడు, అదొక బంగరుకాంతి సెలయేటి ప్రవాహంలా, ఒక పరిమళ భరిత ఉద్యానవనంలా, సమస్తం, సమస్తం, సమస్తం తెరుచుకొంటుంది. సరళంగా ఉండు.

అదీ సంగతి బాబూ!

నీ కోసం గత రెండు మూడు రోజుల్నుంచీ దీనిని సదా చూస్తున్నాను. ఈ రోజుదయమే అది లభించింది. ఎందుకనంటే, విషయాలను, కేవలం యిప్పుడున్న స్థాయికి తీసుకురావడానికి, నాకున్న సమయం కంటె, పదిరెట్లెక్కువ అవసరమయ్యేంత బ్రహ్మాండంగా పని పేరుకుపోయింది. కొంచెం ఒత్తిడికి లోనైనట్లనిపించింది. నా నడక మధ్యలోనే ఆపివేసి, విశ్రమించకోరుతున్నఒక శక్తి కూడా ఉంది, దానిని నేను నా

సంకల్పమంతటితో నేనేదో బుద్ధి తక్కువ పనిచేస్తున్నానని గ్రహించేంత వరకు నిరోధిస్తూనే ఉన్నాను. విషయం అదే, నాకతడు చెప్పిందదే. నేను విశ్రమించాను - వెంటనే అంతా చక్కబడింది.

సారత: మనం తీవ్ర ఒత్తిడితో జీవిస్తున్నాం కదా?

ఇదిగో అటువంటి సమయంలో బాబూ, వారానికి నా సందేశం

దాన్నేం చేద్దాం? ఓహ్ అది వస్తుంది. కాని అది యథార్థం, మనం ఎల్లప్పుడు దాని ఒత్తిడికి లోనవుతూనే ఉంటున్నాం - ఎప్పుడూ. ఆ ప్రశంసనీయమైన మనస్సుతో మనం నియంత్రించబడుతున్నంత కాలం విశ్రమించడం అంటే, తమస్సులో, అచేతనలో పడిపోవడమే అని అన్పిస్తుంది. ఈ పాత భావాలన్నీ అలాగే తమను తాను పొడిగించుకుంటూ అలాగే మిగిలి ఉంటాయి. జాగ్రత్త, తమస్సు, తమస్సు, జాగ్రత్త నిద్రలో జోగుతున్నావు, చాలా చెడు, చాలా 'చెడు' అని చెప్తూ ఉండే ఒక అద్భుత గ్రాహకంలలో అవశేషంలాంటిదేదో ఒకటి ఉంది. అది బుద్ధిలేనిది, ఎందుకనంటే, తమస్సు ఆనందం కలిగించేది కాదు, లేక ప్రకాశమయమైనదీ కాదు, అది తత్‌క్షణ సంతసం, వెలుగు. *శ్రీమాత : శిష్యునితో సంభాషణ, సెప్టెంబర్* ***16,1961***

## విషయాలెలా సంక్లిష్టమౌతాయి

సంఘటనేదైనప్పటికీ (స్వయంగా అది చాలా సరళం, ఒక పసిబిడ్డ కంటె సరళం, తెలుసా - ఒక పరిపూర్ణసారళ్యత) అది ఐహిక మానవ వాతావరణంతో సంపర్కంలోనికొచ్చినంతనే, అదెన్నడూ కానంత సంక్లిష్టంగా తయారవుతుందనే ఒక పెరుగుతున్న అవగాహన, దాంతో అవసరమూ, త్రోసివేయలేని దైనందిన సంపర్కం వల్ల ఉత్పన్నమౌతోంది. అది పూర్తిగా అనవసరంగా, చాలా సరళంగా ఉండేదాన్నంతా సంక్లిష్టం చేయడమే సామాన్య మానవ వ్యాపకంలాగా కన్పిస్తోంది. నేను దీనిని రోజు విడిచి రోజు, ప్రతి రోజు ప్రతి చిన్న సంఘటనలో, ప్రతి క్షణంలో నేను దీనిని గమనిస్తున్నాను. ఒకానొక చేతనతో అది ఒకానొక చేతనతో సంపర్కంలోనికొచ్చినప్పుడు అది వంకర పోతుంది. కొన్నిసమయాల్లో భయంకర ముడులుగా పడిపోతుంది. దానినంతా విడదీయడానికి ఒక విచిత్రమైన శ్రమ చేయవలసి ఉంటుంది. ఆ మొత్తం వ్యవహారం పూర్తిగా అనవసరం.

వాస్తవంగా గత కొద్దిరోజులుగా దాన్నంతా గమనిస్తున్నాను. 'విషయాలెందుకిలా తయారవుతున్నాయి?' అని ఆశ్చర్యపోతున్నాను. జడత్వం నుండి, తమస్సు నుండి వెలువడడానికి ఆలంబనాలు బహుశా అత్యంత ప్రభావవంతమైన ఆలంబనాలు ఉండి ఉండవచ్చు. ఆ సరళత్వంలో ఆ పరిపూర్ణ ప్రశాంతతతో ప్రతిదీ జరిగిపోతుంటే, మానవచేతన తేలికగా నిద్రాస్థితిలో పడిపోయే దశలో ఉండేది. కనీసం జంతు చేతనను కూడా కాకుండా బహుశా నిద్రలో జోగుతుండే మొక్క స్థితికి చేరుకునేది!

అదీ కారణం.

కాని దానిని మరో ప్రక్క నుండి చూస్తే అది యెంతో హాస్యాస్పదం - విచిత్రంగా అసంగతం! నీవు పలికే ప్రతిమాట అర్థమూ అటువంటి స్థితికి వెంటనే మెలిదిరిగిపోతుంది. అప్రయత్నంగా అది జరుగుతుంది, కారణం చెప్పలేవు. స్వచ్ఛమైనది, స్పష్టమైనది, ఆటంకాలు లేకుండా మృదువుగా జరిగిపోయే దానితో, వెంటనే సంక్లిష్టతల సుడిలో పట్టుబడిపోతావు.

అన్నీ, మొత్తం కార్యకలాపాలన్నీ జీవితం మొత్తం అలా వుంది. తరువాత, చిన్న తేడాలు, చిన్న భేదాలు ఉన్నాయి. అలా వికృతమైన చేతనలలో అవి సహజంగానే చెప్పుకోదగిన పరిమాణాలుగా తయారవుతాయి. అవి 'ఇప్పుడు ప్రతిదీ చక్కగా ఉంది' అంటాయి. ఆ తరువాత 'ప్రతిదీ అపసవ్యంగా తయారౌతుంది' అంటాయి. కాని అది సత్యం కాదు. కేవలం కొద్ది తేడాలతో అది ఎప్పుడూ అదే. యథార్థమైన ప్రతిదీ చక్కనిదే, యథార్థమైనది, అది అదిగా ఎంతో సరళం. ఎంతో సరళం, ఎంతో ప్రశాంతం, ఎంతో సమీపం, మానవ ఆలోచనకు దాదాపు అచింత్యం, మానవ ఇంద్రియ సంవేదనకు అంతకంటె ఇంకా తక్కువగా తెలిసేది.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ, మే **29,1963***

## సాధారణ మానవ వైఖరి

వినోదం కలిగించే ఒక ఇంద్రియ సంవేదన అది, ఇంద్రియ సంవేదన, అనుభూతికి సంబంధించిన మిశ్రమం అది.

వస్తువులు, లేక విషయాల యెడల సాధారణ మానవ వైఖరి, విచిత్రమైన నిష్పత్తులలోనికి ఇబ్బందులను హెచ్చిస్తుంది లేక పెద్దవిగా చేస్తుంది.

యథార్థమైన వైఖరి పూర్తిగా సరళమూ అక్లిష్టమూనైన మామూలు వైఖరి. వాటికంటే ఆహ్, సమస్త జీవనమూ ఎంతో తేలిక అవుతుంది. ఎందుకనంటే దేహం కంపనాలననుభూతి చెందుతుంది (దేహాన్ని రూపొందించడానికి కేంద్రీకృతమైన అసలు కంపనాలను) అనుభూతి చెందుతుంది. అది వాటి స్వభావాన్ననుభూతి చెందుతుంది, దానికి తన 'మామూలు' ప్రతి చర్యనూ ఒక శాంతియుత, నమ్మకం నిండిన ప్రతి చర్యనూ చూస్తుంది. విషయాలనది ఎంతో తేలిక పడేటట్లు చేస్తుంది. కాని ఈ ఆరాటపు అలజడి, భయం, అసంతృప్తి ప్రవేశించగానే 'దానికి సంబంధించిన దేన్నీ కోరని' ఒక సంకల్పపు ప్రతిచర్య జరుగుతుంది. ఓహ్ వెంటనే మరుగుతున్న నీటిలా అది తయారవుతుంది. కళపెళ కళపెళ, ఒక యంత్రంలా, అదే సమయంలో నమ్మకంతో, సరళతతో ఇబ్బందిని సమ్మతిస్తే అది కనీస స్థాయికి తగ్గిపోతుంది. నా అర్థం, స్వయంగా భౌతిక కంపనంలోనే పూర్తిగా భౌతిక రీతిలో అని.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ, ఫిబ్రవరి 25, 1961*

## సారళ్యత, స్వేచ్ఛ

వ్యక్తి చేయగలిగిన ఉత్తమ విషయమేమిటంటే, ఏ దురభిమానాలను గాని, ముందుగా ఊహించుకొని భావాలను లేక సూత్రాలను లేకుండా చేసుకోవడం - ఓహ్ నైతిక సూత్రాలు, సుస్థిర కట్టుబాట్లు 'ఏం చేసితీరాలి', 'ఏం చేయకూడదు' అనేవి, పురోగతికి సంబంధించిన, నీతులకు సంబంధించిన ముందుగా ఊహించి తయారు చేసిపెట్టుకొన్న, సమస్త సాంఘిక, మానసిక ఆచారాలు, అంతకు మించిన కష్టమైన ఆటంకం మరేదీ ఉండదు. ఆ మానసిక నిర్మాణాలలో ఒకదానిని అధిగమించడానికి, డజన్ల సంవత్సరాలను వృథా చేసిన వారిని నేనెరుగుదును.

యథార్థంగా సారళ్యతలో తెరుచుకొని వున్న వ్యక్తి తాను అజ్ఞానినని తెలిసిన అజ్ఞానపు సారళ్యత... ఇలా (చేతులు తెరచి సంజ్ఞ) లభించేదాన్నంతా స్వీకరించ సిద్ధంగా... అప్పుడు బహుశా కొంత సంభవిస్తుంది.

సహజంగా, పురోగతికై తృష్ణ, తెలుసుకోవాలనేందుకు తృష్ణ, తనను తాను రూపాంతరీకరించుకొన్న తృష్ణ, అన్నింటినీ మించి దివ్యప్రేమకై, పరమ సత్యానికై తృష్ణ - దానిని నిలుపుకోగలిగితే అప్పుడు వేగంగా సాగిపోతావు.

నిజంగా ఒక తృష్ణ, ఒక అవసరం, తెలుసా ఒక అవసరం ఉంటే... తక్కిన సమస్తాన్ని గురించి పట్టించుకోనవసరం లేదు, నీవకసరమైనది అది.

నీకు తెలిసిన దానిని నీవంటిపెట్టుకొని ఉండడం, నీవనుభూతి చెందిన దానికి నీవంటిపెట్టుకొని ఉండడం, నీవిష్టపడిన దానికి నీవంటిపెట్టుకొని ఉండడం, నీ అలవాట్లను నీవంటిపెట్టుకొని ఉండడం, నీ అవసరాలని చెప్పుకొనే వాటికి నీవంటిపెట్టుకొని ఉండడం, ఇప్పుడున్న ప్రపంచానికి ఉన్నదున్నట్లుగా నీవంటిపెట్టుకొని ఉండడం, అదిగో అది నీ కాళ్ళు చేతులను బంధించేది. ఒక దాని తరువాత మరొకటిగా దాన్నంతా రూపుమాపాలి. సమస్త బంధాలను త్రుంచివెయ్యి.

ఈ విషయాన్ని వేలసార్లు చెప్పాను, కాని జనం చేసినదాన్నే చేస్తూ పోతూనే ఉన్నారు. బాగా వాక్పటుత్వం కలవాళ్లు, ఇతరులకు దానిని బోధించే వాళ్లు వాళ్ళే అంటిపెట్టుకొన్నారనేది తెలుసా. చూడడంలో తమ స్వకీయ మార్గానికే సంవేదించే, స్వకీయ విధానానికే, పురోగమించే తమ స్వకీయ అలవాటుకే, సాధ్యమైంది అదొకటే విధానమని అంటిపెట్టుకుపోతారు.

బంధనాలు వద్దు, స్వేచ్ఛ, స్వేచ్ఛ, స్వేచ్ఛ, స్వేచ్ఛ! ప్రతిదాన్నీ ఆకాంక్షించడం తప్ప ఆ తృష్ణ తప్ప మార్చి వేసుకొనడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండు.

నేను బాగానే అర్థం చేసుకొన్నాను. కొంతమంది 'దైవం' అనే భావనను ఇష్టపడరు. ఎందుకనంటే వెంటనే అది సమస్త యూరపు లేక పాశ్చాత్య అవగాహన (భయంకరమైనవి అవి)లతో కలగలసి పోతుంది. కనుక అది వారి జీవితాలను కొంచెం అధికంగా సంక్లిష్టం చేస్తుంది. కాని మనకది అవసరం లేదు. మనకు 'ఏదో' అవసరం, పరిపూర్ణత అవసరం, దివ్య వెలుగు అవసరం, దివ్య ప్రేమ అవసరం, పరమసత్యం అవసరం, పరమోత్కృష్ట సిద్ధి అవసరం. అంతే అంతా. సూత్రాలు... అవి ఎంత తక్కువైతే అంత మంచిది. ఒక అవసరం, ఒక అవసరం, ఒక అవసరం, ఆ ఒక్కటే సంతృప్తినివ్వగలదు, మరేంకాదు, అర్థప్రమాణం కాదు. తత్ మాత్రమే. అప్పుడు ముందుకు సాగిపో! నీ దారే నీదిగా సాగిపో, అది ఏ మార్గమైనా, ఎటువంటి మార్గమైనా, నేటి అమెరికా యువత తప్పిదాలు సైతం ఒక మార్గంగా అవ్వవచ్చు. పరవాలేదు.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ, అక్టోబర్ 7, 1964*

జీవనానందం.

•ప్రతి దానియందు, ప్రతి వస్తువు నందు, ప్రతి కదలికయందు, ప్రతి కంపనయందు, చుట్టూ వున్న ప్రతిదానియందు, జనులు సచేతన జీవులు మాత్రమే గాక, చెట్లు, మొక్కలు సజీవమైనవి మాత్రమే గాక, కేవలం తాను ఉపయోగించే ఏ వస్తువైనా, వ్యక్తి చుట్టూ వున్న వాటిలో ఈ ఆనందం జీవిస్తూ ఉన్నందుకు ఆనందం, కేవలం ఆతడున్నాడు కనుక ఆనందం, కేవలం ఉన్నందుకు ఆనందంను అనుభూతి చెంది దాదాపు సిద్ధం గావడం ఆరంభమయ్యే సమయం వస్తుంది. ఇదంతా ఆ విధంగా కంపించడాన్ని వ్యక్తి చూస్తాడు. ఒక వస్తువును స్పృశిస్తాడు. ఈ ఆనందాన్ని అనుభవిస్తాడు. కాని సహజంగానే, మొదట్లో నేను మాట్లాడిన క్రమశిక్షణను అనుసరించి తీరాలి అని అంటాను. లేని యెడల, ఒక కోరిక, ఒక మక్కువ, ఒక మమకారం లేక సహజ మొగ్గుదలలు, వికర్షణలు, అటువంటిదంతా ఉన్నంత కాలం, అలా సంవేదించలేడు - సంవేదించలేడు.

సుఖానుభూతులను కనుగొన్నంతకాలం - సుఖానుభూతి, అది వస్తువులో ప్రాణిక లేక భౌతిక సుఖానుభూతి ఈ ఆనందాన్ని సంవేదించలేదు. ఎందుకనంటె ఈ ఆనందం ప్రతిచోటునా వుంది. ఈ ఆనందం చాలా సూక్ష్మమైనదేదో తమ ఆనందాన్ని అవన్నీ గానం చేస్తున్నట్లు వస్తువుల మధ్య వ్యక్తి కదలాడుతుంటాడు. నీ చుట్టూ వున్న జీవనంలో బాగా తెలిసినదానిలా అది తయారయ్యే ఒక సమయం వస్తుంది. నిజమే, మనుషులలో దానినమభూతి చెందడం అనేది కొంచెం ఎక్కువగా కష్టమే అనే దాన్ని నేనంగీకరించి తీరాలి. ఎందుచేతననగా అవగాహనా విషయాలతో కలగలసి పోయే ఈ విధమైన ఆహంకారిక, కాఠిన్యత లేక మొరటుతనం వారిలో చాలా హెచ్చుగా ఉంది. అందుచేత ఇచట ఆనందాన్ని స్పృశించడం ఎక్కువ కష్టం. కాని జంతువులలో సైతం దానిని అనుభూతి చెందగలడు, మొక్కలలో కంటె ఇంకా అది, అది వరకే కొంచెం ఎక్కువ కష్టమై కూచొంది. కాని మొక్కలలో పుష్పాలలో అదెంతో అద్భుతం! తమ సంతోషాన్నంతా అవి మాట్లాడుతాయి. దానిని వ్యక్తం చేస్తాయి. బాగా తెలిసిన వస్తువులన్నింటిలో, నీ చుట్టూ ఉన్న వాటిలో, నీవుపయోగించే వాటిలో, అవి అవిగా కేవలం

ఉన్నందుకు, ప్రతిదీ సంతోషిస్తున్న ఒక చేతనా స్థితి వున్నది. కనుక అటువంటి క్షణంలో యథార్థమైన ఆనందాన్ని స్పృశించానని తెలుసుకొంటావు. దానిపై దేని వత్తిడీ లేదు. నా అర్థం అది దేనిమీద ఆధారపడనిది; అది బాహ్య పరిస్థితుల మీద ఆధారపడదు, హెచ్చు, తగ్గులుగా సానుకూల స్థితి మీద అది ఆధారపడదు, అది దేని మీదా ఆధారపడదు. విశ్వమనుగడకసలు కారణంతో ఒక సంసర్గం.

అది ప్రాప్తించినపుడు అది దేహ జీవ కణాలనన్నింటినీ నింపివేస్తుంది. అది ఆలోచించగా జరిగినది కాదు - దానికి కారణం చెప్పలేదు, కారణం కాలేదు, విశ్లేషించలేదు, అది అదేం కాదు, ఒక వ్యక్తి నివసించే ఒకానొక స్థితి అది. దేహం దానిలో పాలుపంచుకొన్నప్పుడు, అదెంతో తాజాగా తయారవుతుంది. ఎంతో తాజా, ఎంతో అప్రయత్నం, కనుక... అది తనమీదకు తానెన్నడూ వెనుదిరగదు. ఆత్మ - పరిశీలన, ఆత్మ విశ్లేషణ విషయాలను విశ్లేషించడం అనే స్పృహ దానికి ఎంత మాత్రం ఉండదు. అదంతా సంతసానంద కంపనల ఒక సంకీర్తనలా ఉంటుంది. కాని చాలా చాలా ప్రశాంతంగా, ఏమాత్రం కాఠిన్యం లేకుండా, గాఢావేశం లేకుండా, అటువంటిదంతా యేమీ లేకుండా ఉంటుంది. అది చాలా సూక్ష్మం, కాని అదే సమయంలో చాలా తీవ్రంగా ఉంటుంది. అది ప్రాప్తించినపుడు, మొత్తం విశ్వమంతా ఒక అద్భుత సామరస్యభరితంగా గోచరిస్తుంది. సాధారణ మానవ చేతనకు వికృతంగా, అసుఖం కలిగించేదిగా ఉన్నది కూడా ఆనందకరమైనదిగా అవుతుంది.

CWM 9:22-23

## జీవితాన్ని పరిపూర్ణం చేయడం

జీవితంలో చెడుగా అనిపించిన వాటిని తొలగించడానికి మంచి, ఎల్లప్పుడూ సమయాన్ని వెచ్చిస్తుంది, అలాగే ప్రపంచంలోని వివిధ దేశాలలోని అన్ని మంచిగుణాలను ఒకచోట చేర్చినట్లయితే, చాలా తక్కువ విషయాలే ఉనికిలో మిగిలి ఉంటాయి.

మంచి, పరిపూర్ణతను కోరుకుంటుందని చెప్పుకుంటుంది, కానీ పరిపూర్ణత అనేది ఒక సమగ్రత. కాబట్టి రెండు కదలికలు ఒకదానికొకటి విరుద్ధంగా ఉన్నాయి. నిర్మూలించేది, తగ్గించేది, పరిమితులను విధించేది

మంచి కానీ ప్రతి విషయాన్ని అంగీకరించే పరిపూర్ణతదేనినీ తిరస్కరించదు, ప్రతి విషయాన్ని దాని స్థానంలో దాన్ని ఉంచుతుంది, కాబట్టి మంచి, పరిపూర్ణత స్పష్టంగా ఒకదానితో ఒకటి విభేదిస్తాయి.

జీవితాన్ని తీవ్రంగా పరిగణించడం సాధారణంగా రెండు కదలికలను కలిగి ఉంటుంది: మొదటిది బహుశా ఏ గుణం, లక్షణం లేని వాటికి ప్రాముఖ్యత ఇవ్వడం, రెండవది జీవితాన్ని స్వచ్ఛమైనదిగా, ఉనికికి యోగ్యమైనదిగా భావించే నిర్దిష్ట సంఖ్యలో ఉండే లక్షణాలకు మాత్రమే పరిమితం చేసుకోవడం. కొంతమంది వ్యక్తులలో - ఉదాహరణకు, శ్రీ అరొబిందో ఇక్కడ "మర్యాదస్తులు" లేదా ప్యూరిటన్ల గురించి మాట్లాడు తున్నారు - ఈ మంచి పొడిగా, శుష్కంగా, బూడిద రంగుగా, దూకుడుగా మారుతుంది, పైగా ప్రతిచోటా, ఆనందంగా, స్వేచ్ఛగా, సంతోషంగా ఉన్న ప్రతిదానిలో తప్పును కనుగొంటుంది.

జీవితాన్ని పరిపూర్ణంగా మార్చడానికి ఏకైక మార్గం - నా ఉద్దేశ్యం, భూమిపై జీవితం, వాస్తవానికి, దాని ప్రస్తుత సంపూర్ణతలో మాత్రమే కాకుండా, గతం, వర్తమానం ఇంకా భవిష్యత్తు మొత్తంగా దాన్ని చూడగలిగేంత ఎత్తు నుండి చూడటం: అదిగతంలో ఎలా ఉంది, అది ఇప్పుడు ఎలా ఉంది అది భవిష్యత్తులో ఎలా ఉండబోతోంది - అన్నింటినీ ఒకేసారి చూడగలగాలి. ఎందుకంటే అదే ప్రతిదాన్ని వేటి స్థానంలో వాటిని ఉంచడానికి ఏకైక మార్గం. ఏదీ తొలగించబడదు, ఏదీ తొలగించబడకూడదు, కానీ ప్రతి విషయం దాని స్థానంలో మిగిలిన వాటితో పూర్తిగా సామరస్యంగా ఉండాలి. మర్యాదస్తులకు చాలా "చెడ్డవి", "నిందించదగినవి", "ఆమోదయోగ్యం కానివి" అనిపించే ఈ విషయాలన్నీ పూర్తిగా దివ్య జీవితంలో ఆనందం, స్వేచ్ఛ యొక్క కదలికలుగా మారతాయి. ఆపైన తాను అనంతంగా జీవించడంలోని అనంతమైన ఆనందాన్ని చూడడాన్ని ఆస్వాదించే పరమాత్మ అద్భుతమైన హాస్యాన్ని తెలుసుకోవడం, అర్థం చేసుకోవడం, అనుభూతి చెందడం, జీవించడం నుండి మనల్ని ఏదీ ఆపలేదు.

*CWM 10:155-56*

## దివ్యమైన నవ్వుల సూర్యుడు

ఈ ఆనందం, ఈ అద్భుతమైన నవ్వు ప్రతి నీడను, ప్రతి బాధను, ప్రతి వేదనను కరిగిస్తుంది! లోపలి సూర్యుడిని కనుగొనడానికి, దాని కాంతి

ప్రవాహంలో మునిగిపోవడానికి మీరు మీ లోపలికి తగినంత లోతుకు వెళ్లాలి. ఆపైన సామరస్యమైన, కాంతివంతమైన, సూర్యకాంతితో ప్రకాశించే నవ్వుల జలపాతం తప్ప మరేమీ లేదు, ఇది ఎటువంటి నీడ లేదా వేదనకి చోటు లేకుండా చేస్తుంది.

నిజానికి, అతి పెద్ద కష్టాలు, అతి పెద్ద బాధలు, అతి పెద్ద శారీరక బాధలను కూడా ఆ దృక్కోణం నుండి చూడగలిగితే, అక్కడ నుండి, మీరు కష్టాల అవాస్తవికత, దుఃఖం అవాస్తవికత, చూస్తారు. అక్కడ సంతోషకరమైన, ప్రకాశవంతమైన కంపనం తప్ప మరేమీ లేదు.

వాస్తవానికి, కష్టాలను కరిగించడానికి, బాధలను అధిగమించడానికి, వేదనను తొలగించడానికి ఇది అత్యంత శక్తివంతమైన మార్గం. మొదటి రెండు సాపేక్షంగా సులభం - నేను సాపేక్షంగా చెబుతున్నాను - చివరిది చాలా కష్టం. ఎందుకంటే మనం శరీరాన్ని, దాని భావాలను చాలా గట్టిగా, సానుకూలంగా పరిగణించడం అలవాటు చేసుకున్నాము. కానీ మన శరీరాన్ని ఒక ద్రవరూపమైనదిగా, మార్పుచెందేదిగా, అనిశ్చితమైనదిగా, కొత్తరూపంలోకి మార్చుకోగలదిగా చూడడం మనం నేర్చుకోకపోవడమే కారణం, ఇది మనకు అలవాటు లేని విషయం. చీకటినంతటినీ, అన్ని కష్టాలను, అన్ని వైరుధ్యాలను, అన్ని అసమానతలను, విసుగు తెప్పించే ఏడుపు, రోదనలను కరిగించే ఈ ప్రకాశవంతమైన నవ్వును తీసుకురావడం మనం నేర్చుకోలేదు.

ఈ సూర్యుడు, దివ్య దరహాసం కలిగిన ఈ సూర్యుడు అన్ని విషయాలకు కేంద్రంగా ఉన్నాడు, అతనే అన్ని విషయాలకు చెందిన సత్యం: మనం దానిని చూడటం, అనుభూతి చెందడం, జీవించడం నేర్చుకోవాలి.

*CWM 10:156*

## పరమ ప్రభువుతో కలసి ఆనందించండి

వాతావరణం గంభీరంగా మారిన వెంటనే, ఏదో తప్పు జరిగిందని, ఇబ్బంది కలిగించే ప్రభావం ఉందని, పాత అలవాటు తనను తాను పునఃస్థాపించుకోవడానికి ప్రయత్నిస్తున్నదని, దానిని అంగీకరించకూడదు. ఈ పశ్చాత్తాపం అంతా, ఈ తప్పు చేశాననే చింత, అనర్హుడననే భావన, తనవల్ల తప్పు జరిగిపోయిందనే భావన - ఆపైన ఒక అడుగుదూరంలో ఉంది. ఓ! నాకు అవన్నీ మరొక యుగానికి, చీకటి యుగానికి చెందినవిగా అనిపిస్తాయి.

కానీ కొనసాగే ప్రతిదీ, అంటిపెట్టుకుని ఉండటానికి ప్రయత్నించే ప్రతిదానిని, ఈ నిషేధాలన్నీ, ఇంకా జీవితాన్ని రెండుగా-చిన్న విషయాలు, పెద్ద విషయాలు, పవిత్రమైనవి, అపవిత్రమైనవిగా విభజించే అలవాటు.... "ఏమిటి!" ఆధ్యాత్మిక జీవితాన్ని అనుసరిస్తున్నామని చెప్పుకునే వ్యక్తులు ఇలా అంటారు, "ఇంత చిన్న విషయాలను, ప్రాముఖ్యతలేని విషయాలను మీరు ఆధ్యాత్మిక అనుభవానికి లక్ష్యంగా ఎలా ఉపయోగించగలరు?" అని.

అయినప్పటికీ ఆ అనుభవం ఇంకా ఇంకా గట్టిగా వాస్తవికంగా మారుతూ ఉంటుంది, భౌతికంగా కూడా. "కొన్ని విషయాలు" మాత్రమే భగవంతుడు, "మరికొన్ని"ఆయన కాదు అనుకోవడం తప్పు. భగవంతుడు ఎల్లప్పుడూ ఉన్నాడు. ఆయన దేనిని అంత తీవ్రంగా తీసుకోడు, ప్రతిదీ ఆయనకు వినోదం కలిగించేదే, అటుపై ఒక వేళ నీకు ఆయనతో ఎలా క్రీడించాలో తెలిస్తే గనకఆయన నీతోక్రీడిస్తుంటాడు, నీకు ఆయనతో క్రీడించడం తెలియదు, అలాగే మనుషులకు ఆయనతో క్రీడించడమెలాగో తెలియదు. కానీ ఆయనకు ఈ ఆట ఆడటం ఎంతబాగా తెలుసో, ఎంత బాగా ఆడతాడో! ప్రతిదానితోనూ ప్రతి చిన్నవస్తువుతో కూడా. నీకు కొన్ని వస్తువులు మేజాబల్లపై ఉంచాల్సినవి ఉన్నాయా? అదేదో ఆలోచించి అమర్చవలసిన విషయమని భావించకు, అలా కాదు, ఒక ఆటలా భావించు. ఒకటి ఇక్కడ ఉంచు ఇంకొకటి అక్కడ ఉంచు, ఇది ఇల్లా ఉంచు, ఇంకోకసారి ఇదంతా వేరే విధంగా పెట్టుకోవచ్చు.. ఇది ఎంత మంచి ఆట, ఎంత వినోదం. అయితే మనం భగవంతుడితో కలసి ఎలా ఆనందించాలో నేర్చుకోవాలి అనే విషయాన్ని అంగీకరించినట్టేనా?

*CWM 10: 156-57*

## సరళంగా ఉండండి, సరళంగా ఉండండి

మీకు తెలుసా, మనం సంక్లిష్టతలతో చుట్టుముట్టి ఉన్నాం, కానీ ప్రతిదీ సరళంగా సూటిగా తెరచిఉండే ప్రదేశమొకటి ఎల్లప్పుడూ మనలో ఉంటుంది- ఇది నా అనుభవంలోని వాస్తవం. మీరు వృత్తాలలో తిరుగుతారు, వెతుకుతారు, పని చేస్తారు, చివరికి మీరు ఇరుక్కుపోయినట్లు అనిపిస్తుంది. అప్పుడు అంతర్గత వైఖరిలో ఏదో దారి ఇస్తుంది, అకస్మాత్తుగా అది తెరుచుకుంటుంది - చాలా సరళంగా.

నేను చాలా తరచుగా ఈ అనుభవం కలిగి ఉన్నాను. అందుకే ఆ అనుభవం మీకు కల్పించమని శ్రీ అరవిందులను అడిగాను.

ఆయన పదేపదే, పట్టుదలతో: సరళంగా ఉండండి, సరళంగా ఉండండి అనేవారు. మీకు అనిపించేది సరళంగా చెప్పండి. పట్టుదలతో సరళంగా ఉండండి, సరళంగా ఉండండి. ఇవి కేవలం పదాలు మాత్రమే, కానీ వాస్తవానికి, ఆయన ఈ మాటలు మాట్లాడినప్పుడు ఒక ప్రకాశంతో నిండిన మార్గం తెరుచుకుంటుంది, ప్రతిదీ చాలా సరళంగా మారుతుంది: 'ఒక అడుగు తర్వాత మరొకటి వేయండి, అదే మనం చేయాల్సిందల్లా!'- నాకు అలా అనిపించింది.

ఇది ఆసక్తికరంగా ఉంది, అన్ని చిక్కులు ఇక్కడ ఉన్నట్లు అనిపించింది (మదర్ తమ కణతలను తాకి చూపించారు), చాలా సంక్లిష్టంగా, సర్దుబాటు చేయడం చాలా కష్టం అనిపిస్తుంది. ఆపై శ్రీ అరవిందులు ఇలా చెప్పినప్పుడు, చాలా వింతగా ఆయనకన్నుల నుండి ఒక కాంతి వచ్చినట్లుగా ఉంది, ఒకరు అకస్మాత్తుగా ప్రకాశంతో నిండిన తోటలోకి వచ్చినట్లు.

అది ఆ అనుభూతిని కలిగించింది - ప్రకాశంలో స్నానం చేసిన తోటలా.

ఇంత సరళమైన విషయంలో ఇంత పట్టుదల. మీరు చూసేది లేదా మీకు తెలిసిన వాటిని సరళంగా చెప్పండి - సరళంగా సరళంగా. ఒక సరళత... ఇది పూర్తిగా మనోహరమైన తోటకు చెందిన అనుభవం కలిగిస్తోంది.

సరళంగా ఉండండి, సరళంగా ఉండండి.

సంక్లిష్టతలు ఉన్నాయి (అదే సంజ్ఞ), ఇది కఠినమైనది, సంక్లిష్టమైనది, అటు తర్వాత ఒక తలుపు తెరుచుకుంటుంది: సరళంగా ఉండండి.

చాలా మానసిక ఉద్రిక్తత ఉన్నట్లు : ఇక్కడ కణతల వద్ద ఏదో. (నిశ్శబ్దం)

నేను ఇలాంటి కష్టాన్నే ఎదుర్కోవలసి ఉంటుంది, ఇది మరొక స్థాయిలో ఉన్నప్పటికీ, గుర్తుంచుకోండి. చూడవలసిన వ్యక్తులు, చేయవలసిన పనులు, పరిష్కరించాల్సిన సమస్యలు కలగలిపి ఎన్నో విషయాలు పెద్ద కుప్పగా తయారయ్యాయి. ఆ కుప్ప అంతా చాలా గట్టిగా కట్టగా కట్టబడింది. చాలా చిన్నదిగా చేయబడింది. ఒక సాధారణ దేహంలో ఉండే శక్తులతో గడిపే ఒక జీవితంలో ఉండే గంటలు, సమయంతో పోల్చితే ఇంకా చిన్నదిగా

చేయబడింది. అయినప్పటికీ దీని వెనుక ఒక రకమైన ఎల్లప్పుడూ చురుకైన నిశ్చలత ఉంది, అంటే చైతన్యం నిశ్చలత అనే భావనను కలిగించేది, పరిణామం, పురోగమన ప్రవాహం పై, ప్రవాహంతో పాటు పుట్టిన భావనను కలిగించేది వుంది.

అయితే ఈ నిశ్చలస్థితి.. ఒక వేళ నేను ఏం చేయాలో అది చేయడానికి ప్రయత్నం చేసినప్పుడు, మీకు తెలుసు ప్రతిదీ నేనే చేయాలని, సరే.. అది అసాధ్యంగా మారుతుంది, అన్నీ కలగలిసిపోతాయి, అది తలనెప్పిగా తయారవుతుంది. అటువంటప్పుడు ఆయన సమాధానం అదే: సరళంగా ఉండు సరళంగా ఉండు అనే.

ఈ రోజు ఉదయం నేను నడుస్తూ ఉన్నప్పుడు, ఈ రోజు కార్యక్రమం, చేయవలసిన పనులు చాలా తలకు మించినవిగా ఉన్నాయి, వాటిని పూర్తి చేయడం అసాధ్యంగా అనిపించింది. అదే సమయంలో నాలో ఒక నిశ్చలస్థితి, నేను నా కదలికను, పనులను ఆపిన వెంటనే ఇదంతా నాకు ఒక ఆనంద తాండవంగా మారిపోతుంది. (ఒక సజీవత్వంతో ఒక అసాధారణమైన సంగీతంతో అన్ని కణాలు స్పందిస్తూ ఉన్నాయి) దైవం సన్నిధి ఆనంద పూర్ణమైన సన్నిధితో అన్ని కణాలు స్పందిస్తున్నాయి. కానీ నేను బాహ్య ప్రపంచాన్ని చూసినప్పుడు, అది లోనికి ప్రవేశించి దాడి చేస్తున్నప్పుడు కూడా ఈ ఆనందం పూర్తిగా అదృశ్యం కాలేదు, కాకపోతే కొంత వెనక్కు మళ్ళింది. తత్ఫలితంగా నేను ఎప్పుడు ఒక చోట కూర్చుని, నిశ్చలంగా ఉందామని అనిపిస్తుంది. అలా చేయగలిగితే అద్భుతంగా ఉంటుంది. అయినప్పటికీ, బయటనుండి వచ్చే సూచనలు అన్నీ నిస్సహాయత, ముసలితనం, బడలిక, శక్తి సామర్థ్యాలు క్షీణించడం, ఇలాంటివన్నీ నాకు బాగా తెలుసు, ఇదంతా అబద్ధం అని. కానీ శరీరంలో ఒక స్థిమితమైన ప్రశాంతత అత్యవసరం. ఇటువంటి విషయాల్లో కూడా నాకు సంబంధించినంత వరకు శ్రీ అరవిందుల సమాధానం అదే: సరళంగా ఉండు సరళంగా ఉండు అని.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ, సెప్టెంబర్ 16, 1961*



ఆధ్యాత్మిక భాషణం : దాని సరళతలో సర్వశక్తి మయంగా ఉంటుంది.

*CWM 14:204*

## సారళ్యతను పెంచి పోషించుకొనడం
## గొడవలు లేకుండా జీవించడం:

మనిషి గొడవలు లేకుండా జీవించవచ్చు. ఇది చెప్పడానికి వింతగా అనిపిస్తుంది, ఎందుకంటే, ఇంతకు ముందు చెప్పిన దానికి విరుద్ధంగా, పరిస్థితులు ఎలా కనిపిస్తాయి అంటే, కలిసి ఉన్న వ్యక్తులకు ఉండే ప్రధాన వ్యాపకం, బహిరంగంగా లేదా రహస్యంగా గొడవలు పెట్టుకోవడం అని, గొడవల కోసమే జీవితం రూపొందించబడినట్లు అనిపిస్తుంది. అదృష్టవశాత్తూ నీవు ఎల్లప్పుడూ వాక్ యుద్ధం చేయకపోయినప్పటికీ, దెబ్బలు తినకపోయినప్పటికీ, నీవు నిరంతరం చికాకులో ఉంటావు, ఎందుకంటే నీవు కనుగొని, సాధించదలచుకున్న పరిపూర్ణతను నీ చుట్టు ప్రక్కల చూడలేకపోతున్నావు. ఆ పరిపూర్ణతను సాధించడం నీకు కష్టతరమే అయినా, దానిని ఇతరులు సాధించాలని నీవు అనుకుంటున్నావు.

"వాళ్ళు అలా ఎలా ఉంటారు?..." నీవు "అలా" ఉండడం ఎంత కష్టమో నీవు మర్చిపోతావు!

ప్రయత్నించి చూడు నీకే తెలుస్తుంది.

దయ నిండిన చిరునవ్వుతో ప్రతి దానిని చూడడం నేర్చుకో. నీకు చికాకు కలిగించే అన్ని విషయాలను నీవు పాఠంగా తీసుకో, అప్పుడు నీ జీవితం మరింత ప్రశాంతంగా ప్రభావవంతంగా ఉంటుంది, ఎందుకంటే నీలో నీవు సాధించాలనుకునే పరిపూర్ణతను ఇతరులలో నీవు కనుగొనలేనప్పుడు నీవు అనుభవించే చికాకులో నీ శక్తిలో ఎక్కువ శాతం వృధా అవుతుంది.

ఇతరులు సాధించవలసిన పరిపూర్ణత గురించి ఆలోచిస్తూ నీవు అక్కడే ఆగిపోతావు, నీవు సాధించాల్సిన లక్ష్యం గురించిన స్పృహ నీలో చాలా అరుదుగా ఉంటుంది. నీకు దాని గురించి స్పృహ ఉంటే, నీకు ఇవ్వబడిన పనిని చేయడం ప్రారంభించు, అంటే, నీవు ఏమి చేయాలో అవగాహన చేసుకుని అది చేయి, అంతే కానీ ఇతరులు ఏమి చేస్తున్నారనే దాని గురించి ఆలోచించద్దు, ఎందుకంటే, అది నీ పని కాదు. నిజమైన వైఖరికి సంబంధించిన ఉత్తమ మార్గం ఏమిటంటే, "నా చుట్టూ ఉన్న వారందరూ, నా జీవితంలోని అన్ని పరిస్థితులూ, నా దగ్గరున్న ప్రజలందరూ, నేను చేయవలసిన పురోగతిని నాకు చూపించడానికి దివ్య చేతనే నా ఎదురుగా పట్టుకున్న అద్దాలు.

ఇతరులలో నన్ను దిగ్భ్రాంతికి గురిచేసే ప్రతిదాన్ని నేను నాలో సరి చేయవలసి ఉంటుంది."

బహుశా ఒక వ్యక్తి తనలో నిజమైన పరిపూర్ణతను కలిగి ఉంటే, ఆ వ్యక్తి పరిపూర్ణతను ఇతరులలోనూ తరచుగా కనుగొంటాడు.

*CWM 10: 22- 23*

## మనిషికి కొంత సమయం చిక్కినప్పుడు:

జీవిత గమనంలో ఎంతో తరచుగా ఒక రకమైన శూన్యత, అంటే ఖాళీ ఉన్న సమయం ఉంటుంది, అది కొన్ని నిమిషాలైనా కావచ్చు, కొన్నిసార్లు అంతకంటే ఎక్కువైనా కావచ్చు. మరి నువ్వు అప్పుడు ఏం చేస్తూ ఉంటావు? వెంటనే నువ్వు నీ దృష్టిని మరల్చడానికి ప్రయత్నం చేస్తావు, అప్పుడు నువ్వు ఏదో ఒక మూర్ఖ వ్యాపకాన్ని, లేకపోతే ఇంకేదైనా చేస్తూ ఆ సమయాన్ని గడిపేస్తావు. అది సాధారణ విషయం. చిన్నవారి నుండి పెద్దల వరకు మనుషులందరూ విసుగు రాకుండా ఉండే విధంగా సమయాన్ని గడిపేస్తారు. వారికి ఇష్టమైన విసుగుతో ఉండడం, ఆ విసుగు నుండి తప్పించుకోవడానికి మార్గాన్ని వెతుక్కోవడానికి మూర్ఖంగా ప్రవర్తించడం.

సరే, పై దాని కంటే మెరుగైన మార్గం ఉంది - గుర్తుంచుకుని అనుసరించడానికి నీకు కొంచెం సమయం దొరికినప్పుడు, అది ఒక గంట లేదా కొన్ని నిమిషాలు అయినా, నీకు నీవు ఇలా చెప్పుకో: "చివరికి, నా మనసును ఏకాగ్ర పరచడానికి నాకు సమయం దొరికింది, నన్ను నేను సమీకరించుకోవడానికి, నా జీవిత లక్ష్యాన్ని పునరుద్ధరించడానికి, నన్ను నేను శాశ్వత సత్యానికి సమర్పించుకోవడానికి నాకు కొంత సమయం ఉంది." నీవు బయటి పరిస్థితుల వల్ల వేధించబడని ప్రతిసారీ దీన్ని జాగ్రత్తగా అనుసరించగలిగితే , నీవు నీ మార్గంలో చాలా త్వరగా ముందుకు సాగుతున్నావని నీవు కనుగొంటావు. కబుర్లు చెప్పుకోవడం, పనికిరాని పనులు చేయడం, చేతనను తగ్గించే విషయాలను చదవడం వంటి వాటితో సమయాన్ని వృథా చేసే బదులు - ఉత్తమమైన పనులు మాత్రమే ఎంచుకోవాలి, నేను ఇక్కడ చాలా తీవ్రంగా మూర్ఖత్వం నిండిన పనుల గురించి మాట్లాడటం లేదు - నిన్ను నీవు గజిబిజిగా మార్చుకోవడానికి ప్రయత్నించే బదులు, ఇప్పటికే చాలా తక్కువగా ఉన్న సమయాన్ని (ఎంత

తక్కువగా ఉందంటే అది కేవలం నీవు నీకున్న సమయంలో మూడు వంతులు కోల్పోయానని నీ జీవిత చివరి దశలో గ్రహించడానికి సరిపోయేంత సమయం) చేజిక్కించుకుని, - అప్పుడు నీవు రెట్టింపు సమయాన్ని వెచ్చించాలనుకున్నా- అది పని చేయదు - అందుకని ఎప్పుడు మితంగా, సమతుల్యంగా, ఓపికగా, నిశ్శబ్దంగా ఉండటం మంచిది, నీకు ఇచ్చిన అవకాశాన్ని ఎప్పటికీ కోల్పోకుండా ఉండు, అంటే ఖాళీగా ఉన్న సమయాన్ని సరైన లక్ష్యాన్ని సాధించడానికి ఉపయోగించు.

నీకు ఏ పని లేనప్పుడు, నువ్వు చంచలంగా ఉంటావు, అటు ఇటు పరిగెత్తుతావు, స్నేహితులను కలుసుకుంటావు, లేకపోతే అలా దారి వెంబడి నడుచుకుంటూ వెళ్తావు, నేను మంచి వాటి గురించి మాట్లాడుతున్నాను. నేను అసలు చేయకూడని విషయాలు గురించి మాట్లాడడం లేదు. బదులుగా, ఆకాశం ముందు కానీ, సముద్రం ముందు కానీ లేకపోతే చెట్ల కింద కానీ, సాధ్యమైనంత నిశ్శబ్దంగా కూర్చో (ఇక్కడ నీకు అవన్నీ ఉన్నాయి), ఇప్పుడు చెప్పే వాటిల్లో ఏదో ఒకటి అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించు - నువ్వు ఎందుకు జీవిస్తున్నావో అర్థం చేసుకోవడానికి, నువ్వు ఎలా జీవించాలో తెలుసుకోవడానికి, నువ్వు ఏమి చేయాలనుకుంటున్నావో, వాస్తవానికి ఏమి చేయాలో దాని గురించి ఆలోచించడం, నువ్వు ప్రస్తుతం నివసిస్తున్న అజ్ఞానం, అసత్యం, బాధ నుండి తప్పించుకోవడానికి ఉత్తమ మార్గం ఏమిటి అని.

*CWM 3: 253-54*

## సంతోషం

ఈ కవితా పంక్తులు చాలా అందంగా ఉన్నాయి. మనం వాటిని ఇలా అనువదించవచ్చు: "ఏమీ లేనివాడు సంతోషంగా ఉంటాడు, అతను ప్రకాశమయ దేవతల ఆనందంలో పాలుపంచుకుంటాడు. ఏమీ లేకపోవడం అంటే దేనినీ ఉపయోగించకపోవడం, ఒకరి వద్ద ఏదీ ఉండకూడదని అర్థం కాదు. "ఏదీ లేనివాడు సంతోషంగా ఉంటాడు": అతను స్వాధీనత భావం లేనివాడు, వస్తువులు తన వద్దకు వచ్చినప్పుడు వాటిని ఉపయోగించుకోగలడు, అవి తనవి కావని, అవి పరమాత్మకి చెందినవని అవగాహనతో ఉండడం వల్ల వస్తువులు దూరమైనప్పుడు వాటి గురించి చింతించడు. తనకు ఈ

వస్తువులను ఇచ్చిన భగవంతుడు ఇతరులు ఆనందించడానికి వాటిని తన నుండి తీసివేయడం చాలా సహజమని భావించగలడు. అలాంటి వ్యక్తి వస్తువులు ఉన్నప్పుడు వాటిని ఉపయోగించడంలో, వస్తువులు లేని సమయంలో కూడా సమాన ఆనందాన్ని పొందుతాడు. వస్తువులు నీ వద్ద ఉన్నప్పుడు, నీవు వాటిని భగవత్ అనుగ్రహంగా, భగవంతుడు ఇచ్చే బహుమతిగా స్వీకరిస్తావు, ఆ వస్తువులు నిన్ను విడిచిపెట్టినప్పుడు, నీవు పేదరికపు సంతోషంలో జీవిస్తావు. ఎందుకంటే, నేను యజమానిననే భావం నిన్ను వస్తువులపై అతుక్కుపోయేలా చేస్తుంది, నిన్ను వాటికి బానిసలుగా చేస్తుంది, ఆ భావం లేకపోతే మనిషి నిరంతరం ఆనందంగా జీవించవచ్చు, వచ్చి పోయే విషయాలు, జరిగిపోయిన విషయాల నిరంతర కదలికలో జీవించవచ్చు. ఆ వస్తువులు నీ దగ్గర ఉన్నప్పుడు, అవి నీకు సంపూర్ణత్వ భావనను ఇస్తాయి , అవి నీ దగ్గర నుంచి దూరమైనప్పుడు, నిస్సంగత్వ ఆనందాన్ని ఇస్తాయి. ఆనందం!

ఆనందం అంటే సత్యంలో జీవించడం, శాశ్వతత్వంతో సహజీవనం చేయడం, సత్యవంత జీవితాన్ని ప్రకాశం ఎప్పటికి విఫలం చేయదు.

ఆనందం అంటే స్వేచ్ఛగా ఉండడం, వాస్తవిక స్వేచ్ఛను పొంది స్వేచ్ఛగా ఉండడం, దివ్య సంకల్పంతో స్థిరమైన మార్పులేని ఐక్యత కలిగి ఉండే స్వేచ్ఛ. సంకుచితత్వం, అల్పత్వం, అవాస్తవం, అసత్యం వీటన్నిటితో ఉన్న భౌతిక జీవితపు దురదృష్టాలకు కట్టుబడని, అమరత్వం కలిగిన వారు దేవుళ్లు.

దేవతలు అంటే ప్రకాశం వైపు తిరిగిన వారు, శక్తి, జ్ఞానంలో నివసించేవారు. అదే బుద్ధుడు చెప్పింది, ఆయన ఉద్దేశం మతానికి సంబంధించిన దేవుళ్లని కాదు. వారు దివ్య స్వభావాన్ని కలిగి ఉంటారు, వారు మానవ శరీరాలలో నివసించినా అజ్ఞానం, అసత్యం నుండి విముక్తి పొంది ఉంటారు.

నీ దగ్గర ఏమీ లేనప్పుడు, నువ్వు విశ్వం వలె విశాలంగా మారవచ్చు.

*CWM 3 : 253- 54*

## వివేకివై జీవించు

జ్ఞానవంతులుగా మారడానికి, సాధారణంగా చెప్పే కారణాలు, చాలా వరకు పనికిరాని కారణాలని నాకు ఎప్పుడూ అనిపిస్తుంది. 'ఇది చేయవద్దు,

ఇది నీకు బాధ కలిగిస్తుంది, అలా చేయవద్దు, అది నీలో భయాన్ని రేకెత్తిస్తుంది" ఇలా నీ చైతన్యం చాలా వరకు ఆవిరైపోతుంది, అది జఠిలంగా మారుతోంది, ఎందుకంటే అది దుఃఖానికి, బాధకి భయపడుతోంది.

ఒక ప్రత్యేకమైన చైతన్య స్థితి ఉన్నదని చెప్పటం మంచిదని నేను భావిస్తున్నాను. ఆకాంక్ష మరియు నిరంతర అంతర్గత ప్రయత్నం ద్వారా ప్రతి ఒక్కరు దానిని సాధించగలరు, ఆస్థితిలో ఆనందం మిశ్రితం కాని, క్రీనీడ లేని వెలుగులో, భయంకలిగించే పరిస్థితులన్నీ అదృశ్యం అయిపోతాయి. ఇది ఒకరు తనకోసం తాను బ్రతుకని స్థితి, ఇక్కడ తాను ఏ పని చేసినా, ఏ అనుభూతి పొందినా, ప్రతీక్షణం ఆ పరమాత్మకు అచంచలమైన విశ్వాసంతో సమర్పించడమే. ఆ విధంగా సమర్పించడం వలన, తన బాధ్యతలన్నింటి నుండి, తను స్వతంత్రుడు అవుతాడు, అప్పుడు తనకు ఎలాంటివి భారంగా అనిపించవు.

తనగురించి తాను ఆలోచించవలసిన పని లేకుండా, తన గురించిన బాధ్యతలేవీ లేకుండా ఉండటం, ఇది వర్ణించలేని ఆనందం. తన గురించి తాను ఆలోచించడం, ఏది చేయాలి, ఏది చేయకూడదు అని ఆలోచించి బాధపడటం, మనకు ఏది మంచిది, ఏది చెడు అని విచారించడం, వేటికి దూరంగా ఉండాలి, వేటిని అనుసరించాలి. ఇవన్నీ ఆలోచించడం చాలా అసహనానికి, నిస్తేజానికి గురి చేస్తుంది. సర్వోత్కృష్టమైన ప్రజ్ఞ, అత్యున్నతమైన ప్రకాశం సర్వోన్నతమైన ప్రేమ మొదలైన లక్షణాలు గల పరాత్పర చైతన్యం ముందు ఎవరైతే సూర్యకాంతికి వికసించిన పుష్పం వలె చాలా పారదర్శకంగా జీవిస్తారో, వారి సమస్త విషయాలు పరాత్పర చైతన్యం నిర్వర్తిస్తుంది, నీకే ప్రతిదీ చేసిపెడుతుంది. ఇకపై ఎటువంటి బాధలు ఉండవు, ఇది ఒక ఆదర్శవంతమైన స్థితి.

కానీ ఇది ఎందుకు జరగట్లేదు?

ఎవరూ దాని గురించి ఆలోచించరు, అది చేయడం మర్చిపోతారు. వారి పాత అలవాట్లు తిరిగి వస్తాయి.

అన్నిటినీ మించి నీ మదిలోతుల్లో లేదా నీ అంతర లోతుల్లో, అవచేతన లోనూ, నిశ్చేతనలోనూ నీవు జాగ్రత్తగా ఉండకపోతే, నిన్ను దురదృష్టం వరిస్తుందనే కృత్రిమ సందేహం మొదలై నీ చెవిలో మారుమ్రోగుతుంది. నీ

గురించి నీవు గమనించడం మర్చిపోతే, ఏం జరుగుతుందో నీకే తెలియదు, నీవు చాలా నిగూఢంగా వెర్రితనంగా, చాలా తెలివి తక్కువతో ఆ సందేహాన్ని విని నీపై నీవు దృష్టి సారించడం మొదలు పెడతావు, దానిద్వారా మొత్తం వ్యర్థమైపోతుంది.

నీవు చింతించకుండా ఉండటం కోసం, నీ కణాల్లో కొంచెం ప్రజ్ఞను, కొంచెం వివేకాన్ని నింపి మరలా మొదటి నుండి ప్రారంభించాలి.

*CWM 3:256-57*

## అవసరమైన మాటలు మాత్రమే మాట్లాడండి.

మీలో ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని నేను సూచిస్తున్నాను, ఓ! ఎక్కువ సమయం కాదు, కనీసం ప్రతీ రోజు ఒక గంట మాత్రమే. ఖచ్చితంగా అనివార్యమైన (అవసరమైన) పదాలు తప్ప మరేమీ మాట్లాడవద్దు. ఒక మాట ఎక్కువ మాట్లాడవద్దు, ఒక మాట తక్కువా వద్దు.

మీ జీవితంలో ఒక గంట సమయం తీసుకోండి, మీకు అత్యంత అనుకూలమైన సమయం, ఆ సమయంలో మిమ్మల్ని మీరు నిశితంగా గమనించండి, పూర్తిగా అవసరమైన మాటలను మాత్రమే చెప్పండి.

ప్రారంభంలో ఏది పూర్తిగా అనివార్యమైనది, ఏది కాదు అని తెలుసుకోవడం మొదటి సమస్య, ఇది ఇప్పటికే మీకొక అధ్యయనం, రోజులు గడిచే కొద్దీ మీరు దీనిని బాగా అర్థం చేసుకొంటారు.

తరువాత, వేరొకరు మీతో మాట్లాడనంత కాలం, మీరు మౌనంగా ఉండటం, మాకు ఏమాత్రం కష్టం కాదని మీరు తెలుసుకొంటారు, కానీ మీరు మాట్లాడటం ప్రారంభించిన వెంటనే, మీరు రెండు, మూడు లేదా పది, ఇరవై పనికిరాని పదాలు మాట్లాడుతారు, అస్సలు అవసరం లేని మాటలు మీరు మాట్లాడతారు.

*CWM 3:259*

మంచిగా ఉండటం కోసం మంచిగా ఉండండి

అవును, మీరు తిన్ననైన మార్గాన్ని అనుసరించాలి అనుకొంటే, మీరు వినమ్రంగా ఉండి, స్వచ్ఛత కోరుకొంటే, ఇతర విషయాలపై మీకు ఆసక్తి లేనివారైతే, మీరు ఏకాంత జీవితాన్ని గడపాలని, మరియు స్వచ్ఛమైన విచక్షణ

కలిగి ఉండాలని, కోరుకొంటే అన్నీ తేలిక అవుతాయనే భ్రమలో పడకండి దానికి భిన్నంగా జరుగుతుంది. మీరు అంతర్గత మరియు బాహ్య పరిపూర్ణత వైపు ముందుకు పురోగమించనారంభించినపుడే ఇబ్బందులు మొదలవుతాయి.

ఓ! "నేను ఇప్పుడు మంచిగా ఉండటానికి ప్రయత్నిస్తున్నాను, అందరూ నాకు చెడ్డవారిగా కనిపిస్తున్నారు" అని చాలామంది చెప్పడం నేను తరచుగా విన్నాను. కానీ ఇది ఖచ్చితంగా మీకు ఒక విషయం బోధించడానికే, అది ఏమంటే, ఒకరు ఒక అవసరం కోసం మంచిగా ఉండటం, మనతో ఇతరులు మంచిగా ఉండాలి అని మంచిగా ఉండటం కాకుండా, ప్రతి ఒక్కరూ మంచిగా ఉండటం కోసం మంచిగా ఉండాలి.

ఇక్కడ ఎల్లప్పుడూ ఒకటే పాఠం : ప్రతిఒకరూ చేయగలిగినంత బాగా చేయాలి. దాని ఫలితం ఆశించకుండా చేయగలిగిన మంచి చేయాలి. ఫలితాన్ని దృష్టిలో ఉంచుకొని చేయకూడదు. ఈ దృక్పథం, మంచి పనికి ప్రతి ఫలం వస్తుంది, జీవితాన్ని సులభతరం చేస్తుందని మంచిగా మారడం, అనేది మంచి పని నుండి అన్ని విలువలు తీసివేస్తుంది. మంచితనాన్ని ప్రేమించడం కోసం మీరు మంచిగా ఉండాలి, న్యాయాన్ని ప్రేమించడం కోసం న్యాయంగా, స్వచ్ఛతను కోరుకొని స్వచ్ఛంగా ఉండటం మరియు అనవసర విషయాల పట్ల అనాసక్తిగా ఉండటం వలన మీరు ఈ మార్గంలో ఖచ్చితంగా ముందుకు సాగుతారు.

*CWM 3:264-65*

## స్వేచ్ఛ - ఆనందం

ఒకరు అన్ని కోరికల నుండి విముక్తి పొందినపుడు, ఖచ్చితంగా అనంతమైన ఆనందం లోకి ప్రవేశిస్తాడని బుద్ధుడు చెప్పాడు. ఈ ఆనందం కొంచెం నిస్సారంగా ఉండవచ్చు. ఏదేమైన ఇది త్వరిత మార్గంగా నాకు అనిపించదు.

మొదట్లో ఎవరైనా సమస్యను వాస్తవికంగా స్వాధీనం చేసుకొంటే, ధైర్యం మరియు ధృఢ సంకల్పంతో దానిలోకి ప్రవేశించి, కోరికల కోసం, సుధీర్ఘమైన, కష్టమైన, బాధాకరమైన, నిరాశపరచే ప్రయత్నం చేసే బదులు తమను తాము సరళంగా, పూర్తిగా, ఎలాంటి నిబంధనలూ లేకుండా సర్వోన్నత సత్యానికి,

సర్వోన్నత చైతన్యానికి తనను తాను సమర్పించుకోవడం, అనేది మన అహాన్ని వదిలించుకోవడానికి చాలా వేగవంతమైన మార్గం. జనులు ఇది అనుసరించడానికి చాలా కష్టం అని అంటారు, కానీ ఇందులో కనీసం ఓ కాంతివంతమైన, ఉత్సాహవంతమైన, సృజనాత్మక జీవితం ఉంది.

కోరికలు లేనపుడు అహంకారం ఉండడానికి ఏమీ మిగలదు అనేది నిజం, దీని వలన చైతన్యం చాలా ధృడంగా మారి మన అహం ధూళిగా పోతుందనేది అభిప్రాయం ఉంది, అపుడు ఒకరి యొక్క అహంభావం కూడా ధూళిలో కలిసిపోతుంది. దానివలన ఒకరు నిర్వాణంలోకి ప్రవేశించడానికి సిద్ధం అవుతారు, ఈ విలయం చాలా సాధారణమైనది మరియు శుద్ధమైనది.

కానీ ఇక్కడ మనం నిజమైన నిర్వాణంగా పరిగణించేది, మన అహం అంతా పరమాత్మ చైతన్యంలో లయమైపోవడమే. ఈ మార్గాన్ని నేను సానుకూల మార్గం అని పిలుస్తాను. సమగ్రమైన, సంపూర్ణమైన, స్వీయ చింతనేలేకుండా, ఎలాంటి బేరసారాలు లేకుండా, తాను తన గురించి ఆలోచించకుండా, తనకోసం తాను బ్రతుకకుండా, పరమ సౌందర్యవంతమైన, ప్రకాశవంతమైన, రమణీయమైన, శక్తివంతమైన, కరుణామయమైన, మరియు అనంతమైన దాని గురించి మాత్రమే ఆలోచించడంలో, మరే ఇతరమైన వాటితో పోల్చలేనంత ప్రగాఢమైన ఆనందం ఉంది.

ఇదొక్కటే అర్థమైనది, ప్రయత్నించడానికి యుక్తమైనది. మిగిలినదంతా కేవలం పురోగమించకుండా కాలాన్ని గడపడమే.

ఒక అడుగు ఒక అడుగు వేసుకుంటూ వందల ఏళ్ళ పాటు మెల్లగా శ్రమిస్తూ, పర్వతం చుట్టూ తిరుగుతూ దాన్ని అధిరోహించడానికి, కనిపించని రెక్కలు విప్పి నేరుగా శిఖరాన్ని చేరడానికి మధ్య ఉన్నంత తేడా అది.

## ఒంటరిగా జీవించడం

అరణ్యంలో ఒంటరిగా జీవించేవారు చాలామంది వారి చుట్టూ ఉన్న జంతువులతో, వృక్షాలతో సహవాసం చేయడం గమనిస్తూ ఉంటాం. కానీ ఒంటరిగా ఉండటమన్నది ఒక ఆంతరిక ధ్యానంలోకి, సర్వోన్నత సత్యంతో సంయోగం లోకి ప్రవేశించే శక్తిని ఇస్తుందనటం అసలు యథార్థం కాదు. నిజానికి పరిస్థితుల ఒత్తిడి వల్ల నీకు చేసేది ఏదీ లేకపోవడం దానిని ఇంకా

సులభం చేస్తుంది, కానీ నేను దానిని అంగీకరించలేను. మనిషి ఎప్పటికీ వ్యాపకాలను ఆవిష్కరించుకుంటూ ఉండాలి, నా జీవిత అనుభవ ప్రకారం కష్టాల మధ్యలో వ్యక్తి తన స్వభావాన్ని లొంగదీసుకోవడంలో విజయవంతం అయితే , శాశ్వతుని సన్నిధితో తనలో తాను ఒంటరిగా ఉండటానికి శ్రమించినపుడు, దివ్య అనుగ్రహం మనకిచ్చిన పరిసరాలను అదేవిధంగా ఉంచుకుంటూ... అప్పుడు సాక్షాత్కారాన్ని పొందితే, అది అనంతంగా ఇంకా సత్యమైనది, ఇంకా ఎక్కువ గాఢమైనది, ఇంకా ఎక్కువ కాలం నిలిచి ఉండేదిగా నాకు కనిపిస్తుంది.

కష్టాలను అధిగమించాలంటే వాటి నుండి పారిపోవటం దాని పరిష్కారం కాదు. ఆధ్యాత్మిక జీవితాన్ని అన్వేషించే వారిలో కొంత భాగం ఇలా అంటుంది," ఓహ్ ! ఒంటరిగా చెట్టు క్రింద కూర్చుని, ధ్యానంలో ఉంటూ, మాట్లాడటానికి, పనిచేయడానికి ఎలాంటి ఆసక్తి లేకుండా ఉండటం ఎంత బాగుంటుంది ?" ఇలా ఎందుకు అనిపిస్తుందంటే అక్కడ ఒక బలమైన ఏర్పాటు ఉంది. కానీ ఇది భ్రాంతికరమైనది.

హఠాత్తుగా కలిగేవి అత్యుత్తమ ధ్యానాలు ఎందుకంటే అవి ఒక తప్పించరాని ఆవశ్యకతలాగ ఒక్కసారిగా నిన్ను స్వాధీనం చేసుకున్నవి గనుక. నీకు ఏకాగ్రత నిలుపడము, ధ్యానం చేయడము, ప్రకటనలకు అతీతంగా చూడటము తప్ప వేరే ఎంపిక లేదు, అది ఒక అరణ్యపు ఒంటరితనంలో నిన్ను స్వాధీనం చేసుకోవాలి, నీలో కొంత సిద్ధంగా వున్నపుడు, సమయం ఆసన్నమైనపుడు, నిజమైన అవసరం వచ్చినపుడు, అనుగ్రహం నీతో ఉన్నప్పుడు అది జరుగుతుంది.

మానవజాతి కొంత పురోభివృద్ధి చెందింది, కానీ నిజమైన విజయం జీవితంలో సాధించబడవలసి

ఉన్నట్లుగా కనిపిస్తుంది.

అన్ని పరిస్థితులలో శాశ్వతునితో, అనంతత్వంతో ఒంటరిగా ఎలా జీవించాలో నువ్వు తెలుసుకోవాలి. సకల వ్యాపకాలలో సర్వోత్కృష్టుడే నీ సహచరుడుగా ఎలా స్వేచ్ఛగా ఉండాలో నీకు తెలిసి ఉండాలి. వాస్తవానికి అది నిజమైన విజయం.

*CWM 3;276*

## మార్గంపై పురోగమించడం

నిన్ను ఏడిపించాలని నీ గురించి ఇతరులు మాట్లాడే బుద్ధిలేని ప్రసంగాలకు నువ్వు కలత చెందినా, బాధపడినా, నిరుత్సాహపడినా, నీ మార్గంలో ఎక్కువదూరం ముందుకు సాగలేవు. అటువంటి విషయాలు నీ దురదృష్టం వల్లనో లేక నీ విధి బాగలేకనో నీ వద్దకు రావడం లేదు. దానికి భిన్నంగా దివ్యచైతన్యము, దైవ అనుగ్రహము నీ దృఢ సంకల్పాన్ని తీవ్రంగా తీసుకుని, పరిస్థితులను నీ మార్గంలో ఒక గీటురాయి అయ్యేట్లుగా అనుమతించడానికి, నీ సంకల్పంలో నిజాయితీ వుందా, నువ్వు కష్టాలను ఎదుర్కొనేంత బలంగా వున్నావా లేదా ! అని చూడటానికి వస్తాయి.

కనుక ఎవరైనా నిన్ను ఎగతాళి చేసినా, లేదా నిర్దయగా మాట్లాడినా మొదట నువ్వు చేయాల్సింది, ఎలాంటి బలహీనత లేక అపరిపూర్ణత అలా జరగడానికి అనుమతించింది ? అని నీలోకి నువ్వు చూసుకోవడం తప్ప, నిరుత్సాహ పడడం, కోపం తెచ్చుకోవడం, దూకుడుగా ప్రవర్తించడం చేయకూడదు, ఎందుకంటే నువ్వు నిజమైన విలువ కలదిగా భావించేదానిని మనుష్యులు అభినందించరు. దానికి విరుద్ధంగా నువ్వు సరిచేసుకోవలసిన నీ బలహీనతను లేక, అపరిపూర్ణతను లేక విరూపాన్ని నీకు చూపించినందుకు దైవ అనుగ్రహానికి నువ్వు ధన్యవాదాలు చెప్పుకోవాలి.

కాబట్టి బాధగా ఉండటానికి బదులు పూర్తిగా సంతృప్తి చెంది, నీకు వ్యతిరేకంగా ఉద్దేశితమైన హాని నుండి అవకాశాన్ని, ఒక గొప్ప అవకాశాన్ని సంగ్రహించు.

*CWM 3:382*

## ఒక అడుగు వెనుకకు వేసి ఆలోచించడం

మీలో చాలామంది బాహ్య ప్రభావాల స్పర్శకు తెరుచుకుని మీ అస్తిత్వపు ఉపరితలంలో జీవిస్తూ ఉంటారు. నీ దేహానికి బయట అది వున్నట్లుగా పూర్తి ప్రక్షేపణతో జీవిస్తావు, అదే విధంగా ప్రక్షేపణతో ఉన్న అప్రసన్న వ్యక్తిని కలిసినప్పుడు కలత చెందుతావు. మొత్తం సమస్య నువ్వు వెనుక అడుగు వేయడానికి అలవాటు పడకపోవడం వల్ల ఉత్పన్నమవుతుంది. ఎప్పటికీ నీలోకి నువ్వు అడుగేయాలి - అంతర లోతుల్లోకి పయనించడం నేర్చుకోవాలి- అడుగు వెనక్కి వేయి, జాగ్రత్తగా ఉంటావు. బయటి ప్రపంచంలో చలిస్తున్న

ప్రాపంచిక శక్తులకు నిన్ను నువ్వు ఇచ్చుకోవద్దు. ఏదైనా చేయడానికి ఎంత తొందరలో ఉన్నా ఒకింత సమయం వెనక్కి తగ్గి ఆలోచించి చేస్తే, ఎంత తొందరగా, ఎంత గొప్ప విజయవంతంగా నీ పని పూర్తవుతుందో కనుక్కొని ఆశ్చర్యపోతావు. ఒకవేళ ఎవరైనా నీ పట్ల కోపంగా ఉంటే అతని స్పందనలలో పట్టుబడకుండా వెనుకకు తగ్గు, అప్పుడు ఎలాంటి ప్రోత్సాహం, బలము, ప్రతిస్పందన లేని అతని కోపం అదృశ్యమవుతుంది. ఎప్పటికీ నీ శాంతిని నిలుపుకో, దాన్ని పోగొట్టే అన్ని ప్రలోభాలను నిరాకరించు. వెనక్కు తగ్గకుండా ఎప్పుడూ దేనినీ నిర్ణయించవద్దు, వెనుకడుగు వేసి ఆలోచించకుండా ఒక్క పదం కూడా మాట్లాడవద్దు, వెనకడుగు వేసి ఆలోచించకుండా చర్యలోకి నిన్ను నువ్వు తోసుకోవద్దు. సాధారణ ప్రపంచానికి చెందినదంతా అశాశ్వతం, క్షణికం, కాబట్టి అక్కడ కలత చెందటానికి అర్హమైనది ఏదీ లేదు. ఏది నిలిచేదో, శాశ్వతమో, అమరమో, అనంతమో అది పొందడానికి, జయించడానికి, కలిగి ఉండటానికి అర్హమైనది. అది దివ్య ప్రకాశం, దివ్య ప్రేమ, దివ్య జీవితం- అది సర్వోన్నత శాంతి, పరిపూర్ణ సంతోషం, పృథ్విపై మొత్తం అభివ్యక్తిని కిరీటంగా గల సర్వ- ఆధిపత్యం. విషయాల పరస్పర అనుబంధం గురించిన జ్ఞానం నీకు వచ్చినప్పుడు నీకు ఏది జరిగినా వెనుకడుగు వేసి చూస్తావు. నిశ్శబ్దంగా వుంటూ దివ్యశక్తిని పిలిచి సమాధానం కోసం వేచి చూస్తావు. అప్పుడు ఖచ్చితంగా ఏం చేయాలో నీకు తెలుస్తుంది. గుర్తుంచుకో, కనుక నువ్వు చాలా ప్రశాంతంగా ఉండటానికి ముందు సమాధానం అందుకోలేవు. ఆ అంతరిక శాంతిని సాధన చేయి, కనీసం ఒక చిన్న ప్రారంభాన్ని చెయ్యి, అది నీలో ఒక అలవాటుగా అయ్యేవరకూ నీ సాధనలో ముందుకు సాగు.

*CWM 3:160*

## నిజమైన దృక్పథం

ఒక సన్యాసిలా ఉండటం గానీ, లేదా కోరికను భోగించడం కానీ నిజమైన దృక్పథం కాదు. నేను ఇచ్చినదానిని పూర్తి నిరాడంబరంగా తీసుకోవడము, దానితో పరిపూర్ణంగా తృప్తి చెందడం, ఎక్కువ అడగకపోవటం, లేదా ఇచ్చిన దానిని నిరాకరించకపోవడం అనేది సరైన దృక్పథం. సాధకులుగా తమ కర్తవ్యాలను బాగా అర్థం చేసుకోవడానికి ఇతరులకు ఇవ్వవలసిన నిజమైన ఉదాహరణ ఇది.

*CWM 14:47*

మనం ఓరిమితో ఉండాలి.

వాస్తవానికి నువ్వు మొత్తం చైతన్యంతో ముందుకు సాగే కొద్దీ, ఇంకా ఎక్కువ సజీవంగా, సత్యంగా, స్థిరంగా అయ్యేకొద్దీ మొదట నువ్వు ఎంత నిజాయితీ లేకుండా, కపటము, అవిశ్వాసము సందేహము, మూర్ఖత్వాల ఒక కుళ్లిన మూటలా ఉండేవాడివో ఊహించలేవు. ఎందుకంటే (ఎలా వివరించాలి?) అస్తిత్వ భాగాల మధ్యన సంతులనం మారేకొద్దీ, ప్రకాశిత భాగం ఎక్కువయ్యేకొద్దీ, మిగిలినది ఇంకా ఎక్కువ చాలనంతగా, భరించలేనంతగా అవుతుంది. అప్పుడు నిజంగా నువ్వు పూర్తిగా ఏవగించుకుంటావు (చాలాకాలం క్రితం ఇది నన్ను బాధించేది, ఎంతో కాలం కాదు, ఏమైనా కొన్ని సంవత్సరాల క్రితం...) అన్న ఈ కదలిక అక్కడ ఎక్కువగా ఉంటుంది (అది ఒక యాదృచ్ఛికమైన, సహజ చలనం, సంపూర్ణమైనది ) "దాని గురించి నేనేమి చేయలేను. అది అసాధ్యం, నేను చేయలేను, ఇది ఎంత పెద్ద పని అంటే నేను చేయలేను- ప్రభూ, నా కోసం నీవు చెయ్యి." ఇది నువ్వు ఒక చిన్నపిల్లవాడి సరళత్వంతో చేస్తే (సమర్పణకు చెందిన సంజ్ఞలతో) నిజంగా ఇలాగ నువ్వు చేయలేవని నీకు తెలుసా, అలా నువ్వు అది చేయలేవని నిజంగా అంగీకరిస్తావు.." అది సాధ్యం కాదు. నేను ఎప్పటికీ అది చేయలేను నీవు నా కోసం చేయాలి, "అని. కానీ తర్వాత "అద్భుతం- ఆయన చేశాడు అని మూగబోతావు : "ఎలా ఇది జరిగింది!" ఇక్కడ చాలా విషయాలున్నాయి.. అలాంటివి అదృశ్యమయ్యి, ఇహ ఎప్పటికీ తిరిగిరానివి.... పూర్తయ్యింది. కొంతకాలం తర్వాత "ఇది ఎలా జరిగింది? అది అక్కడ వుంది, అలా ఫట్‌మని ఒక క్షణంలో పూర్తయ్యింది" అని ఆశ్చర్యపోతావు. కానీ అక్కడ వ్యక్తిగత ప్రయత్నం ఉన్నంతవరకు, అది... ఉఫ్... అది ఎలా ఉంటుందంటే ఒక మనిషి కొండపైకి తన పీపాను దొర్లించి నట్లు... మరునిమిషం అది మళ్లీ కొండ మీద నుండి క్రిందకు పడిపోతుంది.

కానీ అది అసంకల్పితంగా ఉండాలి., ఒక లెక్కప్రకారం కాదు, అది ఒక భావనతో చేయకూడదు, "అప్పుడు అది పనిచేస్తుంది. "అది నిజంగా నీ పూర్తి నిస్సహాయతతో "దయచేసి నువ్వే చేయాలి. నేను చేయలేను- అసాధ్యం" అన్నదృఢమైన ప్రమాణంలో జరగాలి.

తత్వవేత్తలు, మేధావులు నీ మీద జాలి చూపించవచ్చు, కానీ వ్యక్తిగతంగా నేను పట్టించుకోను, నేను పట్టించుకోను నేను ఒక వేదాంతిని కాను, ఒక

మేధావిని కాను, అంత తెలివిమంతురాలిని కాను.. ఇది నేను బిగ్గరగా ప్రకటిస్తున్నాను. ఒక వేదాంతిని కాను, మేధావిని కాను, తెలివిమంతురాలిని కాను. ఎటువంటి నటన లేదు. ఒక సాహిత్యవేత్తను కాను, ఒక కళాకారిణిని కాను నేను ఏమీ కాను. నేను పూర్తిగా దీనికి అంగీకరిస్తున్నాను. ఇది పూర్తిగా అప్రాముఖ్యమైనది- ఇలా ఉండటం మానవులకు పరిపూర్ణత.

నువ్వు ఏమీ చేయలేవని, పూర్తిగా నిస్సహాయుడవని తెలుసుకోవడాన్ని మించిన గొప్పతనం మరొకటి లేదు, అది చేసే వ్యక్తివి నువ్వు ఒక్కడివే కాదు, నువ్వు చేసిన ఆ కొంత చిన్నది గానీ, పెద్దది గానీ అది ముఖ్యం కాదు-అది పరమ ప్రభువు చేత చేయబడింది, దాని బాధ్యత మొత్తంగా ఆయనదే. ఇలా ఉండటం నిన్ను ఆనందంగా ఉంచుతుంది. దానితో నువ్వు సంతోషంగా ఉంటావు.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ, ఆగష్టు **11, 1964.***

## వినయంగా వుండటం

కేవలం సర్వోన్నత చైతన్యం, సర్వోన్నత సంకల్పం మాత్రమే ఉనికిలో ఉన్నాయని, 'నేను' కాదని తెలుసుకోవడమే నిజమైన నమ్రత.

మనసులో, ప్రాణికంలో, శరీరంలో వినమ్రంగా ఉండటమంటే దైవం లేకుండా వాటికేమీ తెలియదని ఎప్పుడూ మరువకుండా ఉండటం, అవి ఏమీ కాదు, దైవం లేకుండా ఏమీ చేయలేవు. దైవం లేకుండా అవి ఏమీ కాదు అజ్ఞానంలో, గందరగోళంలో, అసమర్థతతో ఉంటాయి. దైవమే సత్యం, జీవితం, శక్తి, ప్రేమ, సౌలభ్యం.

కనుక మనసు, ప్రాణము, శరీరాలు దైవాన్ని నిర్ణయించడానికి, అర్థం చేసుకోవడానికి మొత్తంగా అసమర్థులని తెలుసుకోవాలి, అనుభూతించాలి, కేవలం ఆయన తత్వ సారంలోనే కాదు ఆయన చర్యలో, అభివ్యక్తిలో కూడ.

ఇది మాత్రమే నిజమైన నమ్రత, దీనితోనే నిశ్శబ్దము, శాంతి వస్తాయి.

అలాగే ఇది సకల ప్రతికూల శక్తుల దాడిని ఎదుర్కొనే ఖచ్చితమైన రక్షణకవచం. వాస్తవంగా మనుష్యులలో అతిశయపు ద్వారంలోనే ఎప్పటికీ శత్రువుల తట్టడాలు ఉంటాయి, ఎందుకంటే ఈ ద్వారమే అవి ప్రవేశించడానికి తెరుచుకునేది.

నీ వ్యక్తిగత విలువ లేదా నీ వ్యక్తిగత సాక్షాత్కారము ఏదైనా యోగంలో మొట్టమొదటి ఆవశ్యక లక్షణం నమ్రత.

ఒక నిజమైన, నిజాయితీ గల వినయం మనల్ను రక్షిస్తుంది, అహంకారం ఆవశ్యకంగా కరిగిపోవడానికి ఖచ్చితమైన మార్గం.

నమ్రత, నిజాయితీ ఉత్తమ సంరక్షకులు. అవి లేకుండ ప్రతి అడుగు ప్రమాదకరమే, వాటితో విజయం తథ్యం.

*CWM 14:152,53*

## వ్యక్తి తన అహాన్ని జారవిడవడం

వ్యక్తి సృష్టిలో నుండి బయట పడడం దగ్గరకే చేరుకుంటే ఈ సమస్త సృష్టి ఈ విశ్వావతరణ అంతా కలసి ఒక పనికిరాని హాస్యోక్తిగా కనిపిస్తుంది. ఈ సృష్టి నుండీ బయటపడిపోవడమే మన కర్తవ్యమైతే ఇదంతా ఎందుకు మొదలయ్యింది. ఇంతగా పోరాడి, ఇంతగా వేదన చెంది, దృశ్యమాన జగత్తు కూడా సృష్టించబడి, విషాదాంతంగా, నాటకీయంగా ముగిసిపోవడంలో గల ప్రయోజనమేముంది? ఈ సృష్టిలో నుండీ ఎలా బయటపడాలో బోధించడమే ప్రధానమయితే ఇది అసలు ప్రారంభమవ్వకపోవడమే మంచిదిగా ఉండేది.

కాని ఈ విషయ లోతుల్లోకి గనుక మనిషిపోయి చూస్తే తన అహంకారాన్నే గాక, సమూలంగా అహాన్ని కూడా ఒలిచి పడేసి, తనదంటూ పూర్తిగా ఎటువంటి స్వీయచింతన లేకుండా, అనాసక్తంగా సమర్పించుకోగల్గితే అప్పుడు ఆ మనిషి పరమ ప్రభువు ప్రణాళికను అర్థం చేసుకోగల్గుతాడు. అప్పుడు ఇదొక పనికిరాని హాస్యోక్తి కాదని ఆది బిందువు దగ్గరకే, మళ్ళీ వెనుకకే మరలిపోయే, ఒక దెబ్బతిన్న, ఒక చిత్రహింస్మాత్మకమైన జీవన మార్గం కాదని తెల్సుకొంటాడు; దీనికి భిన్నంగా ఈ సమస్త సృష్టి ఆ ఆనందానికి ఆ సౌందర్యానికి ఆ మహాత్యాగానికి చెందిన ఆనంద అస్తిత్వమని, మహత్వ అస్తిత్వమని, మహనీయమైన ఉత్కృష్ట జీవనమని, నిరంతర వికాసమని, సతత వికాసోన్ముఖమని బోధించడం కోసమేనని తెలుసుకొంటాడు. అప్పుడిదంతా అర్థవంతమైనది అవుతుంది. ఇక ఏ మనిషీ వేదన, సంఘర్షణలకు గురౌతూ ఇక్కడ జీవిస్తున్నందుకు విచారపడడు. అప్పుడు దివ్య లక్ష్యాన్ని సిద్ధింప చేసుకోవడంలో ఉత్సాహంతో ఉంటూ ఆ లక్ష్య సిద్ధి, విజయం పట్ల దృఢ విశ్వాసంతో, ఏ మాత్రం వెనుకాముందు ఆలోచించక ఆ సాక్షాత్కార సాధనలో నిమగ్నమైపోతాడు.

కాని దానిని తెలుసుకోవాలంటే అహంకారికంగా ఉండటాన్ని, పరాత్పర మూలం నుండీ విడివడి, వేరు వ్యక్తిగా తన వైపుకు తాను తిరిగిపోవడాన్ని ఆపు చేయాలి, అప్పుడు ఆ వ్యక్తి నిజమైన లక్ష్యాన్ని గ్రహించగల్గుతాడు. ఇది ఒక్కటే దానికి మార్గం.

అహాన్ని జారవిడవాలి, అదొక పనికిరాని వస్త్రంలా దాన్ని పడిపోనివ్వాలి. ఫలితానికి తగిన ప్రయత్నాలు జరగాలి. అప్పుడు తన మార్గమంతా ఒంటరిగా పోడు. అతడు నమ్మితే అతడికి సహాయం అందుతుంది.

నీవు గనుక ఒక క్షణం పాటు దివ్యానుగ్రహంతో సంపర్కం చెందగల్గితే ఆ అద్భుత దివ్యానుగ్రహం తనతో పాటు నిన్ను గైకొనిపోతుంది. మార్గంలో నిన్ను వేగవంతం చేస్తుంది. నీవు ఆదుర్దా పడాల్సిన దాన్ని కూడా నీవు మర్చిపోయేలా చేస్తుంది. నీవు గనుక ఒక సెకను పాటు దివ్యానుగ్రహ సంకల్పంలో ఉంటే ఇక దాన్ని మర్చిపోవడానికి ప్రయత్నించవు. ఎటువంటి చిక్కులు లేని పసిపిల్లవాడిలోని సరళత, నిష్కాపట్యంతో ఆ దివ్యానుగ్రహానికి నిన్ను నీవు ఇచ్చి వేసుకో. ఇకపై ప్రతిదీ ఆ దివ్యానుగ్రహాన్నే చేయనివ్వు.

ఈ విషయంలో ఏది వ్యతిరేకిస్తున్నదో దాన్ని వినకుండా ఉండటం, ఏదైతే విభేదిస్తుందో దాన్ని నమ్మకుండా ఉండటం అత్యావశ్యకం. దివ్యానుగ్రహాన్ని నమ్ముకోవడం, ఒక నిజమైన విశ్వాసం, ఒక దృఢ విశ్వాసంతో ఉండటమే నిన్ను నీవు సంపూర్ణంగా, ఎటువంటి లెక్కలు వేయకుండా, బేరసారాలు చేయకుండా సమర్పించుకొనెలా చేస్తుంది. విశ్వాసం! "ఇది చెయ్యి, ఇది నా కోసం చేసిపెట్టు దీన్ని నీకే అప్పచెబుతున్నాను" అనే విశ్వాసం ఉండాలి.

అదే శ్రేష్ఠమైన విధానం.


CWM 9:426-27

## నిజమైన పురోగమనానికి సంకేతం

తప్పనిసరేమీ కాదు. ఒక వ్యక్తి ఏదో అనుభవంతో ఉన్నాడు కాబట్టి చాలా ముందంజలో ఉన్నాడని అనుకోవలసిన అవసరమేమీ లేదు. వ్యక్తి ఇంకా సమగ్రంగా అభివృద్ధి చెందలేదనే వాస్తవికత మూలంగా సరళత, వినమ్రత, నమ్రతలకు సంబంధించిన ఒక మౌలికాంశం అతనిలో కొరవడింది. తాను ఎదుగుతున్న కొద్దీ అతడి మెదడులో ఏదో స్ఫటికంలా గట్టిపడిపోతుంది;

అంతకంతకూ స్థాణువైపోతుంది. నీవు కనుక తీవ్రంగా ప్రయత్నించకపోతే శిలాజంలా మిగులుతావు. ఇదే సాధారణంగా మనుషులకు జరుగుతుంది. ప్రత్యేకంగా సాక్షాత్కారానికి ప్రయత్నించి, దానిలో సఫలమైన వారిలో లేదా వాళ్ళు అనుకొన్న లక్ష్యాన్ని నెరవేర్చుకున్నామని విశ్వసించిన వారిలో ఇది జరుగుతుంది. ఎవరి విషయంలోనైనా గాని, అది వాళ్ళ వ్యక్తిగత లక్ష్యం. వాళ్ళు దానిని చేరుకొన్నారు, దానిని పొందారు. అది జరుగుతుంది. అక్కడే వాళ్ళు నిలిచిపోయారు, స్థిరపడిపోయారు. 'ఇక ఇంతే' అని అన్నారు. అంతకు మించి వాళ్ళేమీ కాలేరు. ఇకపై పదేళ్ళు జీవిస్తారు, లేదా ఇరవై లేదా ముప్ఫై ఏళ్ళు జీవిస్తారు. ఇక కదలరు. అక్కడే ఉంటారు. అట్లాంటి మనుషుల్లో ఉండే వస్తువులో మృదుత్వం కొరవడుతుంది. అదే అసలైన, ముమ్మందుకు పురోగమించడానికి అవసరమైన వస్తువు. వాళ్ళు అక్కడే ఆగిపోయారు. వాళ్ళు మ్యూజియంలో పెట్టడానికి పనికొచ్చే మంచి వస్తువులు. పనిచేయడానికి కాదు. ఏది చేయబడాలో దానికి నమూనాలే కాని అంతకు మించి మాత్రం కాదు. నా మటుకు వ్యక్తిగతంగా, నా కార్యం చేయడానికి కొద్దిమాత్రమే తెలిసిన వ్యక్తిని తీసుకొంటాను, అతిగా శ్రమించిన వాడ్ని కాదు. కాని ఎవరిలో గొప్ప ఆకాంక్ష అత్యంత సద్భావన ఉందో, ఎవరు తనలో ఈ జ్వాలను అనుభూతి చెందుతున్నారో, ఎవరు ఈ పురోగమన ఆవశ్యకతతో ఉన్నారో వారిని అనుమతిస్తాను. అతడికి ఏదో కొంత మాత్రమే తెలిసి ఉండవచ్చు. ఇప్పటికి కొంత సిద్ధింప చేసుకొని ఉండవచ్చు. కాని తన అంతరంగంలో ఒక ఉత్తమ ద్రవ్యం ఉంటే దానితోనే చాలా చాలా దూరం వరకు పోగలడు. అతడు త్రోవను తెల్సుకోవాలి (నీ గ్రంథాలయంలో మాదిరిగానే ఇక్కడ కూడా) పోయేందుకు త్రోవను తెల్సుకోవాలి. జీవితంలో సాధారణంగా నీవొక కొండనెక్కినప్పుడో లేదా తెలియని ప్రదేశానికి పయనమయ్యినప్పుడో అక్కడొక మార్గదర్శిని వెతుక్కొంటావు. దారి చెప్పమని అడుగుతావు. అలాగే ఇక్కడ కూడా. నీవు మార్గదర్శిని అనుసరిస్తే, చాలా ప్రయాసపడి అతడి స్వీయమార్గాన్ని కనుగొని, తనకు తాను గర్వంగా భుజం చరచుకొని, ఎలా చూచినా చివరకు వచ్చాశాననే భావంతో, అతడే లక్ష్యమైతే అనుకొన్నాడో, దానిని చేరుకుని అక్కడే ఆగిపోయి తిష్ఠ వేసుకొని కూర్చునే వాడికంటే శీఘ్రంగా వెళ్ళగలవు.

*CWM 5:285* — *శ్రీమాత*



'దైవం అంటే ఏమిటి' ఒక దరహాసిస్తుండే తేజోమయ అపారత.

*CWM 14:204*

# జీవిత సూత్రాలు

ఆత్రుత పడవలసిన అవసరం లేదు - గాబరాపడాల్సిన పనిలేదు. అసహనంతో ఉండాల్సిన అవసరం లేదు, దానివల్ల ఏ ఉపయోగమూ లేదు. అసహనంగా ఉండటంలో ప్రయోజనం లేదు. అది హృదయాన్ని దుఃఖమయం చేస్తుంది. అది నిరుపయోగం.

సమయం వచ్చినప్పుడు, అది వచ్చి తీరాలి. ప్రభువు కోరినపుడు, అతడు కోరతాడు, అది అవుతుంది అది అంతే. మనమెప్పుడూ అతిగా ఆందోళన పడుతుంటాము లేదా కొంచెం విశేషించి చూస్తే ఈ ఆందోళనలన్నీ ఆయన కార్యంపై ఉల్లి పొరల్లాంటివి.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ, ఆగష్టు* ***11,1964***

మనం నిరంతరం ఆకాంక్షిచే స్థితిలోనే ఉండాలి. మనం ఆకాంక్షించ లేకపోతే ఒక పసిపాపలోని సరళత, అమాయకత్వంతో ప్రార్థిద్దాం.

*CWM 15:208*

అణుకువ : దాని సరళతలో అది ఆరాధనీయమైనది.

*

గొప్పవ్యక్తులు ఎప్పుడూ చాలా సరళంగా వినమ్రులై ఉంటారు.

*

సరైన స్వీయ మూల్యాంకనం : సరళత, వినమ్రత దానికదిగా ముందుకు నెట్టుకు రావడానికి ప్రయత్నించదు.

*

వినమ్రత తన స్వీయ మనోహరత్వంతోనే సంతృప్తిపడుతుంది. దానిపైనది అంతగా దృష్టి పెట్టదు.

మార్గంలో పురోగమించే కొద్దీ మనం మరింత నిరాడంబరులమౌతాము. ఏది చేయబడాలో దానితో మనం పోల్చుకొంటే మనమేదీ చేయలేదని మిక్కిలిగా గ్రహిస్తాము.

*

మన ప్రయత్నాలు ఏవైనా, మన సంఘర్షణలు ఏవైనా ఆఖరికి మన విజయాలు ఏమైనా ఇప్పుడు మన ఎదుట ఉన్న మార్గంతో పోల్చుకొంటే, మనం ప్రయాణించింది ఏమి లేదని మనం తెల్సుకోవాలి.

*

నీవు చాలా ముఖ్యమని, లేదా ముఖ్యం కాదని లేదా నీవు చాలా గొప్పవాడవని, లేదా అల్పుడవని తలంచకు. ఎందుకంటే మనకు సంబంధించి మనమేమీ కాము. మన నుండి దైవం సంకల్పించే దానిగా అవడం కోసమే మనం జీవించాలి.

*CWM 14:151-52*

మనిషి ప్రజ్ఞ అనబడే, సంక్లిష్టతకు పైన దివ్యానుగ్రహంలోని శోభాయమానమైన నిరాడంబరం, సరళత, మన అనుమతితో పనిచేయడానికి సంసిద్ధంగా ఉంది.

మన జీవితం పూర్తి సరళమైనది, చాలా తేలికయైనదిగా అవ్వగలిగేది - మనిషి మనసు దానిలోనికి అనేక విధాలైన నిరుపయోగమైన క్లిష్ట పరిస్థితుల్ని చొప్పించలేకపోతనే.

మనిషి మనసు గనుక ఒక్కసారి పనిచేయడం మొదలుపెడితే అది దివ్యానుగ్రహ కార్యానికి మందగింపజేస్తుంది.

*CWM 14:344*

## సరళత

సరళత్వంలో ఒక గొప్ప సౌందర్యం ఉంది.

*

ఆధ్యాత్మికతే పరమ నిరాడంబరత.

*

నిజమైన ఆధ్యాత్మికత అన్నది చాలా సరళమైనది.

*

సామరస్యాన్ని అభివ్యక్త పర్చడానికి, ఉన్న వాటిల్లో సరళతే ఉత్తమమైనది.

*CWM 14:150-51*

సరళతే అన్నింటిలో సామరస్యతను అభివ్యక్తం చేయడంలో శ్రేష్ఠమైనది.

*

బాధపడకు. చెయ్యాల్సిందంతా నిజాయితీతో చెయ్యి. ఫలితాన్ని దైవ పర్యవేక్షణకు వదిలిపెట్టు.

*

కష్టాలను ముందుగా చూడకు, ఆ ధోరణి వాటిని అధిగమించేలా చేయదు, పైపెచ్చు అవి నీ వద్దకు వచ్చేలా చేస్తుంది.

*

పురోభివృద్ధి గురించి ఆందోళన పడకపోవడం మంచిది. ఎందుకంటే ఆందోళన చెందడమే పురోగమనాన్ని అడ్డుకొంటుంది. దైవ సహాయానికై నిగర్వంగా, సరళంగా, పూర్తి విశ్వాసంతో తెరుచుకొని ఉండటం, విజయంపై విశ్వాసం కల్గి ఉండటం శ్రేష్ఠం.

*

చిరంతన చైతన్యంలో జీవిస్తూ ఉండు. ఇక నీకు ఆందోళన బాధ అనేదే లేదు.

*CWM 14:222-23*

నిత్యం ఆదుర్దా అనేది లేకుండా మనం జీవిద్దాం. దేని గురించో ముందుకు ముందే గాబరా పడటమెందుకు. అది ఎప్పటికీ జరుగకపోవచ్చు?

దివ్యానుగ్రహంపై విశ్వాసం లేకపోవడం వల్లనే ఆదుర్దా కలుగుతుంది. సమర్పణ అనేది పూర్తి కాలేదని, సమగ్రం కాలేదని సూచించే నిస్సంశయ సంకేతం.

*- శ్రీమాత*



**Vol. 54, No. 7**
**July 2024**


Date of Publication:
1st July 2024

TN/PMG (CCR)/ WPP 473/24-26
Registered: PY/41/2024-26

## AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

*Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo*



**Flower on the Cover:**
**Integral Simplicity**
*The simplicity that comes from perfect sincerity.*
*(Significance and explanation of the flower given by the Mother)*
Botanical name: Vittadinia triloba
Common name: Creeping daisy


*Owner:* Sri Aurobindo Society
*Printer:* Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
*Publisher:* Pradeep Narang for Sri Aurobindo Society
*Published from:* Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
*Printed from:* Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

---

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001



# అఖిల

అఖిల భారత పత్రిక

ఆగష్టు 2024

# భారతదేశంపై మదర్


# విషయ సూచిక



## సంపాదకీయం

విషయాలకు సంబంధించిన దైవ ప్రణాళికలో భారతదేశం నిర్వహించవలసిన ఒక ప్రముఖ కేంద్రీయ పాత్ర ఉన్నదని మదర్, శ్రీ అరవిందులు దర్శించారు. కాని అది జరగాలంటే తాను కోల్పోయిన వైదుష్యాన్ని, వైభవాన్ని, శక్తిని తిరిగి హక్కుగా పొందాలి. అందుకు తగినట్లు వారి పనికి, మహాకార్య నిర్వహణకు కేంద్రంగా భారతదేశాన్ని ఎన్నుకోవడమే గాక అనేక ముఖ్యమైన సూచనలను, కీలకాలను అందించారు. భారతదేశ భవిష్యత్తుకు సంబంధించిన మదర్ దర్శనానికి ఈ సంచికను ప్రత్యేకించాం.

*అనువాదం : కె.వి. రావు*



శ్రీ అరవిందులు తమ మాతృదేశాన్ని ఎల్లప్పుడూ ప్రేమించారు. ఆమె గొప్పది ఉదాత్తమవ్వైనది, పరిశుద్ధమైనది, ప్రపంచంలో తన మహాకార్యానికర్తూరాలిగా కావాలని ఆశించారు. అంధస్వార్థ ప్రయోజనాల, అజ్ఞాన దురభిమానాల నీచ, కు సంస్కార స్థాయికి ఆమె కూరుకుపోవడాన్ని వారు అంగీకరించలేదు. ఇందుకనే, వారి సంకల్పంతో పూర్తిగా ఏకీభవిస్తూ, సత్యం, ప్రగతి, మానవజాతి రూపాంతీకరణల ప్రమాణాన్ని, అజ్ఞానం, బుద్ధిహీనత, ఈర్ష్య లేక దుస్సంకల్పం వల్ల దానిని ధూళి దూసరితం చేయ, పంకంలోనికి ఈడ్చుకునిపోవ కాంక్షించేవారిని గురించి పట్టించుకొనకుండా ఉన్నతంగా ఉద్ధరించాలి. ఓ అంతరాత్మ గల వాళ్ళందరూ దానిని చూచి, దాని చుట్టూ చేరగలిగేటట్లు అత్యున్నత స్థాయికి తీసుకుపోదాం.

*CWM 13:123* — శ్రీమాత

# భారతదేశ అంతరాత్మ

## భారతదేశ మహదాత్మ ఎల్లకాలం జీవించుగాక!

భారతదేశ మహదాత్మ ఏకం, అవిభాజ్యం. ప్రపంచంలో తన మహాకార్యమేమిటో ఆమెకు యెరుకే. బాహ్య సంబంధ అభివ్యక్తికి ఆలంబనాలకై ఆమె వేచి చూస్తున్నది.

*CWM 13:351*

అంధకారాలంకృతులైన కలియుగ పండితులచే వంటగదిలోనూ, చిన్ని ప్రార్థనా మందిరంలోనూ ఇకనెంత మాత్రం ఓ భారతాత్మా నిన్ను నీవు దాచి పెట్టుకోకు. ఆత్మశూన్య కర్మకాండచే, వాడుకలో లేని కట్టుబాటు, దక్షిణ పేరుమీద వసూలు చేసే డబ్బుతో నిన్ను నీవు తెరమరుగు చేసుకోవద్దు. శాశ్వత వేదంతో నీ అంతరాత్మలో అన్వేషించు, భగవంతుని అర్థించి నీ యథార్థ బ్రాహ్మణత్వాన్ని, క్షత్రియత్వాన్ని తిరిగి పొందు. వేద యజ్ఞ రహస్య సత్యాన్ని వెలికితీయి, సనాతన, మహాబలీయ వేదాంత సాఫల్యతకు తిరిగి చేరుకో.

ఏం చేయాలో ఏం చేయకూడదో తెలియజెప్పే, మతపరమైన ఆచారాలని చెప్పబడే వాటి నుండి స్వేచ్ఛ పొందు. యథార్థ వివేకాన్ని మనం తప్పక తిరిగి పొందాలి. పరమ సత్యంలో నివసించడానికి, పరమ సత్యం కోసం జీవించడానికి ఖచ్చితమైన సూచనలను దైవం నుండి ప్రత్యక్షంగా స్వీకరించాలి.

*CWM 10:314-15*

*అవగాహన, **15** ఆగష్టు **1947***

ఓ మా మాతృమూర్తీ, భారతదేశ ఓ మహదాత్మా, గాడాంధకార నైరాశ్యం దినాలలో గూడా నీ బిడ్డలను ఎన్నడూ నీవు విడిచిపెట్టలేదు. వారు లేచిన ఇప్పుడు, నీ విముక్తి సంబంధిత ఈ ఉషస్సు వెలుగు నీమోముపై పడిన ఇప్పుడు ఈ మహనీయ ఘడియలో నీకు ప్రణమిల్లు తున్నాం. మా ముందు తెరచుకొంటున్న స్వేచ్ఛాక్షితిజం, యథార్థ

గొప్పదనపు, జాతుల సముదాయంలో నీ యథార్థ జీవితపు క్షితిజం కూడా కాగలిగేటట్లు మాకు మార్గం చూపించు. ఎల్లప్పుడూ గొప్ప ఆదర్శాల పక్షానే మేముండునట్లు, నీ నిజరూపాన్ని మనుషులకు చూపేటట్లు, ఆధ్యాత్మ మార్గాలలో ఒక నాయకునిలా, సర్వజనావళికి ఒక మిత్రునిగా, సహాయకునిగా వుండగలిగేటట్లు మాకు మార్గం చూపించు.

*CWM 13:351*

## భారతమాత

వ్యక్తి భవిష్యత్తును, హెచ్చుతగ్గులుగా బహిరంగంగా శాసించే, ఆతని యథార్థ ఆత్మ, అయిన ఒక చైత్యపురుష ప్రతి వ్యక్తికీ ఉన్నట్లే, ప్రతి జాతికి దాని యథార్థ అస్తిత్వమైన ఒక చైత్య పురుష ఉంది. అది తెర వెనుక నుండి దాని భవిష్యత్తుకు రూపం కల్పిస్తూ ఉంటుంది. అది ఆ దేశపు అంతరాత్మ, జాతీయ ప్రతిభ, జన బాహుళ్యపుతత్త్వం, జాతీయాకాంక్షా కేంద్రం, దేశ జీవనంలో సుందరమూ, మహోదాత్తమూ, మహనీయమూ, మహోదారమూ అయిన దానంతటికీ ఊట బావి. యథార్థ దేశభక్తులు ఒక స్పర్శనీయ సత్యతగా దాని సాన్నిధ్యాన్ని సంవేదిస్తారు. భారతదేశంలో దాదాపు ఒక దివ్యమూర్తిత్వంగా అది రూపుదిద్దుకొంది. తమ దేశాన్ని యథార్థంగా ప్రేమించే వారందరు దానిని భారతమాత అని పిలుచుకొంటూ, తమ దేశ సంక్షేమం కోసం నిత్య ప్రార్థన చేస్తుంటారు. ఇదిగో ఆమె, దేశ యథార్థ ఆదర్శాన్ని సంకేత పరంగాచూపుతుంది, దేహంగా ధరించింది.

భారతదేశంలో ప్రజ్ఞాధురీణులు, జగన్మాత ఒక పార్శ్వంగా ఆమెను భావిస్తారు కూడా. ఆ విషయాన్ని దుర్గాస్తోత్ర, ఈ క్రింది పాఠ్యాంశమిలా వివరిస్తుంది.

"జననీ, దుర్గామాతా, నీ వాహనం సింహం, సమస్త శక్తినీ మాకిచ్చు దానవు, నీ శక్తి అంశాల నుండి జన్మించిన వారము మేము, భారతీయ యువకులమైన మేము, నీ ఆలయమందాశీనులమై ఉన్నాము. ఓ జననీ మా ప్రార్థనలాలకించి భువిపై అవతరించు, భారతావని యందు నిన్ను నీవభివ్యక్తం గావించుకో!"

"జననీ దుర్గామతల్లీ నీవు ప్రేమ, శక్తి, జ్ఞానాలను ప్రసాదించుతావు. అదే సమయాన నీ ఉగ్ర రూపమున భయంకరవు, కావున జననీ! నీవెంత సుందరివో, అంత దారుణవు గూడ. జీవన సంగ్రామంలో, భారత సంగ్రామంలో, మేము నీచే అధికారం పొంది పోరుచున్న వీరకిశోరులం. మాతా! మా మనోహృదయాలకు అసురుల బలవీర్యాలను, మా అంతరాత్మ ధీవిశేషాలకు, దేవతల శీల విజ్ఞానాలను అనుగ్రహించు తల్లీ!

"దుర్గామ తల్లీ! ప్రపంచంలో అత్యుత్తమ జాతి అయిన భారతీయు లిపుడు, అంధకారంలో మునిగి ఉన్నారు. తల్లీ! నీవు తూర్పుదిశయందు ఉదయించబోతున్నావు. నీ దివ్య అవయవాల అరుణారుణ రాగంతో, ప్రభాతం ప్రస్ఫుటమౌతోంది. అంధకారాన్ని చెదరగొట్టివేస్తోంది. జననీ! నలుదిశలా నీ ప్రకాశం బరపి, అంధకారాన్ని తుదముట్టించు. దుర్గామాతా! మేము నీ బిడ్డలం, నీ అనుగ్రహం ద్వారా, నీ ప్రభావం ద్వారా, నీ మహాకార్యానికీ, నీ మహోన్నతా దర్శానికీ అర్హులమయ్యేదం గాక. అమ్మా! మా క్షుద్రతను, మా స్వార్థపరతను, మా భయాన్ని పారద్రోలు.

"దుర్గామతల్లీ! నీవు కాళివి... అసురుని వధించు, మాలో పాదుకొని వున్న శత్రువులను, నిష్కరుణమైన నీ అరపులతో, కదిలించు పెకలించి వెయ్యి. ఏ ఒక్కడూ సజీవంగా మిగులకుండుగాక! మేమలా పరిశుద్ధమూ, అకళంకమూ, అయ్యేదముగాక! ఇదే మా ప్రార్థన. ఓ తల్లీ మాలో నీవభివ్యక్తంకా!

"దుర్గామ తల్లీ! స్వార్థపరతచేత, భయాందోళన చేత, క్షుద్రతావేశం చేత, భారతమిప్పుడు తలదించుకొని వుంది. మమ్మిపుడు గొప్పవారిని చేయి, మా ప్రయత్నాలను గొప్ప ఉద్యమాలను చెయ్యి, మా హృదయాలను విశాలం చెయ్యి, మమ్ము మా నిశ్చయానికి దీటుగా తీర్చిదిద్దు. శక్తి హీనులమై, అలసతాపరులమై, భయోపహతులమై మేమింకెప్పుడూ అల్పమైన దానిని కోరుకుండెదము గాక!"

"దుర్గామతల్లీ! యోగశక్తిని విస్తరింపచెయ్యి. నీ ఆర్యసంతతి అయిన మా యందు గత కాలం నాటి బోధనాశీలాలను, బుద్ధి బలాన్ని, శ్రద్ధాభక్తులను, తపస్యాతేజాన్ని, బ్రహ్మచర్య పటిష్ఠతను, యథార్థ జ్ఞానాన్ని,

అభివృద్ధి చెయ్యి. దానినంతటినీ మా ద్వారా ప్రపంచానికి గూడ కట్టబెట్టి, ఓ జగజ్జననీ, సర్వానర్థాలను పారద్రోలు."

"దుర్గామతల్లీ! ముందు లోపలి శత్రువును వధించు, తర్వాత బైటి విఘ్నాలనన్నింటినీ పెకలించి వేయి. ఉదాత్తము, విక్రాంతము, ప్రబలము అయిన ఈ భారతజాతి, అలాగే ప్రేమ సమైక్యతలందు, సత్య ఊర్జములందు, కళాసాహిత్యములందు, శక్తి జ్ఞానములందు, శిరోమణి అయిన ఈ భారతజాతి తన పవిత్ర వన ప్రదేశములందు సారసంపన్న క్షేత్రములందు, ఆకాశాన్నంటే తన పర్వత సానువులందు, శుద్ధ జల ప్రవాహాలతో ఒప్పారే తననదీతటములందు శాశ్వతమై నివసించు గాక! ఇది మా మాతవైన నీ పాదాలకడ మేము చేసే ప్రార్థన, తల్లీ! ఆవిర్భవించు, అభివ్యక్తం కా!"

"దుర్గామాతా! నీ యోగబలరూపాన, మా తనువుల్లో ప్రవేశించు, మేమపుడు నీ ఉపకరణాలమౌతాం, సర్వపాపాలను వధించే నీ కరవాల మౌతాం, సర్వాంధకారాన్ని తుదముట్టించే నీకర దీపికలమౌతాం. నీ ఈ చిన్నబిడ్డల అభిలాషను నెరవేర్చు తల్లీ! నీవు ఈశ్వరివై నీ ఉపకరణాల మైన మమ్మ శాసించు, నడిపించు, మమ్ముకరవాలంగా ఉపయోగించి, పాపాన్ని వధించు. మేమనే దీపాన్ని యెత్తి పట్టి జ్ఞాన తేజాన్ని విస్తరింప జెయ్యి. జననీ! ఆవిర్భవించు, అభివ్యక్తంకా!"

దేశాలన్నింటిలో జాతీయ అంతర్మాత యెడల అదేవిధమైన ప్రగాఢ భక్తిని చూడనెవరైనా ఇష్టపడతారు. దాని అత్యున్నతాదర్శపు అభివ్యక్తి కోసమై తగిన పరికరాలుగా తయారుగావాలని అదే ఆకాంక్షను చూడనిష్టపడతారు. తన జాతీయాత్మతో తనను తాను మమేకం చేసుకొనడం ద్వారా తన యథార్థ స్వభావాన్ని, నిర్వహించవలసి వున్న పాత్రను కనుగొన ప్రతి జాతిని శక్తివంతం చేసే, ప్రగతికై స్వయం - పరిపూర్ణతకై అదే తీవ్రావేశాన్ని ఇష్టపడతారు. చరిత్రకు సంబంధించిన యాదృచ్ఛిక ఘటనలను పరిగణించు ఒక సజీవ, అమరజీవిగా అది ప్రతి వానిని తయారు చేస్తుంది.

*CWM 12:42-44*

*(గమనిక : దుర్గాస్తోత్రమ్ - కీ.శే. శ్రీ చలసాని నాగేశ్వరావు గారి తర్జుమా)*

## భారతదేశమంటే ఏమిటి?

భారతదేశమంటే ఒక భూభాగమో లేక భూమిపై ఉన్న నదులూ, పర్వతాలూ, అందులో నివసించేవారి సమష్టి నామం కాదు. భారతభూమి ఒక సజీవ భూమి, శివుని అంత సజీవమయినది. శివుడు ఎలా ఒక దైవమో అలానే భారతదేశం కూడా ఒక దేవత. ఆమె కావాలనుకుంటే తానొక మానవ రూపంలో అవతరించగలదు.

*


అతి అనాదికాలంగా (కొంతమంది పండితులు క్రీస్తుశనానికి 8000 సంవత్సరాల క్రితమని అంచనా వేశారు) భారతదేశం ఆధ్యాత్మిక జ్ఞానానికి, సాధనకూ సర్వోన్నత సత్యావిష్కరణకూ ఆ సత్యంతో ఏకం కావటానికీ తొలి భూమి, ఏకాగ్రతను అధికంగా, ఉన్నతంగా సాధన చేసిన దేశమిదే. సంస్కృత భాషలో ఈ దేశంలో బోధించే, వినియోగించే యోగమని పిలువబడే పద్ధతులు అసంఖ్యాకం. కొన్ని కేవలం భౌతికం మరికొన్ని కేవలం మేథోపరం, ఇంకా కొన్ని మత సంబంధం మరియు భక్తిపరం. చివరగా కొంతమంది ఒక సమగ్రమైన ఫలితాన్ని సాధించడానికి ఈ వివిధ పద్ధతులను కలగలుపుతారు.

*CWM 13:372-73* *శ్రీమాత*

సౌందర్యాన్ని నిరసించమని బోధించడం, అసుర శక్తుల బలీయమైన ఆయుధాలలో ఒకటి. అదే భారతదేశపు నాశనానికి కారణం. దైవం అంతరాత్మలో ప్రేమగా, మనసులో జ్ఞానంగా, ప్రాణికంలో శక్తిగా, భౌతికంలో సౌందర్యంగా ఆవిష్కరించబడుతుంది. మీరు సౌందర్యాన్ని తిరస్కరించినపుడు మీరు భౌతికంగా దైవం యొక్క ఈ ఆవిష్కరణను నివారించి ఆ స్థానాన్ని శత్రు శక్తులకు అందించినట్లే.

*CWM 13:312-73* *శ్రీమాత*





శ్రీమాతా శ్రీ అరవిందులు 1919లో అస్తవ్యస్థతలు, వైపరీత్యాలు ఒక నూతన సృష్టి కోసం జరిగే పురిటినొప్పుల లాంటివని రాశారు. ఈ నొప్పులు ఎంతకాలం సాగుతాయి. మన ఆశ్రమంలో, భారతదేశంలో, చివరికి ఈ ప్రపంచంలో?

ఈ పృధ్వి సంసిద్ధమయ్యే వరకూ, నూతన సృష్టిని అంగీకరించే వరకూ ఇది కొనసాగుతుంది.

ఈ నూతన సృష్టి చైతన్యం ఈ సంవత్సర ప్రారంభం నుండి అప్పుడే పని చేయడం ప్రారంభించింది. దానిని ప్రతిఘటించకుండా జనులు సహకరించినపుడది త్వరితం అవుతుంది.

కానీ మూర్ఖత్వం అజ్ఞానమనేవి చాలా మొండివి.

ప్రేమ, ఆశీస్సులు

*CWM 17:322* శ్రీమాత

# భారతదేశంపై మదర్ వ్యాఖ్యానాలు

## శ్రీ అరవిందుల జననం, భారత స్వాతంత్ర్యం.

శ్రీ అరవిందుల జననం వరకూ మతాలు, ఆధ్యాత్మికత ఎల్లప్పుడూ గత రూపాలపై కేంద్రితమై భూమిపై జీవనాన్ని నిరసించటమే గమ్యంగా చేసుకొన్నాయి. మీకు ఈ రెండు ప్రత్యామ్నాయాల మధ్య ఎంపిక ఉంది.

ఈ ప్రపంచంలో చిన్న చిన్న ఆనందాలు, బాధలు, సంతోషాలు, దుఃఖాలు నిండిన జీవితం వుంది. సరిగా ప్రవర్తించనపుడు భయపెట్టే నరకం, లేదా మరొకటి, వేరే లోకంలోకి తప్పించుకొని, స్వర్గం, నిర్యాణం, మోక్షం కోసం ఆకాంక్షించడం ఈ రెంటిమధ్య అంతగా ఎంచుకోవటానికి ఉండదు. ఎందుకంటే రెండూ సమానంగా చెడ్డవే.

శ్రీ అరవిందులు భారతదేశం బలహీనం కావటానికి, ఆమె పతనానికి ఇదే కారణం, మూల తప్పిదమని అన్నారు. బౌద్ధమతం, జైనమతం, మాయానాదం ఈ దేశపు శక్తిని పీల్చివేశాయి.

కేవలం పదార్థం కాక ఈ విశ్వంలో మరేదో ఉన్నతమైనది ఉన్నదని ఎరుక కలిగిన ఒకే ఒక దేశం - భారతదేశమే. మిగిలిన దేశాలన్నీ దానిని మరిచిపోయాయి. యూరప్, అమెరికా తదితర దేశాలు ఆ సత్యాన్ని విస్మరించాయి. అందువలన హిందూదేశం భద్రపరచి, పరిరక్షించి ప్రపంచానికి అందించవలసిన సందేశం ఇంకా ఉంది. కానీ ప్రస్తుతం ఆమె అయోమయంలో కొట్టుమిట్టాడుతోంది.

సత్యం-జీవితం నుండి పారిపోవటంలో లేదు, ఇందులో స్థిరంగా నిలిచి, దానిని పరివర్తన చెందించి, దివ్యమయం చేసుకోవటంలో ఉందని, అందువలన దైవం ఈ పదార్థ ప్రపంచంలో తనను తాను ఆవిష్కరించుకుంటుందనీ శ్రీ అరవిందులు చూపించారు.

*CWM 12:210-11*

మధురమయీ! ప్రస్తుతం ప్రపంచం మొత్తం ఒక అసంతులనంలో అల్లకల్లోలంగా ఉండటాన్ని చూస్తున్నాం. ఈ విశ్వం ఒక నూతన శక్తిని ఆవిష్కరించటానికి, సత్యాన్ని అవతరింపచేయడానికి సమాయత్తమవుతోందని అనుకోవాలా? లేదా అది ఈ అవతరణను వ్యతిరేకిస్తున్న అసుర శక్తుల కార్యమనుకోవాలా?

అది ఏకకాలంలో రెండూ కూడా. ఒక అల్లకల్లోలమయిన సంసిద్ధత. భారతదేశం ఏమి జరుగుతుందో వివరించి ఆగమనాన్ని త్వరితం చేయగల ఒక ఆధ్యాత్మిక మార్గదర్శి. కానీ దురదృష్టవశాత్తు పాశ్చాత్యతను అనుకరించే అంధ వ్యామోహంలో తాను భౌతిక ప్రాపంచిక వాదంలో పడి తన ఆత్మను నిర్లక్ష్యం చేసింది.

*CWM 16:326-27*

మధురమయీ! కురుక్షేత్ర సంగ్రామం జరిగి 5000 సంవత్సరాలు గడిచిపోయాయి. కానీ శ్రీకృష్ణ పరమాత్మ రాజకీయ వివేచన ప్రభావం నిన్నమొన్న ఝాన్సీలక్ష్మితో అంతమయిపోయింది. ఆ తర్వాత భారతదేశాన్ని, ప్రపంచాన్ని కొత్తగా పరిరక్షించడానికి ఒక పూర్ణ అవతార అవసరం వుంది. అది నిద్రాణంగా వున్న బ్రహ్మతేజాన్ని మేల్కొల్పుతుంది. ఈ యుగంలో మానవుడు అత్యంత ప్రమాదంలో ఉండటం వలన కలియుగంలోనే దైవం పూర్తిగా ఆవిష్కరించుకుంటుందని శ్రీ అరవిందులు కూడా చెప్పటం జరిగింది. ఇక్కడ తనంతట తానే ఒక మహత్తరమయిన రహస్యాన్ని వెల్లడించారు. దైవం హిందూ దేశంలో పరిపూర్ణంగా తనను తాను ఆవిష్కరించుకుంటుందని, స్వయంగా తానే ఈ ఆవిష్కరణ అనేది చెప్పని నిరాడంబరత ఆయనిది.

పనిని సాధించిన వారికి దానిని గురించి గొప్పగా చెప్పుకొనే అలవాటుండదు. ఆ కార్యానికి కావలసిన శక్తిని మాత్రం నిలుపుకొని దాని ఫలితపు ఘనతను శాశ్వతునికి వదిలివేస్తారు.

*CWM 16:269-70*

శ్రీమాతా! ఆగష్టు 15వ తేదీకి ఒక గుప్తమైన విశిష్టత ఉన్నదా? లేక సాధారణమయినదేనా? చరిత్రలో ఈ రోజున ముఖ్యమైన సంఘటనలు జరిగాయి.

నీ ఉద్దేశం ఏమిటి? ఆగష్టు 15 శ్రీ అరవిందుల జన్మదినం. అందువల్ల భౌతిక దృష్టిలో, ఈ పృథ్వి జీవనంలో దానికి ప్రముఖమైన ప్రాధాన్యత ఉంది.

ఆగష్టు 15న వేరే ముఖ్య ఘటనలు జరిగాయా?

ఏమిటి? భారతదేశ స్వాతంత్ర్యమా? స్వాతంత్రం ఆ రోజున వచ్చిందనా? అందుకనే నీకు చెప్పాలి. అలా ఎందుకు జరిగిందో? నీ అంతట నీవు తెలుసుకోవటం సాధ్యం కాదు. శ్రీ అరవిందులు అది కూడా వ్రాశారు. ఆయన ఇచ్చిన సందేశంలో చెప్పలేదూ?

(నిశ్శబ్దం)

అవును అది ఖచ్చితంగా అదే. నూతన సంవత్సరానికి లేదా అటువంటి పండగలకి ఈ రోజున, పూజాదినాలలో కొందరు పంపిన శుభాకాంక్షల పత్రాలు నా చేతికి వచ్చాయి. ఈ లేఖల మీద ఇలా రాసి వుంది. నాకు సరిగ్గా అవే మాటలయితే గుర్తులేవు కానీ ఏదోవిధంగా ఈ స్మరణీయమైన రోజున మన దేశం ఆవిర్భవించిన సందర్భంగా చెప్పిన శుభాకాంక్షలు. శ్రీ అరవిందుల శిష్యుడినని చెప్పుకొనే ఒక వ్యక్తి నుండి (చాలాకాలం క్రితం) వచ్చాయి. కేవలం మానవుల మూర్ఖత్వం మాత్రమే అటువంటి పాతకాన్ని చేయగలదు. 'శ్రీఅరవిందుల జన్మదినమైన ఈ చిరస్మరణీయ దినం మరియు దాని సహజ పరిణామమైన ఈ దేశపు జన్మదినం' అని వ్రాసి ఉంటే బాగానే ఉండేది. కానీ అతను ముఖ్యమైన విషయాన్ని వదిలివేసి, రెండవ దానిని మాత్రమే చెప్పాడు. ఏదయితే కేవలం ఒక పరిణామమో దానికి అది ఒక సహజ ఫలితం. అది అలాగే ఉంటుంది. మరొక విధంగా ఉండదు.

కానీ జనులెపుడూ తప్పుగానే ఆలోచిస్తారు. వాళ్ళు ఫలితాన్ని కారణంగా భావిస్తారు. ఫలితాన్ని ఆకాశానికెత్తి అసలైన కారణాన్ని మరచిపోతారు.

అందుకనే ఈ ప్రపంచం తలక్రిందులుగా నడుస్తుంది. సులభంగా చెప్పాలంటే అంతకన్నా మరొక కారణమేమీ లేదు.

*CWM 8:264-65*

## భారత దేశాన్ని అర్థం చేసుకోవటం

హిందూ దేశం మతానికి డోయలతొట్టి కావటం, ఎంతోమంది దేవతలు తన భవితకు ఆధిపత్యం వహించడం వలన వారితో మనం ఈ దేశాన్ని పునరుద్ధరించే అద్భుతాన్ని సాధించటంలో ఒకరిగా ఉంటాం. **(ఎ చౌమల్, పాండిచ్చేరి మీద ఒక వ్యాసంలో 1928)**

పైకి కనిపించే దానితో అంధులై, అపనిందలతో వంచించబడి భయం వివక్షతతో వెనుకకు లాగబడి, ఎవరి జోక్యాన్నైతే తాను కోరుకుంటాడో ఆ భగవంతుని ప్రక్క నుండి సాగిపోయాడు గాని ఆయనను చూడలేదు. తను కోరిన అద్భుతాలను సాధించిన శక్తులకు సమీపంగా నడుస్తాడు కానీ వాటిని గుర్తించాలని అనుకోడు. అలా తన జీవితపు మహదాశయాన్ని కోల్పోతాడు.

నిగూఢ రహస్యాలు, అద్భుతాలు వేటి ఉనికిని అతని మేధ దివ్యీకరించి, వేటిని అతని హృదయం అస్పష్టంగా ఆకాంక్షిస్తుందో... వాటితో సంస్పర్శను పొందే అద్వితీయమైన అవకాశాన్ని అతను కోల్పోతాడు.

అన్ని సమయాలలోను దీక్షను స్వీకరించే ముందు ఔత్సాహితుడెవరైనా కొన్ని పరీక్షలకు నిలబడవలసి ఉంటుంది. ప్రాచీన కాలపు విద్యాలయాలలో ఈ పరీక్షలు కృత్రిమంగా ఉండి చాలా వరకు వాటి విలువను కోల్పోతాయి. ఇప్పుడు అలా కాదు. ఈ పరీక్షలు చాలా దైనందిన పరిస్థితులలో చాలా యాదృచ్ఛికంగా అనుకోకుండా

సంభవించినట్లు జరిగి దానిని మరింత కష్టసాధ్యము, ప్రమాదకరం చేస్తుంది.

మనసు యిష్టాయిష్టాలు, జాతి, విద్యా వివక్షతలు జయించిన వారికే భారతదేశం తన అపూర్వ నిధుల రహస్యాన్ని వెల్లడిస్తుంది. తక్కిన వారు తాము కోరుకున్నది దొరకక నిరాశ చెంది వెనుతిరుగుతారు. ఎందుకంటే వారు దోషమయ మార్గంలో వెతికి, దివ్య పరిశోధనా అన్వేషణలను చెల్లించటానికి అంగీకరించ లేదు కనుక.

*CWM 13:373-74*

## భారతీయ మేధావి

నేను కూడా గ్రాండే రివ్యూ అందుకొన్నాను, మీరు చెప్పిన కథనాన్నీ చదివాను. ఆ కథనం మరీ దారుణంగా లేదు కానీ చాలా బలహీనమైన కథనం. కానీ ముఖర్జీ చెప్పిన ప్రకారం, వారు భారతదేశం వెలుపల (అమెరికాలో అని అనుకొంటున్నాను) చాలా సంవత్సరాలు నివసించి, పూర్తిగా పాశ్చాత్యీకరించబడ్డారు. లేకుంటే అతను గాంధీ, ఠాగూర్ లను భారత దేశంలో ప్రజాదరణ పొందిన వ్యక్తులుగా పేర్కొనడు. దీనికి భిన్నంగా వారు భారతదేశం వెలుపల అత్యంత ప్రజాదరణ పొందారు, విదేశీయులకు ఈ ఇద్దరు వ్యక్తులు భారతీయ మేధావులుగా ప్రాతినిధ్యం వహిస్తారు. ఇది సత్యానికి చాలా దూరంగా ఉంది. వాళ్ళు పాశ్చాత్య దేశాల్లో ప్రాచుర్యం పొందారంటే పాశ్చాత్యుల మానసిక అవగాహనకు మించి వాళ్ళ ఎత్తు (వర్ధమాన దశ) దాటిపోలేదని అనుకోవచ్చు.

భారతదేశంలో శాస్త్ర సాంకేతిక, సాహిత్యపరంగా, తాత్వికంగా ఆధ్యాత్మికంగా వివిధ రంగాలలో వీరికన్నా చాలా గొప్ప మేధావులు ఉన్నారు. శాంతినికేతన్ నుండి చాలామంది యువకులు గొప్ప పరిపక్వత తో వస్తున్నారు, కానీ సాక్షాత్కారానికి అవసరమైన బలం, శక్తి వారిలో లేదు. గాంధీ కి సంబంధించిన యువత, చాలా శక్తి, కార్యాచరణ బలం కలిగి ఉన్న వారు, పరిమిత బుద్ధితో, సంకుచిత ఆలోచనలనే నాలుగు గోడల మధ్య బంధించబడ్డారు.

నేను మరలా చెపుతున్నాను, భారతదేశంలో మెరుగైన, చాలా అత్యుత్తమమైన మేధావులు ఉన్నారు. కానీ ~~ఈ~~ భారతదేశం అంతర్జాతీయ ఖ్యాతి పై దృష్టి పెట్టడం లేదు.

*CWM 16:5-6*

## ఓమ్

భారతీయ భాషలలో, భారతీయులకు ఓంకారం అనే స్వరం ఉంది, ఇది ఒక అద్భుతం, వారు ఏం చెపుతున్నారో తెలుసా? 'ఓం' అనేది పరమాత్మచే సృజించబడిన సకల శబ్ధాల సారము, ఓం కారం భగవంతుని పిలిచే పిలుపుగా అతను వింటాడు. ఒక భావం మాత్రమే... శక్తి - బ్రహ్మాండం అది అత్యద్భుతంగా ఉంది. ఒక చిహ్నంగా.....,

ఒక శక్తిగా! ఒక చిహ్నంగా మాత్రమే గాదు, ఒక శక్తిగా కూడా అది బ్రహ్మాండమైనది. అది నేను మొదటి సారి విన్నాను, మొట్టమొదటిసారి విన్నాను. భారతదేశంలోని హిమాలయాల్లో బెర్నార్డ్ అనే అతను ఒక సంవత్సరం గడిపాడు. అతనికి తెలియని యోగులు అతన్ని సందర్శించారు. (అతను హిమాలయాలలో, ఒంటరిగా ఓ గుడిసె లో జీవించాడు). ఒక యోగి అతనిని చూడటానికి వచ్చాడు, అతను ఏమీ మాట్లాడలేదు. అతని ప్రక్కన కూర్చున్నాడు, తర్వాత వెళ్ళిపోయాడు. ఆ యోగి అతనితో "ఓం" అని చెప్పాడు. ఆపై అతను ఫ్రాన్స్ తిరిగి వచ్చాడు. భారత దేశం లో తన అనుభవాలను వివరించాడు. ఆసమయం లో నాకు భారతదేశం గురించి ఏమీ తెలియదు, అతను ఓం అనే శబ్దాన్ని ఉచ్ఛరించి నపుడు (శ్రీమాత తన చేతులను క్రిందకు ఉంచారు), ఓ శక్తి నా శరీరం మొత్తంలో ప్రవేశించింది, శరీరం మొత్తం అసాధారణ రీతిలో కంపించింది. ఎలాగంటే ఇది ఒక అభివ్యక్తీకరణ, ప్రతీదీ కంపించడం ప్రారంభించింది. అప్పుడు నేను "చివరిగా ఇదిగో ఇదే నిజమైన శబ్దం " ఇంతకు మించి నాకు ఏమీ తెలియదు, ఖచ్చితంగా ఏమీ తెలియదు. దాని అర్థం ఏమిటో కూడా తెలియదు.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ డిశంబర్ 24-1969*

ఆధ్యాత్మికత పరంగా భారతదేశం ప్రపంచంలోనే చాలా ముందు వరుసలో ఉంది. ఆధ్యాత్మికతకు ఉదాహరణ ఇవ్వడమే ఈమె ప్రధానకార్యం. ఈ విషయాన్ని ప్రపంచానికి బోధించడానికే శ్రీ అరొబిందో ఈ భూమి పైకి వచ్చారు.

ఐరోపాలోని అందరు మేధావుల కన్నా ఇక్కడ వున్న ఓ సాధారణమైన అజ్ఞాని అయిన రైతు కూడా తన హృదయంలో దైవానికి చాలా దగ్గరగా ఉంటాడు. ఇది చాలా స్పష్టమైన వాస్తవం.

ఆరోవిల్లి వాసులు కావాలనుకుంటే, వారందరూ ఆ విషయాన్ని తెలుసుకొని తదనుగుణంగా ప్రవర్తించాలి, లేదంటే ఆరోవిల్లి వాసులుగా ఉండటానికి వారు అనర్హులు.

*

భారత దేశం సిద్ధమైంది.

ఇది ఒక విషయ దర్శనం, అది వెంటనే ఫ్రెంచి భాష లోనికి అనువదింపబడింది.

ఆధునిక మానవ జాతి యొక్క అన్ని రకాల కష్టాలకు, భారతదేశం ప్రతీకాత్మక ప్రతినిధిగా మారింది.

భారత దేశం భవిష్యత్ పునర్వికాస భూమి, ఒక ఉన్నతమైన, నిజమైన జీవిత పునర్జీవనం.

స్పష్టమైన దర్శనం అనేది, విశ్వచరిత్రలో, భూమిని విశ్వానికి ప్రతీకగా ప్రతిబింబించేలా చేసింది, దాని ద్వారా మనం చేసే పనిపైనే మన దృష్టి కేంద్రీకరించడం జరుగుతుంది. ఇదే విషయం ఇప్పుడు జరుగు తోంది. భారతదేశం అన్ని మానవ సమస్యలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. వీటికి సంబంధించిన నివారణ కూడా భారతదేశం లోనే దొరుకుతుంది. అందుకే నేను ఆరోవిల్ ప్రారంభించాను.

ఆరోవిల్ ఆవిర్భవించింది. ఇది చాలా స్పష్టంగా ఏర్పడింది. ఇది చాలా శక్తివంతమైనది.

అందుకనే నేను వ్రాసుకొన్నాను. నేను వారికి ఎలా? ఎందుకు? అని తెలుపలేదు. నేను వారితో "ఇది మీ పత్రిక మొదటి పేజీలో వ్రాయమని" చెప్పాను. అది ఏమైనా సరే, మీరు మీకు నచ్చినది చెప్పవచ్చు, కానీ ఇది ముందు ఉంచండి.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ ఫిబ్రవరి 8, 1972*

## గాంధేయ అహింసావాదం

మనుషులు ఎంత వరకైతే వాళ్ళ అహంకారం చేత, దానికున్న కోరికల చేత శాసించబడతారో అంతవరకూ హింస అన్నది ఆవశ్యకం. కాని ఈ హింసా వైఖరిని నీవు దాడికి లోనౌతున్నప్పుడే నిన్ను రక్షించుకొనే సాధనంగా వాడాలి. ప్రతి ఒక్క వ్యక్తి అవసరాలు, అదేవిధంగా సమస్తం పట్ల సామరస్యతను పరిగణనలోకి తీసుకొనే ఉజ్వలమైన అవగాహనా పరమైన స్థితిని నిజీకరించుకోవాలని కోరుకుంటున్నాం, ఈ ఆదర్శం వైపుగానే మానవ జాతి పురోగమిస్తుంది.

భవిష్యత్‌లో హింసతో ఎలాంటి అవసరం ఉండదు. ఎందుకంటే భవిష్యత్ దివ్య చేతన చేత పాలింపబడుతుంది. దానిలో సమస్త వస్తుజాలం లయ పొందికను పొంది ప్రతి అంశం సంపూర్ణత సంతరించు కొంటుంది.

ఈ క్షణాన, మనమింకా ఆయుధాలు అవసరమున్న దశలోనే ఉన్నాం. ఇది తాత్కాలికమైన దశ అని, శాశ్వతమైనది కాదని మనకు అర్థం కావాలి. ఆ మరో దశను గురించి మనం పరిశ్రమించాలి.

శాంతి... శాంతి సామరస్యాలు చేతన పరివర్తనలో బయటకు వెలువడే సహజాభి వ్యక్తులు.

చూచావా! భారతదేశాన్ని శాసిస్తున్న గాంధీ సిద్ధాంతమైన అహింస భౌతిక హింసను నైతిక హింసతో భర్తీ చేసింది. అదింకా అధ్వాన్నం!

ఇక్కడ గాంధీకి వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం చేశావా, పతి ఒక్కరూ వెంటనే ....... ఓహ్!

ఆయన పేరును ప్రస్తావించాల్సిన అవసరం లేదు. భౌతిక హింసను, నైతిక హింసతో భర్తీ చేయడం వల్ల లాభం లేదని నీవు పిల్లలకి వివరించాలి. వచ్చే రైలుకు ఎదురుగా పట్టాల మీద పడుకొని ఆ రైలు బండిని ఆపడం లాంటిది నైతిక హింస. అది చివరికి భౌతిక హింసకంటే ఎక్కువ అస్తవ్యస్థతను కలుగ జేస్తుంది.

ఇంకా చాలా చెప్పొచ్చు.... అది ప్రతి సందర్భంపై ఆధారపడి ఉంటుంది. నామటుకు నేను రక్షణ కోసం కంచె వేసే అభ్యాసాన్ని ప్రోత్సహిస్తాను. ఎందుకంటే అది నీకు నైపుణ్యాన్ని, నీకదలికలపైన అదుపును, హింసాత్మక సమయంలో క్రమశిక్షణను పాటించడాన్ని నేర్పుతుంది. నేను తుపాకినెలా పేల్చాలో నేర్చుకొన్నాను, వాడాను.. తుపాకి ఎందుకంటే అది నాకు ఒక నిబ్బరతను నిశ్చలతను, నిపుణతను, ఒక మంచి సునిశిత దృష్టిని కల్గిస్తుంది. అది నిన్ను ఆపద నడుమ అట్లాగే నిశ్చలంగా ఉండగల శక్తి నిస్తుంది. ఇలాంటి సద్గుణాలు.... మరి ఎందుకు ఆశావిహీనంగా, అహింస పద్ధతిలో ఉండాలో నాకు తెలియదు. అలా ఉండటం, ఒక వెన్నెముక లేని వ్యక్తిత్వాన్ని తయారు చేసి పెడుతుంది.

దానిని ఒక కళగా మరల్చు! శాంతిని, నైపుణ్యాన్ని, ఆత్మ నియంత్రణను పెంపొందించుకొనే కళ. గాంధీలాగా ఉద్రేకంతో నినదించాల్సిన అవసరం లేదు. నిరుపయోగం, నిరుపయోగం, పూర్తిగా అది నిష్ప్రయోజనం, దానిని నేనెప్పటికీ సమర్థించను. ఆత్మ రక్షణకు సంబంధించిన ఈ సాధనాలపై అదుపులో సాధించవలసిన దానికి అనుగుణంగా మనిషి వాటిని పెంపొందించుకోవాలి.

అన్నింటికీ మించి నైతిక హింసా పద్ధతి, భౌతిక హింస మాదిరిగానే చెడ్డది, ఇంకా ఘోరమైనది అని వాళ్ళు అర్థం చేసుకొనేటట్లు చెయ్యి. భౌతిక హింస అనేది మనిషిని బలిష్టుడిగా, ఆత్మసంయమనుడిగా

అయ్యేలా ఒత్తిడి చేస్తుంది. అదే నైతిక హింస.... (ఇంకా నిష్క్రియంగా...) నీలోనే ఒక ఘోరమైన నైతిక హింసకు నీవే ఆశ్రయమిచ్చేలా చేస్తుంది.

*శ్రీమాత ఒక శిష్యునితో సంభాషణ ఫిబ్రవరి 18,1973*

## కృష్ణుడు గీత

చరిత్రలో గొప్పవి నాలుగు ఘటనలు చోటుచేసుకొన్నాయి. ట్రాయ్ ముట్టడి (సీజ్ ఆఫ్ ట్రాయ్) క్రీస్తు జీవితం శిలువ మరణం, బృందావనంలో శ్రీ కృష్ణుని ఆవాసం, కురుక్షేత్రంలో అర్జునుడితో సంవాదం. ట్రాయ్ ముట్టడి గ్రీసును సృష్టించింది. బృందావనంలో ఆవాసం ఒక భక్తిపరమైన మతాన్ని సృష్టించింది. (దానికి ముందు కేవలం, ధ్యాన, ఆరాధనలే ఉండేవి.) క్రీస్తు తన శిలువ నుండి ఐరోపాను మానవీయం చేశాడు. కురుక్షేత్రంలో జరిగిన సంవాదం ఇంకా మానవాళిని ఇంకా విముక్త పర్చవలసి ఉంది. అయినా ~~ఈ~~ నాలుగు సంఘటనలు ఎప్పుడూ జరుగలేదేమో అనే నానుడి కూడా ఉంది.

**1) పూర్వకాలంలో ఉన్న ఆరాధన ధ్యానాలు ఇప్పటివి మాదిరిగానే ఉండేవా?**

**2) కురుక్షేత్రంలో జరిగిన సంవాదం మానవ జాతిని విముక్త పర్చవలసి ఉంది అంటే అర్థం?**

1) పూర్వకాలంలో ఇప్పటిలోగానే ప్రతి మతానికి దానిదైన ప్రత్యేక ఆరాధన, ధ్యాన పద్ధతి ఉండేవి.

సర్వత్ర ఎల్లప్పుడు ధ్యానమే మానసిక ఏకాగ్రతకు, మానసిక వ్యాపకానికి ప్రత్యేక వైఖరిగా ఉన్నది. ఆచరణపరమైన వివరాలే భిన్నమైనవి. ఆరాధన ఆచార విధులు, క్రతువులు, పరంపరలుగా నిష్కళంకంగా, యధావిధిగా ఆయా దేవతామూర్తులకు గౌరవ సూచకంగా జరిగేవి. ఇక్కడ శ్రీ అరొబిందో వైదిక, వేదాంతిక కాలాల్లో ప్రాచీన భారతదేశంలో వున్న ధ్యాన ఆరాధనల గురించి ప్రస్తావిస్తున్నారు.

2) కురుక్షేత్రంలో సంవాదమంటే భగవద్గీత. అసత్య, అజ్ఞానాల నుండి తప్పించుకొని సత్యంవైపుగా అధికాధికంగా విడుదలయ్యేలా

మానవజాతిని నడిపించిన, భవిష్యత్‌లో నడిపించబోయే గొప్ప ఆధ్యాత్మిక ఉద్యమానికి ఆధారంగా గీతా సందేశాన్ని శ్రీ అరొబిందో పరిగణించారు.

అది తొలుత ప్రకటితమైన కాలం నుండీ గీతకు బ్రహ్మాండమైన ఆధ్యాత్మిక కార్యం వుంది. కాని శ్రీ అరొబిందో ఇచ్చిన నవీన వ్యాఖ్యానంతో దాని ప్రభావం గణనీయంగా పెరిగి నిర్ణయాత్మక మయ్యింది.

*CWM 10:62-63*

## యోగం - దేశభక్తి

దేశభక్తికి సంబంధించిన రాగబంధాలు మన యోగానికి విరుద్ధమైనవి కావు. పైగా బలం కోసం సంకల్పించడం, తనదేశ సమగ్రత కోసం సంకల్పించడం అన్నది పూర్తిగా న్యాయసమ్మతమైన రాగానుబంధం. ఆమె పురోగతి చెందాలనే, తనకు తానుగా మరింతగా ప్రకటితమవ్వాలనే పూర్తి స్వతంత్రతతో, తన యథార్థ అస్తిత్వంతో విరజిల్లాలనే సంకల్పం చక్కనిది, ఉదాత్తమైనది, అది మన యోగానికి చేటుచేసేది కాదు. కాని దీని నుండి నిష్క్రమించకూడదు. సిద్ధంకాని కార్యంలో ముందుకు ముందే నిమగ్నమైపోకూడదు. ప్రార్థించాలి, ఆకాంక్షించాలి, సత్యం యొక్క విజయం కోసం సంకల్పించాలి. అదే సమయంలో రోజువారీ విధులు కొనసాగిస్తూ, జరగాల్సిన కార్యాన్ని సూచించే దోషరహితమైన సంకేతం కోసం నిశ్శబ్దంగా వేచి చూస్తూ ఉండాలి.

*నా ఆశీస్సులతో...* *CWM 10:356*

## భారతదేశం - ప్రపంచం

నేటి మానవునికి ఈ ప్రపంచం సాధారణ దృష్టిలో ప్రస్తుతమొక రకమైన అస్థిరత, అస్తవ్యస్థతలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఇది సత్యావిర్భావానికి, ఒక నవీన శక్తి ఆవిర్భావానికి తనంతట తాను సంసిద్ధమౌతోందని దీని అర్థమా? లేదా ఈ అవతరణకు వ్యతిరేకంగా జరిపే దుష్ట శక్తుల చేష్టకు ఫలితమా? ఈ మొత్తం వ్యవహారంలో భారతదేశం ఎలాంటి స్థానాన్ని ఆక్రమిస్తుంది?

ఒకే సమయంలో రెండూనూ. సన్నాహానికి సంబంధించిన అస్తవ్యస్తమైన సరంజామా ఇది. ఈ గమన దూరాన్ని తగ్గించడంలో సహాయం చేసే దాని గురించి జరుగుతున్న దాని గురించి విశదపర్చే ఆధ్యాత్మిక మార్గదర్శిగా భారతదేశం ఉండాలి. కాని దురదృష్టవశాత్తు, పాశ్చాత్యాన్ని అనుకరించే గుడ్డి దశలోనే ఉంది. పదార్థవాది వైఖరి గలవానిగా తయారై తన అంతరాత్మను నిర్లక్ష్యం చేసినదిగా అయ్యింది.

*

భారత్ పాకిస్తాన్ ఐక్యత వైపుగా కాశ్మీరు సమస్య మొదటి అడుగుగా భావించవచ్చునా?

పరమ ప్రజ్ఞ దానిని పర్యవేక్షిస్తుంది.

*

భూమిపై ఆధ్యాత్మిక జీవనాన్ని స్థాపించే నిమిత్తం భారతదేశం జగద్గురువుగా భావించబడుతుంది. కాని మదర్! ఈ ఉన్నత పదవిని అలంకరించడానికి రాజకీయంగా, నైతికంగా, భౌతికంగా కూడా అర్హురాలిగా ఉండాలి కదా?

నిస్సందేహంగా, వర్తమానంలో చాలా చేయాల్సి ఉంది!

*

ప్రస్తుత ప్రభుత్వంలో ఈ గందరగోళ పరిస్థితి ఎందుకు? పరమసత్య పరిపాలన కోసం, మంచి కోసమే అనే ఒక సంకేతమా?

పరమ సత్యంలోని శక్తి వల్లనే ఈ పృథ్వి అంతటిలో ఏర్పడిన ఒత్తిడి అది. అదే అస్తవ్యవస్థతకూ, గందరగోళానికి కారణం. రూపాంతరం చెందడాన్ని దుష్టత్వం తిరస్కరిస్తూ ప్రతిచోట పైకి లేస్తుంది.

సత్యమార్గం నిశ్చయం, కాని అది ఎప్పుడు, ఎలా బయట పడుతుంది అన్నది చెప్పడంకష్టం.

*

ఆర్వాచీన మానవజాతికి చెందిన అన్ని యిక్కట్టులకు భారతదేశం ప్రతీకాత్మక ప్రతినిధి అయ్యింది.

భారత దేశం దాని పునర్వికాస సాధనంగా ఉండబోతుంది. ఈ పునర్వికాసం ఒక ఉన్నత, యథార్థ జీవనం కోసం యావత్తు సృష్టిలో ఈ భూమికి ఒక విశిష్ట స్థానం ఉంది. ఇతర గ్రహాలకు లేని ఒక పరిణామ శీలమైన అంతరాత్మిక అస్తిత్వం ఈ భూమికి కేంద్రంలో ఉంది.

అందులో, ప్రత్యేకించి భారతం దైవం ఎంపిక చేసుకొన్న దేశం.

## ప్రభుత్వం - రాజకీయం

భారతదేశం భవిష్యత్ కోసం పనిచేసి ఒక ఉదాహరణను నెలకొల్పు గాక. అలా ప్రపంచంలో తన నిజమైన స్థానాన్ని తిరిగి పొందుతుంది. సుదీర్ఘ కాలంగా విభజన, వ్యతిరేకతలతోనే పాలించు కోవడానికి అలవాటు పడి ఉంది.

సమైక్యతతో పరస్పర అవగాహనతో, సహకారంతో పరిపాలించుకొనే తరుణం వచ్చింది. సహకార్యకర్తను ఎన్నుకోవడంలో, అతడే పార్టీకి చెందినవాడు అనేదానికంటే ఎంత విలువైన మనిషి అన్నది ముఖ్యం. దేశం ఘనత ఒక పార్టీ గెలవడం మీద ఆధార పడి ఉండక, అన్ని పార్టీల కలయికపై ఆధారపడి ఉంటుంది.

*CWM:365-369*

## ఒక మనిషి కావాలి

నూత్న భారత చట్ట సభలో ఒక వర్గం ఉంది. ఆ వర్గం భారతదేశం స్వీకరించిన స్థానంతో అసంతృప్తిలో ఉంది. వారు శ్రీ అరవిందుల ఆదర్శానికి, ఆయన సూచనల ప్రకారం పని చేయడానికి ఇష్టపడు తున్నామని ప్రకటించారు. ఇక్కడ నుండి మనమెవరినన్నా ఒకమనిషిని పంపి దిల్లీలో సమావేశం జరుపగలరా అని వారు అడిగారు. అడిగింది ఒక 'వర్గం' మాత్రమే. మొత్తం పార్లమెంటు కాదు.

దృష్టిపెట్టవలసిన విషయమే ఇది.

కాని కష్టమైన అంశం ఆ 'మనిషి'ని కనుగొనడం, ఎందుకంటే ఆ మనిషికి శ్రీ అరవిందుల గురించి కూలంకషంగా తెలిసుండాలి. నేరుగా ఆయన నుండి ప్రేరణలు పొందేందుకు సమర్థుడై ఉండాలి. అదే

సమయంలో చాలా శక్తితో కూడిన పటిష్టమైన వ్యక్తిత్వంతో ఉండాలి. స్పర్శ మాత్రంతో పొంగే శక్తి-జడప్రాయమైన వాటిని మేల్కొల్పే సంచలన శక్తి. ఎన్నో సంవత్సరాలుగా అలాంటి మనిషి కోసం చూస్తున్నాను, ఇప్పటికీ దొరకలేదు.

ఒక వ్యక్తి ఉన్నాడు అతడు చేయగల్గి ఉండేవాడు కాని పూర్తిగా సానుకూలంగా లేడు. శ్రీ అరవిందుల్ని సంపూర్ణంగా ఆకళింపు చేసుకోగల తగినంత విశాలమైన మనస్సు అతడికి లేదు. కాని చాలా ఋజువర్తనం, గట్టివాడు - అతడు కాశ్మీరులో రహస్యంగా ఖూనీ చేయబడ్డాడు. అవును అక్కడే చంపబడ్డాడు. ఇక్కడ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించే, ప్రారంభ సమావేశానికి అతడు వచ్చాడు, సభకు అధ్యక్షత వహించాడు. అతడు కొంచెం పొడగరి, దృఢకాయుడు.

అతడిపేరు ఇప్పుడు మర్చిపోయాను, కాని అతడు కాశ్మీరులో గోప్యంగా హతమయ్యాడు. (ఇది అనధికారికం. అయితే, అతడు జబ్బు పడ్డాడు) అతడు తలపెట్టిన కార్యం పరిపూర్ణం కాలేదు. అప్పటికి అది సరిపోయింది. ఎలాగైనా అతడు చేసి ఉండాల్సింది. కాని ఇప్పుడున్న యువజనులను నేను ఎఱుగను, ఇక్కడ అవసరమైంది శ్రీ అరొబిందో స్ఫూర్తిని ఆకళింపు చేసుకోగల మనోవైశాల్యంతో, శక్తి మేళవింపు. దాన్ని లక్ష్యానికి పరివర్తింప చేసుకోవడం, దానితో పాటు ప్రాణిక శక్తి, ఈరెండూ కలిసికట్టుగా ఉండాలి.

ఇది ఏదో రేపు జరగడం కాదు. సరిగ్గా ఇప్పుడే జరగాలి. ఇదే సమస్య, ఎందుకంటే ప్రమాదం ఇప్పుడే ఉంది.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ జూన్ 7,1967*

## మహిళలు - భారత దేశ పాత్ర

ఎందుకనంటే ఈ వ్యతిరేకతలన్నీ చివరకు అదృశ్యమైపోయే ఒక ప్రపంచం కోసం వ్యక్తి కలగంటాడు. భావించిన దానికి వాస్తవరూపమివ్వడానికి, దర్శించిన దానిని సృష్టిలోనికి తీసుకురావడానికి, ఒకే ఏకైక

చేతన, కర్మలలో ఏకం చేస్తూ మానవజాతిలో ఉత్తమమైన దానికంతటికీ సామరస్య పూర్వక సమన్వయంగా ఉండగలిగే ఒక జీవి (మనిషి-అను) జీవిస్తూ వర్ధిల్లగలిగే ఒక ప్రపంచం కోసం వ్యక్తి కలగంటాడు.

అట్లాంటి సంతోషకరమైన సమూలమైన పరిష్కారం వచ్చే వరకు భారత్ ఈ విషయంపైన ఇతర విషయాల పైన అతి తీవ్ర, విభేదాల భూమిగానే ఉంటుంది.

ఏదేమైనప్పటికీ, చాలా విస్తృతమైన, సర్వగ్రాహక సమన్వయంతో సమస్య పరిష్కరించ బడుతుంది.

సర్వేశ్వరి అయిన దివ్యమాత విశ్వసృష్టి కర్త్రిణి, సర్వ శత్రు విజేత, సర్వదేవతల సర్వలోకాల జనని, సర్వ వరదాయినికి సంపూర్ణపూజ్య భావంతో మినుమిక్కిలి ఆరాధన జరగడాన్ని మనం చూచేది నిజంగా భారతదేశంలో కాదా?

ప్రకృతి, మాయ, భ్రష్టపరచే భ్రాంతి, ప్రతి పతనానికి, ప్రతి దీన స్థితికీ కారణమనీ, మోసం చేసి, అపవిత్రం చేసి, ప్రలోభపెట్టి, దైవం నుండి దూరం చేసే భౌతిక ప్రకృతిగా స్త్రీతత్వానికి అత్యంత అధిక తిరస్కృతిని, తీవ్ర నిందారోపణను మనం చూస్తున్నది కూడా భారత దేశంలో కాదా?

యావత్తు భారత జీవనమంతా ఈ వైరుధ్యానికే గురి అయింది. ఈ విభేదంతో ఆమె మనస్సులోనూ హృదయంలోనూ వేదన పడింది. ప్రతి చోటా స్త్రీ దేవతలను ఆమె ప్రతిరూపాలుగా నిలబెట్టారు. భారత దేశపు బిడ్డలు తమ మాత అయిన దుర్గ నుండి తమ జీవన పరిష్కారాన్ని విడుదలను కాంక్షిస్తూ వేచి ఉంటారు. అయినా తన బిడ్డల్లోనే ఒకరు అవతారం అనేది స్త్రీ రూపంలో అవతరించదు అని చెప్పలేదా, ఎందుకంటే అట్లా వస్తే సరిగ్గా ఆలోచించే హిందువు గుర్తించలేడట. అదృష్టం కొద్దీ ఇలాంటి సంకుచిత పక్షపాత భావనకు, ఇలాంటి అల్ప ప్రాముఖ్యతలకు దైవం ప్రభావితం కాదు. ఈ పార్థివ శరీరంలో పరమాత్మ అభివ్యక్తమవ్వాలని కోరుకుంటే మనుషులు తనను గుర్తిస్తారా లేదా అన్నది

లక్ష్య పెట్టడు. దీనితో పాటుగా ఆయన ఎత్తిన అన్ని అవతారాల్లో ఎప్పుడు బాలలకు సరళ హృదయులకే ప్రాధాన్యత ఇచ్చాడు విద్వాంసులకన్నా!

ఏ విధంగా చూచినా స్త్రీ పురుషులను రెండుగా విభజించే అనివార్యత లేని, జంతు సంతానోత్పత్తి అవసరానికి ఇక ఏ మాత్రం లొంగని ఒక నూతన జాతిని సృజించేందుకు ఒత్తిడి చేసే ఒక కొత్త చేతన, సృష్టి నియమ సూత్రం అవతరించే వరకు వర్ధమాన మనవ జాతి పురోగతి కోసం. స్త్రీ పురుషుల్ని సరిసమానంగా చూడటం, స్త్రీలకు పురుషులతో సమానంగా విద్యను, తర్ఫీదును అందించడం, అన్ని లింగ భేదాలకు అతీతమైన దివ్య యథార్థతత్వంతో నిరంతర సంపర్కం కల్గిఉండటం ద్వారా అన్ని సామరస్యతలకు, అవసరాలకు మూలస్రోతస్సును కనుగొనేలా వారికి బోధించాలి.

భిన్నత్వాలకు నెలవైన భారతదేశం కొంగ్రొత్త సాక్షాత్కారాలకు నిజీకరణలకూ నెలవు కాబోతున్నది. వాటి మూల భావనలకు ఆమె ఊయలగా సైతం అలరించుతుంది.

*CWM 12:105-06* — *శ్రీమాత*

మనమధ్య ఐకమత్యత లేదని జనం అంటారు. ఐకమత్యతనెలా నెలకొల్పాలి? మన మాతృమూర్తి పిలుపు ద్వారా, ఆమె పుత్రులందరి గొంతు ద్వారా మాత్రమే గాని మరే యితర అవాస్తవ పద్ధతుల ద్వారా గాదు. అదింకా హీనస్వరమే, కాని అది పెరుగుతోంది. భగవంతుని శక్తి మన మధ్య వరకే బహిర్గతమైంది, దేశం మీద దాని కార్యం విస్తరిస్తోంది.

*CWSA 6-7:1036* — *శ్రీ అరవిందులు*

# భారతదేశంపై సందేశాలు

నిష్కపటత్వంతో, ధైర్యంగా, సహనంతో, నిజాయితీగా ఉండటం ద్వారా మీరు మీ దేశానికి ఉత్తమంగా సేవ చేయగలరు, దానిని ప్రపంచ దేశాల కంటే ఉత్తమంగా, గొప్పగా మార్చగలరు. (భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక పునరుజ్జీవన సమాజం కోసం సందేశం)

భారతదేశం మాత్రమే ప్రపంచాన్ని శాంతి వైపుకు, కొత్త ప్రపంచ వ్యవస్థ వైపుకు నడిపించగలదు, కాబట్టి ప్రపంచానికి జరగవలసిన మంచి కోసం భారతదేశాన్ని తప్పక రక్షించాలి.

*

దివ్య శక్తి ఒక్కటే భారతదేశానికి సహాయం చేయగలదు. మీరు దేశంలో విశ్వాసాన్ని, ఐక్యతను పెంపొందించగలిగితే అది మానవ నిర్మిత శక్తి కంటే చాలా శక్తివంతమైనది.

*

భారతదేశాన్ని, ప్రపంచాన్ని రక్షించడానికి ఆధ్యాత్మిక జ్ఞానంతో ఒక బలమైన సంఘటిత సంకల్పం గల సమూహం ఉండాలి. ప్రపంచానికి సత్యాన్ని అందించగలిగేది భారతదేశమే. కేవలం దివ్య సంకల్పాన్ని, శక్తిని అభివ్యక్తం చేయడం ద్వారా, భారతదేశం ప్రపంచానికి తన సందేశాన్ని బోధించగలదు, పాశ్చాత్య భౌతికవాదాన్ని అనుకరించడం ద్వారా కాదు. దివ్య సంకల్పాన్ని అనుసరించడం ద్వారా భారతదేశం ఆధ్యాత్మిక పర్వతం పైభాగంలో ప్రకాశించి, సత్యం మార్గాన్ని చూపుతుంది, ప్రపంచ ఐక్యతను వ్యవస్థీకరిస్తుంది.

*CWM 13: 352-53*

భారతదేశం ప్రపంచానికి ఆధ్యాత్మిక నాయకురాలిగా ఉండాలి. ఆమె లోపల ఆ సామర్థ్యం ఉంది, కానీ బయట... ప్రస్తుతానికి ఆమె ప్రపంచానికి ఆధ్యాత్మిక నాయకురాలిగా మారడానికి ఇంకా చాలా చేయాల్సి ఉంది.

అలాంటి అద్భుత అవకాశం ఇప్పుడే వచ్చింది! కానీ...

*CWM 13:367*

భారతదేశానికి ఆత్మ జ్ఞానం ఉంది, కానీ ఆమె పదార్థాన్ని నిర్లక్ష్యం చేసింది, దానివల్ల బాధపడింది.

పాశ్చాత్య దేశాలకు పదార్థ జ్ఞానం ఉంది, కానీ అవి ఆత్మను తిరస్కరించాయి, దానివల్ల తీవ్రంగా బాధపడుతున్నాయి.

కొన్ని వైవిధ్యాలతో, ప్రపంచంలోని అన్ని దేశాలకు అనుగుణంగా ఉండే సమగ్ర విద్య, పూర్తిగా అభివృద్ధి చేయబడి, వినియోగించడానికి అవకాశం ఉన్న పదార్థంపై ఆత్మ, న్యాయబద్ధ అధికారాన్ని తిరిగి తీసుకురావాలి.

క్లుప్తంగా నేను చెప్పాలనుకున్నది ఇదే.

ఆశీస్సులతో.

*CWM 13: 361*

భారతదేశం తిరిగి తన ఆత్మను కనుగొని, దానిని అభివ్యక్తపరచాలి.

*

మీరు మీ సందేశాలలో ఒకదానిలో ఇలా అన్నారు:

“భారతదేశానికి మొదటి సమస్య ఏమిటంటే, ఆమె ఆత్మను తిరిగి కనుగొనడం, అభివ్యక్తీకరించడం” అని.

భారతదేశం తన ఆత్మను తిరిగి కనుగొనడం ఎలా?

చైత్య పురుషుని అనుభూతి చెందడం ద్వారా. నీ చైత్య పురుషుని భారతదేశ ఆత్మ పట్ల తీవ్ర ఆసక్తితో ఉండనివ్వు, సేవా దృక్పథంతో దాని కోసం ఆకాంక్షించు, నిజాయితీగా ఉంటే నీవు విజయం సాధిస్తావు.

*

చైత్య పురుష శాసనాన్ని పాలించగల, తప్పక పాలించే దేశం

భారతదేశం. ఇక్కడ దానికి సమయం ఆసన్నమైంది. . అంతేకాకుండా, దురదృష్టవశాత్తూ ఒక విదేశ ప్రభావం, ఆధిపత్యంతో చేతన వక్రీకరించబడిన ఈ దేశానికి పరిష్కారాన్ని ఇచ్చే ఏకైక దారి ఇదే. కానీ ఇది ఇలా ఉన్నప్పటికీ, ప్రత్యేక ఆధ్యాత్మిక వారసత్వం ఈ దేశానికుంది.

ఆశీస్సులతో.

(ఆల్ ఇండియా రేడియో, పాండిచ్చేరి ద్వారా ప్రసారం చేయడం కోసం సందేశం)

మేము ప్రకాశం మరియు సత్యానికి దూతలుగా ఉండాలనుకుంటు న్నాము. ఒకేసారి సామరస్య పూర్వక భవిష్యత్తు తనకు తాను సమర్పించుకోవడానికి ప్రపంచానికి ప్రకటించబడుతుంది.

భయంతో పరిపాలించే పాత అలవాటును ప్రేమ ప్రభుత్వం ద్వారా భర్తీ చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

*

(21 ఫిబ్రవరి 1971న మదర్ పుట్టినరోజున ఆల్ ఇండియా రేడియో, పాండిచ్చేరి ద్వారా ప్రసారం చేసిన సందేశం)

నిజమైన స్వేచ్ఛ అనేది ఆరోహణ గమనం, నిమ్న ప్రవృత్తులకు లొంగడం కాదు.

నిజమైన స్వాతంత్ర్యం దివ్య అవతరణ.

భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం కావాలి, తద్వారా మానవజాతి ఎలా అవ్వాలో బోధించేందుకు ఆమె ప్రపంచానికి సరైన ఉదాహరణగా నిలువ గలదు.

*CMW 13: 369 - 70*

భారతదేశం పోరాడుతున్నది సత్య విజయం కోసమే. భారతదేశం, పాకిస్తాన్లు మరోసారి ఒకటి అయ్యే వరకు పోరాడాలి ఎందుకంటే అది వారి అస్తిత్వానికి సంబంధించిన సత్యం.

*CWM 17: 262*

మదర్,

భారతదేశంలో రాజకీయ, ఆర్థిక పరిస్థితి మరింత హాస్యాస్పదంగా మారుతుంది. దయచేసి భారతదేశాన్ని భారతీయుల నుండి రక్షించి నీ కృపకు మమ్మల్ని పాత్రులను చేయి.

దైవానుగ్రహం అద్భుతమైంది, సర్వశక్తిమంతమైంది.

భగవంతుని పని విధానాలు సంతోషకర హాస్య ప్రవృత్తితో నిండి ఉంటాయి...

ప్రేమతో కూడిన ఆశీర్వాదాలు.

*CWM 17: 278*

భారతదేశం యోగ జ్ఞానానికి సంరక్షణా భారం వహిస్తోంది, కానీ ఈ జ్ఞానం భౌతికవాదం ద్వారా కప్పబడి ఉంది. శ్రీ అరొబిందో దానిని మేల్కొలిపారు. ఇప్పుడు అది వ్యాప్తి మాత్రమే చెందాలి.

*

(బంగ్లాదేశ్ సంక్షోభ సమయంలో, మదర్ ఈ క్రింది నాలుగు ప్రకటనలు చేశారు.)

పరిస్థితి గంభీరంగా ఉంది. దాని నుండి దేశాన్ని బయటకు తీయగల శక్తి గలది, బలమైన, జ్ఞానవంతమైన కార్యాచరణ మాత్రమే.

దీవెనలు.

(దిగువ సందేశం ఆశ్రమంలో తదుపరి ఇచ్చిన పరిచయ వాక్యంతో పంపిణీ చేయబడింది: "ప్రస్తుత సంక్షోభం కోసం దేశంలోని ప్రజలందరికీ మదర్ అందించిన మంత్రం.")

పరమేశ్వరుడా, శాశ్వత సత్యమా
నీకు మాత్రమే విధేయులమవ్వనీ
సత్యానుకూలంగా జీవించెదము గాక!

*CWM 13: 371-72*

భారతదేశం పూర్తిగా దివ్య జీవనానికి దూతగా మారినప్పుడే, ప్రపంచంలో తన నిజమైన స్థానాన్ని పొందుతుంది.

(ఆశ్రమాన్ని సందర్శించిన భారత ప్రభుత్వ విద్యా కమిషనుకు సందేశం)

భారత ప్రభుత్వం ఒక విషయం తెలుసుకోవాలి

అది భవిష్యత్తు కోసం జీవించాలనుకుంటుందా, లేదా అది నిర్విరామంగా గతానికి కట్టుబడి ఉండాలనుకొంటోందా?

*

(ఆల్ ఇండియా రేడియో, పాండిచ్చేరి, ప్రారంభోత్సవం రోజున, దాని ద్వారా ప్రసారం కోసం ఇచ్చిన సందేశం)

కాంతికి, ఆధ్యాత్మిక జ్ఞానానికి ఆలవాలమైన ఓ భారత దేశమా! ప్రపంచంలో నువ్వు చేయవలసిన వాస్తవ లక్ష్యం కోసం మేలుకో. ఐక్యతకి, సామరస్యానికి మార్గం చూపించు.

*

భారతదేశ భవిష్యత్తు చాలా స్పష్టంగా కనబడుతోంది. భారతదేశం ప్రపంచానికి గురువు. ప్రపంచ భవిష్యత్తు నిర్మాణం భారత్‌పైనే ఆధారపడి ఉంది. భారతదేశం సజీవాత్మ. భారతదేశం ప్రపంచంలో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అవతరింప చేస్తోంది. ఈ పరిధిలో భారతదేశ ప్రాముఖ్యతను భారత ప్రభుత్వం గుర్తించి, తదనుగుణంగా తన కార్యాచరణను రూపొందించుకోవాలి.

భారతదేశం ఘోర పోరాటం నుండి విజయం సాధించినప్పుడు, తన ప్రాదేశిక సమగ్రతను తిరిగి పొందుతుంది, నైతిక సంక్షోభంపై విజయం సాధించడం ఇంకా ప్రాణాంతకమైంది, ఎందుకంటే శరీరాన్ని చంపే బదులు అది అంతరాత్మ-సంబంధాన్ని నాశనం చేస్తుంది, ఇది చాలా విషాదకరం - భారతదేశం ప్రపంచంలో తన వాస్తవిక స్థానాన్ని తిరిగి పొంది, తన పనిని పునఃప్రారంభిస్తుంది. పూర్తిగా వ్యక్తిగత ఆసక్తులు, ఆశయాలతో కూడిన ప్రభుత్వ, రాజకీయ ప్రత్యర్థులకు మధ్య

ఈ చిన్నపాటి తగాదాలు స్వయంచాలకంగా న్యాయపూర్ణమైన జ్ఞానోదయ పూర్వక ఒప్పందంతో పరిష్కరించబడతాయి.

*

(1 నవంబర్ 1954న పాండిచ్చేరి మరియు భారతదేశంలోని ఇతర ఫ్రెంచ్ స్థావరాలు ఇండియన్ యూనియన్కి బదిలీ చేయబడ్డాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఉదయం 6.20 గంటలకు ఆశ్రమం వద్ద మదర్ చిహ్నంతో కూడిన జెండాను ఎగురవేశారు, అప్పుడు మదర్ ఈ క్రింది సందేశాన్ని చదివారు.)

మనకు సంబంధించినంత వరకు, నవంబర్ 1కి ప్రగాఢమైన ప్రాముఖ్యత ఉంది. శ్రీ అరొబిందో సమైక్యత కలిగిన భారతదేశ ఆధ్యాత్మిక పతాకం అని పిలిచే జెండా మన దగ్గర ఉంది. దాని చదరపు రూపం, దాని రంగు, దాని రూపకల్పనకు సంబంధించిన అన్ని వివరాలు చిహ్న అర్థాన్ని కలిగి ఉంటాయి. 1947 ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు దీనిని ఎగురవేశారు. అది మళ్ళీ ఇప్పుడు 1 నవంబర్ 1954న ఈ స్థావరాలు భారతదేశంతో కలిసినప్పుడు ఎగురవేయబడుతోంది, భవిష్యత్తులో భారతదేశం తనలోని ఇతర భాగాలను పునరుద్ధరించుకున్నప్పుడల్లా ఇది ఎగురవేయబడుతుంది. ఐక్యత కలిగిన భారతదేశం ప్రపంచంలో నెరవేర్చడానికి ఒక ప్రత్యేక కార్యం ఉంది. శ్రీ అరొబిందో దాని కోసం తన జీవితాన్ని అర్పించారు, మేము కూడా అదే చేయడానికి సిద్ధంగా ఉన్నాము.

*

(ఆశ్రమాన్ని సందర్శించిన భారత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ గారికి, ఇచ్చిన సందేశం)

భారతదేశం తన కార్య లక్ష్యం అత్యున్నత స్థాయికి ఎదగాలి, ప్రపంచానికి సత్యాన్ని ప్రకటించాలి.

భారతీయుల నుండి భారతదేశాన్ని రక్షించమని నిన్ను ప్రార్థిస్తున్నాను.

అవును, ఇది చాలా అవసరం అనిపిస్తుంది.

భారతదేశం ప్రస్తుతం అంధకారంలో ఉన్నప్పటికీ భారతదేశ భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉంది.

వాస్తవిక ఆధ్యాత్మికత అంటే జీవితాన్ని త్యజించడం కాదు, దివ్య పరిపూర్ణతతో జీవితాన్ని పరిపూర్ణంగా మార్చుకోవడం.

ఇప్పుడు భారతదేశం ప్రపంచానికి దీనినే తప్పక చూపాలి. **26 జనవరి 1963**

ప్రస్తుతం ఉన్న అత్యవసర పరిస్థితిలో ప్రతి భారతీయుడి కర్తవ్యం ఏమిటి?

*

నీ చిన్న అహంకార వ్యక్తిత్వాన్ని దాటి, మన భారతమాతకు యోగ్యమైన బిడ్డగా అవ్వు. నీ విధులను నిజాయితీగా, సక్రమంగా నిర్వర్తించు. ఎల్లప్పుడూ ఉల్లాసంగా, నమ్మకంగా, దైవానుగ్రహంపై స్థిరమైన నమ్మకంతో ఉండు.

మానవజాతి హితం కోసం భారతదేశ నిర్మాణానికి సహకరించడమే మన ధ్యేయమై ఉండాలి. ఇదే మన జాతీయవాద భావన. దీనినే బహిరంగంగా ప్రకటించాలి, అనుసరించాలి. “సమయం వచ్చింది. మీరిప్పుడు గొప్ప పూనికతో ముందడుగు వేసి, ఈ భౌతిక అస్తిత్వం నుండీ మానవజాతి కదిలే ఇంకా ఉన్నతమైన, గంభీరమైన, విశాలమైన జీవితానికి ఉద్గమించాలి. మానవజాతిని ఇబ్బంది పెట్టిన సమస్యలు మనలోపటి సామ్రాజ్యాన్ని జయించుకున్నప్పుడే పరిష్కరించబడతాయి. ప్రకృతి శక్తుల్ని విలాస, సౌకర్యాల సేవలో కట్టి పడేయడం వలనకాక, బౌద్ధిక, ఆత్మిక శక్తులపై అదుపు సాధించడం ద్వారా అటు అంతర్గతంగానూ ఇటు బాహ్యంగానూ మనిషి స్వేచ్ఛను విజయోపేతంగా నిరూపించడం ద్వారా అంతరంగంలో నుండీ బాహ్య ప్రకృతిని గెలవడం ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కార మౌతాయి. ఈ పనికోసం ఆసియా పునర్జాగృతి అవసరం. కాబట్టే ఆసియా పైకి లేస్తున్నది. ఈ పనికోసమే భారతదేశానికి ఘనతా స్వాతంత్ర్యాలు అత్యావశ్యకాలు. అందుచేత ఆమె పొందితీరవలసిన స్వాతంత్ర్య, ప్రాశస్త్యాలను పొందజూస్తుంది. ఇది యావత్తు మానవజాతి ప్రయోజనం కోసం, ఇంగ్లాడుతో సహా, తన అధికారాన్ని పూర్తిగా నెలకొల్పుకోవాలి” ఇదే ఆమె తన హక్కుగా ప్రకటిస్తోంది.

- శ్రీ అరవిందులు

# భారతదేశ ఐకమత్యత

## భారతదేశ విభజనపై

**(2 జూన్ 1947న భారతదేశ వైస్రాయ్ లార్డ్ లూయిస్ మౌంట్ బాటన్, భారతదేశం నుండి పాకిస్తాన్‌ను భారతదేశంలోని కొన్ని ఇతర ప్రాంతాలను హిందూ ముస్లిం రాష్ట్రాలుగా విభజించడాన్ని ప్రతిపాదిస్తూ రేడియో ప్రసంగం చేశారు. ప్రసారాన్ని విన్న తర్వాత శ్రీమాత ఈ క్రింది ప్రకటనను జారీ చేసింది.)**

భారత స్వాతంత్ర్యాన్ని అమలు చేయడంలో మనకున్న కష్టాల పరిష్కారం కోసం ఒక ప్రతిపాదన చేయబడింది, భారతీయ నాయకులు అదెంత చేదైన విచారంతో కూడినదైనా, హృదయ శోధనలతో కూడినదైనా, దానిని అంగీకరించారు.

అయితే ఈ ప్రతిపాదన ఎందుకు వచ్చిందో తెలుసా? మన గొడవల అసంబద్ధతను మనకు నిరూపించడానికి.

మరి ఈ ప్రతిపాదనలను ఎందుకు అంగీకరించాల్సి వచ్చిందో తెలుసా? మన గొడవల అసంబద్ధతను మనకు మనం నిరూపించుకోవడానికే.

స్పష్టంగా, ఇది పరిష్కారం కాదు. ఇది ఒక పరీక్ష, ఒక యాతన, మనం దానిని పూర్తి చిత్తశుద్ధితో జీవిస్తే, దేశాన్ని చిన్న ముక్కలుగా విభజించడం ద్వారా దాని ఐక్యత, గొప్పతనాన్ని మనం తీసుకురాలేమని మనకు రుజువు అవుతుంది. పరస్పర వ్యతిరేక ప్రయోజనాల ద్వారా మనం దాని శ్రేయస్సును సాధించలేం. ఒక సిద్ధాంతాన్ని మరొకదానికి వ్యతిరేకంగా ఉంచడం ద్వారా మనం సత్యాన్ని సేవించలేం. ఏది ఏమైనప్పటికీ, భారతదేశానికి ఒకే ఆత్మ ఉంది, మనం భారతదేశం గురించి, అవిభాజ్యమైన భారతదేశం గురించి మాట్లాడే వరకు వేచి ఉండాలి, మన నినాదం ఇలా ఉండాలి:

## భారత దేశం, ప్రపంచం

శ్రీ మాతా, భారతదేశం ప్రపంచలోని అన్ని పోరాటాలకూ ప్రతీక అనే భావన నాకు ఉంది. భారతదేశం తన ఐక్యతను తిరిగి పొందనంత వరకు ప్రపంచంలో నూతన చైతన్యం స్థాపించబడదు.

అవును

(మౌనం)

భారతదేశం నిర్మాణంలోఉన్న కొత్త ప్రపంచానికి చిహ్నం అని స్పష్టంగా కనిపిస్తోంది, కాబట్టి కొత్త ప్రపంచం వెలుగు చూడాలంటే భారతదేశం ప్రతీకాత్మకంగా "ఒకటిగా" ఉండాలి....

అవును.

ఫలితంగా పాకిస్తాన్ కనుమరుగవ్వాలి.

ఖచ్చితంగా అంతే, కాని

అందులో ఎలాంటి సందేహం లేదు. కాబట్టి ఇదే దానికి తగిన సమయం.

కానీ వారు ఇప్పటికే ఒక అవకాశాన్ని కోల్పోయారు.

అవును, వారు ఇప్పటికే ఒక అవకాశాన్ని కోల్పోయారు. అయితే ఇప్పుడు... వారు దీన్ని వదులుకోకూడదు.

(మౌనం)

కానీ భారతదేశమే విభజించబడిఉంది.

విభజించబడి ఉందా?

అవును, ఉదాహరణకు, ఒరిస్సాలో. ఒరిస్సాలో ఎక్కువ భాగం పూర్తిగా శ్రీ అరవిందుల ప్రభావంతో ఉంది, మరో భాగం తిరుగుబాటులో ఉంది.... ఎన్.ఎస్.కు అక్కడఅంతులేని శత్రువులు ఉన్నారు. ఆమె అక్కడ ఎన్నికైంది, కానీ ఆమెకు ఎడతెగని శత్రువులు ఉన్నారు - భారతదేశం అంతర్గతంగా విడిపోయి ఉంది.

(మౌనం)

ఇది తీవ్రమైనది.

అంత ప్రగాఢ విశ్వాసం కావాలి... కానీ... (ఆమె వేళ్ల మధ్యఏదో నలిగి ధూళివలె మారుతున్నట్లు సంజ్ఞ చేశారు).

చూడండి, ఆ శక్తి చాలా చురుకుగా పనిచేస్తూ ఉంది.... ఎన్నో సంవత్సరాలుగా చెలామణిలో ఉన్న అబద్ధాలు అన్నీ ఇప్పుడు పైకి కనిపిస్తున్నాయి. ప్రతిచోటా కూడా ఇలాగే మిశ్రమంగా ఉంది.

అలాంటిది... అలాంటి సత్యశక్తి కావాలి, మీకు తెలుసు వాటన్నింటిని అధిగమించడానికి తగినంత గొప్పది అది.

(మౌనం)

నాకు సంబంధించినంత వరకు, విజయం తథ్యం, కానీ అది రేపో లేక..ఇంకెప్పుడో తెలీదు (దూరాన్ని సూచిస్తూ సంజ్ఞ చేశారు )

అక్కడికి చేరుకోవడానికి మనం ఏ దారిలో వెళ్లాలో నాకు తెలియదు.

విజయం తథ్యమే, అది సుస్పష్టం కానీ అక్కడికి చేరుకోవడానికి మనం ఏ దారిని తీసుకోబోతున్నాం?

ఇది మన వ్యక్తిగత స్థితిపై చాలా ఆధారపడి ఉంటుంది. అది వారికి అర్థం కాలేదు. ఏదీ మనలను తాకనంతగా మనం సత్యాన్ని గట్టిగా పట్టుకోవాలి

(మౌనం)

ఇది ఎప్పుడూ అదే విషయానికి తిరిగి వస్తుంది: “నీ ఇచ్ఛ ఎలా ఉందో, ప్రభూ, నీ ఇచ్ఛ ఎలా ఉందో.”

కానీ అది అధిగమించలేనంత బలంగా ఉంది.

*

## ప్రపంచ పోరాటానికి ప్రతీక

భారతదేశ ఆత్మ మాత్రమే ఈ దేశాన్ని ఏకం చేయగలిగేది. బాహ్యంగాచూస్తే భారతదేశంలోని సంస్థానాలు స్వభావం, ధోరణులు,

సంస్కృతి అలాగే భాషలో, చాలా భిన్నంగా ఉంటాయి. వాటిని కృత్రిమంగా ఏకం చేసే ఏ ప్రయత్నమైనా వినాశకరమైన ఫలితాలను మాత్రమే కలిగిస్తుంది.

కానీ ఆమె ఆత్మ ఒక్కటే, ఆధ్యాత్మిక సత్యం, సృష్టి మౌలిక ఐక్యత, జీవితపు దైవిక మూలం పట్ల తీవ్రమైన ఆకాంక్షను కలిగి ఉన్నది, అలాంటి ఆకాంక్షతో ఏకం కావడం ద్వారా ఎప్పటినుండో నిలచి ఉన్న ఎడతెగని ఐక్యతను పునరుద్ధరించి ఒక ఉన్నతమైన మానసికస్థితిని నెలకొల్పుతుంది.

*

## భారతదేశ ఏకీకరణ

అది ఆ విధంగా చేయలేం. ఎలా దాన్ని చేయాలో నేను దర్శించాను. ఇది పోరాటం ద్వారా జరగదు: పాకిస్తాన్‌లోని వివిధ ప్రాంతాలు విడిపోవాలని కోరతారు. అలాంటి ప్రాంతాలు అయిదు ఉన్నాయి. అలా విడిపోవడం ద్వారా, వారు భారతదేశంలో చేరతారు. ఒక విధమైన సమాఖ్యను ఏర్పాటు చేసుకుంటారు. అది అలాజరుగుతుంది.

అది లోపల నుండి విడిపోతుంది, అవును, నేను చూశాను.

అది సరిగ్గాఅలాగే జరుగుతుంది.

నేను చూశాను, అది ఏ రోజు అనేది (ఇటీవల) నాకు గుర్తు లేదు, అకస్మాత్తుగా, చాలా గంటలు దైవిక శక్తిదర్శనంతో సంయోగం కలిగింది... అది.. అది అద్భుతమైనది, విషయాలు అసాధారణంగా మారాయి. తర్వాత, మరుసటి రోజు, వార్తలన్నీ మారిపోయాయి. నిజంగా అసాధారణమైన విషయం. నిజానికి జరిగింది నేను చూసినది కాదు, ఇది చాలా సంవత్సరాల ముందు కనిపించింది.... కానీ అది అంతగా పట్టించుకోవలసిన అవసరం లేదు. అంతా బాగానే ఉంది.

*

## విషయాలు ముందుకుకదులుతున్నాయి

మనం ఎల్లప్పుడూ ఆతురుతలో ఉంటాము, ఎందుకంటే భూమిపై జీవితం చిన్నది, కానీ మీరు ఏమి జరుగుతుందో చూసినప్పుడు... (విశాలమైన, వృత్తాకార సంజ్ఞ). నిజంగా ఎంత అందంగా ఉంటుందో, చాలా మెరుగ్గా ఉంది! దీనికి ఎక్కువ సమయం పడుతుంది, కానీ ఇది చాలా మెరుగ్గా ఉంది. అమెరికాలో జరుగుతున్న మార్పుకూడా ఇందులో ఒక భాగమే, అయితే దీనికి కూడా సమయం పడుతుంది.

*

కాబట్టి, భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు సమాఖ్యగా ఏర్పడడం ఒకటైతే, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోమార్పు ఇంకొకటి. మానవుల ఐక్యత అనే ఒక ఆదర్శం అని శ్రీ అరవిందులు రూపొందించి వివరించిన తరహాలో భారత రాష్ట్రాల సమాఖ్య ఉంటుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో జరిగే మార్పు కూడా అదే కోవకు చెందినది, అది శ్రీ అరవిందులకు వ్యక్తం కాబడినట్లుగానే ఉంటుంది. అయితే అందుకు సమయం పడుతుంది.

*

## ఒక స్మృతి

**1947**వ సంవత్సరంలో భారతదేశం స్వాతంత్ర్యాన్ని సాధించింది. దేశవ్యాప్తంగా బాణాసంచాలు ప్రకాశాలు, ఉదయం సంగీత కచేరీలు, కవాతులు మొదలైన వేడుకలు జరిగాయి.

ఈ సమయంలో జాతీయ జెండా, జాతీయ గీతం గురించి నేను మదర్ తో మాట్లాడాను. వందేమాతరం జాతీయ గీతం అయినప్పటికీ సంగీత బృందం జన గణ మన జాతీయ గీతంగా వాయించవలసి వచ్చింది. వందే మాతరం కేవలం ఒక గీతం కాదు, అది ఒక మంత్రం అన్నారు మదర్. రవీంద్రనాథ్ ఠాగూర్ చేసిన వందేమాతరం, జనగణమనల సంగీత కూర్పు మేము వాయించాము. ఆ తర్వాత తిమిర్ బరన్ కూర్పు చేసిన వందేమాతరంను మదర్‌కు వినిపించాము. తిమిర్

బరన్ కూర్పును మదర్ ఇష్టపడ్డారు. అది కూడ వాయిద్య బృందానికి ఇంకా బాగా సరిపోతుంది. కానీ వాయిద్య బృందానికి దాని సంగీత సంజ్ఞామానం లేదు. మొదట మన హీరు గంగులిని తిమిర్ బరన్‌తో సంప్రదించమని చెప్పాలని అనుకున్నాము, కానీ చేయలేకపోయాము. సహానా దీదీ ఒక సంజ్ఞామానం వ్రాశారు, చివరకు ప్లే గ్రౌండ్ లో తిమిర్ బరన్ వందేమాతరం మదర్ కు వినిపించగలిగినందుకు కృతజ్ఞతలు చెప్పుకున్నాము., మదర్ దాన్ని నిజంగా ఇష్టపడ్డారు.

అదే సమయంలో సింప్సన్ అనే ఇంగ్లీషు మ్యూజిక్ నిర్వాహకుడు వాద్య బృందం కోసం ఒక సంగీత సంజ్ఞామానాన్ని తయారు చేసినట్లుగా కనుక్కొన్నాను. ఆ రాగం జనగణమన కన్నా చాలా బాగుంది. మొత్తంగా అది ఒక మంత్రం లాగా, జాతీయ గీతానికి తగినట్లుగా ఉంది. కనుక ఆశ్రమంలో ఏదైనా కార్యక్రమం ప్రారంభించడానికి ముందు మేము ఎప్పుడూ మన వాద్యబృందం వాయించిన ఆ చిన్న భాగంతోనే ప్రారంభిస్తాము. ఆశ్రమం బయట నుండి వచ్చిన వాళ్లకు, ప్రభుత్వం నుండి వచ్చిన వాళ్లకు కార్యక్రమం నిర్వహించేటప్పుడు ప్రారంభంలో వందేమాతరం, ముగింపు కు జనగణమన వాయించేవాళ్లము.

ఆసమయంలోనే నేను మన జాతీయ పతాకం గురించి మదర్‌తో మాట్లాడాను. మన స్వతంత్రానికి ముందు భారత ప్రభుత్వం జాతీయ పతాకం ఆకృతి గురించి చాలామంది వ్యక్తులను, సంస్థలను సంప్రదించింది. ఆశ్రమం నుండి జయంతి లాల్ దా, మదర్ జెండా పంపించారు. అంతిమంగా భారత ప్రభుత్వం దేశానికి ప్రాతినిధ్యం వహించేదిగా మూడు రంగుల కాంగ్రెస్ జెండాను ఎంపిక చేసింది. మధ్యనున్న చరఖా బదులు అశోక చక్రం ఉంచబడింది. మూడు రంగుల జెండాకు పైన కాషాయ రంగు, మధ్యన తెలుపు, క్రింద ఆకుపచ్చగా ఉంచారు. ఈ మూడు రంగులు, స్వేచ్ఛను, శాంతిని, అభివృద్ధిని సూచిస్తాయి. మధ్యనున్న ధర్మచక్రం చలనాన్ని, ఐక్యతను సూచిస్తుంది.

జాతీయ జెండాను చూచిన తర్వాత మదర్ మాతో ఇలా అన్నారు, చక్రం మధ్యభాగం తెలుపు వర్ణం లోనే ఉంది, కానీ ఇది మూడు వర్ణాలలో

వ్యాపించలేదు, ఇండియా లోని అన్ని జాతుల పూర్తి జీవన విధానాన్ని ఆక్రమించలేదు కాబట్టి వాటి చలనము, ఏకత సాంకేతికంగా ప్రాముఖ్యతను పొందలేదు. ఇది భారతదేశ ఐక్యత, ఏకత్వాలను సాంకేతికంగా స్థిరం చేయడానికి సహాయం చేయలేక పోయింది అని మదర్ భావించారు. ఈ పతాకాన్ని చూచినపుడు ఎవరైనా భారతదేశ ఐక్యత కొంచెంగా చెదిరిందన్న భావనకు వస్తారు. ఒకవేళ చక్రము మూడు వర్ణాలలో వ్యాపించినట్లైతే అది ఇంకా బాగుండేది.

**1947** వ సంవత్సరంలో మన దేశమొత్తం యాదృచ్ఛికంగా వేడుకలు జరుపుకుంటున్నపుడు మదర్ శ్రీఅరవిందుల గది నుండి బయటకు వచ్చారు, అప్పుడు ఆమె ఒక సమాధి స్థితిలో ఉన్నట్లుగా కనిపించారు. నేను ఆమె గది ముందున్న పైకప్పుతో ఉన్న వరండాలో నిలబడి ఉన్నాను. ఆమె ఎంతో తీవ్రతతో రాబోయే నలభై సంవత్సరాలలో భారతదేశం చాలా చెడుకాలాన్ని చూస్తుంది అన్నారు.

ఇప్పుడు మనం దాని గురించి ఆలోచిస్తే ఆమె సత్యం మాట్లాడారని అనిపిస్తుంది. ఏది ఏమైనా ఆమె తన ఆధ్యాత్మిక శక్తితో భారత్ తిరిగి గొప్పగా అవుతుందని పదేపదే చెప్పారు. ఒకరోజున అది పూర్తి పృధ్వి భవిష్యత్తుకు బాట చూపుతుంది.

స్వతంత్రానికి ముందు భారత దేశ విభజన మదర్‌ను ఎంతో బాధించింది. ఆమె అన్నారు, భారతదేశం తిరిగి ఒకటవుతుందని శ్రీ అరవిందులు అన్నారు అని.


భారతదేశం గురించి మదర్ ఇలా అన్నారు,

"ఇండియా ఒక పెద్ద కుండలాంటిది, అందులో ఒక మంచి భోజనం వండటానికి అన్ని ప్రదేశాల నుండి పదార్థాలు తీసుకురాబడతాయి."

*ప్రణబ్ ఐ రిమెంబర్ : 212,214*

**29, జూలై 1964**

("మదర్ యొక్క భారతదేశ పటం," ఇందులో పాకిస్తాన్, నేపాల్, సిక్కిం, భూటాన్, బంగ్లాదేశ్, బర్మా, శ్రీలంక చేర్చబడ్డాయి, క్రింది మొదటి



వాక్యంలోని విభజన ఇండియా నుంచి పాకిస్తాన్ విభజించబడటం గురించి)

ఈ పటం, విభజన తర్వాత చేయబడినది.

ఇలా వచ్చి అలా జరిగిపోతున్న రూపాలెన్ని వున్నప్పటికీ, ఇది నిజమైన ఇండియా మ్యాప్, దీని గురించి మనుష్యులు ఏం ఆలోచించినా, ఇది ఎప్పటికీ నిలిచిపోయే నిజమైన ఇండియా మ్యాప్

**29 జూలై, 1964**

**Vol. 54, No.** 8
**August 2024**


Date of Publication:
1st August 2024

TN/PMG (CCR)/ WPP 473/24-26
Registered: PY/41/2024-26

**AKHILA - Akhila Bharata Patrika (Telugu)**

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

*Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo*



(*About "the Mother's flag", which contains her symbol in gold centred on a silver-blue background*)

It is the flag of India's spiritual mission. And in the accomplishment of this mission will India's unity be accomplished.

*CWM 13: 352, 15 August 1947*

*Owner:* Sri Aurobindo Society
*Printer:* Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
*Publisher:* Pradeep Narang for Sri Aurobindo Society
*Published from:* Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
*Printed from:* Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

---

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001

# అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబర్ 2024



## జీవితం - ఒక యాత్ర, ఒక ఆరోహణ

# విషయ సూచిక

## మదర్ వాక్కులు




## శ్రీ అరవిందుల వాక్కులు



---

పదార్థ విశ్వంలో సచేతన జీవులుగా మన మనుగడకు గల సత్యత, విశిష్టతలను ఆవిష్కరించుకొనడం కోసం జరుగుతుంది మన కృషి. ఏ దిశలో, ఎంత దూరం, ఒకసారి ఆవిష్కరించుకొన్న ఆ విశిష్టత మనల్ని తీసుకుపోతుంది, ఏ మానవ లేక దివ్య భవితవ్యం వైపు తీసుకుపోతుంది.

CWSA 21:1051 — *శ్రీ అరవిందులు*



జీవించడం, ప్రేమించడం అనంత విషయాల సంకేతాలు,
ప్రేమ శాశ్వత ఆవరణ గుండా తరలివచ్చే శోభ.

*సావిత్రి పుట. 397*

# విశ్వంలో ఏం జరుగుతుంది?

**ఓ ప్రభూ!**

నీ శాసన శోభను, నీ వైభవ మహనీయతను ఏ పదాలు వర్ణించగలవు? నీ ప్రేమలోని అమిత ఆనందాన్ని నీ చేతనలోని పరిపూర్ణతను ఏ శబ్దాలు వ్యక్తీకరించగలవు?

నీ అవర్ణనీయ శాంతిని, నీ సర్వశక్తిసమన్విత సత్యంలోని మహత్వాన్ని, నీ నీరవతలోని రాజదర్పాన్ని ఏ పదాలు కొనయాడి, పాడగలవు?

ఈ సమస్త ప్రకటిత విశ్వం నీ వైభవాన్ని, నీ అద్భుతాలను చెప్పడానికి సరిపోలేకపోతుంది. నీ కాల శాశ్వతత్వంలో పదే పదే ఇంకా ఇంకా ఉత్తమంగా, శ్రేష్ఠంగా రూపొందడానికి ఇది ప్రయత్నిస్తుంది, చిరంతనంగా.

CWM 1:306

ఈ సృష్టికి నిర్దిష్టమైన ఒక లక్ష్యమున్నదా? ఏదైనా ఒక చిట్టచివరి అంతమున్నదా, దాని వైపు ఇది పోతుందా?

లేదు. విశ్వం ఒక గమనం, అది శాశ్వతంగా తనకు తాను సాగిపోతుంటుంది. నీవు ఇది అంతమని, ఒక లక్ష్యమని స్థిరీకరించడానికి ఏదీ లేదు. మన కార్యాచరణ కొరకు ఆ గమనాన్ని విభజించుకోవాలి. దానికది అంతం లేనిది.

ఈ లక్ష్యం లేదా ఆ లక్ష్యమని చెప్పాలంటే మనం పనిచేయడానికి మనకొక ధ్యేయం అవసరం. ఒక చిత్రాన్ని చూచినట్లయితే దానికి ఒక రంగు, ఒక కూర్పుతో కూడిన నిర్దిష్టయోజన అవసరమౌతుంది. మనమొక పరిధిని ఏర్పాటు చేసుకోవాలి. ఆ భావాన్నంతా ఒక నిర్ధారిత చట్రంలో ఇమడ్చాలి, కాని ఆ పరిమితి అన్నది భ్రామికం, చట్రం అన్నది ఒక సాధారణ ఒడంబడిక. నిజానికి చిత్రానికి నిరంతర కొనసాగింపు ఉంటుంది. అది అంతకంతకూ సాగుతూ ఒక నియమిత చట్రాన్ని దాటుకొంటూ పోతుంది. అలా ప్రతి కొనసాగింపు అవే పరిస్థితుల్లో చట్రానికి సంబంధించిన ఒక అంతులేని పరంపరలోకి సాగిపోతుంది.

మన లక్ష్యం ఇది లేదా అది అని చెప్పుతాం కాని ఇది ప్రారంభం మాత్రమే, దానికి ఆవల ఇంకొక లక్ష్యం ఉంటుందని, దీని మలుపు ఇంకొక లక్ష్యంలోకి నడుపుకుపోతుందని మనకు తెలుసు; ఈ పరంపరలు ఎప్పటికీ పెరుగుతాయే తప్ప ఆగవు.

CWM 3:31-32

ఈ ప్రపంచం ఎప్పటికీ చిరంతనంగా మారుతూనే ఉంటుంది. ఒక్క క్షణం మాత్రం కూడా క్రితం దానిలా ఉండదు. దీనిలో ఒక సాధారణ సామరస్యత దానికదిగా మరింత పరిపూర్ణంగా వ్యక్తపర్చుకొంటుంది; కనిపించేవన్నీ భిన్నంగా ఉన్నప్పటికీ ఏదీ పూర్వంలాగా ఉండదు. ఈ సమస్తం సదా నిరంతరం వర్ధిల్లుతున్నది. సామరస్యత మరింత సామరస్య పూరితమౌతుంది. సత్యం మరింత సత్యవంతమౌతుంది. ప్రకటనలో దానిని చూడాలంటే మొత్తంగా చూడాలి. కాని మనిషి మానవ పరగణాన్నే చూడడు, అతడి వ్యక్తిగత పరిధినే చూసుకుంటాడు. అది చాలా చిన్నది, అల్పం, సూక్ష్మం - దానిని అర్థం చేసుకోలేడు.

ఇది ద్వైతమైన విషయం. దానినది పూర్తి చేసుకొంటూ (పరస్పర మిశ్రమాన్ని చూపే ముద్ర) ఈ అభివ్యక్త సృష్టి దానికది మరింత సచేతనమవ్వగా, దాని స్వీయ అభివ్యక్తీకరణ కూడా సంపూర్ణమౌతుంది. ఈ రెండు కలసి ప్రయాణిస్తున్నాయి.

CWM 11:76 *26 ఆగష్టు 1967*

సృజన గమ్యం పూర్తిగా బహిర్గతం కావాలంటే ఈ జరిగేదంతా అవసరం. సృష్టి కర్తవలే ప్రాణి కూడా సచేతునుడు అవ్వడమే సృష్టి లక్ష్యం అని ఎవరైనా అనవచ్చు. అదొక వాగ్వైఖరి, కాని అది (సృష్టి-అను) ఆ వైపుకే సాగుతోంది. ఈ సృష్టి లక్ష్యం సర్వశక్తివంతుడు, అనంతుడు, శాశ్వతుడు... కాలాతీతుడు అయిన అనంతుని, శాశ్వతునికి చెందిన ఈ దివ్యచేతన. అనంతుడు, చిరంతనుడు, సర్వశక్తిమయుడు (మన మతాలు అతడినే దేవుడని పిలిచినాయి; జీవితానికి సంబంధించినంత వరకు, మనకు ఆయన దైవం. ప్రతి వైయక్తిక రేణువు ఈ చేతనను

పుణికిపుచ్చుకొన్నదే. ప్రతి వైయక్తిక రేణువు అదే చేతనతో నిండి ఉన్నదే.

విభజనే ప్రపంచాన్ని సృష్టించింది. ఈ విభజనలోనే శాశ్వతమైనది దానంతటదిగా ప్రకటితమౌతున్నది. దీనిని చెప్పడానికి మన భాష (లేదా మన చేతన) చాలదు.

CWM 11:289 *25 డిసెంబర్ 1971*

ఈ సమస్త సృష్టి దైవాన్ని తప్ప అన్యమైన దాన్ని కోరకూడదు. దైవాన్ని మాత్రమే, మరిదేన్నీ గాక అభివ్యక్తీకరించాలి. ఈ సృష్టి చేసేదీ, దోషాలుగా పిలువబడేవి కూడా సమస్త సృష్టిలో దైవాన్ని అప్రతిహతంగా అభివ్యక్తపర్చడానికి ఉన్న సాధనాలు మాత్రమే దైవం అంటే 'ఇది అది కాదు' అంటూ అన్ని విధాల ఆంక్షలతో మనిషి ఊహించుకొన్నట్లు కాదు. ఒక బ్రహ్మాండమైన ప్రకాశ శక్తుల సంపూర్ణ సముదాయం అది. నిజంగా ప్రపంచంలో వున్న శక్తి. ప్రపంచంలోకి వచ్చిన ఒక నూతన మహత్తర శక్తి; తనకు తాను రూపుదాల్చి, సమస్త దివ్యశక్తినీ 'ప్రకటనీయం' చెయ్యాలి.

నేనీ ముగింపుకొచ్చాను. నేను చూచాను, గమనించాను, మనం పిలుచుకొనే అతి మానసాన్ని నేను దర్శించాను. సృష్టిని ఆ అతిమానసం ఉన్నత శక్తికి స్పందనీయంగా, సానుకూలమైనదిగా మార్చుతుంది; దానిని మనం దైవం అని పిలుస్తాం. ఎందుకంటే మనం దేనికి సంబంధించి ఉన్నమో అదే దైవం అని... అది (క్రిందికి దిగినట్లు, ఒత్తిడి కల్గిస్తున్నట్లు సంజ్ఞ) ఈ పదార్థాన్ని ఆ శక్తికి లోనయ్యేవిధంగా మరింత స్పందన శీలమైనదిగా చెయ్యాలి.

CWM 11:315 *6 మే 1972*

సమస్త అస్తిత్వంలో నిర్వికారంగా ఉండి, నిశ్శబ్ద హృదయ కుహరంలో ఒక జ్యోతి వెలుగుతుంటుంది, అది ఎప్పటికీ ఆరిపోదు. ఆకాంక్ష యొక్క తీవ్ర వహ్ని దైవాన్ని తెలుసుకోవడానికి, దైవంగా జీవించడానికి ప్రజ్వరిల్లుతున్నది.

CWM 14:474 *శ్రీమాత*

# ఐహిక సృష్టి కేంద్రీయ ప్రేరణ

మదర్ బుధవారం తరగతులలో 'దివ్య జీవనం' గ్రంథంలోని చివరి ఆరు అధ్యాయాలను చదువ మొదలుపెట్టారు.

పదార్థంలో అభివృద్ధి చెందుతుండే పరమాత్మ రూపాలలో స్వయంగా నివసిస్తున్న పరమాత్మను, ఆ రూపం బహిరంగపరచేంత వరకు ఒక ఆధ్యాత్మిక పరిణామం, ఒక చేతనా పరిణామం కొనసాగుతుంది. అయినపుడు ఇదే ఐహిక సృష్టికి కీలక సూత్రం, కేంద్రీయ విశిష్ట ఉద్దేశ్యం అవుతుంది. ఆరంభంలో పదార్థ నిశ్చేతనలో పరమాత్మ, దైవసత్యత అంతర్వ్యాలనమైనందు వల్ల ఈ ఉద్దేశ్యం, కీలకం, కనుమరుగైనాయి. నిశ్చేతన ఒకతెర, స్పృహలేని పదార్థ స్థితి అనే తెర, పదార్థంలోనే ఉండి పనిచేస్తున్న వైశ్వచిచ్ఛక్తిని కనుమరుగు చేసింది. అందుచేత సృష్టించిన దివ్యక్రియాశక్తి మొదటగా భౌతిక జగత్తులో, ఊర్జరూపం ధరించింది. ఆ ఊర్జం తానే తనకు నిశ్చేతనంగా కనిపించేటట్లు తయారైంది. అయినప్పటికీ అదొక బ్రహ్మాండమైన గుహ్యప్రజ్ఞ కార్యాలను నిర్వహిస్తున్నది.

*శ్రీ అరబిందో, దివ్య జీవనం,* SABCL Vol. 19, P 824

ఖచ్చితంగా చెప్పాలంటే మొట్టమొదట అర్థం చేసుకోవలసింది జగదస్తిత్వపు వాస్తవాన్ని తెలిపే, జగత్తు మనుగడకు కారణాన్ని తెలిపే మొదటి వాక్యాన్ని. మనం శ్రీ అరవిందుల గ్రంథం 'దివ్య జీవనం' చివర్లో మొదలుపెట్టాం. ఇవి ఆ గ్రంథంలోని చివరి అధ్యాయాలు. శ్రీ అరవిందులు ప్రారంభమంతటా ఒకదాని తర్వాతమరొకటిగా, ప్రాచుర్యంలో ఉన్న సిద్ధాంతాలన్నింటినీ తీసుకొని, అవి ఈ జగత్సృష్టి యెలా, ఎందుకు జరిగింది అనేదాన్ని గురించి తెలిపిన దాన్ని కూలంకషంగా చర్చించారు. అవంటే ఏమిటో పూర్తిగా తెలియజెప్పడానికి వాటిని వాటి పరిమితుల చివరికంటా తీసుకుపోయి వివరించారు. చివర్లో అవియెంత వరకు అసంపూర్ణమో లేదా అపరిపూర్ణమో వివరించి, తమ యథార్థమైన పరిష్కారాన్నందించారు. దాంతో దానికి సంబంధించిన



నిశ్చేతన నుండి దివ్యచిచ్ఛక్తి వెలువడుట
(చిత్రణ, వివరణ శీర్షిక : మదర్)

సమాచారాన్నంతా చెప్పివేసినట్లయింది. అదిగో అది మన అధ్యయన నేపథ్యం. మొత్తం చదువాలంటే మనకు పది సంవత్సరాల పైననే పడ్తుంది. అంతేగాక దానిని చక్కగా అర్థం చేసుకోవాలంటే, నీకు సకల విధ జ్ఞానం ఉండాలి. ఒక గొప్ప మేధోపరిణితి ఉండాలి. ఇప్పుడు మనం సృష్టి కార్యం ఏమిటో తెలిపిన చోట ఉన్నాం. వారు దానిని 'ఐహిక సృష్టికి సంబంధించిన ప్రధాన విశిష్ట ఉద్దేశ్యం' అన్నారు.

ఎందుచేతనంటే మొత్తం జగత్తును గురించి వారు ఇప్పుడు ఆలోచించడం లేదు. వారు ఐహిక సృష్టినే, అంటే భూమిపై మన జీవితాన్ని, మొత్తం జగత్కార్యానికి సంబంధించి, కేంద్రీకరించబడిన ప్రతీకాత్మక ప్రతిరూపంగా తీసుకున్నారు. వాస్తవానికి చాలా సనాతన సాంప్రదాయాల ప్రకారం లోతైన ఆధ్యాత్మిక దృక్కోణం నుండి చూస్తే భూమి కేంద్రీకృతం చేయబడిన జగజ్జీవనానికి ప్రతీకగా సృజించబడింది. ఒకపరిమితమైన, కేంద్రీకృతమైన "స్థలంలో" కేంద్రీకరించబడిన చోట రూపాంతరీకరణమనే మహాకార్యం అత్యంత సంపూర్ణంగా, ప్రభావవంతంగా, మరింత అనాయాసంగా జరగడానికి భూమి సృజించబడింది. అందుచేత ఇచటవారు కేవలం ఐహిక సృష్టిని గురించే చెప్పారు. కాని మనం దానినొక సంకేత రూప సృష్టిగా అర్థం చేసుకోవాలి. అంటే అది ఒక వైశ్వకార్యానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. అదొక సంకేత రూప కేంద్రీకృత ప్రాతినిధ్యం ప్రధాన ఉద్దేశ్యం అని వారు చెప్పిన దానికర్థం. పదార్థ హృదయంలో దాగి ఉండి లోనుండి బయట వైపుకు, ఒక పురోగమించే అభివృద్ధి వైపు, ఈ పదార్థాన్ని లోనుండి ప్రేరేపిస్తున్న పరమాత్మను సంపూర్ణ అభివ్యక్తిలో చివరకు వెలువడచేయడానికి, పదార్థాన్ని మేలు కొలుపడం, అభివృద్ధి చేయడం ఈ ఐహిక సృష్టి కార్య ప్రధానోద్దేశ్యం. కనుక నీవు చూస్తున్న బాహ్య ఆకారాలలో మొదట మన బాహ్య చేతనకు పూర్తిగా అచేతనంగా కన్పించే శిలలు, మట్టి, ధాతువులు గల ధాతు ప్రపంచం నీకు కనిపిస్తుంది. అవును, ఈ చేతన వెనుక, పరమాత్మ శక్తి ప్రాణం, పరమాత్మ శక్తి చేతన ఉన్నాయి. చూపుకు మాత్రమే అది పూర్తిగా దాగి ఉన్నట్లు, నిద్రలో పడిపోయినట్లు కనిపిస్తున్నది. అయినప్పటికీ పైకి పూర్తిగా

జడంలా కన్పించే వైశ్వపదార్థాన్ని క్రమంగా ఆంతరం నుండి రూపాంతరీ కరించడానికి పనిచేస్తున్నది. పరమాత్మ అధికాధికంగా చేతనాభివ్యక్తి కార్యంలో తనను తాను నిమగ్నం చేసుకొంటుంది. ఉపరితలాన్ని మాత్రమే చూచే దృష్టికి, ప్రాణంగాని, స్పృహ గాని లేని దానిలా కన్పించే సంపూర్ణ జడపదార్థ తెర కన్పిస్తుందని వారు చెప్పారు. నీవొక శిలను తీసుకొని, దానివంక నీ సాధారణ దృక్కుతో, స్పృహతో చూస్తే 'అందులో ప్రాణం లేదు, దానికి స్పృహ లేదు" అంటావు. రూపాల వెనక్కు దృష్టి సారించగల వానికి ఈ పదార్థ కేంద్రంలో వైశ్వ పదార్థ ప్రత్యణు కేంద్రంలో దాగి పరాత్పర దివ్య సత్యం లోపలి నుండి నెమ్మదిగా వేనవేల సంవత్సరాల నుండి, లోనున్న పరమాత్మ శక్తిని బహిర్గతం చేయగల విధంగా పదార్థాన్ని మార్చడానికి ప్రయత్నం చేస్తున్నదని తెలుస్తుంది. అదే పురోగమిస్తున్న జీవన చరిత్ర అయ్యింది. శిల నుండి ఆకస్మికంగా ప్రాథమిక జీవనం ఎలా బయటపడింది, ఎలా జీవజాతుల క్రమాభివృద్ధి ద్వారా ఒక విధమైన వ్యవస్థ రూపొందింది అంటే ప్రాణాన్ని బహిర్గతం చేయగల ఒక జీవపదార్థం ఎలా ప్రత్యక్షమైందో తెలిపే చరిత్రగా అది తయారైంది. కాని ధాతు ప్రపంచం నుండి వనస్పతి ప్రపంచంగా మార్పు చెందుతుండే మూలకాలు, ధాతు ప్రపంచానికి సంబంధించినవా లేక వనస్పతుల ప్రపంచానికి సంబంధించినవా అనేది తెలియదు. దీనిని గనుక కూలంకషంగా అధ్యయనం చేసినట్లయితే దీనికీ, దానికీ చెందని ఇది గానీ, అది గానీ కానటువంటి వింతైన జాతులు కన్పిస్తాయి. ఆ తరువాత వనస్పతులప్రపంచాభివృద్ధి కన్పిస్తుంది. అందులోనే సహజంగా ప్రాణంబయటపడ్తుంది. ఎందుకనంటే అక్కడ పెరుగుదల రూపాంతరీకరణ ఉంది. ఒక మొక్క మొలకెత్తడం, పరిణమించడం, ఎదగడం జరుగుతోంది. ప్రాణ ప్రథమ ప్రక్రియలతో బాటు, శిలలో కంటే వేగంగా జరిగే కుళ్లిపోవడం, నశించిపోవడం అనే ప్రక్రియ గూడా చోటు చేసుకుంటుంది. ఒక శిలను ఇతర శక్తుల తాకిడి నుండి రక్షించినట్లయితే ఎంతోకాలం అలాగే ఉండిపోతుందనిపిస్తుంది. కాని మొక్క జీవితం విషయంలో అలాగాక ఎదగడం, ఎత్తుగా పెరగడం,

తిరిగి వాలిపోవడం, అనే వక్రరేఖను అనుసరించడం జరుగుతుంది. కాని చాలా నిరోధించబడిన చేతనతో ఇది జరుగుతుంది. వనస్పతులను సవివరంగా అధ్యయనం చేసిన వాళ్ళకు వాటిలో చేతన ఉన్నదనే విషయం బాగా తెలిసే ఉంటుంది. ఉదా : మొక్కలు బ్రతకడానికి సూర్యరశ్మి కావాలి. ఇక్కడ సూర్యుడు అంటే మొక్కలు పెరగడానికి అత్యావశ్యక ఊర్జం. కాబట్టి సూర్యరశ్మి లేనిచోట ఒక మొక్కను పెడ్తే అది సూర్యరశ్మి కోసం పైకి, పైపైకి పెరుగుతూ ప్రయత్నించడాన్ని గమనించగలవు. మనిషి జోక్యం లేని నిర్జనారణ్యంలో మొక్కలన్నింటి మధ్య ఈ విధమైన పెనుగులాట ఉంటుంది. అన్నీ తిన్నగా ఏదో ఒక విధంగా సూర్యరశ్మి నందుకోవడానికి ప్రయత్నిస్తూ పెరుగుతూ పోతుంటాయి. ఇది చూడడానికి చాలా ఆసక్తికరంగా ఉంటుంది. చుట్టూ గోడలున్న ఒక చిన్న ప్రాంగణంలో సూర్యరశ్మి పడని చోట ఒక మొక్క కుండీని పెడ్తే మామూలుగా ఇంతెత్తుగా ఉన్న (సంజ్ఞ) అంతెత్తుకు పెరిగి సూర్యరశ్మిని కనుగొనడానికి ప్రయత్నించడం నీకు తెలుస్తుంది. దానిని బట్టి అందులో చేతన వున్నదని, అభివ్యక్తమౌతున్న ఒక జీవ సంకల్పం అందులో ఉన్నదని తెలుస్తోంది కదా! ఇంకా అధికాధికంగా అభివృద్ధి చెందిన జాతుల విషయంలో కొంచెం, కొంచెంగా, పూర్తిగా మొక్కలకూ చెందని పూర్తిగా జంతువులకూ చెందని మారుతున్న ఒకానొక దశను వాటి మధ్య చూడగలవు. అటువంటి చాలా రకాలున్నాయి. తెరువబడిన నోరులాగా ఉండే మొక్కలున్నాయి. ఆ ఖాళీలోకి ఒక కీటకాన్ని వదిలితే వెంటనే ఠపీమని ఆ నోరుమూతబడ్తుంది. ఆ కీటకాన్నది స్వాహా చేస్తుంది. దాన్ని ఎంతమాత్రం మొక్క అనలేం, ఇటువంటివి చాలానే ఉన్నాయి.

ఇప్పుడు జంతువుల విషయానికొద్దాం. తొలి జంతువులను మొక్కల నుండి వేరుచేసి చూడడం కష్టం, వాటిలో చేతన దాదాపు ఉండదనే చెప్పవచ్చు. కాని సమస్త జంతువర్గాలను నీవాప్రపంచంలో చూడగలవు. ఉన్నత జంతువుల దాకా నిజానికి బాగా చేతన కలిగిన వాటిదాకా చూడగలవు. వాటికి స్వేచ్ఛాయుతమైన స్వీయ సంకల్పం ఉంది. అవి చాలా చేతన గలవి, ఏనుగులాగా అద్భుతమైన తెలివితేటలు గలవి

ఉన్నాయి. ఏనుగుల గురించి వాటికి గల అద్భుతమైన తెలివితేటల గురించి చాలా కథలు తెలుసు గదా! కాబట్టి మనకు బాగా తెలిసేటట్లు ఒక మనస్సు వాటిలో ఉండనే ఉందన్నమాట. ఈ పురోగమనాత్మక అభివృద్ధి ద్వారా మనం ఒక్కసారిగా ఇపుడు అంతరించిపోయిన జాతుల దగ్గరకొస్తాం. వాటి జాడలు కనుక్కొన్నారు. అంటే కోతిలాంటి మధ్యంతర జీవులు లేదా వాటిలా ఉండే వాటి దగ్గరకొస్తాం. కాని అది అప్పటికే రెండు కాళ్ళతో నడిచే జంతువై పోయింది. అచటి నుండి మనం మనిషి దగ్గరకొస్తాం. ఇక్కడ మానవుని పరిణామ ప్రారంభం పూర్తిగా ఉంది. అయినా అతనికి ప్రతిభావంతమైన తెలివితేటలున్నాయని చెప్పగలమా? చెప్పలేం. కాని అదివరకే మనస్సు అందులో చర్యజరుపుతోంది. అంటే స్వేచ్ఛ ఆరంభమైందన్నమాట. ప్రకృతి శక్తులకు, పరిసరాలకు, స్వతంత్రంగా స్పందించడం మొదలైందన్నమాట. అలా మానవునిలో ఆధ్యాత్మిక జీవితాన్ని జీవించగలిగే ఉన్నత జీవి దాకా కావలసిన శ్రేణులన్నీ ఉన్నాయి. అదే శ్రీ అరవిందులు ఈ పుటలో చెప్పారు.

అత్యున్నత స్థాయిలో మానవుడు పూర్తిగా ప్రకృతి నుండి స్వతంత్రుడై జీవనారంభిస్తాడు. “పూర్తిగా” అనేది అతిశయోక్తి. అతడు పూర్తిగా స్వతంత్రుడు కాగలుగుతాడు. తనలోనే ఆధ్యాత్మిక చేతనను వాస్తవం చేసుకొన్న ఒక మనిషి, దైవ మూలంతో ఒక ప్రత్యక్ష సంపర్కం సాధించుకొన్న వాడు, అక్షరాలా ప్రకృతి నుండి ప్రకృతి శక్తి నుండి స్వేచ్ఛ పొందినవాడే.

(వర్షం ఆరంభమైంది) ఆహా! ఇది మన బుర్రలను చల్లార్చడానికొచ్చింది.

(నవ్వులు) ‘దానినది అధిగమించడం’ అని వారు చెప్పినదానికర్థమేమిటంటే, లోని పరమ పురుష, ఆంతరిక దివ్యచిచ్ఛక్తి, సర్వోత్కృష్ట ఆధ్యాత్మిక సత్యత, అభివృద్ధి చెందాలని చేసే స్వయం కృషిలో (వర్షం ఎక్కువైంది) ఓహ్, ఓహ్! మనం ఇక మాట్లాడం మానెయ్యాలి... తనను తానభివ్యక్తం చేసుకొనేందుకు సచేతన ఉపాధులను అభివృద్ధి చేయడానికి

జరిపే కృషిలో వైశ్వప్రకృతికి సంబంధించిన సమస్త ప్రక్రియ ద్వారా గాకుండా ఆ దైవంతో ఒక ప్రత్యక్ష సంపర్కాన్ని పెట్టుకొనే సామర్థ్యం గల ఒక జీవి దగ్గరకు ఆ పురుష చేరుకుంది.

CWM 9:209-13 *ది మదర్*

శ్రీ అరవిందులు మానవులకు ఈ సత్యాన్ని బోధించడానికొచ్చారు. మానసిక చేతనలో నివసిస్తున్న ఒక మార్పు చెందే జీవి మానవుడు, కాని ఒక నూతన చేతనను పరమసత్య చేతనను సముపార్జించుకొనగల శక్యతతో, పరిపూర్ణంగా సామరస్యమైన, శివం, సుందరం, సుఖమయ, పూర్తిగా సచేతనుడై జీవించగల సమర్థుడైనవాడై ఉన్నాడు. భువిపై వారు గడిపిన జీవితకాలాన్నంతా, వారు అతిమానసికం అని పిలిచిన ఈ చేతనను తమలో ప్రతిష్టించ, దానిని సిద్ధింపజేసుకొన వారి చుట్టూ చేరిన వారందరికీ సహాయం చేయ వెచ్చించారు.

CWM 12:116 *ది మదర్*

## ఇచట తనను తాను సఫలం చేసుకొనుట భగవంతుని ప్రణాళిక

ఒకరు తన అంతరాత్మను కనుగొనడానికి దానితో ఏకం అవడానికి అది తన జీవితాన్ని శాసించడానికి, కావలసిన అంతర్గత ప్రయత్నం చేసినప్పుడు ఆ ఆవిష్కరణ ఒక విధంగా ఓ అద్భుతమైన ఉల్లాసాన్ని కలిగిస్తుంది. దీని ఫలితంగా వ్యక్తి ప్రవృత్తిలో 'ఇప్పుడు నాకు కావలసిన దాన్ని నేను పొందాను, నేను అనంతమైన ఆనందాన్ని కనుగొన్నాను' అనే ప్రేరణ మొదట కలుగుతుంది. ఇక ఎంత మాత్రం దేనిని గురించీ ఆతడాలోచించడు.

నిజానికి ఈ ఆవిష్కరణ చేసిన వారందరికి ఇదే జరిగింది. వారిలో కొందరైతే ఈ అనుభవాన్నే సాక్షాత్కారానికి నియమంగా ఏర్పాటు చేశారు. 'నీవు ఎప్పుడైతే ఇది సాధించావో, ప్రతిదీ జరిగిపోయినట్లే, ఇంకా చేయాల్సిందేమీ లేదు. మార్గం చివరకు, లక్ష్యాన్ని చేరుకున్నట్లే" అని చెప్పారు.

నిజానికి దీనికన్నా ముందుకు వెళ్ళడానికి గొప్ప ధైర్యం అవరం.

అతడావిష్కరించే ఈ అంతరాత్మ తప్పక ఒక నిర్భయ యోధుని అంతరాత్మ అయ్యుండాలి. త్వరగా గాని లేక ఆలస్యంగా గాని ప్రతి వ్యక్తీ ఆ స్థితికి చేరుకుంటాడు అనే భావనతో ఇతరుల దురదృష్టాన్ని గూర్చి తననుతాను ఒక ప్రక్క సమాధానపర్చుకుంటూ, తన ఆంతరిక సంతసంతో సంతృప్తి పడి ఉండక, ఇతరులు కూడా తాను చేసిన కృషినే చేయడం మంచిదని, లేక మహా అయితే ఈ ఆంతరిక ప్రజ్ఞాస్థితి నుండి 'మహనీయ పరహితత్వం'తో ప్రగాఢ అనుకంపతో దానిని చేర ఇతరులకు సహాయం చేస్తాడు.

ఎప్పుడైతే ఇక ప్రతి ఒక్కరూ ఆ స్థితిని పొందారో, అదే ప్రపంచం ముగింపు. ఎవరైతే బాధను ఇష్టపడరో వారికిదే ఎంతో ఉత్తమమైనది. కానీ ఇక్కడ ఓ "కానీ" ఉంది. పరమాత్మ ప్రకటితమైనప్పుడు ఆయన లక్ష్యం, తలంపు ఖచ్చితంగా ఇదేనని నీవు అనుకొంటున్నావా? (నిశ్శబ్దం)

ఇచటికే చేరుకొంటే, మొత్తం సృష్టి, విశ్వజనీన అభివ్యక్తి మొత్తం మహా అయితే ఒక చాలా చెడ్డ హాస్యోక్తిగా అవుతుంది. దీనిలో నుండీ బయటపడిపోవడమే అయితే ఇదంతా ఎందుకు ప్రారంభమయ్యింది! ఇంతగా పోరాడుతూ, దుఃఖిస్తూ, బాహ్యంగా కూడా, నాటకీయంగా విషాదభరితంగా సృష్టించబడుతున్న దానివల్ల ఉపయోగమేమిటి? చాలా తేలిగ్గా దీనిలో నుండి బయట పడడం ఎలాగో బోధించేటట్లయితే అసలు ఈ సృష్టి ఆరంభమవ్వకపోవడమే మంచిది. కానీ ఈ విషయాల్లోకి లోతుగా వెళ్ళి అహంకారాన్ని మాత్రమే కాకుండా మూల అహాన్ని కూడా తొలగించి తనను తాను సంపూర్ణంగా ఏ మాత్రం దాచుకోకుండా, పూర్తిగా అనాసక్తంగా సమర్పించుకొన్నప్పుడు అతడు ఆ పరమాత్మ ప్రణాళికలను అర్థం చేసుకోగల్గుతాడు. అప్పుడు అది చెడ్డ హాస్యోక్తి కాదని, ప్రారంభ బిందువు వద్దకు నీవు తిరిగిపోయే ఈ మార్గం వేదనాభరితమైనది, దెబ్బలు పడేది కాదని తెలుసుకొంటావు.

దీనికి భిన్నంగా ఈ సంపూర్ణ సృష్టి ఆనందమయ అస్తిత్వమని సౌందర్యమయ అస్తిత్వమని, ఘన అస్తిత్వమని, ఉదాత్త జీవన రాజసమని

ఆ ఆనందము, ఆ సౌందర్యము, ఆ మహత్వానికి చెందిన శాశ్వత వృద్ధి అని, శాశ్వత ఏకోన్ముఖయాత్ర అని తెలియపర్చడానికే ఉంది. అప్పుడు ప్రతీదీ అర్థవంతమైనదే. ఇక అప్పుడు తాను పోరాడుతున్నందుకు, బాధలు పడుతున్నందుకు పశ్చాత్తాప పడడు. దివ్య లక్ష్యాన్ని సిద్ధింపచేసుకోవడానికి ఉత్సాహంతో ఉంటాడు. విజయాన్ని, లక్ష్యాన్ని చేరే దృఢ విశ్వాసంతో ఎలాంటి ఆలోచన లేకుండా సాక్షాత్కార సాధనలో లీనమైపోతాడు.

కాని దానిని తెలుసుకోవడానికి పరమాత్మ మూలాల నుండి విడిపోయి, తన వైపుకు తాను, తిరిగిన ఒక వేరు వ్యక్తి ఉండటాన్ని, అహంకారికంగా ఉండటాన్ని ఆపు చేసుకోవాలి. చేయబడాల్సింది, తన అహాన్ని విడిచిపెట్టడమే. అప్పుడు నిజమైన లక్ష్యాన్ని తెలుసుకోగల్గుతాడు. కేవలం ఇదే మార్గం.


అహంకారాన్ని విడిచి పెట్టడం అంటే ఒక నిరుపయోగమైన వస్త్రంలా దానికదే అహం జారిపడిపోవాలి. ఈ పర్యవసానం అర్థమైనది. దీనికై ప్రయత్నాలు జరగాలి. అప్పుడు మార్గంలో ఒంటరి అవ్వడు. విశ్వాసం ఉంటే, సహాయాన్ని పొందుతాడు.

CWM 9:426-28 — శ్రీమాత

## నీవు మాత్రమే - ఉన్నదంతా

ఆ అద్భుతమైన ఆనందాన్ని.. తనను తాను నీవుగా సంవేదించడాన్ని ఈ సృష్టి దానినే తన గమ్యంగా చేసుకున్నదనేది సుస్పష్టం.

CWM 11:268 — శ్రీమాత



భవిష్య ఘటనలకు మహత్తర స్వప్నాల మూసను తయారు చేసాడు. రాబోవు కాలానికెదురు నిలువ, తన తపశ్చర్యలను కంచులా పోత పోసాడు.

*సావిత్రి పుట.* ***45***

# జీవితం - ఒక యాత్ర, ఒక ఆరోహణ

సామాన్య మానవుడు తన జీవితాన్ని సాధారణంగా జీవించినపుడు, కొంత కలగాపులగంగా, కొంత అనిశ్చితమైన అపరిపూర్ణమయిన ఆలోచనలు, అవగాహనలు, భావాలు, ఉద్రేకాలు, కోరికలు, ఆస్వాదనలు, చర్యలు, చాలా వరకు చర్వితచర్వణమవుతూ కేవలం పాక్షికంగా మాత్రమే శక్తివంతమయిన ఆత్మోన్నతిని కలిగిస్తూ అన్నీ ఒక ఉపరితలంపై ఉండే అహం చుట్టూ కేంద్రితమై ఉంటాయి. ఈ చలనాల మొత్తం కలిపి ఒక అంతర ప్రగతికి దారితీస్తుంది. అదే ఈ జన్మలో పాక్షికంగా పైకి కనిపిస్తూ, పాక్షికంగా రాబోయే జన్మల ప్రగతికి బీజం అవుతుంది. ఈ చైతన్య ఆత్మ యొక్క ప్రగతి విస్తరణ, పెంపొందే ఆత్మ వ్యక్తీకరణ, అతని వ్యవస్థ యొక్క సామరస్యమయిన అభివృద్ధి మానవ ఉనికి యొక్క పరమార్థమూ సారమూ అవుతుంది. చేతన యొక్క ఈ అర్థవంతమైన ప్రగతి ఆలోచన, సంకల్పం, భావావేశం, కోరిక, చర్య, అనుభవంతో చివరకు ఉన్నతమైన దివ్య ఆత్మ అన్వేషణకు దారి తీస్తుంది. ఇందుకోసమే మనిషి మనసు కలిగిన ఈ భౌతికశరీరాన్ని ధరించడం జరిగింది. మిగిలినదంతా అనుబంధమూ విధాయకమూ లేదా నిరర్థకమూ మరియు ప్రమాదవశాత్తు సంభవించేది మాత్రమే. కేవలం ఏదయితే అతని ప్రకృతి యొక్క ప్రగతిని పరిపోషిస్తుందో లేదా అతని ఆత్మ యొక్క ప్రవర్ధమాన వికసనానికి, ఆవిష్కరణకు దోహదం చేస్తుందో అది మాత్రమే పరిగణనీయతా యోగ్యం.

CWSA 23:89-90

ఈ ఆరోహణలో మూడు దశలు ఉన్నాయి, అట్టడుగున ఉన్నది ఈ అవసరాలు, కోరికలు, ఒత్తిడికి బానిస అయిన దైహిక జీవనం, మధ్యలో ఉన్నది మహనీయ ప్రయోజనాలు, ఆకాంక్షలు, అనుభవాలను సంవేదించే మానసికమూ, ఉన్నత భావావేశ మరియు అంతరాత్మల పాలన, శిఖరంపై ప్రప్రథమంగా లోతైన అంతరాత్మ మరియు ఆధ్యాత్మిక స్థితి. తమ స్వీయ సన్నిహితమైన వైశిష్ట్యాన్ని ఆవిష్కరించే మన సమస్త

ఆకాంక్షలు, అన్వేషణలు ఉన్న అతిమానస శాశ్వత చేతన దశ ఉంది. భౌతిక జీవనంలో మొదట కోరికలు, అవసరాలు మరియు వ్యక్తి యొక్క సమాజం యొక్క ఆచరణీయ హితవుకు (తొలిపీఠం వేయబడి ఉంటుంది) అది ఆధిపత్యం వహించే శక్తిగాఉంటుంది. మానసిక జీవనంలో ఆలోచనలు, ఆశయాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. సత్యపు ఆచ్ఛాదనలో పాక్షిక వెలుగు కలిగిన ఆలోచనలు, అపరిపూర్ణమైన అంతర్గత అనుభవాలను పెంపొందించటం వలన మనసు రూపొందించిన ఆశయాలు జీవితాన్ని శాసిస్తాయి. ఎప్పుడైతే మూఢమైన భౌతిక పోకడలు తగ్గుముఖం పట్టి, మానసిక జీవనం ప్రాముఖ్యతను సంతరించుకుంటుందో మానసిక జీవి అయిన మనిషి మానసిక ప్రకృతి ప్రేరణతో ముందుకు నెట్టబడు వ్యక్తి జీవనమే కాక చివరికి అస్పష్టమూ, సంక్లిష్టమయిన సంఘ జీవనం కూడా ఈ సూక్ష్మ ప్రక్రియకులోను కావడానికి ఒత్తిడి చేయబడి ఆ ఆలోచన లేదా ఆశయం యొక్క మూసలో రూపు దిద్దుకోవడానికి ప్రేరేపించబడతాయి. ఆధ్యాత్మిక జీవనంలో లేదా మనసు కన్నా ఉన్నతమయిన శక్తి ఆవిష్కరించబడి ప్రకృతిని వశపరచుకున్నప్పుడు ఈ పరిమితమయిన ప్రేరణ శక్తులు వెను తిరిగి, కనుమరుగై, అదృశ్యమవుతాయి. ఆధ్యాత్మికమైన లేదా అతిమానస పరమాత్మ, ఆ దివ్యమైన పురుష, సర్వోన్నతమైన, అంతర్యామి సత్యత మాత్రమే మనలోని ప్రభువై, స్వేచ్ఛగా మన చరమాభివృద్ధిని సర్వోన్నతమూ, విశాలమూ, మన ప్రకృతి ధర్మానికి సాధ్యమైన అత్యంత సమగ్రమయిన వ్యక్తీకరణకు అనుగుణంగా రూపొందించాలి. చివరకు ఆ ప్రకృతి పరిపూర్ణమైన సత్యంలో అప్రయత్నమైన స్వేచ్ఛలో వ్యవహరిస్తుంది. ఎందుకంటే అది శాశ్వతత్వపు తేజోమయ శక్తినే అనుసరిస్తుంది కాబట్టి. వ్యక్తికి ఆపై సాధించవలసినది కానీ, తీరవలసిన కోరికలు కానీ ఉండవు. అతను ఆ అమూర్తిత్వపు లేదా శాశ్వత విశ్వమూర్తిత్వంలో అంశంగా మారిపోతాడు కనుక. జీవనంలో దివ్య ఆత్మ ఆవిష్కరణ, మరియు దివ్య గమ్యంవైపు విశ్వ గతిని నిర్వహించడం, పరిరక్షించడం తప్ప మరి ఏ ఉద్దేశ్యమూ అతనిని కార్యోన్ముఖం చేయలేవు.

మానసికమైన ఆలోచనలూ, అభిప్రాయాలు, నిర్మాణాలు ఇక ఏ మాత్రం అతనికి చెందవు. ఎందుకంటే అతని మనసు నిశ్శబ్దంలోకి జారుకుంది. అది కేవలం దివ్య జ్ఞానం యొక్క ప్రకాశ, సత్యాలకు ఒక 'వాహిక' మాత్రమే. అతని ఆత్మ విస్తృతి ముందు ఆదర్శాలనేని చాలా పరిమితమయినవి, అనంతత్వపు సాగరం అతని గుండా ప్రవహిస్తూ, ఎప్పటికీ అతనిని ప్రేరిపిస్తూ ఉంటుంది.

CWSA 23:208-09 *శ్రీ అరొబిందొ*

## దైవ చేతన సప్త శ్రేణులు

నిర్మల ఆత్మ నుండి భౌతిక ఉనికి వరకు అవరోహణ

(శ్రీ అరవిందుల ఈశోపనిషత్ విశ్లేషణ నుండి సేకరించినది) బ్రహ్మమే గమ్యం. ఎందుకంటే అదే ప్రారంభం మరియు అంతం కూడా. అన్ని గమనాలకు కారణము, ఫలితం కూడా తానే అయి ఉంది.

కానీ ప్రకృతి గమనంలో అంతిమ గమ్యమనే భావనే ఒక భ్రమలా ఉంటుంది. ఎందుకంటే పరబ్రహ్మ గహనం మరియు అనంతం కనుక. ఆయనను చేరుకోవాలని పరిశ్రమించే దేవతలంతా(1) ప్రతి గమ్యం దగ్గరా ఆయనను తెలుసుకున్నాం అనుకుంటారు. పరబ్రహ్మ ఇంకా ముందుకు మరింత సుదూరమయిన సిద్ధివైపు జరిగి పోయాడని తెలుసుకుంటారు. మన సాపేక్ష చేతనకు ఈ ప్రపంచంలో గోచరించేవేవి కూడా పూర్తిగా 'అది' కాలేవు. అంతా ఆ అజ్ఞేయమైన దానికి సంకేతపరమైన ప్రాతినిధ్యం మాత్రమే.

ఆ పరమాత్మలో అన్నీకూడా ముందుగానే సిద్ధి పొంది ఉన్నాయి. ప్రకృతి మార్గంలో పరుగులు పెట్టే ఇతరులందరూ(2) ఇతః పూర్వమే

---

**(1)** దేవతలు విశ్వమూర్తులుగా ఒక దివ్య స్వరూపం యొక్క వ్యక్తీకరణలయిన పరబ్రహ్మ ప్రతినిధులు. వారి అమూర్తిత్వ కార్య ప్రకృతి గుణాల వివిధ రూపాలుగా దర్శనమిస్తారు వారు.

**(2)** ఇతరులు అనేది తరువాతి శ్లోకంలోని సర్వానిభూతాని, వేర్వేరు చేతనలలో 'అనేకం'గా పరబ్రహ్మ వ్యక్తమయ్యే అన్ని ప్రాణులు.

బ్రహ్మంలో ఆవిష్కరించబడిన దానిని సాధించడానికి దేశ కాలాల పరిధిలో కార్య కారణానన్నుసరించి చేసే ఒక ప్రయత్నం మాత్రమే.

తన విశ్వాత్మలో కూడా పరబ్రహ్మ గమనాన్ని అధిగమిస్తాడు. కాలాతీతుడై తనలో భూత, భవిష్య వర్తమానాలను ఏకకాలంలో నిక్షిప్తం చేసుకొని, ఊహించగల కాలాంతానికి పరుగుతీయనక్కరలేదు. ఆకాశాన్ని అధిగమించి అన్ని రూపాలను తనలోనే యాదృచ్ఛికంగా కలిగి ఊహించ గల అంతరిక్షపు అంచులకు పరుగు తీయవలసిన అవసరం లేదు. కార్య కారణానికి అతీతంగా అన్ని ఘటనలను, శక్తులను కార్య కారణపాశంతో బంధించబడకుండా, దేనితో అయితే అవన్నీ విశ్వంలో ఒకదానికొకటి అనుబంధమై ఉన్నాయో వాటిని తనలో ఇముడ్చుకొని ఉంది.

విభక్తమయిన వ్యక్తిత్వాలుగా ప్రకృతి గమనంలో వ్యక్తం కాకముందే అన్నీ కూడా భగవత్ స్వరూపంగా తెలియజేయబడి ఉంటాయి.

మన ప్రకృతి గమనంలో వాటి ఉద్దేశ్యమేమిటి?

ఈ గమనమొక లయబద్ధమైన గతి, ఒక సామరస్యత. దేనినయితే ఆ తత్వం విశ్వజీవనంగా తన స్వరూపాలనే చైతన్య ప్రతిబింబాలుగా తీర్చిదిద్దుతుందో అదే. అజ్ఞేయాన్ని సంకేత యుతంగా వ్యక్తీకరించే ఒకసూత్రమిది.

ఈ విధంగా ఏర్పాటు చేయబడిన చేతన యొక్క ప్రతి స్థాయీ, నిజానికి తనకన్నా అతీతమైన దానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అగాధాల అగాధం, ఖండాల యొక్క ఖండం. అదివరకే సంపూర్ణమై వున్న ‘తత్’కు చేర్చవలసినదేమీ లేని, తన స్వయం తృప్తి కోసం మనుగడలో వున్న దివ్య చేతనలీల[3] అది. సచేతన పురుష తన స్వీయ మనుగడచే సమర్థించబడిన, తనకు మించి మరే ప్రయోజనము లేని ఒక వాస్తవికత అది.

ప్రయోజనమనే భావన, గమ్యమనేది విశ్వం లేక స్వంత నిజ ప్రకృతి నుండి రూపాలుగా తనలో వసించే, స్వతహాగా ఆత్మలుగా ప్రవర్ధమానమయ్యే

---

3. ప్రపంచంలో సగుణ దేవుని లీలకు మామూలుగా అన్వయించి చేసిన వైష్ణవ రూపమిది. కాని అంతే సమంగా క్రియాశీల నిర్గుణ బ్రహ్మమునకూ అన్వయ మౌతుంది.

ఆత్మ వికసనం నుంచి ఆవిర్భవిస్తుంది. ఎందుకంటే ఆ అస్తిత్వం క్రమంగా తన ఆవిష్కృత రూపాలలో ఆత్మ వ్యక్తీకరణ చేసుకుంటుంది. నిజమైన ఐక్యత అనేకత్వం నుండి ఉద్భవించి రెండవ దాని విలువలను మన చైతన్యంలో పూర్తిగా మార్చి వేస్తుంది.

ఈ ఆత్మ వికాసం చేతన యొక్క సంక్లిష్టతచే పాలించబడుతుంది.

ఎందుకంటే చైతన్యం అనేది సరళమూ, సజాతీయమూ కాదు. అది సప్త గుణాత్మికం. తనను ఏడు రూపాలుగా లేదా స్థాయిల చైతన్య క్రియగా, సత్య ఆత్మ నుండి భౌతిక ఉనికిగా దిగి వస్తుంది. వాటి పరస్పర హేల ప్రపంచాలను సృజిస్తుంది. అన్ని కార్యాలను నిర్దేశిస్తుంది. సర్వ భూతాలను కలిగి ఉంటుంది.

CWSA 17:26-27 — శ్రీ అరొబిందొ

# కృష్ణ

ఈ భయంకరమైన మధురమైన విశ్వంలో
ఆత్మ జన్మించడంలోని అర్థాన్ని చిట్టచివరకు కనుగొన్నాను
పుడమి ఆకలిగొన్న హృదయం స్వర్గాన్ని అతిక్రమించి
శ్రీ కృష్ణుని పాదాలకై ఆకాంక్షించడం నేను అనుభూతి చెందాను

ఆ అమృతనయనాల సౌందర్యం నేను కాంచాను,
ఆర్తి నిండిన ప్రియుని వేణుగానాన్ని కూడా విన్నాను
మరణంలేని పారవశ్యత కలిగించిన విస్మయాన్ని చవిచూచాను,
నా హృదయంలోని వేదన శాశ్వతంగా మూగబోయింది

ఆ సంగీతం మరింతగా చేరువ అయ్యింది
ప్రాణం అపరిచితమైన ఆనందపారవశ్యంతో వణికింది
తన ప్రభువు స్పర్శను, కౌగిలిని, ఉనికిని ఆశిస్తూ
సర్వ ప్రకృతి విశాలమైన తన్మయంతో నిశ్చలమయింది

ఈ ఒక్క క్షణం కోసమే ఎన్నో యుగాలు జీవించాను,
చిట్టచివరకు జగతి పరిపూర్ణమై స్పందించింది నాలో

*CWSA 2:608* — శ్రీ అరొబిందొ

## ఇదేనా అంతం?

ఇదేనా అంతం మనం గడిపిన జీవితానికి,
కన్న కలలకి, సాధించిన విజయానికి?
చెరిగిపోయిన నామం, కరిగిపోయిన రూపం -
ఇదేనా అంతం?

కఠిన పాషాణానికి అడుగున కుళ్లిన దేహం,
అగ్గిలో కాలి కాలి మిగిలిన భస్మం.
ఆవిరైన ఆలోచన, మనసు పూర్ణ లయం.
ఇదేనా అంతం?

వెనకటి కుటిలపు ఘడియలు మరి లేవు
వెనకటి రోషం, వేగం మరి రావు.
మౌనమైన అవని, కానరాని రవి వెక్కిరించిన మరణం,
ఇదేనా అంతం?

దైవం దిశగా ఎగసిపడే మన తపనలు
అన్యుల ఎడదలలోకి వ్యాపించే కంపనలు
లోకం మరణం, జీవితం శూన్యం - అంతా మోసం.
ఇదేనా అంతం?

తేనెలూరిన తీగ మూగవోయెనా,
కానని వాద్యకాడు అంతరించెనా?
కోయిల కూసిన శాఖ విరిగి పడిందని
పాట ఆగిపోవాలా?

మనస్సులో ఒకడు సంకల్పించి, యోచించి,
భూమి భవితవ్యాన్ని రూపుదిద్దుతున్నాడు.
ఎదలో ఒకడు ప్రేమించి, తపించి, ఆశించాడు.
అతడూ రూపుమాయ వలసిందేనా?

మర్త్యులలోని అమరుడు అతడి నామం.
కళాకారుడైన పరమ దైవం,
దివ్యా కృతులలో తనను తాను దిద్దుకుంటున్నాడు
అలుపెరగని శ్రమతో సృష్టి కార్యం చేస్తున్నాడు.

దివిలో తారలు విరిసిన హేతువు తెలిసిన దాక
ఎదలో కానక నిలిచిన వేలుపు వెలసిన దాక
తనను తాను ఆత్మ తెలుసుకున్న దాక.
అటుపై కూడా లేనే లేదు అంతం.

CWSA 2:643-44 - *శ్రీ అరొబిందొ*

## మనిషి జీవితం ఒక సుదీర్ఘ మందకొడి సన్నద్ధత

మానవ జీవనం ఒక సుదీర్ఘ, అగమ్య సన్నాహం
ఆశ, ప్రయాస, విరోధం, విరామం కలగలిసిన వలయం.
పదార్థమనే అయోమయ వేదికపై బతుకు గీసే వన్నెల చిత్రం.

పాదం తాకని శిఖరాన్ని ఎగబాకాలని చూస్తుంటాడు
అగ్గులు అద్దిన నిశీధిలో తడుముకుంటూ పోతుంటాడు.
కనీకనిపించక చేజారే గుప్త యథార్థం.
ఎవరికోసమో, ఎందుకోసమో తీరని ఆరాటం.

మునుపెన్నడూ నిజం కాని ఒక ఆదర్శం, మహదాశయం,
పడి లేస్తూ అంతులేక సాగే ఉద్విగ్నపు గమనం.
మార్గానికి అంతంలో ఎదురౌతుందొక మహా బిందువు.
అందులోంచి భళ్లున సాక్షాత్కరిస్తుంది దివ్యతేజం.

దేవుడి అనంతతలోకి ప్రవేశిస్తాం, పరవశిస్తాం.
మన ప్రకృతి సరిహద్దు రేఖను దాటుతాం,
మహాప్రకృతి దివ్యసీమలోకి తప్పించుకుపోతాం.

*సావిత్రి పుట.* ***24*** - *శ్రీ అరొబిందొ*

# జీవితం - సృష్ట్యానందపు మార్మిక పుత్రిక

పరమ గోప్య ఆనంద పాత్రీ,
జీవితమా, నీ తత్వం పరవశం,
నిర్విరామ విశ్వ యాత్రీ,
నీ పరిధికి లేదు అంతం.

వైభవాన్ని, వైషమ్యాన్ని,
నీ రెక్కలపై లీవిగ మోస్తావు.
దివ్యత్వాన్ని, మనుషత్వాన్ని,
ఖేదాన్ని, హ్లాదాన్ని భేదం లేక భరిస్తావు.

వేసట లేక, వెరపు లేక,
ధృవంగా నీలో నిలవనీ.
దిగంతాలు పిక్కటిల్లే పోరు కేక,
జీవితమా, ఆగని పోరాటం సాగనీ.

నీ ఆనందం సమస్తాన్నీ జుర్రుకుంటాను,
నీ యాతనలన్నీ తీరుగ భరిస్తాను.
కేసరి గర్జనలాంటి భీకర వాణి,
తీయని వసంత కోకిల గానం కానీ,

దిగ్గజంలా ఆక్రమిస్తాను,
దివ్యుడిలా ఆనందిస్తాను,
మనిషిలా తపించి, తరిస్తాను,
బాలుడిలా కేరింతలు కొడతాను.

ఇంతకు మించి నిన్నేమీ అడగను,
నా రాతలో లేని సిరిని కోరను.
విజయుణ్ణి కానీ, జితుడైనా కానీ,
జీవితమా, నిను జయించనీ, లేదా ఓడిపోనీ.

మాసిన బట్టల్లో కూడా మహదేవుణ్ణి
నేలరాలినా కూడా నిత్యం దివ్యుణ్ణి,
కాలరాసితే నింగి కెగబాకుతా,
చంపితే చిరకాలం వెలుగుతా.

CWSA 2:541 - శ్రీ అరొబిందో

# ప్రపంచ సమస్య కీలకం

(ఆలోచనలను నొక్కిచెప్పడానికి సంకలనకర్త అసలు భాగాలను దిగువన ఉంచారు. కొన్నిచోట్ల నొక్కి చెప్పడానికన్నట్లు బోల్డ్ టైప్ ఫేస్ని ఉపయోగించారు. సాధారణ శీర్షిక, ఉప శీర్షికలు సంకలనకర్త వ్రాసినవి.)

## సృష్టి అంటే ఏమిటి?

తన సచేతన అస్తిత్వపు విశుద్ధ ఆనందం నుండి శక్తి పనిచేసి, సృష్టించిన సత్, సత్యతయే మనం. మనం చేసేదంతా, మనం తయారయ్యేదంతా, మనం సృజించే దానంతటికీ సంబంధించిన, మన సమస్త తీరులు, చిత్త వృత్తుల కారణం, లక్ష్యం, గమ్యపు ఆత్మ ఆ సత్ సత్యతయే.

వాస్తవానికి కవి, కళాకారుడు లేదా సంగీతకారుడు కొత్తవి సృష్టించేటప్పుడు, తన అవ్యక్త స్వశక్తిని అభివ్యక్తి రూపంలోకి అభివృద్ధి చేయడం తప్ప ఏమీ చేయడు. ఆలోచనాపరుడు, రాజనీతిజ్ఞుడు, మెకానిక్కు తమలో దాగి ఉన్న వస్తువులకు మాత్రమే బాహ్యంలో ఆకృతిని ఇస్తారు. కాబట్టి వస్తువులు ఆకృతి లేని సమయంలో వారిలోనే ఉన్నాయి, అవి వారే, రూపంలోకి వచ్చినప్పుడు కూడా అవి వారిలోనే ఉన్నాయి. అలాగే ప్రపంచం, శాశ్వతత్వంతోనే ఉన్నాయి.

సమస్త సృష్టి లేక సంభూతి, ఈ సృష్టిగా ఏదీ ఉందో, అది ఈ ఆత్మ-వ్యక్తీకరణ తప్ప మరొకటి కాదు. విత్తనం నుండి మొలకెత్తి

పరిణమించేది, అప్పటికే విత్తనంలో ఉంది, ఉనికిలో ముందునుంచే ఉంది, "ఇది అవుతాను" అనే దాని సంకల్పం ముందుగానే నిర్ణయించబడింది, ఇది అవుతాను అనే మార్గంలో ఉండే ఆనందం, అయిన తర్వాత ఉండే ఆనందం ముందే ఏర్పాటు చేయబడింది.

మూల ద్రవ్యం, తన ఉనికికి సంబంధించిన శక్తిలో, దాని ఫలితంగా వచ్చే జీవ వ్యవస్థగా ఉంది. ఎందుకంటే ఇది ఎల్లప్పుడూ రహస్య, భారమైన, తనను తాను తెలుసుకునే శక్తిగా ఉంటుంది, ఇది తన స్వంత నిర్నిరోధమైన ప్రేరణతో, అది దేనితో నిండి ఉందో దానిని, దాని రూపం ద్వారా వ్యక్తీకరించడానికి కృషి చేస్తుంది.

తన నుంచి సృష్టించే లేక, అభివృద్ధి చేసే తనకు, తనలో పనిచేసే శక్తికి, అతను పని చేసే పదార్థానికి మధ్య తేడాలు మాత్రమే చూపుతాడు. వాస్తవానికి ఆ శక్తి అతనే, పరికరంలో నిండిన వ్యక్తిగత చైతన్యం తానే, అది ఉపయోగించే పదార్థం తానే, దాని ఫలితంగా వచ్చే రూపం తానే.

మరో మాటలో చెప్పాలంటే, ఇది ఒకే జీవునికి సంబంధించిన ఒకే ఉనికి, ఒకే శక్తి, ఒకే ఆనందం, తనను తాను వివిధ లక్ష్యాలపై కేంద్రీకరింప జేసుకొంటుంది. అప్పుడు లక్ష్యానికి సంబంధించిన చేతన, "ఇది నేను" అని చెబుతుంది. ఆ జీవిలో స్వీయ శక్తి రకరకాలుగా మారుతూ వివిధ రకాలైన రూపాల ద్వారా వ్యక్తమవుతుంది.

## అది ఏమి కోరుకుంటుంది?

తానేది ఉత్పత్తి చేస్తుందో అది తానే, తానుగాక మరొకటి కాజాలదు. ఇది ఒక ఆట, ఒక లయ, దాని స్వంత అస్తిత్వం సాధించే అభివృద్ధి, చేతన యొక్క శక్తి మనడంలో ఉన్న ఆనందం.

కావున ప్రపంచంలోకి ఏది వచ్చినా, అచట ఉండడాన్ని ఉద్దేశించిన రూపంలోకి చేరడం, ఆ రూపంలో తన స్వీయ అస్తిత్వాన్ని విశాలం చేసుకోవడం దానిలో ఉన్న చేతనను, శక్తిని అనంతంగా అభివృద్ధి చేయడం, అభివ్యక్తం చేయడం, పెంచడం, సిద్ధింపజేసుకోవడం, తన అత్యంత లోతైన అస్తిత్వంలో సక్రియంగా వున్న సత్, చిచ్ఛక్తి, ఆనందాలచే

తనను గురించి సూచించబడిన ఏ భావన ద్వారానైనా, ఏ దిశకైనా, సాధ్యమైన ఏ సాధనోపాయం ద్వారానైనా, అభివ్యక్తిలోనికి రావడంలోని ఆనందం కోసం, జీవి రూపపు ఆనందం కోసం, చేతన లయకు గల ఆనందం కోసం, క్రియాశక్తి ఖేలనంలోని ఆనందం కోసం, ఆ ఆనందాన్ని హెచ్చించుకొనడం, ఆ ఆనందాన్ని పరిపూర్ణం చేసుకోవడం కోసం అది వెదుకులాడుతుంది.

## లక్ష్యం ఏమిటి?

ప్రపంచంలో ఎవరైనా (వ్యక్తిగతంగా కావచ్చు లేదా సమష్టిగా కావచ్చు) దేని వైపునా మొగ్గుచూపితే, అంటే ఏదైనా లక్ష్యం కాని పరిపూర్ణత గాని ఉన్నట్లయితే, ఆ పరిపూర్ణత స్వీయ ఉనికి, శక్తికి, చేతనకి, ఆనందానికి సంబంధించిన పరిపూర్ణత మాత్రమే.

కానీ వ్యక్తిగత నిర్మాణానికి సంబంధించిన పరిమితుల్లో కేంద్రీకృతమై ఉన్న వ్యక్తిగత చేతనలో అటువంటి సంపూర్ణత సాధ్యం కాదు, కేవల సంపూర్ణత పరిమితమైనదానికి సాధ్యపడదు ఎందుకంటే అది పరిమితమైన స్వీయ-భావనకు పరాయిది.

అందువల్ల వ్యక్తిగతంగా సాధ్యమయ్యే ఏకైక చివరి లక్ష్యం వ్యక్తిలో అనంత చేతన ఆవిర్భావం, ఇది ఆత్మ-జ్ఞానం, ఆత్మ-సాక్షాత్కారం ద్వారా తనలోని సత్యాన్ని తిరిగి పొందడం, సత్‌లోనే ఉన్న అనంతుని సత్యంగా, చేతనలోని అనంతుని చేతనగా, ఆనందంలోని అనంతుని ఆనందంగా తనను తాను మళ్ళీ పొంది, తన స్వకీయ ఆత్మగా, సత్యతగా తెలుసుకొనడమే తనను తాను కనుగొనడం. పరిమితి గల బాహ్య రూపం దాని వివిధ అభివ్యక్తీకరణల కోసం ఉన్న ఒకానొక ఉపకరణం మాత్రమే.

## ప్రపంచ చిక్కుముడి కీలకం:

స్థల,కాలాలుగా విస్తారితమైన తన బృహద్వైశాలతలో సచ్చిదానందంచే వాస్తవీకరించబడినది గనుక ప్రపంచ - క్రీడ అసలు స్వభావాన్ని ఈ విధంగా భావించాలి.

మొదట, మూలాధార ద్రవ్యానికి గల సాంద్రత, అనంత విభజనీయతలోనికి సచేతన పురుషకు సంబంధించిన ఒక అంతర్వలనం, ఒక ఆత్మ విలీనతగా ఈ ప్రపంచ క్రీడను భావించాలి.

తరువాత, తనకు తాను బంధించుకొన్న క్రియాశక్తి ఒక రూపం ధరించిన జీవిగా, సజీవ జీవిగా, చింత చేయగల జీవిగా వెలువడడంగా ఈ ప్రపంచ క్రీడను భావించాలి.

అంతిమంగా, ఇప్పటికీ సైతం అది రహస్యంగా, నిజంగా, శాశ్వతంగా అయివున్న అపరిమేయ సచ్చిదానందంగా తనను తాను తిరిగి తెలుసుకొని, ప్రపంచంలో క్రీడిస్తున్న ఏకైకుడు, అనంతుడననే నిర్నిబంధ సాక్షాత్కారంలోనికి రూపధారి అయిన చింతన జీవి, ఒక విడుదలగా గ్రహించాలి. ఈ త్రివిధ నడక, ప్రపంచ చిక్కుముడి మొత్తం పరిష్కారం

CWSA 21: 121-23 *శ్రీ అరొబిందొ*

## భావనలు, క్షణిక దర్శనాలు

ఎప్పుడు మనం హేతుబద్ధ జ్ఞానాన్ని దాటతామో, అప్పుడు మనకు జ్ఞానం వస్తుంది. హేతుబద్ధ జ్ఞానం సహాయకారి, హేతుబద్ధ జ్ఞానం అవరోధం.

ఎప్పుడు మన సంకల్పాలను దాటి ముందుకు వెళ్ళామో, అప్పుడు మనం శక్తివంతులమౌతాం. ప్రయత్నమే సహాయకుడు, ప్రయత్నమే అడ్డం.

ఎప్పుడు మనం భోగాలను దాటి ముందుకు వెళ్ళామో, అప్పుడు మనకు ఆనందం ఉంటుంది. కోరిక సహాయకారి, కోరిక అవరోధం.

ఎప్పుడు మనం వ్యక్తిగతీకరించడాన్ని దాటి ముందుకు వెళ్ళామో, అప్పుడు మనం నిజమైన వ్యక్తులుగా ఉంటాం. అహం సహాయకారి, అహం అవరోధం.

మనం మానవత్వాన్ని దాటిన తర్వాత, మనం మనిషిగా ఉంటాం. జంతువు సహాయకారి, జంతువు అవరోధం.

ఆ క్రమబద్ధ అంతః స్ఫురణలోకి హేతుబద్ధ జ్ఞానాన్ని రూపాంతరీకరించాలి. నీ సమస్తం వెలుగుగా ఉండేలా చూచుకో. ఇదే నీ లక్ష్యం.

ప్రయత్నాన్ని సులభ, సాధికార, సమృద్ధికర ఆత్మ-బలంగా మార్చు, నీలోని సమస్త భాగాలు చైతన్య శక్తిగా ఉండేలా చూసుకో. ఇదే నీ లక్ష్యం.

భోగించడాన్ని సమతుల్యమైన, బయట వస్తువులతో అవసరంలేని ప్రహర్షంగా మార్చు, నీ సమస్తం ఆనందమే అగుగాక. ఇదే నీ లక్ష్యం.

విభజించబడిన వ్యక్తిని, విశ్వ మూర్తిత్వంగా పరివర్తింపచేయి, నీ సమస్తమూ దివ్యమైనదే అగుగాక. ఇదే నీ లక్ష్యం.

జంతువును మందల కాపరిగా మార్చు, నువ్వు కృష్ణుడిగా ఉండు. ఇదే నీ లక్ష్యం.

ఆలోచన ఉనికికి ముఖ్యమూ కాదు, కారణమూ కాదు. కానీ అది తయారుగావడానికి ఒక సాధనం, నాలో నేనేమి చూస్తానో అదిగా నేను అవుతాను. ఆలోచన నాకు సూచించిన దానిగా నేనవుతాను. ఆ ఆలోచన నాలో ఏది వెల్లడిస్తోందో, నేను ఆ విధంగా మారగలను. భగవంతుడు మనిషిలో నివసిస్తాడు కాబట్టి, ఇది మనిషికి తనపై ఉన్న అచంచల విశ్వాసం అయి ఉండాలి.

మనిషి ఇంతకుముందే చేసిన వాటిని పునరావృతం చేయడం మన పని కాదు, కానీ కొత్త సాక్షాత్కారాలు, కలగనని ఆధిపత్యాలను సాధించడం మన పని. కాలం, అంతరాత్మ, ప్రపంచం మన కోసం కార్య క్షేత్రంగా ఇవ్వబడ్డాయి. దృష్టి, ఆశ, సృజనాత్మక కల్పన ప్రేరకాలుగా ఉండాలి. సంకల్పం, ఆలోచన, శ్రమ మన సర్వ-సమర్థవంత సాధనాలుగా ఉండాలి.

మనం ఇంకా సాధించవలసిన కొత్తవి ఏమిటి?

ప్రేమ, ఎందుకనంటే మనం ఇంకా ద్వేషాన్ని, మనల్ని మనంగా సంతోషపెట్టుకోవడాన్ని మాత్రమే ఇంత వరకూ సాధించాము; జ్ఞానం, ఎందుకనంటే మనం లోపాన్ని, గ్రహణ శీలతను, యోచనను మాత్రమే

ఇంతవరకూ సాధించాము; పరమానందం, ఎందుకంటే మనం సుఖాన్నీ, బాధని, ఉదాసీనతని మాత్రమే ఇంతవరకూ సాధించాము; శక్తి, ఎందుకనంటే మనం బలహీనతని, కృషిని, ఓడిపోయిన విజయాన్ని మాత్రమే ఇంతవరకూ సాధించాము; జీవితం, ఎందుకనంటే మనం పుట్టుకని, పెరుగుదలని, మరణాన్ని మాత్రమే ఇంతవరకూ సాధించాము; ఐక్యత, ఎందుకనంటే మనం యుద్ధాన్ని, సాంఘిక జీవనాన్ని మాత్రమే ఇంతవరకూ సాధించాము.

ఒక్క మాటలో చెప్పాలంటే పరాత్పరుడు, పరాత్పరుని దివ్య రూపంగా మనల్ని మనం పునః తయారు చేసుకోవడం.

**ముగింపు:**

మనిషి, భగవంతుడి కలయిక అనేది ఎల్లప్పుడూ మానవునిలోకి దైవత్వ ప్రవేశం, దైవత్వంలో మానవుని స్వీయ-లీనం అనేదే శాశ్వతార్థం.

కానీ, అలా విలీనం కావడం అంటే వ్యక్తిత్వ వినాశనం కావడం కాదు. విలుప్తత ఈ శోధన, తీవ్ర భావావేశం, బాధ, ఆనందం యొక్క పూర్ణ స్థితి కాదు. అదే ముగింపుగా ఉంటే అసలు ఆటే ప్రారంభించబడదు.

ఆనందమే రహస్యం. స్వచ్ఛమైన ఆనందం గురించి తెలుసుకో, నీవు దేవుణ్ణి అవగాహన చేసుకుంటావు.

అప్పుడు మొత్తం విషయం ఎక్కడ మొదలైంది?

కేవల అస్తిత్వ ఆనందం కోసం సత్ తనను తాను హెచ్చించుకొంది. తనను తాను అసంఖ్యాకంగా కనుగొనడానికి వీలుగా అసంఖ్యాక కోట్లాది రూపాలలో మునక వేసింది.

మరి ఏది మధ్యస్థం? బహుళ ఐక్యత కోసం కృషి చేసే విభజన, వైవిధ్య వెలుగుల వరద వైపుగా శ్రమించే అజ్ఞానం, అనూహ్య పారవశ్య స్పర్శ కోసం వేదన పడుతున్న బాధ. ఎందుకనంటే ఇవన్నీ చీకటి రూపాలు, వికృత కంపనాలు.

మరి ఈ మొత్తం వ్యవహారానికి ముగింపు ఏమిటి? తేనె తనని తాను, దాని అన్ని చుక్కలను కలిపి రుచి చూచినట్లే, దాని చుక్కలన్నీ

ఒకదానినొకటి రుచి చూడగలవు, ప్రతి ఒక్కటి మొత్తం తేనెతుట్టెను తనలాగే రుచి చూడగలదు, అదే విధమైన ముగింపు భగవంతునికి, మనుష్య అంతరాత్మకు, విశ్వానికి మధ్య చరమ దశగా ఉండి తీరాలి.

ప్రేమ, అనేది ప్రధాన స్వరం; ఆనందం, సంగీతం; శక్తి, రాగం; జ్ఞానం, ప్రదర్శకుడు; అనంతంగా ఉన్న పరమాత్మ, స్వరకర్త, ప్రేక్షకుడు. మనకు ప్రాథమిక అపశ్రుతులు మాత్రమే తెలుసు. అవి ఎంత శక్తివంతమైనవో, వాటిల్లోని లయబద్ధత ఇంకా గొప్పది కానీ మనం ఖచ్చితంగా దివ్య ఆనంద షడ్జమం వద్దకు చేరుకుంటాము.

CWSA 33:203-04 *శ్రీ అరొబిందొ*

ఎంత భయంకరమైనవిగా ప్రాథమిక అపశ్రుతులనెరుగుతామో, అంత గొప్పది సామరస్యత అని తెలుసుకుంటాము. పరంపరగా కొనసాగే దివ్య దివ్యానందాలలోకి ఖచ్చితంగా చేరతాము.

# వ్యక్తిగత మోక్షం, సృష్టి కార్యం కాదు

మనకు వ్యక్తిగతంగా మోక్షం అవసరం లేదు, ఎందుకంటే అంతరాత్మ నిత్యముక్తమైనది, బంధం ఒక మాయ. బంధింపబడినట్లు ఆటాడతాం కానీ యథార్థంగా మనం బద్ధులం కాము.

*CWSA 13:71*

ప్రపంచాన్ని దుష్టశక్తి ఆవిష్కరణగా లేదా అంతరాత్మ స్వీయ-భ్రాంతిగా పరిగణించక దైవం యొక్క ప్రకటనగా చూస్తాం, ఇంకా పాక్షికంగా ఉన్నప్పటికీ అది ఒక ప్రగతిశీల పరిణామ ప్రకటన. కనుక జీవితాన్ని పరిత్యజించడం, ప్రపంచాన్ని, ప్రపంచం దేని కొరకు నిర్మితమైందో ఆ లక్ష్యాన్ని నిరాకరించడం, మన జీవిత గమ్యం కాదు.

*CWSA 23:328*

విశ్వంలోని అస్థిర జీవితంలో భౌతిక పునర్జన్మ నుండి వ్యక్తిగత అంతరాత్మ విముక్తి చెందడం అన్నది విమోచన యొక్క ఏకైక గమ్యంగా

మనలను వెంటాడే సామాన్య భావన. ఒక్కసారి ఈ స్వేచ్ఛ లభిస్తుందన్న భరోసా వస్తే ఇంక జీవితంలో ఇక్కడ లేదా వేరెక్కడైనా తర్వాత చేయవలసిన కార్యం గానీ, లేదంటే కొనసాగే భౌతిక అస్తిత్వం కోరేది, లేదా గత జీవితాలకు అవసరమైన విఫల ప్రభావాల కార్యం గానీ ఉండదు. యోగాగ్నితో వేగంగా హరించిపోయే లేదా వినియోగమయ్యే ఈ స్వల్పం శరీరం నుండి ముక్తిపొందిన అంతరాత్మ విడుదలతో ఆగిపోతుంది. పునర్జన్మ నుండి పలాయన లక్ష్యమే అంతరాత్మ యొక్క అత్యున్నత లక్ష్యంగా భారతీయ మనస్తత్వంలో ఎప్పటినుండో స్థిరపడి ఉంది, దాని స్థానంలో అతీతంలో స్వర్గాన్ని అనుభవించడం అనే ధ్యేయం అనేక మతావలంబులను పురిగొల్పే సిద్ధాంతంగా స్థిరపడింది. హిందూ మతం కూడ, వేదమంత్రాల స్థూల బాహ్య వ్యాఖ్యానం జాతిలో ప్రబలంగా ఉన్నపుడు తొలి, నిమ్నస్థాయి పిలుపును సమర్థించింది, తర్వాత భారతదేశంలోని ద్వంద్వ వాదులు కూడ దానిని సర్వోన్నత ఆధ్యాత్మిక ఉద్దేశ్యంలో భాగంగా చేశారు. నిస్సందేహంగా మనసు, శరీరాల పరిమితుల నుండి ఆత్మకు చెందిన ఒక శాశ్వత శాంతి, విశ్రాంతి, నిశ్శబ్దాలలోకి విమోచన అన్నది స్వర్గం ఇచ్చే మానసిక సంతోషాల కన్నా, శాశ్వతం చేయబడిన భౌతిక సుఖాల కన్నా ఉన్నతమైన ఒక విజ్ఞాపనను తయారు చేస్తుంది, కానీ ఇది కూడ ఒక ప్రలోభమే, ఇది మనసు ప్రపంచంతో అలసిపోవడం మీద, జన్మ ఎత్తే సాహసం నుండి ముడుచుకుపోవడం మీద, దాని ఒత్తిడి, బలహీనతా తంత్రిని మీటుతుంది గాని సర్వోన్నత ఆశయంగా ఉండలేదు.

వ్యక్తిగత ముక్తి అన్న కోరిక రూపంలో ఎంత ఉన్నతంగా ఉన్నా అది అహంకార ఫలితమే, ఇది మన స్వంత వ్యక్తిత్వ భావన పై విశ్రమిస్తూ, తన వ్యక్తిగత మంచిని లేదా సంక్షేమాన్ని కోరుకుంటుంది, దుఃఖం నుండి విడుదలవ్వాలనే దీని పరితాపం, సంభూతిలోని సమస్య అంతరించి పోవాలనే ఆక్రందన, దీనినే మన అస్తిత్వ సర్వోన్నత లక్ష్యంగా తయారు చేస్తుంది. అహంకారమూలం యొక్క సంపూర్ణ నిరాకరణకు వ్యక్తిగత మోక్షానికి అతీతంగా ఎదగడం ఆవశ్యకం. మనం దైవాన్ని

అన్వేషిస్తున్నామంటే అది కేవలం దైవం కోసం తప్ప వేరే ఇతరమైన దేనికి కాకూడదు, ఎందుకంటే అది మన అస్తిత్వం యొక్క సర్వోన్నత పిలుపు, ఆత్మ యొక్క లోతైన సత్యం. అంతరాత్మ స్వేచ్ఛ కోసం, మన నిజమైన ఉన్నత ఆత్మ సాక్షాత్కారం కోసం, దైవంతో సంయోగం కోసం మనం చేసే విమోచనాన్వేషణ కేవలం మన స్వభావంలోని అత్యున్నత ధర్మం కనుక, అత్యున్నతం కోసం మనలో క్రింది స్థాయి ఆకర్షణ ఉంది కనుక, అది మనలోని దివ్యసంకల్పం కనుక అలా సమర్థించబడింది. ఇది దానికి సరిపోయే సమర్ధనం, నిజమైన ఒక కారణం.

నిజమైన మోక్షం లేదా పునర్జన్మ ఆవృతి నుండి విముక్తి అంటే భౌతిక జీవితాన్ని నిరాకరించడమో లేక ఆధ్యాత్మిక స్వీయ-నాశనం చేత వ్యక్తిగత పలాయనమో కాదు, కుటుంబాన్నీ, సమాజాన్ని భౌతికంగా త్యజించడము కాదు,అది ఆంతరంలో దైవంతో పొందే ఏకత, అటువంటి వ్యక్తిలో గత జీవితము, భవిష్య జన్మల పరిమితి ఉండదు, అది జన్మ లేని అంతరాత్మ యొక్క శాశ్వత అస్తిత్వం.

చర్యలు నిర్వర్తిస్తున్నా అంతరంలో స్వేచ్ఛగా ఉండే వ్యక్తి ఏమీ చేయనట్లే అని భగవద్గీత చెబుతుంది. ఎందుకంటే అతనిలో పనిచేస్తున్నది ప్రకృతి, ప్రభువు నియంత్రణలో ఉన్న ప్రకృతి అదే విధంగా అతను ఒక వందసార్లు శరీరం ధరించినా, అతను భౌతిక జీవితంలో కాక, జనన మరణాలు లేని ఆత్మలో నివసిస్తాడు కనుక జన్మ సంబంధ సంకెళ్ల నుండి, లేదా అస్తిత్వ సంబంధ యాంత్రిక భ్రమణం నుండి స్వేచ్ఛగా ఉంటాడు.

*CWSA 23:270*

మనం ప్రస్తుతమున్న దాని కన్నా పూర్తిగా అతీతమైన దాని గురించి అంతరంలో ఎరుకతో ఉంటూ, తెలుసుకుంటూ, దానికి శక్తివంతంగా ఆకర్షితమైనపుడు మనల్ను నిమగ్నం చేసే ప్రథమ ప్రేరణ ప్రస్తుత వాస్తవానికి దూరమై, ఆ ఉన్నత సత్యంలో మొత్తంగా నివసించడం.

సర్వోన్నత సత్ వైపు, అనంత బ్రహ్మానందం వైపు మనం ఆకర్షించబడినపుడు, ఈ ఆకర్షణ యొక్క రూపం ఏమంటే నిమ్నమైన

దానిని అంతం కలిగిన దానిని ఒక భ్రమ అని చేసే అధిక్షేపణ, అతీతంలోని నిర్వాణం కొరకు ఆకాంక్ష, ఆత్మలో లయమై నిమజ్జనమై, అంతరించి పోవాలనే భావావేశం..

కానీ నిమ్నతత్వంలో బంధించే మొత్తం స్వభావం ఉన్నతంలోని విశాల అస్తిత్వంలోకి విమోచన చెందదడం, జీవించే సత్యం చేత జీవించే సంకేతాన్ని చైతన్యంగా కలిగి ఉండటం నిజమైన లయం, నిజమైన నిర్వాణం.

అంతిమంగా ఉన్నత సత్యం మాత్రమే మిగిలిన అన్నింటికి కారణం మాత్రమే గాక అది కేవలం తక్కిన అన్నింటినీ ఆలింగనం చేసుకుంటు, అన్నింటిలో ఉండటం మాత్రమే గాక, దానిని మనం ఇంకా ఇంకా అధికాధికంగా పొందిన కొద్దీ తక్కినదంతా మన అంతరాత్మ అనుభవంలో ఒక ఉత్తమ విలువ లోకి రూపాంతరం చెంది, దివ్యసత్యానికి చెందిన ఒక సమృద్ధ అనుభవం, అనంతునితో ఇంకా ఎక్కువ బహుళపార్శ్వ సంయోగం, సర్వోన్నతుని వైపు ఒక విశాల ఆరోహణలకు సాధనమవుతుంది. అంతిమంగా సకల విషయాల పరిపూర్ణతలైన నిరపేక్షం, దాని సర్వోన్నత విలువలకు దగ్గరవుతాం. ముముక్షత్వం కోసం, విమోచన కోసం అప్పటివరకు మనల్ను నడిపిస్తున్న భావావేశాన్ని కోల్పోతాం.

CWSA 23:507-08 *శ్రీ అరవిందులు*

ప్రపంచం ఒక దురదృష్టకర దుర్ఘటన కాదు, అది తనను తెలుపుకొనే వైపు కదులుతున్న ఒక అద్భుతం.

భవిష్యత్తు అందానికి చెందిన ఒక ధృవీకరణ ప్రపంచానికి అవసరం. శ్రీ అరవిందులు ఆ భరోసా ఇచ్చారు.

CWM 13: 15 *శ్రీమాత*

# మనలో ఉండడం నిండుగా ఉండడం ప్రకృతి లక్ష్యం

మనం మనంగా అవ్వడమే మనం చేయవలసిన ముఖ్యమైన పని. కాని మన నిజమైన మనం మనలోనే ఉంది, ఆ ఉన్నత స్థితి, మన నిజమైన దివ్యమైన ఉనికి మనకు తెలియరావాలంటే, మేల్కొనాలంటే మన బాహ్యమైన శరీరం, ప్రాణం, మనసులను అధిగమించి పోవడం మనం పూర్తి చేయవలసిన నియమం. మనలో మనం అభివృద్ధి చెందడం ద్వారా మనలో మనం జీవించడం ద్వారా మాత్రమే మనం దానిని కనుగొనగలం, అక్కడినుంచి ఒక దివ్యమైన ఆధ్యాత్మికమైన మనసు, ప్రాణం, శరీరం మనం సృష్టించుకోవాలి. వాటినుండి ఒక నూతన ప్రపంచాన్ని సృష్టించుకోవాలి. అదే మన దివ్యజీవనానికి అనువైన నిజమైన పర్యావరణాన్ని సృష్టించగలదు. ఇదే ప్రకృతి మన ముందు ఉంచిన అంతిమ లక్ష్యం. ఇదే మనకు అత్యావశ్యకమైనది, ప్రతి వ్యక్తి తనలోని చైతన్యాన్ని, దివ్యమైన సత్యాన్ని కనుగొనాలి, దానిని తన ఉనికిలో జీవనంలో వ్యక్తపరచాలి. దివ్య జీవనం అనేది మొట్టమొదటిగా ఆంతరికమైనది. బాహ్యమైనది లోపల ఏముందో దాని వ్యక్తీకరణ మాత్రమే, అంతరంగంలో దివ్యత్వం నెలకొనకపోతే బాహ్యమైన ఉనికిలో దివ్యత్వం ఉండే అవకాశం లేదు.మానవునిలోని దివ్యత్వం ఆతని ఆధ్యాత్మిక హృదయంలో కప్పబడి ఉంది, మానవునిలో గనక ఆ శాశ్వత సత్యచైతన్యం యొక్క ఉనికి లేకపోతే తనను తాను అధిగమించి వెళ్ళడం లేదా ఇంకొక ఉన్నత స్థితికి వెళ్ళడమనే అవకాశం ఉండదు.

ఉండటం, సంపూర్ణంగా ఉండటం అనేదే మనలో ప్రకృతి యొక్క లక్ష్యం, సంపూర్ణంగా ఉండటం అంటే తన ఉనికి పట్ల సంపూర్ణమైన చైతన్యంతో ఉండటం, అచేతన, అర్ధ భాగం చేతన, అసంపూర్ణ చేతనలో తన అస్తిత్వాన్ని పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోలేదు. అది కేవలం అస్తిత్వమని భావించాలి కాని సంపూర్ణమైన అస్తిత్వమని భావించరాదు.

మన అస్తిత్వం పట్ల సంపూర్ణమైన సమగ్రమైన చైతన్యం స్పృహ కలిగి తన అస్తిత్వం సంపూర్ణ సత్యాన్ని ఎరిగి ఉండటమే తన అస్తిత్వం పైన పూర్తి ఆధిపత్యం కలగడానికి పూర్తిచేయవలసిన అత్యావశ్యకమైన నియమం. ఈ రకమైన తనపట్ల తనకుండే ఎరుకనే ఆధ్యాత్మిక జ్ఞానం అని అర్థం చేసుకోవాలి: ఆధ్యాత్మిక జ్ఞానసారం ఏమిటంటే అంతరంగం లోని ఆత్మ అస్తిత్వం పట్ల ఎరుకను కలిగి ఉండడమే. దాని కార్యక్రమం అది ఏ రకమైనదైనా సరే అది చైతన్యమే తనకు తాను రూపొందించు కొంటుంది. మిగిలిన జ్ఞానం అంతా చైతన్యమే తనను తాను మరచిపోయి తిరిగి మళ్ళీ తన స్వస్థితి పట్ల ఎరుకను పొందడం, అలాగే తన చైతన్యంలోని విషయాల పట్ల ఎరుకను కలిగి ఉండటం. మొదటగా అది తనను తాను మరిచిపోయి తిరిగి స్వీయ జ్ఞానం పొందడానికిగాను పరివర్తన చెందడానికి చేసే ప్రయత్నం.

అంతే కాక, చైతన్యం తనలో అస్తిత్వ శక్తిని కలిగి ఉంది కనక, సంపూర్ణంగా ఉండడం అంటే అంతర్గతమైన సమగ్రమైన తన అస్తిత్వ శక్తిని కలిగి ఉండటం, ఆ ఆత్మలోని శక్తినంతా స్వాధీన పరచుకుని సద్వినియోగ పరచుకోవాలి. తన అస్తిత్వంలోని శక్తిని స్వాధీనం చేసుకోకుండా, లేక సగం శక్తిని మాత్రమే స్వాధీనం చేసుకుని లేక కొంత తక్కువ స్థాయిలో శక్తిని స్వాధీనం చేసుకొని ఉండడం అనేది చెడగొట్టబడి తగ్గించబడి ఉండటమే. ఏదో ఉండటం మాత్రమే కానీ సంపూర్ణంగా ఉండటం కాదు. నీ అస్తిత్వంలోని శక్తినంత ఒక చోట చేర్చుకుని ఒక కేవల నిశ్చల స్థితిలో ఉండిపోవడం సాధ్యమే, అయినప్పటికీ చలనంలో ఉంటూ నిశ్చలంగా ఉండటమే అస్తిత్వ సమగ్ర స్థితి, ఆత్మశక్తి దైవశక్తికి నిదర్శనం. శక్తిలేని వాడు ఆత్మాలేనివాడే అని భావించాలి. కానీ ఆధ్యాత్మిక చైతన్యం మనలో అంతర్గతంగా స్వయంభువుగా ఉంది కాబట్టి అదే విధంగా దాని శక్తి కూడా మనలో అంతర్గతంగా తనకుతానుగా ఉంటూ తననుతాను పరిపూర్ణం చేసుకుంటూ దానికదే పనిచేయగలదు. ఏ ఉపాధులను అది ఉపయోగించినా అవి తనలోనివే అయివుండాలి, బాహ్యమైన ఉపాధులు సైతం అదే చైతన్యంతో రూపొందించబడి

అందులో భాగంగా ఉంటూ దాని అస్తిత్వాన్ని వ్యక్తీకరించాలి. అస్తిత్వంలోని శక్తి చేసే చైతన్యపూరిత కర్మయే  మన సంకల్పం. చైతన్యం చేత, చైతన్యంతో కూడిన సంకల్పం ఏదైనా సరే, అది ఉండడం కావచ్చు ఇంకోలా మార్పుచెందడం కావచ్చు, దానిని సృష్టి సామరస్యంగా ఫలప్రదం చేయవలసి ఉంటుంది. అయితే ప్రతి కర్మకు లేదా కర్మలో ఉండే శక్తికి అంత సార్వభౌమత్వం ఉండదు, అది కర్మచేయడానికి అవసరమైన ఇంద్రియాలపైన అధికారం కలిగి ఉండదు.  అటువంటి లోపం వలన అస్తిత్వంలోని శక్తి అపరిపూర్ణంగా ఉండి చైతన్యంలో విభజనను, అదికూడా సరిగా పనిచేయలేని విభజనను తీసుకువస్తుంది. దాని వలన అస్తిత్వ వ్యక్తీకరణ అసంపూర్ణంగా ఉండి పోతుంది.

చివరిగా, సంపూర్ణంగా ఉండడం అంటే ఉనికిలోని సంపూర్ణ ఆనందాన్ని కలిగి ఉండడం. అస్తిత్వంలోని ఆ ఆనందం లేకుంటే, లేక అసంపూర్ణంగా ఉంటే, లేదా తటస్థంగా, లేదా తగ్గించబడి ఉంటే అది అస్తిత్వమే, కాని సంపూర్ణత్వం లేని అస్తిత్వంగా ఉంటుంది. ఈ ఆనందం కూడా అంతరంగంలో స్వయంభువుగా దానికదే ఉండాలి. అది బాహ్యమైన వస్తువులపైన ఆధారపడి ఉండరాదు. అది ఎటువంటి ఆనందం కలిగించే విషయమైనా, దానిని తనలో భాగం చేసుకుని, తనలోని విశ్వానందంలో భాగంగా అనుభవిస్తుంది. ఆనందం లేకపోవడం అనేది అంతా, ఈ బాధ కష్టాలు ఇవన్నీ పరిపూర్ణత లేకపోవడానికి ఒక సంకేతం, అసంపూర్ణతకు సంకేతం. అవి విభజన లోనుండి పైకిలేస్తాయి, అది అస్తిత్వంలోని చైతన్యంలోని అసంపూర్ణత, అస్తిత్వంలోని శక్తి లోని అసంపూర్ణత. అస్తిత్వంలో సంపూర్ణత రావాలంటే, అస్తిత్వంలోని చైతన్యంలో సంపూర్ణత ఉండాలి.

కానీ, మళ్ళీ ఉండటం అంటే విశ్వాత్మకంగా ఉండటం. ఇరుకైన అహం పరిమితులలో ఉండడం అంటే అసంపూర్ణంగా ఉండడం: సహజంగానే ఒక అసంపూర్ణ చైతన్యంలో జీవించడం, అసంపూర్ణ శక్తిలో, ఆనందంలో జీవించడం. అలా ఉండటం అంటే తన స్వయం స్థితి

కంటే తక్కువ స్థాయిలో ఉండటం, అది అజ్ఞానానికి లోబడి ఉండటానికి, బాధలకు, దుర్బలతకు దారితీస్తుంది, ప్రకృతి యొక్క ఒకానొక దివ్య సంయోగం వల్ల కొంత ఈ సమస్యలు తొలగినా కూడా, అది పరిమితులతో కూడిన ఉనికే, పరిమితులతో కూడిన చైతన్యం, శక్తి, ఆనందం. ఉనికి సమస్తం కూడా ఒక్కటే కనక, ఉండడం అంటే అంతా తానయి ఉండటం. అన్నింటిలోనూ తాను ఉంటూ, సమస్తాన్ని తన ఆస్తిత్వంలో కలిగిఉంటూ, సర్వానికి చెందిన చైతన్యం తన చైతన్యంగా కలిగి, విశ్వశక్తినంతా తనలోని శక్తిలో సమీకరించి, ఆ విధంగా తన కర్మలను చేస్తూ, అనుభవిస్తూ అదంతా తన స్వకర్మగా, అనుభవంగా, అనుభవిస్తూ, అందరి ఆత్మలను తన స్వంత ఆత్మగా అనుభూతి చెందుతూ సమస్త ఆనందాన్ని తన స్వంత ఉనికిలోని ఆనందంగా చేసుకుని అనుభవిస్తూ ఉండటం అనేది సమగ్రమైన పరిపూర్ణమైన దివ్య జీవనం.

కానీ అలా విశ్వాత్మక సంపూర్ణత, విశ్వాత్మక స్వేచ్ఛ కావాలంటే అది సర్వాతీతమైన స్థితిలో కూడా ఉండాలి. అటువంటి ఆధ్యాత్మిక పరిపూర్ణతగల ఉనికి శాశ్వతమైనది. అలాంటి శాశ్వతమైన కాలాతీతమైన ఉనికిని ఎరుగక, శరీరంపైన ఆధారపడిన, దేహగతమైన మనసు, దేహగతమైన ప్రాణం, అదో ఇదో ఏదో ఒక ప్రపంచంపైన ఆధారపడి, అవో ఇవో ఏవో కొన్ని పరిస్థితులపైన ఆధారపడి జీవించడం వాస్తవమైన ఆత్మలో జీవించడం కాదు, మన ఆధ్యాత్మిక అస్తిత్వంలో ఉండే సంపూర్ణత్వం కాదు. అలా దేహగతమైన ఉనికి కలిగి, దేహపరంగా జీవించడం అశాశ్వతమైన జీవిగా ఉండటం, మరణానికి కోరికకు బాధలకు కష్టాలకు నశించడానికి కృశించడానికి లోబడి జీవించడమే. దేహగత చైతన్యాన్ని అధిగమించి దానిని దాటి, శరీరంలో బంధించబడక, శరీరంచే బంధించబడక, శరీరాన్ని ఒక పనిముట్టు వలె కలిగి, దానిని ఆత్మ యొక్క ఒక బాహ్యమైన చిన్నరూపంగా మాత్రమే భావిస్తూ ఉండటం అనేది దివ్యజీవనానికి మొదటి నియమం. మనసుని అజ్ఞానానికి, చైతన్యంలోని పరిమితులకు లోబడజేసి ఉంచక, మనసుని అధిగమించి

ఒక పనిముట్టుగా వాడుకుంటూ, దానిని కేవలం ఉపరితల రూపంగా నియంత్రిస్తూ ఉండడం అనేది రెండవ నియమం. ప్రాణంపైన ఆధారపడక, దానితో తాదాత్మ్యత చెందక దానిని అధిగమించి, నియంత్రించి, ఒక పనిముట్టుగా వ్యక్తీకరణకు ఒక సాధనంగా ఉపయోగించుకొంటూ, ఆత్మ చైతన్యంగా ఉండటం అనేది మూడవ నియమం. ఒక వేళ చైతన్యం గనక శరీరాన్ని అధిగమించక పోయినట్లైతే శరీరగత జీవితం కూడా దానికి సంబంధించిన చైతన్యంలో పూర్తి ఉనికిని పొందలేదు, శరీరాన్ని అధిగమించలేదు, పదార్థం తన ఉనికితో భౌతికమైన ఏకత్వాన్ని అనుభవించలేదు. ఒకవేళ చైతన్యం గనక వ్యక్తిగతమైన ప్రాణానికే పరిమితమైన ఆటలో భాగమై, దానిని అధిగమించలేకపోతే ప్రాణం కూడా తన స్వంత సంపూర్ణ జీవితాన్ని పొందలేదు, ఒక విశ్వాత్మక జీవితాన్ని తన స్వంతంచేసుకుని, ఆ విశ్వ ప్రాణశక్తితో ఏకత్వాన్ని అనుభవించలేదు.మనసు కూడా ఒక పూర్తి స్వీయచైతన్యం కలిగిన ఉనికి, కార్యాకలాపం కాదు. అది వ్యక్తిగత మనసుకుండే పరిమితులను అధిగమించలేదు, విశ్వజనీన మనసుతో, అందరి మనసులతో ఏకత్వాన్ని అనుభవించలేదు, తన స్వంత చైతన్యంలోని సమగ్రతను, వ్యక్తిగతచైతన్యానికి విశ్వజనీన చైతన్యానికి ఉండే ఘనమైన భేదాన్ని అనుభవించలేదు. అయితే వ్యక్తిగత స్థితిని విశ్వజనీన స్థితిని కూడా అధిగమించాలి, అప్పుడే వ్యక్తి లేదా విశ్వాత్మక ఉనికి సైతం తన నిజమైన సత్తాలోనికి ప్రవేశిస్తుంది, అక్కడ పరిపూర్ణమైన సామరస్యత సాధ్యమౌతుంది. అతీతమైన స్థితికి ఈ రెండు స్థితులు బాహ్యమైన అసంపూర్ణమైన రూపాలే అయినాకూడా, ఆ అతీతం వాటికి సారమై ఉంది. ఆ సారం యొక్క చైతన్యం పొందడం ద్వారా వ్యక్తిగతచైతన్యం విశ్వచైతన్యం తమ వాస్తవ పరిపూర్ణతను స్వేచ్ఛను పొందగలుగుతాయి.

లేదంటే మనిషి ఈ విశ్వం యొక్క చలనంలో భాగమై దాని వికారాలకు పరిమితులకు లోబడి తన ఆధ్యాత్మిక చైతన్యాన్ని కోల్పోతాడు. మానవుడు అత్యున్నత దివ్యసత్యంలోకి ప్రవేశించాలి,

దానితో ఏకత్వాన్ని అనుభవించాలి, అందులో జీవించాలి, దాని స్వీయసృష్టిలో మమేకం కావాలి. తన మనసు ప్రాణం శరీరం మొత్తాన్ని అతిమానస ప్రకృతిలోకి పరివర్తన చేసుకోవాలి. తన ఆలోచనలు, భావాలు, కర్మలు అన్నీ ఆ పరమోన్నత దివ్య చైతన్యంచే నిర్ణయించబడి, దానియొక్క స్వీయ రూపాలుగా ఉండాలి.

*CWSA 21: 1059-1063* *శ్రీ అరవిందులు*

## మన ప్రగాఢ ఆకాంక్ష అనివార్య గమ్యం

### సువర్ణ కాంతి

నీ సువర్ణ కాంతి నా మెదడులోకి ప్రవేశించింది,
అక్కడి బూడిద రంగు గదులలో సూర్యకాంతి నిండినప్పుడు అవి
గుప్త జ్ఞానానికి ఒక ప్రకాశవంతమైన సమాధానంవలె మారాయి
ఒక ప్రశాంతమైన ప్రకాశం, ఒక జ్యోతివలె

నీ సువర్ణ కాంతి నా కంఠం లోనికి అవతరించింది,
నా వాక్కు సర్వం ఒక దివ్యవాణిగా మారింది,
నా ఒక్క స్వరం నీ స్తోత్రమయ్యింది.
నా మాటలు అమృత మధువుతో నిండిపోయాయి.

నీ సువర్ణ కాంతి నా హృదయంలోనికి అవతరించింది,
నా జీవితాన్ని నీ నిత్యత్వంతో మోదింది,
అక్కడ నీవున్న చోట ఒక ఆలయం వెలసింది.
ఆ ఆలయంలోని ప్రార్థనలన్నీ నీవైపుకే దారితీస్తాయి.

నీ సువర్ణ కాంతి నా పాదాలలోకి అవతరించింది,
ఈ నా భూతలం ఇప్పుడు నీ క్రీడమైదానం అలాగే అది నీ ఆసనం కూడా.

*CWSA 2: 605* *శ్రీ అరవిందులు*

**Vol. 54, No.** 9
**September 2024**

Date of Publication:
1st September 2024

TN/PMG (CCR)/ WPP 473/24-26
Registered: PY/41/2024-26

**AKHILA - Akhila Bharata Patrika (Telugu)**

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

*Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo*



## Flower on the cover:

**Life Energy**

*Powerful and manifold, meets all needs.*

*(Spiritual significance and explanation of the flower given by the Mother)*

*Botanical name:* Dendranthema Xgrandiflorum
[Chrysanthemum Xmorifolium]

*Owner:* Sri Aurobindo Society
*Printer:* Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
*Publisher:* Pradeep Narang for Sri Aurobindo Society
*Published from:* Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
*Printed from:* Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

---


A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001

# అఖిల

అఖిల భారత పత్రిక

అక్టోబర్ 2024



## పూజ


# విషయ సూచిక



## సంపాదకీయం

మనకు అత్యున్నతమైన దానిగా తనను తాను చూపుకునే దానిని పూజించడం మానవ హృదయానికి ఒక సహజమైన చలనం. సరైన చేతనతో దానిని నిర్వహించినట్లయితే దానిలో ఒక గొప్ప శక్తి ఉంది. పూజ భావనను లోతుగా పరిశోధించడానికీసంచికను ప్రత్యేకించాం.

*అనువాదం : కె.వి.రావు*

కలయిక విషయానికొస్తే, స్థిరమైన కలయిక లోపల ఉంది, అది అన్ని సమయాల్లో ఉంటుంది, బాహ్య కలయిక లేదా సంబంధం సాధారణంగా స్థిరంగా ఉండదు. వారు పూజించినప్పుడల్లా తరచుగా లేదా దాదాపు మార్పు లేకుండా సంబంధాన్ని కలిగి ఉన్న కొందరు ఉన్నారు. వారు పూజించే చిత్రంలో లేదా ఇతర ప్రతిమలలో దేవత వారి విషయంలో జీవించవచ్చు, దాని ద్వారా స్పందిచవచ్చు, పనిచేయవచ్చు. ఇతరులు అతడు ఎల్లప్పుడూ ఉన్నట్లు, బాహ్యంగా, సూక్ష్మ- భౌతికంగా ఉన్నట్లు. వారు నివసించే ప్రతి చోట లేదా ప్రతి గదిలో వారితో కలిసి ఉన్నట్లుగా భావించవచ్చు. కానీ కొన్నిసార్లు ఇది కొంత కాలానికి మాత్రమే ఉండవచ్చు. లేదా వారు దేవతతో సాన్నిధ్యాన్ని అనుభవించవచ్చు, ఆ దేవతను శరీరంలో తరచుగా చూడవచ్చు (కానీ కొన్నిసార్లు తప్ప భౌతికంగా కాదు), స్పర్శను అనుభవించవచ్చు లేదా ఆలింగనం చేసుకోవచ్చు, నిరంతరం ఆ సన్నిధితో సంభాషించవచ్చు. - అది కూడా ఒక రకమైన కలయికే. భగవంతుడు తనలో నిరంతరం ఉంటాడని ఎల్లప్పుడూ స్పృహతో ఉండే వ్యక్తి, ఇంకా ప్రపంచంలోని ప్రతిదానిలో ఉంటూ, ప్రపంచం మొత్తాన్ని తనలో ఉంచుకునే వ్యక్తి, అస్తిత్వంతో మమేకమై ఉండటమే కాకుండా ప్రపంచానికి అతీతంగా ఉన్నవాడు భగవంతుడని స్పృహ తో ఉండటమే గొప్ప కలయిక, కానీ ప్రపంచంలో కూడా మనిషి భగవంతుణ్నే చూస్తాడు, వింటాడు, అతనిని తప్ప మరి దేనిని అనుభూతి చెందడు. తద్వారా ఇంద్రియాలు అతనికి మాత్రమే సాక్ష్యంగా నిలుస్తాయి - ఇది కృష్ణప్రేమ్‌కు, అతని గురువుకు ఇచ్చిన వాటి వంటి నిర్దిష్ట వ్యక్తిగత వ్యక్తీకరణలను మినహాయించదు. కలయికకు సంబంధించి ఎన్ని ఎక్కువ మార్గాలు ఉంటే అంత ఉత్తమంగా ఉంటుంది.

CWSA 20:363-64

శ్రీ అరోబిందో

# ఉపాసన, భక్తి

## భావోద్వేగాలను భగవంతుని వైపు మళ్లించడం:

హృదయాన్ని ఎండబెట్టడం ఈ యోగంలో భాగం కాదు, కానీ భావోద్వేగాలను భగవంతుని వైపు మళ్లించాలి. హృదయం నిశ్చలంగా ఉండి, సాధారణ భావాలకు దూరంగా ఉండి, పై నుండి వచ్చే ప్రవాహం కోసం ఎదురుచూసే నియమిత సమయాలు ఉండవచ్చు. కానీ అలాంటి స్థితులు పొడిగా ఉండవు, అవి నిశ్శబ్దం, శాంతితో కూడుకొని ఉంటాయి. ఈ యోగంలోని హృదయం నిజానికి చైతన్యం ఊర్ధ్వానికి చేరుకునేంత వరకు ఏకాగ్రతకు ప్రధాన కేంద్రంగా ఉండాలి.

*

యోగంలో భావోద్వేగం మంచి అంశం, కానీ భావోద్వేగ పూరితమైన కోరిక సులభంగా కలవరంగానూ, అడ్డంకిగానూ మారుతుంది.

*

నీ భావోద్వేగాలను భగవంతుని వైపు మళ్లించు, వాటి శుద్ధి కోసం ఆకాంక్షించు, అప్పుడు అవి మార్గంలో సహాయకారిగా మారతాయి, ఇకపై అవి బాధలకు కారణం కావు.

*

భావోద్వేగాన్ని చంపుకోవడం కాదు, దానిని భగవంతుని వైపు మళ్లించడం యోగంలో సరైన మార్గం.

*

కానీ అది స్వచ్ఛంగా ఉండాలి, ఆధ్యాత్మిక శాంతి, సంతోషాలపై స్థాపించబడి, ఆనందంలోకి రూపాంతరం చెందగల సామర్థ్యం కలిగి ఉండాలి. మనస్సు, ప్రాణిక భాగాలలో సమత్వం, ప్రశాంతత హృదయంలో తీవ్ర అంతరాత్మిక భావోద్వేగం అన్నీ సంపూర్ణంగా కలిసిపోతాయి.

*

హృదయంలో ఉన్న భగవంతుని వైపు స్థిరంగా మండే చైత్య అగ్నిని నీ ఆకాంక్షతో మేలుకొలుపు - ఇది భావోద్వేగ స్వభావాన్ని పరిపూర్ణం చేయడానికి, దాని నుండి విముక్తి పొందడానికి ఒక మార్గం.

*

యోగంలో భావోద్వేగం అవసరం, అధిగమించాల్సిన చిన్న విషయాలపై నిరుత్సాహానికి గురిచేసేది అధిక భావోద్వేగ సున్నితత్వం మాత్రమే. ఈ యోగానికి ఆధారం భక్తి, ఒక వ్యక్తిలో భావోద్వేగ భాగాన్ని చంపినట్లయితే భక్తి ఉండదు. కాబట్టి యోగం నుండి భావోద్వేగాలను మినహాయించే అవకాశం ఉండదు.

*

శక్తిని వ్యర్థం చేసి ఏకాగ్రతకి, శాంతికి భంగం కలిగించేవి సాధారణ ప్రాణిక భావోద్వేగాలు మాత్రమే. వాటిని అధిగమించవలసి ఉంటుంది. భావోద్వేగం కూడా చెడ్డది కాదు. ఇది ప్రకృతిలో అవసరమైన భాగం, అంతరాత్మిక భావోద్వేగం సాధనకు అత్యంత శక్తివంతమైన సహాయాలలో ఒకటి. అంతరాత్మిక భావోద్వేగాన్ని, భగవంతుని పట్ల ప్రేమతో కూడిన కన్నీళ్లను లేదా ఆనందంతో కూడిన కన్నీళ్లను అణచివేయకూడదు. సాధనలో ఆటంకం కలిగించేది ప్రాణిక ఆవేశాల మిశ్రమం మాత్రమే.

*

## భావోద్వేగ బంధం

భావోద్వేగాలు, ప్రేమ, దుఃఖం, బాధ, వైరాగ్యం, భావోద్వేగ ఆనందం మొదలైన వాటిపై ఒక విధమైన మానసిక- ప్రాణికమైన వాటిపై అధిక ప్రాధాన్యత వంటి వాటిని భావోద్వేగ వాదం అంటారు. లోతైన అనుభూతిలో కూడా ప్రశాంతత, నియంత్రణ, శుద్ధి చేసే సంయమనం, కొలమానం ఉండాలి. మనిషి మనోభావాల చేతిలో కీలుబొమ్మగా ఉండకూడదు, ఎల్లప్పుడూ తనలోని మనోభావాల మీద యజమానిగా ఉండాలి.

*

చేతన ఈ విషయాలలో (సంతోషం, దుఃఖం) మునిగిపోయి, భావోద్వేగ పూరిత సుఖం లేదా బాధకి సంబంధించిన ఉత్సాహంలో మునిగిపోతే, దానిని భావోద్వేగ బంధం అంటారు. మనస్సు దాని భావావేశాలు, ప్రేమ, బాధ మొదలైన వాటికి సంబంధించిన అవగాహనలను ఆస్వాదించి, వాటితో ఆడుకునే మరొక రకం ఉంది, కానీ అది స్వల్ప హింసాత్మక, మరింత ఉపరితల భావోద్వేగాల బంధం.

## భక్తి

భక్తి అనేది అనుభవం కాదు, అది హృదయం, ఆత్మ యొక్క స్థితి. ఇది చైత్య పురుషుడు మేల్కొని ముందుకు వచ్చి ఉన్నప్పుడు వచ్చే స్థితి.

*

నీవు భక్తిని అడగడంలో ఎటువంటి సందేహం లేదు, ఎందుకంటే ఇది నీ స్వభావం యొక్క ప్రధాన వాదన అని నేను అనుకుంటాను; ఆ విషయానికి, ఇది సాధనకు ఉండవలసిన బలమైన ప్రేరణ శక్తి, రాబోయే అన్నిటికీ ఉత్తమ మార్గం. అందుకే నేను చెప్పాను, హృదయం ద్వారా ఆధ్యాత్మిక అనుభవం నీకు రావాలి. నా పట్ల మదర్ పట్ల నీకున్న విధేయత మొదలైనవి, నీవు చెప్పినట్లుగా, భక్తిలో భాగం కాకపోవచ్చు, కాని అవి ఉన్నయ్యి అంటే హృదయ లోతుల్లో భక్తి వుంది అని అర్థం. బయటి తొడుగులు పడిపోవడంతో ఇది ఉపరితల చేతనలోకి పూర్తి శక్తితో బయటకు రావడమే, అది రావడం అనివార్యం అని నాకు అనిపిస్తోంది. లోపల ఉన్నది ఖచ్చితంగా ఉపరితలంపైకి రావాలి.

*

నీవు యోగ సాంప్రదాయిక ఆలోచనలను విశ్వసిస్తావు - అలాగే, సాంప్రదాయ ఆలోచనల ప్రకారం, భక్తి ఒక సులభమైన పద్ధతి, అంటే ఆధారపడటం, తనను తానే ఇచ్చుకోవడం, భక్తి, ఆలంబన, సమర్పణ. నీ మార్గంలో నీకు ఎదురైయ్యేది - మనసులోనూ, ప్రాణికంలోనూ ఉన్న పాత గందరగోళం, అది నీలో ఉంది, పెరుగుతోంది. "నాకు భక్తి కావాలి"

అని హృదయం చెబుతుంది, "వద్దు, వద్దు, మనం తర్కించుకుందాం" అని మనస్సు చెబుతుంది, "అర్థంలేనిది, నేను లొంగిపోలేను" అని ప్రాణికం చెబుతుంది. నీకు కావలసింది మనస్సులోని గత సంస్కారాల ద్వారా సృష్టించబడిన గందరగోళాన్ని శాంతపరచి, ఒక విషయంపై స్థిరపడడం లేదా సామరస్యం చేయడం. భక్తి ప్రాథమిక శక్తిగా, పరమాత్మ యందు జ్ఞానాన్ని, బలాన్ని, ఆనందాన్ని పొందడమే - ఈ యోగంలో ప్రతిపాదించబడిన సామరస్యం. కానీ ఏ విధంగానైనా, అది దేని ద్వారా అయినా, శాంతి సులభంగా సాధ్యమవుతుంది.

*

భక్తి, ప్రేమల ప్రవాహం అనేది ఎంత ఎక్కువ పునరావృతమైతే లేదా మేల్కొంటే అంత ఎక్కువగా వ్యక్తిలోని అన్ని భాగాలకు విస్తరించి, వాటిపై ప్రభావాన్ని చూపుతాయి. ఒకవేళ నీవు అహైతుక భక్తి మార్గాన్ని అనుసరించాలనుకుంటే, అది అడ్డంకి కాదు. ఎందుకంటే అంతకన్నా మంచిది మరొకటి ఉండదు. ఆ విధంగా ప్రతిదీ ఒక సాధనంగా చేయవచ్చు - ఉదాహరణకు కవిత్వం, సంగీతం; కేవలం కవిత్వం, సంగీతం మాత్రమే కాదు, కేవలం భక్తికి సంబంధించిన వ్యక్తీకరణ కూడా కాదు, అవి ప్రేమకి, భక్తికి సంబంధించిన అనుభవాన్ని తీసుకురావడానికి ఒక సాధనంగా మారతాయి. ధ్యానం అనేది మానసిక ఏకాగ్రతకి సంబంధించిన ప్రయత్నం కాదు, కానీ ప్రేమకి, ఆరాధనకి, పూజకి సంబంధించిన ప్రవాహం. సరళంగా హృదయపూర్వకంగా అనుసరిస్తే, అహైతుక భక్తి మార్గం మరి ఏది తీసుకు వెళ్ళలేనంత ముందుకి దూరం తీసుకు వెళ్ళగలదు.

*CWSA 29: 350-55*

## భక్తి, ప్రేమ

భక్తి యొక్క స్వభావం ఆరాధన, పూజ, తన కంటే గొప్పదానికి స్వీయ- అర్పణ - ప్రేమకి సంబంధించిన స్వభావం అంటే ఒక అనుభూతి లేదా సాన్నిహిత్యం, ఐక్యత కోసం అన్వేషించడం. తనను తాను

ఇచ్చుకోవడం ప్రేమ, భక్తిల (ఈ రెండిటి) స్వభావం యోగంలో రెండూ అవసరం, ఒక దానికి మరొకటి మద్దతు ఇచ్చినప్పుడు, ప్రతి ఒక్కటి పూర్తి శక్తిని పొందుతుంది.

*

ప్రేమ అనేది భగవంతుని పేరు కాదు, అది ఆయన చేతన, వ్యక్తి యొక్క శక్తి. భక్తి, ప్రేమ ఒకేలా ఉండవు, కానీ ప్రేమ అనేది భక్తికి సంబంధించిన అంశాలలో ఒకటి. భక్తి వివిధ రకాలు ఉన్నాయి, వాటిలో ప్రేమ స్వభావం కలిగిన భక్తి అత్యంత బలమైనది, అన్నింటికంటే ఉన్నతమైనది, అత్యంత తీవ్రమైనది, పారవశ్యమైనదిగా పరిగణించబడుతుంది. ప్రేమలో కూడా ఉన్న రూపం ఇదే, అది స్వీయ-అర్పణ ద్వారా తయారు చేయబడింది. శరణు పొందడం, సంపూర్ణ ఆరాధన, నిస్వార్థ కలయిక పట్ల తపన, ఈ భక్తే ప్రేమ. "ప్రేమను జయించడం" లేదా "విజేతను ప్రేమించడం" అంటే అజ్ఞానం, అసత్యం, స్వార్థం, అహం, అభిరుచి, కామం, బాహ్యమైన లేదా స్వీయ-సంబంధిత కోరికలు, తన మార్గంలో అడ్డుగా నిలిచే మొదలైనవాటన్నిటిపై ప్రేమ ప్రబలంగా ఉంటూ, ఒంటరిగా సాధించి, దివ్య చేతనకు సంబంధించిన అన్ని ఇతర బహుమతులను కిందకు తీసుకు రావడమే. ప్రేమ, నిస్వార్థత, స్వీయ- సమర్పణ ద్వారా సాధకుడు ప్రేమ జయించటానికి సహాయం చేయగలడు.

*

నేను దానిని (ప్రేమభక్తి) ప్రేమ ఆధారంగా గల భక్తి అని భావిస్తాను కానీ ఆరాధన, సమర్పణ, గౌరవం, విధేయత మొదలైన భక్తిలు ప్రేమ లేకుండా ఉండవచ్చు.

నిస్వార్థత, స్వీయ-అర్పణ, పూర్తి నమ్మకం, విశ్వాసం, హక్కుగా అడగకుండటం, కోరిక లేకపోవడం, దైవ సంకల్పానికి సమర్పించుకోవడం, దైవంపై దృష్టి కేంద్రీకరించబడిన ప్రేమకు (నిజమైన ప్రేమకి, భక్తికి) కొన్ని ప్రధాన సంకేతాలు.

## భావోద్వేగ భక్తి

నేను భక్తికి వ్యతిరేకం లేదా భావోద్రేక భక్తికి వ్యతిరేకం అని అనుకోవడం అపార్థం - ఇది అదే విషయానికి వస్తుంది, ఎందుకంటే భావోద్వేగం లేకుండా భక్తి ఉండదు. యోగంపై నా రచనలలో నేను భక్తికి అత్యున్నత స్థానాన్ని ఇచ్చాను. ఈ అపార్థానికి కారణమయ్యే సమయంలోనైనా నేను చెప్పినదంతా శుద్ధి చేయని భావోద్వేగానికి వ్యతిరేకంగా ఉంది, నా అనుభవం ప్రకారం, ఇది సమతుల్యతను కోరుకోవడం, ఉద్రేకపూరిత, అసహ్యకర వ్యక్తీకరణలు లేదా విరుద్ధమైన ప్రతిచర్యలు, విపరీతమైన నాడీ రుగ్మతలకు దారితీస్తుంది. కానీ, శుద్ధి చేయాలని నొక్కి చెప్పటం అంటే నేను నిజమైన అనుభూతిని, భావోద్వేగాన్ని ఖండిస్తున్నానని అర్థం కాదు, శుద్ధి చేయబడిన మనస్సు లేదా సంకల్పం విషయంలో నొక్కి చెప్పాను కానీ, దానికి భిన్నమైన దాని గురించిన ఆలోచనను, సంకల్పాన్ని నేను ఖండిస్తున్నాను. దీనికి విరుద్ధంగా, భావోద్వేగం ఎంత లోతుగా ఉంటే, భక్తి ఎంత తీవ్రంగా ఉంటే, సాక్షాత్కారానికి, పరివర్తనకు శక్తి అంత ఎక్కువగా ఉంటుంది. భావోద్వేగ తీవ్రత ద్వారా చైత్య పురుషుడు మేల్కొని, భగవంతునికి అంతర్గతంగా తలుపులు తెరుచుకోవడం జరుగుతుంది.

*

నిమ్న ప్రాణికం ఇంత వరకు నియంత్రణలో లేనందున ప్రాణమయ పురుష యొక్క భక్తి ప్రోత్సహించబడకపోతే, అది భక్తికి విరుద్ధంగా ప్రవర్తిస్తే, భక్తి ఎలా పెరుగుతుంది, నిమ్న ప్రాణికం ఎలా మారుతుంది? శరీర ప్రకృతికి సంబంధించి తుది స్పష్టత, సామరస్యం వరకు వ్యక్తిలో ఎల్లప్పుడూ వైరుధ్యాలు ఉంటాయి, కానీ మెరుగైన కదలికల ఆటను ఏ విధంగానూ అణచివేయడానికి ఇది ఒక కారణం కాదు - దీనికి విరుద్ధంగా, వీటిని అభివృద్ధి చెందిస్తూ పెంచాలి.

*

చైత్య పురుష (భక్తి) కంటే భావోద్వేగ (భక్తి) బాహ్యంగా ఉంటుంది - ఇది బాహ్య వ్యక్తీకరణ వైపు మొగ్గు చూపుతుంది. చైత్య పురుషుడు

అంతర్ముఖంగా ఉండి మొత్తం అంతర్గత, బాహ్య జీవితానికి దిశానిర్దేశం చేస్తాడు. భావోద్వేగం తీవ్రంగా ఉంటుంది, కానీ దాని ప్రాతిపదికన అంత ఖచ్చితంగా ఉండదు లేదా జీవితం యొక్క మొత్తం దిశను మార్చేంత శక్తివంతంగా ఉండదు.

## ప్రాణిక భక్తి

ప్రాణిక భక్తి సాధారణంగా కోరికలు, హక్కుగా భావించి అడిగే వంటి వాటితో నిండి ఉంటుంది, - అది ఇచ్చేదానికి రాబడిని ఆశిస్తుంది. అది భగవంతుని కొరకు కంటే దాని కొరకు భగవంతుణ్ణి ఎక్కువగా ప్రేమిస్తుంది. అది కోరుకున్నది పొందకపోతే, అది తిరుగుబాటు చేయగలదు లేదా మరి ఎక్కడికైనా వెళ్లి పోగలదు. ఇది తరచుగా అసూయ, అపార్థం, నమ్మకద్రోహం, కోపం మొదలైనవాటి ద్వారా అనుసరించబడుతుంది - ఇవి మానవ ప్రేమ యొక్క సాధారణ అసంపూర్ణతలు. ఇవి భక్తిలోని అసలు సూత్రానికి వ్యతిరేకంగా మార్చవచ్చు. మరోవైపు, చైత్య పురుషుని ద్వారా నడిపించబడే ప్రాణిక భక్తి ఉంటే, ఈ లోపాలు మాయమవుతాయి, ప్రాణికం (ప్రేమకి, భక్తికి), (ఉత్సుకతని, ఉత్సాహాన్ని) ఇస్తుంది, ఇది చర్యలోనూ, జీవితంలోనూ అమలులోకి తీసుకురావడానికి ఎక్కువ ప్రేరణను ఇచ్చి నడిపిస్తుంది. ప్రాణికం ఎల్లప్పుడూ జీవితంలో స్వీయ-అభివ్యక్తి కోసం ఆత్మకి సాధనంగా ఉండాలి, దాని స్వంత పరిగణన (అహం, కోరిక) లేదా దాని స్వంత ప్రత్యేక ప్రేరణపై పనిచేయకూడదు.

*CWSA 29:356-58*

ప్రాణిక భక్తి అహంకారపూరితమైనది, సాధారణంగా భగవంతునిపై ఇది నాది, నాకు ఇది కావాలి అని హక్కుగా అడగటం వంటి వాటితో నిండి ఉంటుంది, అటువంటి వారు సంతృప్తి చెందనప్పుడు తిరుగుబాటు చేస్తారు. మానసికం అనేది హృదయంలో ప్రేమ లేకుండా ఉద్దేశములో, ఆలోచనలో ఆరాధన చేయటం.

*

## విరహం లేదా విడిపోవడంలో బాధలు

విరహం ఆత్మ కోసం చేసే ప్రాణిక అన్వేషణలో మధ్యంతర అనుభవం - ఇది చాలా ప్రారంభ దశలో ఎందుకు సాధ్యం కాకూడదు అనటానికి ఎటువంటి కారణం లేదు. ఎటువంటి అశాంతి లేని సాక్షాత్కారాలు, స్వచ్ఛమైన ఆనందాన్ని గ్రహించేవి, మరింత అభివృద్ధి చెందిన సాధనకు చెందినవి.

*

విరహానికి సంబంధించిన స్వచ్ఛమైన అనుభూతి చైత్య పురుషునికి చెందుతుంది - కానీ రాజసిక లేదా తామసిక కదలికలు వస్తే (నిరాశ, ఫిర్యాదు, తిరుగుబాటు మొదలైనవి) అది తామసికం లేదా రాజసికం అవుతుంది.

*

విడిపోవడంలో ఉన్న బాధలు ప్రాణికానికి చెందినవి, అంతరాత్మిక స్థితికి కాదు. బాధలు లేని చైత్య పురుషుడు వాటిని వ్యక్తపరచవలసిన అవసరం లేదు. చైత్య పురుషుడు ఎల్లప్పుడూ నమ్మకం, ఆనందం, విశ్వాసంతో భగవంతుని వైపు తిరిగి ఉంటాడు - అతను ఏ ఆకాంక్షను కలిగి ఉన్నాడో, ఆ ఆకాంక్ష నమ్మకం, ఆశతో నిండి ఉంటుంది.

*CWSA 29: 359-60*

## దైవంతో శత్రుత్వం

శత్రుత్వ సిద్ధాంతం గూర్చి ఇంకా వ్రాయడానికి నా దగ్గర సమయం లేదు. ఈ పనిని రెండు, మూడు రోజుల్లో పూర్తిగా చేస్తాను. దైవం పట్ల శత్రుత్వంతో ఒక భక్తుని కంటే కూడా వేగిరంగా దైవాన్ని చేరుకోవచ్చు అన్న ఆలోచనలో, సత్యమే కనిపించడం లేదు. ఈ ఆలోచన ఆధ్యాత్మిక సత్య సంబంధమైన అంశాలకు, హేతు బద్ధతకు, స్వభావానికి, అనుభవానికి కూడా విరుద్ధంగా కనిపిస్తుంది.

'ఎక్స్'కు నీ సమర్ధన చూస్తే దాన్ని బట్టి అవి 'ఎక్స్' స్వంత ఆలోచనలుగానే ధ్వనిస్తున్నాయి. చాలా విపరీతంగా తోస్తున్నాయి. అవి గనుక సరైనవైతే ఈ దిగువ అంతిమ నిర్ణయాలకు మనం వచ్చి తీరాలి.

**1.** సత్యం సాక్షాత్కారం వైపు నడిపే ఉత్తమ మార్గం కాదు. ఆధ్యాత్మికంగా అవ్వడానికి రజస్సే ఉత్తమ మార్గం. రాజసిక ప్రవృత్తి గల మనిషి తన ప్రబలమైన అహంకారంతో, హింసాత్మక ప్రత్యాశతో దైవానికి నిజమైన సాధకుడు అవుతాడు.

**2.** అసురుడు శ్రేష్ఠ భక్తుడు. సిద్ధికి దేవ స్వభావాన్ని షరతు అనీ, దానికి విరుద్ధమైనది అసుర స్వభావం అనీ చెప్పే గీతా వాక్యం పూర్తిగా తప్పు. దానికి మరో విధమైనది సత్యం.

**3.** రావణుడు, హిరణ్యకశుపుడు, శిశుపాలుడు దైవానికి గొప్ప భక్తులు. ఎందుకంటే దైవానికి ప్రతికూలురు. కాబట్టే కొన్ని జన్మల్లోనే విముక్తులయ్యారు. వాళ్ళతో పోల్చుకుంటే మహర్షులు, భక్తులు చాలా దీనమైన ఆధ్యాత్మిక పాత్రలు. పురాణాల్లో రావణుని గురించి ఒక చిక్కు సమస్య నాకు తెలుసు. ఈ అసురులు, రాక్షసులు విష్ణువు లేదా కృష్ణునికి లేదా రామునికి ఆరాధకులు లేదా శిష్యులుగా ఉండేలా నటించలేదు లేదా తిరుగుబాటుతో మోక్షాన్ని పొందే శిష్యులుగా ఉండటానికి వారి హోదాను వినియోగించలేదు అన్న విషయాలను నన్ను ఎత్తి చూపనివ్వు. వాళ్ళు శత్రువులుగానే ఉండి మోక్షాన్ని పొందారు, చంపబడి, దేవునిలో విలీనం అయిపోయారు.

**4.** గురువు పట్ల విధేయత, దైవాన్ని ఆరాధించడం లాంటివన్నీ మనిషికి పనికిరాని, గొర్రెలకు తగిన ఆహారాలు. గురువు మీదకి లేదా దైవం మీదకి దురుసుగా పోయి, ఆయనను దూషించి, ధిక్కారాన్ని కనబర్చి, ఆయన నిజాయితీకి సవాలు విసిరి, ఆయన చర్యలు దోషాలుగా ప్రకటించి, ఆయన తీర్పు తప్పు అని, పక్షపాత పూర్వకమని, జుగుప్సాకరమని, అసత్యం, దయ్యాలకి మద్దతునిచ్చేదని, మొదలైనదంతా ఉత్తమ భక్తిమార్గం. అదే గురు శిష్యుల మధ్య నిజమైన అనుబంధం,

అవిధేయతే గురువు పట్ల అత్యున్నత గౌరవం, క్రోధం కలహాలన్నవి దైవానికి సమర్పించదగిన ఉన్నత ఆరాధనలు.

5. తన దోషాల్ని కనిపెట్టుకోవడానికి, మహాకాళి కొట్టే దెబ్బల్ని ఆనందంగా స్వీకరించే సాధనలు, ప్రకాశం, బలం, పవిత్రతతో ఎదగడం అన్నవి శిష్యత్వానికి సంబంధించిన అయోగ్యత, పిరికితనం, తిరుగుబాటుతో మారడంలో నిశ్శబ్ద ఒత్తిడికి స్పందించే వాడు, తన తప్పులను మొండిగా సమర్థించేవాడే దృఢమైన మనిషి, ఒక పటిష్టమైన ఆధారం, పరిపూర్ణతా మార్గంలో ఒక ఉన్నత స్థాయీ సాధకుడు.

ఇలా పర్యవసానాలను గుణించుకొంటూ పోగలను. కాని నా దగ్గర సమయం లేదు. ఈ విషయాలన్నింటినీ నీవు నమ్ముతున్నావా? ఇవన్నీ పరిపూర్ణతా మార్గంలో 'ఎక్స్' వాదనకు సంబంధించిన లేదా సంఘర్షణకు సంబంధించిన పర్యవసానాలు. నీవు పూర్వ సిద్ధాంతాన్ని ఒప్పుకొన్నట్లయితే ఈ తార్కికమైన పర్యవసానాలను అంగీకరించాల్సిందే. 'ఎక్స్' చేసింది అదే. అతడి దోషాల్నే సత్యంగా పిలిచాడు. నేను విధించిన మార్గం అసత్యమని 'తన ఉన్నతాత్మను మరచిన గురువు'ననే వాస్తవం ద్వారానే అది వివరించబడుతుంది అన్నాడు. ఆ పర్యవసానాలు అతడు వెళ్లిపోయేలా చేశాయి. మనం కోరుకోలేదు. తను స్వయంగా అనుకొనే వెళ్లాడు. అతడు సృష్టించుకొన్న పరిస్థితుల కారణంగా అతడి గతానుభవంతో వచ్చిన ఒకమార్పుకు అతడు లోనైతే తప్ప ప్రాయోగికంగా అతడిని నేను వెనుకకు రమ్మనడం అసాధ్యం. ఆ మార్పు సాధ్యాసాధ్యాల గురించి ఆలోచించడంలో, గతానుభవం, నన్ను అనుమతించదు.

CWSA 29:360-361

*శ్రీ అరవిందులు*

# ప్రార్థన, పూజ

**బాహ్య పూజ :**

ఆంతరిక పూజకు ధ్యానానికి ఈ యోగంలో మాత్రం పరిమితంటూ లేదు. కేవలం ఆంతరిక అస్తిత్వానికి మాత్రమే గాక, మొత్తం అస్తిత్వానికి, ఈ యోగం సంబంధించినది గనుక, అటువంటి పరిమితీకరణను ఉద్దేశించలేదు. విభిన్న మతాల పాతరూపాలు పడిపోవచ్చు. కానీ, రూపాలన్నీ లేకుండా పోవాలనేది సాధన నియమం కాదు.

(పాత రూపాలు పడిపోవచ్చు) అన్నప్పుడు ప్రణామం వగైరాలను గురించి ఆలోచించడం లేదు, దానికొక సజీవమైన విలువ ఉంది. ఇకనెంత మాత్రం విలువలేక పోయినప్పటికీ కొనసాగుతున్న పాత రూపాలను గురించే నేనామాట అన్నాను. ఉదాహరణ, చనిపోయిన వారికోసం చేసే శ్రాద్ధకర్మను గురించే ఆలోచిస్తున్నాను. ఈ యోగంతో సంబంధంలేనటువంటి ఇక్కడి రూపాలను గురించి కూడా ఆలోచిస్తున్నాను. ఉదాహరణకు క్రైస్తవ రూపాలనంటి పెట్టుకునే క్రైస్తవులు లేక నమాజ్‌కు మహమ్మదీయులు, లేక పాత పద్ధతిలో సంధ్యావందనానికి అంటిపెట్టుకున్న హిందువులు అవి పడిపోతున్నట్లుగాని, లేక తమ సాధన స్వేచ్ఛామయ పురోభివృద్ధికి ఒక ఆటంకమనిగాని త్వరలో తెలుసు కుంటారు.

బాహ్య పూజ అంటే అర్థమేమిటి? అది పూర్తిగా బాహ్యానికే సంబంధించినదే అయితే, అది అత్యంత నిమ్నరూపమనే మాట నిజమే. ఆంతరికంగా యథార్థ చేతనతో చేసినదైతే, పూజ స్వభావంలో, చర్యలో, దేహాన్ని అత్యంత బాహ్య చేతనను పాలుపంచుకునేటట్లు చేస్తూ, ఆరాధనకు సంబంధించిన మహనీయ సంపూర్ణతనదికొని తెస్తుంది.

నీవు చెప్పేది, నిస్సందేహంగా యథార్థం, కానీ అటువంటి ఆధారాలు, విశ్వాసం కోసం ఇంకా అవసరం ఉన్నవారికి లేకుండా చేయకపోవడం మంచిది. ఈ అంతర్దర్శనాలు, ప్రతిరూపాలు, క్రతువులు వారికోసం

ఉద్దేశించబడినవి. ఏ విశ్వాసాన్నైనా లేక విశ్వాస ఆధారాన్ని అయినా, అది ఉన్న వ్యక్తులు, దానిని మరో విశాలమైన, మరింత సంపూర్ణమైన దానితో పునఃస్థాపించుకొంటే తప్ప తొలగించకూడదనేది ఒక ఆధ్యాత్మిక సూత్రం.

(ఒక విగ్రహం లోనికి) ఒక శక్తివంతమైన దైవ సాన్నిధ్యాన్ని తీసుకువస్తే, అది దానిని తీసుకొచ్చిన వ్యక్తి తన దేహాన్ని వదిలి వేసిన చాలాకాలం వరకు ఉండవచ్చు. మామూలుగా అది పూజారి భక్తిచే, ఆరాధించడానికి దేవాలయానికి వచ్చే వారి చిత్తశుద్ధి, నమ్మకంతో పోషించబడుతుంది. ఇది విఫలమైతే, ఆ దివ్య సన్నిధి ఉపసంహరించుకోవడం జరగవచ్చు.

*

(ఒక దేవాలయంలో దేవతకు అర్పించిన ఆహారం అదృశ్యం అవ్వడం అనే విషయానికి) "విజ్ఞాన శాస్త్రీయ" విశదీకరణ ఏమిటంటే, ఎవరో బహుశా ఒక సేవకుడు, అక్కడ చూచే వాళ్ళెవరూ లేనప్పుడు అక్కడున్న నిషేధాలను పట్టించుకొనకుండా, సమర్పించిన ఆహారాన్ని శీఘ్రంగా పూర్తి చేసి ఉంటాడు. అటువంటి గుహ్యమైన వ్యవహారాలు అసాధ్యమని ఊహించి ఉంటుంది, కానీ అదలాంటిదై ఉండకపోవచ్చు, అదొక కేవలం జరగడానికి అవకాశం ఉన్న అనుమానం లేక సిద్ధాంతం. గుప్తజ్ఞానం కలవారు లేక వారిలో కొంతమంది, చూపుకందని జీవులకు కొన్నిసార్లు అర్పించిన ఆహారం (ఏవిధంగా చూసినా ఎల్లప్పుడూ అలా జరగదు) దాని సూక్ష్మ మూలకాలను, ఆహారపు బయటకు కనిపించేదాన్ని వదిలివేస్తూ, హరించడం జరుగుతుందని అంటారు. భౌతికంగా ఆహారాన్ని స్వీకరించడమనేది అరుదు, కానీ ఎచట భక్తి అత్యంత దృఢంగా ఉంటుందో, అచట అటువంటి సంఘటనలు సంభవించినట్లు నమ్ముతారు.

CWSA 29:364-65

## బయటకు కన్పించే భక్తి

యాంత్రికమైన, కృత్రిమ భక్తి అంటూ ఉండజాలదు - భక్తి ఉందా లేదా అనేదే అసలు విషయం. భక్తి తీవ్రమైనది కావచ్చు, కాకపోవచ్చు,

సంపూర్ణం లేక అసంపూర్ణం కావచ్చు, కొన్ని సమయాల్లో బహిర్గతం కావచ్చు, కొన్ని సమయాల్లో తెరమరుగు కావచ్చు, కానీ యాంత్రికమూ, కృత్రిమమూ అయిన భక్తి పదాలే పరస్పర విరుద్ధమైనది.

(బహిరంగ భక్తికి వ్యతిరేక వాదనలు) ఇతర పార్శ్వాలను ఉపేక్షిస్తూ, సత్యపు ఒక పార్శ్వాన్నే పరిగణించే మనస్సు అతిశయోక్తిలివి. ఆంతరిక భక్తి ప్రధాన విషయం, అది లేని బాహ్యభక్తి, ఒక రూపం, కేవలం కర్మకాండగా అవుతుంది. కాని అది ముక్కు సూటిగా సాగేది, చిత్తశుద్ధి కలిగినదీ అయినప్పుడు, బాహ్యభక్తికి, దాని స్థానం దానికి ఉంది.

*

దైవం యెడల మాత్రమే భక్తి ఉండాలి. సాధకులు, సాధకులే, వారు దైవాన్ని చేర ప్రయత్నించే వారైనప్పటికీ దోషాలు సంఘర్షణలతో నిండి ఉన్నవాళ్లే.

*

ప్రతి దానినీ దైవం నుంచి హక్కుగా కోరేది, తనను తానర్పించుకొనని ఒక భక్తి నిజమైన భక్తి కాదు.

CWSA 29:355

## ప్రార్థన

ప్రార్థన, ఆకాంక్ష అనేవి ఆధ్యాత్మిక జీవితపు ఒక భాగం, ప్రార్థన ఫలించినా, ఫలించకపోయినా తన విశ్వాసాన్ని ప్రశాంతతను అలాగే నిలుపుకుంటూ అలజడికి లోనుకాకుండా ఉంటే, అది సమర్పణతో విభేదించవు. సాధారణ జీవితంలో, దైవంతో మానవసంబంధపు ప్రధాన మౌలిక అంశాలలో ఒకటి ప్రార్థన. తరచుగానే గాని ఎల్లవేళలా సమాధానం రాదు. సమాధానం లభించకపోయినప్పుడు మతాత్మిక మనిషి తన నమ్మకాన్ని, సమాధానం ఇవ్వడం దైవేచ్ఛ కాదని అర్థం చేసుకొంటాడు. లేకపోతే తన ప్రార్థన ఆలకించబడేంతవరకు తీవ్రంగా ప్రార్థిస్తాడు. అది ఆ మనిషి మీద, పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. ఒక సాధకుడు నిస్సంగుడై ఉండి, సమమనస్కుడై ఉంటే ఇతరుల వ్యవహారాల్లో

వాళ్లకోసం ఆంతరంగికంగా కలిగించుకోవచ్చు. కానీ జోక్యం చేసుకొన బద్ధుడై ఉండడు.

*

సర్వుల ప్రార్థన ఆలకించబడదు అనేది నిజం. ఎంత చిత్త శుద్ధితో కూడినదైనప్పటికీ ప్రతివాని ప్రార్థనలను వినడం జరిగితే ప్రపంచం మరింత వినాశకర వ్యవహారమై ఉండేది. భగవంతుని వైపు ప్రార్థన సైతం ఎల్లవేళలా వినడం వెంటనే జరగదు, విశ్వాసం సైతం ఎల్లవేళలా వెంటనే తృప్తిపరచబడదు. తన పెనుగులాటలో ప్రార్థన, విశ్వాసం రెండూ సాక్షాత్కారం వైపు మనిషికి సహాయపడడానికివ్వబడిన రెండు శక్తులు - అవి లేకుండా, ఆకాంక్ష, సంకల్పం, విశ్వాసం లేకుండా (ఆకాంక్ష అంటే ప్రార్థన) ఎచటికి చేరాలన్నా అతనికి కష్టమౌతుంది. కాని ఇవన్నీ, దైవ క్రియాశక్తిని కార్యోన్ముఖం చేయడానికి కేవలం ఉపాయాలే - క్రియా శక్తులు, కర్మలోనికి వచ్చే ముందు లేక కనీసం అవి కర్మలో వున్నట్లు కన్పించే ముందు, లేక ఫలితం ఫలించే ముందు సైతం సుదీర్ఘ చాలా సుదీర్ఘ కాలం పడ్తుంది. తన విషయాన్ని అతి శయోక్తిగా చెప్పినప్పటికీ, పరవశించిన వాడు పూర్తిగా తప్పు చెప్పినవాడు అవ్వడు. అతిశయింపజేసి, చేసిన ప్రకటనలు సైతం కొన్ని సమయాల్లో జగచ్ఛక్తిని నమ్మించ సహాయం చేస్తాయి. అప్పుడది 'మహా అయితే సరే, అదలా అయితే, మంచిదే' అంటుంది.

*

ప్రార్థనకు సంబంధించినంత వరకు, ఏవిధమైన కఠిన నియమం పెట్టలేం. అన్నీ కాక, కొన్ని ప్రార్థనలకు సమాధానమివ్వబడుతుంది. అన్ని ప్రార్థనలకు సమాధానం ఎందుకివ్వరు అని నీవడగవచ్చు. కాని ఎందుకివ్వాలి? ఒక పెట్టెకు గాని, యంత్రానికి గాని ఏదైనా చీటీ గాని, నాణేన్ని గాని వేయడానికున్న గాడిలాంటి దానిలో ప్రార్థనను పడవేస్తే, నీవడిగింది వచ్చేసే, యంత్రాంగం కాదది. పైపెచ్చు, అదే క్షణంలో మానవాళి ప్రార్థించే సకల వైరుధ్య విషయాలనన్నింటినీ, పరిగణనలోనికి

తీసుకొంటూ, వాటినన్నింటినీ అనుగ్రహిస్తే భగవంతుడు ఒక విపత్కరమైన కలుగులో యిరుక్కుపోతాడు, అందుచేత అది కుదరదు.

ప్రపంచంలో నివసిస్తున్నట్లయితే అటువంటి (ప్రపంచ సమస్యలను పరిష్కరించ సహాయం కోసం) ప్రార్థనలు చేయవచ్చు. కానీ దైవం ఆ ప్రార్థనలన్నింటినీ నెరవేర్చాలని ఆశించరాదు, లేక దైవం వాటిని నెరవేర్చబద్ధుడై ఉన్నాడని భావించరాదు. అతడు సాధకుడైనప్పుడు, ప్రార్థన సాధనకు, సంబంధించిన ఆంతరిక విషయాలకైనదై ఉండాలి. సాధనకు, దివ్య కార్యానికి అవసరమైనంత మేరకు మాత్రమే బాహ్య విషయాలను గురించి ప్రార్థన ఉండాలి.

*

ప్రార్థన గురించి నీవు చెప్పినది సరియైనదే. అది (నిర్వ్యక్తిక ప్రార్థన) అత్యున్నతమైన ప్రార్థనా విధానం, కానీ మరో విధానం కూడా (అనగా అత్యధిక సవ్యక్తిక ప్రార్థనా విధానం కూడా) అనుమతించదగినదే, వాంఛించదగినది సైతం అవుతుంది. సరైన విధంగా సమర్పించిన ప్రార్థనలన్నీ మనల్ని దైవానికి సన్నిహితంగా తీసుకుపోతాయి, ఆనతితో సరైన బాంధవ్యాన్ని నెలకొల్పుతాయి.

*

ప్రార్థనల విషయంలో, ఎవరి కోసం ప్రార్థించావో ఆతనిలో తత్సంబంధమైన ఫలితం లేకపోయినా, ఇతరుల కోసం చేసే నిస్వార్థ ప్రార్థన, ప్రార్థించడమనే వాస్తవికత, అది తీసుకొచ్చే వైఖరే నిన్ను ఉన్నత శక్తికి తెరచి పెడ్తుంది. దానిని గురించి సానుకూలంగా ఏం చెప్పలేం, ఎందుకనంటే ఫలితం అవశ్యం, వ్యక్తుల మీద ఆధారపడి ఉంటుంది. వాళ్లు ఉన్ముఖమై ఉన్నారా, లేక స్వీకరించే విధంగా ఉన్నారా లేక, ప్రార్థన క్రిందికి తీసుకొచ్చే ఏ దివ్యశక్తికైనా బదులు పలికేదేదైనా ఉందా క్రిందికి అనే దానిమీద కూడా ఆధారపడి ఉంటుంది.

*

ప్రార్థనలు పూర్తిగా విశ్వాసంతో నిండి ఉండాలి.

ఈ లేఖ వ్రాసిన వానిని ఒక సహచర సాధకుడిలా అడిగాడు శ్రీఅరవిందుల ఫొటోగ్రాఫ్ మీద ధ్యానించాలని యెందుకనుకొంటున్నావు? నీలా లోపల ధ్యానించగలిగితే, ఈ బాహ్యా రూప భక్తి అవసరం లేదు.

CWSA 29:365-67

*

శ్రీ అరవిందుల ఫొటోగ్రాపు వంక చూస్తున్నప్పుడు ఒక సజీవ నిజమైన నేత్రాలతో వున్న ఒక సజీవ వ్యక్తివైపు చూస్తున్నట్లు ఈ లేఖకుడనుభూతి చెందాడు.

CWSA 29:355-363

పరివర్తన చెందే షరతుతో మాత్రమే ఎవరూ పూజ చేయకపోవచ్చు. చాలామంది పరివర్తన చెందాలని గాని పూజించాలని గాని కోరుకోరు.

*ది మదర్ శిష్యునితో సంభాషణ, జనవరి **14,1970***

## విశ్వజనీన దైవారాధన

దైవాన్ని గురించిన మానవ ఆలోచనలు, మొదట రూపం ధరించిన వాని పూజ, రూపరహితుని వైపు ఆకాంక్షగా తరువాత, సగుణుని ఆరాధన, నిర్గుణుని వైపు నిరపేక్షకునిపై అరుదైన ఆత్మల తపనగా తమను తాము విభజించుకొంటాయి.

ఎందుకనంటే ఈ దశలన్నింటికీ తాంత్రిక ఆరాధన, క్రమశిక్షణ అవకాశమిస్తుంది. రూప రహితుడు తనను తాను రూపంతో ఎలా చూపుకోగలుగుతాడు. అని మతాత్మిక హేతువాది ప్రశ్నిస్తాడు. సమాధానమివ్వడానికి ఎదురుగా విశ్వం వున్నది. శిలలోని, వృక్షంలోని, జంతువులోని, మానవునిలోని నారాయణుని హిందూ మతం పూజిస్తుంది. దానినే, మేధోపరమైన, ఆధ్యాత్మిక అభిజాత్యం లేక అన్యమతాల కాఠిన్యత తృణీకరిస్తుంది. అది తన అభిజాత్యాన్ని తయారు చేసి, తన స్వకీయ, తార్కిక కాఠిన్యతా రూపంలోనికి మళ్ళిస్తుంది. అచేతన పదార్థాలు, శిలలు, నాలుగు కాళ్ళ జంతువు, మానవుడు ఇవన్నీ భవంతునిలో సమమైనవే, దైవంలో మన సహోదరులే, తాను పూనడానికి తిరస్కరించినటువంటి

సర్వవ్యాప్తి రూపాలే. కాని పదార్థరూపాలకావల, ఆదర్శప్రాయమైన, సంకేతాత్మకమైన యితర రూపాలున్నాయి, ఇంకా అంతకంటే ఎంతో నిజమైన, ఏ ఇతర అసలైన భౌతిక అభివ్యక్తికన్న దైవశక్తిని ఎంతో నిండుగా కలిగిన వాటికంటె తక్కువవి కావు. మనం పూజించే భగవంతుని గురించిన మానసిక ప్రతిరూపాలివి. అతని భక్తికి అతడే రూపం తీసుకొచ్చినా, భగవంతుని యందు ఆతనికి గల ప్రేమ ఆ రూపాన్ని పూని దానిని ఉజ్జీవింపచేస్తుంది. విశ్వాసం పరితాపానికి బదులు పలికే, బహుశా అదే తండ్రి, తల్లి, సఖుడు, ప్రేమికుడు, వీటన్నింటినీ అతిశయిస్తూ దానికి అతీతం గూడా అవుతూ, తానుగా స్వయంగా వాటివైపు పరితపిస్తూ వున్న ప్రేమ గల, ఒక దివ్యచేతన వున్నట్లయితే అది తన ఆనందం కోసం, తన విఖ్యాతి కోసం, విశ్వరూపాలను పూనుతున్నదని, లేక సృష్టిస్తున్నదని అనుకోవడం నిరర్థకం. కాని, తన హృదయంలో లేక తన ఊహలో తనకు తానుగానే రూపమేర్పరచుకొన్న దాని, పూజించు వాని ప్రేమ సమర్పించుకొనే దాని ప్రతిష్టకు, లేక పరిశుద్ధతకు ఒక అప్రతిష్ట కలిగించే తిరస్కారం అవుతుంది. ~~ఈ~~ మానసిక రూపాలకు, మానసిక పూజ నివేదించవచ్చు. పైగా ఇది ఉన్నత విధానమే. లేక దీనికి పదార్థ పునాదిని పూజలకు సంబంధించిన భౌతిక చర్యకు ఒక భౌతిక ఆకృతిని రూపొందించడానికి ఒక విగ్రహానికి, లేక ప్రతిబింబ చిత్రానికి 'ప్రతిష్ట' చేయవచ్చు.

రూపరహితంలో గూడా, ఆయన గుణాలలో, ఆయన దివ్యప్రేమ, దివ్య శక్తి, దివ్యానందం, ప్రజ్ఞానం, జ్ఞాన నేత్రానికి తనను తాను వ్యక్తపరచుకొనే, గొప్ప జగత్ సూత్రాల రూపంలో గూడా భగవంతుని పూజిస్తాం.

వీటిలో అభివ్యక్తమైన నిర్వ్యక్తికతగా లేక వాటిని తనలో భరించి వున్న సవ్యక్తికతగా ఆయనను మనం పూజిస్తాం. పరాకాష్ట శిఖర దశలో అరూపమైన దానిలోనికి మాత్రమే గాక, గీత పలికిన నిర్గుణ, అనిర్దేశ్యంలోనికి గూడ మనం లేస్తాం. మన మానవ అజ్ఞానంలో, పట్టాలు, విశిష్టతలు, ఆధిక్యతలు ప్రత్యేకతలపై మనకు గల మానసిక తీవ్ర

ఆపేక్షలతో మనం ఆ విధంగా ఈ విషయాలను వర్గీకరించి, ఇది ఉన్నతమైనది, అది అజ్ఞానమయ, అధములకు అని చెప్తాం. మనకు తెలుసా? రూపారాధకుని, మనిషిని పూజించే, విగ్రహారాధకుని, బహు దేవతా వాదిని, భ్రష్టుడనే భావంతో ఆస్తికుడు చిన్నచూపు చూస్తాడు. సగుణారాధకుడిని, మూర్తిత్వంపై కేంద్రీకరించే ఆస్తికుని అజ్ఞానంపై ఒక ప్రశాంత, సహనం కల దృష్టితో చిన్నచూపు చూస్తాడు.

భగవంతుడు దేనినీ తృణీకరించనట్లు మనకు కనిపిస్తుంది. ఆలోచనా శిఖరం నుండి అనిర్వచనీయం, అజ్ఞేయం లోనికి తత్త్వవేత్త దుముకుడులో ఆనందాన్ని స్వీకరించినట్లు, ఒక చిన్న బిడ్డ ప్రార్థనలోనూ లేక ఒక పుష్పాన్ని లేక ఒక పత్రాన్ని విచిత్రమైన ప్రతిబింబం ముందు సమర్పించడంలో ఆనందాన్ని, సమస్తపు దివ్యాంతరాత్మ స్వీకరిస్తున్నట్లు మనకు కనిపిస్తోంది. పైకెదిగి తీరంలేని సంసిద్ధిలోనికి విస్తరించుకొంటూ పోయినా, చిన్న బిడ్డకుండే హృదయాన్ని, రూపాల ద్రష్ట సామర్థ్యాన్ని నిలుపుకోగలిగిన వారికతడత్యంత శుభాన్ని చేకూరుస్తాడు.

CWSA 1:572-73 *శ్రీఅరవిందులు*

నీకు విశ్వాసమూ, నమ్మకమూ ఉంటే, నీవు పూజించేది గురువు మానవరూపాన్ని గాక ఆయన రూపం ద్వారా అభివ్యక్తమయ్యే పరాత్పర ప్రభువును, అని తెలుసుకొంటావు.

ఇబ్బంది పడకుండా, నీకు యే మార్గం సహాయం చేస్తే ఆ మార్గం ప్రకారం, పరాత్పర ప్రభువునకు యెట్టి మినహాయింపులు లేకుండా, నిన్ను నీవు సమర్పించుకో.

ప్రేమ, ఆశీస్సులతో

CWM 14:60 *ది మదర్*

శ్రీమాత! శ్రీ అరవిందుల యోగమార్గాన్ని ఎంచుకున్న తర్వాత మిగిలిన దేవుళ్ళు, దేవతలనందరినీ పూజించటం మానివేయాలా?

శ్రీ అరవిందులు అందించిన మార్గాన్ని నిజంగా ఆచరించేవారు, ఈ మార్గపు అనుబంధం ప్రారంభం కాగానే, తన చేతనను ఇతర దేవీ దేవతలకు పరిమితం చేయడం అసాధ్యమని గమనిస్తారు.

CWM 10:254

శ్రీమాతా! కొందరడుగుతూ ఉంటారు - శ్రీ అరవిందుల అనుచరులు రాముడు, కృష్ణుడు, మరి ఏ ఇతర దేవతలనైనా పూజించవచ్చా? కూడదా? ధార్మికమైన మత కార్యక్రమాలను నిర్వహించవచ్చా లేక వదిలివేయాలా?

ఇక్కడ ఈ మార్గంలో ఒక వ్యక్తి అనుసరించవలసిన నిర్దిష్టమైన నియమాలేవీ లేవు. ప్రతి వ్యక్తీ తన అంతఃకరణ చెప్పినట్లుగా నడుచుకోవాలని చెప్పాను. నిజాయితీగా ఉండి, దైవానికి సేవకుడవ్వాలనుకుంటే, శ్రీమాతారవిందుల నామాలు తెలియకపోయినా అలా కావచ్చు. శ్రీమాత రాధ రూపంలోనో, మేరీమాతగానో లేదా హనుమరూపంలో బదులు పలుకుతారు. అది ఆ వ్యక్తి నిజాయితీ, విశ్వాసాలపై ఆధారపడి ఉంటుంది. ఎవరినీ మతపరమైన ఉత్సవ కార్యక్రమాలను చేయమని కానీ, ఆపివేయమని గానీ చెప్పము. మదర్! మీరేమంటారు?

అది చాలా సత్యం

CWM 17:234

శ్రీమాత

## భూమిపై దైవం

దైవాన్ని ప్రకటించే దేనినైనా గుర్తించడానికి జనులు నిరాకరిస్తున్నారు. అందులో దోషాలనెంచటానికి లోపాలు వెతకటానికి ఉన్నతమయిన దానిని తమ స్థాయికి, క్రిందకు దించటానికీ ప్రయత్నిస్తుంటారు. ఇతరులు తమను అధిగమించి పోయినపుడు ఊరికే కోపంతో రగిలిపోతారు. తేలికపాటి "అసమగ్రతను" కనుగొనడంలో విజయం సాధించినపుడు, గొప్పగా ఆనంద పడిపోతారు. కానీ ఈ భూమిపై దైవం ఎదురైనపుడు వారి అనాగరికమైన భౌతిక మనసుకు వారికి కేవలం మొరటుతనమే ఎదురౌతుంది. వారికి చూడగల సమర్థత లేనిది, చూడవద్దని కోరుకున్నది వాళ్ళు చూడాలని ఆశించలేరు. దైవం యొక్క బాహ్యాచర్యలను మాత్రమే పరిగణించినపుడు వాళ్ళు ఖచ్చితంగా దైవాన్ని తప్పుగా అంచనా వేస్తారు. ఎందుకంటే మానవ చర్యలా కనిపించే దైవకార్యం పూర్తిగా అందుకు భిన్నంగా ఉండి మానవీయం కాని మూలాల నుండి ఉద్భవిస్తుంది.

ఈ భూమిపై ఒక కార్యార్థమై ఆవిష్కృతమయే దైవం సాధారణ మానవులలానే ప్రవర్తించినట్లు గోచరించినా నిజానికి అలా జరగదు. దైవపు పనితీరును పైకి కనిపించే, ప్రకటితమయ్యే ప్రమాణాలను అనుసరించి బేరీజు వేయలేం. కానీ మానవులు తమ నిమ్నతను ఎంతో ప్రేమించి ఒక ఉన్నత సత్యాన్ని ఒప్పుకొనటాన్ని లేదా సమర్పణ చేసుకోవటాన్ని భరించలేరు. దోషాలను వెతికి పట్టుకోవటం, ఉన్నత సత్యాన్ని అనుమానించి విమర్శించటమనే ఈ కుటిల వ్యామోహం మానవత యొక్క ప్రభావముద్ర, కేవలం మానవతను అది వేరుగా నిలబెడుతుంది. మరొకవైపు ఎక్కడైతే సత్యమయినది, సుందరమయినది, ఉదాత్తమయినది అప్రయత్నంగా ఆరాధించబడుతుందో అక్కడ దివ్యత్వం వ్యక్తమవుతుంది. మీ హృదయం దివ్య మూలాలను కలిగి ఉన్నదానిని ఆరాధించడానికి, పూజించటానికి ఎగసినపుడు అది మీలోని భౌతిక చైతన్యం చైత్యసత్త లేదా అంతర్మాతో సంస్పర్శలోకి వస్తుందనే విషయాన్ని మీరు రూఢిగా తెలుసుకోవాలి.

అటువంటి విషయం మీ ముందున్నక్షణంలో మీ కళ్ళ నుండి ఆనంద బాష్పాలు కురుస్తాయి. కేవలం కుటిలమయిన వ్యక్తులు మాత్రమే యిలా ఆలోచిస్తారు. అవును. ఇది చాలా మహత్తరమైన విషయమే. కానీ అది నాకు సంభవించి ఉంటే బాగుండేది. ఈ గుణం నాకు ప్రాప్తించి ఉంటే, ఈ మహోత్కృష్టమయిన ఆవిష్కరణకు నేను ఉపకరణం అయి ఉంటే బాగుండేది అనుకుంటారు. భగవంతుడు తనకు కావలసిన సమయంలో తాను ఎన్నుకున్న పద్ధతిలో తనను తాను వ్యక్తం చేసుకోవాలని అనుకోవటం ప్రధానమయిన విషయమయినపుడు మీరు మీ అహం గురించి ఎందుకు చింతించాలి? అది అలా అభివ్యక్తమైనపుడు మీరు సంతృప్తులయి, మీ దయనీయమైన వ్యక్తిత్వపు సంకుచిత శృంఖలాలను ఛేదించుకో గలిగి, నిస్వార్థమయిన ఆనందంతో పైకి దూసుకుపోవాలి. మీ ఆత్మ జాగృతమయినదనటానికి, సత్యాన్ని అనుభూతి చెందిందనటానికి ఈ ఆనందం సరియైన సంకేతం. అప్పుడే మీరు అవగతమవుతున్న ఆ సత్యపు ప్రభావానికి తెరుచుకోగలుగుతారు. దానిచే ఒక రూపాన్ని దిద్దుకుంటారు.

నాకు కొన్ని సందర్భాలు గుర్తున్నాయి. చిన్న పిల్లలు, పసిపాపలూ చేసే దివ్యమైన పనులు చూసినపుడు వెంటనే నా కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. ఆ ఆనందాన్ని అనుభూతి చెందండి. దాని వలన మీలోనే ఉన్న ఆ దివ్యసన్నిధి యొక్క లబ్దిని పొందుతారు.

CWM 3:158-159

## విగ్రహారాధన

విగ్రహాలు మానవ సృజన కాదా? అవి స్వయంగా ఏమైనా ఉనికిని కలిగి ఉంటాయా?

ఏ రూపమయినా దేనినయితే మనం తృణీకార భావనతో విగ్రహం అని పిలుస్తామో ఆ మూర్తి యొక్క బాహ్యరూపమేదయినా, మన భౌతిక నేత్రాలకది వికృతంగా, చాలా సాధారణంగా లేదా భయంకరంగా అనిపించినా, వ్యంగ్యచిత్రంలా దానిలో ఎపుడు అది దేనికయితే

ప్రాతినిధ్యం వహిస్తుందో ఆ ఉనికి ఉంటుంది. ఎవరో ఒకరు ఒక పూజారి లేదా దీక్షనిచ్చే గురువు లేక సాధువు లేక సన్యాసి, ఎవరికైతే ఆ శక్తి ఉంటుందో (నాకు సాధారణంగా పూజారులు ఈ కార్యాన్ని చేస్తుంటారు.) వారు ఆ శక్తిని, దాగి వున్న ఆ దివ్యసమక్షానికి తీసుకురాగలరు. అది సత్యం. అక్కడ శక్తి ఉనికి రెండూ ఉంటాయి. అంతే కానీ జనులు పూజించే చెక్క, లోహం లేదా రాతితో చేసిన రూపంలో కాదు, అది దివ్య సాన్నిధ్యం.

కాని యూరపు దేశీయులకు ఈ అంతరంగికమయిన అనుభూతి తెలియదు ఏ మాత్రం తెలియదు. వారికి అంతా ఉపరితలంపైనే. అది కూడా కాదు. వెనుక ఏమీలేని ఒక పలుచని బాహ్యాపొర. వారు దానిని అనుభూతి చెందలేరు. కానీ దివ్య సన్నిధి అక్కడ ఉండటం సత్యం. అది సంపూర్ణంగా నిజం. అందుకు నేను హామీ యిస్తాను.

కానీ ఈ విగ్రహాలు కేవలం మానవ సృజనలు మాత్రమే కాక అవి స్వయం సంభవాలు కాదా?

ఈ విషయంలో నాకు కొన్ని చాలా ఆసక్తికరమైన అనుభవాలున్నాయి. జనులు ఎలా ఆలోచిస్తారు? ఎలా అనుభూతి చెందుతారనే విషయంపై. కొంతకాలం క్రితం ఒకరు శ్రీఅరవిందుల చిన్న విగ్రహాన్ని తయారు చేశారు. అతను దానికి ఒక కుండలాంటి పొట్టను పెట్టాడు. నాకది విచిత్రంగా అనిపించింది. నేనతన్ని అడిగాను. అలా ఎందుకు తయారు చేశావని. అతను ఇలా వివరించాడు. ఇది కంటికి కనిపించే ఒక సాధారణమయిన బొమ్మే అయినప్పటికీ, అది మీరు భగవంతుడని భావించే ఒక వ్యక్తి యొక్క, మీరు పూజించే వ్యక్తి యొక్క లేదా దైవమో, అవతార పురుషుని రూపం కనుక లేదా కేవలం ఒక గురువు యొక్క రూపం అయినా దానిలో ఆయన ఉనికికి చెందిన ఆత్మ మరియు శక్తి నిక్షిప్తమై ఉంటాయి. మీరు దానిని పూజిస్తారు. అది ఎంత మోటుగా ఉన్నా, ఆ రూపం హాస్యాస్పదంగా ఉన్నా సరే.

ఒకతను నాది శ్రీ అరవిందులది ఒక పెద్ద చిత్రపటం వేశాడు. దానిని తీసుకవచ్చి నాకు చూపించాడు. అది చాలా భయంకరంగా

ఉంది. భౌతిక దృష్టికది భయంకరంగానే ఉంది. భయంకరంగా ఉంది అన్నాన్నేను. దీనిని ఉంచుకోలేము. ఇంతలో వెంటనే ఎవరో 'ఇది నాకు కావాలి' అన్నారు. దీనిని మా యింటిలో పెట్టుకుని పూజ చేస్తాను. 'ఆహ్ కాని ఇలాంటిదానిని ఎలా పెట్టుకోగలవు' అనకుండా ఉండలేకపోయాను. (అది మరీ అంత వికృతంగా లేదు.) అలాంటి పటానికి ఎలా పూజ చేయగలవు? అది చాలా శూన్యంగా, సామాన్యంగా ఉంది' అన్నాను. 'నాకది శూన్యం కాదు. అందులో పూర్తి సన్నిధి, శక్తి ఉంది'. అని సమాధానం చెప్పాడు. 'నేనలానే దానికి పూజ చేస్తాను. 'సన్నిధి మరియు శక్తి'. ఇదంతా ఒక ప్రాచీన భావనపై ఆధారపడి ఉంది. మనం విగ్రహమని తృణీభావంతో చూసే రూపం ఆ దేవత యొక్క బాహ్య రూపం. ఎలా ఉన్నప్పటికీ ఆ దేవతకు ప్రాతినిధ్యాన్ని వహించే ఉనికి అక్కడ ఉంటుంది. ఎవరో ఒకరు ఒక పూజారి, లేదా దీక్షనిచ్చే గురువు - ఒక సాధువు లేదా సన్యాసి, ఆ శక్తి వున్న వ్యక్తి (సాధారణంగా ఇది ఒక అర్చకుని పని) ఎవరైతే శక్తిని, సన్నిధిని ఆ విగ్రహంలో నింపగలుగుతారో వారిది. అది సత్యం. ఎంతో వాస్తవం, ఆ శక్తి సాన్నిధ్యాలక్కడ ఉంటాయి. అంతేకానీ (చెక్క, లోహం, రాయితో చేసిన రూపం మాత్రమే కాదు) అక్కడ పూజింపబడేది ఆ దైవసన్నిధి.

యూరోపియన్లకు ఈ అంతరంగిక భావన తెలియదు. వారికి అంతా ఇలా ఉంటుంది. (శ్రీమాత చేతితో సంజ్ఞ చేస్తారు) ఒక ఉపరితలం - అది కూడా కాదు.పైపైన ఒక పొర లాంటిది. దాని వెనుక వారు మరి దేనిని అనుభూతి చెందలేరు. కానీ అక్కడ దైవ సాన్నిధ్యం ఉండటమనేది ఒక ఉత్కృష్టమైన సత్యం. నేను దానికి హామీ ఇస్తాను.

జనులు నాకు వివిధ రకాల దేవతల విగ్రహాలను యిస్తూ ఉంటారు. లోహం, చెక్క లేదా దంతంతో చేసినవి. వాటిని నేను చేతిలోకి తీసుకోగానే ఆ దేవత అక్కడ ఉంటుంది. నా దగ్గర ఒక గణేష్ విగ్రహముంది (నాకు చాలా ఇవ్వటం జరిగింది) అది చేతిలోకి తీసుకొని ఒక్క క్షణం దాని వైపు చూసినపుడు, తానక్కడే ఉంటాడు. నా మంచం ప్రక్కన నేను ఎక్కడ పని చేస్తానో, ఎక్కడ భోజనం, ధ్యానం చేస్తానో అక్కడొక చిన్న

విగ్రహముంది. మరొకటి బద్రీనాథ్ హిమాలయాల నుండి వచ్చిన నారాయణుడి విగ్రహం. ఆ రెంటినీ నా చేతిరుమాలకి పేపర్‌వెయిట్‌గా వాడుతుంటాను. చేతి రుమాళ్లు మంచం పక్కన ఒక చిన్న టేబిల్ మీద ఉంటాయి. వాటిపైన ఈ గణపతి, నారాయణ విగ్రహాలను పెడతాను. వాటిని నేను తప్ప ఎవరూ తాకరు. వాటిని పైకెత్తి ఒక తాజా చేతిరుమాల్‌ను తీసుకొని, వాటిని యధాస్థానంలో ఉంచేస్తాను. ఒకసారి నా వేలిగోళ్ళకి పాలిష్ కలిపాను. వేసుకొనే ముందు కొంత గణపతి నుదిటిపైనా, పొట్టపైన, గోళ్ళకి వేశాను. మేము చాలా స్నేహంగా, సత్సంబంధాలను కలిగి ఉంటాం. అందుకని నాకిదంతా ఎంతో సత్యం.

నారాయణుడు ముందు వచ్చాడు. తనని నేనిక్కడ పెట్టి ఆనందంగా ఉండమని చెప్పాను. కొంత కాలం తరువాత చాలా చక్కటి గణపతి విగ్రహమిచ్చారెవరో? అప్పుడు నేను నారాయణుడిని అడిగాను. నేనాయన అనుమతి తీసుకోలేదు. 'కోపం తెచ్చుకోవద్దు, కానీ నేను నీకొక మంచి నేస్తాన్ని యిస్తున్నాను. నాకు మీరిద్దరూ కూడా యిష్టమే. ఒకరి కన్నా ఒకరేమీ ఎక్కువ కాదు. తను ఇంకా బాగున్నాడు, కానీ నువ్వు నారాయణుడివి కదా? ఇలా పొగిడేదాన్ని, ఉల్లాస పరిచే విషయాలు చెప్పేదాన్ని, దానితో చాలా సంతోషంగా ఉండేవాడు.

నాకెపుడూ అలానే ఉండేది. ఎప్పుడూ కూడా. మతపరమైన భావన ఏమీ ఉండేది కాదు. జనులు ముఖ్యంగా యూరపు దేశస్థులు భావించినట్లుగా ఉండేది కాదు. ఆంగ్లభాషలో దానిని ఒక విధమయిన భయం అనవచ్చు. అటువంటిది లేదు. ఆ అనుబంధం నాకు నవ్వు తెప్పించేది. ఆ వెనుక ఉన్న సాన్నిధ్యాన్ని నేను అనుభూతి చెందేదాన్ని.

*శ్రీమాత : ఒక శిష్యునితో సంభాషణ, ఏప్రిల్ 29,1961*

## ఆరాధనలోని మూడు భాగాలు

దివ్య ప్రేమ, ఆరాధనకు చెందిన ఒక సంపూర్ణ చర్య ఒకే ఒక మొత్తం యొక్క ప్రకటనలో మూడు భాగాలుంటాయి - కర్మలో దైవాన్ని ఆచరణాత్మకంగా ఆరాధించడం, కొంత దృష్టిని, అన్వేషణను, లేదా దైవంతో కొంత అనుబంధాన్ని ప్రకటించే చర్య రూపంలో ఒక సంకేతాన్ని పూజించడం, ఒక ఆంతరిక ఆరాధన, ఏకతకై పరితాపం, లేదా హృదయము, ఆత్మ, అంతరాత్మ అధ్యాత్మలో ఏకత యొక్క అనుభూతి.

*శ్రీ అరొబిందో, సింథసిస్ ఆఫ్ యోగా, భాగం 20, పుట 152-153*

## మొదటి రెండు భాగాలు అంత బాగా అర్థం కాలేదు.

అక్కడ చర్యకు సంబంధించిన ఒక శుద్ధ భౌతిక రూపం ఉంది, కొన్ని మతారాధన వ్యవస్థలలో అర్పణను ప్రకటించడానికి ఒక ప్రత్యేక సంజ్ఞ, ఒక ప్రత్యేక చలనం ఉన్నట్లుగా అక్కడ చర్యకు సంబంధించిన ఒక శుద్ధ భౌతిక రూపం ఉంది. అది పూర్తిగా భౌతికమైనది, ఉదాహరణకు అగరుబత్తి వెలిగించడం, అర్పణలను చేయడం, లేదా ఒక దేవాలయం దర్శించడం, ఒక విగ్రహాన్ని అలంకరించడం, వాస్తవానికి ఇవన్నీ శుద్ధ భౌతిక చర్యలు.

రెండవ భాగం ఒక రకమైన మానసిక అర్పణ, ఇది ఒక సంకేత నిర్వహణ చర్యను తయారు చేసేది. కేవలం అగరుబత్తి వెలిగించడంతో తృప్తి చెందని వ్యక్తి ఈ అగరుబత్తి వెలిగిస్తున్నపుడు ఒక సంజ్ఞను సంకేతంగా తయారుచేసుకుంటాడు, ఉదాహరణకు శరీరంలో ఆకాంక్ష జ్వలిస్తున్నట్లుగా, లేదా తనను తాను కరిగించుకుంటూ ఆ అగ్ని శుద్ధతలో అర్పించుకుంటున్నట్లుగా భావన చేసుకుంటాడు.

చివరగా ఈ రెండింటి వెనుక సంయోగం కోసం ఒక ఆకాంక్ష ఉంది. నువ్వు నిర్వర్తించే ఈ చర్యలు, వాటి నుండి తయారు చేసిన సంకేతం దైవానికి ఇంకా ఇంకా దగ్గర చేయడానికి కేవలం ఒక సాధనంగా, ఆయనతో సంయోగానికి నీకు అర్హతను కల్పించేదిగా కావచ్చు.

ఆరాధనా చర్య సంపూర్ణం కావాలంటే ఈ మూడు అంశాలు ఉండాలి. అంటే కొంత శుద్ధ భౌతికమైనది, కొంత మానసికమైనది, కొంత అంతరాత్మ సంబంధమైనది, అంతరాత్మిక ఆకాంక్ష.. ఈ మూడింటిలో ఒకటి లేకుండా ఏ రెండు మాత్రమే ఉన్నా అది అసంపూర్ణమే. నియమానుసారంగా ఈ మూడు చాలా అరుదుగా చైతన్యంతో కలిసి ఉండటం జరుగుతుంది. అది అసాధారణ నిజాయితీ, అర్పణల అస్తిత్వాలను ఉత్పన్నం చేస్తుంది. : అన్ని భాగాలలో మొత్తం అస్తిత్వం ఈ చర్యలో పాల్గొంటుంది.

దేవుళ్ళు, దేవతల ప్రతిమలు

*CWM 8; 234-35*

నిజానికి మానవ సృష్టి అయిన ఈ రూపాలలో కొన్నింటిని నేను ప్రాణిక, మానసిక ప్రపంచాలలో చూశాను. అతీతం నుండి అభివ్యక్తమయ్యే ఒక శక్తి అక్కడ ఉంది. కానీ అసత్యానికి చెందిన ఈ త్రిప్రపంచాలలో మనిషి తన స్వంత ప్రతిమలో భగవంతుని సృష్టించాడు. మానవుని నిర్మాణాత్మక భావనా ఫలితంగా ఇంచుమించు రూపాల్లో అభివ్యక్తమయ్యే అస్తిత్వాలు ఇవి., ఇది నిజంగా భయంకలిగించేది ! ఈ నిర్మాణాలను కొన్నింటిని నేను చూసాను.....(నిశ్శబ్దం) ఇదంతా చాలా అస్పష్టంగా, దురవగాహంగా, అనిర్వచనీయంగా ఉంటుంది.

కొంతమంది దేవుళ్ళు ఇతరుల కన్నా అనాదరణకు గురయ్యారు. ఉదాహరణకు మహాకాళీ, పాపం, ఎటువంటి విషయాలు ఆమె పట్ల జరిగాయి, మీకు తెలుసు..... అది నిజంగా చాలా భయం కలిగించేది., ఊహించశక్యం గానిది ! కానీ ఈ రూపం కేవలం చాలా నిమ్న ప్రపంచంలో జీవిస్తుంది...... అవును అత్యంత నిమ్న ప్రాణికంలో. ఈమె కుండేది వేరేది..... గుర్తించశక్యంగాని మూలం నుండి, ఎంతో దూరంలో ఉన్న ఒక ప్రతిబింబం. అయితే సాధారణంగా మానవ చైతన్యం చేత ఆకర్షించబడినది ఇది. ఒక విగ్రహం తయారు చేసేటప్పుడు పూజారి ఒక రూపాన్ని కిందకు తీసుకు వస్తాడు. నిత్యకృత్యంగా ఆచారం

కొనసాగించినపుడు అతను తనను తాను ఆవాహనకు చెందిన ఒక ఆంతరిక స్థితిలో ఉంచుకుని, శక్తి నింపటానికి ఆ విగ్రహంలోకి ఒక రూపాన్ని లేదా ఒక ఉద్భూతమయిన దాన్ని క్రిందకు తీసుకురావడానికి ప్రయత్నిస్తాడు. ఒకవేళ పూజారి నిజమైన ఒక ఉపాసనా శక్తి ఉన్నవాడైతే అతను విజయవంతమవుతాడు. కానీ సాధారణంగా ప్రతిదానికి మినహాయింపులు ఉంటాయి, వీళ్ళు సంప్రదాయానికి అనుగుణంగా సామాన్య భావనలలో నైతిక శిక్షణ పొంది ఉంటారు. వారు ఆవాహన చేసుకొనే దేవత గురించి వారు ఆలోచించినప్పుడు, ఆ దేవతకు ఇవ్వబడిన అన్ని విశిష్ట లక్షణాల గురించి, ప్రకటనల గురించి ఆలోచిస్తారు, ఆ ఆవాహన ప్రాణిక లోక అస్తిత్వాలను లేదంటే ఉత్తమంగా మానసిక లోకాల అస్తిత్వాలను సంభోదిస్తూ ఉంటుంది తప్ప దివ్య అస్తిత్వానికి కాదు. ఈ చిన్న అస్తిత్వాలే ఒక విగ్రహంలో లేదా ఇంకో విగ్రహంలో అభివ్యక్తమవుతాయి. చిన్న చిన్న దేవాలయాల్లో, గృహాలలో ఉండే ఈ విగ్రహాలు- కొంతమంది తమ ఇళ్ళలో చిన్న కోవెలలు, నిర్మించుకుని అందులో వారు పూజించే దేవత ప్రతిమను పెట్టుకుంటారన్నది మీకు తెలిసిన విషయమే - ఆ అస్తిత్వాలు ఆ ప్రతిమలలో అభివ్యక్తమవుతాయి, కొన్నిసార్లు పర్యవసానాలు దురదృష్టకరంగా ఉండచ్చు, ఎందుకంటే ఈ రూపాలు నిజమైన దేవతకు చాలా భిన్నంగా వుండవచ్చు.... అవి అసంబద్ధ రూపనిర్మాణాలు. కొన్ని కుటుంబాలలో వారు పూజించే కాళీ రూపాలు నిజమైన భీకర ఆకారాలు.

*CWM 6; 275-76*

## మత సంబంధ స్మారక చిహ్నాలు

అన్ని మతాల స్మారక చిహ్నాలలో అత్యున్నత మతం అని చెప్పుకునే దాంట్లో, అది ఫ్రాన్స్ గానీ, జపాన్ గానీ వేరే ఏ ఇతర దేశమైనా ఎప్పటికీ ఒకే రకమైన దేవాలయాలు గానీ, చర్చిలు గానీ, ఒకే దేవతలు గానీ ఉండవు, కానీ నా అనుభవం అన్ని చోట్ల చిన్న చిన్న తేడాలతో దాదాపు ఒకటేగా ఉంటుంది. చర్చిలో ఏకీకృతమైన ఏ శక్తి అయినా కేవలం

విశ్వసనీయత మీద, భక్తుల విశ్వాసం మీద ఆధారపడి ఉంటుంది. అలాగే అక్కడ యథార్థంగా ఉన్న శక్తికి, వారు అనుభూతి చెందే శక్తికి ఇంకా భేదం ఉంది. ఉదాహరణకు నేను ఫ్రాన్స్ లో అత్యంత సుందరమైన ప్రధాన చర్చిని చూశాను, కళాత్మక దృక్పథంతో చూస్తే అది అత్యంత శ్రేష్ఠమైన స్మారక చిహ్నాలలో ఒకటి- అత్యంత పవిత్ర స్థలంలో ఒక పెద్ద నల్లని ప్రాణిక సంబంధ సాలెపురుగును చూశాను, అది తన గూడును అల్లి మొత్తం అంతటా విస్తరింపజేసింది, అది ప్రజల భక్తి, ప్రార్థనల నుండి ప్రసరించే శక్తులన్నింటినీ పట్టుకుని, లోపలకు తీసుకుంటూ ఉంది.. అది అంత ఆహ్లాదకర దృశ్యం కాదు అక్కడ ఉన్నవారు, ప్రార్థిస్తున్న వారు ఒక దివ్యస్పర్శను అనుభూతి చెందుతూ, ఆ ప్రార్థనల నుండి వచ్చే అన్ని రకాల శబ్దాలను అందుకుంటున్నారు, కానీ అక్కడున్నదేమంటే ఇదే. అది వారి లోని చెడును మంచిగా పరివర్తన చెందిస్తుందని వారి విశ్వాసం, వాళ్ళ విశ్వాసం వాళ్ళకుంది. నిజానికి నేను అక్కడకు వెళ్ళి వారితో అన్నాను, " మీరు భగవంతుని ప్రార్థిస్తున్నామనుకుంటున్నారా? అది మీ శక్తులన్నింటితో పోషించబడే ఒక పెద్ద ప్రాణిక సాలెపురుగు. "యథార్థానికి అది అంత దయతో ఉన్నది కాదు. అందువల్లనే చాలా సమయాల్లో ఈ రకమైనది చాలామటుకు అన్నిచోట్ల ఉంది. అక్కడ ఉన్నది ఒక ప్రాణిక శక్తి, ఈ ప్రాణిక అస్తిత్వాలు మనుష్యుల భావోద్వేగ స్పందనలతో పోషించబడతాయి, చాలా కొద్దిమంది, అతికొద్దిమంది, అల్పసంఖ్యలో ఒక నిజమైన మత భావనతో చర్చికి, దేవాలయానికి వెళతారు, అది భగవంతుని ప్రార్థించడానికో, దేనినైనా అడుక్కోవటానికో కాదు కానీ తమను తాము అర్పించుకోవడానికి, కృతజ్ఞత, ఆకాంక్షలను ఇచ్చుకోవడానికి, తమను తాము ఇచ్చుకోవడానికి. ఇలా చేసే వారు మిలియనుకు ఒక్కరుంటారు. ఆ వాతావరణాన్ని మార్చే శక్తి వారికి ఉండదు. వారు అక్కడుండే దాన్ని దాటడానికి ప్రయత్నించి, వేరే ఎక్కడకో వెళ్లి అక్కడ దివ్యత్వాన్ని స్పర్శిస్తారు. అధికభాగం మనుష్యులు మూఢ నమ్మకం, అహంకారం, స్వ-ఆసక్తి కారణంగా అక్కడకు వెళ్ళి, ఈ విధమైన వాతావరణాన్ని సృష్టిస్తారు, మీరు చర్చికి గానీ, గుడికి గానీ

వెళ్లినపుడు ఈ వాతావరణాన్నే శ్వాసిస్తారు. కేవలం ఒక మంచి అనుభూతితో అక్కడకు వెళ్లినపుడు మాత్రమే "ఇది ధ్యానానికి ఎంత నిశ్శబ్దమైన ప్రదేశం!" అని మీకు మీరు చెప్పుకుంటారు.

క్షమించాలి, కానీ అది అలాగే ఉంటుంది. నేను ఉద్దేశ్యపూర్వకంగా ఈ ప్రయోగాన్ని ప్రతిచోట కొంచెంగా చేసాను చిన్న ప్రదేశాలలో ఒక చిన్న గ్రామంలోని చర్చిలో ధ్యానానికి అనువైన నిశ్శబ్ద స్థలాన్ని కనుగొన్నాను, అది చాలా నిశ్చలంగా, చాలా నిశ్శబ్దంగా కొంత ఆకాంక్షతో ఉంది. కానీ ఇలాంటిది చాలా అరుదు ! నేను ఇటలీలోని అందమైన చర్చ్‌లను, అద్భుతమైన ప్రదేశాలను చూశాను. అవి పూర్తిగా ఈ ప్రాణిక అస్తిత్వాలతో, పూర్తి భయంతో నిండి ఉన్నాయి. వెనిస్‌లో ఒక బ్యాసిలికా చిత్రం మీద పనిచేస్తున్నప్పుడు జరిగినది నాకు గుర్తుకొచ్చింది. ఒక మతగురువు ఒక నిస్సహాయ స్త్రీ చెప్పే కార్యాలను వింటున్నాడు. అది నిజంగా భయం కలిగించే దృశ్యం,! ఆ మత గురువు ఎవరు, అతని గుణం ఎలాంటిది ? అన్నది నాకు తెలియదు, అతను కనిపించడు.- మీకు తెలుసనుకుంటా! వాళ్ళు కనిపించరు. వాళ్ళు ఒక పెట్టెలో ఉంటూ కటకటాల చట్రం నుండి చెప్పేదాన్ని వింటారు. అతని పై ఎంత అంధకారంతో పీల్చే శక్తి ఉందంటే, ఆ నిస్సహాయ స్త్రీ ఒక దుర్భర భయంకర స్థితిలో ఉంది, చూడటానికి అది నిజంగా బాధాకరంగా ఉంది. దానిలో ఏదో పవిత్రత ఉందని వీరంతా విశ్వసిస్తారు ! కానీ అది వ్యతిరేక ప్రాణశక్తులు అల్లిన గూడు, ఈ శక్తులు దీన్నంతా తమ ఆహారంగా ఉపయోగించుకుంటాయి. అంతేగాక అగోచర ప్రపంచంలో ప్రాణిక లోకానికి చెందినవి తప్ప వేరే ఏ అస్తిత్వాలు పూజించబడటానికి ఇష్టపడవు. దీనితో ఇవి చాలా సంతోషిస్తాయి. అలా ఇది వీటికి ప్రాముఖ్యత నిస్తుంది. ఇవి గర్వంతో నిండిపోయి, చాలా సంతోషానుభూతి పొందుతాయి, వీటిని పూజించే మనుష్యుల గుంపు వీటికి దొరికినపుడు చాలా తృప్తి చెందుతాయి.

CWM 6: 194-95

కానీ నీవు నిజమైన దేవతలను తీసుకొంటే వాళ్ళు వీటికి అసలు విలువనివ్వరు. వారసలు ఆరాధింపబడటానికి ఇష్టపడరు. లేదు, ఈ పద్ధతి వారికి ఎలాంటి ప్రత్యేక సంతోషాన్ని కల్గించదు. ఈ ఉపాసనలకు వాళ్ళు సంబరపడతారని తలంచకు. ఎందుకంటే వారికి గర్వముండదు. ఈ దర్పం కారణంగానే ఒక మనిషి పూజింపబడటానికి ఇష్టపడతాడు, మనిషికి గనుక గర్వమనేది లేకుంటే అతనూ ఆరాధింపబడటానికి ఇష్టపడడు. ఆ దేవతలు గనుక ఒక మంచి తలంపును, లేక ఒక ఉత్తమ అనుభూతిని, లేదా స్వార్థ రహితమైన పూనికను లేదా కుతూహలాన్ని ఒక హర్షాతిరేకతను, ఆధ్యాత్మిక ఆహ్లాదాన్ని చూస్తే, అవిగో అవన్నీ పూజలు, ఉపాసన క్రియలు, ప్రార్థనలకంటే ఒక గొప్ప అపరిమితమైన మూల్యాన్ని వారికి కనబర్చుతాయి.

గట్టిగా చెబుతున్నాను, ఇది చాలా గంభీరమైన విషయం. నిజమైన దేవతను కుర్చీ వేసి కూర్చోబెట్టి, నిర్బంధించి, నీవు పూజ చేసేంత సేపు అలాగే నిశ్చలంగా ఉంచితే, బహుశ ఆ దేవత నీవు చేసేది చూసి నవ్వుకొంటాడు. ఖచ్చితంగా ఈ పద్ధతి ఆ దేవతకు సంతోషాన్నివ్వదు. అతడు నీ పొగడ్తకు లోనయ్యి లేక నీ పూజలకు సంతోషపడి సంబరపడిపోడు. నీవు ఆ ఆలోచనను నుండి విముక్తుడవు కావాలి. ఆధ్యాత్మిక, భౌతిక లోకాలకు మధ్య పూర్తిగా ప్రాణిక జీవులకు చెందిన పరగణానే ఉంది. ఈ రాజ్యమంతా లేదా ఈ పరగణా అంతా ఇలాంటి విషయాలతో నిండి ఉంది. ఆ జీవులు ఈ విషయాలపైనే బ్రతుకుతున్నాయి. ఆ ఒక్కొక్క జీవి ఎంత గొప్ప సంఖ్యలో తనను విశ్వసించే వారిని, భక్తుల్ని, ఆరాధకుల్ని కల్గి ఉంటే అంతగా ఉబ్బితబ్బిబ్బవుతుంది. దేవతలు దేనికి విలువనిస్తారో ఎవరైనా ఊహించగలరా? దేవతలు - అసలైన దేవతల గురించి నేను మాట్లాడుతున్నాను. వారు అధిమానస దేవతలైనా కావచ్చు కానీ వారిలో కూడా ఈ రకమైన అంశముంటుంది. కాబట్టి మానవీయ లోపాలను స్వీకరించే వారిగా కనిపిస్తారు. కానీ ఇవన్నీ

ఉన్నప్పటికీ వారు నిజంగా ఉచ్చతర చేతనతో ఉన్నారు. ఇక ఇదంతా వారిని సంతోషపర్చదు. నిజంగా మంచితనంతో చేసే కర్మ, వివేకం, నిస్వార్థత లేదా సూక్ష్మ అవగాహన లేదా నిజాయితీతో కూడిన ఆకాంక్షలన్నవి వారికి ఈ అల్ప మతపరమైన క్రియల కంటే అత్యున్నత గుణ కర్మలు. వాటికి వీటికి లెక్కలేనంత వ్యత్యాసం. ఉదాహరణకి కాళీ పేరు మీద ప్రాణిక అస్తిత్వాలకు సంబంధించిని చాలా ఉన్నాయి. వాటికి చాలా భయంకర రూపాలను కల్పించడం జరిగింది. చాలా కుటుంబాలు వాటిని వాళ్ళవాళ్ళ కులదేవతలుగా ఆరాధిస్తారు. వాళ్ళు చాలా భయంకరమైన ప్రాణిక శక్తితో ఉంటారు. వాళ్ళింట్లో పూజించే కాళిక పట్ల ఎంతో భయంతో ఉండే జనుల్ని నేను ఎరుగుదును. నిజంగా ఒక చిన్న తప్పు చేయడానికి కూడా వణికిపోతారు. ఎందుకంటే ఏదైనా పెద్ద ఆపద వస్తే అది కాళికే కల్పించిందని తలంచుతారు. ఈ ఆలోచనే చాలా భయానకమైనది. ఆ శక్తులూ, జీవులూ నాకు తెలుసు, బాగా ఎరుగుదును. అవన్నీ నిజానికి ప్రాణిక శక్తులు, ప్రాణిక రూపాలు, చెప్పాలంటే మనిషి ఆలోచననే వాటికి ఒక రూపాన్నిస్తుంది. అవి ఏమి రూపాలు! మనుషులే నిజానికి అలాంటి భయంకరమైన, క్రూరమైన వాటిని పూజిస్తారు; పాపం ఆ అల్పదేవతలు పొందేదేముంటుంది, వీరు నమ్మి చేసే స్తుతి కన్నా మించి వారికేముంటుంది...

ఈ దృక్కోణంలో చూస్తే, ఒకప్పటికైనా ఈ మనుషులు ఈ మత వాతావరణం నుండీ బయట పడితే మంచిది, భయంతో నిండిపోయి, ఒక రకంగా గుడ్డిగా మతానికి మూఢంగా సమర్పించుకోవడంతో దుష్టశక్తులు దీనిని ఒక భయంకరమైన అవకాశంగా తీసుకొన్నాయి. నిరాకరించే తరుణం, సాకారాత్మక ధోరణి, మూఢ నమ్మకం నుండి విముక్తుణ్ణి చేయడం పూర్తిగా అత్యావశ్యకం. క్రూరమైన, ప్రాణిక శక్తులను శరణు పొందడం నుండీ బయట పడినప్పుడే, మనిషి నిజంగా ఆధ్యాత్మిక ఔన్నత్యాలకు ఉద్గమించగలడు. యథార్థ శక్తికి, నిజమైన చేతనకు, నిజమైన సత్య శక్తులకు నిజమైన ఉపకరణంగా, సహాయకారి కాగలడు.

ఉన్నతంలోకి ఆరోహించడానికి మునుపు వీటన్నింటిని వెనుక వదిలివేసి ముందుకు సాగాలి.

*CWM 6:195-97* శ్రీమాత

## ఆరాధనకున్న ఆధ్యాత్మిక విలువ

**మధురమయి మాతా! దుర్గాదేవికి, కాళికాదేవికి చేసే ఆరాధనలకు ఏదైనా ఆధ్యాత్మిక విలువ ఉన్నదా?**

ఆ ఉపాసన ఎవరు చేస్తున్నారు అన్నదానిపై అది అధారపడి ఉంటుంది.

ఆధ్యాత్మిక విలువకు సంబంధించిన ప్రాముఖ్యతను గూర్చినది కాదు. సమగ్రత, యోగానికి సంబంధించిన సంపూర్ణ సత్యం కోసం ఒకానొక రూపానికో లేదా మరోదానికో తన ఆకాంక్షను పరిమితం చేసుకోకుండా ఉండటం ముఖ్యం.

కాని ఆధ్యాత్మిక దృక్కోణంలో ఉపాసనకు ధ్యేయ వస్తువు ఏదైనా కానీ జరిగేది నిజాయితీతో కూడినదై ఉంటే ఆత్మ సమర్పణ సమగ్రంగా, సంపూర్ణంగా ఉంటే, ఆ ఆధ్యాత్మిక ఫలితం దానికి తగినట్లుగానే ఉంటుంది; ఎందుకంటే నీవు ఏ ధ్యేయ వస్తువునైనా తీసుకో, దాని ద్వారా అదే అయినా, దానికి విరుద్ధమైనదైనా నీ సమర్పణ, నిజాయితీకి అనుపాతంలో, కొలమానంలో ఉంటే పరమ యథార్థ తత్వాన్ని చేరుకోగలవు.

అందువల్లనే ఎప్పుడూ ఇలా చెప్పడముంటుంది. దైవానికి చెందిన ఏ పార్శ్వాన్ని నీవు ఉపాసిస్తున్నావు, లేదా ఎవరిని నీవు మార్గదర్శిగా ఎంచుకొన్నావన్నది విషయమేమీ కాదు. నీ స్వీయ సమర్పణ సంపూర్ణంగా, ఖచ్చితంగా పూర్తి నిజాయితీతో ఉంటే ఆధ్యాత్మిక లక్ష్యాన్ని చేరుతావన్నది నికరం.

కానీ ~~ఈ~~ పూర్ణ యోగాన్ని మాత్రం సిద్ధింపజేసుకోవాలనుకొన్నప్పుడు, అక్కడ వచ్చే ఫలితం, ఇక్కడ వచ్చే ఫలితం ఒకే మాదిరిగా ఉండదు. ఏ

విధంగానూ నీకు నీవు పరిమితమవ్వకూడదు, ఆఖరికి నీ సమర్పణ మార్గంలోనూ, ఈ రెండూ చాలా భిన్నమైన విషయాలు.

ఆధ్యాత్మిక సిద్ధి ఇంతకు ముందు అవగతమయినట్లు, ఇప్పుడు సాధారణంగా అర్థమౌతున్నట్లు నీ లోపల లేదా ఒక రూపం ద్వారా లేక వేరే విధంగా, ఏదో ఒక మార్గంలో పరమాత్మతో సమైక్యమవ్వడం, పరిపూర్ణంతో, పరాత్పరంతో నీ అస్తిత్వం సమ్మిళితం కావడం, నీ ప్రత్యేక వ్యక్తిత్వం ఈ సమ్మేళనంలో అదృశ్యమైపోవడం. దేనికైతే నిన్ను నీవు ఇచ్చుకోవాలని ఎంపిక చేసుకొంటావో దానికంటే పూర్తి నిజాయితీగా, సమగ్రంగా స్వీయ సమర్పణ చేసుకోవడం మీదే అది పూర్తిగా ఆధారపడి ఉంది. ఎందుకంటే నీ ఆకాంక్షలోని నిజాయితీ అన్ని పరిమితుల్ని దాటి, పరమాత్మను కనుగొనేలా చేస్తుంది. ఎందుకంటే అతడిని నీలోనే నీవు మోస్తున్నావు. నీవు అతడిని బయట అన్వేషించినా, అంతరంగంలో వెతికినా, ఒక రూపంలో వెతికినా, నిరాకారంలో వెతికినా నీ ఆకాంక్ష తగినంత నిజాయితీతో, నీ సంకల్పం తగినంత సత్యతతో ఉంటే చాలు. నీవు లక్ష్యాన్ని చేరుకొన్నట్లే.

శ్రీ అరవిందులు చెబుతున్న దానికి ప్రశంసాపూర్వకమైన కదలిక తెచ్చుకొందామనుకుంటే, నీలో సిద్ధింపజేసుకున్న ఈ ఏకత్వంతో ఈ బాహ్య చేతనలోకి, ప్రపంచంలోకి తిరిగి వచ్చి, ఈ బాహ్య చేతనను, ప్రపంచాన్ని రూపాంతరీకరించాలనుకొన్నప్పుడు నిన్ను నీవు ఏ విధంగానూ పరిమితం చేసుకోలేవు. ఇక మరోవిధంగా నీ కార్యాన్ని నెరవేర్చనూలేవు. ప్రధానంగా దైవంతో ఏకత్వాన్ని అన్ని రూపాల్లో, అన్ని పార్శ్వాల్లో ఆయనను చేరుకొనేందుకు ఉపయోగించిన ప్రతిమార్గంలోనూ కనుగొనేలా ఉండాలి. దానికి పైగా వెళ్ళి నీవొక కొత్త మార్గాన్ని కనుగొనాలి.

నీ యోచనలో మొదట ఈ విషయాన్ని స్పష్టపర్చుకోవాలి. ఇదే అసలు ప్రాముఖ్యత కల్గిన విషయం. ఇతర ఆధ్యాత్మిక సాక్షాత్కారాల దృష్ట్యా పూర్ణ యోగాన్ని గూర్చి తికమక పడకూడదు. అవన్నీ ఎంతో ఉన్నతంగా ఉండవచ్చు. కానీ అవి చాలా పరిమిత క్షేత్రానికే కట్టుబడి ఉన్నాయి. ఎందుకంటే వాటన్నింటి గమనం లోతుగా మాత్రమే ఉంటుంది.

నీవు రంధ్రాన్ని తొలచవచ్చు. నీ ఆకాంక్షతో, దేనిలోకైనా లోతుగా చొచ్చుకుపోవచ్చు. నీ ఆత్మ సమర్పణ సంపూర్ణం, సమగ్రం, పరిపూర్ణం అవ్వగల్గి, ఆ నిజాయితీపైన, నీ ఆకాంక్షలోని తీవ్రత, చిత్తశుద్ధిపైన అంతా ఆధారపడి ఉంటుంది. నీవు ఎంపిక చేసుకొన్న రూపంపై ఇది ఆధారపడి లేదు. ఆవశ్యకత కొద్దీ రూపానికి ఆవల ఏమున్నదో కనుగొనే నిమిత్తం నీవు దానిగుండా పోవాలి. కానీ, నీవు గనుక నిన్నూ నీ స్వభావాన్ని రూపాంతరీకరించుకోవాలనుకొంటే, నూత్న ప్రపంచానికి చెందిన సృష్టిలో భాగం పంచుకోవాలనుకొంటే, ఈ ఆకాంక్ష, తిన్నని, నిశిత లక్ష్యం అసలు సరిపోదు. ప్రతి అంశాన్ని, సమస్తాన్ని తన చేతనలో సమ్మిళితం చేసుకోవాలి.

సహజంగానే అది చాలా కష్టం

CWM 8:243-45

## ఉపాసననకున్న మతపరమైన విలువ

మదర్, మానుష స్వభావంలో ఈ దివ్య మూలకం ఏమిటి, అదెప్పుడూ దాని ఆధ్యాత్మిక పరితోషాన్ని పూర్తి చేసుకొనే సంకేతాలనే కోరుతుంది?

ఇది స్పష్టం వ్యక్తిలోని ఆ భాగం విరూపాలతో, జీవితం నుండీ తప్పుకోవడం, వదిలివేయడం, జీవితాన్ని యథాతథంగా ఉంచడంతో సంతృప్తి చెందదు. అస్తిత్వానికి చెందిన ఆ భాగం సంపూర్ణంగా ఉండటాన్ని, సమగ్రంగా రూపాంతరం చెందడాన్ని లేదా ఏ మూల్యానికైనా ఆంతరిక ఆరాధనతో పాలుపంచుకోవడాన్ని కోరుకొంటుంది.

ప్రతి సామాన్య మనిషిలోనూ ఒక ఆపేక్ష, ఒక అవసరముంటుంది. తాను సంవేదిస్తున్న దానిని, తాను ఆంతరికంగా కోరుకొంటున్న దానిని భౌతిక రూపంలోకి తర్జుమా చేయాలనే ఒక ఖచ్చితమైన అవసరము ఉంటుంది. ఎవరైతే ఎప్పుడూ ఆత్మసాక్షాత్కారం కోసం జీవన వ్యవహారాన్ని వదిలిపెట్టాలని కోరుకొంటారో వారిని నేను విపరీతమైన, అసంపూర్ణమైన వారుగా పరిగణిస్తాను. వాస్తవానికి వీరంతా బలహీన స్వభావులు. కానీ ఎవరైతే బలంతో, శక్తితో తమలో ఒక విధమైన ఆరోగ్యకర సంతులనంతో ఉన్నారో వారు వారి ఆధ్యాత్మిక సిద్ధిని

భౌతికంగా కూడా సిద్ధింప చేసుకొనే ఖచ్చితమైన అవసరాన్ని సంవేదిస్తారు. వాళ్ళు రూపాల నిలువని లోకాల్లోకి లేదా మబ్బుల్లోకి ప్రయాణం కట్టడంతో సంతృప్తి చెందరు. వాళ్ళు భౌతిక చేతనతో ఉండి తీరాలి. చివరికి వాళ్ళ శరీరం కూడా వాళ్ళ ఆంతరిక అనుభవంలో పాలుపంచు కొంటుంది. ఇప్పుడు అంతా సంసిద్ధంగా చలామణిలో ఉన్న మతాన్ని అనుసరించే, అవలంభించే అవసరం మనుషుల్లోని 'సమూహ ప్రవృత్తి' నుండి ఉత్పన్నమౌతుంది. ప్రతి వ్యక్తి నిజంగా తనకనువైన ఆరాధన పద్ధతి లేదా సంప్రదాయాన్ని కనుగొని, ప్రయత్న సిద్ధంగా, వైయక్తికంగా దైవంతో తన ప్రత్యేక సంబంధాన్ని ప్రకటించడమే అసలైన అంశం, అదే ఆదర్శవంతమైన నియమం కాగలదు.

తాను ఒక మతంలో పుట్టానని, లేదా తక్కిన జనులంతా ఒక మతాన్ని నమ్మి, ప్రేమించి, అనుసరిస్తున్నారని లేదా వారంతా ఒక చోటికి వెళ్లి పూజలు, ప్రార్థనలు చేస్తున్నారని లేదా ఫలానా వ్యక్తి అలా ఆరాధించి, ప్రార్థనతో సహాయాన్ని పొందాడని, ఒక మతాన్ని అనుసరించడం, దృఢ స్వభావానికి గుర్తు కాదు. పైగా దీనిని తన సహజ యథార్థత లోపంగా, ఒక బలహీనతకు సంకేతంగా చెబుతాను.

తన ఆంతరిక ఆకాంక్షను, ఆరాధనను తన భౌతిక జీవన రూపాల్లోకి తర్జుమా చేయాలనుకోవడం పూర్తిగా న్యాయ సమ్మతం. ఒక మనిషి తనను రెండుగా చీల్చుకొని, భౌతిక జీవితాన్ని పూర్తిగా యాంత్రికంగా చూస్తూ మామూలుగా పనిచేస్తూ సమయం చిక్కినప్పుడు లేదా అనువుగా ఉన్నప్పుడు తన లోపలికి మళ్లి, భౌతిక జీవనంలో నుండి భౌతిక చేతన నుండి తప్పించుకు పోయి తన ఆధ్యాత్మిక ఆహ్లాదాలను కనుగొనే నిమిత్తం ఎంతో ఎత్తులకు పోయి చేసేదానికంటే ఇది చాలా నిజాయితీతో కూడినది.

తనను రెండుగా చీల్చుకొని బాహ్య జీవితం అసలు ముఖ్యమైనది కాదు, అది మనకు ఎలా ఉందో అలాగే దానిని తీసుకోవాలని, నిజానికి ఆంతరిక ప్రవృత్తి మాత్రమే పరిగణనలోకి తీసుకోదగినది అని చెప్పే మనిషి కంటే, తన పదార్థమయ జీవితాన్ని అత్యున్నత ఆకాంక్షకు

అభివ్యక్తీకరణకు చేసే ఇంకొక వ్యక్తి ప్రయత్నం ఖచ్చితంగా గొప్పది, గంభీరమైనది, నిజాయితీతో కూడినది.

*CWM 8:245-47* శ్రీమాత

# గురువుకు శరణాగతి

శ్రీమాత ఫోటోగ్రాపు

ధ్యానం చేస్తున్నప్పుడు నాకు నిద్ర వచ్చినట్టు అనిపిస్తే, నేను తరచుగా నిశ్శబ్దంగా ఏకాగ్రతతో మేల్కొని కూర్చుని శ్రీ మాత ఫోటో లేదా మీ ఫోటోను చూస్తాను. నేను శక్తిమేరకు ఏకాగ్రతతో ఆమె ఫోటో లేదా మీ ఫోటోను చూడటం ద్వారా అదే మొత్తంలో ప్రయోజనం పొందగలనా?

అవును, చాలా మంది అలా చేస్తారు.

కొన్నిసార్లు ఆ స్థితిలో నేను ప్రార్థిస్తాను; కొన్నిసార్లు లోపల ఆలోచనలు లేదా మాటలు ఏమీ ఉండవు, కాబట్టి నేను అలా చూస్తూ ఉంటాను. నేను సరైన మార్గాన్ని అనుసరిస్తున్నానా?

అవును.

*CWSA 32:597*

ధ్యానం, ఫోటోను చూస్తూ చేసేటప్పుడు, కళ్ళు తెరిచి చేయడం మంచిది.

*CWSA 29:313*

పరమాత్మకి శరణాగతి, గురువుకి శరణాగతి రెండు వేర్వేరు విషయాలు అంటారు. ఇది నిజమేనా?

కాదు. గురువుకు శరణాగతి చేయడంలో, అతనిలోని పరమాత్మకి శరణాగతి చేస్తున్నాడు - అది కేవలం మానవ అస్తిత్వానికి మాత్రమే అయితే అది పనిచేయదు. కానీ దైవ సన్నిధి యొక్క స్పృహ గురువును నిజమైన గురువుగా చేస్తుంది, తద్వారా శిష్యుడు ఎవరికి శరణాగతి చెందాడో ఆ వ్యక్తిని గూర్చిన ఆలోచనతో అతనికి శరణాగతి అయినప్పటికీ, ఆ ఉనికి దానిని ప్రభావవంతంగా చేస్తుంది.

నిరాకార పరమాత్మకి శరణాగతి చెందడం వల్ల వ్యక్తి గుణాలకు, అహంకారానికి కొంత వరకు లోబడి ఉంటాడా?

అవును - నిరాకారంలో స్థిరమైన భాగం మాత్రమే స్వేచ్ఛగా ఉంటుంది కాబట్టి, చురుకైన ప్రకృతి ఇప్పటికీ గుణాల ఆటలో ఉంటుంది. చాలా మంది అహం నుండి విముక్తి పొందారని అనుకుంటారు, ఎందుకంటే వారు నిరాకార అస్తిత్వ భావనను పొందుతారు, అహంకార మూలకం మునుపటిలా వారి చర్యలో ఉందని వారు చూడలేరు.

నిరాకార పరమాత్మకి శరణాగతి కంటే రూపంలో - గురువుగా - పరమాత్మకి శరణాగతి ఉన్నతమైనది కాదా?

అది మరింత గతిశీలమైనది.

గురువుకు శరణాగతి చెందడం, అన్ని శరణాగతులకు మించిన శరణాగతి అని పిలవబడేంత గొప్పగామహిమాన్వితమైనదిగా ఎందుకు చెప్పబడింది?

ఎందుకంటే దాని ద్వారా మీరు వ్యక్తి రూపమైన దైవానికి మాత్రమే కాక వ్యక్తిగాలేని దైవానికి, మీలోని దైవానికి మాత్రమే కాక మీ వెలుపల ఉన్న దైవానికి శరణాగతి చెందుతారు. అహం లేని ఆత్మలో మాత్రమే కాకుండా, అది పాలించే వ్యక్తిగత స్వభావంలో కూడా అహంకారాన్ని అధిగమించే అవకాశం మీకు లభిస్తుంది. ఇది మొత్తం సంకల్పం దైవానికి శరణాగతి చెందింది అనేందుకు సంకేతం, "సమగ్రమ్, మను తనుమ్ బుతం". ఇవన్నీ నిజం కావాలంటే అది నిజమైన ఆధ్యాత్మిక శరణాగతి అయి ఉండాలి.

గురువుకు సంపూర్ణ శరణాగతి చెందాక కూడా అనేక శక్తుల చేతిలో కీలుబొమ్మలా నిస్సహాయంగా మిగిలిపోతే - దానివల్ల ప్రయోజనం ఏమిటి? హానికరమైనది ఏమిటంటే, తమలోని పరమాత్మను వదిలి, గురువులోని పరమాత్మకి మాత్రమే శరణాగతి చెందడం, ఈ ఏకపక్ష శరణాగతియే హానికరం.

హానికరమైనది, మీ అహాన్ని గొప్పగా చేసుకునేస్వభావానికి, మీరు దైవం అని పిలుచుకునే దేనికైనా శరణాగతి చెందడమే మిమ్మల్ని ఆ శక్తుల చేతిలో కీలుబొమ్మగా చేస్తుంది.

*CWSA 35:396-97*

**Vol. 54, No. 10**
**October 2024**

Date of Publication:
1st October 2024

TN/PMG (CCR)/ WPP 473/24-26
Registered: PY/41/2024-26

# AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

*Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo*



*Owner:* Sri Aurobindo Society
*Printer:* Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
*Publisher:* Pradeep Narang for Sri Aurobindo Society
*Published from:* Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
*Printed from:* Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

A Monthly Published by
SRI AUROBINDO SOCIETY-605001

# అఖిల

అఖిల భారత పత్రిక

నవంబర్ 2024



## నిజాయితి

# విషయ సూచిక



## సంపాదకీయం

అనేక మార్గాల వెంట సాగే ఆధ్యాత్మిక పరిణామం, విశాలమైన, సంక్లిష్టమైన ప్రక్రియ. మనం ఏ మార్గం వెంటనడిచినా, ఆధ్యాత్మిక అభివృద్ధి, ఏకైక అత్యంత ప్రధానమైన ఆవశ్యకాంశం. నిజాయితీ సాధనా ఫలం అభ్యాసానికి సంబంధించిన నిజాయితీ మీద ఆధారపడి ఉంటుంది. నిజాయితీకి సంబంధించి ఈ అత్యంత ప్రాథమిక లక్షణానికీ సంచిక అంకితం.

*అనువాదం : కె.వి.రావు*



నీ పనిని నీవు నిజాయితీగా భగవతార్పణంగా చేసి, ఆ భగవంతుని పాదాల కడ ఉంచినట్లయితే, ధ్యానము వలన కలిగే ఫలితమే నీ పని వలన పొందగలవు.

*CWM 16:178*

శ్రీమాత

# నిజాయితీ అంటే

## నిజాయితీలో శ్రేణులు

నిజాయితీ అంటే ఏ నిమ్న శక్తుల ప్రభావాన్నీ కాకుండా కేవలం భగవంతుని ప్రభావమును మాత్రమే అంగీకరించడం.

*CWSA 29:50*

పరిపూర్ణ నిజాయితీతో ఉండడం అంటే కేవలం దివ్యసత్యమును మాత్రమే కాంక్షించడం, ఆ దివ్యమాతకు నిన్ను నీవు సమర్పించుకోవడం. ఈ ఆకాంక్ష మినహా ఇతర వైయక్తిక అభ్యర్థనలను తిరస్కరించడం, నీ జీవితములోని ప్రతి అంశమును, చర్యను ఆ దివ్యమాతకే సమర్పించడం. ఏ పని అయినా, అహంకారానికి తావులేకుండా, ఆ పరాత్పరుడి ద్వారా ఇవ్వబడిన పనిగా దానిని చేయడం. ఈ భావనయే దివ్య జీవనమునకు మూలము.

*CWSA 29:51* శ్రీ అరవిందులు

నిజాయితీతో ఉండటం అంటే, మనసా వాచా కర్మణా ఆ దివ్యశక్తికై ఆకాంక్షించడం. అంటే ఒక విధానములో శ్రీమాతకై ఆకాంక్షించి వేరే పద్ధతిలో తిరస్కరించకూడదు.

*CWM 14:65*

ప్రశ్న : మధుమయి శ్రీమాతా, చిత్తశుద్ధి అంటే ఏమిటి?

చిత్తశుద్ధిలో వివిధ శ్రేణులు ఉన్నాయి. మొదటి శ్రేణితో ఆధ్యాత్మిక జీవనం కావాలని ఒక బలమైన ఆకాంక్ష, కోరికతో ఉండి కూడా... ఎలా చెప్పాలి? ఏ మాత్రం సంకోచించకుండా ఆ ఆధ్యాత్మికతకు వ్యతిరేకమైన పనులు చేయడం, నిజానికి కపటంతో ఉండడం కంటే ఇది ఒకవిధంగా చిత్తశుద్ధి ఒక శ్రేణియే అనేది అత్యంత స్పష్టం. ఇక రెండవ శ్రేణిలో ఇలా ఉంటుంది. మన అస్తిత్వంలోని ఒక భాగానికి ఈ ఆకాంక్ష ఉండి, మనలోని అన్నిరకాల లోపాలను, అసంపూర్ణతలను వదిలించుకోవాలని బలంగా కోరుకుంటూ చెప్పడమే కాక ఆలోచించడం సైతం,

సంవేదించడం సైతం చేస్తూ ఉంటాము. కానీ అదే సమయంలో మన అస్తిత్వంలోని మిగతా భాగాలు ఈ లోపాలు, అసంపూర్ణతలను, బయట పడవేసి, వాటిని దాటిపోయేందుకు వాటి మీద ఒత్తిడి పడకుండా చాలా జాగ్రత్తగా, వాటిని దాచి పెడ్తాయి. ఇది అత్యంత సహజంగా జరిగేది.

ఇక చిట్టచివరగా, మనం బాగా చాలినంత దూరం పోతే ఈ వర్ణనను చాలినంత దూరం దాకా నెట్టుకుంటూ పోతే దైవం కోసం మన ముఖ్య ఆకాంక్షను వ్యతిరేకించే భాగం వరకూ పోతే మనకు సంపూర్ణ చిత్తశుద్ధి లేనట్లే. అంటే, పరిపూర్ణ చిత్తశుద్ధి అనేది అత్యంత అరుదైన గుణము అన్నట్లు. ఎప్పుడైతే మన జీవితంలో ఏ నిమిషంలో ఏమి జరిగినా మన అస్తిత్వం మొత్తం తనను తాను ఆ పరాత్పరునికే అర్పించుకొని కేవలం దైవ సంకల్పంను మాత్రమే ఆకాంక్షించినట్లయితే, మన అస్తిత్వంలో ఏమి జరిగినా, నిరంతరం దైవ అనుభవంతో సంపూర్ణ ఐక్యం చెంది, నీ సంకల్పమే సిద్ధించుగాక అని మనం అసంకల్పితంగా పరిపూర్ణంగా అనగలిగితే అప్పుడు నీవు చిత్తశుద్ధి గలవాడవు అని అర్థం. కాని ఈ విధంగా అనుకోనంత వరకు, అంగీకరించనంత వరకు, స్వీకరించనంత వరకు అది మిశ్రమ చిత్తశుద్ధియే. అసలేమాత్రం చిత్తశుద్ధి లేని స్థాయి వరకు, హెచ్చు తగ్గులుగా మిశ్రమమైనదే అవుతుంది.

*CWM 6:397-98* — *శ్రీమాత*

చిత్తశుద్ధి అనేది, కేవలం సత్యనిష్ఠకన్న ఒక మెట్టు పైన ఉంటుంది. అంటే నీవు ఉద్దేశించిన దానినే చెప్పడం, నీకున్నదని చెప్పుకొనే దానినే నీవనుభూతి చెందడం, అవి నీ సంకల్పంలో తీవ్రంగా ఉన్నాయని అర్థం. సాధకుడు దైవీ ఉపకరణంగా మారాలనీ, దైవంతో ఏకమవడానికి ఉబలాటపడుతూ ఉండడమే నిజమైన చిత్తశుద్ధి. సాధకునికి చిత్తశుద్ధి అంటే దైవానికి సంబంధించిన ప్రేరణ, సంకల్పం తప్ప వేరే ఏ ఇతర ప్రేరణలకు, ప్రభావాలకు లోబడకుండా ఉండడం.

*CWSA 29:50* — *శ్రీ అరవిందులు*

## మానసిక, ప్రాణిక, భౌతిక చిత్తశుద్ధి

మానసిక చిత్తశుద్ధి, ప్రాణిక చిత్తశుద్ధి, భౌతిక చిత్తశుద్ధి అని ఉన్నాయా? ఉంటే వీటి మధ్య భేదం ఏమిటి?

చిత్తశుద్ధి సూత్రము ఎక్కడైనా సహజంగా ఒకే తీరుగా ఉంటుంది. కాని వాటి పనితీరు వాటి, వాటి అస్తిత్వ స్థితులను బట్టి ఉంటుంది.

పరిపూర్ణ, సమగ్ర చిత్తశుద్ధితో ఉండాలి అంటే ఎలాంటి ప్రాధాన్యతలు, కోరికలు, ఆకర్షణలు, వికర్షణలు, ఇష్టాలు, అయిష్టాలు, సానుభూతి, వ్యతిరేకతలు, బంధనాలు అనేవి ఉండకూడదు. అన్నిటిపట్ల ఒకేరకమైన, అంటే నిజమైన వైఖరిని కలిగి ఉండి, పరిపూర్ణమైన లేదా సమగ్ర దృష్టిని కలిగి ఉండడం అన్నట్లు. ఇది గ్రహించడం ఎవరికైనా చాలా కష్టమే. మానవుడు తనని తాను దైవీకరించుకోవడానికి నిర్ణయించుకోనంత వరకు తనలోని ఈ వ్యతిరేకతల నుండి స్వేచ్ఛను పొందడం అనేది దాదాపు అసాధ్యమే. అలానే, ఈ వ్యతిరేకతలను మనిషి తనలో మోస్తున్నంత కాలం అతను పరిపూర్ణ చిత్తశుద్ధిని పొందలేడు. అప్పుడు అప్రయత్నంగా మానసిక, ప్రాణిక మరియు భౌతిక పనివిధానం అసత్యం అని నిరూపించబడుతుంది. నేను భౌతికమైన చిత్తశుద్ధిని నొక్కి చెబుతున్నాను. ఎందుకంటే ఇంద్రియాల పని విధానం కూడా ప్రాధాన్యతను అనుసరించి, అసాధారణంగా వక్రీకరించబడుతుంది. ప్రాధాన్యతలకు లోబడే వారు సహజమైన, నిజమైన దానిని చూడడం, వినడం, రుచి చూడడం, అనుభవించడం అనేది చేయలేరు. ఎంత కాలమైతే నీకు నచ్చినవి, నచ్చనివి అని వుంటాయో, కొన్నింటిపట్ల ఆకర్షితుడవై మిగతా వాటిని వికర్షిస్తావో, వాటిని నీ చర్యలు, ప్రాధాన్యతలు, తిరస్కరణలలో నీవు చూసినంత కాలం వాస్తవ దృష్టితో చూడలేవు. సంవేదనలు, అనుభవాలు, అనుభూతులు, ఆలోచనల లాగానే ఇంద్రియాలు కూడా మానవుని గతి తప్పించడానికి ఉపకరిస్తాయి.

అందువలన నీవు ఏం చూస్తున్నావో, అనుభవిస్తున్నావో, ఆలోచిస్తున్నావో నీకు ఖచ్చితమైన నిర్ధారణ ఉండాలి అంటే, నీవు పూర్తిగా నిర్లిప్తతతో దూరంగా ఉండి నిర్ధారించుకోగలగడం అవసరం. ఇది అంత

సులభమైనదేమీ కాదు. కానీ, నీ దృష్టి కోణం పూర్తి వాస్తవం కానంత వరకు దానికి చిత్తశుద్ధిలేనట్లే.

ఇవేకాక, ఇంకా వేరుగా గుర్తించలేని అతి సూక్ష్మమైనవి కూడా ఉన్నాయి. ఉదాహరణకు, నీకు సానుభూతులు, వ్యతిరేకతలు ఉన్నంత వరకు నీకు సానుభూతి ఉన్న వాటి పట్ల సానుకూల దృక్పథం ఉండడం, అలాగే అయిష్టమైన వాటిపట్ల ప్రతికూల దృష్టికోణం ఉండడం అనేది అత్యంత సహజమైన విషయం. ఏది ఏమైనా వీటన్నింటిలో నేను చిత్తశుద్ధితోనే ఉన్నాను అని ఎంతకాలం నిన్ను నీవు మోసపుచ్చుకుంటూ ఉంటావో అంతవరకూ నీవు మానసిక కుటిలత్వంతో అంటే చిత్తశుద్ధి లేనితనంతో ఉన్నావని అర్థం. ప్రాణి స్థితిని బట్టి ఈ కుటిలత్వాలు చిన్నచిన్న తేడాలతో ఎన్నో రకాలుగా ఉంటాయి. ఈ కుటిలత్వాలకు ఆధారం కోరిక లేదా వ్యక్తిగత అవసరాలు, అహంకారం, అహంకార పూరిత పరిధుల వల్ల, కోరిక నుండి జనించే అన్ని రకాల వైకల్యాలే దీనికి కారణం. వాస్తవానికి, ఒక వ్యక్తి నిరంతరం చిత్తశుద్ధికై ప్రయత్నిస్తూ అహంకారంతో ఉన్నట్లయితే, ఆ వ్యక్తి పరిపూర్ణ చిత్తశుద్ధితో ఉన్నాడని చెప్పలేము. చిత్తశుద్ధికై ప్రయత్నించే వ్యక్తి అహంకారాన్ని అధిగమించి, ఏ మాత్రం కొరత లేకుండా, లెక్కలు పెట్టకుండా తనను తాను పూర్తిగా దైవ సంకల్పమునకు సమర్పించుకోవాలి. అప్పుడు మాత్రమే ఆ వ్యక్తి పరిపూర్ణ చిత్తశుద్ధి కలవాడిగా మారగలడు కానీ అంతకు ముందు కాదు.

అంతేకాదు, చిత్తశుద్ధితో ఉండడంలో అద్భుతమైన ఆనందం ఉంటుంది. చిత్తశుద్ధితో చేసే ప్రతీపనికీ తప్పక ఒక బహుమతి ఉంటుంది. అది ఎలాగంటే శుద్ధి గావింపబడుతున్న అనుభూతిని పొందడం, ఊర్ధ్వముఖంగా (పైకి) ఎగబాకుతున్న అనుభూతి (అభివృద్ధి వైపు), అత్యంత చిన్న అసత్యమును కూడా నిరాకరించినపుడు స్వేచ్ఛను పొందుతున్న అనుభూతిని పొందడం వంటిది.

చిత్తశుద్ధి అనేది ఒక రక్షణ, ఆదరవు, మార్గదర్శి, చివరగా పరిపూర్ణమైన రూపాంతరీకరణ శక్తి.

*CWM 8:397-400* — శ్రీమాత

ఇక్కడ ప్రశ్న ఏమిటంటే, నిజాయితీగా ఉండటమే, నీకు నిజాయితీ లేకపోతే యోగం ప్రారంభించవద్దు.

అన్నింటిలోకి నిజాయితీగా ఉండడం చాలా కష్టం. బహుశా ఇది కూడా చాలా ప్రభావవంతమైనది.

నీలో పరిపూర్ణమైన నిజాయితీ ఉన్నప్పుడు, నీకు విజయం తప్పక లభిస్తుంది. కానీ ఇది చాలా కష్టం. నిజాయితీగా ఉన్నప్పుడు నీలోని అన్ని అంశాలు, అన్ని కదలికలు (బాహ్యమైనవి మరియు అంతరంగికమైనవి) నీకు సంబంధించిన అన్ని భాగాలు, అన్నింటి ఏకైక సంకల్పం దైవానిదై ఉండటమే. దైవం కోసం మాత్రమే జీవించడం, దైవ సంకల్పాన్ని మాత్రమే వ్యక్త పరచడం, దైవ సంకల్పమే నీ సంకల్పంగా జీవించడం, దైవశక్తి తప్ప ఇతర ఏ శక్తుల మీదా ఆధారపడకపోవడం.

నీ నిజాయితీని తీవ్రతరం చేస్తూ, నిజాయితీని సరిదిద్దుకోవలసిన అవసరం లేనప్పుడు ఏ రోజు, ఏ గంట లేదా ఏ నిమిషం కూడా దైవాన్ని మోసం చేయవలసిన అవసరం నీకు లేదు. మొదటి విషయం ఏమిటంటే తనను తాను మోసం చేసుకోవడం కాదు. ఏ ఒకరూ దైవాన్ని మోసం చేయలేరని తెలుసు. చివరకు చాలా తెలివైన అసురులు కూడా దైవాన్ని మోసం చేయలేరు. ఇది అర్థం చేసుకొన్నప్పటికీ ఒకరు తన జీవితంలో చాలా తరచుగా, ఒక రోజులో తనకు తెలియకుండానే, అప్రయత్నంగా, దాదాపు స్వయంచాలకంగా తనను తాను మోసం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఒకరు తాను చేస్తున్న పనులకు, మాటలకు, తన చేష్టలకు ఎల్లప్పుడూ అనుకూలమైన వివరణలు ఇస్తారు. ఇదే ఎప్పుడూ ముందు జరుగుతుంది. గొడవలు పడడం, 'ఇది ఎదుటివారి తప్పు వల్ల జరిగింది' అనడం, ఇలాంటి విషయాల గురించి నేను మాట్లాడడం లేదు. నేను ప్రతిరోజూ జీవితంలో జరిగే చాలా చిన్న విషయాల గురించి మాట్లాడుతున్నాను.

ఒక పిల్లవాడు ఒక తలుపుకు కొట్టుకుని, ఆ తలుపునే లాగి తంతాడు! నీవు ఆ బాల్యదశను దాటినా అది చిన్న కారణమైనా తెలివితక్కువ

మన్నింపులతో "వారు అలా తప్పు చేయకపోతే నేను ఇలా చేసేవాడిని కాదు" అని అర్థంలేని కారణాలు చెప్తావు. ఇది సూటిగా చెప్పడం కాదు.

## నిజాయితీగా ఉండడం

నీవు ఎవరితోనో ఉన్నప్పుడు, యుక్తమైన కార్యం చేయని వారితో ఉన్నప్పుడు సైతం, నీవు నిజాయితీపరుడవైతే తక్షణం యుక్తమైన కార్యం చేసి ప్రతిస్పందించాలి. దీన్నే నేను నిజాయితీ అంటాను. ఉదాహరణకు, చాలా కోపంగా ఉండే వ్యక్తినే తీసుకో. అతనికి బాధ కలిగించే విషయాలు చెప్పడానికి బదులు, నీవు ఏమీ మాట్లాడకు. నీవు ప్రశాంతంగా, నిశ్శబ్దంగా ఉండు. ఆ విధంగా ఆ కోపాన్ని నీ దగ్గరకు రానివ్వవు. ఇది సులభమా కాదా? అని తెలుసుకోవడానికి నిన్ను నీవు గమనించాలి. నీవు నిజాయితీగా ఉన్నావో లేదో తెలుసుకోవడానికి ఇది చాలా ప్రాథమిక విషయం. చాలా చిన్న ప్రారంభం. నేను కోపం వంటి అంటువ్యాధిని పట్టుకొనే వారి గురించి, ఇతరుల వలె కోపానికి లోనయ్యే వారి గురించి మాట్లాడడం లేదు.

నేను చెప్తున్నాను, నిన్ను నీవు చురుకైన దృష్టితో చూసుకుంటే, నీ సహజ ప్రవర్తనలో, నువ్వు ఎంత నిజాయితీగా ఉండాలని ప్రయత్నించినా, నీలో కొంత కపటత్వాన్ని నువ్వు గుర్తిస్తావు. ఇది ఎంత కష్టమైన విషయమో నీకు తెలుస్తుంది.

నేను చెప్తున్నాను, నీ శరీరంలోని అన్ని కణాలు, నీలోని అన్ని అంశాలు, నిజాయితీగా ఉండి, నువ్వు పూర్తి సమగ్రంగా దైవాన్నే కోరుకుంటే, నీకు విజయం ఖచ్చితంగా లభిస్తుంది. అంతకంటే ఏదీ తక్కువ కాదు. దీనినే నేను నిజాయితీ అని అంటాను.

"నేను నాకు చెందిన వాడిని ఇంకెంతమాత్రం కాదు, నేను దైవానికి చెందిన వాడిని దైవమే నాలో ఉండి అన్ని పనులు చేయిస్తోంది, దైవమే అంతా చేస్తోంది." ఇలాంటి చపలత్వాలను, కపటాలను అంగీకరించే పైపై మెరుగుల గురించి నేను మాట్లాడడం లేదు. ఇది చాలా కఠినమైన విషయం. కొంతమంది ప్రబుద్ధులు, తమ కోరికలు కప్పి పుచ్చుకోవడానికి

అందమైన ముసుగు ధరిస్తారు. వారి గురించి నేను మాట్లాడటం లేదు. నేను మరింత నిజాయితీగా ప్రవర్తించే వారి గురించి మాట్లాడుతున్నాను.

ఒక రోజులో ఎన్ని విషయాలు, ఆలోచనలు, అనుభూతులు, హావభావాలు, ప్రత్యేకించి భగవంతుని వైపు ఆకాంక్షతో మళ్ళాయి? ఎన్ని మళ్ళాయి? నీవు కనీసం ఒక తలం పైనైనా భగవంతుని వైపు మళ్ళితే నీవు దాన్ని ఎర్రఅక్షరాలతో లిఖించవచ్చు.

*CWM 5:5-7* — *శ్రీమాత*

"నువ్వు నిజాయితీగా ఉంటే, నీకు విజయం తథ్యం" అని నేను చెప్పినప్పుడు నా ఉద్దేశ్యం, నిజమైన చిత్తశుద్ధి, నిరంతరం నివేదనగా జ్వలించే నిజమైన జ్వాల అని. దైవం కోసం, దైవం కోసం మాత్రమే ఉనికిలో ఉన్నామనే హర్షాతిరేకం, దైవం లేకుండా ఏదీ లేదు, దైవం లేకపోతే జీవితానికి ఎలాంటి అర్థం లేదు. ఎటువంటి ఉపయోగం, విలువ లేదు, ఎలాంటి ఉత్సాహమూ లేదు, ఈ ఆకాంక్ష, అత్యున్నత సత్యానికి శరణాగతి, దీన్నే మనం దైవికం అని అంటాము (ఎందుకంటే నువ్వు ఏదో ఒక పదం ఉపయోగించాలి) అదే ఈ విశ్వ మనుగడకి ఏకైక కారణం. దాన్ని తొలగిస్తే సర్వం అదృశ్యమైపోతుంది.

*CWM 5:5-7* — *శ్రీమాత*

# నిజాయితీ సాధనలో సహాయపడుతుంది

## ఆధ్యాత్మిక జీవిత ప్రాథమిక సుగుణం

ప్ర: ఆధ్యాత్మిక జీవితానికి సిద్ధం కావడానికి ప్రాథమిక సుగుణం ఏమిటి?

నేను ఈ విషయాన్ని చాలాసార్లు చెప్పాను, కానీ దానిని పునరావృతం చేయడానికి ఇది ఒక అవకాశం: అది చిత్తశుద్ధి.

చిత్తశుద్ధి సంపూర్ణంగా, దృఢంగా ఉండాలి. ఎందుకంటే చిత్తశుద్ధి మాత్రమే ఆధ్యాత్మిక మార్గంలో నీకు రక్షణ. నీకు చిత్తశుద్ధి లేకపోతే, తదుపరి అడుగులోనే నువ్వు పడి, నీ తల పగలగొట్టుకోవడం ఖాయం. అన్ని రకాల శక్తులు, సంకల్పాలు, ప్రభావాలు, అస్తిత్వాలు నీ చుట్టూ

ఉన్నాయి, అవి నీ చిత్తశుద్ధిలో ఎంత చిన్న చీలిక దొరికినా చాలని దానికోసం వెతుకుతూ ఉంటాయి. అది దొరికిన వెంటనే, ఆ చీలిక ద్వారా ప్రవేశించి నిన్ను గందరగోళంలోకి నెడతాయి.

అందువల్ల, ఏదైనా చేసే ముందు, ఏదైనా ప్రారంభించే ముందు, ఏదైనా ప్రయత్నించే ముందు, ముందుగా నువ్వు ఎంత చిత్తశుద్ధితో ఉన్నావని మాత్రమే కాకుండా, చేయబోయే పని గురించి నిశ్చితమైన ఉద్దేశ్యంతో ఉన్నానా లేదా అని నిర్ధారించుకో.

అందువల్ల అదే నీ ఏకైక రక్షణ.

*CWM 8:247-248*

ప్ర : శ్రీ అరొబిందో శతజయంతి సందర్భంగా, నేను వ్యక్తిగతంగా శ్రీ అరొబిందోకు సమర్పించగలిగే అత్యుత్తమ సమర్పణ ఏమిటి?

ఆయనకు నీ మనస్సును సంపూర్ణ చిత్తశుద్ధితో సమర్పించు.

*CMW 12:205* *మదర్*

"నిజాయితీగా, పట్టుదలతో అనుసరించే ఏ పద్ధతి అయినా తెరుచుకునే తత్వాన్ని నీ దగ్గరికి తీసుకురావడంతో ముగుస్తుంది."

*CWSA 31: 729*

దయ, రక్షణ ఎప్పుడు నీతో ఉంటాయి. ఎప్పుడైనా అంతర్గతంగా లేదా బాహ్యంగా, కష్టం లేదా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అవి నిన్ను అణచివేయడానికి అనుమతించవద్దు. దివ్యశక్తిని ఆశ్రయించు అది రక్షిస్తుంది.

నువ్వు ఎప్పుడూ విశ్వాసంతో, చిత్తశుద్ధితో అలా చేస్తూ ఉంటే, నీలో ఏదో తెరుచుకోవడాన్ని గమనించగలవు. ఇది ఎన్ని బాహ్య అవాంతరాలు ఉన్నప్పటికీ ఎప్పుడూ నిశ్చలంగా, ప్రశాంతంగా ఉంటుంది.

*CWSA 31: 724-725*

## భగవంతుని అనుగ్రహం, చిత్తశుద్ధి

దైవానుగ్రహం గురించి ఎటువంటి సందేహం లేదు. మనిషి చిత్తశుద్ధితో ఉంటే, అతడు పరమాత్మను చేరుకుంటాడనేది కూడా పూర్తిగా నిజం. కానీ అతను వెంటనే, సులభంగా, ఆలస్యం లేకుండా

చేరుకునేటట్టు దివ్యానుగ్రహం చేయదు. నీలో లోపం ఉంది. భగవంతునికి దానిని సరి చేయడానికి సమయం పడుతుంది, ఐదు సంవత్సరాలు, ఆరు సంవత్సరాలు, ప్రభావం వెంటనే చూపనందున సందేహం కూడా ఉంటుంది. ఒక వ్యక్తి కేంద్రంగా చిత్తశుద్ధి ఉండవచ్చు. సాక్షాత్కారం ప్రారంభించడానికి ముందు అతనిలో చాలా విషయాలు మార్చవలసి ఉంటుంది. అతని చిత్తశుద్ధి అతను ఎప్పుడూ పట్టుదలతో ఉండేలా చేయాలి ఎందుకంటే ఇది భగవంతుని కోసం పడే ఆలస్యం లేదా నిరాశ లేదా కష్టం లేదా మరేదీ అణచివేయలేని తపన.

*CWSA 29:116-117*

విశ్వాసం, ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించడంలో పూర్తి చిత్తశుద్ధి, వారి ప్రభావానికి తనను తాను తెరుచుకోవాలనే సంకల్పం, సామర్థ్యం తప్ప శ్రీ అరోబిందో మదర్ ప్రభావాన్ని స్వీకరించడానికి ఎటువంటి నిబంధనలు లేవు. కానీ ఈ సామర్థ్యం సాధారణంగా చిత్తశుద్ధి, విశ్వాసం ఫలితంగా వస్తుంది.

*CWSA 32:106*

అతను దూరంగా ఉండి సహాయం పొందలేకపోతే, అతను ఇక్కడ యోగాన్ని ఎలా కొనసాగించాలని ఆశిస్తున్నాడు? ఇది యోగం, ఇది మౌఖిక సూచనలపై లేదా బాహ్యంగా దేనిపైనా ఆధారపడదు, కానీ పూర్తి నిశ్శబ్దంలో కూడా తమను తామే తెరచి శక్తిని, ప్రభావాన్ని పొందే సమర్థతపై ఆధారపడి ఉంటుంది. దూరం నుండీ అందుకోలేని వారు ఇక్కడ కూడా అందుకోలేరు. అలాగే ప్రశాంతత, చిత్తశుద్ధి, శాంతి, సహనం, పట్టుదల లేకుండా ఈ యోగం చేయలేము, ఎందుకంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది, వాటిని ఖచ్చితంగా, పూర్తిగా అధిగమించడానికి చాలా సంవత్సరాలు పడుతుంది.

*CWSA 35:597*

ప్ర: మదర్ శక్తిని గుర్తించి, దానిని ఇతర అహంభావ, అజ్ఞాన శక్తుల నుండి వేరు చేయడం కోసం నిజమైన, ఖచ్చితమైన మార్గం ఏమిటి?

ఒక వ్యక్తి తన స్వంత కోరికలను, లోపాలను మానసిక తార్కికతతో సమర్థించుకోకుండా, పరిపూర్ణ చిత్తశుద్ధిని కలిగి ఉండాలి. నిష్పక్షపాతంగా నిశ్శబ్దంగా తనను తాను, తన కదలికలను గమనిస్తూ మదర్ శక్తిని పిలవాలి. అప్పుడు క్రమంగా ప్రతిదానిని ఆ ప్రకాశంలో గుర్తించడం ప్రారంభమవుతుంది. ఇది నువ్వు ఒకేసారి సంపూర్ణంగా చేయలేకపోయినా, క్రమ క్రమంగా అంచనా వేయడం, అనుభూతి స్పష్టంగా, ఖచ్చితంగా ఏర్పడతాయి. ~~ఈ~~ విషయాలపై సరైన స్పృహ ఏర్పడుతుంది.

*CWSA 32: 225*

కోరికల విషయానికొస్తే, హృదయపూర్వక ఆకాంక్షతో నీలో పని చేయడానికి మదర్ శక్తిని పిలవడం సరైన మార్గం. మదర్ ప్రకాశం, శక్తి నీలో పని చేస్తున్నప్పుడు అవి నీలో మార్చవలసినవన్నీ నీకు చూపుతాయి. నువ్వు నీ నిష్కపట, సంపూర్ణ సమ్మతిని అందించినట్లయితే అవి వాటిని మారుస్తాయి.

*CWSA 32:393*

మనిషి తన స్వంత బలహీనతలను గ్రహించడం అతని చిత్తశుద్ధి వలన కలిగిన ఒక ఫలితం.

*CWSA 29:53* — *శ్రీ అరొబిందో*

## భగవంతుడు కోరుకునేది కోరుకోవడం

ప్ర: నా పట్ల మీ ప్రేమే నా నిజమైన ఆశ్రయం, ఏకైక బలం. నా తల్లీ, నేను మీకు అందించేది బురదగా ఉన్న మిశ్రమం, అందుకు నేను సిగ్గుపడుతున్నాను, కానీ మీరు మాత్రమే దానిని శుద్ధి చేయగలరు.

నా ప్రియమైన బిడ్డ!

నివేదించబడేదాని స్వభావం ఏదైనప్పటికీ, అది చిత్తశుద్ధితో సమర్పించబడినప్పుడు, అది ఎప్పుడూ ఒక దివ్యప్రకాశంలోని మెరుపుతో ఉంటుంది. అది పూర్తి సూర్యునిగా పెరిగి మొత్తం అస్తిత్వాన్ని ప్రకాశింపచేస్తుంది. నువ్వు నా ప్రేమ ఉందని నమ్మి నువ్వు నా సహాయం గురించి నమ్మకంతో ఉండు, నా ఆశీర్వాదాలు నీకు ఎప్పుడూ ఉంటాయి.

*CWM 16:211*

నీ సాధనలో అడుగడుగునా ముఖ్యమైనది చిత్తశుద్ధి, అది ఉంటే, తప్పుల గురించి అంతగా పట్టించుకోనవసరం లేదు, వాటిని సరిదిద్దవచ్చు. చిత్తం అపరిశుద్ధంగా ఉంటే, అది ఒక్కసారిగా సాధనను క్రిందికి లాగుతుంది. కానీ ఈ స్థిరమైన చిత్తశుద్ధి ఉందా లేదా ఏ సమయంలోనైనా చిత్తం పరిశుద్ధత్వం నుంచి పడిపోతోందా అనేది నువ్వు నీలో చూడటం నేర్చుకోవలసిన విషయం. దాని పట్ల పట్టుదల, స్థిర సంకల్పం ఉంటే, చూచే శక్తి వస్తుంది. చిత్తశుద్ధి ఇతరులను సంతృప్తి పరచడంపై అస్సలు ఆధారపడదు ఇది అంతర్గత విషయం, నీకు నాకు మధ్య మాత్రమే ఉంటుంది.

*CWM 14: 68*

సంపూర్ణ చిత్తశుద్ధితో, భగవంతుడు కోరుకునే దానినే కోరుకోవడం, జీవితంలో శాంతి ఆనందాలకు అవసరమైన పరిస్థితి. మనుషులు తమకు ఏమి అవసరమో. జీవితం వారికి ఏమి ఇవ్వాలో భగవంతుని కంటే తమకే బాగా తెలుసునని దాదాపు ఎప్పుడూ నమ్మకంతో ఉండటమే వాళ్ళ కష్టాలకు కారణం. చాలా మంది మనుషులు ఇతరులు తమ అంచనాలకు అనుగుణంగా ఉండాలని, వారి కోరికలకు అనుగుణంగా పరిస్థితులు ఉండాలని కోరుకుంటారు అందువల్ల వారు బాధతో అసంతోషంగా ఉంటారు.

*CWM 16:433* *ది మదర్*

# నిజాయితీకున్న శక్తి

## నిజాయితీ సూత్రాలు

భయపడవద్దు, నీ నిజాయితియే నీకు రక్షణ

*

నీవు పూర్తిగా నిజాయితీతో ఉండు, ఏ విజయమూ నిన్ను కాదని పోదు.

దైవకార్యానికి సమర్పించుకోవడంలో పూర్తిగా నిజాయితీతో ఉండు. అది నీ బలాన్ని, విజయాల్ని రూఢి పరుస్తుంది.

నిజాయితీగా ఉండు.

నిజాయితీయే దివ్యత్వానికి ద్వారం.

ఎవరైతే నిష్కపటంగా, నిజాయితీగా ఉంటారో వారికి దైవమే చెలికాడు.

దైవానికి సమర్పించుకోవడంలో ఖచ్చితంగా, నిజాయితీగా ఉండు. దానితో నీ జీవితం సామరస్య పూరితంగా, అందంగా అవుతుంది.

*

నీవైతే నిజాయితీగా ఉండు, అవసరమైతే నేను వెయ్యిసార్లయినా నీ తప్పుల్ని సరిదిద్దడానికి సిద్ధంగా ఉన్నాను.

*

ఎవరైతే నిజాయితీగా ఉన్నారో వారికి నేను సహాయం చేసి సునాయాసంగా దైవం వైపుకు తిప్పగలను. కాని కపటం ఉన్న చోట కొద్దిమాత్రంగానే సహకరించగలను.

*CWM 14:65-68*

నిజాయితీతో చేసిన ప్రార్థనలన్నీ అనుగ్రహించబడతాయి. కాని భౌతిక స్థాయిలో అవి సాకారమవ్వాలంటే సమయం పడుతుంది.

*

నిజాయితీతో పిలిచే పిలుపుల్ని తప్పక ఆలకించడముంటుంది, వాటికి జవాబు అందుకోవడమూ ఉంటుంది.

*CWM 15:207-08*

తాను మారాలనే నిజంగా చిత్తశుద్ధితో అనుకొంటే అది సహాయం చేస్తుంది. తాను ఖచ్చితంగా మారాలనే సంకల్పంతో ఉంటే ఆ నిజాయితీ, చాలా శక్తివంతంగా సహకరిస్తుంది. అది నీకు మారే శక్తి అందిస్తుంది. మారేందుకు ఊతమిస్తుంది. కాని మనిషి పూర్తి చిత్తశుద్ధితో మారాలని ఆకాంక్షించాలి.

*CWM 4:349*

నీలో నిజాయితీ అనేది ఎప్పుడున్నా సహాయం, మార్గదర్శనం,

అనుగ్రహం నీకందుతాయి, నీకు జవాబునివ్వడానికే అవి అక్కడున్నాయి. ఇక ఎంతో కాలం నీవు పొరబడుతూ ఉండవు.

అభివృద్ధి కోసం ఉండే ఆకాంక్షలో ఈ నిజాయితీ, సత్యం కోసం ఉన్న సంకల్పంలో చిత్తశుద్ధి, నిజంగా నిష్కల్మషంగా ఉండే ఆవశ్యకతలో ఆధ్యాత్మికతలో ద్యోతకమయ్యే శుద్ధత - ఈ నిజాయితీయే సర్వప్రగతికి తాళపు చెవి.

*CWM 3:192*

దైవానికి చెందిన ఏ పార్శ్వాన్ని నీవు ఉపాసిస్తున్నావు, లేదా ఎవరిని నీవు మార్గదర్శిగా ఎంచుకొన్నావన్నది విషయమేమీ కాదు. నీ స్వీయ సమర్పణ సంపూర్ణంగా, ఖచ్చితంగా పూర్తి నిజాయితీతో ఉంటే ఆధ్యాత్మిక లక్ష్యాన్ని చేరుతావన్నది నికరం.

## ఆధ్యాత్మిక సిద్ధి

ఇంతకుముందు అవగతమయినట్లు, సాధారణంగా ఇంకా అర్థంచేసుకొన్నట్లు నీ లోపల లేదా ఒక రూపం ద్వారా లేక వేరే విధంగా, ఏదో ఒక రూపంలో సమైక్యమవ్వడం, నిరపేక్షునితో, పరాత్పరంలో నీ అస్తిత్వం కరిగిపోవడం, నీ ప్రత్యేక వ్యక్తిత్వం ఈ పరాత్పరంతో కరిగిపోవడం, అదృశ్యమైపోవడం. దేనికైతే నిన్ను నీవు ఇచ్చుకోవాలని ఎంపిక చేసుకొంటావో ఆఎంపిక కంటే నీ ఆత్మార్పణకు గల నిజాయితీ, సమగ్రత్వాలమీదే అది పూర్తిగా ఆధారపడి ఉంటుంది.

ఎందుకంటే నీ ఆకాంక్షలోని నిజాయితీ అన్ని పరిమితుల్ని దాటి, పరమాత్మను కనుగొనేలా చేస్తుంది. ఎందుకంటే అతడిని, నీలోనే నీవు మోస్తున్నావు.

*CWM 8:243-244* *శ్రీమాత*

## నిత్యజీవితంలో ముందుకు పొగడానికి

జీవితంలోని భయాలను అపాయాలను, విపత్తులన్నింటినీ ఎదిరిస్తూ కవచధారియై సుభద్రంగా సాగిపోవడానికి రెండు విషయాలుమాత్రమే అవసరమౌతాయి, ఆ రెండు ఎప్పుడూ కలిసే ప్రయాణించాలి - దివ్యమాత

అనుగ్రహం, నీవైపు నుండి నీలోని సమర్పణ, నిజాయితీ, విశ్వాసాలతో రూపుదిద్దుకొన్న ఒక అంతరిక స్థితి. నీ విశ్వాసం స్వచ్ఛమైనదిగా, నిష్కపటమైనదిగా, పరిపూర్ణమైనదిగా ఉండాలి. మనస్సులో ఒక అహంకార పూరిత విశ్వాసం, కీర్తికాంక్ష, గర్వం, దర్పం మానసిక దురంహంకారం, ప్రాణిక స్వార్థ సంకల్పం, వ్యక్తిగత నిక్కచ్చి కోర్కెలతో ప్రాణికం కళంకితమవ్వడం, నీచ స్వభావానికి చెందిన అల్ప సంతోషాలపై కాంక్ష ఉండటమంతా ఒక అట్టడుగు పొగబారిన అల్పజ్వాల, అది ఎగువకు స్వర్గసీమల వరకూ జ్వలించలేదు. ఈ జీవితం దైవకార్యానికి, దివ్యత్వ ప్రకటనకు సహకరించేందుకు మాత్రమే నీకివ్వబడిందని భావించు. దివ్యచేతనకు చెందిన శుద్ధత, శక్తి, ప్రశాంతతత, విశాలత, స్థిరత ఆనందాలను, ఆ దివ్యచేతన నీ మనః ప్రాణ శరీరాలను రూపాంతరీకరించి పరిపూర్ణం చేసేందుకై నీపై ఒత్తిడిని తేవాలని తప్ప మరేమీ కోరుకోకు. దైవాన్ని, ఆధ్యాత్మిక, అతిమానస సత్యాన్ని దాని సిద్ధి ఈ భూమిమీద, నీలోనూ ఎంపిక చేయబడుతూ, పిలువబడుతున్న వారందరిలోనూ జరగాలని, దాన్ని సృష్టించేందుకు అవసరమైన పరిస్థితులను, అలాగే దాన్ని వ్యతిరేకించే శక్తులన్నింటిపై దాని విజయాన్ని తప్ప నీవేమి అడగకు.

నీ నిజాయితీ సమర్పణలు వాస్తవికమూ సంపూర్ణమూ కానివ్వు. నిన్ను నీవు సమర్పించుకొనేటప్పుడు బేషరతుగా, నిరాపేక్షంగా, నిన్ను నీవు స్వార్థదృష్టితో దాచుకోకుండా, నిస్సందేహంగా పూర్తిగా ఇచ్చి వేసుకో. తద్వారా నీలో ఉన్నదంతా దివ్యమాతకే చెందుతుంది. ఇక అహంకారానికి వదిలిపెట్టడం లేదా వేరే శక్తికి అప్పగించబడటం ఉండదు.

నీ విశ్వాసం, నీ నిజాయితీ, నీ సమర్పణ ఎంత అధికంగా పరిపూర్ణమౌతాయో అంత అధికంగా అనుగ్రహ రక్షణలు నీతో ఉంటాయి. దివ్యమాత అనుగ్రహ రక్షణలు నీతో ఉండగా నిన్నేది తాకగలదు, లేదా నీవెవరికి భయపడాలి? ఆ అనుగ్రహ, రక్షణలోని అతి స్వల్పఅంశమైనా అన్ని కష్టాలు, అడ్డంకులూ, ఆపదల నుండీ దాటించివేయగలదు; దాని పూర్తి సన్నిధితో నీవు నీ మార్గంలో సురక్షితంగా పోగలవు. ఎందుకంటే అది ఆమె మార్గమే, ఇక ఈ లోకానికి చెందిన లేదా కనిపించని అన్య

లోకాలకు చెందిన దుష్టత్వం, అది ఎంత బలమైనదైనా సరే, దాని బెదిరింపుని లక్ష్యపెట్టనవసరం లేదు. దానికి ప్రభావితం కానవసరం లేదు. దాని స్పర్శ, కష్టాలను అవకాశాలుగా, వైఫల్యాన్ని విజయంగా, బలహీనతను సుస్థిర బలంగా మార్చివేయగలదు. ఎందుకంటే పరమేశ్వరుడు అనుమతించిందే దివ్యమాత అనుగ్రహం, ఇక దాని ప్రభావం నేడో, రేపో తథ్యం. ఆదేశించబడింది, అనివార్యమైనది, ఆపశక్యముకానిదది.

*CWSA 32:8-9* *శ్రీ అరవిందులు*

# ఆచరణలో నిజాయితి

మదర్! ఏదైనా ఒక రోజు ఎవరికైనా కష్టం కలిగి దానిని గురించి మీకు చెప్పటం లేదా మిమ్మల్ని దర్శించటం సాధ్యం కానపుడు ఏమి చెయ్యాలి?

ఏ మాత్రం సాధ్యం కానపుడు, ఒంటరిగా, స్థిరంగా ఒకచోట కూర్చొని మనసును నిశ్శబ్దం చేయటానికి ప్రయత్నించండి. అక్కడే ఉన్నట్లుగా నన్ను పిలవండి. పూర్తి నిజాయితీతో, ధ్యాసతో నేను వచ్చేటట్లు చేయండి; ఆపై చాలా నిశ్చలంగా, శాంతంగా ఉండి ఫలితం కోసం వేచి ఉండండి.

ఫలితం వస్తుందనే భావిస్తాను. ఎందుకంటే అక్కడ వున్న సమస్య స్వభావంపై అది ఆధారపడి ఉంటుంది.

ఒకవేళ ఇబ్బంది, వ్యక్తి యొక్క ఒక అంశం దేనినో వాంఛిస్తూ, మరొక అంశానికి అది సమంజసం కాదని తెలిసే ఉంటే అది సంక్లిష్టమౌతుంది. ఎందుకంటే ఏ అంశమయితే కావాలని కోరుకుంటుందో అది తన స్వీయ సంకల్పాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. అందుచేత ఒక వ్యక్తి స్థిరంగా కూర్చొని, మొదట దానిని నిజాయితీగా నివేదన చేసుకొనే స్వల్పకార్యానికి ఒప్పించగలగడంతో ప్రారంభిస్తే ఇక్కడ ఒక వ్యక్తికి నిజమైన ప్రగతి సాధ్యమౌతుంది. “నాకు కావలసినదేమిటో నాకు ఇప్పుడు తెలిసింది. కానీ అవసరమైతే నా ఈ కోరికను విడిచి పెట్టవలసి వుంటే అందుకు నేను

సిద్ధమే."

దీనిని మీరు మీ శిరసులోనే కాక, నిజాయితీగా చెయ్యాలి. అప్పుడు నేను చెప్పిన విధంగా మీరు ముందుకు సాగిపోవాలి. అప్పుడు ఆ వ్యక్తికి తెలుస్తుంది. ఏమి చెయ్యాలో తెలుస్తుంది.

కొన్నిసార్లు మీకు దానిని కాగితం మీద పెట్టినపుడు సులభతరం అవుతుంది. నేనక్కడ ఉన్నట్లుగా మీరు ఊహించుకోండి. ఒక కాగితం తీసుకొని మీరు నాకేమి చెప్పదలచుకున్నారో దానిని వ్రాయండి. కొన్నిసార్లు మీరు దానిని స్పష్టంగా నిర్మించుకుంటుండగానే మీకా సందర్భం యొక్క సరియైన దృశ్యపు అవగాహన కలుగుతుంది. సమాధానం సులభంగా దొరుకుతుంది. కొన్ని సార్లు ఇది అవసర మౌతుంది, కొన్నిసార్లు ఉండకపోవచ్చు, అది పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. మీరొక అయోమయంలో, ఒక సుడిగుండంలో ఉన్నట్లయితే, అన్నింటినీ మించి ఒక ప్రాణికమయిన ఉద్రేకంలోఉంటే, ఇలా పేపరుమీద పెట్టటమనేది మిమ్మల్ని అప్పటికే శాంతపరుస్తుంది. మీ శుద్ధీకరణం అపుడే ప్రారంభమౌతుంది.

*CWM 7:105-106*

తెలివి తక్కువ పనులు చేయటం ...

ప్రశ్న : తెలివితక్కువ పనులు చేసేవారుంటారు....

అవును.

వాళ్లకి తెలుసు తామలా చేస్తున్నామని, కాని వాళ్ళ మనసు దానిని సమర్థించదు. ఏ మాత్రం మద్దతు ఇవ్వదు. ఎటువంటి క్షమాపణలు, కారణం లేదా వివరణ ఇవ్వదు. ఇది ఏమి స్థితి?

ఈ స్థితి ఏమిటి? అంటే వాళ్లకు తెలుసు తాము తెలివితక్కువ పనులు చేస్తున్నామని, వాళ్లకా ఎరుక ఉంటుంది. కానీ దాని నుండి నిగ్రహించుకోలేరు. ఎందుకంటే వారి మనసుకు అలా నియంత్రించు కోవడానికి కావలసినంత శక్తి ఉండదు. కేవలం అంతరాత్మకు మాత్రమే కల్పించుకోగల సామర్థ్యముంటుంది. మీ మనసు మీ చైత్య సత్తతో

అనుబంధమై అంతరాత్మ ప్రభావాన్ని స్వీకరించగలిగితే అది ప్రతిఘటనను కూడగట్టుకోగల దృఢత్వాన్ని కలిగి ఉంటుంది. దానికి సత్యమేదో, కానిదేదో తెలుసు. దానికి సుహృద్భావన ఉంటే నిరోధించే శక్తిని కూడదీసుకొని, పోరాడి విజయాన్ని పొందుతుంది. ఒక్కటే షరతేమిటంటే చైత్యపురుషతో సంపర్కంతో ఉండటం.

మీరు నిర్ణయించుకున్నప్పుడే అది జరుగుతుంది. "ఈసారి అలా చేయకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను. అలా చెయ్యను నా శక్తినంతా కూడతీసుకుని అలా చేయకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను." మీరు కొంతైనా విజయాన్ని సాధించగలిగితే అదే ఎక్కువ. పెద్దది కానక్కరలేదు. చిన్న గెలుపు, పాక్షికమైనదైనా చాలు. మీరు కావాలనుకున్నది మీరు చేసి ఉండకపోవచ్చు. కానీ అభీప్స, కోరిక, వ్యామోహం ఇంకా అక్కడ ఉంటాయి. అది మీలో సుడిగుండాలను సృష్టిస్తుంది. కానీ బాహ్యంగా మీరు ప్రతిఘటిస్తారు. "నేనలా చెయ్యను, నేను కదలను, నన్ను నేను నిర్బంధించుకోవలసి వచ్చినా కాళ్ళు చేతులూ కట్టేసుకోవలసి వచ్చినా అలా చెయ్యను. అది పాక్షికమైన గెలుపే అయినప్పటికీ అది ఒక మహత్తరమైన విజయం. దీని వలన తరువాత మీరు మరికొంచెం ముందుకు వెళ్లగలుగుతారు. ఉధృతమైన వ్యామోహాలను మీలో బిగపెట్టి ఉంచే బదులు వాటిని కొంత శాంత పరచటం ప్రారంభించగలవు. మొదట వాటిని నెమ్మదిగా కష్టపూర్వకంగా అయినా శాంతింప చేయవచ్చు. అవి దీర్ఘకాలం ఉంటాయి. వెనుతిరిగి వస్తాయి. మిమ్మల్ని ఇబ్బంది పెడతాయి, విసిగిస్తాయి. మీలో చాలా నిరుత్సాహం నింపుతాయి. కానీ మీరు బాగా ప్రతిఘటించినపుడు కొంచెం కొంచెంగా పలుచబడి పోతుంది. మీరపుడు రెండవ వైఖరిని నేర్చుకోవటం ప్రారంభిస్తారు. "ఇప్పుడు నా చేతనను వీటికి అతీతంగా ఉంచుకోవాలనుకుంటున్నాను. అయినప్పటికీ ఇంకా ఎన్నో యుద్ధాలను చేయవలసి ఉంటుంది. కానీ నా చేతన వాటికన్నా ఉన్నతంగా నిలిచినపుడు నెమ్మది నెమ్మదిగా అవి మరి ఎన్నడూ తిరిగిరాని సమయం వస్తుంది." మీరు పరిపూర్ణంగా స్వతంత్రులని అనుభూతి చెందే క్షణం వస్తుంది. మీరు దానిని

గ్రహించకపోవచ్చు కూడా అంతే. అందుకు చాలా సమయం పట్టవచ్చు. అది త్వరగా కూడా రావచ్చు. అది వ్యక్తిత్వపు పటిష్టతపై, మీ ఆకాంక్ష నిజాయితీపై ఆధారపడి ఉంటుంది. కానీ స్వల్పమైన నిజాయితీ ఉండే వారికి కూడా, ఈ పద్ధతిని అనుసరిస్తే వాళ్ళు సఫలీకృతులౌతారు. అందుకు సమయం పట్టవచ్చు. మొదటి విషయంలో వ్యక్తీకరించకపోవటం అనే విషయంలో విజయం సాధించవచ్చు. భూమిపై అన్ని శక్తులూ ఆత్మ వ్యక్తీకరణకు మొగ్గు చూపుతాయి. ఈ శక్తులన్నీ తమను తాము ఆవిష్కరించుకోవాలనే ధ్యేయంతోనే వస్తాయి. కానీ మీకొక అవరోధాన్ని కల్పించి వాటి వ్యక్తీకరణను నిరాకరిస్తే అవి కొంత తడవు ఆ అడ్డుకట్టను ఛేదించటానికి ప్రయత్నించి చివరకి అలసిపోయి ఆవిష్కరణకు అవకాశం వైపు ఉపక్రమించి నిశ్శబ్దంగా మిమ్మల్ని విడిచి వెళ్ళిపోతాయి.

*CWM 5:210-212*

శ్రీ అరవిందులకు నివేదన కావటం

ప్రశ్న : శ్రీమాతా! సంపూర్ణమైన నిజాయితీతో శ్రీ అరవిందులకు నా మనసును నివేదించటానికి చాలా మహోన్నతమైన ఏకాగ్రతను సాధిచండం అవసరం కాదా? ఏ మార్గాన్ని అవలంబించటం వలన ఈ అమూల్యమైన ప్రావీణ్యాన్ని పెంపొందించుకోవచ్చు.

రోజు మొత్తంలో నువ్వు ప్రశాంతంగా ఉండగల ఒక నిర్దిష్టమైన సమయాన్ని ఎంచుకో.

శ్రీ అరవిందుల గ్రంధాన్నొకటి తీసుకుని ఒకటీ లేదా రెండు వాక్యాలను చదువు. నిశ్శబ్దంగా, ఏకాగ్రంగా ఉండే ఆ వాక్యాల అంతరార్థాన్ని ఆకళింపు చేసుకో. నిశ్శబ్దాన్ని పొందేంత లోతుగా మనసును ఏకాగ్రం చెయ్యి. ఇలా ప్రారంభించి ప్రతిరోజూ ఫలితంవచ్చే వరకు ప్రయత్నించు. అయితే సహజంగానే వచ్చే నిద్రలోకి జారిపోకుండా చూసుకో.

*CWM 12:205* — *శ్రీమాత*


ఇంటి వాతావరణంలోనూ, నీ దైనందిన కార్యాక్రమాల మధ్యలో కూడా సాధన చేయడం సాధ్యమే. చాలామంది అలా చేస్తారు. మొదట

ప్రారంభంలో కావలసినదల్లా ప్రతిరోజూ వీలైనంతగా శ్రీమాతను స్మరించటం, మీ హృదయంలో ఆమె ఉండే స్థానంపై కొంత సమయం ఏకాగ్రతను నిలపడం, వీలైతే ఆమెను దివ్య జననిగా భావించడం, మీలో ఆమె ఉనికిని అనుభూతి చెందాలని ఆకాంక్షించడం, మీరు చేసే పనులను ఆమెకు నివేదించటం, ఆంతర్యం నుండి ఆమె మీకు మార్గం చూపి మిమ్మల్ని రక్షించాలని ప్రార్థించండి. ఇది సమయం తీసుకొనే సుదీర్ఘమైన తొలి దశ. కానీ ఒక వ్యక్తి నిజాయితీగా, పట్టుదలతో ఈ మార్గాన్ని అవలంబించినపుడు నెమ్మది నెమ్మదిగా అతని మానసిక స్థితి మార్పు చెందటం ప్రారంభమయి, సాధకునిలో ఒక క్రొత్త చైతన్యం వికసించటం మొదలయి అంతరంగంలో శ్రీమాత సాన్నిధ్యపు ఎరుక, స్వభావం, జీవనాలపై ఆమె పనిచేయడం అవగతమౌతుంది లేదా ఏదైనా ఆధ్యాత్మిక అనుభవంతో జ్ఞానోదయానికి ద్వారాలు తెరుచుకోవచ్చు.

*CWSA 32:186* — *శ్రీ అరొబిందొ*

శ్రీమాత కృపకు పాత్రమవ్వాలంటే ఒకే ఒక విషయం అవసరం. అది పరిపూర్ణమైన నిజాయితీతో, నిజంగా సమగ్రంగా తెరుచుకోవటం

*CWSA 32:164* — *శ్రీ అరొబిందొ*



నీవు నీ పట్ల నిజాయితీతో ఉండు-

(ఆత్మ వంచన చేసుకోకు).

భగవంతుని పట్ల చిత్తశుద్ధితో ఉండు-

(శరణాగతిలో బేరసారాలు లేవు).

మానవత్వంతో సాదాసీదాగా ఉండు-

(డంభంతో ప్రదర్శన కూడదు).

*CWM 14:70* — *ది మదర్*

# నిజాయితీ మార్గంలోని అవరోధాలు

కష్టాలు, చిత్తశుద్ధి

నిజాయితీతో పనిచేయ సంసిద్ధమైతే, త్వరగా గాని, తరువాత గాని అవరోధాలను అధిగమిస్తావు.

*CWM 12:354*

పరిపూర్ణ నిజాయితీకి అతిగొప్ప అవరోధాలు, మక్కువలు, లేక మోజులు (అవి మానసికమైనవి, ప్రాణికమైనవి, లేదా భౌతికమైనవి గావచ్చు) ముందుగా యేర్పరచుకొన్న భావాలు. ఇదిగో ఈ ఆటంకాలనే అధిగమించి తీరాలి.

*CWM 14:71*

నిరపేక్ష చిత్తశుద్ధిని సముపార్జించుకొన్నానని నీవు దృఢంగా నమ్మినపుడు, అసత్యతలో మునక వేసినట్లు ఖచ్చితంగా చెప్పవచ్చు.

*CWM 14:69*

ప్రశ్న : యోగాభ్యాసానికి తలుపు తెరచినపుడు, అనేక ఆటంకాలను ఎదుర్కోవలసి ఉంటుందని ఎవరో అన్నారు. ఇది యథార్థమా?

అది అనుల్లంఘనీయ నియమమేం కాదు, అదెక్కువగా ఆ వ్యక్తిమీద ఆధారపడి ఉంటుంది. వారి స్వభావంలోని బలహీన విషయాలకొక పరీక్షగా విపరీతపరిస్థితులు అనేక మందికెదురౌతాయి. స్వేచ్ఛగా మార్గంపై నడవగలగడానికి ముందు సుస్థిరంగా ప్రతిష్ఠితం కావలసి వున్న యోగపు అపరిత్యాజ్య ఆధారపీఠం, సమచిత్తత లేక సమభావం. ఆ దృక్కోణం నుండి, సహజంగానే, సమస్త అలజడులు నీవు నెగ్గవలసిన పరీక్షలు. కాని దివ్యవెలుగుకు, పరమసత్యానికి నీవు తెరచుకొనడానికి అడ్డుపడే, నీ చుట్టూ నీ మానసిక కట్టడాలు నిర్మించిన పరిమితులను భగ్నం చేసేందుకు అవి అవసరం.

*CWM 3:52*

## ఆకాంక్ష, విరోధ శక్తులు

ఒక ఆకాంక్షతో, ఆధ్యాత్మిక జీవనానికొచ్చినపుడు, విరోధ శక్తులు మనపై దాడిచేస్తాయా?

ప్రతివాని మీదా, ఎటువంటి మినహాయింపులు లేకుండా.

అవి చాలా మంచివిగా కన్పించినా గూడానా?

కొన్ని సమయల్లో అవును, కొన్ని సమయాల్లో ఇవి చాలా ప్రమాదకరం కూడా.

కానీ మనకెలా తెలుస్తుంది?

ఆహా! అత్యంత తేలిక మార్గం, నీకో గురువు ఉంటే, పోయి ఆయనను అడగడం. అది ప్రతి వ్యక్తికీ అందుబాటులో ఉన్న విషయం. తన గురువుమీద నమ్మకముంచి, అతనిని కనుగొని, అతనిని అడిగితే సరిపోతుంది. నిజంగా అతనికి తెలుసు గనుక అతను చెప్తాడు.

నీకు గురువు లేకపోతే అప్పుడది కొంచెం ఎక్కువ ఇబ్బంది అవుతుంది. ఎందుకనంటే ఈ విరోధ శక్తులు చాలా తెలివిగలవి. ఆపత్తు, దైన్యత, మోసం అనే అభిప్రాయం కలిగించేటట్లు కన్పించవు. అలా కన్పిస్తే వెంటనే తెలుసుకుని, వాటిని లోనికి తీసుకొన నంగీకరించవు. సాధారణంగా అదొక స్నేహితుని ముసుగులో వస్తాయి.

నిజాయితీ కలవాడివైతే, చిన్నచిన్న సూచనలను త్వరగా గ్రహిస్తావు. నీ దర్పాన్ని సంతృప్తిపరచలేక నీలో సంశయాలను రేకెత్తించే, లేక సరిగ్గా ఏం చేయవలసి వుందో దానిని కొంచె తెలియకుండా చేసే చిన్న సూచనలను చాలా చిన్న విషయాలను, నీకు చాలా నిజాయితీఉంటే త్వరగా గ్రహిస్తావు. చాలా నిజాయితీ కలవాడివైతే ఆత్మగౌరవపు సంతృప్తులలో నిన్ను ప్రోత్సహించే, అభినందనలు, ప్రయత్నాలు, మోసాలకు నిన్ను లోబడకుండా ప్రత్యేకించి నీవు తగినంత జాగరూకుడవై ఉంటే వాటి ద్వారా ఆవలికి చూడగలుగుతావు. నీ దర్పానికి కొంచెం ప్రోత్సాహమిచ్చే, "అది అతి ఖచ్చితమైన గుర్తు - 'నేనేమంత చెడ్డవాడిని

కాదు. నేను చేసే దాన్నంతా ఎంతో మంచిగానే చేస్తాను. నా ప్రయత్నం చాలా ప్రశంసనీయం. నా చిత్తశుద్ధి సమస్త దూషణకతీతమైనది, వగైరా" అని అనుకొనేటట్లు చేసేదొక ఖచ్చితమైన గుర్తు. మరింతకింతగా నీవు సంతృప్తి పడతావు. అందులో నీకు సందేహం ఉండదు. కాని అక్కడ కూడా, అదెల్లప్పుడూ ఈ రూపాలనే తీసుకోదు. వ్యక్తులను బట్టి ఇతరమైన విషయాలు ఉంటాయి. కొంతమందికిలా, మరికొంతమందికి అవి తాము గొప్పవారమనే భావాలు మేలుకొలుపుతాయి. "నేనీవిధంగానే కొనసాగిస్తే నేనో గొప్ప యోగినౌతాను. నాకు గొప్ప శక్తులుంటాయి. నేను చాలా మంచిపని చేస్తాను. ఎంత చక్కగా నేను దైవాన్ని సేవించబోతున్నాను, ఆయన దాంతో ఎంతో సంతోషపడతాడు" అనుకొంటాడు. అది చాలా ప్రమాదకరం. సరిగ్గా దానికి వ్యతిరేకంగా జరగవచ్చు. "ఇంతా చేసి, బహుశా నేనెందుకూ పనికిరానేమో. నా ప్రయత్నం అసలు దేనికైనా అర్హమైనదేనా? ఈ కృషి వల్ల ఏమీ ఫలితం ఉండదు. అసలు ఆధ్యాత్మిక జీవితం జీవించే సామర్థ్యం నాకుందా? బహుశా, నేనసలెన్నడూ ఏమీ చేయలేనేమో, నిజం చేసుకోలేని కల కోసం, వాస్తవ విషయాలను వదిలివేస్తానేమో.. అసలింతకీ నేనెవర్ని? ఒక ధూళి కణాన్ని, దైవాన్ని కనుగొనడానికి ప్రయత్నించడం సమంజసమేనా? బహుశా అసలు నేనేమీ కనుగొనలేనేమో, నా ప్రయత్నాలన్నీ వ్యర్థమేమో" అని అనుకోవడం కూడా జరుగవచ్చు. అది ఇంకా ఎంతో ప్రమాదకరం. అటువంటి ఉదాహరణలు వందలకొలదిగా చూపగలను.

*CWM 5:155-56*

## యథార్థంగా రక్షించేదొకటి ఉంది.

నిన్ను నిజంగా రక్షించే ఒకే ఒక్కటుంది. అది నీ చైత్యపురుషతో, అతి చిన్న సంపర్కంతోనైనా ఉండడం, ఆ సంపర్క ఘనయేకత సంవేదన ఉండడం. అప్పుడు, ఈ వ్యక్తి దగ్గర్నుండి లేక ఆ పరిస్థితి నుండి నీ దగ్గరకేది వచ్చినా దానిని చైత్యపురుష ముందు పెట్టి, అది సరైనదో కాదో చూడు. నీవు సంతృప్తిచెందినప్పటికీ, అన్ని విధాలా నీకు నువ్వు

"చివరకు నాకుండాలని అనుకొన్న స్నేహితుడిని నేను కనుగొన్నాను. నా జీవితంలో అత్యుత్తమ పరిస్థితులలో ఉన్నాను. వగైరా" అని అనుకో. నీ చైత్యపురుషతో నీకున్న ఈ స్వల్ప సంపర్కం ముందు పెట్టు. అది కాంతివంతంగా వుంటుందో లేక ఆకస్మికంగా కొంచెం అసౌకర్యంగా అన్పిస్తుందో చూస్తావు. అధికంగా కన్పించదు. పెద్ద శబ్దం చేసేదేదీ ఉండదు. కాని కొంచెం అసౌకర్యం ఉండవచ్చు. నీవనుకొన్నట్లుగా అది ఉందని ఖచ్చితంగా ఇక నీవెంత మాత్రం అనుకోకూడదు! అవును, ఆ చిన్ని స్వరాన్నే ఎప్పుడూ తప్పక వినాలని అనేది అప్పుడు తెలుసుకుంటావు. అదిగో అదే సత్యం, మరితరమైనదేదీ ఇక నెంతమాత్రం నిన్ను ఇబ్బంది పెట్టలేదు.

ఒక నిజాయితీ గల ఆకాంక్షతో ఆధ్యాత్మిక జీవితంలోనికి వస్తే, కొన్ని సమయాల్లో అసుఖాన్ని కలిగించే విషయాల మహోత్పాతం నీమీద పడవచ్చు. నీ మంచి స్నేహితులతో తగాదా పడతావు. నీ కుటుంబం నిన్ను ఇంటి బయటకు గెంటవచ్చు. నీవు సంపాదించాననుకొన్నదాన్ని పోగొట్టుకోవచ్చు. జ్ఞానం వైపు, యోగం వైపు సైతం చాలా చాలా ప్రయత్నించిన తరువాత గొప్ప ఆకాంక్షతో భారతదేశానికొచ్చిన ఒక వ్యక్తిని నేనెరుగుదును. అదెప్పుడో, చాలా కాలం క్రితం జరిగింది. ఆ కాలంలో జనం గడియారపు గొలుసులను, చిన్న ఆభరణాలను పెట్టుకొనేవారు. ఈ పెద్ద మనిషి దగ్గర వాళ్ళ అమ్మమ్మ ఇచ్చిన బంగారపు పెన్సిలు ఉంది. ప్రపంచంలో అత్యంత విలువైన వస్తువుగా దానినతడు భావించి దానిపై బాగా మక్కువతో ఉండేవాడు. అది అతని గొలుసుకు కట్టి ఉండేది. పాండిచ్చేరి లేదా భారతదేశంలో మరెక్కడో లేక కొలంబోలోనే అనుకొంటాను. దిగబోతున్నప్పుడు ఓడ నుండి చిన్న పడవలలోనికి దిగితే అవి తీరానికి చేరుస్తాయి. ఈ పెద్ద మనిషి, అందుచేత ఓడ పై దిగడానికేర్పాటు చేసిన చోటు నుండి పడవలోనికి దూకవలసి ఉంటుంది. అతని అడుగు సరైనచోట పడలేదు. కాని ఏదోవిధంగా నిలద్రొక్కుకున్నాడు. కాని అతడు ఒక్కసారిగా హఠాత్తుగా కదలడం వల్ల, ఆ చిన్న బంగారపు పెన్సిలు సముద్రంలో పడిపోయి

సరాసరి లోతుల్లోకి పోయింది. అతడు మొదట చాలా బాధపడ్డాడు. తనలో తాను 'ఎందుకు బాధ, ఇదీ భారతదేశ ప్రభావం, నా బంధనాల నుండి నేను స్వేచ్ఛ పొందాను' అనుకొన్నాడు. చాలా చిత్తశుద్ధి కలిగిన వారికే ఆ విషయం అటువంటి రూపం తీసుకొంటుంది. ప్రాథమికంగా ఇబ్బందుల హిమపాతం, ఎప్పుడూ నిజాయితీగల వారి మీదే. నిజాయితీ లేనివారు, చివరకు తాము పొరపడ్డామని తెలుసుకొనేటట్లు తయారయ్యేందుకు, అత్యంత సుందరమైన రంగులతో వాటిని తాము మోసపోవ స్వీకరిస్తారు. కాని ఎవరికైనా పెద్దగా ఇబ్బందులున్నప్పుడు, ఆతడొకానొక చిత్తశుద్ధి శ్రేణికి చేరుకొన్నాడనే దాన్నది ఋజువు చేస్తుంది.

*CWM 5:155-58*

నేనిప్పుడు కొంచెం హాస్యంగా చెప్తున్నాను. ఏ కొంచెం నిజాయితీ గలవారికైనా, ఎంతో ఎక్కువ కాదు, అది అలసిపోయేటట్లు చేస్తుంది. కొంచెం నిజాయితీ మరింత వేగంగా ముందుకు పోవ మంచిపోట్లు పొడవడం అనేది తప్పక జరిగే అవకాశముంది. ఇది సాధ్యమే. వాస్తవంగా ఇదే జరుగుతుందని నేను నమ్ముతున్నాను. కాని ఈ వైఖరి .... ఈ వైఖరి ఇది, కొంచెం అధిక దయార్ద్రమైనది, మామూలుగా లాభదాయకం కాదు. చిత్తశుద్ధితో ఆకాంక్షిస్తే, ఇబ్బందులుంటే బహుశా ఈ ఇబ్బందులు తగ్గిపోతాయి. అలా ఆశిద్దాం.

(శిష్యుని వైపు తిరుగుతూ) కనుక వాళ్ళకు నీవు చెప్పవలసిన విషయం: నిజాయితీగా ఉండండి, సహాయం లభిస్తుంది అని.

*CWM 8:132-133* *ది మదర్*

## ప్రతి వ్యక్తికీ సంఘర్షణ ఉంటుంది

నీవు వీటి నుండి బయట పడ్తావు. అందుకు సందేహం లేదు. ప్రతి వానికీ ఈ సంఘర్షణలు ఉంటాయి. బయట పడడానికి అవసరమైనదేమిటంటే, నిజాయితీ, తదేక దీక్ష.

చాలామంది చేసేటట్లు, ఈ సంఘర్షణలను ఆహ్వానించినందువల్ల ప్రయోజనం ఉండదు. లేక వాటిని బయటకు నెట్ట పోరాడడం కోసం

అవి వచ్చినపుడు అనుమతించడం వల్ల ప్రయోజనం ఉండదు. ఎందుకనంటే అవెప్పుడూ తమను తాము తిరిగి, తిరిగి వచ్చేటట్లు చేసుకొంటాయి. వాటిని తప్పించుకోకుండా ఎదుర్కోవాలి. ఎవరికీ అవి పూర్తిగా ముఖ్యంగా యోగం తొలిదశలలో లేకుండా పోవు. కాని ప్రశాంతంగా వాటిని తప్పించుకొంటే, అదే ఒక ముందడుగు. ప్రశాంతంగా తయారు కావడం, అది మామూలు అయ్యేంత వరకు యథార్థ అంతరాత్మిక స్థితిని వెనుకకు పిలవడం చేస్తే అది తొలగిపోనన్నాపోతుంది, లేక సంఘర్షణ కనీన స్థాయి కన్నా చేరుకొంటుంది. ప్రగతికది ఉత్తమ మార్గం.

*. CWSA 31:744-745*

అలా ఎందుకనంటే నీ మనస్సు, ప్రాణికం నిజాయితీగా తయారయ్యాయి. అందుచేత దాడి బలమైనదిగా, అసాధారణమైనదిగా నీకు కన్పించింది. ఇతఃపూర్వం, నీవు అప్పుడప్పుడూ తలవంచుతున్నావు గనుక, దాన్ని కోరుకునే భాగం తీవ్రంగా పట్టుబట్టలేదు. దాని మీద ఒత్తిడి పడినపుడు, తక్కిన ప్రాణిక స్వభావంచే అంత తీవ్రంగా సంవేదించబడలేదు. నీ మానసిక, అంతరాత్మిక, ఉన్నత ప్రాణిక అస్తిత్వాలు, దాని నుండి పూర్తిగా ఎడమై నిలిచాయి. ఇంకా ఆ కోరికను నిలుపుకొనే ఉన్నది. నీ భౌతిక ప్రాణికం, అప్పుడప్పుడు వ్యతిరేక శక్తులచే, ఆ కోరిక క్రియాశీలమయ్యేటట్లు నెట్టబడుతోంది. కొద్ది రోజుల క్రితం నీవు బాధపడిన భౌతిక అలజడిని సృష్టించడం కూడా ఈ కోరికయే. నిమ్న ప్రాణికానికి సంబంధించిన ఈ కోరికను నీవు పూర్తిగా వదిలించుకొని తీరాలి.

*CWSA 31:263*

అధిగమించవలసినదేదైనా స్వభావంలో ఉండి ఉంటే, సాధకుడు అధిగమించి, స్వేచ్ఛ పొందేంత వరకు, దానిని పరీక్షకు గురిచేసే సంఘటనలను తనపైకిసతతం ఆకర్షిస్తూ ఉంటుంది. ముఖ్యంగా, ఆ వ్యక్తి అధిగమించ ఒక చిత్తశుద్ధి గల కృషి చేస్తున్నప్పుడు, కనీసంగా, తరచుగా జరిగే విషయమిది. అతని తీర్మానాన్ని భగ్నం చేయ

ప్రయత్నించేది, లేక దానిని పరీక్షకు పెట్టేది (ఎందుకనంటే అది చేయ, తమకు హక్కున్నదంటాయి) లేక ఆకాంక్షించిన మార్పుకు సంబంధించిన దాని సత్యత, పటిష్టతలపై పట్టుబట్టే లేక పురోగమనాన్ని వేగవంతం చేసేందుకు ఒత్తిడి కలిగించేటట్లు వేలుపులన్నా చేస్తుండవచ్చు అని కూడా మనం చెప్పుకోవచ్చు. చివరి దృక్కోణం నుండి దానినంగీకరిస్తే అది చాలా బాగా సహాయపడ్తుంది.

*CWSA 31:653* *శ్రీ అరవిందులు*

## దుఃఖితులు, వ్యధాభరితులు, లేక నిరుత్సాహ పడినవారు

మొదటి చరణం చాలా తెలివి గల సలహానిస్తుంది. తనను మొదటి బాణం తాకగానే బాగా శిక్షణ పొందిన యుద్ధ ఏనుగు పారిపోదు. దాని వీరోచిత నిరోధ వైఖరిలో ఎటువంటి మార్పు లేకుండా అది బాధను భరిస్తూ ముందుకు పోతూనే ఉంటుంది. సత్యమార్గాన్ననుసరించ అభిలషించే వారు సహజంగానే సకల దుస్సంకల్ప రూపాల దాడులకు గురౌతారు. వాళ్ళు అర్థం చేసుకొనకపోవడమే కాక, వారికర్థం కాని దాన్ని సామాన్యంగా ద్వేషిస్తారు కూడా.

నిన్ను గురించి మనుష్యులు తీవ్ర విద్వేషంతో చెప్పే తప్పుడు మాటల వల్ల, విచారపడినా, వ్యథ చెందినా, లేక నిరుత్సాహ పడినా, నీవు మార్గం మీద ఎక్కువ దూరం ముందుకు పోలేవు. దురదృష్టవంతుడివి గనుక, లేక నీ సమయం అంత మంచిదికాదు గనుక కాదు అలాంటివి నీకు ప్రాప్తించేది, కాని అందుకు విరుద్ధంగా, దివ్య చేతన, దివ్యకృప నీ తీర్మానాన్ని తీవ్రంగా తీసుకొని, నీ తీర్మానం నిజాయితీగలదేనా, కష్టాల నెదుర్కోతగినంత బలం నీకున్నదా లేదా అని చూడ్డానికి నీ మార్గం మీద పరిస్థితులను ఒక గీటురాయిగా తయారయ్యేందుకు అనుమతించినందు వల్ల అవి ప్రాప్తిస్తున్నాయి.

అందుకని ఎవరైనా నిన్ను హేళన చేసినా, పెద్దగా ఔదార్యం చూపని విధంగా ఏదైనా మాట్లాడినా, అలాంటిది జరగడానికి, నీలోని బలహీనత, లేక అపరిపూర్ణత అనుమతించిందో, కనుగొనడానికి నీలోపలికి నీవు

మొదట చూచుకోవాలి, నిస్పృహ చెందకూడదు, కోపం తెచ్చుకోకూడదు, లేక వ్యథ చెందకూడదు. ఎందుకనంటే, నీ యథార్థ విలువ నీవనుకొంటున్న దానిని జనం ప్రశంసించరు. అందుకు విరుద్ధంగా, నీవు సరిచేసుకోవలసిన వున్న బలహీనతను, లేక అపరిపూర్ణతను, లేక వికారాన్ని నీకు ఎత్తి చూపినందుకు దైవకృపకు ధన్యవాదాలు తెలుపాలి. అందుచేత అసుఖంగా ఉండే బదులు, పూర్తి సంతృప్తితో దాని నుండి ప్రయోజనాన్ని, నీకు వ్యతిరేకంగా ఉద్దేశించబడిన అపకారం నుండి ఒక గొప్ప ప్రయోజనాన్ని సాధించుకోవాలి.

దానితో పాటు, యథార్థంగా మార్గాన్నన్నుసరించి, యోగాభ్యాసం చేయాలనుకొంటే, ఇతరుల ప్రశంస కోసం గాని, లేక గౌరవం కోసం గానీ చేయక, నీ అస్తిత్వానికిది తప్పించుకోలేని అవసరంగా దానిని చేయాలి, మరోవిధంగా నీవు సుఖంగా ఉండలేవు గనుక దానిని చేయాలి. జనం నిన్ను మెచ్చుకొన్నా, మెచ్చుకొనకపోయినా, అది అసలే మాత్రం ముఖ్యం కాదు. సాధారణ మనుషులకు దూరమైతే, మామూలు జీవన సరళి నీకు పరిచయం లేనిదిగా అన్పిస్తే, చాలా తక్కువ మంది నిన్ను మెచ్చుకుంటారు. అది చాలా సహజం అని ముందుగానే నీకు నువ్వు చెప్పుకొంటే మంచిది, ఎందుకనంటే వాళ్ళు నిన్ను అర్థం చేసుకోలేరు.


మళ్ళీ చెప్తున్నాను అది ఏ మాత్రం ముఖ్యం కాదు.

*CWM 3:280-283* — *ది మదర్*

యథార్థమైన చిత్తశుద్ధి మార్గంపై ముందుకు పోవడంలో వుండనే ఉంటుంది. ఎందుకనంటే మరో విధంగా ఉండలేవు. మరోవిధంగా చేయలేవు గనుక నీ జీవితాన్ని నీవే దివ్య జీవితానికి అర్పించుకొంటావు. మరోవిధంగా చేయలేవు గనుక నీ అస్తిత్వాన్ని రూపాంతరీకరించ, వెలుగులోనికి వచ్చేందుకు కాంక్షిస్తావు. ఎందుకనంటే అది నీ జీవిత కార్యం, ఉద్దేశ్యం.

అదలా ఉన్నప్పుడు నీవు సరైన మార్గంమీదున్నావనేది ఖాయం.

*CWM 3:283* — *ది మదర్*



నిజాయితీ గల ఒక హృదయం ప్రపంచంలోని అన్ని అసాధారణ శక్తులంత విలువైనది.

*CWSA 28;577* — శ్రీ అరవిందులు

# కపటత్వ ఛాయలు

## సూత్రాలు

ప్రశ్న: నేను దైవాన్ని మాత్రమే కోరుకుంటాను తప్ప ఇతరమైనదేదీ కాదు అని నిజాయితీగా భావిస్తాను. కానీ ఇతర వ్యక్తులతో సంపర్కంలోకి వచ్చినపుడు, ఏ విలువా లేని విషయాలలో నిమగ్నమై ఉన్నపుడు, సహజంగా నా ఒకే ఒక గమ్యమైన దైవాన్ని మరచిపోతాను. ఇది నిజాయితీ లేకపోవడమా? ఒకవేళ కాకపోతే దానర్థం ఏమిటి ?

అవును, అది అస్తిత్వంలో నిజాయితీ లేకపోవడమే, అక్కడ ఒక భాగం దైవాన్ని కోరుతుంది, ఇంకో భాగం వేరే దేనినో కోరుకుంటుంది. అజ్ఞానము, మూర్ఖతల వల్లనే అస్తిత్వంలో కపటత్వం ఉంటుంది. కానీ ఒక పట్టువిడువని సంకల్పంతో, దైవానుగ్రహం పట్ల సమగ్ర విశ్వాసంతో ఈ కపటత్వాన్ని నయం చేసుకోవచ్చు.

*CWM 14:68*

ప్రశ్న : ఒక లేఖలో శ్రీఅరవిందులు ఇలా అన్నారు "యుక్తంగా అర్పించబడిన ప్రార్థన మొత్తంగా మనల్ను దైవానికి దగ్గరగా తీసుకువచ్చి, ఆయనతో ఒక యుక్తమైన అనుబంధాన్ని స్థాపిస్తుంది." ఈ లేఖలో యుక్తంగా అర్పించడమంటే ఏమిటి? దయచేసి వివరిస్తారా?

వినయము, నిజాయితీ. ఇది మొత్తం బేరం చేసే ధోరణి ఒక కపటమని చెప్పకుండా ముందుకు సాగదు, ఈ కాపట్యత, ప్రార్థన నుండి మొత్తం విలువను దూరం చేస్తుంది.

*CWM 15:209*

వ్యక్తి అంతరంలో ఒక ఆంతరిక సంఘర్షణ సంభావ్యత ఉన్నంతవరకు అతనిలో ఇంకా కొంత కపటం ఉన్నట్లే.

*

అస్తిత్వం లోని సమస్త విభజన ఒక కాపట్యతయే.

నీ దేహానికి నీ అస్తిత్వ సత్యానికి మధ్యన ఒక అగాధాన్ని తవ్వడం అన్నది గొప్ప కాపట్యత.

ఎప్పుడైతే భౌతిక అస్తిత్వం నుండి సత్యమైన అస్తిత్వాన్ని ఒక అగాధం వేరు చేస్తుందో, వెంటనే ప్రకృతి దానిని అన్ని రకాల ప్రతికూల సూచనలతో నింపేస్తుంది, వాటిలో అత్యంత బలమైనది భయం, అత్యంత ఉపద్రవ కరమైనది సంశయం.

## వంచన చేసే అలవాట్లు

చాలా భాగం మనుష్యులు తమను తాము మోసం చేసుకునే అలవాటును ఎప్పటినుండో స్థిరపరచుకుని ఉంటారు. వందల కొద్దీ విభిన్న మార్గాలలో వారిని వారు మోసం చేసుకుంటారు, ప్రతిదీ ఇంకోదానికన్నా ఎక్కువ కుయుక్తి తో, వంచనతో, సూక్ష్మతతో ఉంటుంది, ఇదంతా కూడ ఒకప్పుడు ఒక సంపూర్ణ సరళతతో, పరిపూర్ణ కాపట్యంతో ఉన్నది.

*CWM 14:68-70*

ఒక సమగ్రమైన పారదర్శక నిజాయినీతో ఉండాలి. నిజాయితీ లోపమే మనం ప్రస్తుతం ఎదుర్కొంటున్న కష్టాలకు కారణం. నిజాయితీ లేకపోవడం అన్నది అందరిలో ఉంటుంది. మనిషి మూల స్వభావమే అతడిని కపటంగా చేస్తుంది. ఇది చాలా క్లిష్టమైనది, ఎందుకంటే మనిషి స్థిరంగా తనను తాను మోసం చేసుకుంటూ, సత్యాన్ని తన నుండి దాచి, తనను తాను మన్నించుకుంటూ ఉంటాడు...

నిజాయితీగా ఉండటం కష్టం, కానీ వ్యక్తి కనీసం మనసులో నిజాయితీగా ఉండచ్చు, ఆరోవిల్లి సభ్యుల నుండి కోరుకునేది ఇదే. ఇంతకు మునుపు ఎప్పుడూ లేని శక్తి ఇప్పుడు అక్కడ ఉంది : మనిషిలోని కపటం ఈ శక్తి క్రిందకు దిగిరావటాన్ని, అస్తిత్వంలో దీన్ని అనుభూతించటాన్ని నిరోధిస్తుంది. ప్రపంచం అసత్యంలో నివసిస్తుంది, మనుష్యుల మధ్యన ఉండే అన్ని అనుబంధాలు ఇప్పటివరకు అసత్యం మీద, వంచన మీద ఆధారపడి ఉన్నాయి.

*CWM 13:268*

## కుటిలతను గుర్తించడం

కుటిలత నయం చేయలేని ఒక లోపంగా కనిపిస్తుంది, ఇది అస్తిత్వంలో అనుగ్రహం యొక్క పని విధానాన్ని రద్దు చేస్తుంది. ప్రపంచంలో కాళీమాత భయంకర జోక్యాన్ని ఆవశ్యకతగా చేసింది తప్పనిసరిగా కుటిలతే.

ఒక కపటమైన వ్యక్తికి నేను ఆదేశాలు ఇవ్వలేను, ఎందుకంటే అతను కపటంగానే ప్రతిస్పందిస్తాడు, అది అతను మునిగి ఉన్న అంధకారాన్ని ఇంకా ఎక్కువ చేస్తుంది.

కపటంగా ఉన్న వారితో మనమేమీ చేయలేము, వారిని ఉన్నట్లుగా అంగీకరించడం తప్ప.

ఆశీర్వాదములు. *CWM 17:343*

నీ తప్పు ఏదైనా నీకు చూపించబడితే ఒక నిధిని నీకు చూపినట్లే. అంటే నీలో ఒక తప్పును, అసామర్థ్యాన్ని, అర్థం చేసుకోవడంలో లోపాన్ని, బలహీనతను, కపటత్వాన్ని నువ్వు పురోగమించడానికి అడ్డుపడే దాన్నంతా నువ్వు కనుగొన్న ప్రతిసారి ఒక అద్భుతమైన నిధిని నువ్వు కనుగొన్నట్లే.

*CWM 3: 220-221*

ప్రశ్న : నేను ఒక కష్టాన్ని అధిగమించాలనుకుంటున్నాను, ఇదంతా నేను నాలో తప్పులను లేదా బలహీనతలను గుర్తించినపుడు వాటిని సమర్థించడానికి, లేదా వాటికి అభిముఖంగా అడ్డుకునేందుకు నాలో ఏదో కొంత ప్రయత్నిస్తూ ఉంటుంది.

~~ఈ~~ 'కొంత' ఒక అజ్ఞాన స్వీయ గౌరవానికి చెందిన కుటిలత, తన లోపాలు గుర్తించబడవనే నమ్మికతో వాటిని దాచిపెట్టడంకన్నా, లోపాలను సరిచేసుకోవడానికి వాటిని గుర్తించడం ఉదాత్తమువైనది, సమున్నతమైనదని ~~ఈ~~ కుటిలత ఇంతవరకు అర్థం చేసుకోలేదు.

సకల మానసిక సమస్యలలాగే ఇక్కడ కూడ నిజాయితీ, ఒక పరిపూర్ణమైన, రాజీపడని నిజాయితీ నిజమైన పరిహారం.

*CWM 16:364* *శ్రీమాత*

నీ స్వభావంలోని కుటిలత గురించి నువ్వు మాట్లాడుతున్నావు. ఒకవేళ అస్తిత్వంలోని కొంతభాగం వ్యక్తిలోని ఉన్నత కాంతికి అనుగుణంగా జీవించడానికి, లేదా బాహ్యాన్ని ఆంతరిక వ్యక్తిత్వంతో సమానం చేయడానికి సుముఖంగా లేకపోవడమే కుటిలతకు అర్థం అయితే అప్పుడు ఈ భాగం అందరిలో ఎప్పటికీ కుటిలంగానే ఉంటుంది. ఒకే ఒక మార్గం ఏమంటే ఆంతరిక అస్తిత్వం పైన వత్తిడి తెచ్చి, దానిలో అంతరాత్మిక, ఆధ్యాత్మిక చైతన్యాన్ని క్రిందకు దిగి వచ్చే వరకు వృద్ధి చెందిస్తే, ఇది బాహ్య వ్యక్తిత్వం నుండి కూడ అంధకారాన్ని బయటకు తోసివేస్తుంది.

*CWSA 29:52*

## కుటిలత, ఉన్మత్తత

ఉన్మత్తతలో పడిపోయిన వారు నిజమైన స్పర్శను కోల్పోయి తప్పుడు సంపర్కంలోకి ప్రవేశిస్తారు. ఇది కొంత అస్వచ్ఛత అనాత్మిక కోరికతో మార్గంలోకి ప్రవేశించడం వల్ల కావచ్చు, లేక కొంత కుటిలత, అహంకారం, అసత్య దృక్పథం, లేక మస్తిష్కంలో కొంత బలహీనత లేక క్రిందకు తనలోకి పిలిచిన శక్తిని భరించలేని నాడీవ్యవస్థ వల్ల కావచ్చు.

ఈ పథంలో తనను తాను అధిగమించడాన్ని సాధించిన వ్యక్తి మార్గనిర్దేశకతను అనుసరించడం సురక్షిత మార్గం. కేవలం ఆ మార్గదర్శకతను ప్రగాఢంగా, నిజాయితీగా అనుసరించాలి. స్వంత మనసు, దాని భావాలు, ఊహలు జోక్యం చేసుకోవడాన్ని అనుమతించకూడదు. అది తప్పనిసరిగా ఒక నిజమైన మార్గనిర్దేశకత కావాలి గానీ ఒక అనుభవం లేనితనం, లేక వంచన నిర్దేశించేది కాకూడదు.

*CWSA 31:810*

సాధారణ క్రైస్తవునికి ఇలా ఉండటం కష్టం, ఎందుకంటే క్రీస్తు బోధనలు పూర్తిగా మేధావి చైతన్యానికి, ఐరోపా సమాజ విద్య చేత శిక్షణ పొందిన ప్రాణిక వ్యక్తి చైతన్యానికి చెందిన ఇంకో తలంలోనివి. రెండవ వర్గం వ్యక్తి తాను హృదయపూర్వకంగా బోధించిన మొత్తం ఒక బోధకునిగా లేక మతగురువుగా ఉన్నా, ఎప్పటికీ సాధన చేసి

ఉండకపోవచ్చు. . కానీ నిజమైన విశ్వాసానికి, నమ్మకానికి, దృష్టికి చెందిన ఒక కేంద్రం నుండి ఆలోచించడం, అనుభూతించడం, చర్య తీసుకోవడం అన్నది మానవస్వభావానికి ఎక్కడైనా కష్టం. ఒక సాధారణ హిందువు ఆధ్యాత్మిక జీవితాన్ని అత్యున్నతమైనదిగా పరిగణిస్తాడు, సన్యాసిని గౌరవిస్తాడు, భక్తుని చేత చలిస్తాడు, కానీ ఒకవేళ తన కుటుంబ పరిధిలో ఎవరైనా ఆధ్యాత్మిక జీవితం కోసం ప్రపంచాన్ని వదిలిపెడితే ఎంతగా కన్నీళ్ళు,

వాదోపవాదాలు, ఆక్షేపణలు, శోకాలు చోటుచేసుకుంటాయంటే! అతను సహజంగా మరణించిన దాని కన్నా అధ్వాన్నంగా ఉంటుంది. ఇది చైతన్యంతో ఉండే మానసిక కుటిలత కాదు- వాళ్ళు పండితులలా వాదిస్తూ నీది తప్పు అని నిరూపించడనికి శాస్త్రాలలోకి వెళతారు, ఇది అచైతన్యం, ప్రాణిక కుటిలత, దీని గురించిన ఎరుక లేకుండా హేతుమనసును ఒక తోడుదొంగగా ఉపయోగిస్తారు.

*CWSA 29:53-54* *శ్రీ అరవిందులు*

## అంతరాత్మ చిత్తశుద్ధి

నీ అంతరాత్మకు సంబంధించిన చిత్తశుద్ధికి కొలమానం ఏమిటంటే, దైవంపట్ల నీకుండే వ్యాకులత, ఉన్నత జీవితానికై నీకుండే ఆకాంక్ష.

*CWSA 29: 55-56* *శ్రీ అరవిందులు*

మనం గందరగోళ పడకుండా స్పష్టంగా అర్థం చేసుకోవాల్సిన రెండు విషయాలు ఉన్నాయి. కొన్ని అవసరాలు (భౌతిక పదార్థాన్ని పూర్తిగా నియంత్రించడంలో విజయం సాధించాలనుకుంటే అవి పూర్తిగా అవసరాలు), అటు తరవాత నైతిక భావనలు. ఇవి రెండు పూర్తిగా వేర్వేరు విషయాలు. ఉదాహరణకు, ఒకరు తమ శరీరాన్ని విషప్రయోగం చేయడం లేదా తమ మెదడులను అణిచివేయడం లేదా తమ సంకల్పాన్ని రద్దు చేయడం ఇలాంటివి చేయవచ్చు , ఎందుకంటే వారు తమ భౌతిక చైతన్యంపై ఆధిపత్యం కావాలని తమ శరీరాన్ని మార్చగల సామర్థ్యాన్ని కలిగి ఉండాలని కోరుకుంటారు. అయితే అలా చేయడం ద్వారా నైతికంగా యోగ్యత పొందుతారని భావించి మాత్రమే ఎవరైనా ~~ఈ~~ పనులు

చేస్తే, అది మిమ్మల్ని ఎక్కడికీ తీసుకుపోలేదు, మీకు ఇంకేమీ దొరకదు. ఎందుకంటే ఇది దాని కోసం ఉద్దేశించినది కాదు. పూర్తిగా ఆచరణాత్మక కారణాల కోసం ఒకరు దీన్ని చేస్తారు: అదే కారణంతో, ఉదాహరణకు, మీకు విషం తీసుకునే అలవాటు లేదు, ఎందుకంటే అది మిమ్మల్ని విషపూరితం చేస్తుందని మీకు తెలుసు. ఆపైన కొందరు తీసుకునే చాలా నెమ్మదిగా పనిచేసే విషాలు ఉన్నాయి (వారికీ ఈ విషయంలో ఎటువంటి తప్పు కనపడదు, ఎందుకంటే దాని ప్రభావం చాలా నెమ్మదిగా ఉంటుంది కాబట్టి వారు దానిని సులభంగా గుర్తించలేరు), కానీ ఒక వ్యక్తి తన భౌతిక కార్యకలాపాలలో పూర్తిగా ఆధిపత్యం పొందాలనుకుంటే అలాగే తమ శరీర అసంకల్పిత చర్యలలో కొంత జ్ఞానంతో ఉండాలనుకుంటే, అప్పుడు ఇటువంటి విషయాలకు దూరంగా ఉండాలి, అంతే కాని నైతిక కారణాల వల్ల కాదు: పూర్తిగా ఆచరణాత్మక కారణాల కోసం, యోగ పరమైన సాధనల కోసం చేయవచ్చు.

పుణ్యం పొందాలనే ఆలోచనతో లేదా మీరు పుణ్యాన్నిసంపాదిస్తే దేవుడు చాలా సంతోషిస్తాడు,మీలో ప్రత్యక్షమవుతాడు అనే ఆలోచనతో దీన్ని చేయకూడదు! అలా జరిగే అవకాశమే లేదు అలా జరగదు కూడా! తప్పులు చేసిన పిదప, తన లోపాలను గ్రహించి, తన బలహీనతను గ్రహించి, వాటన్నిటి నుండి బయటపడాలని హృదయపూర్వకంగా కోరుకునే వ్యక్తికి సన్నిహితంగా బహుశా, భగవంతుడు ఉంటాడు. తప్పులే ఎప్పుడూ చేయని వ్యక్తి ఇతర మానవులపై తనకున్న బాహ్యాఆధిక్యతతో సంతృప్తి చెందుతాడు. అందువల్ల దైవం అతనికంటే సాధారణ వ్యక్తికే ఎక్కువ దగ్గరగా ఉంటాడు. దైవం దృష్టిలో ఇది పెద్ద వ్యత్యాసాన్ని చూపించలేదు. చాలా వ్యత్యాసాన్ని చూపించేది ఏమిటంటే, చిత్తశుద్ధి, సహజత్వం, ఆకాంక్ష యొక్క తీవ్రత, అటువంటి అవసరం కావాలి,ఆ అవసరం మిమ్మల్ని ఆక్రమించి ప్రపంచంలో ఇంకేది లెక్కచేయనంత శక్తివంతం కావాలి.

*CWM 5: 348-349* — శ్రీ మాత

# పూర్తి నిజాయితీగా తయారవ్వడం ఎలా

## సమగ్రంగా నిజాయితీగా మారడం

మన ఉనికి యొక్క అన్ని భాగాలలో నిజాయితీగా ఉండటం యోగ మార్గం.

*CWM 13:268*

మీరు భగవంతునితో, 'నాకు నువ్వు మాత్రమే కావాలి' అని చెబితే, మీరు చిత్తశుద్ధితో ఉండే విధంగా ఆ భగవంతుడు పరిస్థితులను ఏర్పాటు చేస్తాడు.

*CWM 14:66*

ప్ర: 'నేను నీవాడిని, నీవాడిని మాత్రమే' అని మొత్తం ఉనికి చెప్పగలిగే స్థితిని ఎలా వేగంగా సాధించగలం?

ఆచరణలో ఒకటిగా విలీనమయ్యే రెండు చర్యలు ఉన్నాయి.

(1) మీరు సాధించాలనుకునే లక్ష్యాన్ని ఎప్పటికీ మర్చిపోకండి.

(2) అస్తిత్వంలోని ఏదైనా భాగాన్ని, దాని కదలికలలో దేనినైనా నీ ఆకాంక్షకు విరుద్ధంగా ఉండే అవకాశం ఇవ్వద్దు.

దీని వల్ల రాత్రివేళ జరిగే మనసు కదలికల పట్ల స్పృహ అవసరం అవుతుంది, రాత్రి పూటజరిగే కార్యకలాపాలు తరచుగా పగటి పూట ఉండే ఆకాంక్షకు విరుద్ధంగా ఉండి దాని అభివృద్ధిని తిరోగమించేలా చేస్తుంది.

అప్రమత్తత, చిత్తశుద్ధి, కృషిని కొనసాగించడం, దయ ఇవి మిగిలిన పనిపూర్తి చేస్తాయి.

*CWM 16:378*

## శ్రీ మాతకు అన్నీ నివేదించండి

ఒక వ్యక్తి ఏదైనా చెడుపని చేసినట్లయితే, చేయకూడని పని అని తెలిసీ అలాచేసినప్పుడు, ఉదాహరణకు, 'అమ్మకు దాని గురించి తెలుసు,

నేను ఆమెకు చెప్పనవసరం లేదు' అని తనకు తాను చెప్పుకుంటే, దానిని లోపల దాచుకుంటే, దాని మీద జాగ్రత్తగా ఒక తలుపు వేసేసి, దానిని తమ హృదయంలోనో లేదా మరెక్కడైనా ఉంచుకుంటారు. ఇదంతా సరిగా ఆలోచించకపోతే.. ఒకరికి అసౌకర్యంగా అనిపిస్తుంది, లోపల ఏదో ఎదురు తిరుగుతుంది, ఆహ్లాదకరంగా ఉండదు... 'సరే, నేను దాని గురించి మదర్‌తో చెప్పబోతున్నాను' అని బయలుదేరినప్పుడు మీరు గొప్ప ప్రయత్నం చేయాలి, అవునా?

గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అవుతుంది, నాలుక ఎండిపోతుంది, ఆపై మీకు మాటలు రావటం చాలా కష్టంగా ఉంటుంది, నిజంగా, దాని విషయమై ఎలా ముందుకు వెళ్లాలోమీకు తెలియదు, అయ్యో! కానీ ఇప్పుడు మీరు నిర్ణయించుకున్నారు, ఒక పెద్ద ప్రయత్నం చేయాలని: మీరు చాలా శ్రమతో మాటలను ఒక్కొక్కటిగా బయటకు తీసే ప్రయత్నం చేస్తారు, చివరకు మాట్లాడతారు, వీలైనంత ఖచ్చితంగా చెప్పడానికి ప్రయత్నిస్తారు. నాయనా , ఇది ఎంత పెద్ద తలుపును తెరుస్తుంది అంటే మీరు చిత్తశుద్ధితో చేసిన పనితో నేను నేరుగా మీ చైత్యపురుషుని లోనికి ప్రవేశించగలను. ఆపై, నేను ప్రవేశించినప్పుడు, నేను కాంతినంతా, శక్తినంతా, సంకల్పాన్నంతా, చైతన్యాన్నంతా, అవసరమైన దృఢనిశ్చయాలన్నింటినీ నీలో నింపుతాను, తద్వారా మీరు చేసిన పొరపాటుని మళ్ళీ చేయలేరు. ఒక కప్పులో ఎక్కువ నీరు పోస్తే, అది పొంగిపొర్లుతుంది - పొంగిపోయేది చాలా ఉంది, కానీ ఇంకా కొంత మిగిలే ఉంటుంది, అది చాలు అది పని చేస్తుంది. మీరు ఈ ప్రయత్నాన్ని మరోసారి చేస్తే, మీకే తెలుస్తుంది - ఇంకా మీరు చెప్పడానికి కూడా ఇంకేమీ ఉండదు, ఎందుకంటే మనమధ్య దాచడానికి మిగిలేది ఏదీ ఉండదు - అది చాలా మంచిది, మీరు గొప్ప పురోగతి సాధించినట్లే.

*CWM 6:198-199* — *శ్రీమాత*

**Vol. 54, No. 11**
**November 2024**


Date of Publication:
1st November 2024

TN/PMG (CCR)/ WPP 473/24-26
Registered: PY/41/2024-26

**AKHILA - Akhila Bharata Patrika (Telugu)**

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

*Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo*



**Cover Page Flower:**

**Simple Sincerity**

*The beginning of all progress.*

*Spiritual Significance and explanation of the flower given by the Mother*

*Botanical name:* Aster amellus

*Owner:* Sri Aurobindo Society
*Printer:* Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
*Publisher:* Pradeep Narang for Sri Aurobindo Society
*Published from:* Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
*Printed from:* Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

---


A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001

# అఖిల

అఖిల భారత పత్రిక

డిసెంబర్ 2024

# మృత్యు రహస్యం

# విషయ సూచిక



భౌతిక విజ్ఞాన శాస్త్రంగాని, గుప్తజ్ఞాన శాస్త్రం గాని, దేహం చిరకాలం జీవించగలిగేటందుకు అవసరమైన పరిస్థితులను కల్పించినప్పటికీ, ఆంతరిక వికసనాన్ని వ్యక్తం చేయతగిన ఉపకరణంగా తనను తాను దేహం మలుచుకోలేకపోతే, అంతరాత్మ ఆ దేహాన్ని త్యజించడానికి ఏదో ఒక మార్గాన్ని కనుగొంటుంది. నూతన దేహం ధరించ సాగిపోతుంది. పదార్థ లేక భౌతిక కారణాలు, మృత్యువు సంభవించడానికి గల ఏకైక లేక యథార్థ కారణం కాదు. ఒక నూతన జీవ పరిణామానికి గల ఆధ్యాత్మిక ఆవశ్యకతే మృత్యు యథార్థ అత్యంత ఆంతరిక కారణం.

*CWSA 22:854* — *శ్రీ అరవిందులు*

# మృత్యు రహస్యం

భువిపై గల సమస్త జీవరాశికి మరణం వాస్తవం అని ఆపాదించబడింది. మౌలికంగా ప్రకృతి మరణానికిచ్చిన అర్థం నుండి గాక వేరు అర్థంలో మనిషి దానిని అర్థం చేసుకుంటున్నాడు. మనిషిలోనూ అతని స్థాయికి దగ్గరగాఉండే జంతువులలోనూ మరణావశ్యకత, వారి చేతనలో ఒక ప్రత్యేక రూపాన్ని, ప్రాశస్త్యాన్ని సంతరించుకొంది. తిరిగి నూతనంగా తయారు గావలసిన, మార్పు చెందవలసిన, రూపాంతరణ చెందవలసిన ఆవశ్యకతకు సంబంధించిన ఒక సంవేదన ఈ నిమ్న ప్రకృతికి ఆధార భూతమైన ఉప చేతస్సు జ్ఞానంలో వుంది.

భువిపై పదార్థపు ఆ పరిస్థితులు మృత్యువును అపరిత్యాజ్యం చేసాయి. అచేతన ప్రథమ స్థితి నుండి అభివృద్ధి చెందుతుండే చేతనకు ఒక ఎదుగుదల పదార్థ పరిణామపు మొత్తం అర్థం. ఈ ఎదుగుదల ప్రక్రియలో రూపాలు అంతరించడం ఒక అనివార్య ఆవశ్యకతగా తయారైంది, జరుగుతున్నది సరిగ్గా అదే. ఎందుకనంటే వ్యవస్థీకృతమైన వ్యష్టిచేతనకు ఒక సుస్థిర ఆధారంగా అయ్యేందుకు వీలుగా ఒక స్థిర రూపం అవసరమైంది. అయినప్పటికీ, మృత్యువును అనివార్యమైన దానిగా చేసి రూపానికి సంబంధించిన స్థిరత్వమే పదార్థం రూపాలుగా తయారవ్వాలి, అది లేకుండా, ఇవి లేకుండా పదార్థ భూమికపై వ్యవస్థీకృత ఉనికికి సంబంధించిన ప్రథమ స్థితి లోపించినట్లవుతుంది. ప్రాణ-క్రియా శక్తుల ఘనిష్ట వ్యష్టీకరణ, దేహధారణ అసాధ్యమౌతుంది. కాని ఒక నిర్దిష్ట, ఘనిష్ట రూపనిర్మాణం, వెంటనే కఠినమైన, వంగనిదిగా, రాయిలా బిగుసుకుపోయే ధోరణిలో పడిపోతుంది. వ్యష్టిరూపం, బాగా బంధించి ఉంచే మూసలాగా నిలిచిపోతుంది. అది క్రియా శక్తుల కదలికలను అనుసరించలేదు. విశ్వజనీన క్రియాశీలతలోని పురోగమనాత్మక మార్పుతో సామరస్యతతో మార్పు చెందలేదు. ప్రకృతి పట్టుబట్టే దానిని నిరంతరంగా అనుసరించలేదు, అది ప్రవాహం నుండి బయటకు త్రోసివేయబడుతుంది. రూపానికీ, దాని మీద ఒత్తిడి కలిగించే క్రియాశక్తికీ మధ్య పెరుగుతూ పోతుండే హెచ్చు తగ్గులు, అసమానతల ఒకానొక చోటున, రూపం పూర్తిగా అంతరించవలసిన అవసరం త్రోసివేయనలవి గానిది. ఒక నూతన రూపం తప్పక సృజించబడాలి. ఒక నూతన సామరస్యత, సమానత

సాధ్యమవ్వాలి. ఇది మృత్యువుకు గల యథార్థ ప్రాశస్త్యం, ప్రకృతిలో దాని ప్రయోజనం. కాని దేహం అతివేగంగా, స్పందించగలదిగా, మృదువుగా, తయారుకాగలిగితే మారుతున్న చేతనతో పాటు మార్పుకు దేహజీవకణాలు జాగృతం కాగలిగితే ఒక తీవ్రమైన, కనుమరుగుకు అవసరం ఉండదు, మృత్యువికెంత మాత్రం అనివార్య మైనది కాదు. విశ్వజనీన క్రియాశక్తుల కదలికను, ప్రపంచ ఆంతరిక రూపాంతరీకరణా ప్రవాహాన్ని అవి అనుసరించ గలిగినంత ఉత్తమంగా, మానసిక, ప్రాణిక అస్తిత్వాలు అనుసరిస్తాయి. ఒక విధంగా పరిణామం వాటిని తనతో తీసుకుపోతుంది. కాని దేహం అత్యంత పదార్థ సంబంధ స్వభావ ధర్మానికి కట్టుపడిపోయి, చాలా నిదానంగా కదుల్తుంది. కొన్ని అంటే 70 లేక 80, ఒక వంద లేక 200 సంవత్సరాల తర్వాత బహుశా అది అత్యధికం అనుకుంటాను, బాహ్య అస్తిత్వం శకలాలైయ్యేంత తీవ్రంగా దేహం విడిపోతుంది. అభ్యర్థన, సమాధానాల మధ్య భేదం, దేహానికి సంబంధించి పెరుగుతున్న అశక్తత, బాధ్యతారాహిత్యం, మృత్యువుకు సంబంధించిన దృగ్గోచర సంవిధానాన్ని కొని తెస్తుంది...

మొత్తం అస్తిత్వం ఏకకాలంలో, తన పురోగమనాత్మక రూపాంతరీకరణలో విశ్వపు ఆంతరిక నడకతో అడుగు కలిపి ముందుకు పోగలిగితే, అస్వస్థత ఉండదు, మరణమూ ఉండదు. కాని మొత్తం అస్తిత్వం, సమగ్రంగా అత్యున్నత భూమికల నుండి అక్షరాలా అది జరగాలి. ఆ ఉన్నత భూమికలలో అది అత్యంత నమ్యం, రూపాంతరీకరించు క్రియాశక్తులకు కావలసిన ప్రమాణంలో అత్యంత పదార్థ సంబంధ భూమికల వరకు లొంగుబాటు జరుగుతుంది. ఆ అత్యంత పదార్థ భూమిక స్వాభావికంగా, నూతన రూపంలోనికి వేగవంతంగా జరిగే మార్పుకు వంగనిది, అంగీకరించనిది, మొండిది.

*CWM 3:36-37, 87-90* — *ది మదర్*

# వైరుధ్యాలు - ప్రగతి ప్రేరకాలు

## భావాలు సూక్తులు : శ్రీ అరవిందులు

**88 - తాను బ్రతకడం కోసం మృత్యువు ప్రపంచాన్ని నిర్మించింది. మృత్యువును రద్దు చేయగలవా? అప్పుడు జీవితం కూడా నశించిపోతుంది. నీవు మృత్యువును రద్దు చేయగలవు, కాని దానినొక మహనీయ జీవనంగా రూపాంతరీకరించగలవు.**

**89 -** తాను ప్రేమించగలందులకు కర్కశత్వం చేత ప్రపంచం నిర్మితమైంది. కర్కశత్వాన్ని రద్దు చేయగలవా? అప్పుడు ప్రేమ కూడా నశిస్తుంది. నీవు కర్కశత్వాన్ని రద్దు చేయలేవు, కాని దానిని దానికి వ్యతిరేకించే ఒక భయంకర దివ్యప్రేమ ఆనందాలలోకి రూపమార్పిడి చేయగలవు.

**90 -** తాము తెలుసుకోగలందుకు, అవిద్య, తప్పులచే ప్రపంచం నిర్మితమైంది. అజ్ఞానాన్నీ, తప్పునూ రద్దు చేస్తావా? అప్పుడు జ్ఞానం కూడా నశించిపోతుంది. నీవు అజ్ఞానాన్ని తప్పును రద్దు చేయలేవు. నీవు వాటిని, పూర్తి దేదీప్యమాన హేతుబుద్ధి అతిక్రమణగా మార్చి వేయగలుగుతావు.

**91 -** జీవితం ఒక్కటే ఉండి మృత్యువు లేకపోయి ఉంటే, అమృతత్వ మనేది ఉండదు. ప్రేమ ఒక్కటే ఉండి, కర్కశత్వం లేకపోయి ఉంటే, సంతోషం అనేది ఒక నిరుత్సాహ, క్షణ భంగుర ప్రహర్షం మాత్రమే అవుతుంది. హేతుబుద్ధిఒక్కటే ఉండి అజ్ఞానం లేకపోయి ఉంటే, మన అత్యున్నత సిద్ధి, ఒక పరిమిత హేతుత్వాన్ని, ప్రాపంచిక వివేకాన్ని మించి వుండేదికాదు.

**92 -** మృత్యువు రూపాంతరీకరించబడితే, మహా జీవితం అవుతుంది. అంటే అమృతత్వం. కర్కశత్వ రూపమార్పిడి జరిగితే అది దివ్య ప్రేమ అవుతుంది. అంటే భరించనలవి గాని ప్రహర్షం. అవిద్యను వస్తుతః మార్చి వేస్తే అది వివేక, జ్ఞానాల ఆవలకు దుమికే దివ్య వెలుగు అవుతుంది.

## మదర్ వ్యాఖ్యానాలు

భావం ఒకటే. అంటే వ్యతిరేకతలు, వైరుధ్యాలు పురోగతికి ఉత్ప్రేరకాలు. కర్కశత్వం లేకపోయి ఉంటే దివ్యప్రేమ నిరుత్సాహమైన దౌతుంది అని చెప్పడం... అభివ్యక్త,అనభివ్యక్తమైన దానికావల అస్తిత్వం కల దివ్య ప్రేమ సూత్రం, నిరుత్సాహతకు, కర్కశత్వానికి సంబంధమేమీ లేనిదై ఉంటుంది. పదార్థం తన అభివ్యక్తిని తీవ్రతరం చేయడానికి, వ్యతిరేకతలు వేగవంతమైన, చాలా ప్రభావవంతమైన ఉపాయాలు అనేది శ్రీ అరవిందుల భావనగా కన్పిస్తున్నది.

అనుభవంగా చెప్పాలంటే అన్నింటికంటే ముందు శాశ్వత దివ్యప్రేమలో ఎవరైనా సంపర్కంలోకొస్తే, అతనికి వెంటనే ఒక సంవేదన - ఎలా చెప్పాలి? ఒక అవగాహన, ఒక ఇంద్రియ సంవేదన కలుగుతుంది. అది అర్థం చేసుకోవడం కాదు, అదెంతగా మలచబడినా, సంసిద్ధం చేయబడినా 'తత్'ను

అభివ్యక్తం చేయజాలదు అనే అర్థంలో ఇది పూర్తిగా ఖాయం. సంవేదించేది, మొదటగా యీ విధమైన అసామర్థ్యతను. ఆ తరువాత అనుభవం వస్తుంది. ఒక రూపాన్నభివ్యక్తం చేసేదేదో దానిని 'కర్మృశత్వం' అని ఖచ్చితంగా చెప్పలేం. ఎందుకనంటే మనకు తెలిసినటు వంటి కర్మృశత్వం కాదది, కాని పరిస్థితుల సమగ్రతలోనివే అయిన ఒక కంపనం ప్రత్యక్షమౌతుంది. కొంత తీవ్రతతో, యిచట అభివ్యక్తమయ్యే ప్రేమను తిరస్కరిస్తుంది. ఖచ్చితంగా అది యిది : ప్రస్తుతం మనుగడలో వున్న ప్రేమ అభివ్యక్తిని తిరస్కరించేది, పదార్థ ప్రపంచంలో వున్నదేదో అది. నేను సాధారణ ప్రపంచాన్ని గురించి మాట్లాడడం లేదు. ప్రస్తుతమున్న చేతన అత్యున్నత స్థితిని గురించి మాట్లాడుతున్నాను. సంభవించిన దేనిని గురించో నేను మాట్లాడుతున్నది ఒక అసంభవం. ఈ వ్యతిరేకతచే ఎదుర్కోబడి ఆగిపోయిన చేతన భాగం, దివ్య ప్రేమ మూలానికి 'ఈ తిరస్కృతి అనుభవం లేకుండా, పొందలేనటువంటి తీవ్రతతో' సరాసరి విన్నవించుకొంటుంది. పరిమితులు భగ్నమౌతాయి, అంతకు ముందు అభివ్యక్తం కాని వరద క్రిందికి గ్రుమ్మరిల్లుతుంది. అంతకు ముందు వ్యక్తం కానిదేదో వ్యక్తం అవుతుంది.

మనం జీవన్మరణాలు అని చెప్పుకొనే వాటి దృక్పథం నుండి దీనిని చూచినపుడు ఒక అటువంటి స్పష్టమైన అనుభవం వున్నది. అది ఈవిధమైన నిరంతర 'ధ్యాస' లేక మృత్యు సన్నిధి, మృత్యు సంభావ్యత ఉంది. దానినే 'సావిత్రి'లో ఊయల నుండి సమాధి వరకూ సాగే ప్రయాణమంతటి యందూ మన వెంట ఎల్లప్పుడూ ఒక సహ ప్రయాణీకుడున్నాడు అని చెప్పారు. మనలో మృత్యు భయం, లేక మృత్యు సన్నిధి వెంటనంటి వుంటోంది. దీనితో పాటు జీవకణాలలో శాశ్వతత్వం కోసం ఒక దివ్య శక్తి పిలుపున్నది. ఈ నిరంతర భయం లేకపోతే తీవ్రతతో కూడిన ఆ పిలుపు ఉండేది గాదు. ఈ సమస్త విషయాలు అభివ్యక్తిని తీవ్రతరం చేసే మార్గాలు మాత్రమే దానిని పురోగమింప చేసి, దానిని మరింత పరిపూర్ణం చేసే మార్గాలు మాత్రమేనని అర్థం చేసుకొంటాడు. చాలా ఘనిష్టంగా దానిని సంవేదించ నారంభిస్తాడు. సాధనోపాయాలు మొరటైనవి గావచ్చు. అవెందుకంటే స్వయంగా అభివ్యక్తే చాలా మొరటైనది. శాశ్వతంగా పురోగమనాత్మకమైనది, అభివ్యక్తం గావడానికి అత్యంత పరిపూర్ణం, మరింత తగినదియైనకొద్దీ బాగా మొరటైన సాధనోపాయాలు, సూక్ష్మతరమైన వాటికి దారిస్తాయి. అటువంటి క్రూరమైన

వ్యతిరేకతల ఏవిధమైన అవసరం లేకుండా ప్రపంచం పురోగమిస్తుంది. ఇదెందుకనంటే ప్రపంచం ఇంకా తన పసితనంలోనే వుంది. మానవ చేతన పూర్తిగా ఇంకా తన శైశవ దశలోనే ఉంది.

ఇదొక చాలా ఘనిష్ట అనుభవం.

పురోగమించడానికి మరణించవలసిన అవసరం భువికి లేనప్పుడు, మృత్యువికెంత మాత్రం ఉండదు అనేది దానిననుసరించి ఉంటుంది. పురోగమించడానికి బాధపడవలసిన అవసరం భువికి లేనప్పుడు బాధపడడమనేది ఎంత మాత్రం ఉండదు. ప్రేమించడానికి, ద్వేషించవలసిన అవసరం భువికెంత మాత్రం లేనప్పుడు ద్వేషమికెంత మాత్రం ఉండదు.

సృష్టిని తన తమస్సు నుండి బయట పడవేసి, దానిని దాని సాఫల్యత వైపు సాగిపోయేటట్లు చేయడానికి, ఇది అత్యంత వేగవంతమైన అత్యంత ప్రభావవంతమైన ఆలంబనం.

(సుదీర్ఘ మౌనం)

బహుశా! అది త్వరగా జరిగిపోవచ్చు. కాని ప్రశ్న యిక్కడికి దారితీస్తుంది. సంక్లిష్టతను సారళ్యతలోనికి, కర్కశత్వాన్ని దివ్య ప్రేమలోనికీ అలా రూపాంతరం చెందిచే "తత్"ను ఆకర్షించడానికి 'చాలినంత' ఆకాంక్ష, చాలినంత తీవ్రత, ప్రభావం, ఇంకా అలా కొనసాగడమనే దానికి దారితీస్తుంది.

*CWM 10:166-68* *ది మదర్*

# మరణం ముట్టడి లేకపోతే

జీవితంకు ప్రకృతి నిరంతరం వేసే ప్రశ్నే మరణం. అది తననే ఇంకా కనుగొనలేదని ప్రకృతి జీవితానికి గుర్తు చేస్తుంది. ఒకవేళ మరణం దాడిలేనట్లయితే అదే అంసపూర్ణ స్థితిలో జీవి శాశ్వతంగా ఈ భూమిపై ఉండవలసి వస్తుంది. ఈ మరణం కారణంగానే 'పరిపూర్ణ జీవితం' అనే ఆలోచన, ఆ జీవిలో మేల్కొని, అది సాధించడానికి మార్గాలను, సాధ్యాసాధ్యాలను పరిశీలించే అవకాశం దానికి లభిస్తుంది. - ఆలోచనలు మరియు సంగ్రహావలోకనములు

*SABCL* ***16**వ భాగం, పుట **386***

కొద్దిగా జాగరూకుడైన ఏ వ్యక్తి అయినా తన జీవిత కాలంలో ఒక్కసారి అయినా తనకు తాను వేసుకునే ప్రశ్న - ఇది మనిషి తన ఆలోచనలో ఈ జీవితం నిరంతరాయంగా కొనసాగుతుంది అనే భ్రమలో వుంటాడు. కానీ ఎప్పుడైనా యాదృశ్చికంగానైనా దగ్గరగా మొదటిసారి మరణం పరిచయం అయినప్పుడు అతనిలో తిరోగమనం మొదలవుతుంది.

ఈ మరణం సున్నిత హృదయములను భయపెడుతుంది. ఇతరులకు అన్యాయంగా అనిపించి, వారిని ఆగ్రహమునకు గురిచేస్తుంది. 'ఎవరూ కోరుకోకుండానే, ఏమి అర్థం కాకుండానే ఈ రాక్షస ప్రహసనంలో భాగం ఎలా అవుతారు?' అని ప్రతీఒక్కరూ ఎవరికి వారు ప్రశ్నించుకునే వైఖరి ఉంది. 'చావడానికే అయితే మరి పుట్టడం ఎందుకు? కేవలం ఈ తిరోగమనం, విచ్ఛిన్నం కొరకే అయితే మరి ఇంత అభివృద్ధి, ఇన్ని రకాల జ్ఞాన పురోభివృద్ధికై ఆరాటం, కృషి ఎందుకు? కొందరు తమలో ఒక రకమైన తిరుగుబాటును చవిచూస్తే, కొంత బలహీనులు నిరాశ, నిస్పృహలకు లోనవుతారు. ఒకవేళ దీని అంతటి వెనుక ఒక సచేతన పరమేచ్ఛ ఉన్నట్లయితే ఈ పరమేచ్ఛ (చాలా) క్రూరమైన శక్తిగా కన్పిస్తుంది.

కానీ, శ్రీ అరవిందులు చెప్పేదేమిటంటే, పదార్థ చైతన్యంలో పరిపూర్ణత అనే అవసరాన్ని బహుశా... ఇది నిర్వివాద అంశం కాకపోవచ్చు. మేలుకొలుపడానికి, పురోగతి ఆవశ్యతకు ఇదొకా అనివార్య ఆలంబనం. ఈ మరణం అనే విపత్తు లేనట్లయితే ప్రాణులు అన్నీ తాము వున్న స్థితిలోనే తృప్తి చెంది వుండిపోతాయి అని శ్రీ అరవిందులు అంటారు. కానీ మనం విషయాలను వున్నవి ఉన్నట్లుగా అంగీకరించి, వాటి నుండి బయటపడే మార్గమును చూడాలి. వాస్తవం ఏమిటంటే, సమస్త విశ్వము, సమస్త సృష్టి నిరంతర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తూ ఒక పరిపూర్ణత వైపుకు సాగుతూ ఉంటుంది. ఒక పరిపూర్ణ స్థితికి చేరుకున్నాము అనుకునే లోపే అది ఇంకా అసంపూర్ణమైనది అని మనకు (విశ్వంకు) అర్థం అవుతుంది. చైతన్యపు అతి సూక్ష్మ స్థితి ఈ అభివృద్ధిని అనుసరిస్తూ ఒక ఉన్నత ప్రమాణాలకు చేరుకుంటేనే ఈ లయబద్ధ ప్రగతి, విశ్వ పురోభివృద్ధి లయను, ఆకృతిని పోలి ఉండి, దైవ ప్రగతి యొక్క లయను చేరుకుంటుంది. కానీ ఈ భౌతిక ప్రపంచము దృఢమైనది, మొండిది. దానిలో రూపాంతరీకరణ చాలా చాలా నెమ్మదిగా సాగుతుంది. అది ఎంత నెమ్మదిగా సాగుతుంది అంటే ఈ మానవ

చైతన్య పరిశీలనకు దాదాపుగా అందనిది లేదా కాల గమనములో కొలవలేనిది, గ్రహించలేనిది అయి ఉంటుంది. అందువల్లనే అంతః మరియు బాహ్య గమనములో నిరంతరం ఒక అసమతుల్యత ఉంటుంది.

ఈ సమతుల్యత లేకపోవడం మరియు బాహ్య రూపాలు అంతఃపురోభివృద్ధిని అనుసరించలేకపోవడం కారణంగా రూపాలలో మార్పులు మరియు క్షీణత ఆవశ్యకత ఏర్పడుతుంది. కానీ ఒకవేళ సమాన లయబద్ధతను పొందడానికి, ఈ పదార్థములోనికి సరిపడినంత చైతన్యమును చొప్పించ గలిగితే ఒకవేళ ఈ పదార్థము అవసరమైనంత నమ్యత (వంగే గుణము) పొంది అంతః పురోభివృద్ధిని అనుసరించగలిగితే, అందువలన మరణం అనేది అవసరమే ఉండదు.

శ్రీ అరవిందుల ప్రకారం ఈ ప్రకృతి, ఈ పదార్థ చైతన్యములో అవసరమైన ఆకాంక్షను, నమ్యతను మేల్కొల్పడానికి ఒక విభిన్నమైన మార్గమును కనుగొన్నది.

జడత్వము అనేది పదార్థము యొక్క బలమైన లక్షణము అనేది విస్పష్టము. అలానే ఈ మరణం అనే హింస లేనట్లయితే, బహుశా ఈ వైయక్తిక చైతన్యము ఎంతటి జడత్వములో ఉంటుండొవచ్చు అంటే మార్పు కంటే కూడా ఈ శాశ్వత అసంపూర్ణత్వమే మేలని అనిపించేంత. అదీ సాధ్యమే.

ఏది ఏమైనా, పరిస్థితి ఇలానే ఉంటుంది. కానీ కొంత జ్ఞానము కలిగిన మనకు (మానవులకు) దీనిని మార్చాల్సిన అవసరం ఉంది అని ఈ పదార్థములోనికి ఎంత వీలయితే అంత మృదువైన, నమ్యత గల, అభివృద్ధి దిశగా రూపాంతరీకరించగలిగే ప్రకంపనలు చొప్పించగలిగే శక్తిని, చైతన్యమును, పరాక్రమమును ఆహ్వానించాలని అనుకుంటాము.

ఈ క్రమములో పదార్థ విషయాల (లౌకిక) పట్ల అనుబంధముఅనేది ఒక పెద్ద అవరోధము అనేది విదితమే. ఎవరికైతే నిగూఢ జ్ఞానము వుంటుందో వారు చాలా వేగంగా పురోభివృద్ధి వైపునకు కదలాలని అనుకుంటున్నారు అని ప్రకృతి కనుగొనకలుగుతుంది. ప్రకృతి తన యాత్రను, వరుస ప్రయత్నాలను, అపజయాలను, వినూత్న ఆరంభాలను, సరికొత్త ఆవిష్కరణలను, తను కల్పించుకున్న మార్గములను, అనూహ్య అనుభవాలను చాలా ఇష్టపడుతుంది. ఆ మేరకు తన ప్రయాణం ఎంత దీర్ఘంగా ఉంటే ఆ

మేరకు తనకు అంత ఆనందదాయకము అని ఎవరైనా చాలా సులభంగా చెప్పగలరు.

కానీ ఎవరైనా అతి మంచి ఆటనే (మార్గమునే) ప్రయత్నిస్తారు కదా! అంతటినీ మార్చాల్సిన అవసరం ఏదో ఒక సమయంలో అవసరం అవుతుంది. అభివృద్ధి చెందాలంటే నాశనం చేయాల్సిన అవసరం లేని ఆటను కలగంటారు. ఎలా అంటే - కొత్త దారులను, కొత్త మార్గములను, సరికొత్త వ్యక్తీకరణలను కనుగొనడానికి అభివృద్ధి చెందాలనే ఆకాంక్ష చాలు అని, జడత్వము, నిరుత్సాహము, నీరసము, అర్థం చేసుకోలేకపోవడము, ఉదాసీనతను జయించడానికి ఉత్సాహము కావలసినంత ఉంటే సరిపోతుంది అని.

కొంత అభివృద్ధిని సాధించగానే ఈ శరీరం ఎందుకు విశ్రాంతి తీసుకుంటుంది? అది అలసిపోయింది కాబట్టి. అది (శరీరం) ప్రకృతిలో, నీవు కొంతసేపు ఆగాలి, నాకు విశ్రాంతికి కొంత సమయం కావాలి అని కోరుతుంది. ఈ చిన్న కారణమే లేదా విశ్రాంతే దానిని మరణం వైపుకు నడిపిస్తుంది. కానీ ఒకవేళ ఈ భౌతిక శరీరం దాని లోపల ఒక ఉత్సాహమును నింపుకుని - మరి కొంత మంచిగా ప్రయత్నించాలనీ, మరికొంత పారదర్శకంగా, సుందరంగా, కాంతివంతముగా, నిత్య యవ్వనంగా మారడానికి ప్రయత్నించినట్లయితే అది ఈ ప్రకృతి యొక్క భయంకరమైన మరణం అనే హాస్యము నుండి తప్పించుకోగలుగుతుంది.

ప్రకృతికి ఇదంతా అంత ప్రాముఖ్యమైనది ఏమీ కాదు. ఆమే దీనిని మొత్తంగా ఒక విశాల దృష్టితో చూస్తుంది. ఏమీ కోల్పోయినట్లుగా భావించదు. సంపూర్ణ పురోభివృద్ధి దిశగా ప్రయాణంలో భాగంగా భావిస్తుంది. ఆమెకు ఇది అంతా కేవలం చిన్నచిన్న మొత్తాలను మళ్లీ కలపడం వంటిది మాత్రమే. అసంఖ్యాకమైన చిన్న, మామూలు మూలకాలను ఒక కుంభంలో వేసి కలిపితే దానిలో నుండి ఒక వినూత్నమైనది పుట్టుకొస్తుంది అని అనుకుంటుంది. కానీ ఈ క్రీడ అందరినీ అబ్బుర పరచదు. ఎవరైనా ప్రకృతి చైతన్యమంత, విశాల చైతన్యమును కలిగిన వారైతే, ఆమె కంటే బలవంతులైతే అదే పనిని వారు ఆమె కన్నా మెరుగైన రీతిలో చేయవచ్చు కదా? ప్రస్తుతం మనం ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాము. క్రిందకు దిగి వచ్చి ప్రకటితమవుతూ, పని చేసే శక్తి సహాయముతో ఎవరైనా ఒకరు ఈ బ్రహ్మాండమైన క్రీడను, పనిని

తమ చేతులలోనికి తీసుకుని, దానిని మరింత సుందరంగా, సామరస్య పూర్వకంగా సత్యంగా చేయవచ్చు కదా?

అందుకు, ఆ శక్తిని అందుకోగలిగి, సాధ్యమైన సాధనా మార్గమును రూపకల్పన చేసుకోగలిగిన శక్తివంతమైన మేధాశక్తి అవసరం అవుతుంది. దీనికై ప్రకృతి పద్ధతులే కాక వేరే పద్ధతులు కూడా ఉన్నాయి అనే ప్రకృతిని ఒప్పించగలిగిన చైతన్య పూరితమైన జీవుల ఆవశ్యకత ఉంది. ఇది పిచ్చితనంవలె ఉండవచ్చును కానీ అన్ని క్రొత్త విషయాలు సత్యాలు (నిజాలు) అని నిరూపణ అయ్యేంత వరకు పిచ్చివిగానే అనిపిస్తాయి.

ఇప్పుడు ఈ పిచ్చితనం నిజమయ్యే సమయం ఆసన్నమయ్యింది. బహుశా, మనం ఈ భువి మీదకు వచ్చిన కారణాలు మనలో చాలామందికి తెలియకపోవచ్చునేమో కానీ, చాలా చైతన్య పూరిత కారణాలే ఉన్నాయి. ఈ పిచ్చితనంను నెరవేర్చుకోవడానికి లేదా చేరుకోవడానికి మనల్ని మనం సంసిద్ధుల్ని చేసుకోవాలి. ఈ పిచ్చిలో జీవించడం ఈ సంసిద్ధత అనేది ఎంతో విలువైనది.

*CWM 9:33-36* — *శ్రీమాత*

**374** - నీవు దేనిని మరణం అని పిలుస్తున్నావు? దైవం మరణించగలదా? మరణానికి భయపడే ఓ ప్రాణీ! జీవితం ఆడుతూ నీ దగ్గరికి భయం అనే ముసుగులో, మరణపు శిరస్సుతో వచ్చింది.

**375** - భౌతిక అమృతత్వాన్ని, మరణాన్ని సాధించడానికి గల మార్గం అనేది మనం తీసుకునే అవకాశం మాత్రమే కానీ, ప్రకృతి నిర్బంధము వల్ల కాదు. కానీ ఎవరు ఒకే కోటును వంద సంవత్సరాల వరకు ధరించాలనీ, లేదా మార్పు లేని ఒకే రకమైన, ఇరుకైన ఇంట్లో శాశ్వతంగా నివసించాలని కోరుకుంటారు?

*CWM 12:473* — *శ్రీ అరవిందులు*

# భౌతికంగా మరణమంటే ఏమిటి?

## ప్ర: భౌతిక దృక్కోణంలో మరణం అంటే ఏమిటి?

మరణం అనేది భౌతిక శరీరాన్ని రూపొందించే కణాల వికేంద్రీకరణ, వ్యాప్తికి సంబంధించిన దృగ్గోచర సంవిధానం.

అమరత్వాన్ని స్వభావంగా కల చేతన, భౌతిక ప్రపంచంలో తనను తాను వ్యక్తపరచుకోడానికి, ఎక్కువ కాలమో లేదా తక్కువ కాలమో నిలిచిఉండే భౌతిక రూపాలను తీసుకుంటుంది.

భౌతిక పదార్థం ఈ చేతన కోసం బహుముఖంగా పరిపూర్ణత్వం శాశ్వతత్వం వైపు తొందరగా ఎదుగుతున్న వ్యక్తీకరణకు మాధ్యమంగా మారడానికి రూపాంతరం చెందుతుంది.

**ప్ర: వికేంద్రీకరణ ఒకేసారి జరుగుతుందా లేక స్థాయిల వారీగా జరుగుతుందా?**

ప్రతిదీ ఒక్కసారిగా వికేంద్రీకరణ (విడిపోదు) జరగదు. అందుకు చాలా సమయం పడుతుంది.

భౌతిక జీవికి సంబంధించిన కేంద్ర సంకల్పం అన్ని కణాలను కలిపి ఉంచాలనే దాని సంకల్పాన్ని వదులుకుంటుంది. అది మొదటి దృగోచర సంవిధానం. ఇది ఒక కారణం లేదా మరొక కారణంగా విడిపోవడాన్ని అంగీకరిస్తుంది. సరిచేయలేని అస్తవ్యస్థతకి సంబంధించిన భావన బలమైన కారణాలలో ఒకటి. మరొకటి సమన్వయం, సమన్వయ ప్రయత్నాన్ని కొనసాగించడం పట్ల ఒక రకమైన తిరుగుబాటు. వాస్తవానికి, అసంఖ్యాకమైన కారణాలు ఉన్నాయి, కానీ ఒక హింసాత్మక దుర్ఘటన తప్ప, ఏదో ఒక కారణంగా అన్నింటినీ కలిపి ఉంచే సమన్వయ సంకల్పాన్ని కొనసాగించకుండా త్యజించడమే అనివార్యంగా మరణానికి దారి తీస్తుంది.

**ప్ర: "కణాల చెల్లాచెదురు" అనే మాటలో, "చెల్లాచెదురు" అనే పదానికి ప్రత్యేక అర్థం ఏమైనా ఉందా? అలా ఉంటే, అది ఏమిటి?**

నేను కణాల చెల్లాచెదురు అనే పదాన్ని దాని అత్యంత భౌతిక అర్థంలో ఉపయోగించాను. కణాలని శరీరంగా పట్టి ఉంచే ఏకాగ్రత అంతరించి, శరీరం విడిపోయినప్పుడు, ప్రత్యేకంగా అభివృద్ధి చేయబడి, వాటిలోని దివ్య ఉనికిని గురించి స్పృహతో ఉన్న కణాలన్నీ చెల్లాచెదురుగా విడిపోతాయి. అప్పుడు

ప్రతి ఒక్క కణంలోనూ ఉన్న చేతనకు సంబంధించిన దివ్యసన్నిధి సంక్రమణం ద్వారా, ఇతర కలయికలలోకి ప్రవేశించి వాటిల్లో మేల్కొంటుంది. ఈ విధంగా, ఏకాగ్రత, అభివృద్ధి, వ్యాప్తికి సంబంధించిన ఈ సంవిధానం ద్వారా, పదార్థమంతా పరిణామం చెంది, సంక్రమణం ద్వారా నేర్చుకుంటుంది, సంక్రమణం ద్వారా అభివృద్ధి చెంది, సంక్రమణం ద్వారా అనుభవాన్ని పొందుతుంది.

సహజంగా, కణాలు శరీరంతో కరిగిపోతాయి. ఇతర కలయికలలోకి ప్రవేశించే కణాల చేతన గురించి నేను చెప్పాను.

ప్ర: సహకారం, సమన్వయ ప్రయత్నాన్ని కొనసాగించడం వల్ల భౌతిక జీవికి ఏవగింపు ఎందుకు కలుగుతుంది?

సాధారణంగా, ఈ ఏవగింపు జీవికి సంబంధించిన ఒక భాగంలో (ముఖ్యమైన భాగం, ప్రాణికమైన లేదా మానసికమైన కావచ్చు) పురోగతిని పూర్తిగా తిరస్కరించినప్పుడు సంభవిస్తుంది. కాబట్టి, భౌతికంగా, ఇది కాలక్రమేణా వచ్చే క్షీణతకు వ్యతిరేకంగా పోరాడేటప్పుడు ఏవగింపుగా వ్యక్తమవుతుంది.

ప్ర: భౌతిక జీవికి సంబంధించిన కేంద్రీయ సంకల్పానికి, సుస్థాపిత కణాలకి మధ్య సంబంధం ఎక్కడ ఉంటుంది? ఎలా ఉంటుంది?

కణాలు విశ్వ నిర్మాణానికి అనుగుణంగా ఉండే అంతర్గత కూర్పు లేదా నిర్మాణాన్ని కలిగి ఉంటాయి. కాబట్టి ఒకే విధమైన బాహ్య మరియు అంతర్గత స్థితుల మధ్య బంధం స్థాపించబడి ఉంటుంది.... ఇది “బాహ్యమైనది” కాదు, కానీ ఇది వ్యక్తికి బాహ్యమైనది. అంటే, కణం, దాని అంతర్గత కూర్పులో ఉన్న స్థితికి అనుగుణంగా, విశ్వ కూర్పులో ఉన్న కంపనాన్ని గ్రహిస్తుంది. ప్రతి కణం పూర్తిగా ప్రకాశించే కేంద్రంతో విభిన్న ప్రకాశాలతో కూడి ఉంటుంది, కాంతికి కాంతికి మధ్య బంధం ఏర్పడుతుంది. అంటే, సంకల్పం, కేంద్ర కాంతి, జీవి అంతర్గత సంబంధం ద్వారా సంబంధిత కాంతులను తాకడం ద్వారా కణాలపై పనిచేస్తాయి. ప్రతి కణం విశ్వ ప్రపంచానికి సారూప్యత కలిగిన చిన్ని ప్రపంచం.

ప్ర: సంకల్పం, పదార్థ రూపం లేని కేంద్రీయ కాంతి, కణానికి సంబంధించిన స్థూల పదార్థంపై ఎలా పని చేస్తుంది?

ఇది "సంకల్పం పదార్థంపై ఎలా పని చేస్తుంది?" అని అడగడం వంటిది. జీవితమంతా ఇలాగే ఉంటుంది. మొత్తం సృష్టి సంకల్పానికి సంబంధించిన చర్యల ఫలితమని, సంకల్పం లేకుండా, పదార్థం జడమైనది, నిశ్చలంగా ఉంటుందని, జీవితాన్ని సాధ్యం చేసే పదార్థంపై సంకల్పానికి సంబంధించిన ప్రకంపనలు పనిచేస్తాయన్నది వాస్తవం. లేకపోతే జీవితం ఉండదు.

ప్ర: కాలక్రమేణా వచ్చే క్షీణతను నివారించడానికి వికాసం చెందాలనే సంకల్పం సరిపోతుందా? భౌతిక జీవి ఈ క్షీణతను ఎలా నిరోధించగలదు?

శరీర రూపాంతరీకరణ అంటే సరిగ్గా అదే భౌతిక కణాలు చేతనావంతం కావడమే కాదు, యథార్థ చిత్-శక్తిని గ్రహిస్తాయి. అంటే, అవి ఈ ఉన్నత చేతన చేసే పనిని అనుమతిస్తాయి. అదే రూపాంతరీకరణ కార్యం.

ప్ర: భౌతిక అస్తిత్వం గురించి ఒక వ్యక్తి ఎలా స్పృహలోకి వస్తాడు?

మానవజాతి, దాదాపు సమస్త మానవజాతి, భౌతిక అస్తిత్వం గురించి మాత్రమే స్పృహ కలిగి ఉంది. విద్య వలన, తమ ప్రాణికంపై, మనస్సు యెఱుక ఉన్న మనుషుల సంఖ్య పెరుగుతోంది. వారి చైత్య పురుష గురించి యెఱుక ఉన్న మానవుల విషయానికొస్తే, వారు చాలా తక్కువ.

"భౌతిక అస్తిత్వానికి సంబంధించిన యెఱుకను ఎలా మేల్కొల్పుతారు?" అని నీ ప్రశ్న అయితే, శారీరక విద్యా లక్ష్యం ఖచ్చితంగా అదే. శారీరక విద్య కణాలకు యెఱుకను నేర్పుతుంది. కానీ మెదడు అభివృద్ధి విషయానికొస్తే, అధ్యయనం, పరిశీలన, తెలివికి సంబంధించిన విద్య, అన్నింటికంటే ముఖ్యంగా పరిశీలన, తార్కికత ద్వారా మెదడు అభివృద్ధి చెందుతుంది. సహజంగా, వ్యక్తిత్వ కోణం నుండి, చైతన్యానికి సంబంధించిన సమస్త విద్య యోగం.

*CWM 10-27-30, 80-84* మదర్

ప్ర: మరణం తరువాత, ఒకసారి భౌతిక అస్తిత్వం నుండి, అతని ప్రాణిక, మానసిక అస్తిత్వాల నుండి వేరు చేయబడినప్పుడు, ఆత్మ తన గురించి. తను ఉన్నాననే ఉనికిని గురించి ఎలా స్పృహలో ఉంటుంది?

ఆత్మ పరమాత్మ యొక్క ఒక రవ్వ, విస్ఫులింగం. ప్రభువు తన అస్తిత్వాన్ని గురించి స్పృహలో ఉండడానికి ఒక శరీరం ఎలా అవసరమో నేను చూడలేదు.



ఘడియ, ఘడియకూ ప్రలోభపెట్టే నిత్యుడాతడు
అతికొద్ది తావులోని అనంతుడాతడు
మృత్యుబాహువులలో అమృతుడాతడు

(సావిత్రి, 4వ సంస్కరణ, పుట. 516)

# మృత్యు ఘడియ

## మరణం పట్ల సరైన వైఖరి

పరిస్థితి ఏదైనప్పటికీ, దానిని అనుకూలంగా చూడడం నీ మనసుకు అలవాటు అయితే, అది నీకు ప్రతికూలంగా ఉండదు. ఇది బాగా తెలిసిన విషయమే, మనస్సు ఒక విషయాన్ని అంగీకరించడానికి నిరాకరించినంత కాలం, దానికి వ్యతిరేకంగా పోరాడుతున్నంత కాలం, దానిని అడ్డుకోవడానికి ప్రయత్నించినంత కాలం, హింసలు, ఇబ్బందులు, తుఫానులు, అంతర్గత పోరాటాలు, అన్ని బాధలు ఉంటాయి. కానీ "మంచిది, ఇదే జరగాలి, ఇలాగే జరగాలి" అని మనసు ఒప్పుకున్న నిమిషం, ఏది జరిగినా నువ్వు సంతృప్తి చెందుతావు. కొంతమంది వ్యక్తులు వారి శరీరంపై, మనసుపై నియంత్రణ కలిగి ఉన్నారు. అలాంటివారు, కొంతమంది మార్మికుల గురించి నేను ఆ రోజు నీకు చెప్పాను: వారు అనుభవించిన బాధలు ఒక క్షణంలో దశలను దాటడానికి, సాక్షాత్కారాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడానికి, లక్ష్యాన్ని (భగవంతునితో ఐక్యత) సాధించడానికి వారికి ఒక విధమైన సోపానాన్ని నిలుపుతాయని వారు భావించినప్పుడు, వారుఅసలు బాధలను అనుభవించరు. వారి శరీరం మానసిక భావనతో పూత పూసినట్లుగా ఉంటుంది. ఇది చాలా తరచుగా జరుగుతుంది, నిజంగా ఉత్సాహం ఉన్నవారిలో ఇది చాలా సాధారణ అనుభవం. అన్నింటికంటే, ఎవరైనా ఏదైనా కారణాల వల్ల లేదా మరేదైనా గానీ శరీరాన్ని విడిచిపెట్టి, కొత్త దేహం తీసుకోవలసి వస్తే, ఒకరి మరణాన్ని ఆమోదయోగ్యం కాని ఓటమిగా మార్చడం కంటే అద్భుత, సంతోషకర, ఉత్సాహభరితమైనదిగా చేయడం మంచిది కాదా? దేహాన్ని అంటిపెట్టుకుని ఉన్నవారు, ముగింపును ఒకట్రెండు నిమిషాలు అయినా ఆలస్యం చేయడానికి ప్రయత్నించే వారు, భయానక వేదనకు ఉదాహరణగా నిలిచే వారు, వారు తమ ఆత్మ గురించి స్పృహలో లేరని చెప్పవచ్చు.

*CWM 4: 354*

## మరణం ఒక ఆలంబనం మాత్రమే

ముఖ్యంగా, ఇది బహుశా ఒక ఆలంబనం కాదా? ఈ ప్రమాదాన్ని ఒక ఆలంబనంగా మార్చుకోవచ్చు. ఒక వ్యక్తి చేతనతో ఉన్నట్లయితే, దానిని

అన్నిటిలాగే ఒక అందమైన దానిగా, చాలా అందమైన దానిగా చేయొచ్చు. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోండి, భయపడని వారు, ఆందోళన చెందనివారు, ఎటువంటి మొండితనం లేకుండా మరణించగల వారు దాని గురించి ఎప్పుడూ ఆలోచించరు, ఎవరు ఈ "భయానకత" ఎదురుపడినప్పుడు దాని నుంచి తప్పించుకోకుండా, వీలైనంత దూరంగా నెట్టడానికి ప్రయత్నించకుండా ఉండి, అన్ని వేళలా వెంటాడబడతారో, అటువంటివారు, సందర్భం వచ్చినప్పుడు, తల ఎత్తి, నవ్వుతూ, "ఇదిగో ఇక్కడ ఉన్నాను" అని చెప్పగలరు.

తమ జీవితాన్ని సాధ్యమైనంత సద్వినియోగం చేసుకోవాలనే సంకల్పం వారికే ఉంటుంది, "అవసరమైనంత కాలం, చివరి నిమిషం వరకు నేను ఇక్కడే ఉంటాను, నా లక్ష్యాన్ని సాధించే మార్గంలో నేను ఒక్క క్షణం కూడా కోల్పోను" అని చెప్పే వారు, అటువంటివారు అవసరం వచ్చినప్పుడు, తమను తాము ఉత్తమంగా చూపించుకోగలరు. ఎందుకు? ఇది చాలా సులభం, ఎందుకంటే వారు వారి ఆదర్శ సత్యం, ఆదర్శంలో నివసిస్తున్నారు, ఎందుకంటే అదే వారికి నిజమైన విషయం, వారి ఉనికికి కారణం, అన్ని విషయాలలో వారు ఈ ఆదర్శాన్ని, ఈ ఉనికికి కారణాన్ని చూడగలరు, వారు భౌతిక జీవితపు దుర్భరత్వంలోకి ఎన్నడూ రారు.

కాబట్టి, ముగింపు:

మరణాన్ని కోరుకోకూడదు.

ఎప్పటికీ చావడానికి సంకల్పించకూడదు.

చనిపోవడానికి ఎప్పుడూ భయపడకూడదు.

అన్ని పరిస్థితులలో ఒక వ్యక్తి తనను తాను అధిగమించాలనే సంకల్పంతో ఉండాలి.

*CWM 4:354*

ఒక చనిపోయిన వ్యక్తి దేహాన్ని గౌరవించాలా? అయితే ఎలా?

అది సజీవమైనదైనా, నిర్జీవమైనదైనా ప్రతి దానినీ గౌరవించాలి. దైవ చేతనలో ప్రతిదీ సజీవమే అనే విషయం తెలుసుకో.

గౌరవాన్ని హృదయంలో ఆంతరిక వైఖరిలో అనుభూతి చెందాలి.

## మరణ భయం

ఒక వ్యక్తి మరణించవలసినపుడు మరణిస్తాడు. చనిపోవాలని లేనపుడు చనిపోడు. మీరు మృత్యు ప్రమాదంలో ఉన్నప్పుడు కూడా. అది మీరు మరణించ వలసిన ఘడియ కానపుడు మీరు మరణించరు. కానీ మీరు అపాయానికి దూరంగా ఉన్నప్పటికీ, మీ కాలిపై ఒక చిన్న గీత కూడా మీ మరణానికి దారి తీయవచ్చు. ఎందుకంటే ఆ సమయం ఆసన్నమయింది కనుక. అందుకని భయానికి అర్థం లేదు. మీరు చేయగలిగినదేమిటంటే : మీరొక చేతనాస్థితిలోకి ఎదిగి అక్కడి నుండి అది అలా జరగవలసి ఉంది. అది తప్పించలేని సత్యంగా గుర్తించబడింది. కనుక దానిని మనం అంగీకరించాలి, కానీ చింతించవలసిన అవసరం లేదు. అది రావలసినపుడే వస్తుంది. కనుక నేను భయపడవలసిన అవసరం లేదు. అది ఖచ్చితంగావస్తుంది. కనుక దాని గురించి భయపడకుండా ఉండటం మంచిది. ఇంకా అందుకు భిన్నంగా సహజంగా సంభవించవలసిన దానిని అంగీకరించడం ఉత్తమం. ఇది విదితమయిన పరిష్కారమే. అందరూ అనుసరించే మార్గమిదే. మరొకటి ఉంది. మరింత కష్టతరమయినది. కానీ దీనికన్నా ఉత్తమమయినది. అది మనకి మనం చెప్పుకోవడంలో ఉందని నేను నమ్ముతాను. నేను ఈ శరీరం కాదని తనలో సత్యమైనదేమిటో తెలుసుకోవడానికి ప్రయత్నించడం. తన అంతరాత్మను కనుగొనేంత వరకు ఆ వెంటనే అది మీకు అర్థమవుతుంది. అమృతత్త్వపుతత్వం అర్థమవుతుంది. మనిషి తెలుసుకుంటాడు. వెళ్ళటం, రావటం అనేది ఒక వీలు కల్పించుకోవడం మాత్రమే. పాదరక్షలు చిరిగిపోయినప్పుడు వాటిని చూసి నేను ఏడవను. వాటిని వదిలిపెట్టేస్తాను. చెప్పులు అరిగిపోయినపుడు పారేస్తాను కానీ వాటి కోసం విలపించను.

చైత్యపురుష తన కార్యసాధన కోసం ఈ శరీరాన్ని తీసుకుంది. కానీ దానిని వదిలివేయవలసిన సమయం వచ్చినప్పుడు ఎప్పుడైనా అది ఏ కారణం చేతనైనా నిరుపయోగమయినపుడు ఆ శరీరాన్ని నిర్భయంగా వదిలివేస్తాడు. అది చాలా సహజమయిన ప్రక్రియ. ఏ మాత్రం విచారించకుండా చేయవలసిన పని అంతే.

మీరు మీ అంతర్మాతలో స్థిరమైనపుడు చాలా అప్రయత్నంగా, యధేచ్ఛగా మీకా భావన కలుగుతుంది. మీరు ఐహికమయిన జీవితానికి అతీతంగా

ఎగసి అమృతత్వ భావనను పొందుతారు. నేనిది ఉత్తమమయిన పరిష్కారంగా భావిస్తాను.

మనం తెలుసుకోవలసిన మూడవ విషయం కూడా ఒకటి ఉంది. కానీ అందుకు ఒక వ్యక్తి ఒక శక్తివంతమైన యోగి అయి ఉండాలి. మరణం అనివార్యమని తెలిసిననాడు, అది ఇంతవరకూ సంభవిస్తున్న ఒక ప్రమాదమని (ఇంతవరకూ అందరి విషయంలో జరుగుతున్నదని) దానిని మనం అంగీకరించాలి. ఇకపై ఈ ప్రమాదాన్ని అధిగమించి జయించాలనే సంకల్పాన్ని పెంపొందించుకోవాలి. కానీ ఈ ప్రకృతి ధర్మానికి సామూహిక సూచనలకు, ఈ అవనిపై అలవాట్లకు విరుద్ధమయిన, భయంకరమైన, భీకరమైన పోరాటం. మీరు దేనికీ జంకని ప్రథమస్థాయి యుద్ధవీరులయితే తప్ప ఈ పోరాటాన్ని ప్రారంభించకుండా ఉంటే మంచిది. మీరు వెనుకడుగు వేయని సాహసోపేత వీరులయితే తప్ప మీరు పోరాడలేరు. ఎందుకంటే అడుగడుగునా, క్షణక్షణం ఎంతగానో లోతుగా పాతుకుపోయిన విషయాలపై యుద్ధం చేయవలసి ఉంటుంది. అది అంత సులభమయిన విషయం కాదు.

*CWM 5:315-16*

ఆత్మ చుట్టూ విభిన్న అంశాలను చైతన్యవంతంగా వ్యవస్థీకరించుకోవటం

కొన్నిసార్లు వ్యక్తులు మరణించేటపుడు వారు చనిపోబోతున్నట్లు వారికి తెలుస్తుంది. వాళ్ళు ఎందుకు ఆ అదృశ్యశక్తిని వెళ్ళిపొమ్మని చెప్పరు?

అవును అది వ్యక్తులపై ఆధారపడి ఉంటుంది. రెండు విషయాలు అవసరం. మొట్టమొదట మీలో ఏదీ కూడా ఏ అంశం కూడా మరణించాలని కోరుకోకూడదు. అది తరచుగా జరగదు. మీలో ఎక్కడో ఎపుడూ ఒక పరాజితుడుంటాడు. ఏదో అలసిపోయి ఉంటుంది. లేదా విరక్తి చెందినది, విసిగి వేసారిపోయినది, లేదా సోమరితనమో లేదా పోరాడటానికి సుముఖంగా లేనిదేదో ఉంటుంది. అయితే ఇది పూర్తి అయిపోని, అదే మంచిది అంటుంది. అది చాలు మీరు మరణిస్తారు. కానీ ఇది సత్యం. మీలో ఏదీ కూడా ఖచ్చితంగా ఏదీ మరణించడానికి అంగీకరించకపోతే మీరు మరణించరు. ఎవరైనా మరణించాలంటే ఒక్క క్షణం. ఒక క్షణంలో పదవవంతయినా అతని అంగీకారం చెబితే చాలు. ఈ క్షణమాత్ర అంగీకారం లేకపోతే అతను

మరణించడు.

సమస్త భౌతిక, ప్రాణిక ధర్మాలను బట్టి నిజంగా చనిపోవలసిన వారు. నాకు కొంతమంది తెలుసు కానీ వాళ్ళు అందుకు నిరాకరించారు. నేను చనిపోను అన్నారు. వాళ్ళు జీవించి ఉన్నారు. మరికొంత మంది అసలు చనిపోవలసిన అవసరం లేనివాళ్ళు 'ఓ అలానే మరీ మంచిది. తొందరగా ముగిసిపోతుంది' అన్నారు. అంతే అయిపోయింది. అది చాలు. అంతకన్నా ఎక్కువ ఏమీ అవసరం లేదు. మీకొక నిరంతరమయిన అభిలాషఉండనవసరం లేదు. మీరిలా అంటే చాలు. 'మంచిది, నాకిది సరిపోతుంది' అంతే ముగిసిపోతుంది. నిజంగా అలానే ఉంటుంది. మీ మంచం ప్రక్కనే మృత్యువు నిలబడి ఉంటుంది. అతనితో అనండి 'నువ్వు నాకు వద్దు వెళ్ళిపో అని. అతను తలవంచి వెళ్లిపోతాడు. కానీ సాధారణంగా దారి ఇవ్వటం జరుగుతుంది. ఎందుకంటే పోరాడాలంటే ఎంతో దృఢంగా ఉండాలి. ఎంతో ధైర్యంగా సహనంతో ఉండాలి. జీవిత ప్రాధాన్యతపై ఎంతో విశ్వాసం కలిగి ఉండాలి. ఉదాహరణకి చాలా దృఢంగా, తానింకా జీవితంలో ఏదో సాధించాలని భావించే వ్యక్తులయి ఉండాలి. అతను తప్పకుండా అది సాధించగలుగుతాడు. కానీ ఎవరికి తెలుసు. అతనిలో లేశమంత అయినా లోపల ఎక్కడో ఒక పరాజితుడు ఉంటే అతను లొంగిపోయి 'అవును' అంటే? ఇక్కడే ఆత్మయొక్క ఏకీకరణ అవసరం.

మనం ఏ మార్గాన్ని అనుసరించినా, ఏ విషయాన్ని అధ్యయనం చేసినా మనం ఒకే ఫలితం దగ్గరికి వస్తాం. ఒక వ్యక్తికి అతిముఖ్యమయిన విషయం తన దివ్య కేంద్రం చుట్టూ ఏకం కావటం, ఆ విధంగా అతనొక నిజమైన వ్యక్తిగా రూపొందుతాడు. తనకు, తన తలరాతకూ ప్రభువుగా నిలుస్తాడు. లేకపోతే శక్తుల చేతిలో ఆటబొమ్మలా, నదిలో కొట్టుకుపోయే ఒక బెండు ముక్కలా మారిపోతాడు. తను వెళ్ళకూడదనుకొనే చోటికి వెళతాడు. తాను చేయకూడదనుకున్న పనులు చేస్తాడు. చివరికి నిలబడే శక్తి లేక ఒక అగాధంలో పడిపోతాడు. కానీ మీరు చైతన్యవంతంగా, ఎరుకతో వ్యవస్థీకరించుకొని ఉంటే, దివ్య కేంద్రం చుట్టూ ఐక్యమై ఉంటే, దానితో పాలించబడి, నడప బడుతూ ఉంటే, మీ తలరాతకు మీరే ప్రభువులు. అది ప్రయత్నించటమనే శ్రమ తీసుకోవడం ఎంతో అమూల్యం.

*CWM 5:137,138*

## అంధకారమయమూ, విపత్కరమైన నిష్క్రమణం

ఆత్మహత్య చేసుకొనేవారెందుకు బాధపడ్తారు?

ఆత్మహత్య ఎందుకు చేసుకుంటారు. ఎందుకంటే పిరికి వాళ్ళవటం వలన. పిరికివాళ్ళెపుడూ బాధపడ్తూనే ఉంటారు.

వచ్చే జన్మలో కూడా వాళ్ళు దుఃఖాన్ని పొందుతారు. అంతరాత్మ ఒక ఖచ్చితమైన ధ్యేయంతో, కొన్ని అనుభవాల పరంపర కోసం, నూతన విషయాలను నేర్చుకోవటానికి, ప్రగతిని సాధించటం కోసం జన్మ తీసుకుంటుంది. మీరు దాని కార్యం పరిసమాప్తి కాకుండా వెళ్ళిపోతే మరింత క్లిష్టపరిస్థితులలో పని చేయడానికి తిరిగి రావలసి ఉంటుంది. మీరీ జన్మలో తప్పించుకున్నది, మరొక జన్మలో అనుభవించవలసి ఉంటుంది. మరింత కష్టతరం కూడా అవుతుంది. అలా వెళ్ళిపోకుండా ఈ జన్మలో అధిగమించ వలసిన ఇబ్బందులు ఉంటే అందుకు ఒక పరీక్షలో ఉత్తీర్ణులు కావాలి. అందులో ఉత్తీర్ణులు కాకపోయినా దానికి వెన్నుచూపినా, దానిని దాటకుండా వెళ్లిపోతే, మీరు దానిని మరొకసారి దాటవలసి ఉంటుంది. అది అంతకుముందు కన్నా కష్టతరం అవుతుంది.

ప్రజలు చాలా అజ్ఞానంగా ఉండి, ఇలా ఉంటుందనుకుంటారు. జీవితం, తరువాత మరణం, జీవితం ఒక ఒడుదుడుకుల సమాహారం, మృత్యువంటే శాశ్వతమైన శాంతి అని. కానీ అలా ఉండదు. ఒక వ్యక్తి నిర్హేతుకంగా, అజ్ఞాన మార్గంలో అస్పష్టమైన పద్ధతిలో జీవితం నుండి బయటకు వెళ్ళినప్పుడు అజ్ఞానం, వ్యామోహాలు నిండిన ఆ వ్యక్తి సూటిగా ఒక ప్రాణిక ప్రపంచంలోకి వెళ్లిపోతాడు. ఏ ఇబ్బందులనయితే తప్పించుకోవాలనుకుంటారో అవన్నీ శరీరమిచ్చే రక్షణ ఏ మాత్రం లేకుండా అనుభవించవలసి వస్తుంది. మీకెపుడైనా ఒక పీడకల వస్తే అది ప్రాణిక ప్రపంచంలో ఒక సాహస విహారం. మంచిది. దానికి మీ పరిష్కారం, మిమ్మల్ని మీరు జాగృతం చేసుకొని మళ్లీ ఈ శరీరంలోకి హడావిడిగా ప్రవేశించటమే. కానీ శరీరాన్ని నశింపజేసుకున్నపుడు మిమ్మల్ని మీరు పరిరరక్షించుకోవటానికొక దేహం ఉండదు. మీరొక అంతులేని పీడకలలో ఉండిపోతారు. అది అంత ఆహ్లాదకరం కాదు. ఈ పీడకలలని నివారించాలంటే మీరు అంతరాత్మ చేతనలో ఉండాలి. చైత్యసత్త చేతనలో ఏదీ కలవరపెట్టలేదు. నిజానికి ఆత్మహత్య అనేది ఒక అంధకార

పూరితమైన అజ్ఞాన జనిత చర్య. చేయవలసిన ప్రయత్నం ముందు అదిఒక ఘోరమైన పిరికితనం.

*CWM 7:23-24* శ్రీమాత

# వృద్ధాప్యము, మృత్యువు

ప్రశ్న: ఒకవేళ వ్యక్తి ఈ జీవితంలో తాను నిర్వర్తించవలసిన కార్యం అయిపోయిందని, తాను ఇంకా అర్పించుకొని చేయవలసింది ఏదీ లేదని అనుభూతి చెందితే, లక్ష్యరహిత అస్తిత్వాన్ని ఇంకా లాగటం కన్నా మరణించి, తిరిగి జన్మించడం అతనికి మంచిది కాదా ?

ఇది విషయాలు తాను కోరుకున్న విధంగా జరగటం లేదని కనుగొన్నపుడు, అసంతృప్త అహంకారం తనకు తాను వేసుకునే ప్రశ్న.

కానీ తాను భగవంతునికి చెందినవాడు, సత్యంలో నివసించాలని కోరుకునే వ్యక్తి, పృధ్విపై తన ప్రయోజకతను దైవం గ్రహించే వరకు ఆయన తనను ఈ భూమిపై ఉంచుతాడని, అక్కడ తాను చేసేది ఏదీ లేనప్పుడు మాత్రమే భువిని వదిలేట్లుగా చేస్తాడని తెలుసుకుంటాడు. కాబట్టి ఇక్కడ ఆ ప్రశ్న తలెత్తదు, అలాంటి వ్యక్తి భగవంతుని సర్వోన్నత జ్ఞాన నిశ్చయతలో నిశ్శబ్దంగా నివసిస్తాడు.

ప్రశ్న : నిన్న మీరు " దైవానికి చెందిన వ్యక్తి......" అని వ్రాశారు కదా, ప్రతి ఒక్కరు, వారు ఎవరైనా భగవంతునికి చెందిన వారు కాదా !

"భగవంతునికి చెందిన ఒక వ్యక్తి" అని నేను అన్నపుడు దానర్థం తనలో అహంకారాన్ని నిర్మూలించిన వ్యక్తి. దైవం గురించి నిరంతరము చైతన్యంతో ఉన్న వ్యక్తి, ఎప్పటికీ వ్యక్తిగత సంకల్పం లేని వ్యక్తి, దైవ ప్రేరణ తోనే చర్య జరుపుతూ, దైవం తనను ఏది చేయాలని కోరుకుంటాడో అది తప్ప వేరే లక్ష్యం లేని వాడు.. "భగవంతునికి చెందిన వ్యక్తి" అని నేను అన్నపుడు, దానర్థం తనలో అహంకారాన్ని రద్దుచేసిన ఒక అస్తిత్వం, దైవం గురించి స్థిరంగా చైతన్యంతో ఉన్న వ్యక్తి, వ్యక్తిగత సంకల్పం లేకుండా, దైవ ప్రేరణలో మాత్రమే చర్య జరిపే వ్యక్తి, దైవం అతడిని నిర్వర్తించమని కోరేది తప్ప ఇతరమైన ఏ లక్ష్యము లేనివాడు.

ఈ దశలో ఎక్కువమంది ఉన్నారని అనుకోవడం లేదు. వారి జీవితం ఉపయోగకరమా లేదా అని, నిర్దిష్టంగా వారికి చింత ఉండదు, ఎందుకంటే

వారు భగవంతుని కొరకు, ఆయన వలన మాత్రమే అస్తిత్వంలో ఉంటారు, వ్యక్తిగత జీవితమంటూ వారికి ఉండదు.

*

మనం దేహంలో ఉన్నంతవరకు, దాని వయసు, కష్టాలు ఏవైనా మనం ఏదో ఒకటి చేయడం, నేర్చుకోవడం తప్పనిసరిగా ఉండాలి. ఈ నమ్మకం సకల వ్యత్యయములను ఎదుర్కోవడానికి అవసరమైన బలాన్ని అవశ్యంగా ఇస్తుంది.

ఒకవేళ అది శాశ్వత విశ్రాంతి కోసమో, శూన్యం లోని ఆనందం కోసమో అయినా వ్యక్తి నిష్క్రమణను త్వరితం చేయడం, తొందర పడటం చేయకూడదు. మనం దేహంలో ఉన్నంతవరకు నిస్సందేహంగా అక్కడ మనం చేయవలసింది. నేర్చుకోవలసింది కొంత ఉంటుంది.

మరణం నుండి ఏదీ ఆశించవద్దు. జీవితమే నీ మోక్షం. జీవితంలోనే నిన్ను నువ్వు రూపాంతరం చెందించుకోవాలి. పృధ్వి పైనే నువ్వు పురోగమిస్తావు, పృధ్విపైనే నువ్వు సాక్షాత్కరింపజేసుకుంటావు. దేహంలోనే నువ్వు విజయాన్ని సాధిస్తావు.

*

మరణ సూచన తాను త్వరగా దేహాన్ని త్యజించాలని సంవేదించినపుడు, ఆ సూచన అహంకారం నుండి వస్తుంది. నిశ్చలంగా, నిర్భయంగా ఉండు. అంతా సర్దుకుంటుంది.

*

సంపూర్ణ పరిత్యాగం గురించి నువ్వు మాట్లాడుతున్నావు, కానీ దేహాన్ని త్యజించడం సమగ్ర పరిత్యాగం కాదు. నిజమైన, సంపూర్ణ పరిత్యాగం అంటే అహంకారాన్ని త్యజించడం, ఇది ఇంకా ఎక్కువ కష్టతరమైన శ్రమ, నువ్వు నీ అహంకారాన్ని పరిత్యజించలేదు అంటే, దేహాన్ని త్యజించడం నీకు స్వేచ్ఛనివ్వదు.

మరణం అన్నది ఇలా ఉండాలి అని నువ్వు విశ్వసించేది కాదు. మరణం నుండి నువ్వు ఒక అచేతనా విశ్రాంతికి చెందిన తటస్థ నిశ్చలతను ఆశిస్తున్నావు. కానీ అటువంటి విశ్రాంతిని నువ్వు పొందాలంటే నువ్వు దానికి సిద్ధం కావాలి.

నీవు మరణించినపుడు నువ్వు కేవలం నీ దేహాన్ని కోల్పోతావు, అదే సమయాన పదార్థ ప్రపంచంతో అనుబంధ సంభావ్యతలను, భౌతిక ప్రపంచం పై చర్య జరుపడాన్ని కోల్పోతావు. కానీ ప్రాణిక ప్రపంచానికి చెందినదంతా భౌతిక పదార్థంతో పాటుగా అదృశ్యం కాదు, మన వైకల్యము, నిరాశల సంవేదనతో నీ కోరికలు, అనుబంధాలు, ఆరాటాలు కొనసాగుతాయి. మొత్తం ఇదంతా కోరుకున్న శాంతిని పొందడం నుండి నిన్ను నిరోధిస్తుంది. ఒక ప్రశాంతమైన, ఘటనారహిత మరణాన్ని అనుభవించాలంటే దానికి నువ్వు సిద్ధంగా ఉండాలి. సమర్ధవంతమైన ఒకే ఒక సంసిద్ధత కోరికలను రద్దు చేసుకోవడం.

మనకు దేహమున్నంతవరకు మనం చర్య జరపాలి, పని చేయాలి, కానీ దానిని ఫలితం ఆశించకుండా, ఇలా ఉండాలి, అలా ఉండాలి అన్న కోరిక లేకుండా కేవలం అది చేయాలి కాబట్టి చేయాలి అని చేసినపుడు, క్రమంగా ఆది నిస్సంగత్వంగా వృద్ధిచెంది, ఒక విశ్రాంత మరణానికి మనల్ని సిద్ధం చేస్తుంది.

*

మృత్యువు నుండి నువ్వు తప్పించుకోవాలనుకున్నపుడు ఎలాంటి నశ్వరమైనదానికి నిన్ను నువ్వు బంధించుకోకూడదు భయపడకుండా ఉంటే వ్యక్తి దానిని ఒంటరిగా జయించగలడు, మృత్యువుకు భయపడే వ్యక్తి అప్పటికే మృత్యువు చేత జయించబడి ఉంటాడు.

*

ప్రశ్న : నా స్వభావం బలహీనం కనుక సామాన్య విషయాలను పరిత్యజించడం కష్టమవుతుంది. కానీ నేను నిన్ను మాత్రమే కోరుకుంటున్నాను అన్నది ఖచ్చితం ఒకవేళ నువ్వు లేకపోతే మృత్యువే శరణ్యం.

మరణించడమనే ప్రశ్న తలెత్తదు. నీ దేహాన్ని త్యజించడం ఒక పరిష్కారం కాదు, నీ కోరికలతో నువ్వు ఉండిపోతావు. అది ఇంకా అధ్వాన్నమైనది. నీ కోరికలు ఎంత అప్రయోజకము, బుద్ధిహీనమో అర్థం చేసుకుని, వాటిని అంతమొందించడం ఇంకా ఎక్కువ సహేతుకము, సత్యము..

నీవు దివ్య జీవనాన్ని ఎక్కువగా కోరుకుంటున్నపుడు విఫలత గురించి నువ్వు భయపడవలసిన అవసరం లేదు, ఎందుకంటే నిజాయితీగా, స్థిరంగా

ఉండే ఒక ఆకాంక్ష ఎప్పటికీ సఫలమవుతుంది. నీ బలహీనతలను అధిగమించాలని ఒక దృఢమైన తీర్మానం చేసుకో, అప్పుడు అది కనిపించే టంత కష్టం కాదని తెలుసుకుంటావు. నీ ఆటంకాలను అధిగమించడానికి నా శక్తి నీతోనే ఉన్నది.

నా ఆశీర్వాదాలతో.

*CWM 15:127-28* శ్రీమాత

# ఆత్మహత్య

ఆత్మహత్యకు పాల్పడటం ఖచ్చితంగా ఒక వ్యక్తి చేయగల అత్యంత మూర్ఖచర్య అని తెలుసుకో : ఎందుకంటే దేహం అంతమవ్వటం చైతన్యం అంతమవ్వటమని అర్థం కాదు, నువ్వు జీవించి ఉన్నపుడు నిన్ను ఇబ్బంది పెట్టినది నువ్వు మరణించిన పిదప నీ మనసును పక్కకు మళ్లించే ఎలాంటి సంభావ్యత లేకుండా ఇబ్బంది పెట్టడాన్ని కొనసాగిస్తుంది. దీనిని నువ్వు జీవించి ఉన్నపుడు పరిష్కరించగలవు.

*

ప్రశ్న: నేను శుద్ధంగా నీ బిడ్డను, శుద్ధ భాగ్యంతో జన్మించిన బిడ్డను: అటువంటి బిడ్డకు జీవితంలో సఫలం చేసుకోవలసిన కార్యం ఉండదు. ప్రపంచం నుండి దూరంగా పోవడం ఉత్తమం కాదా ?

నువ్వు పరివర్తన చెందవలసింది. ఆ పరివర్తన సాధ్యమయ్యేది ఈ ప్రపంచంలోనే. ఈ ప్రపంచం నుండి నువ్వు దూరంగా పారిపోతే బహుశ ఇంకా అధ్వాన్న పరిస్థితుల్లో నువ్వు తిరిగి రావలసి ఉండచ్చు, అప్పుడు ప్రతిదానిని మొత్తంగా నువ్వు తిరిగి చేయవలసి ఉంటుంది.

ఒక పిరికి వ్యక్తిగా ఉండకపోవడం చాలా మంచిది, ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కోవడం, దానిని జయించడానికి అవసరమైన ప్రయత్నం చేయడం ఉత్తమం. ఎప్పటికీ సహాయం నీ వెన్నంటే ఉంటుంది నీకోసం దానిని వినియోగించుకోవడం నువ్వు నేర్చుకోవాలి.

*

ప్రశ్న : ఆత్మహత్యకు పాల్పడినపుడు వ్యక్తి ఎందుకు దు:ఖిస్తాడు ?

మనిషి ఎందుకు ఆత్మహత్యకు పాల్పడతాడు ? అతను పిరికివాడు కనుక... ఎవరైనా పిరికివారైనపుడు, ఎప్పుడూ బాధపడుతూనే ఉంటాడు.

ప్రశ్న : తరువాతి జన్మలో తిరిగి బాధపడతాడా ?

చైత్య పురుష ఒక నిర్దిష్ట ప్రయోజనంతో, అనుభవాల ఒక ఏర్పాటు నుండి పయనించడానికి నేర్చుకోవడానికి, పురోగమించడానికి వస్తుంది. దాని కార్యం పూర్తవక ముందే నువ్వు వదిలితే అది ఇంకా ఎక్కువ కష్టమైన పరిస్థితుల్లో మళ్లీ అదే పని చేయడానికి వెనక్కు తిరిగి రావాల్సి ఉంటుంది. కనుక ఒక జీవితంలో నువ్వు తప్పించుకొన్నది మొత్తం ఇంకో జీవితంలో ఇంకా ఎక్కువ కష్టంతో కనుగొంటావు. ఈ విధంగా వదలకపోయినా, జీవితంలో అధిగమించవలసిన కష్టాలు నీకు ఉంటే, అది మేము సాధరణంగా పిలిచే పరీక్ష, దానిని నువ్వు నెగ్గుకురావాలి, ఒకవేళ నువ్వు నెగ్గుకురాలేక పోయినా, లేదా దానికి నీ వెన్ను చూపినా, దాన్ని నెగ్గేబదులు దూరం మళ్లినా, ఇంకోసారి దానిని నువ్వు నెగ్గుకురావల్సి ఉంటుంది, అది ముందు కన్నా చాలా ఎక్కువ కష్టతరమైనది.

ఇప్పుడు నీకు తెలిసిన వ్యక్తులు అత్యంత అజ్ఞానంతో, అది ఇలా ఉంటుందని భావిస్తారు. అక్కడ జీవితం ఉంది, మృత్యువు ఉంది, జీవితం సమస్యల ఒక గుత్తి, మరణం ఒక శాశ్వత శాంతి అనుకుంటారు. కానీ అది అస్సలు అలా ఉండదు. సాధారణంగా వ్యక్తి మొత్తంగా ఒక ఇష్టానుసార మార్గంలో, ఒక అజ్ఞాన, అస్పష్ట మోహావేశంలో జీవితాన్ని వదిలినపుడు, ఈ అన్ని భావావేశాలు, మొత్తం అజ్ఞానం తో తయారయిన ఒక ప్రాణిక ప్రపంచంలోకి అతడు నేరుగా వెళతాడు. కాబట్టి ఏ సమస్యలనైతే తప్పించుకోవాలనుకుంటాడో, వాటిని దేహం ఇచ్చే కనీస రక్షణ లేకుండా తిరిగి కనుగొంటాడు. నీకు ఒక పీడకల వచ్చినా, అది ప్రాణిక ప్రపంచంలోని ఒక దుస్సాహస విహారయాత్ర, కనుక దానికి నివారణ నిన్ను నువ్వు మేలుకొలుపుకోవటమే, అంటే వెంటనే తొందరగా వెనక్కు నీ శరీరంలోకి రావటమే. కానీ నువ్వు నీ శరీరాన్ని నాశనం చేస్తే, నీకు రక్షణనిచ్చే దేహం ఉండదు. కనుక ఆహ్లాదం కాని ఒక నిరంతరం సంభవించే పీడకలలో నిన్ను నువ్వు కనుగొంటావు. ఎందుకంటే పీడకలను నివారించాలంటే నువ్వు ఒక అంతరాత్మిక చేతనలో ఉండాలి, నువ్వు అంతరాత్మిక చేతనలో ఉన్నపుడు విషయాలు నిన్ను ఇబ్బంది పెట్టవు అని ఖచ్చితంగా తెలుసుకుంటావు.

వాస్తవానికి ఇది ఒక అజ్ఞాన అంధకారానికి చెందిన చలనం, నేను చెప్పినట్లుగా మనం తయారుచేసుకోవలసిన సుస్థిర ప్రయత్నం ముందు నిలబడే ఒక గొప్ప పిరికితనం.


తన జీవితానికి 'ఒక అంతం పలకాలని' తనను తాను చంపుకునే మూర్ఖునితో మొదలుపెట్టి, (నిజానికి ఇది అన్ని మూర్ఖత్వాలలోకి అత్యంత ఎక్కువ మూర్ఖత, ఇది విషయాన్ని ఇంకా అధ్వాన్నం చేస్తుంది). నిర్వాణం వరకు( తనను తాను తప్పించుకోవచ్చని ఊహించేది), సమస్తము, అదంతా విలువలేనిది. అవన్నీ విభిన్న తలాలకు చెందినవి, కానీ అవన్నీ విలువలేనివి.

*CWM 15:128, 127; 7:23-24; 11:179* శ్రీమాత

ప్రశ్న : ఒక ఆత్మ అవసాన సమయాన్ని, మరణించే పద్ధతిని ఎన్నుకొంటుందా? బాంబు దాడులు, వరదలు, భూకంప ప్రాంతాల్లో భూకంపాల వలన కలిగే ప్రాణనష్టంలో ఆ ఆత్మలన్నీ ఒకేసారి మరణించాలని నిర్ణయించబడి ఉంటుందా?

సమాధానం : ఎక్కువ మంది మనుషులు సామూహికమైన గమ్యాన్ని కలిగి ఉంటారు. వారి విషయంలో ఏ విధమైన ప్రశ్న లేదు.

పరిణితి చెందిన చైత్యసత్త కలిగిన వ్యక్తి ఎంత సామూహికమైన ఉపద్రవాలు సంభవించినా జీవించగలుగుతాడు. అది తన ఆత్మయొక్క ఎంపిక అయినట్లయితే.



కేవలం నన్నే చూచిన వారికెంతమాత్రం దు:ఖించరు

*(సావిత్రి, **4**వ సంస్కరణ, పుట **684**)*

# మృత్యు ఘడియ పూర్వనిర్దేశితమా

ప్రశ్న : మీరన్నారు 'మనషి మరణ సమయం కోసం తొందర పడాల్సిందీ లేదు, జాగు చేయాల్సింది లేదు' అని. దీని అర్థం అతని పుట్టుకతో పాటే, మరణం కూడా ముందే నిర్ణయించబడుతుందా?

లేదు. అది వేరే మరొక తలానికి చెందిన విషయం. ఒక వ్యక్తి తాను మరణించడానికి సమ్మతించుకొంటేనే అతడు మరణిస్తాడని ఎక్కడో ఒక చోట వ్రాశాను. అది ఇప్పుడు నేను చెబుతున్న దానికి భిన్నమైనది. నేనొకసారి దీనిని నీకు చెప్పి ఉన్నాను. ఇది నిజం. ఎవరి విషయంలోనో వ్రాశాను. దీనిలో రెండు దృక్పథాలున్నాయి, ఇక్కడ నేను ఒక సామాన్యమైన, పూర్తిగా భౌతిక దృక్కోణాన్ని, భౌతిక చేతనకు చెందిన దాన్ని తీసుకుంటున్నాను. వ్యక్తి అస్తిత్వానికి సంబంధించి విభిన్నమైన పూర్వనిశ్చిత నియతివాద స్తరాలున్నాయి. భౌతిక అస్తిత్వం ఒక నియతికి చెంది ఉంటుంది. ప్రాణిక అస్తిత్వం ఒక నియతికి చెంది ఉంటుంది. మానసిక అస్తిత్వం ఒక నియతికి చెందిఉంటుంది. ఉన్నత మానసిక, అంతరాత్మిక అస్తిత్వానికి చెంది ఒక నియతి విధానం పనిచేస్తూ ఉంటుంది. ఇంకా ఆవల ఉన్నత అస్తిత్వాలకు వాటికంటూ వాటి నియతి విధానాలు ఉన్నాయి. అలాగే మహస్సు (అతి మానస) అస్తిత్వానికి ఒక నియతి ఉంటుంది. ప్రతి ఒక్కరి విధివిధానం ఈ నియతులన్నింటి మేళవింపుతో ముడిపడి ఉంటుంది. భౌతిక అస్తిత్వానికి చెందిన మరణం సంభవించాల్సిన సందర్భంలో నీవు వెంటనే చాలా ఉన్నతమైన నియతి పరిధిలోకి, ఉదాహరణకి అతి మానస నియతి సంపర్కంలోకి ప్రవేశించడం జరిగినపుడు భౌతిక నియతిని, అతి మానస నియతిని జతచేస్తే ఆ క్షణంలోనే నీ భౌతిక నియతిచే నిర్ణయించబడిన మరణం పూర్తిగా తప్పించబడుతుంది. మృత్యుఆసన్న సన్నివేశం మారిపోయి వెనుకటి పరిస్థితి వచ్చేస్తుంది. దాని గురించి ఆ వ్యాసంలో చెప్పలేదు. నేను పూర్తిగా భౌతిక దృక్కోణాన్నే తీసుకొన్నాను. కొంతమందిని ఉదహరించాను (వాళ్ళ వాళ్ళ భౌతిక చేతనలో పదార్థ చేతనలో ప్రత్యేకించి జీవించిన వాళ్ళు అంటే మానసిక, ప్రాణిక, పదార్థ స్థాయిల్లో జీవించిన వాళ్ళు) 50యేళ్ళు దాటడంతోనే మరణించడానికి ఆసక్తి చూపిన వాళ్ళు 87 యేళ్ళు వచ్చే వరకూ జీవించారు. దీనికి భిన్నమైన మరో ఉదాహరణ మీకిస్తాను. మరొకతను చాలా దీర్ఘకాలం పాటు

జీవించాలనుకొని, చాలా ముఖ్యమైన పనులు చెయ్యాల్సి ఉందని, దాని కోసం చావకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తలు తీసుకొన్నాడు. అయినా అతడు మరణించాడు. దీనికి భిన్నమైన సంఘటనలు కూడా ఉండవచ్చు కానీ ఇదంతా పైకి కనిపించేది. వీటన్నింటికి ఎన్నో వివరణలు కూడా ఉంటాయి. అవి విభిన్నమైన నియమ సూత్రాలకు విధేయంగా ఉంటాయి. ఇక్కడ నేను పూర్తిగా భౌతిక దృక్కోణాన్నే తీసుకొంటున్నాను.

నీవు గనుక ఒక ఉన్నత నియతిని జోక్యం చేసుకోనివ్వకపోతే దేనినీ మార్చలేవు. నీ భౌతిక నియతిని మార్చడానికి గల పద్ధతి అదొక్కటే. నీ భౌతిక చేతనలో ఉండిపోయి, నీ నియతిని మార్చుదామనుకొంటే, నీవు మార్చలేవు... మొదటి ప్రపంచ యుద్ధమప్పుడు నాకు తెలిసిన ఒక అబ్బాయి తుపాకీ దెబ్బకు చనిపోతాడని చెప్పడం జరిగింది (నీకు తెలుసు కదా. యుద్ధంలో మనిషి చాలా తేలిగ్గా చనిపోతాడు) అతడు చనిపోయే తేది కూడా సుమారుగా తెలియజేయబడింది. ఆ వార్త అతడికి బాగా వేదనకు గురిచేసింది. దీర్ఘకాలం శెలవు మీద పోవడానికి అతడు అనుమతి పొందాడు. అతడు శెలవు పెట్టి పారిస్‌కి వచ్చాడు. అతడు ఒక అధికారి, తన దగ్గర పిస్తోలు ఉన్నది. ట్రామ్‌లో ప్రయాణిస్తూ ఉన్నట్లుండి దూకి పడ్డాడు. పిస్తోలు పేలింది, అక్కడికక్కడే చనిపోయాడు. మృత్యువును తప్పించుకోలేక పోయాడు.

ఇలాంటి ఉదాహరణలు ఎన్నైనా నీకు చెప్పగలను. ఇది పూర్తిగా ఒక్క పార్థివ తలానికి చెందినది - బొత్తిగా భౌతిక, మానసిక, ప్రాణిక తలానికి చెందింది. ఉన్నత జ్ఞానం, ఉన్నత తలాలతో సంపర్కం, ఈ ఉన్నత తలాలు ఈ భౌతిక తలంలోకి దిగిరావడమే పరిస్థితుల్ని మార్చగలవు. కాబట్టి మహస్సు (అతిమానస) తలాన్ని శాశ్వతంగా భౌతిక జీవితంలోకి తేవడంలో మనిషి సఫలీకృతుడైతే భౌతిక జీవితం రూపాంతరం చెందుతుంది. అది పూర్తిగా మార్చి వేస్తుంది. కాని ఈ షరతు మీదే.

*CWM 6:47-49* — *శ్రీమాత*

ఆత్మను సంతోషంగా ఉంచడానికి మేమేమి చేయాలి? తద్వారా అది మంచి పరిస్థితుల్లో పునర్జన్మించడానికి ఆధ్యాత్మిక వాతావరణంలో అవతరించడానికి ఏమి చేయాలి?

దు:ఖమనేది లేకుండా చాలా శాంతంగా, నిశ్చలంగా ఉండి చనిపోయిన వ్యక్తికి సంబంధించి, ఒక వాత్సల్యపూరితమైన స్మృతితో స్థిరంగా ఉండాలి.

# మరణానంతరం జరిగేదేమిటి?

మరణం గురించి ఒకరు నన్ను మరణించిన తరువాత ఏమి జరుగుతుంది? ఎలా చనిపోయిన వ్యక్తి కొత్త శరీరం తీసుకొంటాడు అని ప్రశ్న వేశారు. చెప్పాల్సిన అవసరం లేదు. వ్రాస్తే ఎన్నో సంపుటాలుగా అయ్యే విషయం ఇది. ఈ రెండు వ్యవహారాలు ఒకలా ఉండవు. ఒక మనిషికి భూమిపై భౌతిక శరీరంలో ఉన్నప్పుడు ప్రతిదీ ఎలా సాధ్యమో, క్రియాత్మకంగా మరణం తరువాత జీవితంలో కూడా ప్రతిదీ సాధ్యమే. చెప్పే అన్ని కధనాలు అందరికీ సాధారణీయం అయినపుడు మౌఢ్యంగా మారిపోతాయి. కానీ ఒక సమస్యను కొంత వివరంగా, విడమర్చి చూడవచ్చు. దానిలో నుండి ఒక్కొక్కప్పుడు ఆసక్తికరమైన ఆవిష్కరణలని కూడా చేయవచ్చు.

సాధారణ పద్ధతిలో చూస్తే, ఇది నీకు చాలాసార్లు చెప్పాను, వ్యక్తి అస్తిత్వానికి సంబంధించి బాహ్య ఆచ్ఛాదన దృష్ట్యా ప్రతిదీ మరణ సమయంలో దాని ప్రవర్తనా ధోరణి ఎలా ఉన్నది అన్న దానిపై ఆధారపడి ఉంటుంది. ఆ ధోరణి దాని ఆంతరిక అభివృద్ధి, దాని ఏకీకరణ పైన అవశ్యంగా ఆధారపడి ఉంటుంది.

*CWM 8:335-36*

ప్రశ్న : మృత్యు సంస్థానం అంటే ఏమిటి?

ప్రతి మతం దీని గురించి వేరువేరుగా చెప్పింది. గ్రీకులకంటూ 'ఒక స్వర్గం' ఉంది. ఒక వ్యక్తి నౌకలో దాటి వెళ్లిపోయాడు. అక్కడన్ని స్వర్గాలు, అన్ని నరకాలు ఉన్నాయి.

జీవితంలో అత్యంత చేతనావంతమైనది, మరణ ఘడియలో ప్రదర్శితమయ్యే ఒకానొక క్షేత్రానికి పెట్టబడిన పేరు 'మృత్యుక్షేత్రం". ఆ పార్థివ ప్రాణిక ప్రపంచం చాలా చీకటిగా ఉంటుంది. అది ప్రతికూల ఆకృతులలతో, కోరికలు, సంకల్పాలే ప్రధానమై ఉన్న విరుద్ధ శక్తులతో నిండి ఉంటుంది. అవి చాలా మౌలికమైన జీవులు, తునకలుగా అసంపూర్ణ జీవనంతో, మనిషి నుండి విసర్జితమైన వాటిని తిని జీవించే ప్రేతభుక్కులు. మృత్యు వ్యాఘాతంతో కొద్దిమంది ఎటువంటి ఘాతానికి లోనుకాక చాలా సచేతనంగా, జరిగే దానిపట్ల పూర్తి జ్ఞానంతో బయటకు పోతారు అటువంటి వారెక్కువ లేరు. అది ఒక దుర్ఘటన : ఆఖరి ప్రమాదం, ఆ మృత్యు వ్యాఘాత సమయంలో, ఆ జీవులు వడివడిగా వచ్చి మూగిపోతాయి. బయటకు వచ్చిన

ప్రాణ పదార్థంపై పడి భక్షిస్తాయి. ఎంతవరకు మనిషి ప్రాణంతో బ్రతుకుంటాడో అంతవరకూ అవి అతనిని తాకలేవు. ఇలాంటి దాన్ని నీవు ఒక పీడకల కన్నప్పుడు అనుభవించి ఉంటావు. అప్పటి పరిస్థితి విపత్కరంగా, భయంకరంగా మారినప్పుడు తక్కున లేచి కూర్చుంటావు. నీ శరీరంలోకి వస్తావు. ఎందుకంటే నీ శరీరమే నీకు రక్షణ. నీవు భౌతికంలో ఉన్నంత వరకూ నిన్నేమీ చేయలేవు. నీవెప్పుడైతే భౌతికం నుండీ బయటకు వెళ్ళావో పూర్తిగా (నీవు బయటకు వెళ్ళినా ఒక నిర్దిష్టమైన హద్దు వరకూ రక్షాబంధంగా, ఈ లింకు సహాయపడుతుంది) సూత్ర బంధాలు తెగినచో, నీవు ఆ ప్రత్యేక పరిస్థితుల్ని అవకాశంగా తీసుకొంటేతప్ప, పూర్తిగా శరీరంలేని వాడవైపోతావు. ఉదా : బ్రతికుండగా ఒక మనిషి చాలా మంది ప్రేమకు పాత్రుడైనప్పుడు ఆ మరణ సమయంలో ఈ ప్రేమించిన సంబంధీకులు వాళ్ళ ధ్యాసను అతడిపై నిలిపితే ఆ తరుణంలో ఆ వ్యక్తి అక్కడ రక్షణ పొందుతాడు. ఆ ఏకాగ్రశక్తి ఆయా జీవుల నుండీ పూర్తిగా కాపాడుతుంది. కాని ఎవరైతే ఎలాంటి సంబంధం లేకుండా, అటు అతడు చేటు చేసిన వాళ్ళు అతడిపై ఎలాంటి ప్రేమ లేని వాళ్ళు లేదా అతనిపట్ల భయంకరమైన అజాగ్రత్తతో ఉన్నవాళ్ళు అతడి చుట్టూ ఉంటే - అతడు ఆ శక్తులకు ఎర అయిపోతాడు. ఇది నిజంగా భరించలేని ఘోర అనుభవం. అతడు వాటి సంస్థాన పరిధిలోకి వెళ్ళితే తప్ప అవి అతడిని తాకలేవు. అది పార్థివ ప్రాణిక స్థానం - ఉన్నత ప్రాణికం వాటినన్నింటిని తప్పించుకుపోతుంది. అవి ఏమీ చేయలేవు. కాబట్టి ఈ పదార్థ ప్రాణికం బయటకు పోతుంది. తక్కినదంతా అలాగేఉంటుంది; ఈ ఉన్నత ప్రాణికం ఇతర ప్రమాదాలకు లోనౌతూ ఉంటుంది అంతే. అది కూడా అదృశ్యమైపోతే, మనస్సు అలాగే ఉంటుంది. దీని అంతటికీ వెనుక చైత్యపురుష ఉంటుంది, దానినేది స్పృశించలేదు. అది అన్ని దాడులకు అతీతంగా ఉంటుంది. తాను ఎక్కడికి పోవాలన్నా పూర్తి స్వేచ్ఛతో ఉంటుంది. సాధారణంగా పూర్తి అభివృద్ధితో కూడిన ప్రత్యేక అవకాశం, స్థితి లేకపోతే తప్ప అంతరాత్మిక లోకాల్లోకి విశ్రాంతికై వెడలిపోతుంది. ఒక రకమైన సులలితమైన ధ్యానస్థితిలోకి వెళ్ళిపోతుంది. ఇది ఒక రకంగా తన అనుభవాలను వంటబట్టింపజేసుకోవడం అవుతుంది. విశ్రాంతి తీసుకొని అనుభవాలను వంటబట్టించుకొన్న పిమ్మట కొంగొత్త పునర్జన్మ తీసుకోవడానికి సంసిద్ధ పర్చుకొంటుంది. దానినేదీ స్పృశించలేదు. ఎవరో కొద్దిమంది వారి అంతరాత్మ ఎఱుకతో ఉంటారు. అలాంటి మనిషి

ఇలా అంటాడు :
'ఆ మనిషి గురించి నేను ఎరుగుదును'. ఎందుకంటే మనకు తెలిసిన మనుషులు దేనితో ఏర్పడ్డారు? అన్ని భౌతిక అనుభవాలు, అన్ని ప్రాణిక ప్రతిక్రియలు, వాళ్ళ మానసిక ఊహానిర్మాణాలతో అలా ఒక శరీరం, శీలం, ఆలోచన, వీటన్నటితో కలిపి ఒక మనిషి. మంచిదే కాని అదంతా ఒక చైత్యపురుష చుట్టూ కేంద్రీకరించబడి, వ్యవస్థీకరింపబడి ఒక హద్దు వరకు చైత్య పురుషతో సంపూర్ణంగా మమేకమైతే తప్ప మరణం తరువాత మనిషి పట్టుబట్టి నిలిచి ఉండడు. లేకపోతే ఈ మిశ్రమమంతా కరిగిపోయి, చైత్యపురుష ఒక్కటే ఒక్కొక్కసారి ఒక జ్వాలగా, ఒక్కొక్కసారి ఒక సంపూర్ణమైన సచేతన జీవునిగా నిలిచి ఉంటుంది.

అయితే ఇది ఒక సాధారణ సూత్రం. ఇప్పుడు 'దాటించే రక్షణదారుల్లాగా' ఈ రకమైన ప్రమాదాల నుండీ రక్షించబడే నిమిత్తం ప్రాణిక లోకాల్లో వంతెనలు నిర్మించబడి ఉన్నాయి. శరీరాలు వదిలిన వారిని చేరదీసి, వారికి ఆశ్రయాన్ని, రక్షణనిచ్చే వాతావరణాలున్నాయి. అక్కడ అన్ని రకాల వేరే పరిస్థితులున్నాయి; ఇప్పుడు నేను చెప్పింది మామూలుగా మరణించే వారి సాధారణ పరిస్థితి గురించి, సాధారణ మానవుల గురించి. మనమింకా కొంచెం ఉన్నత కోవకు చెందిన మానవుల దగ్గరకి వచ్చే కొద్దీ ఈ పరిస్థితులన్నీ మారిపోతాయి. వ్యక్తిలో ఒకానొక ప్రత్యేక ఉన్నతాభివృద్ధి లేకపోతే, సాధారణ నియమం వర్తింపబడుతుంది. ఎవరైతే పూర్తిగా ఒక ఆంతరిక సమన్వయంతో ఉంటారో వారు శరీరంపై ఎంతమాత్రం ఇక ఆధారపడరు. ఇది అక్కడ ఉండనీ, ఉండకపోనీ.

ఈ అభివృద్ధి అంతా అలా అలా సునాయాసంగా జరిగిపోదు. దీని గురించి ఒక నియమిత సమయంలో ఆలోచిస్తూ, అప్పుడప్పుడు కోరుకుంటూ, దీని ఊసే లేకుండా చాలా మటుకు మర్చిపోతూ ఉంటే ఏం లాభం లేదు. అది అలా జరుగదు. కొన్ని అనుశాసన పూర్వకమైన అభ్యాసాలు ఉన్నాయి. చాలా ఖచ్చితమైన, కఠినమైన ఆధ్యాత్మిక శిక్షణలు! మౌలికంగా ఇందుకోసమే మనము పృథ్వీమీద ఉన్నాం. నిజంగా చెప్పాలంటే మనుషులు ఈ ఉద్దేశ్యం కోసం, ఈ కార్యం పూర్తి చేయడం కోసం సృష్టించబడ్డారు. బహుశ దానిని నెరవేర్చేందుకు నిరాకరించడం వలన ప్రపంచంలో ఇంత సంక్షోభం నెలకొని ఉంది. ఈ మనుషులు గనుక నిజంగా ఇదంతా చేస్తే, అన్ని విషయాలు చాలా ఉత్తమంగా పరిణమిస్తాయి. CWM 6:54-57 శ్రీమాత

# మృత్యు భయాన్ని జయించడమెలా?

సాధారణంగా చెప్పాలంటే, బహుశా మనిషి అభివృద్ధి పథంలో ఉన్న అతి పెద్ద అడ్డంకి భయం, అనేక పార్శ్వాలు కలిగిన భయం, అనేక రూపాలతో, స్వీయ-వైరుధ్యంతో ఉండి, తర్కరహితమైనది, కారణం లేనిది, తరచుగా అసమంజసమైనదిగా ఉంటుంది. అన్ని భయాలలోకి అత్యంత సూక్ష్మమైనది, అత్యంత దృఢమైనది మరణ భయం. ఇది ఉపచేతనలో లోతుగా పాతుకుపోయి ఉంటుంది. దానిని తొలగించడం సులభం కాదు. ఇది అనేక ముడిపడిన అంశాలతో తయారై ఉంది అనేది తెలిసిందే: అతిజాగ్రత్త, స్వీయ-సంరక్షణకొరకు ఆందోళనపడుతూ చేతనను కొనసాగేలా చేయడానికి యత్నించడం, తెలియనిదానిలోకి అడుగిడాలంటే వెనకడుగు వేయడం, అనూహ్యమైన వాటి వల్ల, ముందుగా చూడలేని విషయాల వల్ల కలిగే ఒక తత్తరపాటు, వీటన్నిటి వెనుక కణాల లోలోతుల్లో దాగి ఉన్న మరణం అనివార్యం కాదు, కొన్ని షరతులు నెరవేరినట్లయితే, దానిని జయించవచ్చు అనే భావన. వాస్తవానికి, భయం అనేది ఆ విజయానికి అతిపెద్ద అడ్డంకులలో ఒకటి. ఎందుకంటే మనం భయపడేవాటిని మనం జయించలేం. మరణానికి భయపడే వ్యక్తి ముందుగానే దానిచేత జయించబడ్డాడు.

ఈ భయాన్ని మనం ఎలా అధిగమించాలి? ఇందుకోసం అనేక పద్ధతులను ఉపయోగించవచ్చు. కానీ అన్నింటికంటే ముందు, ఈ ప్రయత్నంలో మనకు సహాయపడే కొన్ని ప్రాథమిక భావనలు ఇక్కడ అవసరం. మొట్టమొదటగా మనం తెలుసుకోవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే జీవం అనేది ఏకం అది అమరం అని. జీవకోటి రూపాలు మాత్రమే లెక్కలేనన్ని, అవి వచ్చి పోతుంటాయి, అశాశ్వతమైనవి. ఈ జ్ఞానం మనస్సులో సురక్షితంగా, శాశ్వతంగా నిక్షిప్తం చేసుకోవాలి. ప్రతి రూపానికి స్వతంత్రంగా ఉంటూ, అన్ని రూపాల్లో వ్యక్తమయ్యే శాశ్వతమైన జీవంతో సాధ్యమైనంతవరకు మన చేతనను తాదాత్మ్యత పొందేలా చేయాలి. ఇది సమస్యను ఎదుర్కొనేందుకు అనివార్యమైన మానసిక ఆధారాన్ని ఇస్తుంది, ఎందుకంటే సమస్య ఇంకా తొలగిపోలేదు. అంతరంగంలో అన్ని భయాలను అధిగమించి జ్ఞానోదయం పొందినప్పటికీ, అది ఇంకా శరీర కణాలలో దాగి ఉంటుంది, అస్పష్టంగా, సహజంగా, తర్కానికి అందకుండా, సాధారణంగా అవచేతనలో

దాగి ఉంటుంది. ఈ అస్పష్టమైన లోతుల్లోనే దానిని కనుక్కోవాలి, దానిని పట్టుకోవాలి, దానిపై నిశ్చయజ్ఞానం అనే కాంతిని ప్రసరింపచేయాలి.

కాబట్టి జీవం మరణించదు, కానీ రూపం అంతరించిపోతుంది, ఇలా అంతరించిపోవడం గురించే భౌతిక చేతన భయపడేది. ఇంకా రూపం నిరంతరం మారుతూ ఉంటుంది అలాగే ఈ మార్పును ప్రగతిశీలంగా ఉండకుండా ఆపేందుకు చేయగలిగింది నిజంగా ఏమీలేదు. ఈ ప్రగతిశీల మార్పు మాత్రమే అనివార్యమైన మరణాన్ని అతిక్రమించేలా చేస్తుంది, కానీ దానిని సాధించడం చాలా కష్టం, చాలా కొద్ది మంది మాత్రమే ఏర్పరుచుకోగలిగే పరిస్థితులు అందుకు కావాలి. అందువల్ల మరణ భయాన్ని అధిగమించడానికి అనుసరించాల్సిన పద్ధతులు ఒక్కొక్కరికి వారి వారి స్వభావాన్ని, చేతన స్థితిని అనుసరించి విభిన్నంగా ఉంటాయి. ఈ పద్ధతులను నాలుగు ప్రధాన వర్గాలుగా విభజించవచ్చు, అయినప్పటికీ ప్రతి ఒక్కదాంట్లో మళ్ళీ అనేక రకాల పద్ధతులు ఉంటాయి. వాస్తవానికి, ప్రతి వ్యక్తి తన స్వంత పద్ధతిని అభివృద్ధి చేసుకోవాలి. మొదటి పద్ధతి తార్కిక బుద్ధి కలవారికి నచ్చుతుంది. ప్రపంచం ప్రస్తుతమున్న పరిస్థితిలోమరణం అనివార్యం అని చెప్పవచ్చు, పుట్టిన శరీరం తప్పనిసరిగా ఏదో ఒక రోజు, రేపో మాపో చనిపోతుంది, దాదాపు ప్రతి మనిషికి మరణం తప్పనిసరిగా ఏదో ఒక రోజు వస్తుంది: ఒకరు దాని సమయాన్ని త్వరితం చేయలేరు లేదా ఆలస్యం చేయలేరు. దాని కోసం తహతహలాడే వారికి దానిని పొందడానికి చాలా కాలం వేచి ఉండవలసి రావచ్చు,అలాగే ఎవరైనా మరణానికి భయపడే వ్యక్తి అతను అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అకస్మాత్తుగా చనిపోవచ్చు. మానవజాతి సాధారణంగా పొందదానికి ఆస్కారంలేని శక్తులు కలిగిన అతి కొద్దిమంది వ్యక్తులకు తప్ప, మిగిలిన వారందరికీ మరణసమయం అనేది తప్పించుకోవడం అసాధ్యం అనేలా అది నిర్ణయించబడినట్లు అనిపిస్తుంది. ఒకరు తప్పించుకోలేని దానికి భయపడడం అసంబద్ధమని హేతువు మనకు బోధిస్తుంది. ఏమి జరగబోతోందో అని చింతించకుండా, మరణం అనే వాస్తవాన్ని అంగీకరించి, నిశ్శబ్దంగా ప్రతిరోజూ, గంటకు గంటకు చేయగలిగినంత ఉత్తమంగా చేయడమే మనం చేయవలసిన పని. హేతుబద్ధమైన పద్ధతిలో వ్యవహరించడానికి అలవాటు పడిన మేధావులు దీనిని ఉపయోగించినప్పుడు ఈ ప్రక్రియ చాలా ప్రభావవంతంగా ఉంటుంది.

కానీ వారి ఉద్వేగాలలో నివసిస్తూ వాటిచే పరిపాలించబడటానికి అనుమతించే భావోద్వేగాలుకలిగిన వ్యక్తులలో ఇది అంతగా పనిచేయదు. ఎటువంటి సందేహం లేదు, ఈ వ్యక్తులు రెండవ పద్ధతిని ఆశ్రయించాలి, అదే అంతర్గత శోధన. అన్ని భావోద్వేగాలకు అతీతంగా, మన ఉనికిలోని నిశ్శబ్ద ప్రశాంతమైన లోతులలో, ఒక కాంతి నిరంతరం ప్రకాశిస్తూ ఉంటుంది, అది ఆత్మ చైతన్యకాంతి ప్రకాశం. ఈ కాంతిని వెతకడం ఆరంభించండి, దానిపై ఏకాగ్రత పెట్టండి. అది మీలోనే ఉంది. పట్టుదలతోప్రయత్నం చేస్తే మీరు దానిని ఖచ్చితంగా కనుగొంటారు. మీరు దానిలోకి ప్రవేశించిన వెంటనే, మీరు అమరత్వం అనే భావనలో మేల్కొంటారు. మీరు ఎల్లప్పుడూ జీవించే ఉన్నారు, ఇంకా మీరు ఎల్లప్పుడూ జీవించే ఉంటారు.

మీరు మీ శరీరం నుండి పూర్తిగా స్వతంత్రంగా ఉంటారు. మీ చేతన ఉనికి శరీరంపై ఆధారపడి ఉండదు. ఈ శరీరం మీరు వ్యక్తీకరించిన క్షణిక రూపాలలో ఒకటి మాత్రమే. మరణం అంటే ఇకపై అంతరించిపోవడం కాదు, ఇది ఒక స్థితి నుండి ఇంకొక స్థితికి మారడం మాత్రమే. అన్ని భయాలు తక్షణమే మాయమవుతాయి, మీరు స్వేచ్ఛ పొందిన మానవుడిగా ప్రశాంతమైన మానసిక దృఢత్వంతో జీవితంలో ముందుకు నడుస్తారు.

ఇక మూడవ పద్ధతి, ఒక దేవుడిపై విశ్వాసం ఉన్నవారికోసం, అంటే వారు నమ్మే దేవుడికి తనను తాను సమర్పణ చేసుకున్న వారికోసం. వారి జీవితంలోని అన్ని సంఘటనలు దైవ సంకల్పం యొక్క వ్యక్తీకరణగా వారు వాటిని కేవలం ప్రశాంతమైన సమర్పణతో మాత్రమే కాకుండా కృతజ్ఞతతో అంగీకరిస్తారు, ఎందుకంటే వారికి ఏది జరిగినా అది ఎల్లప్పుడూ తమ మంచి కోసమే అని వారు నమ్ముతారు. వారు తమ దేవుడిలో, అతనితో వారికి గల వ్యక్తిగత సంబంధంలో మార్మికమైన విశ్వాసం కలిగి ఉన్నారు. వారు అతని ఇష్టానికి సంపూర్ణంగా లొంగిపోయారు, జీవన మరణాలనే ప్రమాదాల నుండి సంపూర్ణమైన స్వేచ్ఛతో అతని మార్పులేని ప్రేమను, రక్షణను వారు అనుభవిస్తారు.వారు తమ ప్రియతముని పాదాల వద్ద సంపూర్ణ స్వీయ సమర్పణ లేదా అతని చేతుల్లో ఒదిగి పరిపూర్ణ రక్షణ పొందడం అనే నిరంతర అనుభవంతో ఉంటారు. వారి చేతనలో భయం, ఆందోళన లేదా అంతరంగ సంఘర్షణకు ఇకపై ఎటువంటి తావు లేదు. అదంతా ప్రశాంతమైన సంతోషకరమైన ఆనందంతో నింపబడింది. అయితే అలాఒక మార్మిక భక్తుడిగా ఉండే అదృష్టం అందరికీ ఉండదు.

చివరిగా, యోధులుగా పుట్టినవారు కూడా ఉన్నారు. వారు జీవితాన్ని

యథాతథంగా అంగీకరించలేరు అమరత్వానికి, సమగ్రమైన భూసంబంధమైన అమరత్వానికి తమ హక్కును వారు తమలో ఒక స్పందనగా అనుభవిస్తూ ఉంటారు. మరణం అనేది ఒక చెడు అలవాటు తప్ప మరొకటి కాదనే ఒక రకమైన సహజమైన జ్ఞానాన్నివారు కలిగి ఉంటారు. వారు మృత్యువును జయించాలనే సంకల్పంతో జన్మించినట్లు అనిపిస్తుంది. కానీ ఈ ప్రయత్నం భయంకరమైన నిగూఢమైన శత్రువులతో నిండిన సైన్యానికి వ్యతిరేకంగా నిరంతర పోరాటానికి దారి తీస్తుంది. ఈ పోరాటం దాదాపు ప్రతి నిమిషం పోరాడవలసి ఉంటుంది. అచంచలమైన స్థైర్యం కలిగిన వ్యక్తులు మాత్రమే దీనిని ప్రయత్నించాలి. ఈ యుద్ధం అనేక స్థానాల్లో జరుగుతుంది. ఇది ఒకదానికొకటి మిళితమై ఒకదానికొకటి పూరకంగా ఉండే అనేక స్థాయిలలో జరుగుతుంది.... అయితే మృత్యుభయాన్ని జయించటానికి మరొక మార్గం ఉంది, కానీ అది చాలా కొద్దిమందికి మాత్రమే అందుబాటులో ఉంది, అది కేవలం సమాచారంగా మాత్రమే ఇక్కడ ప్రస్తావించబడింది. ఇది జీవించి ఉండగానే ఉద్దేశపూర్వకంగా స్పృహతో మరణంలోకి ప్రవేశించడం.

అటుపైన అక్కడినుండి తిరిగి భౌతిక శరీరంలోకి ప్రవేశించి ఇంతకు ముందులాగానే పూర్తి జ్ఞానంతో భౌతికమైన ఉనికిని కొనసాగించడం. అయితే అందుకు దీక్ష పొందిన వారై ఉండాలి.

*CWM 12:82-87*

ఏదైనా కారణంవల్ల ఒక వ్యక్తి తనశరీరాన్నివిడిచిపెట్టి కొత్త శరీరం తీసుకోవలసి వస్తే, మరణాన్ని అసహ్యకరమైన ఓటమిగా భావించడంకంటే అద్భుతమైన, సంతోషకరమైన, ఉత్సాహభరితమైన విషయంగా భావించడం మంచిది కాదా? శరీరానికి అంటిపెట్టుకుని ఉండేవారు, మరణాన్ని ఒకటి లేదా రెండు నిమిషాలు ఆలస్యం చేయడానికి ప్రయత్నించేవారు, దానిని భయానక వేదనకు ఉదాహరణగా చెప్పేవారు, వారు తమ ఆత్మ గురించి స్పృహలో లేరనే విషయం మనకు తెలియచేస్తున్నారు... ఇది బహుశా ఒక సాధనం అంతే కదా? ఈ ప్రమాదాన్ని ఒక సాధనంగా మార్చుకోవచ్చు. ఒక వ్యక్తి స్పృహతో ఉన్నట్లయితే, దానిని ఒక అందమైన విషయంగా, చాలా అందమైన విషయంగా, మిగిలిన వాటిలాగే చేయవచ్చు. గమనించండి, భయపడనివారు, ఆందోళన చెందనివారు, ఎటువంటి నీచత్వం లేకుండా మరణించగలవారు దాని గురించి ఎప్పుడూ ఆలోచించరు, వారు ఈ

"భయానకమైనదిగా " భావించే మరణంనుండి ఎలా తప్పించుకోవాలో ఆలోచిస్తూ బాధపడరు, దానిని వీలైనంత దూరంగా నెట్టడానికి ప్రయత్నించరు. ఇలా ఆ సమయం వచ్చినప్పుడు, తల ఎత్తి, నవ్వుతూ, ''ఇదిగో ఇక్కడ ఉన్నాను" అని చెప్పగలరు.

తమ జీవితాన్ని సాధ్యమైనంత సద్వినియోగం చేసుకోవాలనే సంకల్పం ఉన్నవారు వారే, "అవసరమైనంత వరకు, చివరి క్షణం వరకు నేను ఇక్కడే ఉంటాను, నా లక్ష్యాన్ని సాధించేవరకు నేను ఒక్క క్షణం కూడా కోల్పోను". ఇలాంటి వారుఅవసరం వచ్చినప్పుడు, ఉత్తమంగా పనిచేస్తారు. ఎందుకు?, ఎందుకంటే వారు వారి ఆదర్శంలో జీవిస్తున్నారు , వారి ఆదర్శం యొక్క వాస్తవికతలో జీవిస్తున్నారు. ఎందుకంటే వారికి అదే నిజమైన విషయం, వారి ఉనికికి కారణం, అన్ని విషయాలలో వారు ఈ ఆదర్శాన్ని, తమ ఉనికికి కారణాన్ని చూడగలరు, అంతేగాక భౌతిక జీవితపు దుర్భరత్వంలోకి వారు ఎన్నడూ కిందికి దిగిరారు.

కాబట్టి, ముగింపు ఏమిటంటే :

మరణాన్ని మనం ఎప్పటికీ కోరుకోకూడదు.

ఎవరూ ఎప్పటికీ చావాలని అనుకోకూడదు.

చనిపోవడానికి ఎప్పుడూ భయపడకూడదు.

అన్ని పరిస్థితులలో ఒక వ్యక్తి తానున్న స్థితిని దాటి ఉన్నత స్థితికి మారడానికి ప్రయత్నించాలి.

*CWM 12: 82-874:355.* శ్రీ మాత

# సజీవులు-నిర్జీవులు

చనిపోయిన వారి పట్ల జీవించి వున్న వారి వైఖరి, మానవజాతి అత్యంత స్వార్థ, అజ్ఞాన పూరితమైన వ్యక్తీకరణలో ఒకటి.

ఇది పూర్తిగా, నేను అజాగ్రత్తగా ఉండను అనే వైఖరి, లేదా దాన్ని వదలించుకోవడానికి ఏదైనా చెయ్యాలనే వైఖరి. ఇక్కడ కొంతమంది పిల్లలు ఉన్నారు (వారు ఇక పిల్లలు కాదు) వారు తమ తల్లిదండ్రులతో కలసి జీవిస్తున్నారు (వారు అంత పెద్దవారు కాదు) వారిలో కొందరు పిల్లలు తమ కలల గురించి ఇలా చెప్పారు కలలో వారి తల్లిదండ్రులు చనిపోయి మరలా

తమ వద్దకు వచ్చినట్లు చెప్పారు. వారు తమ తల్లిదండ్రులను, మీరు చనిపోయారు, మీరు ఇలా వచ్చి మమ్మల్ని ఇబ్బంది పెట్టే హక్కు మీకు లేదంటూ, వారిని దురుసుగా వెనక్కు పంపినట్లు వారి కలను గురించి తెలిపారు.

మీరు చనిపోయారు, ఇలా వచ్చి మమ్మల్ని పట్టించుకుని ఇబ్బంది పెట్టే హక్కు మీకు లేదు. ఇలా కొద్దిమంది మాత్రమే అంత నిజాయితీగా చెప్పగలరు. కానీ ఇది చాలా విస్తృతంగా వ్యాపించింది.

సత్యం అవతరించే ముందు, చాలా విషయాలు మారుతాయి. ఇది మాత్రం నేను చెప్పగలను.

ఈ విషయమే నేను 'టి'కి చెప్పాను. (ఆమెకు అర్థం కాలేదని నేను అనుకుంటున్నాను).

మనుషులు "జీవితం" అని చెప్పడానికి, "మరణం" అని చెప్పడానికి పెద్ద వ్యత్యాసం లేదని నేను ఆమెకు చెప్పాను. ఈ సమస్య గురించి అన్ని వివరాలు తెలుసుకొంటే జీవితానికి, మరణానికి ఉన్న తేడా చాలా చిన్నదిగా అనిపిస్తుంది. దానిని గురించి లోతుగా విచారిస్తే అది ఇంకా చాలా చిన్నదిగా అనిపిస్తుంది. ఎల్లప్పుడూ, జీవితం, మరణం మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని చూపిస్తారు. ఇది చాలా తెలివితక్కువ పని. కొంతమంది జీవించి వున్నా, సగం మరణించిన వారితో సమానం. కొంతమంది మరణించినా కూడా జీవించే ఉంటారు.

*

ఇటీవల జరిగిన అనుభవాల నుండి నేను గమనించింది ఏమిటంటే, మానవులు మరణం గురించి భయంకరమైన విషాదాన్ని సృష్టించారు. నేను గమనించాను, చాలా మంది దౌర్భాగ్యులు, వారు చనిపోయారన్న నెపంతో వారు ఎంతో ప్రేమించిన వారిచేతే నాశనానికి గురి అయ్యారు.

లోకులు వారికి చాలా చెడుకాలాన్ని దాపురింప జేశారు.

నాశనం చేయబడ్డారా?

పూర్తి స్పృహలో ఉన్నప్పుడే దహనం చేశారు, లేదా గాలి వెలుతురు చొరబడని పేటికలో సమాధి చేశారు. ఎందుకంటే వారు ఇంక తమను తాము వ్యక్తపరచుకోలేరు, వారినే మరణించారని జనాలు అంటున్నారు. వారు మరణించారని ప్రకటించడానికి ఏ మాత్రం సమయం వృధా చేయడం లేదు.

కానీ వారు స్పృహతో ఉన్నారు. స్పృహలో ఉన్నారు. మానవ చట్టాల ప్రకారం ఎవరైతే ఇక మాట్లాడలేరో, కదలలేరో, ఆ వ్యక్తి మరణించినట్లే. మరణించాడు కానీ స్పృహలో ఉన్నాడు. అతను స్పృహలో ఉన్నాడు. అందువలన అతను తన చుట్టూ ఉన్నవారిని చూడగలుగుతున్నాడు. వారిలో కొందరు బాధపడుతున్నారు, అతనికి దివ్యదృష్టి ఉంటే, వారిలో కొందరు ఆనందించడం కూడా అతను గమనిస్తున్నాడు. ఆపై తనను, వాళ్ళు ఒక పెట్టెలో ఉంచి, మూత పెట్టి, దానికి మేకులు కొట్టడం గమనిస్తాడు. ఇప్పుడు అంతా అయిపోయింది. వారు నన్ను భూమిలో పాతిపెడుతున్నారు లేదా స్మశాన వాటికకు తీసుకు వెళుతున్నారు. ఆపై తన నోటిలో అగ్ని - పూర్తి స్పృహ.

నేను ఇటీవలి రోజుల్లో ఇలా జీవించాను. గత రాత్రి లేదా అంతకు ముందు నేను అది చూశాను. నేను కనీసం రెండు గంటలు వేరే ప్రపంచంలో గడిపాను. అది సజీవులు, చనిపోయిన వారూ తేడా లేకుండా కలసి ఉండే సూక్ష్మ భౌతిక ప్రపంచం, అక్కడ ఖచ్చితంగా జీవించిన వారికి, మరణించిన వారికి తేడా లేదు. ఉదాహరణకు 'మృదు', ఆమె శరీరంలో ఉన్నపుడు, నేను ఆమెను రాత్రిపూట బహుశా సంవత్సరానికి ఒకసారి చూసి ఉంటాను. (బహుశా అంతగా కూడా ఉండకపోవచ్చు) కొన్నాళ్ళుగా ఆమె నా స్పృహలో లేకుండా పోయింది. కానీ ఆమె తన శరీరాన్ని విడిచిపెట్టినప్పటి నుండి, నేను దాదాపు ప్రతీరాత్రి ఆమెను చూశాను. అక్కడ ఆమె ఉంది, ఎప్పటిలాగే ఉంది, మీకు తెలుసా? కానీ ఎలాంటి బాధ లేకుండా అక్కడ వారు ఇద్దరూ కలసి జీవిస్తున్నారు. మనం చెప్పే జీవించిన మరియు మరణించిన వారు ఇద్దరూ కలసి జీవిస్తున్నారు, కలసి తింటున్నారు, కలసి తిరుగుతున్నారు, కలసి సరదాగా ఉంటున్నారు కూడా. ఒక సుందరమైన, ప్రశాంతమైన ప్రకాశంలో, ఆహ్లాదకరంగా, చాలా ఆహ్లాదకరంగా ఉంటున్నారు.

అతను మరణించాడు అని చెపుతూ, మానవులు జీవితానికి, మరణానికి మధ్య ఓ ఖచ్చితమైన గీత గీశారు. కానీ నిజంగా జరిగేది ఏమిటంటే వారు ఆ శరీరాన్ని అచేతనమైన వస్తువుగా చూస్తారు. కానీ అది ఇప్పటికీ చైతన్యంతో ఉంది.

ఆ శరీరాన్ని ఒక వస్తువులా చూస్తున్నారు, వీలైనంత త్వరగా దీని నుండి బయట పడాలి. ఇది చాలా ఇబ్బందికరమైనది, అయినా ఇది సరి అవుతుంది. అత్యంత దుఃఖాన్ని అనుభవించేవారు కూడా మరణాన్ని చూడాలని అనుకోరు. ఇది చాలా బాధాకరమైన విషయం.

శ్రీమాత : శిష్యునితో సంభాషణ, అక్టోబర్ 12, 1962.

**Vol. 54, No. 12**
**December 2024**


Date of Publication:
1st December 2024

TN/PMG (CCR)/ WPP 473/24-26
Registered: PY/41/2024-26

**AKHILA - Akhila Bharata Patrika (Telugu)**

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

*Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo*



**Flower: Immortality**

*Forms are in perpetual transformation;*
*identify yourself with the Immortal Consciousness*
*and you will become it.*
*(Spiritual significance and explanation of the flower given by the Mother)*
Botanical name:
Gomphrena globosa

*Owner:* Sri Aurobindo Society
*Printer:* Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
*Publisher:* Pradeep Narang for Sri Aurobindo Society
*Published from:* Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
*Printed from:* Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

A Monthly Published by
SRI AUROBINDO SOCIETY-605001